# శ్రీనాథభట్టకృతి

# పల్నాటివీరచరిత్ర.

పాఠనిర్ణేతృరచితమైన ద్వితీయభూమిక,
వీరచరిత్రకథాసారం, వీరచరిత్రేతి
హాసం, శ్రీనాథజీవితసంగ్రహం
గచ్ఛద్వ్యాఖ్య గలది.


పాఠనిర్ణేత

పండిత శ్రీ ఉమాకాన్త విద్యాశేఖరులు.



చెన్నపురి:

శ్రీరామ ముద్రాక్షరశాలయందు

ముద్రితం.

క॥ శ॥ 5040.

వెల రు. 2-8-0

T
954 211
Sy34P

ఓం పరమాత్మనే నమః.

కథాశేషులు శ్రీ కొవ్వూరి చంద్రారెడ్డి

,, శ్రీ కొమర్రాజు లక్ష్మణరావు, యం. ఏ.

,, శ్రీ వైద్యరత్న పండిత డి. గోపాలాచార్యులు.

,, శ్రీ దివాన్‌బహద్దర్ నెమలి పట్టాభిరామరావు, B. A

,, ధర్మనిర్ణేత (హైకోర్టుజడ్జీ) శ్రీ టి. వి. శేషగిరి అయ్య

వార్లు దేశభాషల్లో విజ్ఞానవర్ధనం విషయమై వహించిన అభిరతిని ఆ

ధించడానికి గుర్తుగా ఈకృతిని వారికి సమర్పిస్తున్నాను.

University of Hyderabad
LIBRARY
Acc. No. 29091
Dated 4.1.87
Hyderabad - 500 134

To

# THE SACRED MEMORY OF THE DEPARTED SOULS

of

SRI KOVVŪRI CANDRĀ REDDI VĀRU,

SRI VYDYA RATNA PANDIT D. GOPĀLĀCĀRYULU ,,

SRI KOMARRĀJU LAKṢMAṆA RAO ,, M.A.,

SRI DEWĀN BAHADUR NEMALI PATTĀBHI RĀMA RAO ,, B. A.,

SRI JUSTICE T. V. SEṢAGIRI IYER AVL.,

As a token of reverence for their love of the advancement of culture and learning in the Vernaculars.

# అధికారినిరూపణం.

కాళిదాసాదుల ఉత్తమకావ్యాలు పఠించి, శాస్త్రపరిచయం, సాహిత్యవిచారణలో ఆవశ్యకప్రజ్ఞ, మహాపురుషారాధనతత్పరత్వం కలిగి ఇతిహాస జిజ్ఞాసువులైనవారు ఈకృతిశ్రవణమందు పూర్ణాధికారులు. తక్కినవారికి ఉపదేశాన్ని అనుసరించి బోధోపలబ్ధి. కేవలం వినోదంకోసం వినేవారు అధమాధికారులు.

# ద్వితీయభూమికలోని సఙ్కేతాక్షరవివరణం.

---

अ = अर्थशास्त्रम्
अष्टा = अष्टाध्यायी
अ = अहोबलपण्डितीयम्
ఆ = ఆదిపర్వం
ఆం = ఆంధ్రకవులచరిత్ర
ఆం. చ = ఆంధ్రులచరిత్ర
ఆ. ము = ఆనందముద్రాలయమును చరిత్ర
उत्तर = उत्तररामचरितम्
ऋ = ऋग्वेदः
ऋ. भा = ऋग्वेदभाष्यम्
ए. ब्रा = एतरेयब्राह्मणम्
క. జీ = కవిజీవితములు
का = काव्यप्रकाशः
का. पू = कादम्बरीपूर्वभागः
का. प्र. व्या = काव्यप्रकाशव्याख्या
కా. ఖ = కాశీఖండం
కృ. వి = కృష్ణరాయవిజయం
का. वि = कामकळाविलासः
కా. చూ = కావ్యాలంకారచూడామణి
कु. त = कुलार्णवतन्त्रम्
క్రీ. రా = క్రీడాభిరామం
क. रा = कलियुगराजवृत्तान्तः
का = कादम्बरी
कथा = कथासरित्सागरः
गी = गीता
च. व्या = चम्पूरामायणव्याख्या
ज. व्या = जयमङ्गळव्याख्या
J. A. O. S = Journal of the American Oriental Society.
त = तन्त्रवार्तिकम्
తి. భా. వి = తిక్కనభారతంలో విరాట పర్వం
तै = तैत्तिरीयब्राह्मणम्
ध्व = ध्वन्यालोकः
ద్రావి = ద్రావిడభాషలు
दश = दशरूपकम्
नै = नैषधीयचरितम्
ని = నిరంకుశోపాఖ్యానం
नागा = नागानन्दम्
प्र. च = प्रबोधचन्द्रोदयम्
प्र. य = प्रतापरुद्रयशोभूषणम्
प्र. बो. च. व्या = प्रबोधचन्द्रोदयव्याख्या
प्र. सा = प्रपञ्चसारतन्त्रम्
పా. జా = పారిజాతాపహరణం
पञ्च = पञ्चदशी
బా. సు. ప్ర = బాలవ్యాకరణ సుస్వార్థ ప్రకాశిక
भ = भट्टभास्करभाष्यम्
भ. त्रि = भर्तृहरित्रिशती
भा. प्र = भवप्रकाशः
माल = मालविकाग्निमित्रम्
मधु. वि = मधुराविजयम्
మ. ను = మనుచరిత్ర
म. व = महाभारते वनपर्व
म. उ = महाभारते उद्योगपर्व
म = मनुस्मृतिः
महा = महाभाष्यम्
मेघ = मेघदूतम्
म. स = महाभारते सभापर्व

म. वि = महाभारते विष्णुसहस्रनामस्तोत्रम्
मू = मूकपञ्चशती
मालती = मालतीमाधवम्
रत्ना = रत्नावळी
रा. कि = रामायणे किष्किन्धाकाण्डम्
रघु = रघुवंशम्
रा. बा = रामायणे बालकाण्डम्
रा. यु = रामायणे युद्धकाण्डम्
ल. स = ललितासहस्रनामस्तोत्रम्
వ. చ = వసుచరిత్ర
वा. का = वात्स्यायनकामसूत्रम्
వై. వి = వైజయంతీ విలాసం
वै. सि. म = वैयाकरणसिद्धान्तमञ्जूषा

विक्र = विक्रमाङ्कदेवचरितम्
शु = शुक्रनीतिः
शु. य = शुक्लयजुर्वेदः
श. ब्रा = शतपथब्राह्मणम्
श्री. भा = श्रीभागवतम्
श्री. गु = श्रीगुणरत्नकोशः
श्री. भा. न = श्रीभागवते नवमस्कन्धः
సభా = సభాపర్వం
సం. లో = సంస్కృత లోకోక్తులు
सा = साहित्यदर्पणम्
सौ = सौन्दर्यलहरी
हर्ष. च / ह. = हर्षचरित्रम्

ప్రకాశకులు.

వాఙ్మయసమితి.

గుత్తికొండ

పిడుగురాళ్లపోస్టు, గుంటూరుజిల్లా.

(క॥ శ॥ 5040)

రెండవఆవృత్తి. 1500 ప్రతులు.

అన్నిఅధికారాలు ప్రకాశకులవి.

# బాలచంద్రయుద్ధమునందలిపాత్రలు.

అనుగురాజు:—చేదిదేశంనుండి పల్నాటికివచ్చిన రాజు.
అన్నమ్మ:—బాలచంద్రుడి బొంగరాలాటచూడబోయిన వైశ్యభామిని.
ఆలరాజు:—కొమ్మరాజు కుమారుడు.
ఐతాంబ:—బ్రహ్మనాయుడి భార్య, బాలచంద్రుడి తల్లి.
కన్నమదాసు:—బ్రహ్మనాయుడివరమున పెమ్మసానికి పుట్టినవాడు.
కొమ్మరాజు:—మలిదేవరాజు మరది.
గండుకన్నమనీఁడు:—బాలచంద్రుడి మామ.
తెప్పలినాయుఁడు:—మలిదేవరాజుయోధులలో ఒకడు.
నలగామరాజు:—అనుగురాజుకు మైలమాదేవియందు పుట్టినవాడు.
నరసింగరాజు:—నలగామరాజు సోదరుడు.
నాయకురాలు:—నలగామరాజు మంత్రిణి.
పినమలిదేవరాజు:—మలిదేవరాజు సోదరుడు.
పెమ్మసాని:—తెప్పలినాయుడి భార్య.
బాలమలిదేవుఁడు:—మలిదేవరాజు సోదరుడు
బాదన్న:—బ్రహ్మనాయుడి అన్న.
బాలచంద్రుఁడు:—బ్రహ్మనాయుడి కుమారుడు.
బ్రహ్మనాయుఁడు:—మలిదేవరాజు మంత్రి.
మలిదేవరాజు:—అనుగురాజుకు వీరవిజ్జలదేవియందు జనించినకుమారుడు.
మాంచాల:—బాలచంద్రుడి భార్య.
మాడచి:—మలిదేవరాజుయొక్క రాణివాసం కాపాడే యువతి.
రేఖాంబ:—మాంచాలతల్లి; బాలచంద్రుడి అత్త.
వెంకు:—నలగామరాజు సైనికులలో ఒకడు.
శీలాంబ:—బ్రహ్మనాయుడి తల్లి; దొడ్డనాయుడి భార్య.
శ్యామాంగి:—బాలచంద్రుడి వేశ్య.

| | |
|---|---|
| అనపోతు<br>వెలమలదోర్నీడు<br>చాకలచందు<br>మంగలమల్లు<br>కమ్మరపట్టి<br>కుమ్మరపట్టి<br>కంసాలచందు | బాలచంద్రుడియెడల సోదరభావంకలవారు |
| వెలమనాయుడు<br>మలినీడు<br>పినమలినీడు<br>గోపినాయుడు | మలిదేవరాజు సేనలోనివారు |
| కొండమన్నెమరాజు<br>కోటకేతుడు<br>మాడుగుల వీరారెడ్డి<br>చింతపల్లిరెడ్డి | నలగామరాజు ఆప్తులు. |
| ఆవాలనాయుడు<br>సుంకరరాముడు<br>చెవులనాయకులు<br>జంగిలినాయకులు<br>పెనుమాలవారు<br>సంపెట నారన్న | మలిదేవరాజు యోధులు. |

# విషయసూచిక.


| పుట | విషయము |
| --- | --- |
| 3 | కథా ప్రారంభము. |
| | మలిదేవరాజు, బ్రహ్మనాయుఁడు మొదలయినవారు కార్యమపూడి యుద్ధరంగమునకు బయలుదేరి పోవుట. |
| 7 | నాయకులు శకటంబులకుఁ బూన్చుటకై యెద్దులనుఁ బేరుపేరనఁ బిలుచుట. |
| 8 | మలిదేవరాజాదులు త్రిపురాంతకమునుండి మేళ్ళవాగుచేరుట. |
| 11 | బ్రహ్మనాయుఁడు గార్యమపూడి యుద్ధరంగముఁ జేరఁబోవుట. |
| 14 | ససైన్యంబుగ మలిదేవరాజు కార్యమపూడిం జేరుట. |
| 16 | నాయుఁడు నలగామరాజువద్దకు బట్టును రాయబారమునకై పంపుట. |
| | నలగామరాజు కొల్వుకూటమునకేతెంచుట. |
| 17 | నలగామరాజు సభయందు విద్యావినోదములు జరుగుట. |
| 19 | రాయబారమునకు వచ్చిన బట్టు నలగామరాజు సభయందుఁ బ్రవేశించుట. |
| | భట్టుమూర్తి నలగామరాజునకు రాజనీతి విశేషంబులఁ దెల్పుట. |
| 21 | నాయకురాలేకాంతంబుననలగామునకు సంధివిముఖములైన మాటలు చెప్పుట. |
| 22 | నలగాముఁడు బట్టుతో మలిదేవరాజు బలంబుఁ దృణీకరించుట. |
| | భట్టుమూర్తి నలగామరాజును దూలనాడి బ్రహ్మనాయుని ప్రతాపాదులఁ బేర్కొనుట. |
| 24 | నాయకురాలు బట్టుతో భీకరవాక్యంబులఁ బల్కుట. |
| | బట్టు కార్యముపూడికిఁ దిరిగి పోయి గురిజాలలో జరిగిన వృత్తాంతము రాజునకుఁ దెల్పుట. |
| | బట్టు కార్యమపూడికిఁ బోయిన తరువాత గురిజాలలో జరిగిన వృత్తాంతము. |
| 25 | నలగామరాజుతో నాయకురాలు మలిదేవరాజుయొక్క బలముం గూర్చి నిరసనవాక్యములాడుట. |
| | నలగాముఁడు నాయకురాలితో రాచకార్యంబులఁ జెప్పుట. |
| 29 | నలగాముఁడు గజారోహణంబొనర్చి యుద్ధభూమికి బయలుదేరుట. |
| 32 | నలగాముఁడు గజారూఢుఁడై సేనతోఁగూడి కార్యమపూడి కేగుచుండఁ ద్రోవలోఁ గొదమగుండ్ల పౌరులు విన్నపం బొనర్చుట. |
| 83 | నలగాముఁడు కార్యమపూడికిఁ జేరుట. |

| పుట | విషయము |
|---|---|
| 34 | వివిధ దేశరాజులువచ్చి నలగామ భూపతిని గలిసికొనుట. |
| 35 | వీరులు తమకు యుద్ధమున కాజ్ఞ యిమ్మని బ్రహ్మనాయునిఁ దొందఱ పఱచుట. |
| 36 | బ్రహ్మనాయుఁడువీరులకుఁదొందఱపడవలదని నీతు లుపదేశించుట. |
| 37 | ఈ సమయమున మేడపిలో జరిగిన వృత్తాంతము. |
| 38 | అనుజులతోఁ గూడి బాలచంద్రుఁడు తల్లియైన ఐతమ్మవద్దకు వచ్చుట. |
| | ఐతమ్మబాలుని మనోరథము దెల్పుమని యడుగుట. |
| | భారతయుద్ధాది కథల వినుమని యైతమ్మ బాలచంద్రునికిఁ జెప్పుట. |
| 39 | బొంగరములాడుట నిజమనోరథంబని బాలుఁడు తెల్పుట. |
| | బొంగరాలాడవలదని తల్లి బాలునికిఁ జెప్పుట. |
| | బాలుఁడు తల్లిమాటలకుఁ బ్రత్యుత్తరంబు సెప్పుట. |
| | బొంగరాలాట కూడదని తల్లి మరలఁ జెప్పుట. |
| 40 | బాలుఁడు తల్లిమాటలకుఁ దగు సమాధానము చెప్పుట. |
| | బాలచంద్రుఁడు తల్లియొక్క లోభమును దూలనాడుట. |
| | బాలుఁడు నిజౌదార్యమును దెల్పుట. |
| 41 | బాలచంద్రుఁ డైతమ్మకు వైరాగ్య ముపదేశించుట. |
| | బాలచంద్రుఁ డైతమ్మయొక్క వెనుకటి లోభకార్యంబుఁ జేర్కొనుట. |
| 42 | ఐతమ్మ బొంగరములు చేయఁ బంచుట. |
| 43 | బాలచంద్రుఁడు భౌతిక రహస్యములఁ దెల్పుట. |
| | సిద్ధమైన బొంగరముల బాలచంద్రుల కొసఁగుట. |
| 44 | ఐతాంబ కుమారులకు బుద్ధులు గఱపుట. |
| 45 | బాలచంద్రాదులు బొంగరములాడఁబోవుట. |
| | అమ్మలక్కలు బొంగరాలాటఁ జూడఁబోవుట. |
| 46 | బాలచంద్రుఁడు బొంగరమును త్రిప్పుట. |
| 47 | అన్నమ్మయను వైశ్యకాంతకు బొంగరముతగుల నాపెమూర్ఛిల్లుట |
| | కోమటియన్నమ్మ బాలునిఁ దిట్టుట. |
| 48 | తప్పు క్షమింపుమని బాలచంద్రుఁడన్నమను బ్రార్థించుట. |

| పుట | విషయము |
| --- | --- |
| 49 | బాలచంద్రుఁడు తల్లి వద్దకేగి బ్రహ్మనాయుఁడుపోయిన యుద్ధరంగ మేదియో యడుగుట. |
| | బాలునిమాటలు విని యైతమ్మ మూర్ఛిల్లుట. |
| | ఐతమ్మ యుద్ధవిముఖము లైన మాటలు బాలునికిఁ జెప్పుట. |
| 50 | బాలుఁడు నిజధర్మముల వివరించుట. |
| | ఐతమ్మ శీలమ్మ నాలోచనయడుగుట. |
| | శీలమ్మ యుపాయంబు సెప్పుట. |
| | భయంకర రణరంగవర్ణనముతో నైతమ్మ బాలుని భయపెట్టుట. |
| 51 | బాలచంద్రుఁడు నిజబలోత్సాహంబుఁ దల్లి కెఱిఁగించుట |
| 52 | సంతానముకై పడ్డకష్టముల నోచినవ్రతముల నైతమ్మ వేఱ్వేఱఁ జెప్పుట. |
| 53 | బాలచంద్రుని జన్మప్రకారము. |
| 59 | బాలచంద్రుఁడు వీరధర్మప్రభావంబు దల్లికిఁ జెప్పుట. |
| 60 | బాలచంద్రుఁడు స్వధర్మనిరూపణము చేయుట. |
| 61 | భార్యకుఁజెప్పి యుద్ధమునకేగుమని బాలచంద్రునితో నైతమ్మ చెప్పుట. |
| 62 | ఐతాంబ మాంచాలదగ్గఱ కేగుట |
| 64 | బాలచంద్రుఁడు వేశ్యయింటికిఁ జనుట. |
| 65 | బాలచంద్రుఁడు వేశ్యమాయలకు లోఁబడుట. |
| 67 | బాలుఁడు వారకాంతలఁ దూలనాడుట |
| | శ్యామాంగి మాయాలాపంబులాడుట. |
| 68 | వేశ్యమాత బాలునిఁ గదియుట. |
| 70 | అనపోతు బాలచంద్రుని ప్రవర్తనను చెగడుట. |
| 71 | బాలచంద్రుఁడు గండువారింటి కేగుట. |
| | చెలికత్తెలు మాంచాల నలంకరించుట. |
| 75 | బాలచంద్రుఁడు నతనిభార్యయు నంతఃపురంబునఁ గ్రీడించుట. |
| 76 | రేఖాంబ తనకూతురయిన మాంచాలకుపదేశించిన జ్ఞానప్రకారము. |
| | బాలచంద్రుఁడు తన పూర్వప్రవర్తనకుఁ బశ్చాత్తాపమొందుట. |
| 77 | బాలచంద్రుఁడు భార్యతో వినోదంబులు సల్పుట. |
| | బాలచంద్రునియనుజులు దుందుడుకు సేయుట. |

| పుట | విషయము |
|---|---|
| | బాలచంద్రుఁడనుజులపైఁ గవయు వారు లజ్జాకరంబులగుమాటలాడుట. |
| 78 | మాంచాల భర్తనుదీవించి ఖడ్గంబు చేతికిచ్చి యుద్ధమున కంపుట. |
| 80 | ఐతాంబ కుమారుని దీవించి యుద్ధరంగమున కంపుట. |
| 81 | అనపోతును వెనుక కంపుటకు బాలచంద్రుఁ డుపాయంబుపన్నుట. |
| 82 | బాలచంద్రుఁడు నలగొండను డాయుట. |
| 83 | సంధికయి నాయకురాలు రాయబార మంపుట. |
| | రాయబారులు మలిదేవమహీపతి కొలువునకు వచ్చుట. |
| 85 | కొమ్మరాజు వీరుల వాక్యములఁ బూర్వపక్షము సేయుట. |
| 86 | బాలచంద్రుఁడు నలగొండశిఖరమునుండి రణరంగంబు నవలోకించుట. |
| 87 | దోర్నీఁడుశిబిరంబునకు హద్దులు వివరించుట. |
| 88 | నలగొండదిగి రాజదర్శనమునకుఁ బోవుటకై బాలచంద్రుఁడు గమకించుట. |
| | బాలచంద్రుఁడు కార్యమపూడిం జేరఁగదలుట. |
| 90 | బాలచంద్రుఁడు సభలోఁ బ్రవేశించి రాజదర్శనమునకు మార్గమిమ్మని సభాస్తారుల నడుగుట. |
| | బాలచంద్ర కన్నమదాసుల సంవాదప్రకారము. |
| 92 | బాలచంద్రుఁడు మలిదేవభూపతిని సమ్ముఖమున దూషించుట. |
| | గండుకన్నమనీఁడు బాలచంద్రుని వాక్యంబులఁ బూర్వపక్షము సేయుట. |
| 94 | బాలచంద్రుఁడు యోధులకు రోషమువచ్చు మాటలాడుట. |
| 95 | కొమ్మరాజు బాలచంద్రుని రోషంబు చల్లార్చుట. |
| | అనపోతు మేడపికేగుట. |
| 96 | అనపోతు శ్యామాంగి గృహమునకుఁ జనుట. |
| 97 | అనపోతు మేడపినుండి మరలుట. |
| | బాలచంద్రుఁడువ్రాసిన పత్రము ననపోతు చదువుట. |
| | అనపోతు బాలచంద్రునిఁగూర్చి నిష్ఠురవాక్యంబులాడుట. |
| 99 | అనపోతుతలిదండ్రులు కుమారుని మృతకళేబరముం జూచి విలపించుట. |
| 100 | మాడచికార్యమపూడిలోని శిబిరము సొచ్చుట. |

| పుట | విషయము |
|---|---|
| | రక్తసిక్తంబైన జందెము బిరుదు చూచి బాలచంద్రుఁ డార్చుట. |
| 101 | సంధి కాదని యందఱు నాశ వదలుట. |
| | బాలచంద్రుఁడు సోదరుల దగ్గఱకుఁ బిల్చుట. |
| 102 | బాలచంద్రుఁడు వీరులకు నిజమనోరథంబు దెల్పుట. |
| 103 | బాలచంద్రుఁడు వీరులకుఁ బ్రత్యుత్తరమిచ్చుట. |
| | బాలచంద్రుఁడు తన పూర్వజన్మముల వృత్తాంతము తెల్పుట. |
| 105 | బ్రహ్మనాయుఁడు బాలచంద్రుని సాహసము వారించుట. |
| | బాలుఁడు నిజశౌర్యంబు తండ్రికిఁ దెల్పుట. |
| 106 | బాలచంద్రుఁడు యుద్ధమునకుఁ బోవుటకు సమ్మతించి బ్రహ్మనాయుఁడతనికి రణధర్మంబుల నుపదేశించుట. |
| | యుద్ధరంగత్వము. |
| | బ్రహ్మనాయుఁడు కుమారునకు రణనీతి నుపదేశించుట. |
| 107 | బాలుఁడు యుద్ధరంగమున కేగుట, నరసింహభూపతి రణమునకు వచ్చుట. |
| 108 | బాలచంద్రుఁడు భీమంబగు సంగ్రామ మొనర్చుట. |
| | నలగామరాజు సైన్యము కలఁతనొందుట. |
| 110 | బాలచంద్రుఁడు శాత్రవబలంబులఁ జక్కాడుట. |
| | పాఱిపోవుచున్న సైన్యమునకు నరసింహభూపతి ధైర్యవాక్యములు చెప్పుట. |
| 110 | నలగామరాజు సైన్యంబు బాలచంద్రునిపైఁ గవయుట. |
| 112 | బాలచంద్రుఁడు శత్రుసైన్యంబుఁ జాపకట్టుగఁ గూల్చుట. |
| | బాలచంద్రుఁడు నరసింహుని తలయనుకొని వేఱొకనితలగోసి తండ్రియొద్దకుఁ గొంపోవుట. |
| 113 | ఇరుపక్షములవారు సంకులసమరంబొనర్చుట. |
| 114 | బాలచంద్ర నరసింహభూపతుల ద్వంద్వయుద్ధము. |
| 115 | బాలచంద్రుఁడు సరసింహభూపతి తలగోసికొని తండ్రియొద్దకేగుట. |
| | నరసింహుని శిరస్సునుగనుఁగొని నాయకులు విలపించుట. |
| 116 | బ్రహ్మనాయుఁడు బాలచంద్రునికృత్యంబులఁ దెగడుట. |
| | బాలచంద్రుఁడు బ్రహ్మనాయుని కపటంబుల నెన్నుట. |
| | బాలచంద్రుఁడు మగిడి రణంబునకేగి యనుజులతోఁ గలనిలోనొఱగుట. |
| 118 | యుద్ధరంగమునఁ బిశాచగణములు స్వేచ్ఛావిహారములు సల్పుట. |

| పుట | విషయము |
|---|---|
| | బాలచంద్రుఁడనుజులపైఁ గవయవారు లజ్జాకరంబులగుమాటలాడుట. |
| 78 | మాంచాల భర్తనుదీవించి ఖడ్గంబు చేతికిచ్చి యుద్ధమున కంపుట. |
| 80 | ఐతాంబ కుమారుని దీవించి యుద్ధరంగమున కంపుట. |
| 81 | అనపోతును వెనుక కంపుటకు బాలచంద్రుఁ డుపాయంబుపన్నుట. |
| 82 | బాలచంద్రుఁడు నలగొండను డాయుట. |
| 83 | సంధికయి నాయకురాలు రాయబార మంపుట. |
| | రాయబారులు మలిదేవమహీపతి కొల్వునకు వచ్చుట. |
| 85 | కొమ్మరాజు వీరుల వాక్యములఁ బూర్వపక్షము సేయుట. |
| 86 | బాలచంద్రుఁడు నలగొండశిఖరముననుండి రణరంగంబు నవలోకించుట. |
| 87 | దోర్నీఁడుశిబిరంబునకు హద్దులు వివరించుట. |
| 88 | నలగొండదిగి రాజదర్శనమునకుఁ బోవుటకై బాలచంద్రుఁడు గమకించుట. |
| | బాలచంద్రుఁడు కార్యమపూడిం జేరఁగదలుట. |

| పుట | విషయము |
|---|---|
| 90 | బాలచంద్రుఁడు సభలోఁ బ్రవేశించి రాజదర్శనమునకు మార్గమిమ్మని సభాస్తారుల నడుగుట. |
| | బాలచంద్ర కన్నమదాసుల సంవాదప్రకారము. |
| 92 | బాలచంద్రుఁడు మలిదేవభూపతిని సమ్ముఖమున దూషించుట. |
| | గండుకన్నమనీఁడు బాలచంద్రుని వాక్యంబులఁ బూర్వపక్షము సేయుట. |
| 94 | బాలచంద్రుఁడు యోధులకు రోషమువచ్చు మాటలాడుట. |
| 95 | కొమ్మరాజు బాలచంద్రుని కోపంబు చల్లార్చుట. |
| | అనపోతు మేడపికేగుట. |
| 96 | అనపోతు శ్యామాంగి గృహమునకుఁ జనుట. |
| 97 | అనపోతు మేడపినుండి మరలుట. |
| | బాలచంద్రుఁడువ్రాసిన పత్రము ననపోతు చదువుట. |
| | అనపోతు బాలచంద్రునిఁగూర్చి నిష్ఠురవాక్యంబులాడుట. |
| 99 | అనపోతుతలిదండ్రులు కుమారుని మృతకళేబరముం జూచి విలపించుట. |
| 100 | మాడచికార్యమపూడిలోని శిబిరము సొచ్చుట. |

| పుట | విషయము |
| --- | --- |
| | రక్తసిక్తంబైన జందెము బిరుదు చూచి బాలచంద్రుఁ డార్చుట. |
| 101 | సంధికాదని యందఱు నాశ వదలుట. |
| | బాలచంద్రుఁడు సోదరుల దగ్గఱకుఁ బిల్చుట. |
| 102 | బాలచంద్రుఁడు వీరులకు నిజమనోరథంబు దెల్పుట. |
| 103 | బాలచంద్రుఁడు వీరులకుఁ బ్రత్యుత్తరమిచ్చుట. |
| | బాలచంద్రుఁడు తన పూర్వజన్మముల వృత్తాంతము తెల్పుట. |
| 105 | బ్రహ్మనాయుఁడు బాలచంద్రుని సాహసము వారించుట. |
| | బాలుఁడు నిజశౌర్యంబు తండ్రికిఁ దెల్పుట. |
| 106 | బాలచంద్రుఁడు యుద్ధమునకుఁ బోవుటకు సమ్మతించి బ్రహ్మనాయుఁడతనికి రణధర్మంబుల నుపదేశించుట. |
| | యుద్ధరంగత్వము. |
| | బ్రహ్మనాయుఁడు కుమారునకు రణనీతి నుపదేశించుట. |
| 107 | బాలుఁడు యుద్ధరంగమున కేగుట, నరసింహభూపతి రణమునకు వచ్చుట. |
| 108 | బాలచంద్రుఁడు భీమంబగు సంగ్రామ మొనర్చుట. |
| | నలగామరాజు సైన్యము కలఁతనొందుట. |
| 110 | బాలచంద్రుఁడు శాత్రవబలంబులఁ జక్కాడుట. |
| | పాఱిపోవుచున్న సైన్యమునకు నరసింహభూపతి ధైర్యవాక్యములు చెప్పుట. |
| 110 | నలగామరాజు సైన్యంబు బాలచంద్రునిపైఁ గవయుట. |
| 112 | బాలచంద్రుఁడు శత్రుసైన్యంబుఁ జాపకట్టుగఁ గూల్చుట. |
| | బాలచంద్రుఁడు నరసింహుని తలయనుకొని వేఱొకని తలగోసి తండ్రియొద్దకుఁ గొంపోవుట. |
| 113 | ఇరుపక్షములవారు సంకులసమరంబొనర్చుట. |
| 114 | బాలచంద్ర నరసింహభూపతుల ద్వంద్వయుద్ధము. |
| 115 | బాలచంద్రుఁడు నరసింహభూపతి తలగోసికొని తండ్రియొద్ద కేగుట. |
| | నరసింహుని శిరస్సునుగనుఁగొని నాయకులు విలపించుట. |
| 116 | బ్రహ్మనాయుఁడు బాలచంద్రునికృత్యంబులఁ దెగడుట. |
| | బాలచంద్రుఁడు బ్రహ్మనాయుని కపటంబుల నెన్నుట. |
| | బాలచంద్రుఁడు మగిడి రణంబునకేగి యనుజులతోఁ గలసిలోనొఱగుట. |
| 118 | యుద్ధరంగమునఁ బిశాచగణములు స్వేచ్ఛావిహారములు సల్పుట. |

**ओ३म्.**

**परमात्मने नमः.**

# వీరచరిత్ర ద్వితీయభూమిక.

1. **धर्मस्य स्थितये त्याग मपि सर्वस्य कुर्वतः ।**
**महावीरस्य तेजांसि वसेयुः पुरतो मम ॥**

2. పద్మ, వాణి, మహీధరాత్మజ,
అని నుతింతురు విబుధులెవ్వరి
ఆజగచ్చైతన్యదాయిని
చరణములకు నమస్కృతి.

3. రోహిత ప్రహ్లాదముఖ్యులు
బాలవీరులు తొల్లి తా నని
బాలు డాలోకించు వీరుల
వృత్తిధార గణించెదన్.

4. కామభూపాలసుత, అనపోతుభార్య,
సర్గి లక్ష్మి, సతీధర్మమహిమములను
వ్యక్తమొనరించినట్టి పల్నాటిసీమ
పుణ్యభూముల వెలుగు వర్ధిల్లుగాక.

5. కావ్యపరీక్షా ప్రజ్ఞావంతుల
దండి వర్ధనుని అభినవగుప్తుని
రాజశేఖరుని మమ్మటాద్యులను
తద్వచోఽర్థబలసిద్ధికి తలతున్.

6. మదినినిల్పి ప్రతాపరుద్రీయకర్త,
సూరి, వేముల, సింగు, నాదెండ్ల గోపు,
పేరుభట్టాత్మజుని, పురావిదులనెంచి,
కూర్తు భూమిక వీరచారిత్రమునకు.

ఇక ఈ వీరచరిత్రను నేను మొదట 25 సంవత్సరాల క్రిందట ప్రకటించాను దీనికి. నాలుగు గ్రంథాలు నాకు లభించినవి. ఒకటి కథాశేషులైన శ్రీ అక్కిరాజు శంకరనారాయణవారు నైజాంనుండి తెప్పించి యిచ్చినది. రెండవది క. శే. శ్రీ జానపాటి వేంకటఅప్పయ్యవారివల్ల లభించినది. మూడవది క. శే. శ్రీ పిడుగు వీరభద్రఅయ్యవారిచ్చినది. వీరు వీరమతపీఠానికి ఆచార్యులు. నాల్గవది క. శే. చల్లగుండ్ల పిచ్చయ్యవారు వ్రాయించి పంపినది. వీట్లో బాలచంద్రయుద్ధం నైజాంగ్రంథంలో మాత్రమే సమగ్రంగా వున్నది. తక్కినవి కథాంశాలు గ్రహించడానికి తోడ్పడ్డవి.

## మార్పులు.

మొదటిసారి ముద్రితమైన పల్నాటివీరచరిత్రలోవున్న అరసున్నాలు, బండిరాలు, భాషాప్రవాహంలో లేని అనావశ్యక గజడబసలు మొదలైనవి, నేను చేర్చినవేను. ఇవి మూలగ్రంథంలో లేవు. ఇవి లేకుంటే తెలుగుగ్రంథం కాదనుకొనేదశలో ఛాందసమార్గాన్ని అనుసరించి వాటిని చేర్చాను. ఈ అకార్యానికి ప్రాయశ్చిత్తరూపంగా వాటి నిప్పుడు తొలగించాను. మొదటిపీఠికలోను, వ్యాఖ్యలోను, పూర్తిచేసిన పఙ్క్తుల్లోను, అప్పటి అరసున్నాలు మొదలైనవి నావి గనుక వాటిని అట్లానే వుంచాను.

## వీరకాలనిర్ణయం.

నేను చేసిన వీరకాలనిర్ణయమే పిమ్మటివారు గ్రహిస్తూ వచ్చారు. ఈవిషయంలో చేయవగిన మార్పేమీ లేదని అనుకొంటున్నాను. మొదటిపీఠికలో నేను ఉదాహరించిన హైహాయసంబంధి సంస్కృతశాసనాలు ఇండియన్ ఆంటిక్వెరి పత్రికలోనివి. మాచెర్ల కారెంపూడి శాసనాలు బెజవాడ దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలోని శాసనం నేను స్వయంగా చూచి వ్రాసుకొన్నవి. తక్కిన వన్నీ సూయల్ పట్టికనుండి, తాళపత్రపుస్తకాలయంలోని శాసనసంచయం నుండి, తీసుకొన్నాను. అక్కడక్కడ నేను తెలిపిన స్థలనిర్దేశాదులు

సూయల్ పట్టికనుండి, చోళచాళుక్యరాజ్యపరిపాలనాబ్దాలు సూయల్ పట్టికనుండి ఆధునికేతిహాసగ్రంథాలనుండి స్వీకరించాను.

## శ్రీనాథుడిదేశం.

శ్రీనాథుడు కర్ణాటుడు. శ్రీనాథుడు కర్ణాటదేశస్థుడని నేను సకారణంగా ప్రథమపీఠికలో విశదపరచాను. అప్పటినుండి దానికి శ్రీ చిలుకూరి వీరభద్రరావు వారు యింకా మరికొందరు ప్రతికూలత కనబరచారు కాని నేను చూపిన ప్రమాణాలను అన్యథాకరించలేదు. శ్రీ పెద్దిభట్ల వీరయ్యవారు తమ ఓరుగంటివిచారణలో దీన్ని తటస్థులుగా ప్రస్తావించారు. ఉపపత్తులతో ఈఅంశం స్పష్టపరచాను. శ్రీనాథుడు కర్ణాటదేశస్థుడని యిప్పటికీ భావిస్తున్నాను. శ్రీనాథుడితో సంబంధం వున్నా లేకున్నా కన్నడీలని ఒకబ్రాహ్మణశాఖవారు ఇప్పటికీ పల్నాటిసీమలో కరాలపాటిగ్రామంలో వున్నారు.

ఇట్లానే నన్నయకూడా అనాంధ్రుడుగా కనబడుతున్నాడు. ఆంధ్రదేశాన్ని జయించిన చాళుక్యులకు, చోళులకు బంధుత్వమేర్పడినకాలంలో యితడు అరవదేశంనుండి వచ్చి వుండవచ్చును. ఆంధ్రదేశానికి చోళసంబంధం కలిగిన సమయాన ద్రవిడులు కొంద రిక్కడికి వచ్చినట్లు కనబడుతున్నది. తంబళులు (తమిళులు) అట్లాటివారే నని అనుమేయం. అప్పయ్యదీక్షితులవారి తాంత్రికమీమాంసకు విషయమయిన వారిలో వీరుకూడా చేరివుంటారని అనుకొంటున్నాను. గొరకలు లేవిధంగా వచ్చారో ఇప్పటికి అరవమే మాట్లాడుతున్నారు. ఆరామద్రావిడులు మొదలయినవారి సంగతి విదితమేగదా. ఇతడు శ్రీనాథుడివలె దేశంలో చిరకాలనివాసంగల వంశంలోనివాడు కాక అప్పుడప్పుడే వచ్చి చేరినవాడో అట్లా చేరిన ద్రావిడకుటుంబానికి చెందినవాడో అయివుండవచ్చును. కనుకనే తనభాష అయిన అరవంలోని మాటలను అనావశ్యకస్థలాల్లోకూడా తప్పించుకొనజాలని దశలో వుండినట్లు కనబడుతున్నది. ఇతడు వాడిన శబ్దాలు కొన్ని ఆంధ్రదేశపు వ్యవహారంలో లేకపోవడమే కాకుండా తమిళదేశంలో యిప్పటికీ సాధారణజనుల్లోకూడా వాడుకలో వున్నవి.

| | శబ్దం | అర్థం | నన్నయరూపం | అరవదేశపు ఇప్పటి వ్యవహారం | తెలుగుదేశపు ఇప్పటి వ్యవహారం |
|---|---|---|---|---|---|
| 1 | యును... | సముచ్చయార్థకం | ఆత్మహానియుఁ గోరి విలువిద్యయుం గఱచి. (ఆది) వారిధియుం గలంగె (సభా) | ఎలియుం, పూనైయుం (యెలకా, పిల్లీ) | లేదు |
| 2 | ఎల... | లేత... | ఎలజవ్వనంబు (ఆది) | ఎళంగీర (లేతకూర) | లేదు |
| 3 | తొట్టి | మొదలు కొని | హిమకరుదొట్టి యదువుదొట్టి (ఆది) | పొఱందదు తొట్టు (పుట్టింది మొదలు) | లేదు |
| 4 | కఱచు | నేర్చు | విలువిద్యఁ గఱచుచుండిరి (ఆది) | ఎనక్కుఁ గఱ్ఱుకుడు (నాకు నేర్పు) | లేదు |
| 5 | అరయు | తెలియు | పొరయకుండ నరసి (ఆది) | నన్నా అఱింజి (బాగా తెలిసికొని) | లేదు |
| | ఆరయు | పరిశీలించు | ఆరసి మేలునా (ఆది) | నన్నా ఆరాయ్ (బాగాపరిశీలించు) | లేదు |
| 6 | పేర్మి | గొప్పతనం | మహీశుల పేర్మిఁ జేసి (ఆది) | భగవానుడయ పెరుమై కాట్టత్తుకు (భగవంతుడి గొప్ప తనం చూపడానికి) | లేదు |
| 7 | మనము | మనస్సు | మనమునఁ జెయ్యువల మాటల (ఆది) | ఎనక్ మనం వరాదు (నాకు మనసురాదు) | లేదు |
| 8 | పోలె | వలె | జలకణంబులపోలె (ఆది) | తంగంబోలె యిరికి (బంగారంవలె వున్నది) | లేదు |

ఇక జవంబు, కర్ణండు, తెసుంగు, జందనగంధి, బ్రభాతము అని యిట్లా నన్నయవుపయోగించినట్టి, యిప్పటి తెలుగు వ్యవహారంలో లేనట్టి పూర్ణబిందువులు, గజడదబలు, ంబులు, ండులు మొదలయినవి అరవభాషలో పాలుంజోరుం (పాలూఅన్నం), మూరుంజాదం (మజ్జిగా అన్నం), పూవుం బళమ్ముం, యెరంగు, పొరందా, తెలుంగు, కరండి, సున్నాంబు, నరంబు, పాంబు, ఒడంబు, నడంది, గూండు, వేడికోండు అని యీతీరున యిప్పటికీ ప్రభూతంగా ప్రసిద్ధంగా వ్యవహృతమవుతున్నవి. ఈతమిళశబ్దాలు నేనుసంభాషణలో గ్రహించినవి.

పైన వుదాహరించబడిన శబ్దాలు స్వల్పరూపభేదంతో ప్రకృతపు కన్నడ వ్యవహారంలోను కనబడుతున్నవి. అంచం, గుణం, వనం, కోపం, అని యిట్లాటిశబ్దాలు తెలుగులో హలంతాలై వుంటే 'క్రమము', 'జనము' 'గణము', 'తీర్థము' అని ఆవర్గంలోని వీటికి నన్నయోక్తిలో వున్న అజంతరూపం 'జలవు' 'బలవు', 'తీర్థవు' అని తద్గుణాన్తాలను కన్నడంలో నేటికి వ్యవహారంలో వున్నది. "ఫలం" 'జలం' 'ఇహం' లేదా "ఫలమూ" 'జలమూ' 'ఇహమూ'అని వీటికి తెలుగులో సముచ్చయార్థకరూపం వుంటే "మహారవముఁ ............... ఘోషముఁ;" "ఇహముం బలంబు" "మహోత్సవమున్;......... సాంగత్యముఁ" అని ఆకోటిలోనివాటికి ఆఅర్థంలో నన్నయనూర్చిన అనునాసికాంతమైన ఉత్తు "జలముం" "వనముం", "(నీళ్లూ పండూ)", అని ఆగణంలోనివాట్లో అరవంలో, ఇప్పటికీ వ్యవహృతమవుతున్నది. ఇదివరకు చెప్పినట్లు ఇతడు తమిళుడో చాళుక్యుల ప్రధాన నగరమైన కళ్యాణపు ప్రాంతాలనుండి వచ్చిన కర్ణాటుడో అయివుంటాడని వ్యక్తమవుతున్నది. పైన జూపిన శబ్దాలు, శబ్దరూపాలు నన్నయకాలంలో తెలుగులో వ్యవహృతమై ఇప్పుడు లుప్తమైనవేమో, ఇతడు ఆంధ్రుడే అయి ద్రవిడకర్ణాటభాషలు చదివి వుండడంవల్ల పరిచయవశాన ఆమాటలు వాడినాడేమో అనే యిట్లాటి పూర్వపక్షాలను విచారించక వదలుతున్నాను. ప్రవాహిభాషల్లో కొన్ని శబ్దాలచ్యుతి నిజమే

అయినా అవి మన మనుకొనేటంత తేలికగా నశించడంమాత్రం అసత్యం. దాదాపు వేయిసంవత్సరాలక్రిందటి నన్నయశబ్దాలు, శబ్దరూపాలు ఇప్పటికీ తమిళభాషలో వుండడమే దీనికి నిదర్శనం. నన్నయ పేరుకూడా అనాంధ్రమేను. నన్న అంటే అరవంలోను కన్నడంలోను మంచి అని అర్థం. ఇది తెలుగులో లేనేలేదు. ఇతడు ఆంధ్రుడై అరవం, కన్నడం చదివినవాడనుకొంటే తనపేరుకూడా ఆభాషల్లోకి మార్చుకొనడుగదా. ఈతీరుగా శ్రీనాథుడు నన్నయ అనాంధ్రులు కావడం మనకు అగౌరవహేతువని చింతించవలసిన పనిలేదు. ఆంధ్రేతరులుకూడా తెలుగులో గ్రంథకరణానికి యత్నించారనడం ఆంధ్రులకు గర్వహేతువే కాగలదు అనాంధ్రభాషల సంప్రదాయాలు తెలుగులో పెట్టడం, మార్చిమార్చక అనాంధ్రశబ్దాలనువాడడం శబ్దానుశాసనమని యితడు భావించివుంటే అది అసంబద్ధమనిభారతీయవైయాకరణసంప్రదాయవిరుద్ధమని మాత్రం చెప్పి ప్రస్తావవశాన వచ్చిన యీవిచారణ యిక చాలిస్తున్నాను.

## వీరచరిత్ర.

పల్నాటివీరచరిత్ర కొన్ని మహాప్రబంధలక్షణాలుగల మూలగ్రంథం. నన్నయభారతాదులవలె అనువాదంగాని, హంసవింశత్యాదులవలె క్షుద్రవృత్తబాహుళ్యంగల వుక్కిటిపురాణంగాని, మనుచరిత్రాదులవలె పూర్వకథావిశిష్టంగాని, కానటువంటి ఒక అపూర్వకృతి.

## ప్రబంధశబ్దం.

మనువసుచరిత్రాదులు ప్రబంధాలని తక్కినవి కావని కావ్యాలువేరని తెలుగుదేశంలో తెలుగుపుస్తకాలు చదివే మనలో అనేకులు అనుకొంటున్నారు.

> "ఈతఁడే... మొట్టమొదట మనుచరిత్రమును ప్రబంధరూపమున రచియించిన కవియగుటచేత..." (ఆం. క. చ.)

అని శ్రీకందుకూరి వీరేశలింగంవారు.

"ఈతనికిఁ బూర్వులగు పురాణకవులును, కావ్యకవులును నొనరింపని ప్రబంధ కవనమునకుఁ గ్రొత్తత్రోవ లీతఁడు కల్పించుటంజేసి" (క. జీ.)

అని శ్రీగురుజాడ శ్రీరామమూర్తివారు.

"కావ్యప్రబంధ కవిత్వము."

అని ఆంధ్రవాఙ్మయచరిత్రసంగ్రహకర్త.

మనుచరిత్రతో ఈ ప్రబంధాలు ఆరంభమైనవని ఒకచోట పిల్లలమర్రి పినవీరన్నతో ఆరంభమైనవని ఒకచోట, యిట్లా ప్రతిపాదిస్తున్నారు. ఇవి సాహిత్యసంప్రదాయం తెలియనిమాటలు. ప్రబంధమంటే కావ్యమే కాని విశేషార్థమేమీ లేదు. రామాయణభారతాదులు కూడా ప్రబంధాలేను. ప్రబంధాలు మనుచరిత్రాదులతో ఆరంభమైన వనే వారిచ్చుకునే కొద్దిమాత్రపులతో అట్లాటివి మరికొన్ని వాక్యాలు, అమరుడి నిర్వచనం, విద్యానాథాది సాహిత్యవేత్తల వచనాలు, ఆళ్వారులస్తోత్రాలను దివ్యప్రబంధమనడం, అనువాదాలనుండి వేరుచేయడానికి ఇది విశేషనామ మనడం, మనుచరిత్రాదులు కొత్తరకం గనుక వేరే పేరు ఆవశ్యకమనడం, నామైకదేశవాదం, దండిచెప్పిన వర్ణనల విషయం, యివన్నీ పూర్వపక్షసమాధానాలతో ఇక్కడ విచారించక వదలుతున్నాను. ప్రబంధం, కావ్యం, పర్యాయపదాలని, విశేషమేమీ లేదని, రామాయణమహాభారతాదులు, రూపకాలు, ప్రబంధాలే నని, అందుకే

"प्रबन्धे च अङ्गी रस एक एव उपनिबध्यमानोऽर्थविशेषलाभं, छायातिशयं च पुष्णाति कस्मिन्निवेति चेत् यथा रामायणे यथा वा महाभारते." (ध्व.)

అని ఆనందవర్ధనుడు,

"प्रबन्धेऽप्यर्थशक्तिभूः
यथा गृध्रगोमायुसंवादादौ." (काव्य.)

అని మహాభారతంలోని శాంతిపర్వస్థమైన గృధ్రగోమాయుసంవాదాన్ని వుదాహరిస్తూ మమ్మటుడు,

"प्रथितयशसां भासकविपुत्रसौमिल्लकादीनां प्रबन्धानतिक्रम्य वर्तमानकवेः कालिदासस्य क्रियायां कथं परिषदो बहुमानः ॥" (माळ)

(ప్రథిత యశస్సుగల భాసకవిపుత్ర సౌమిల్లకాదుల ప్రబంధాలను అతిక్రమించి వర్తమానకవి అయిన కాళిదాసుడి రూపకమందు పరిషత్తుకు యెట్లా ఆదరం వుంటుంది?)

అని కాళిదాసు, వాటిప్రబంధత్వం విదితం చేశారని, వ్యవహారమునేది సమీచీనమైతే తప్ప స్థితిమాత్రాననే ఉపాదేయం కాదని, అది అనుచితమైనప్పుడు హేయమని, అనువాదాలను అనువాదాలనే అనవచ్చునని, కావ్యానికి సాధారణమైన నూతనత్వాన్ని బట్టి మాత్రమే విశేషనామ మేర్పరిస్తే కల్పనాగౌరవం సంభవిస్తుందని, రసభావ నిష్పాదన విధానభేదాన్ని బట్టి విశేషనామం వుండవచ్చునని, అది లేనప్పుడు కొంత కల్పన, కొంతపూర్వకథగల రఘువంశాదులకు వలెనే మనుచరిత్రాదులకు విశేషనామ మావశ్యకంగాదని, ఒకవేళ ఆవశ్యకమని ఒప్పుకొన్నా వాటికి ప్రబంధమనే విశేషనామం ఉద్దిష్టార్థాన్ని తెలుపడానికి సమగ్రంగా సమర్థం కాకపోవడమే కాకుండా భ్రాంతిజనకం కూడా కావడంవల్లను అజ్ఞానసూచకంగా వుండడంవల్లను త్యాజ్యమని, రామాయణాదులు ప్రబంధాలు కావని అనుకోవడం శబ్దార్థవివేకశూన్యత్వద్యోతకమని, సిద్ధాంతం మట్టుకు తెలుపుతున్నాను.

గురిజాలకోడిపోరునుండి చివరవరకు గల ఇతివృత్తం శాఖావంతమై విస్తృతమైనది. మహావీరుల ఇతిహాసం కావడంవల్ల ప్రకృష్టం కూడా అయివున్నది. దీనికి నాయకుడైన మలిదేవరాజు, ప్రతినాయకుడైన నలగామరాజు, ముద్రారాక్షసమందలి చంద్రగుప్తుడివలె అంతగా క్రియాపరులు గానివారలు. ఇట్లాటివారికి సచివాయత్తసిద్ధులని వ్యపదేశం. అనపోతు, బాలచంద్రుడు, బ్రహ్మనాయుడు, అలరాజు, పేరినీడు,

కొమ్మరాజు, వీరందరు ఉదాత్త క్షాత్రధర్మమహితులై అవశ్యకమైన ప్పుడు ప్రాణాన్ని సయితం తృణప్రాయంగా, సమర్పించగలిగిన లోకోత్త రులు. బ్రహ్మనాయుడు, విష్ణువుయొక్క అవతారంగా భావించబడుతు న్నాడు. అయినప్పటికీ ఇతడి మానుషప్రవృత్త్యౌచిత్యాన్ని వీరచరిత్ర కర్త సమంజసంగా ప్రతిపాదించాడు. కుమారుడు రణరంగానికి వీపు చూపినందుకు అతడుచేసిన నింద భారతీయవీరతయొక్క ఉత్కర్షను నిజంగా ప్రకటిస్తున్నది. ఉత్తమ ధర్మపరాయణలైన వీరవనితలు ఇందు ప్రాధాన్యం వహిస్తున్నారు. యుద్ధభూమికి పోకుండా ఆపవద్దని కుమా రికి ఉపదేశించిన రేఖ, పతిచేతికి ఖడ్గమందిచ్చి విజయాశీస్సు లర్పించిన మాంచాల,లోకమంపలి వీరవనితలకు ఆరాధ్యలుగా ఉండజాలినవారు. అల్లుణ్ని చంపినందుకు తండ్రిని నిందిస్తూ చితపై శరీరమర్పించి పరలో కంలో సయితం సేవించడానికి పతిని అనుగమించిన రత్నాలపేరిదేవి భారతీయ పత్నీధర్మంయొక్క బలోన్నతిని విదితం చేస్తున్నది. ప్రతి పక్షకోటిలోని నాయకురాలు రామాయణంలో మంథరవలెను, భారతంలో శకునివలెను అనర్థాలకుకారణం. నట్టింటి నాగుబాముని చింతపల్లి రెడ్డి ఆమెనుగురించి చెప్పినమాటలు యథార్థమైనవి. ప్రతి స్పర్థిలేకపోతే తనరొమ్మును తానే గుద్దుకొంటుందని కథకులు తరు చుగా చెప్పుతూవుంటారు. అయినప్పటికీ యీమెను ఒకగొప్ప మంత్ర పాటవంగల రాజనీతిప్రవీణనుగా వీరచరిత్రకర్త ప్రదర్శించాడు. యుద్ధారంభంలో చేసిన సంధియేర్పాట్లు యీమె నయకౌశలాన్ని తెలుపుతున్నవి. అనర్థాలతో స్త్రీలతో యొదుర్కొనవలసివుండడం వీర పురుషులకు దురదృష్టమని చెప్పవచ్చును. ఇట్లాటి దురదృష్టం బ్రహ్మ నాయుడికి సంభవించింది. అయినప్పటికి బ్రహ్మనాయుడు,

**"वृद्धो बालो न हन्तव्यो नैव स्त्री केवलो नृपः ।(स्मृ. अ ४ प्र ७.)**

(వృద్ధుణ్ని, బాలుణ్ని, స్త్రీని, సైన్యాదులు లేనిరాజును చంప గూడదు.)

అనే భారతీయధర్మాన్ని అనుసరించి పరాఙ్ముఖు డయినాడు. వీరత్వప్రసక్తి వచ్చినచోట్ల వీరచరిత్రకర్త ఉద్వేగాన్ని కనబరుస్తాడు. బాలచంద్రుడికి అతడి తల్లిదండ్రులకు జరిగిన సంవాదంలోను బాలచంద్రుడి తక్కిన సంభాషణల్లోను యీవిషయం వ్యక్తం కాగలదు. యుద్ధావసానపురాత్రి, కన్నమనీని అర్ధరాత్రపు రణరంగదర్శనం,ఇట్లాటి చోట్లవలె అతడు భయానకనిష్పాదనమందుకూడా కొంతకౌశలం కనబరుస్తాడు. తక్కినచోట్ల సాధారణదశను దాటలేదు. అతికరాలతమాషాలో సగం మానినందువల్ల పోయినసగం పెంటగాక మిగిలిన చెన్నుగ, సగ, చయ్యన, ఒయ్యన, పన్నుగ అనే యిట్లాటిపదండగ్గణం, భూమిగణం, ప్రకాశగణం, మొదలైన చెత్తను తీసివేస్తే కథనం ఆకర్షకంగాను, స్ఫుటంగాను, పటుత్వవిశిష్టంగాను ఉన్నట్లు విదితం కాగలదు.

ఆరంభంలో జీడిసూనెగుడ్డలు ధరించి పాపవిముక్తికై అనుగురాజాదులు బయలుదేరడం, మధ్యన బాలచంద్రుడి వైరాగ్యోపదేశం, వృత్తాంతావసానమందు ఉభయానికి వినాశం, బ్రహ్మనాయుడి ఉపదేష్టృత్వప్రతిపత్తి, వీటిఅన్నిటివల్ల మహాభారతంలోవలె ఇక్కడకూడా ప్రధానరసం శాంతమని వీరకరుణాదులు అంగరసాలని నిర్ణయించవచ్చును.

వైష్ణవులు నాలాయిరాన్నివలె దీన్ని వీరమతస్థులు ఔర్ధ్వదైహికాల్లో పఠనానికి వినియోగించడం దీని శాంతరసపత్త్వానికి అనుగుణంగా వున్నది. రామాయణాదులవలె కాక వీరచరిత్ర ఒకచే ద్విపదీసవ్యంలోను, ఒకచేసరణిలోను వున్నది.

ఉగ్రం, ప్రసన్నం, మనోహరం, జుగుప్సితం, అద్భుతం యిట్లా వివిధంగావున్న ఖగోళమహీగోళప్రకృతుల్లోని వివిధరూపాలను రామాయణమహాభారతకుమారసంభవాదుల్లోవలె కథాపురుషులదశకు అనుగుణంగా ప్రదర్శించడం వీరచరిత్రలో అరుదు. యుద్ధావసానపు చీకటివర్ణనకూడా ప్రకృతంతో అంతగా సంగతం కాదు. రఘువంశం

లోని సింహదిలీపసంవాదంవంటి, కుమారసంభవంలోని పార్వతీపర మేశ్వరసంవాదంవంటి సంవాదాలుగాని, రఘువంశంలోని అజవిలాపం వంటి ఆత్మగతసంభాషణలుగాని, ఉదాత్తకోటిలో చేరదగినవి, వీరచరి త్రలో మృగ్యం.

## శ్రీ నా థ కృ తు లు.

### పల్నాటివీరచరిత్ర - తెలుగువాఙ్మయం.

పల్నాటివీరచరిత్రను విచారించడానికి పూర్వం తెలుగువాఙ్మ యాన్ని గురించి క్లుప్తంగా తెలుపుతాను. తెలుగువాఙ్మయం నన్నయా దుల భారతసంగ్రహాదులతో ఆరబ్ధమయింది. తరువాత నైషధాదులు ఆవిర్భవించినవి. మరికొంతకాలానికి మనుచరిత్రలవంటివి ఉద్భవించి నవి. శాకుంతలాదులవలె నన్నయాదులకృతులు స్వసృష్టులు కాకపోవడం విశదం. కొన్ని తీసివేతలు, పద్యంలో యిముడకపోతే కొన్ని విశేషణాలు తగ్గడం, అక్షరాల తమాషాకోసం పద్యం నిండకపోతే కొన్ని విశేషణాలు హెచ్చడం, యిట్లానే వర్ణనలు మరికొన్ని చిల్లరమార్పులు, ఉన్నమాత్రాన మూలాలపేక్షచేత అదేకథ, అదేపాత్రవర్గం, అవే కథా వయవాలు, అదేకథాక్రమం కలిగి కొన్నిచోట్ల అవేమాటలు, బహు ళంగా అవే అభిప్రాయాలు తెలిపే నన్నయాదులకృతులు స్వతంత్రగ్రం థాలు కాజాలవు. ఇక అవి అనువాదాలని చెప్పవలసివున్నది.

మూలంయొక్క స్వరూపం అవికలంగా భాషాంతరంలో తెలప డమే అనువాదానికి పరమప్రయోజనం. నన్నయాదులవి అనుచితా నువాదాలు. ముఖ్యమైన అంశాలను కవితాసారంగల ఘట్టాలను వదలి తుంచడం మార్చడం మొదలయిన వికారాలతో కలుషితంగా వున్న నన్నయాద్యనువాదమార్గాన్నే శ్రీనాథుడు నైషధాదుల్లో అనుసరిం చాడు. పల్నాటివీరచరిత్ర మూలగ్రంథమైనాకూడా తెలుగువాఙ్మ యంయొక్క యీసాధారణస్థితిని దాటలేదు. కాళిదాసాదుల కావ్యా ల్లోవలె ఉదాత్తకవితాస్వరూపం యిందు కానరాదు.

గానాలు ఆళ్వారుల నాలాయిరప్రబంధం నయనారుల తేవారాలు అయివుంటవని అనుకొంటున్నాను.

नैषां न्याय्य इह द्विजान्वयजुषां भाषाप्रबन्धे श्रमो
वेदे विश्वपुमर्थसाधनविधौ बद्धादरे जाग्रति
तीरं क्षीरपयोनिधेरुपगतो दैत्यारिदीप्त्यावृतं
को वा धावति दुग्धलब्धिचपलो गोपालकस्यालयम् ॥ (वि. द.)

(సమస్తపురుషార్థాలను సాధించడానికి వేదం బద్ధాదరమై వుంటూ వుంటే ఈ బ్రాహ్మణవంశ్యులకు (రామానుజీయులైన వైష్ణవులకు) దేశ్యభాషాప్రబంధాభ్యాసం అన్యాయ్యం. విష్ణుతేజస్సుచేత ఆవరించబడిన పాలసముద్రపుగట్టుకు పోయి యెవడు పాలకోసం సక్తితో గొల్లయింటికి పరుగెత్తుతాడు?)

" मुञ्चन्तः पञ्चयज्ञान् द्रविडभणितिभिर्मोहयन्तोऽनभिज्ञान् ॥"

(वि. द.)

"పంచయజ్ఞాలు విడిచిపెట్టి ద్రవిడభణితులచేత తెలియనివారిని భ్రమపెట్టుతూ."

అని కృశానువుచేత

" उपादेयं प्राज्ञैरुचितविषयं द्राविडवचोऽप्ययुक्तार्थं हेयं भवति वचनं संस्कृतमपि ॥" (वि. द.)

(ఉచితవిషయమైనది ద్రావిడవచస్సుకూడా స్వీకార్యం అయుక్తార్థమైనది, సంస్కృతవచనంకూడా త్యాజ్యం)

स यासां व्याकर्ता चुलुकितसमुद्रो मुनिवरः
प्रबन्धारः प्रौढाः शठमथनमुख्याः शमधनाः
प्रवक्तारः शुद्धाः प्रथितयशसः पूर्वगुरवो
गिराम्पारे तासां जयति गरिमा द्राविडगिराम् ॥ (वि. द.)

(వేటికి సముద్రాన్ని ఆచమనంచేసిన ఆమునిశ్రేష్ఠుడు వ్యాకరణం రచించాడో, వేటికి శమధనులైన శఠకోపముఖ్యులు ప్రౌఢప్రబంధలో,

వేటికిప్రథితయశస్సుగల శుద్ధులు పూర్వగురువులు (రామానుజాదులు) ప్రసక్తలో ఆద్రావిడవాక్కుల గరిమ వాగగోచరంగా వర్తిస్తున్నది.) అని విశ్వావసుచేత వేంకటాధ్వరి చెప్పించిన వచనాలు ఆకాలంలో సంస్కృతానికి దేశ్యభాషలకు వుండిన సంఘర్షాన్ని తెలుపగలవు. రూపకాలకు సంబంధించిన సాహిత్యగ్రంథాల్లో యీప్రాకృతభాషలు మధ్యమాధమపాత్రలకు యేతీరున వుద్దిష్టమయిందీ స్పష్టంగా తెలుసుకోనవచ్చును. అయితే మతవిజ్ఞానభాషాగౌరవం యియ్యకపోయి నప్పటికీ సంస్కృతం ద్వారా పరిణతబుద్ధులైన విబుధులు కొందరు అను వాదాల్లోకి సంగ్రహాల్లోకి దిగకుండా స్వతంత్రంగా ఉత్తరభారతపు ప్రాకృతాల్లో కావ్యాలు రచించారు గనుక కావ్యశాఖ అయినా కొంతవరకు పరిణతులకు గణసీయమైనదిగా యేర్పడ్డది. బాణుడివంటి విద్వాంసుడిచేత

" कीर्तिः प्रवरसेनस्य प्रयाता कुमुदोज्वला ।
सागरस्य परं पारं कपिसेनेव सेतुना ॥" (ह. च.)

అని కీర్తితమై ఆనందవర్ధనుడివంటి సాహిత్యవేత్తలకు ఉదాహరణా లకు సమకూర్చదగిన వాఙ్మయం శృంగారబహుళమైనా యేర్పడ్డది. కొందరు స్వతంత్రించి రూపకాలుకూడా రచించారు. ఉపలభ్యమాన మైన రాజశేఖరకృతికర్పూరమంజరివంటివి రూపకాలింకా కొన్ని వుండివుంటవి. తెలుగులో యిట్లాటి స్థితిమృగ్యం. అనువాదాలు క్షుద్రంగా వున్నవని తెలిపినాను. స్వతంత్రరచనల్లో ఒకటిరెండు తప్ప తక్కినవి వ్యంగ్యవినాశంతో అన్ని తెలుగుకృతులకూ సమానమైన మురికిపద్యాలకసవుకుప్పలతో నిండి కవితావిషయాన అధమంగా వున్నవి. ప్రాకృతకృతికర్తలు సంస్కృతశబ్దాలను వాడనట్లే తెలుగులో కూడా కొందరు సంస్కృతశబ్దాలను త్యజించి అచ్చతెలుగుగ్రంథరచన ఆరంభించారు. అయితే ఆపని సాధ్యంకాలేదు. కవిత్వందాకా పోవడం యెందుకు? ఇప్పటి టెల్లిగ్రాఫు భాషవలె వారేర్పరుచుకొన్న తిక్క

మాటల పక్కి భాషలో కథలను పూర్తిగా తెలపడమే ప్రాయికంగా వారిపాలిటికి మహాసర్గమయింది. ఈతీరుగా తెలుగుకృతులు యేరకంలోనూ క్షుద్రదశ దాటలేదు. ఇంతకూ చెప్పదలచినదేమంటే ఆ కొంచెం కావ్యనలయంలో కూడా తెలుగుగ్రంథరచన అధమమై ఉత్తమాధికారులకు అగ్రాహ్యాంగా ఉండిందని నన్నయానువాదం యెంత అధమమై ఉత్తమాధికారులకు యెంత అగ్రాహ్యమైనా అతడారంభించినపద్యం యెంత మురికిలక్షణాలు కలది అయినా తెలుగు గ్రంథ మనేదాన్ని మొదట మనకిచ్చాడు గనుక అతడు ఆరాధ్యుడేను. అయితే ఆకాలపు ప్రకృష్టవిద్వాంసులు ఇతడిపనిని గణనీయకోటిలో చేర్చినట్లుగాని తెలుగును సంపన్నం చేయబూనినట్లుగాని కనబడదు. వారు తెలుగుతో సంబంధం పెట్టుకొనివుంటే తెలుగు యీనాటికి అత్యంతం సమృద్ధమైనభాషల్లో ఒకటిగా వుండేదని నే నను కొంటున్నాను. అహోబలపండితుడివంటివిద్వాంసులు విబుధులదృష్టి తెలుగువంక మరల్చడానికి కొంతపూనుకొన్నా వారియత్నం సఫలం కాలేదు. చివరకు అహోబలపండితుడివంటి విజ్ఞానసంపన్నుడి రచన సంస్కృతంలోనే వుండవలసిరావడం తెలుగుయొక్క భాగ్యహీనత కాక మరేమి కాగలదు? అధమాధికారులకు దుర్గ్రాహ్యమైన భగవద్గీతాదులను భారతంలో వదలిపెట్టడం, "నాటకాంతం కవిత్వం" అని కీర్తితమై కావ్యశిరస్సులని చెప్పదగిన నాటకాలను వారు అనువదించకపోవడం, పరమవిజ్ఞానప్రదమైన న్యాయాదిశాస్త్రాలను శ్రీనాథుడివంటి అహోబలుడివంటి మహావిద్యావంతులు సయితం తెలుగున స్పృశించకపోవడం, సాహిత్యంలో సయితం గణనీయమైన విచారణాగ్రంథాలు లేకపోవడం ఆకాలాన తెలుగుకృతులు అధమాధికారులకే వుద్దిష్టమనిఅవి కథలకూ పద్యవినోదానికీ తప్ప మరే వుదాత్త ప్రయోజనానికీ వారు స్వీకరించలేదని స్పష్టపరుస్తున్నవి. పోతనాదుల భాగవతాదులు కూడా ఈసంగతికే జ్ఞాపకంగా వున్నవి.

సంస్కృతమహాభారతమే శాస్త్రజ్ఞవలయంలో ఒక విధంగా కింది మెట్టున వున్నప్పుడు ఇక తుంచడం మొదలైన అసంబద్ధతలతో కూడిన తెలుగు అనువాదంయొక్క అధమాధికారిగ్రాహ్యత్వం చెప్పవలసినది లేదుగదా.

" संस्कृतपुराणपठनाक्षमाणां तच्छ्रवणेऽप्यलालसानां मुमुक्षूणां शूद्रादीनां प्राधान्येन ज्ञानोपयोगीन्यांध्रपुराणानि भवन्त्येवेति " (अहो)

(సంస్కృతపురాణపఠనంచేతగానివారు, వాటిని చదివిచెప్తూవుంటే వినడానికికూడా అలాలసులైనవారుఅయిన శూద్రాదులకు ప్రధానంగా ఆంధ్రపురాణాదులు జ్ఞానోపయోగులవుతున్నవేను) అని అన్న అహోబలపండితుడివచనం వాటి అధమాధికారి గ్రాహ్యత్వాన్ని విశదం చేస్తున్నవి.

తెలుగుకృతుల కిప్పటికికూడా యిదేదశ చాలామట్టుకు దృష్టమవుతున్నది. ఈఅంశాన్నే

"సంస్కృతపండితునిదృష్టి తెలుంగునం దంతఘనంబుగాఁ బోవదెరదు."

(బా. గు. ప్ర. 517.)

అని శ్రీకల్లూరి వేంకటరామశాస్త్రులవారు వ్రాసిన మాటలు విదితం చేస్తున్నవి. మద్రాసు విశ్వవిద్యాలయం వచ్చినతరువాత తెలుగుయొక్క ఈదుర్దశ మారకపోవడం అట్లా వుండగా మరికొంత నికృష్టస్థితి యేర్పడ్డది. విశ్వవిద్యాలయం వచ్చినప్పటినుండి వెలసిన తెలుగు గ్రంథాలు, నిఘంటువులవద్దనుండి పాఠ్యగ్రంథాలవరకు, ఈ అధమదశను వెల్లడిస్తున్నవి. మచ్చుకు కొన్ని ఉదాహరణాలు చూపి యీ విచారణ ముగిస్తాను.

౧ "మహావీరచరిత్రము...కాళిదాసరచితము అయిన ఒకనాటకము."

౨ "మృచ్ఛకటి. ఇది శూద్రకునిచే రచియింపఁబడిన ఒక నాటకము."

3 "భర్తృహరి...ఈయన ................ వాక్యప్రదీపము అను వ్యాకరణ గ్రంథమును రచియించెను."

(పురాణనామచంద్రిక.)

(1) మహావీరచరిత్రం, కాళిదాసరచితమయిన నాటకంకాదు. భవభూతిరచితం.

(2) శూద్రకుడు రచించినది మృచ్ఛకటిగాని మృత్తుఘటికాదు.

(3) భర్తృహరి రచితమైనది వాక్యపదీయం. వాక్యప్రదీపం గాదు.

౪ "సఖుఁడు. సం. వి; అ. పు" (శబ్దరత్నాకరం.)

(4) సఖుడు అనేది అకారాంత పుంలింగశబ్దంయొక్క ప్రథమైక వచనరూపమని శబ్దరత్నాకర కర్త అభిప్రాయం. ఇది తప్పు. అకారాంత పుంలింగమైన సఖ శబ్దం లేదు. అది ఇకారాంత పుంలింగం. పరమసఖ, భవత్సఖ అనేవాటిలోవలె సమాసాన్తస్థమై

**राजाहःसखिभ्यष्टच् (अ ५–४–९१)**

(తత్పురుషసమాసాంతమందున్న రాజన్ అహన్, సఖి ఈశబ్దాలకు టచ్ (అ) ప్రత్యయం వస్తుంది.)

అనేపాణిని వచనంప్రకారం టచ్ ప్రత్యయాంతమైన సఖశబ్దాన్ని చూచి యీయన భ్రమపడివుండవచ్చును. సమాసాంతమందుండనప్పుడు ఇది ఇకారాంతమైన సఖి శబ్దం. అకారాంతంగాదు. అనేకమైన ఆధునికపుస్తకాల్లో బహుళంగా కనబడుతున్న సఖుడు అనేదుష్టప్రయోగాలూ శబ్దరత్నాకరకర్తయొక్క పై తప్పు వ్రాతా ఒకటే కోటిలోవి.

ఉ. "అటజనియోసఖా." (ఆంధ్రమేఘసందేశం. వడ్డాది సుబ్బరాయుడు.)
జనకుండో. సుతుఁడో సఖుండో (ప్రబోధచంద్రోదయం. కందుకూరి వీరేశలింగం.)

"కావుఁరుజన్ సహింతువెసఖా" (వేదం వేంకటరాయశాస్త్రి. మాళవికాగ్నిమిత్రం.)

(5) మీమామ సఖుడు నాకు (రఘువంశం. 14. ఆదిపూడి సోమనాథరావు)

సాధారణంగా యెన్నో తెలుగుపుస్తకాల్లో తరుచుగావుండే ఈసఖుడికి ఇంకా ఉదాహరణాలను విస్తరభీతిచేత వదలుతున్నాను సఖునకుఁ (ఆ. 5) అని భోజరాజీయంలోవలె కొన్ని వెనకటి పుస్తకాల్లో వుంటే అంతమాత్రాన అది సాధువుకాజాలదు. గ్రంథకర్త మృతివల్ల దోషం గుణం కానేరదు. జీవద్దశ గుణాన్ని దోషం చేయజాలదు. గ్రంథకర్త గతించినా జీవించివున్నా సాధ్వసాధుతలు మారవు.

"सह खेन वर्तत इति सखः"

అని సఖశబ్దం సిద్ధిస్తున్నదని కొందరు అడ్డం రావచ్చును. ఋజుమార్గంలో మిత్రవాచికాని యీతీరు కృత్రిమ శబ్దాలు శరణం కాజాలవు. ఈరకపు వాటికి పాల్పడితే నిఘంటువులు అవ్యవస్థితాలై స్వరూపాన్ని కోల్పోవడమేకాక భాష అయోమయపుఅసంబద్ధతపాలు కాగలదు. కనుక అట్లాటివాటిని అడ్డం పెట్టుకోనడం అకార్యమని చెప్పి ఈసంగతి ముగిస్తున్నాను. అవునుగాని శబ్దరత్నాకరపు వ్రాత తప్పని ఒప్పుకొంటాము.పుంలింగంలోను స్త్రీలింగంలోను అప్పుడు సఖి అని ఒకటేరూపం యేర్పడుతుంది, అది చిక్కుగదా అంటే చెప్పుతున్నాను. సుమతి, ధాత్రి గాంధారి, ఇట్లాటివాటికి పుంలింగంలోను స్త్రీలింగంలోను తెలుగులో ఒకటేరూపంగదా. వాటికేమిచేస్తున్నాము? వాట్లో సుమతి అనేదాన్ని ఆ అర్థంలో సుమతుడు అని అననట్లే సఖి అనేదాన్ని సఖుడు అని అనకూడదని అట్లా అనడం అపభ్రంశమని ప్రకరణాన్ని బట్టి అర్థం జ్ఞేయమని చెప్పి మరియొక అంశానికి వస్తాను.

(6) "పాణిని వ్యాకరణభాష్యము మున్నగు గ్రంథములయందును, గోనర్దీయుఁడు, గోణికాపుత్రుఁడు అను పేరులు పదములు గలవు. ఇవి పాణినికి పేర్లుగను వాడఁబడి యున్నవి." (పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి.) వాత్స్యాయన కామసూత్ర వివరణం. 22.

(6) గోనర్దీయుడు గోణికాపుత్రుడు—ఇవి పతంజలి పేరులుగాని పాణిని పేరులుగావు.

"न रत्नमन्विष्यति मृग्यते हि तत्" అని మాఘము
(మద్రాసు యూనివర్ సిటీ యింటర్ మీడియట్ సెలెక్షన్లు 715.)

(7) పై వాక్యం మాఘంలోనిది కాదు. అది కుమారసంభవం లోనిది.

(8) తురగ = గుఱ్ఱములయొక్క, బహువిధ = పలువిధములయిన, ఆరోహకళా = ఎక్కుటయను విద్యయందు, రేవంతునకున్ = అశ్వశిక్షకుఁ డయినవానికి.
(ఆనంద. మను)

రేవంతుడంటే అశ్వశిక్షకుడు కాదు. ఇది ఊహించి వ్రాసిన అర్థం. 'అశ్వారోహణకళయందు అశ్వశిక్షకు' డయినవానికి అని అనడం బాలోక్తిగదా. రేవంతుడు అనేది సంజ్ఞావాచి. అతడు సూర్యపుత్రుడు. భార్య సంజ్ఞాదేవి భర్తృతాపాన్ని సహించలేక ఆడగుర్రపురూపం ధరించి వుత్తరకురుభూముల్లో తపస్సుచేస్తూవుంటే మగగుర్రపు రూపంతో సూర్యుడు ఆమెను కలిసినప్పుడు జనించిన పుత్రుడు రేవంతుడు. ఇతడు అశ్వవాహనుడు. ఈకథ మార్కండేయపురాణంలో దృష్టం. వీరచరిత్రపూర్వభాగంలో రేవంతముళ్లు రేవంతుడి బయలు అనేచోట్ల ఈశబ్దానికి ఈఅర్థమే అను సంధేయం. రేవంతుడంటే అశ్వశిక్షకుడనే అర్థంకాదని ఆశబ్దంజాతివాచికాదని సంజ్ఞావాచి అని స్పష్టపరచాను. పై ఊహింపు అర్థం జూలూరి అప్పయ్యపండితులదిగా కనబడుతున్నది. దీన్నే ఆనందాదిముద్రాలయాల్లో ప్రకటితమైన మను చరిత్రలు పేరు చెప్పకుండా గ్రహించినవని అనుకోనవచ్చును.

9 "మనువునుగురించి మేధాటితి
10 లాత్యాయన" (కామరాజు హనుమంతరావు.) హింజీ 146;47.

(9) మేధాటితి కాదు మేధాతిథి. మేధాతిథి మనువును గురించి యేమీ వ్యాసం వ్రాయలేదు. మేధాతిథి మనుస్మృతికి వ్యాఖ్యాన కర్త. ఆవ్యాఖ్యకు మనుభాష్యమని పేరు. **Medthatithi on Manu** అని మూలంలో వున్న పఙ్క్తిని చూసి వ్రాసిన తెలియనిమాటలివి. ఇట్లాటి

అల్పవ్యుత్పత్తితో Hindu view of life వంటి గొప్ప గ్రంథాలను అనువదించబూనడం దానికి మూలగ్రంథకర్త సమ్మతించడం తెలుగు దురదృష్టంగదా.

(10) లాత్యాయనుడు కాదు లాట్యాయనుడు. ఇంగ్లీషుమూలంలో "Katyana-Latyana" అని ఒకటేచోట ఉన్నారు. కాత్యాయనుడివలె లాత్యాయనుడుగూడా వుండవచ్చునని అనువాది వూహించాడు. ఇట్లానే మరిఒకచోట చూసి తెలియక అవకతవకలు వ్రాయడం యింకొకపుస్తకంనుండి ఉదాహరిస్తాను.

(11) కుమారిలభట్టు 'పాంబు' అనుదానికి బదులు 'పాంప్' శబ్దము నుదాహరించుటచేతను,

(12) కుమారిలభట్టు 'ఆంధ్రద్రావిడభాష' యనుపదము నుపయోగించెననియు నయ్యది దక్షిణదేశభాషలనుద్దేశించి వాడఁబడినదనియును, దెలియుచున్నది.
(విద్వాన్. జి. జె. సోమయాజి. ఎమ్. ఏ. ఎల్. టి.) ద్రావి. 13;174.

(11) కుమారిలభట్టాచార్యులు పాంప్ అని చెప్పలేదు.

**तद्यथा पाप् शब्दं पकारान्तं**
**सर्पवचनं अकारान्तं कल्पयित्वा.**

(त १–३–१०)

అని అనుసాసికంలేని పాప్‌శబ్దాన్ని ఉదాహరించారు.

(12) ఆంధ్రద్రావిడభాష అని వచించలేదు. **तद्यथा द्रविडादि भाषायामेव** అనేమాటలను వాడినారు. (त १–३–१०)

(13) వ్యాకరణమహాభాష్యము చదువుకోకపోతే శబ్దమంజరివల్ల ప్రయోజనము లేదు.
మహాభాష్యము చదువుకొంటే శబ్దమంజరివల్ల ప్రయోజనములేదు.
(చిలుకూరి నారాయణరావు, ఎమ్. ఏ. ఎల్. టి. పి. హెచ్చ్. డి.) (సం. లో)

ఇవి ఊహింపుమాటలు. మహాభాష్యం చదవకపోతే అర్థంకాదని చెప్పబడినది పదమంజరికాని శబ్దమంజరి కాదు.

"अनधीते महाभाष्ये व्यर्था स्यात् पदमञ्जरी"

అని అన్నచోట పదమంజరి కాశికావృత్తి వ్యాఖ్య. అది హారదత్త విరచితం. శబ్దమంజరి పిల్లల ప్రథమశిక్షాపుస్తకం. శాస్త్రసంప్రదాయం తెలియక వ్రాసిన గాలిమాటలను చూపినాను.

(14) కుమారిలభట్టు..................ఇతఁడు జైమినిసూత్రములకు భాష్యమును విరచించెను. (చిలుకూరి వీరభద్రరావు,) ఆం. చ. 248 ప్రథమభాగం.

(14) జైమినిసూత్రాలకు భాష్యం వ్రాసినది శబరస్వామి. కుమారిలభట్టు కాదు. ఆగ్రంథానికి శాబరభాష్యమని పేరు. ఈశాబరభాష్యం మీద కుమారిలభట్టాచార్యులు వార్తికం వ్రాశారు. పైన ఉదాహరించిన పద్యాలదుష్టత విజ్ఞులకు విదితమేగదా అని విస్తరించి వివరించలేదు. ఇక రేజీకటి వుజ్జాయింపుసంస్కృతం, దూడపేడ సంస్కృతం, మరియొకచోట పీఠికలో వివరించదలచి యిక్కడ వదలినాను.

పైన చూపిన అసంబద్ధతలవంటివాటిని గుణదోషవిచారానికి కావలసిన బుద్ధిగాని శక్తిగాని లేక యేదిపెట్టినా మింగేఅధిమాధికాపులుమాత్రమే పత్తిగింజల బసవన్నలవలె స్వీకరిస్తారని స్పష్టం. అపభ్రంశాలు కనుక్కొని నిరసించగలిగి గుణవిశేషాలకు ఆహ్లాదించగల విద్వచ్ఛ్రేణి దేశంలో బలవిశిష్టంగా వుంటే పైనచూపినరకపు పుట్టగొడుగుగ్రంథాలుకాక ఉదాత్తకోటిలో చేరదగినవి ఉత్తమాధికారులకు గ్రాహ్యంకాదగినవి ఉద్భవిల్లడానికి అవకాశం యేర్పడుతుంది. ఆ అవకతవకలపద్యాలకర్తలు వాఙ్మయానికి ఉపకారం చేయవలెననే సంకల్పంకలవారే పూజ్యులే అయినప్పటికీ, తమగ్రంథాలు పరిణతులైన విద్వాంసులు చూస్తారనేసుజ్ఞానం వారికి ఉండినట్లైతే యింకా కొంచెం హెచ్చుశ్రద్ధవహించి తమగ్రంథాలు నిష్కల్మషదశలో వుండడానికి యత్నించి వుంటారనిమాత్రం చెప్పి యీవిచారణ ముగిస్తున్నాను.

సర్ రాధాకృష్ణులవంటి పరిణతబుద్ధులు తమ భావాలను తెలుగులో తెలపడంగాని తెలపడానికి యత్నించడంగాని లేకపోవడం విద్వల్లోకంలో పఠనపాఠనాల్లో తెలుక్కువుండే అధమస్థితి ఫలంగాక మరేమి కాగలదు? తెలుగుప్రాచీనకాలంనుండి యిప్పటివరకు అధమదశయందుండడం నిరూపించాను. ఇట్లా అధమాధికారులకు వుద్దిష్టం గనుకనే తుంచడం, మార్చడం మొదలైన అనౌచిత్యాలతో ఇవి వీరికి చాలవా అని సంగ్రహాలను దరువుప్రాధాన్యంతో ప్రాచీనులు రచించారని అనుకోనవచ్చును. ఇక ఇట్లాటి సంగ్రహాలను మాత్రమే చదివి తెలుగులో వ్రాయడం మొదలుపెట్టే వారికృతులు రచనలు అంతకంటే అధమదశలో వున్న వారికిగాని వుపాదేయం కావనడం విదితమేగదా. ఇట్లా అధమాధికారులకు వుద్దిష్టమైన పురాణసంగ్రహాలు అట్లానే క్షుద్రంగా వున్న మరికొన్ని పుస్తకాలు పాఠ్యగ్రంథాలుచేసి విద్వాన్, బి. ఏ. ఆనర్స్, యం. ఏ. మొదలైన పరీక్ష లేర్పరచడంవల్ల స్పృహణీయమైన ప్రయోజన మేమీసిద్ధించదని విజ్ఞులకు వేరుగా చెప్పవలసినది లేదు. కణాదుడు, గౌతముడు, శంకరుడు, ఆనందవర్ధనుడు, అభినవగుప్తపాదుడు మొదలైన మహావిజ్ఞానసంపన్నుల రచనలకు అందులైపురాణకథలూ అట్లాటివే మరికొన్ని చిల్లరపుస్తకాలూ పఠించడం పరమవిద్యగా వుండే విద్వాసుల భాషాప్రవీణుల విజ్ఞానపురకమేమి? అట్లానే అంధతతో పొందిన బి. ఏ; యం. ఏ. మొదలైన ఉపాధులకు భారతీయ విజ్ఞానవిషయంలో విలువయేమి? అనే ప్రశ్నలకు నీళ్లు నములడమే ప్రతివచనం కదా? బి. ఏ; యం. ఏ. మొదలైన ఉపాధుల ముఖ్యవిషయాల కన్నిటికీ లేదా ప్రకృతం "శిరోమణి" "విద్యాప్రవీణ" ఈఉపాధుల విజ్ఞానవిషయాలమట్టుకైనా తెలుగులోనే నిర్బంధంగా పరీక్షజరుగవలెనని యేర్పరచిననిమిషమే ఆంధ్రభాషయొక్క క్షుద్రదశతొలగడానికి ఆరంభకాలం కాగలదు. ఇప్పుడంతగా ప్రయోజనవంతమైనపనిలేక తగినప్రతిఫలం ప్రాపించకుండా ధనాన్ని వ్యయపరు

స్తున్న ఓరియంటల్ రిసర్చ్ ఇన్స్టిట్యూట్ తెలుగుశాఖను, పైన తెలిపిన పనికి అనుకూలంగా, అనువాదశాఖగామార్చి, యింగ్లీషులోను సంస్కృతంలోను విజ్ఞానవిషయకంగా వున్న ప్రామాణికగ్రంథాలను తెలుగులోకి తర్జుమా చేయించవచ్చును. అంతేగాక శాస్త్రీయవిషయాలను సంస్కృతసాహాయ్యం లేకుండా తెలుగులో తెలపడం అసాధ్యంగనుక, అభిమానశాస్త్రంలోప్రావీణ్యానికీ ఆంధ్రరచనాకౌశలానికీ తోడు సంస్కృతభాషయందు నైపుణ్యం కలిగే విద్యావిధానం యేర్పాటు చేయవలసివున్నది. ఈపని కావలసినంతవరకు జరిగితేనేగాని ఆంధ్రవాఙ్మయేతిహాసంలో స్మరణీయదశ యేర్పడి ఆంధ్రభాషాగ్రంథాలకు వృత్తవ్యాధికారి గ్రాహ్యత్వం సిద్ధించదని, అట్లాగాక కొన్ని అసంగతపురాణసంగ్రహాలకు అతీత మరికొన్ని చిల్లరపుస్తకాలకు పరీక్షలు ఉపాధులు యేర్పరిస్తే ఇదంతా ఆంధ్రభాషాభివృద్ధి అని మనము చంకలు కొట్టుకొనడం మిక్కిలి తెలివిమాలినపని అని చెప్పి ఆనుషంగికంగా వచ్చిన యీవిచారం యింతటితో ముగించి ప్రకృతానికి వస్తాను.

నన్నయకాలంమొదలు ఇప్పటివరకు యేర్పడిన తెలుగుకృతుల స్థితి తెలిపినాను. ఈసంగతి పూర్వపక్షపరంపరాపూర్వకంగా విచారణ చేసి సిద్ధాంతంమట్టును యిక్కడ నిరూపించాను. నన్నయాదులకృతుల్లో ఉండేసంస్కృతం వారి ఉద్దేశమైనా అధమాధికారులకు సయితం పనికిరాకపోవడం, తిక్కన విరాటపర్వంలోని అధికప్రసంగాలు భగవద్గీతాపాఠం, ఉద్యోగపర్వంలోని రాయభారపుఘట్టాలు, మనువసుచరిత్రాదుల వర్ణపుకృతులు, వేమనపింగళిసూరనాదులకృతులు, అదివరకు లేక మద్రాసు విశ్వవిద్యాలయం వచ్చిన తర్వాత తెలుగు పండితులు తెలుగు లెక్చరర్లు అని యిట్లా యేర్పడ్డవారివృత్తం, వారిలో అనేకుల వ్యుత్పత్తి, పండితశబ్దంయొక్క అర్థం, తెలుగులో పండితుడు అనే మాటలకు ఇప్పుడుగల అర్థం, తెలుగుపండితులనే వారిలో అనేకులకు దేశవిజ్ఞానంతో యెంతవరకు సంబంధంగలదు అనే అంశం, తెలుగు కృతికర్తలు కొందరు అపభ్రంశాలు వ్రాసి తమ అవ్యుత్పన్నత

కప్పి పుచ్చుకొనడానికి వ్యాకరణాదులు కొంత చూచి వారిని ఆశ్రయించడం, వారు కొన్ని అవకతవకలు వ్రాసి యియ్యడం, అవి తమ వ్రాతలుగా వీరు ప్రకటించుకొని లోకవంచనా ఆత్మవంచనా కావించడం, దానివల్లకలిగే అజ్ఞానవర్ధనాద్యనర్థాలు, తెలుగుపండితు లనే వారు పాఠశాలలో కాక బయట వుండవలసినవిధాన్ని గురించి కొందరి అభిప్రాయాలు, వ్యాకరణాభ్యాసం లేకుండా బట్లరు ఇంగ్లీషు వంటి దూడపేడ సంస్కృతం తెలుగుపుస్తకాల్లో వాడితే యేమి అనే వారిమాటలు, లౌకికశబ్దాలు వదలి నన్నయాదుల ఛాందస శబ్దరూపాలతో ఛాందసపు తెలుగుశబ్దాలతో పుస్తకం వ్రాయవద్దా అనే సంగతి, తెలుగువంటి జీవద్భాషలకు వ్యాకరణం లేకుంటే యేమి అనే మాటలు, అష్టావధానమని శతావధానమని కర్తలకు బుద్ధిదుర్వినియోగాద్యనర్థాల హేతువు, కారయితలకు ఫలరహితం అయినవాటిని ఆచరిస్తూ అక్షరాలతమాషాపద్యాల కుప్పలుచేసి కవులమని అది కవిత్వమని కొందరు ఉప్పొంగడం, విజ్ఞానలబ్ధి లేకుండా కవిత్వం దానంతట అదే పుట్టుకొని వస్తుంది అని కొందరు అనుకొనడం, భారతీయుల విజ్ఞానలబ్ధికి ప్రకృతదశలో సంస్కృతవిద్య ఆవశ్యకమా కాదా అనే సంగతి, బిరుదులు చేరివున్నమాత్రాన వారికృతులు బాగా వుండవచ్చునని కొందరు తలచడం, కృతిసమర్పణోత్సవాలు చేస్తే కృతులు గొప్పవవుతవని కొందరు ఆశించడం, ఆశువు అని పేరుపెట్టి శీఘ్రంగా పద్యాల కుప్పలుచేస్తే అది కవిత్వమని కొందరు అడావుడిపడడం, పద్యాలపుస్తకం యెంతలావుగావుంటే అంత గొప్ప కవిత్వమని కొందరు తాండవించడం, అట్లా పద్యాలపుస్తకం లావుది తయారుచేయడం మహిమ అని కొందరు నర్తించడం, పద్యాలు గద్యవాక్యాలు వ్రాయడమే పరమవిద్య అయి బుద్ధిపరిపాకంలేని శోచనీయులు కొందరు కృతికర్తలుగా పత్రికల్లో వ్యాసాలకర్తలుగా బయలుదేరడం, అంకితం చేసినవారికి తమకృతి భార్య అని కొందరు

వచించడం, గద్యంపద్యం కలిసిన కృతులకు చంపువనే పేరు ప్రసిద్ధంగా వుంటే దాన్ని మరవడం, గద్యం లేకుండావుంటే అది ఒకవిశేషమను కొనడం, నిరుక్తి అనే అర్థంగల నిర్వచన మనేశబ్దాన్ని తప్పుపేరుగా దానికి పెట్టడం, గర్భకవిత్వమని ఒకపద్యంలో ఇంకొకపద్యం చొప్పించి రెండుమూడుఅర్థాలు చేర్చి, నిరోష్ఠ్యమని ఇంకా యేమోనని కొన్ని అక్షరాలు వదలి కొన్నిమాటలు విడిచి కుస్తీచేస్తే అది నిగ్గు కవిత్వ మని కొందరు తాళాలు కొట్టడం, ఈకాలాన ఒక సభగాని విందుగాని జరిగితే ఒకవూరినుండి మరియొకవూరికి యెవరైనాపోతే, తుమ్మితే దగ్గితే చొప్పదంటుపద్యాలు పోగులు పడడం, యాచించడానికీ ఇయ్యక పోతే తిట్టడానికీ అప్పకవి పద్యాలను సాధనంగా గట్టిపరచడం, ఆసా ధనాన్ని అవలంబించి కొందరు ధనవంతులను వ్యవహారసంబంధులను ఆశ్రయించి వారిని స్తుతించి వారివద్దనుండి కొంతధనాన్ని, పుచ్చు కొంటివాయినం అన్నట్లు, కొన్ని స్తుతులను పొందడంవల్ల, అందులో, బహిరంగంగా ముఖ్యమైన అన్నికులాల తెగల వివిధలక్షణాల మను షులను చేర్చినసభల్లో పొందడంవల్ల, తమకృతులు ఉత్కృష్టమవుతవని కొందరు భావించడం,

**"न तच्छास्त्रं न तच्छिल्पं न सा विद्या न सा कला"**
**यन्नवेत्र च काव्याङ्गमहो भारो महान् कवेः ॥**

(కావ్యాంగం కాకుండావుండే శబ్దంగాని, అర్థంగాని, న్యాయంగాని, కళగాని లేదు, అహాకవిభారం గొప్పది) అని యిట్లాకవి సామగ్రిప్రతి పాదిత మవుతూవుంటే విద్వత్ కవులమని కొందరు మురియడం,

**"अनन्तशास्त्रं बहु वेदितव्यं.........अल्पश्च कालः"**

అని విజ్ఞులు పలుకుతూవుంటే రేజీకటి సంస్కృతంతో ఉభయభాషా పారంగతులమని కొందరు ఊరేగడం,

**నిను మెచ్చుటోవుచుంటిని నను మెచ్చుచు నుంటివీవు** "............" (యేకవీర.)

అని యిట్లా ఒకరినొకరు కొందరు పొగడుకొనడం, నేటికాలపు కవిత్వ మనే గ్రంథంలో తెలిపిన అయోమయం మొదలైనవి ఇప్పటి పద్య కృతుల్లోవలె గద్యకృతుల్లోకూడా అనేకమైనవాట్లో కనబడడం, లోకో త్తరమైన కల్పనలు వ్యూహాలు లేకపోవడం అట్లావుండగా శీలభ్రష్టలైన స్త్రీల, వారికి తగినినాయకుల, ఇట్లాటి మరికొందరి చిల్లరమనుషుల వృత్తం కొన్ని పద్యపుస్తకాల్లోను గద్యపుస్తకాల్లోను ప్రహసనేతరాల్లో బహు ళంగా నిండడం, యెక్కడ దేనిని చెప్పవలెనో ఆవివేకం లేక సందర్భ మున్నా లేకపోయినా తమకు తెలిసినసంగతులన్నీ కొందరు కుక్కడం, విచార్యమాణవిషయంలో ఆవశ్యకమైన ప్రవేశం లేకుండా కొందరు అసంబద్ధాలు రచించడం, అశ్లీల చిత్రాలు పుస్తకాల అట్టలమీద వేసి దానివల్ల కొంత ఆకర్షించవచ్చునని కొందరు ఉత్సహించడం, అనువాదం జేసినమాత్రాన మూలగ్రంథకర్తలతో సమత్వం ఆరోపించుకొని ఆంధ్రగౌతములు, ఆంధ్రకణాదులు, ఆంధ్రశుక్రులు అనేటివున కొందరు అనుచితస్పర్ధతో సంభ్రమించడం, అనువాదంచేసి పద్యాల అనువాది గాని గద్యపు అనువాదిగాని ఉభయపు అనువాదిగాని కాదగి వుంటే ఆ అనువాదమే ప్రధానహేతువుగా కవి చక్రవర్తులమని కవి సమ్రాట్టులమని కొందరు గంతులువేయడం, పేరు చెప్పక చెప్పీ చెప్పక దొంగిలించి యెంగిలివ్రాతలువ్రాసి కాళిదాసు కవిత్వం కొంత అనే సామెతను జ్ఞప్తికితెస్తూ కొందరు మూలగ్రంథాలకు స్వరూప వికృతి కలిగించడం, పాతకాలపువేషంతో వుండేవారికృతులు మంచి వని కొందరు, ఇప్పటికాలపువేషం గలవారివి శ్రేష్ఠంగావుంటవని కొందరు, అటూయిటూ కాక మధ్యరకపువేషంవారివి గొప్పవిగా వుండ వచ్చునని కొందరు, ఇంగ్లీషు చదివిన వారిగ్రంథాలు గణనీయమని కొందరు, ఇంగ్లీషు రానివారి కృతులు ప్రశస్తమని కొందరు, బ్రాహ్మ ణుల కృతులు ఆదరణీయమని కొందరు, నియోగులవి ఉత్తమమని కొందరు, కాదు వైదికులవి శ్లాఘ్యమని కొందరు, వారూ వీరు

కాని మాధ్వులు ద్రావిడులు శ్రీవైష్ణవులు మొదలైనవారివి ఉపాదేయ మని కొందరు, బ్రాహ్మణేతరులవి అంగీకార్యమని కొందరు, యేకులమైనా సరే స్త్రీలగ్రంథాలు సంభావ్యమని కొందరు, నేనెక్కువంటే నేనెక్కువని పద్యాలతో పోట్లాడేవారిగ్రంథాలు గ్రాహ్యంగా వుంటవని కొందరు, తెలుగులో కాక ఇంగ్లీషులో యెవరైనా మెచ్చుకుంటే లేదా ఇంగ్లీషులోకి గ్రంథం అనువదించబడితే అది ఉత్కృష్టంగా వుండవచ్చునని కొందరు, పద్యాలకర్తలు మొదలైనవారివల్ల బహిరంగంగా స్తుతి పొందితే అట్లాటివారికృతులుపొగడదగినవిగా వుండవచ్చునని కొందరు, కర్త మొదలైనవారిచిత్రాలు ప్రకటించేకృతులు గుణవంతంగా వుండవచ్చునని కొందరు, అక్షరాల ఆట (వళిప్రాసలు) ప్రయత్నం లేకుండా పడినట్లు వుంటే అది కవిత్వమని కొందరు మనము మాట్లాడుకొనే సాధారణమైన మాటలు మొదలైనవి, సామెతలు, పద్యంలో వుంటే అదంతా కవిత్వమని కొందరు, తక్కిన విచారంతో మాకు పనిలేదు, అక్షరాల దరువుతో గాని లేకుండా గానిపద్యం వ్రాస్తేచాలును, అది కవిత్వమని కొందరు, సంస్కృతం యెక్కువగా వుంటే జటిలమని రమ్య కవిత్వమని కొందరు, తెలుగు యెక్కువగా వుంటే సొంపు కవిత్వమని కొందరు, అదీ యిదీ సమంగా వుంటే అపేక్ష్యకవిత్వమని కొందరు తలలూచడం, ధార అనర్గళం, శైలి మృదుమధురం, ముద్దులుమూటగట్టుతున్నది అనే యిట్లాటి రోకటిపాటమాటలు, ఈకాలంలో తెలుగులోగురువులని శిష్యులని అనుకొనేవారికి గల విద్యాసంబంధం, వారియెడల వీరి ప్రవృత్తి, ఆధునికమైన మూలగ్రంథాలు అనువాదాలు తదాభాసాలు, శాస్త్రగ్రంథరచనలు వీటి అన్నిటి మీమాంసావిస్తరభీతిచేత వదలుతున్నాను. పీఠికల్లోని ప్రశంసలను యాచితాభిప్రాయాలను గురించి వాఙ్మయపరిశిష్టంలో ద్రష్టవ్యమని చెప్పి ఇక భగవద్గీత వదలిపెట్టడాన్ని గురించి కొంతవిచారిస్తాను. భగవద్గీత వేదాంతానికి సంబంధించినది గనుకను, తెలుగుభారతం కావ్యదృష్టితో రచించబడినది గనుకను, దానిని తిక్కన వదలినాడని కొందరంటున్నారు.

నన్నయాదు లది కావ్యదృష్టి అని వ్యాసు డిదికాదని అనుకో నడం అప్రశ స్తం.

"కవివృషభులు సుహాకావ్యమనియు"

అని నన్నయ్యే సంస్కృతభారతం కవులదృష్టిలో మహాకావ్యమని చెప్పుతున్నాడు.

"प्रबन्धे च अंगी रस एक एव
उपनिबध्यमानोऽर्थविशेषलाभं
छायातिशयं च पुष्णाति कस्मिन्निवेतिचेत्
.........यथावा महाभारते" (ध्व. लो.)

(ప్రబంధంలో ప్రధానరసం ఒకటే ప్రతిపాద్యమవుతూ అర్థ విశేషలాభాన్ని ఛాయాతిశయాన్ని పోషిస్తున్నది. యెట్లానంటే మహా భారంతలోవలె)

అనేకచోట్ల ఆనందవర్ధనుడు మహాభారతం శాంతరసప్రధాన మైన కావ్యమని చెప్పుతున్నాడు. భారతం కావ్యమని భారతంలోనే ఉక్తం.

"कृतं मयेदं भगवन् काव्यं परमपूजितम्" (आदि)

(ఓ మహానుభావుడా! పరమపూజితమైన యీకావ్యం నాచే చేయబడినది.)

అని వ్యాసుడే బ్రహ్మతో చెప్పినట్లు విదితమవుతూవుంటే వ్యాసుడికి కావ్యదృష్టి లేదనడం అవివేకం. కాళిదాసాది మహాకవులకు సంశ్రయం కాగలిగిన వ్యాసుడికి కావ్యదృష్టి లేదనడం నిజంగా తెలివి మాలినపని. మాకు పై వాక్యాలు ప్రమాణం కావంటారా, మీ వాక్యాలు ప్రమాణం కాదని అంతకంటే చులకనగా తోసివేయ వచ్చునుగదా! ఇవన్ని సాహిత్యసాంప్రదాయం తెలియని అజ్ఞాన

వచనాలని అంటున్నాను. పోనియ్యండి నన్నయాదులది కావ్యదృష్టి అనే మాట కొంతసేపు ఒప్పుకొని విచారిస్తాను. భగవద్గీత వేదాంతం గనుక దాంట్లో కవిత్వం లేదని తిక్కన మానివేస్తే, శాంతిపర్వం ఆను శాసనికపర్వం యింకా అక్కడక్కడ వచ్చే కణికనీతివంటి రాజనీతులు మార్కండేయుడి ధర్మప్రవచనం యెందుకు తెలిగించాడు? భగవద్గీతలో లేని కవిత్వం రాజధర్మమోక్షధర్మాలను ప్రతిపాదించే శాంతిపర్వంలో యేమున్నది? భగవద్గీత వేదాంతమైతే శాంతిపర్వంలోని మోక్షధర్మ ఘట్టాలు సృష్టిక్రమాదులనిర్వచనం వేదాంతం కాదా? కావ్య దృష్టితో రచించాడు గనుక తిక్కన భగవద్గీత వదలిపెట్టినాడనడం తలాతోకాలేని అప్రశస్తపుమాట. తెలుగుభారతం అధమాధికారులకు వుద్దిష్టం. గనుకనే దానిని వదలిపెట్టినాడు. బ్రహ్మవిద్యకు ప్రధానాంగా లైన ప్రస్థానత్రయంలో భగవద్గీత ఒకటిగను, బ్రహ్మవిద్యయందు శూద్రాదులకు అధికారం లేదని బ్రహ్మసూత్రమందలి అపశూద్రాధి కరణంలో నిర్ణీతమైనది గనుకను అధమాధికారులకు అది అగ్రాహ్యం కావడంవల్లను శాంతిపర్వాద్యపేక్షచేత అధమాధికారులకు కఠినమైన భగవద్గీతను తిక్కన వదలినాడని స్పష్టం. ఈసంగతినే అహోబలుడి పజ్క్తులు వ్యక్తం చేస్తున్నవి. కావ్యదృష్టివల్లనని అట్లాగని యిట్లాగని వ్రాయడం సంప్రదాయవివేకంలేని అజ్ఞానపు మాటలని చెప్పి యీ విచారణముగిస్తాను.

ఇక తిక్కన అధికప్రసంగాలు. తిక్కన విరాటపర్వస్థకీచకవధ లోని చేర్పుడాలు గొప్పకవిత్వమని కొందరు తలుస్తున్నారు.

"విరాటపర్వములో దిక్కన్న వ్రాసిన శృంగారవర్ణనము అనన్యసాధ్యమని వేఱుగఁ జెప్పవలయునా? ఔచిత్యశోభితము."

అని శ్రీరామలింగారెడ్డివారు.

"ఇట్లీ కీచకవధఘట్టమునకు భీముని నాయకునిఁగాఁ జేసి శృంగార వీరరసముల కంగాంగిభావము కల్పించి యనేకవిధములగు నూతన వర్ణనలఁ జేర్చి యీకథ నొక చక్కని ప్రబంధముగా రచించినాఁడు."

అని శ్రీకోరాడ రామకృష్ణయ్యవారు.

"తిక్కనార్యుని కీచకునియందున్ననో, మానవస్వభావము చక్కఁగఁ బ్రతిబింబించుచున్నది......తిక్కన కీచకుఁడు ఉత్తమనాగరకుఁడు, సరసుఁడు;......తిక్కన మానవప్రకృతి పాండితిని 'హేమవిద్యం' బోనిదానిని ఎంతని కొనియాడ నగును!"

అని శ్రీగుఱ్ఱం సుబ్బరామయ్యగారు.

ఇట్లానే మరికొందరు అనుకొంటున్నారు. ఆచేర్పడాలు అధికప్రసంగమని దుష్టమని తెలుపబోతున్నాను. మంచిది ఆసంగతి విచారిస్తాను. సీతావిషయకమైన రావణరతి, ద్రౌపదీవిషయకమైన కీచకరతి, రసాభాసం. అంతేగాక అది హేయం. ఈహేయత్వాన్ని వివరించవలసిన పనిలేదు. విస్తరం నేటికాలపు కవిత్వమనే కృతిలో శృంగారాధికరణంలోను క్షుద్రకావ్యాధికరణంలోను ద్రష్టవ్యం. సంచారిభావాదిసామగ్రి ఉత్తమనాయకుల రతిసందర్భంలో శోభిస్తవి గాని రత్నాద్యలంకరణం మురుగుడుబురదనీటికుండకువలె దుష్టరతికి హేయం, అత్యంతం అనుచితం. నింద్యత ప్రకటితమయ్యేవిధంగా ఇట్లాటిరతిని తెలుపవలెను గాని చీము పుండుమీద యీగవలె, దానియందు సక్తి కనబరచడం అప్రశస్తం. కనుకనే రామాయణంలో రావణుడు సీతను ప్రార్థించడం ఆమె నిందించడం, తిరిగి అతడు పూలుబుక్కాయి సవరించుకొని మళ్లీ ఆమెనుప్రార్థించడం, తిరిగి ఆమె దూషించడం తప్ప అతడి మన్మథావస్థను సంచార్యాదులచేత విపులీకరించలేదు. అట్లానే మహాభారతంలో కీచకుడు సుదేష్ణతోను ద్రౌపదితోను గట్టిగా తన కామవికారం తెల్పుకొనడంతప్ప వేరేవిధంగా అతడి విరహతాపాలాపాలు మొదలైనవి వివరించలేదు. యెందుకంటే అవి తుచ్ఛమే కాకుండా అనావశ్యకం కూడా అయివున్నవి. దుర్బలచిత్త అయితే లభించేటట్లు అతడికామ ప్రార్థనలు కొంతవరకు దీర్ఘంగా ప్రతిపాదితమైనవి. అంతేగాని అతడి శృంగారాన్ని సంచార్యాదులతో వర్ణించలేదు. కాని తిక్కన్న యీ

వివేకం కోల్పోయి కీచకరతిని అనేకమార్గాల విస్తరింపజేసి ఆసక్తితో దాన్ని ప్రతిపాదించి యీాగపని చేశాడు. పై అంశాలు కథాభాగాలు కాక ద్రౌపదిని చూచినతరువాత సుదేష్ణతో మాట్లాడకముందు యే కాంత సంభాషణరూపాన కొన్ని సీసపద్యాలు, మరికొన్ని వృత్తాలు మొదలైనవి దండగబెట్టి కీచకుడి రతిని మూలంలో లేనిదానిని వుబుకుతో మనకు తెలిపినాడు. అక్కడ ఆగలేదు. కల్లు తేవడానికి ద్రౌపదిని సుదేష్ణ పంపుతానన్నతరువాత తిరిగీ కీచకకామాగ్ని అమూలకాన్ని. యింకా కొన్నిపద్యాలతో విపులీకరించాడు. ఇంతటితో వూరుకొనలేదు. నర్తనశాలకు రమ్మని ద్రౌపది చెప్పినతరువాత మళ్లీ మూలంలో లేని కీచకవిరహాన్ని సంభ్రమంతో వర్ణించాడు. చిన్నపద్యాలతో తృప్తిలేక కాబోలు

> సీ. ఇయ్యింతి ప్రాపున నయ్యనంగుఁడు పార్వతీశుసైనను దక్కనేలకున్నె
> కేలిమైనొక్కట లీలఁగ్రేళ్ళుసఁగెడు వాలుగు సోగలమేలు డించి
> లీలనాముందట నాలేమపాలసినఁ జూడ్కికిఁ జుబ్బనచూఱగాదె
> కనువిచ్చి నన్ను నాతనుమధ్యచూచినఁ దనువున కమృత సేచనముకాదె.
>
> (తి. భా. వి.)

అని సీసాలను అడుగడుక్కూ ఆహ్వానిస్తాడు.

ఈ సీసాలు బాగా వున్నవి గదా అంటే అవి కులటావిలాసంవంటివని చెప్పుతున్నాను. ఈ సంచారివర్ణనలతో వూరుకొనలేదు. అతడి విరహావస్థకు వుద్దీపనంగా వనవిహారాన్ని కల్పించాడు. అంతటితో ఆగలేదు. పొద్దుక్రుంకకపోవడం అతడికి దుస్సహంగా వున్నదని మూలంలో రెండుమాటలు చెప్పితే దానికి సూర్యాస్తమయవర్ణనను చేసి అతడి అనంగదశకు దాన్ని తగిలించాడు. తవుడుతింటూా వయ్యారం అన్నట్లు ఈ పాడుపనిలో దరువులుకూడా వేశాడు. ఇదంతా మురుగుడు బురదకుండకు రత్నాలద్యలంకరణం వంటిదని అది తుచ్ఛమని దానియందు సక్తి

ఈగపని అని తెలిపినాను. అదిగాక రసాభాసం కావ్యంలో అంగంగా వుండదగినది. దాన్ని అనుచితంగా విపులీకరించడం అంగవిస్తరమనే రసదోషానికి హేతువని సాహిత్యవేత్తలు చెప్పుతున్నారు.

**" अंगस्याप्रधानस्यातिविस्तरेण वर्णनम् " (का. प्र.)**

[అతివిస్తరంగా అంగంయొక్క, అంటే ప్రతినాయకాదుల, వర్ణనం (రసదోషం)]

అని మమ్మటుడు.

**" तथा च तद्गत एव रसः प्राधान्येनास्वाद्येत न तु नायकगतः प्रधानो-रस इति दोषः " (का. प्र. व्या.)**

[అట్లా (అయితే) ప్రతినాయకగతరసమే ప్రధానంగా ఆస్వాదిత మవుతుంది. కాని నాయకగతప్రధానరసం ఆస్వాదితం కాదు. కనుక దోషం]

అని వామనాచార్యులు.

హేయరసాభాసం అంగంగాక ప్రధానమైతే కావ్యం భ్రష్టమై దూష్యకోటిలో చేరగలదు. గనుక అవశ్యకమైనచోట అది అంగంగా మాత్రమే వుండడం వుచితం.

**" प्रतिषिद्धविषयत्वादिरूपं सामाजिकसंवेद्यं " (का. प्र. व्या.)**

(సామాజికులకు ప్రతిషిద్ధవిషయత్వాదిరూపంగా సంవేద్యమయ్యేది) అని ఈ ఆభాసపందర్భంలో న్యాయరత్నమహేశచంద్రులవారన్నారు.

అంగమైన ప్రతినాయకవృత్తంలో వనవిహారజలక్రీడాదులు ఒక గ్రంథకర్త ప్రతిపాదిస్తే అది దుష్టమని

**" हयग्रीवस्य जलकेलिवनविहाररतोत्सवादेर्नायकापेक्षया विस्तरेण वर्णनं हयग्रीवस्य नायकत्वमेव प्रत्याययते न तु प्रतिनायकत्वमितिदोषः । "**

न च "वंशवीर्यश्रुतादीनि वर्णयित्वा रिपोरपि ।" इत्यादिना विरोध इति वाच्यं ।

"यद्गुणत्वेन रिपोर्वर्णनेन नायकोत्कर्षप्रतिपादनं तत्रैवास्य तात्पर्यात् न तु वनविहारादावपि ।" (का. प्र. व्या.)

[హయగ్రీవుడియొక్క జలకేళి వనవిహారం, రతోత్సవం మొదలైనవాటిని నాయకుణ్ణి మించి అధికంగా వర్ణించడంవల్ల హయగ్రీవుడే నాయకుడని ప్రతీత మవుతుంది. (కాని అతడి) ప్రతినాయకత్వం (ప్రతీతం) కాదు. కనుక దోషం.....శత్రువుయొక్క వంశవీర్య శ్రుతాదులను వర్ణించి,అంటే వర్ణించడంవల్ల, కూడా (నాయకోత్కర్ష ప్రతిపాదనరూ మనకు ప్రీతికరం.) అనే(వండి)మాటలచేత విరోధంసంభవిస్తుంది అని అనరాదు. యెందువల్లనంటే శత్రువు యేగుణాలుగలవాడని వర్ణిస్తే నాయకోత్కర్షం ప్రతిపాదితమవుతుందో అక్కడనే పై వాక్యానికి తాత్పర్యం గాని వనవిహారాదులందు కూడా కాదు.]

అనేచోట్లల్లో సారబోధినీకారులు నిరాకరించారు.

ఇక అంగమైన హేయరసాభాసంలో ఆత్మభాషణ వనవిహార సూర్యాస్తమయాది వర్ణనల విస్తరం దుష్టమని చెప్పవలసిన పనిలేదు గదా! కనుక ఈ హేయమైన ఆభాసమంతా గొప్పకవిత్వమని గంతులు వేయడం అజ్ఞానం.

ఉత్తరభారతపాఠాంతరాలు మొదలైనవి యీ విచారణలో అప్రధానం గనుక వదలినాను. అవునయ్యా, నన్నయాదుల కృతులు అధమాధికారులకు వుద్దిష్టమని మీరే చెప్పినారు వారికి రుచించే మాదిరి తిక్కన మార్పుచేసినాడు, కనుక వుచితమేనంటారా అసంగతం. అధమాధికారులు ఉత్తమమార్గానికి వచ్చేతీరున రచించవలెను గాని వారిని యింకా అధోగతికి తీసుకొని పొయ్యేసరణి అత్యంతం నింద్యం గదా! కనుక, అధమాధికారులకు హేయండుచితమనడం నిల్వజాలదు. ఇట్లాటి తుచ్ఛశృంగారం తెలుగుదేశపు తెలుగుకృతుల్లో

ఇప్పుడు మితిమీరడం విదితమని చెప్పి ఈచర్చ ముగిస్తాను. తిక్కన విరాటపర్వమందలి అధికప్రసంగాలను వాటి దూష్యతను నిరూపించాను.

పైన తెలిపినట్లు తక్కిన వాటిని విచారించక వదలుతున్నాను. నన్నయాదుల భారతం, నైషధం, మొదలైన అనువాదాలు తుంచడం మార్చడం చేర్చడం మొదలైన అనౌచిత్యాలపాలై అధమమై ఉత్తమాధికారులకు అగ్రాహ్యంగా వుండడం స్పష్టం గనుక నిర్వివాదమని, ఈసంగతి కాదని యెవ్వరైనా రుజువుపరచితే ఆమాటలు ప్రామాణికంగా వుంటే నాసిద్ధాంతాన్ని వదులుకొంటానని లేకపోతే ఆమాటలను ఉపేక్షిస్తానని మనవిచేస్తూ యిక ప్రకృతవిషయానికి వస్తాను. నన్నయ మొదలు ఇప్పటివరకు తెలుగు వాఙ్మయపు సాధారణదశ తెలిపినాను. పల్నాటి వీరచరిత్ర ఇందుకు అపవాదం కాజాలదు. కాళిదాసీయాదుల్లోవలె ఉదాత్తభావోన్మీలనాదులు దీంట్లో కనుగొనలేము కనుక కవితావిషయంలో ఇది ఉత్తమత్వప్రతిపత్తిని పొందజాలదంటున్నాను.

## శ్రీనాథవైలక్షణ్యం.

ఈవీరచరిత్ర కర్తయైన శ్రీనాథుడు ప్రాచీనాంధ్రగ్రంథకర్తల్లో విశిష్టుడు. ఇతడి వైదుష్యం అన్యదీయాపేక్ష చేత అసాధారణమైనదిగా కనబడుతున్నది. కాళిదాసాదులకు భారతవర్షంవలె ఇతడికి ఆంధ్రదేశం అఖండరూపంతో గోచరించినట్లు విదితమవుతున్నది.

ప్రతాపరుద్రీయంలో విద్యానాథుణ్ణివలె త్రైలింగ శూరతేజస్సు ఇతణ్ణి పరవశుణ్ణి చేసినట్లు కనబడుతున్నది. "చిత్తముప్పొంగి" అని వీరచరిత్రంలో ఇతడు చెప్పినమాటలు ఈవిషయాన్ని సూచిస్తున్నవని అనుకొంటాను. పద్యానికి నన్నయాదుల యతిభ్రంశాన్ని ఇతడు అనేక స్థలాల్లో తొలిగించడం స్పష్టం.

తెలుగుభూమి అని ఆంధ్రభూమి అని తసకృతుల్లో పలుచోట్ల ప్రస్తావిస్తూ వచ్చాడు. ఆంధ్రదేశానికి సంబంధించిన భీమఖండాన్ని

సంస్కృతంలో కూడా శ్రీనాథుడే రచించాడేమోనని నేనప్పుడప్పుడు అనుకొంటూ వుంటాను. నైషధం కాశీఖండం మొదలైన గ్రంథాల యందలి గద్యాల్లో, కొన్ని చోట్ల పద్యాల్లో ఒకవిధమైన వాక్యశిల్పం కనబడుతుంది. వేమన స్ఫుటబలోక్తి, పింగళి సూరన మృదుభావనిరతి, శ్రీనాథుడి వాక్యశిల్పం, ప్రాచీనాంధ్రవాఙ్మయంలో గణనీయమైనవని భావిస్తాను. ఆయువుపట్లయిన ఘట్టాల్లో తేలవేసినా అపూర్వభావా లేమీ తెల్పకున్నా సూరన లలితరీతిప్రియత్వం విశుద్ధమనోజ్ఞతా ప్రీతి శ్లాఘ్యం. నన్నయాదుల యతిభ్రంశదోషాన్ని శ్రీనాథుడు చాలావరకు తొలగించాడు. కనుక ఇతడిపద్యాలకు శ్రావ్యత్వాదులుద్భృష్టమవుతున్నవి. ఆకాలాన తెలుగు ఉత్తమవిద్యాద్వారంగావుండి తెలుగుపద్యం కనువు లక్షణాలకు దూరమైవుంటే శ్రీనాథుడు పింగళిసూరన, వేమన వీరివల్ల ఇంకా యెంతవుత్కృష్టమైన కృతులు తెలుగుదేశానికి లభించివుండేవో నని ఉత్ప్రేక్షిస్తుంటాను.

వక్ష్యమాణవిధాన నన్నయాదుల వాటివలె అమార్గ గాములైన అనువాదాలనే కావించినా ఉదాత్తభావోన్మీలనాదులు లేకున్నా వున్నంతవరకు పొల్లుమాటల పెంటకుప్పలకింద అణిగేటట్లు చేయక వివక్షితార్థం ప్రసాదగుణంతో స్ఫుటంగా రుజువుగా తెల పడం శ్రీనాథుడి రచనల యందలి విశేషం. ఒకరిద్దరిలో తప్ప తక్కిన తెలుగు కృతికర్తల్లో యీలక్షణం మిక్కిలి అరుదు.

## వీరచరిత్ర విశేషం.

కాళిదాసీయాదుల్లోవలె ఉత్తమకవితాస్వరూపం వీరచరిత్రలో లేకున్నప్పటికీ అది శ్రీనాథుడి కృతుల్లోనే కాక తెలుగువాఙ్మయ మంతటిలో విశిష్టమైనదిగా కనబడుతున్నది. దీంట్లో ద్వితీయాక్షరపు ఆట లేకపోవడంవల్ల సగం తుక్కువదలడం మొదటివిశేషం. ఇది తెలుగు సంప్రదాయానికి సరిపడని సంస్కృత వృత్తాలైన శార్దూల మత్తేభాదుల్లోకాక దేశ్యపద్యంలో బసవపురాణాదులవలె వుండడం

రెండవ విశేషం. అనువాదం కాక మూలగ్రంథంగా వుండడం మూడవ విశేషం. మనకు సన్నిహితమైన స్థలాలు మహాశూరనిలయాలై నిద్రించే ఆంధ్రుల్లో వీరత్వాదులను ప్రబోధిస్తూ ఇందు కార్యరంగాలుగా వుండడం నాల్గవ విశేషం. వీరగీతాలనే వాఙ్మయశాఖ యందిది ప్రథమగణ్యమై వుండడం ఐదవవిశేషం.

## పల్నాటివీరచరిత్ర—వీరగీతాలు.

కాటయవేమారెడ్డి కోమటివేమారెడ్డివంటి విజ్ఞులు ప్రభువులుగా వున్న రోజుల్లోకూడా తెలుగులో శ్రీనాథుడివంటి విద్యావంతులు న్యాయాది శాస్త్రగ్రంథాలను సాహిత్యవిచారణాగ్రంథాలను వ్యక్తిప్రధానమైన స్వతంత్రకావ్యాలను తలపెట్టక సాధారణపు తుక్కు-అనువాదాలు చేయడం, ఆకాలాన విద్వాంసులుగాని పండితులైన ప్రభువులుగాని ఉదాత్తగ్రంథరచన తెలుగులో ప్రోత్సాహపరచి వుండలేదని విదితం చేస్తున్నదని తెలిపి యింకో అంశానికి వస్తాను. పల్నాటివీరచరిత్ర వీరగీతాల్లో ముఖ్యమైనదిగా కనబడుతున్నది. వెన్నెలరాత్రుల్లో జనసమూహాలకు వీటిని కథకులు వినిపిస్తుంటారు. సాధారణంగా పిచ్చికుంటజాతివారు ఈ వీరకథలను కీర్తిస్తుంటారు. పంబజోడూ, తిత్తీ సహాయపడుతుండగా కత్తిపట్టుకొని, భావానుగుణంగా ఆడుతూ ఈ వీరవృత్తాలను కథకుడు చెప్పుతుంటాడు. భారతీయరూపకానికి బీజాలనదగి భరతుడిచేత ప్రస్తావింపబడిన వృత్తులను ఈకథకప్రవృత్తి పోలివుంటుంది.

సాధారణజనుల్లో ఉద్రేకం కలిగించి వారికి ఆవీరులమీద సద్యఃస్ఫురితమైన భక్తివిశేషాన్ని ఆవిష్కరించజేయడం కొంతపరిణతిగలవారికి వీరత్వాదులందు తత్పరత్వం కలిగించడం వీటి ముఖ్యలక్షణం.

ఇట్లాటి శాఖ అరవం మొదలైన దక్షిణభారత భాషల్లోగాని బంగాళీవంటి ఉత్తరభారతభాషల్లోగాని వున్నదేమో నేను చెప్ప

జాలను. వీటి కథనం ద్రవిడదేశంలో వర్ధితమైన హరికథారూపానికి సమీపంగా వుటుందని యెంచవచ్చును. దేశ్యమైన యక్షగానాలను కొంత అనుకరించి నారాయణతీర్థులు కృష్ణలీలాతరంగిణి నిర్మించినట్లు వీరగీతాలను కొంతవరకైనా అనుసరించి సంస్కృతంలో యెవరు రచించినట్లు కనబడదు.

ఋక్కుల్లో వీరగీతబీజాలు కనుగొనవచ్చును. సంస్కృతం వ్యవహారభాషగా వుండిన కాలంలో వీరగీతాలవంటివి యేవైనా యెప్పడి వుండినవేమో.

ఉదయన విక్రమార్కాదుల ఇతిహాసాలు సంస్కృతభాషలో ఉద్బోధకంగా కీర్తితమయినా అవి ప్రస్తుతవీరగీతమార్గాన లేవు. అయితే సాహిత్యవిషయాన ఈవీరగీతవాఙ్మయం ఉత్తమకవితాశాఖగా పరిగణించ వీలులేదు. కాళిదాసాదుల కావ్యాల్లో వ్యక్తమయ్యే ప్రకృతిశోభలు ఉదాత్తభావవ్యక్తి, పరిణతచిత్త వృత్త్యస్మిలనం మొదలైనవి వీంట్లో కనుగొనలేము. కనుకనే కవితావిషయాన ఉత్తమ శాఖకు చెందదని చెప్పినాను. అయితే యిది దేశీయచ్ఛందస్సులో ద్వితీయాక్షరక్రీడతుక్కు సగంపోయి రచితంకావడంవల్లను అక్కడక్కడ వ్యక్తమయ్యే కవితాచ్ఛాయలవల్లను ఇదిమనుసుచరిత్రాదులకంటె మేలైనదేనని చెప్పవచ్చును. ఇదివరకు తెలిపినట్లు అనువాదపుకోటిలో యిది చేరని మూలగ్రంథమని, చాలామట్టుకు వ్యంగ్యవినాశమే కాక క్షుద్రశృంగారాదులతో నిండిన హంసవింశత్యాదుల సాధారణమార్గంనుండి చీలి మహాభారతంవలె శాంత ప్రధానమై వీరాదులను అంగంగా కలిగినదని, బొబ్బిలికథ మొదలైన వాటివలె సఙ్లధోరణిలోకాక కావ్యమార్గంలో వుండడానికి యత్నిస్తున్నదని, తెలుక్కు మతభాషాగౌరవమేర్పడ్డది ఈ వీరచరిత్రయందేనని, ఇప్పటికీ ఔర్ధ్వదైహికక్రియల్లో బ్రాహ్మణేతరులనేకులు, వైష్ణవులు నాలాయిరాన్నివలె పితృప్రీతి నుద్దేశించి వీరచరిత్రగానం చేయిస్తారని చెప్పి యీ విచారణయింతటితో ముగిస్తున్నాను.

## వీరచరిత్ర—ఆంధ్రులు.

హైహయులైన అనుగురాజాదులు ఆంధ్రులు కాకపోయినప్పటికీ వీరచరిత్ర ఆంధ్రులకు కొంతవరకు గర్వహేతువేను.

### పూర్వపక్షం.

అనుగురాజాదులు హైహయులయినప్పటికీ ఆంధ్రులుగానే మనము భావించవలెను. ఈతీరుగా ఒక్కొక్కరిని ఆంధ్రులు కారంటే యిక మనకు మిగిలే ఆంధ్రులెవరు? మనము ఆంధ్రులని చెప్పేవారు కూడా ఐతరేయబ్రాహ్మణకథ ననుసరించి వుత్తరభారతంనుండి యీ దేశానికి వచ్చినవారే. కనుక వారినికూడా అన్యదేశస్థులనే అనవలసి వుంటుంది. కనుక యిట్లా ఒక్కొక్కరిని వైదేశికులని తోసివేస్తే దేశంలో భూమిదప్ప మరేమీ మిగలదు. అనుగురాజాదులు ఆంధ్రదేశానికి వచ్చి అక్కడవుండినారు గనుక వారిని ఆంధ్రులుగానే భావించవచ్చును.

### తటస్థాక్షేపం.

అట్లా అనాంధ్రులను ఆంధ్రులుగా భావించడం మిక్కిలి అనర్థహేతువు. ఇది ఆంధ్రులదాస్యబుద్ధిని ప్రకటిస్తున్నది. దేశం ఆంధ్రదేశమని దేశస్థులు ఆంధ్రులని చెప్పడం ఒకవ్యవస్థ. వారుమాత్రం కొత్తవారు కారా అంటే అసలు మనిషే భూమికి కొత్త అని అనవలసి వస్తుంది.అదంతా తత్త్వజిజ్ఞాస. లోకధర్మ నిర్వహణార్థం వ్యవహారంలో అప్రతర్క్యమైన హేతువులవల్ల యిది ఆంధ్రదేశం యిది అరవదేశం యిది వంగదేశం అని యిట్లా వ్యవస్థిత మవుతున్నది. ఆవ్యవస్థ ఆధారంగా యిది మనదేశం యిది కాదు అని దృష్టియేర్పడి దాని రక్షణయందు తత్పరత దృఢపడుతున్నది. ఈతీరుగా ఒక్కొక్కదేశం తద్దేశస్థులచే రక్షితమయి విశిష్టవిజ్ఞాన సంప్రదాయాలను కలిగివుండడం లోకశ్రేయోహేతువే గనుక యీ వ్యవస్థ ఉపాదేయమని అంటున్నాను. ఒక దేశస్థులు మరియొక దేశస్థులచేత పరాజితులయి ఉదాత్తగుణ విశేషాదులను కోల్పోవడం లోకానికి అనర్థమేను. ఆరామద్రావిడులు

మొదలైనవారు జేతృవర్గస్థులు కారు గనుక తద్విచారణ ఇక్కడ అప్రసక్తం.

ఆంధ్రులు స్మృతికందరాని సందిగ్ధేతిహాసపు పౌరాణికశాత వాహనుల పిమ్మట పరదేశస్థుల అధీనమయి దీనదశ పాలైనారు.

ఆంధ్రదేశస్థులు కొంతకాలం పల్లవులచేతికింద వుండినారు వారి తరువాత చాళుక్యులవశమయినారు. అప్పటికే ఆంధ్రులకు దాస్యబుద్ధి స్థిరపడినట్లు కనబడుతున్నది. ఒక ఆంధ్రగ్రంథకర్త

"ఆంధ్రదళదానవోపేంద్రుఁడగు నుపేంద్ర [ఆంధ్రసేనలనే రాక్షసులకు విష్ణువువంటివాడైన ఉపేంద్రుడు] (పిన్న వీరభద్రుని? — కోటపెద్దన. కా. చూ.)

అని అన్నాడు. తమకు తాము రాక్షసులుగాను, తమ శత్రువు విష్ణువుగాను కనబడినప్పుడు ఆంధ్రులెంత దీనదశకువచ్చినదీ స్పష్టం కాగలదు. చాళుక్యులమని, చోళులమని, వారు గౌరవం ప్రకటించుకొంటూవుంటే బ్రాహ్మణశ్రమణకన్యాయంగాని మరి యేన్యాయంగాని వర్తించని స్థితిలో ఆంధ్రచాళుక్యులని ఆంధ్రచోళులని, చేతులు నలుపుకొనడం మన దైన్యాన్ని తెలుపుతునే వున్నది.

ఆంధ్రుల శోచనీయదాస్యాన్ని తొలిగించడానికి ఓరుగంటి ఆంధ్రరాజులు కాకతీయులు యత్నించారు. చాళుక్యులను వెలనాటి చోడులను అణచి ఆంధ్రసామ్రాజ్యాన్ని తిరిగీ ప్రతిష్ఠించారు. విజ్ఞానాన్ని దేశంలో ప్రసరింపజేశారు.

వీరికాలంలోనే ఆంధ్రుల ఉత్కర్షను వ్యక్తీకరించిన విజ్ఞుడు విద్యానాథుడు, స్వర్ణాభిషేకప్రథగల మొదటి మల్లినాథుడు, ఆంధ్రదేశంలో వెలయ గలిగినారు.

మందడగ్రామభోక్త అయి దక్షిణరాఢానుండి వచ్చిన కాలాముఖుల తోడ్పాటుతో వెలగపూడి మఠాదుల్లో విద్యాశాలలు సాగించి ఆంధ్రదేశంలో విజ్ఞానాన్ని వ్యాపింపజేసిన విశ్వేశ్వర శైవాచార్యులవంటి విద్యాసంపన్నులు ఈకాకతీయుల కాలంలోనే వర్ధిల్ల గలిగినారు.

కాకతీయగణపతిదేవుడు గణపేశ్వరదేవాలయం కట్టించి అక్కడ అనేకులను విద్వాంసులను స్థాపించాడని కుమారస్వామి తెలుపుతున్నాడు. వీరినే

"राजन्नेते गणपेश्वरसूरयः" [प्र. य.]

అనేచోట గణపేశ్వరసూరులని విద్యానాథుడు పేర్కొన్నాడు.

ఆకాలపు ఆంధ్రుల ఔన్నత్యం అప్పటి ప్రతాపరుద్రీయపు పుటలయందు విదిత మవుతున్నది.

"खेलन्त्यन्ध्रचमूभटाः सवपुषो रौद्रप्रकारा इव"

(శరీరంధరించిన రౌద్రభేదాలవలె వున్న ఆంధ్రసైన్యభటులు క్రీడిస్తున్నారు.)

"अहो तुरङ्गतरङ्गास्त्रिलिङ्गाधिपतेः"

(అహో త్రిలింగాధిపతియొక్క గుర్రాలనే అలలు)

"शृण्वन्तो मुहुरन्ध्रसैन्यपतयः प्राप्ता दिशं दक्षिणाम्"

(మాటికి వింటూ ఆంధ్రసేనాపతులు దక్షిణదిక్కు చేరినారు.)

रेरे सेवण कस्तवायमनिदंपूर्वोऽद्य गर्वो महा
नुत्तीर्णा किल येन गौतमनदी प्राप्तोऽसि मृत्योर्मुखम् ।
एषा काकतिवीररुद्र इति किं नाश्रावि सप्ताक्षरी
प्रक्षुभ्यत्प्रतिपक्षपार्थिवमहाभूतग्रहोच्चाटनी ? ॥

[ఓరీ ఓరీ సేవణుడా ఇదివరకులేని నీయీ మహాగర్వం యేమిటి? దానితో (ఆగర్వంతో) గౌతమనది దాటినావన్నమాటేగాని మృత్యుముఖం చేరినావు. కలతపొందుతున్న శత్రురాజులనే మహాభూతగ్రహాలకు ఉచ్చాటని అయిన "కాకతివీరరుద్ర" అనే ఈ సప్తాక్షరీమంత్రం వినలేదా యేమి ?]

पादच्छायान्ध्रनाथस्य विन्ध्याद्रेर्वा निषेव्यताम्

[(ఓరాజులారా) ఆంధ్రనాథుడి పాదచ్ఛాయనైనా వింధ్యాద్రి పాదచ్ఛాయనైనా సేవించండి. (ప్రతాపరుద్రుణ్ణి ఆశ్రయించండి లేదా వింధ్యాద్రిసమీపమందలి గుట్టలసీడల్లో దాక్కోనండి.)]

**रेरे घूर्जर! जर्जरोऽसि समरे! लम्पाक! किं कम्पसे?**
**वङ्ग! त्वङ्गसि किं मुधा? बलरजः काणोऽसि किं कोङ्कण? ।**
**हूण! प्राणपरायणो भव महाराष्ट्रापराष्ट्रोऽस्यमी**
**योद्धारो वयमित्यरीनभिभवन्त्यन्ध्रक्ष्माभृद्भटाः ॥**

[ఓరీ ఓరీ గుజరాతిరాజా! యుద్ధంలో శిథిలగాత్రుడ వైనావు. ఓ లంపాకుడా వణుకుతున్నా వేమి? ఓ బంగాళీ యెందుకు వ్యర్థంగా యెగురుతున్నావు? ఓ కొంకణుడా సైన్యపుదుమ్ముచేత గుడ్డివాడ వైనావా? హూణుడా ప్రాణాలు కాపాడుకో. ఓ మహారాష్ట్రుడా అపరాష్ట్రుడ వయినావు. (నీరాష్ట్రం పోయింది.) ఈమేము యోద్ధలము అని ఆంధ్రరాజభటులు శత్రువులను పరాభవిస్తున్నారు.]

**"नीराजयन्त्यन्ध्रपुरीरमण्यः प्रदीपजालैर्वरवीररुद्रम्"**
ఆంధ్రపురీరమణులు వీరరుద్రభూపతికి నీరాజన మిస్తున్నారు.)
**"स्वामिंस्त्रिलिङ्गदेशपरमेश्वर!"** **[प्र. य.]**

(స్వామీ! త్రిలింగదేశపరమేశ్వరుడా)

అని యిట్లా ఆగ్రంథంలోని పద్యాలు ఆంధ్రులమైన మనకు ఉచితగర్వహేతువుగా వుంటున్నవి. కాని మహమ్మదీయ కఠినహస్తాలు ఓరుగంటి కోటపై బడినవి. ఆంధ్రసామ్రాజ్య మంతరించింది. కాకతీయుల అనుచరులైన రెడ్డి వీరులు తిరిగీ చిన్నచిన్న రాజ్యాలను అక్కడక్కడా స్థాపించి మహమ్మదీయసంక్షోభాన్ని నివారించడానికీ ఆంధ్రసామ్రాజ్యాన్ని వుద్ధరించడానికీ యత్నించారు.

**"उद्धृत्य भूमिं यवनाब्धिमग्नाम्"**

అని ఒక రెడ్డిరాజు కీర్తితు డయినాడు. ప్రఖ్యాతమైన 'కాటయవేమ'

మాళవికాగ్నిమిత్ర వ్యాఖ్యాదులు యీ కాలంలోనే ఆంధ్ర దేశం లోకానికి సమర్పించింది. రెడ్డిరాజులతో సంబంధం ఉన్నా లేకున్నా వారి కాలంలోనే రఘువంశాదికావ్యాలకు, విద్యాధరుడి యేకావళికి, కుమారిలతంత్రవార్తికం ప్రశస్తపాదభాష్యం మొదలైన శాస్త్రగ్రంథాలకు, వాఖ్యాత అయి విశ్వారాధ్యమైన ఖ్యాతిగల మల్లినాథుడు, పితృసదృశుడైన కుమారస్వామి ఆంధ్రదేశంలో ఉద్భవిల్లినారు. కాని చిరకాలం ఆంధ్రులకు యీదశ వుండలేదు. తిరిగి దాస్యంపాలయినారు. దేశం చివరకు విజయనగర కర్ణాటరాజుల అధీనమయింది. విజయనగరపు రాజులు ఆంధ్రులు కారా అంటే కారని సమాధానం. ఆకాలపు ప్రమాణాలు వారు కర్ణాటులనే విదితం చేస్తున్నవి.

కర్ణాటక్షితినాథమౌక్తికసభాగారాంతరాకల్పిత. (కా. ఖ.)

అని విజయనగరరాజైన ప్రౌఢదేవరాయల విషయమై శ్రీనాథుడు.

శ్రీమతు కర్ణాటసింహాసనాధ్యక్షుండగు కృష్ణరాయ ధరాధినాథుండు.
(కృ. వి.)

అని కుమార ధూర్జటి.

సకలకర్ణాట రక్షా విచక్షణుండు. (రా. శే. చ.)

అని కృష్ణరాయమంత్రి తిమ్మరుసును గురించి మాదయ్యగారిమల్లన.

జీర్ణకర్ణాట పునఃసృష్టి సెవ్వాని. (వ. చ.)

అని విజయనగరరాజైన తిరుమలదేవరాయల నుద్దేశించి భట్టుమూర్తి. ఆంధ్ర, కర్ణాట, అనేవి యేకార్థవాచకాలు కావని, అవిరెండు వేరువేరని ప్రథమభూమికలో నిరూపితం. విజయనగరరాజులు కర్ణాటులు గనుకనే వారివద్ద చేరిన తిమ్మమంత్రి తిమ్మరుసు అయినాడు. అరుసు అంటే కన్నడభాషలో రాజు అని అర్థం. కర్ణాటులైన మైసూరు మహారాజవంశస్థుల్లో ఇప్పటికీ అరసుశబ్దం వ్యవహారంలో వున్నది. ఉ॥ చామరాజ అరస్. ఆంధ్రక్షమావల్లభ అనే యిట్లాటివాక్యాలు అతడి ఆంధ్రదేశాక్రాంతినే తెలుపుతున్నవి.

కొన్ని గ్రంథాలను ఆదరించిన మాత్రానగాని కొన్ని ఆంధ్ర గ్రంథాలు రచించిన మాత్రానగాని ఆంధ్రులు కాజాలరు. మల్కిభరాం, చితాపుఖానుడు ఆంధ్ర గ్రంథాలను ఆదరించారు. బ్రౌనువిరచితమైన నిఘంటువు కలదు. వీరాంధ్రులని గంతులు వేయడంఅవివేకం గదా.

“ स केरलप्राणमरुद्भुजङ्गान्.........
आन्ध्रान्धकारक्षयतिग्मभासः” [म. वि.]

[కేరళ ప్రాణవాయువులకు పాములు ... ... ...
ఆంధ్రాంధకారవినాశానికి సూర్యులు (అయిన బాణాలను యవనుడి మీాద వేశాడు)]

అనేచోట గంగాదేవి విజయనగరరాజూ, తనభర్తా అయిన కంపరాయల ఆంధ్రదేశవిజయాన్ని ప్రకటించింది. విజయనగరకర్ణాటుల కాలంలో ఆంధ్రులపైన దాస్యతమస్సు పూర్తిగా ఆవరించింది. ఆంధ్రాకుసవిష్ణువని ఒక ఆంధ్రుడు తమశత్రువును గొప్పగా పొగడిన దశవంటి నీచదశ తిరిగీ ఆంధ్రులకు సంప్రాప్తమయింది. తిమ్మన్నవంటి మహాసచివుడికిగాని లోకవిదితప్రబోధచంద్రోదయవ్యాఖ్యకు కర్త కాగలిగిన నాదెండ్ల గోపమంత్రివంటి విద్వాంసుడికి గాని ఆంధ్రదేశంలో ఉచితస్థానం లేక కర్ణాటానికి పోవలసి వుండడం ఆంధ్రదేశపు దుర్గతి గాక మరేమిటి? ఇట్లానే జగన్నాథపండితరాయలు వల్లభాచార్యులు మొదలైనవారి ప్రతిభ ఆంధ్రేతరదేశాల్లోనే వికసించవలసి వచ్చింది.

అవునుగాని నిర్ణయసాగర ముద్రాలయంలో ప్రకటితమైన ప్రబోధచంద్రోదయంలో, నాండిల్ల గోపమంత్రి అని వున్నది. అత డాంధ్రుడని వ్యాఖ్యలోగాని, పీఠికాకర్తృవాక్యాల్లోగాని, కానరాదు. కనుక అత డాంధ్రుడంటే మే మొప్పుకోము అని అంటారా చెప్పుతున్నాను.

నిర్ణయసాగరముద్రాలయపుప్రబోధచంద్రోదయంలో నాండిల్ల అని వున్నమాట సత్యం.

దీన్ని చూసే కాబోలును తక్కిన భారతీయులు నాండిల్ల అనే వాడు తున్నారు. లాహూరు మొదలైనచోట్ల సంస్కృత పుస్తకవిక్రేతలు నాండిల్ల అని వ్రాస్తున్నారు. పాశ్చాత్యులుకూడా నాండిల్ల అనే వ్యవహరిస్తున్నారు.

"only Nandillagopa actually quotes one rule for Pais'āci, but implies clearly that in his opinion this one rule was the only one which differentiated Pais'āci from Māgadhi."

(J. A. O. S. Vol. 44. Page 118)

(నాండిల్లగోపుడు ఒక్కసూత్రాన్ని మాత్రమే పైశాచికి ఉదాహరిస్తూ పైశాచిని మాగధినుండి వేరుపరచేది తన అభిప్రాయప్రకారం ఆ ఒక్కసూత్రమే నని విశదంగా వ్యక్తపరుస్తున్నాడు.)

అనేచోట Walter Eugene Clark అమెరికా ఓరియింటల్ సొసైటీపత్రికలో నాండిల్ల అని వ్రాశాడు. అయితే నిర్ణయసాగర పుస్తకంలోని నాండిల్ల అనేపాఠం తప్పు.

ఇతడు నాండిల్ల గోపమంత్రి కాడు. నాదెండ్ల గోపమంత్రి. ఇతడాంధ్రుడు. ప్రబోధచంద్రోదయ వ్యాఖ్యానపీఠికలో తెలిపిన గోపమంత్రివంశవర్ణనం, మాదయ్యగారి మల్లన రాజశేఖరచరిత్రలో తెలిపిన గోపమంత్రి వంశవర్ణనం, ఒక్కటిగా వున్నవి. ఈ గోపమంత్రి రాజశేఖరచరిత్రయందలి అప్పదండనాథుడి సోదరుడు. వీరు ఆరువేలనియోగిబ్రాహ్మణులు. కృష్ణరాయలవద్ద మంత్రిగా వుండిన తిమ్మనకు గోపమంత్రి మేనల్లుడు. ఈసంగతి ప్రబోధచంద్రోదయవ్యాఖ్యాపీఠికవల్లను రాజశేఖరచరిత్రవల్లనుకూడా విశదమవుతున్నది.

" तस्य श्रीकृष्णरायस्य प्राज्यराज्यधुरन्धरः ।
कुलक्रमागतो मन्त्री साल्वतिम्मचमूपतिः ॥"

(శ్రీకృష్ణరాయడికి ప్రాజ్యసామ్రాజ్య ధురంధరుడైన, కులక్రమాగత మంత్రి సాల్వతిమ్మసేనాని).

"तद्भागिनेयौ तरणिप्रतापौ नाण्डिल्लयप्यप्रभुगोपवयौं।"

(అతడి మేనల్లుండ్లు సూర్యప్రతాపుడైన నాండిల్ల యప్యప్రభువు గోపవర్యుడు).

[प्र. भो. च.]

అని గోపమంత్రి.

సాళువతిమ్మ ప్రధానజామాతను. (రా. శే. చ.)

ఆఋవేలవంశవార్ధి పూర్ణచంద్రమా. (రా. శే. చ.)

అని షష్ఠ్యంతాల్లోను ఆశ్వాసాంతంలోను నాదెండ్ల అప్పదండ నాథుణ్ణిగురించి మల్లన్న. పైపద్యాల్లో అప్పయ్య యప్య అయి నాదిండ్ల నాండిల్ల అయినట్లు విశదం. గోపమంత్రి ఆంధ్రుడని స్పష్టం. నాదెండ్ల యల్లమంత్రి అనే యుద్ధవీరుడు ఈ నాదెండ్ల వంశస్థుడొకరు వుండి నట్లు ముప్పైయిద్దరు మంత్రుల పద్యంవల్ల విదితం. నిర్ణయసాగర పుస్తకంలో పైవిధంగానే వినుకొండ, కొండవీడు అనే పేర్లుకూడా వికృతమై వున్నవి.

"यः कोण्डुवीडुनगरीं विनिकोण्डुमुख्यै।
दुर्गैः समं समधिगम्य महामहिम्ना॥"
"प्रादान्मुदा निखिलभूसुरपुङ्गवेभ्यः।
श्रीरामचन्द्रपुरमुख्यमहाग्रहारान्॥" [प्र. भो. च. व्या.]

(మహామహిమతో యెవ్వరు విని కొండు మొదలైన దుర్గాల తోపాటు కొండువీడు నగరం పొంది సంతోషంతో బ్రాహ్మణశ్రేష్ఠు లకు రామచంద్రపురం మొదలైన మహాగ్రహారాలిచ్చాడో)

ఈతీరుగా ప్రసిద్ధాంధ్రపురుషుల, పట్టణాల, పేర్లు యెవరయినదీ యేమైనదీ తెలియకుండా ఆంధ్రేతరులు తారుమారుచేయడం ఆంధ్రు లకు చింతాకరం కాకమానదు. దీన్ని శుద్ధపాఠాలతో ప్రకటించవల సిన భారం మనదై ఉన్నది. రాజశేఖరచరిత్రలో వున్న నాదిండ్ల అనే పాఠం లేఖకదోషంవల్ల యేర్పడివుండవచ్చును. లేదా ఆకాలాన నా

దిండ్ల అని వ్యవహారం వుండివుండవచ్చును. నాండిల్ల అనే పేరుమాత్రం అపభ్రంశం. ఇప్పటికీ నాదెండ్ల అని వ్యవహారం వుంటూవుంటే సమకాలపువాడైన మల్లన్న నాదెండ్లఅని చెప్పుతూవుంటే నాండిల్ల అని వ్యవహారం వుండిన దనుకోవడం అసంభావ్యంగదా. కొండవీటికి సమీపాన గుంటూరులో ఒక పేటగావున్న రామచంద్రపురాగ్రహారం గోపమంత్రి దత్తమే నని అనుకోనవచ్చును. గోపమంత్రి గృహనామానికి కారణమైన నాదెండ్ల కూడా కొండవీటిప్రాంతంలో చిలకలూరిపేటకు దగ్గరగా వున్నది.

ఇప్పటి యూరోపులో ప్రసిద్ధప్రభువులు,నైజాంలో మహారాజా సర్ కిషన్ప్రసాద్ బహద్దరు, మొదలైనవారి కుటుంబాలవలె దండనాయకులు మంత్రులు మహావిద్వాంసులు వెలసిన ఈగోపమంత్రివంశం ఆకాలంలో అత్యంతం ప్రఖ్యాతం అయివుంటుంది. నాదెండ్లలో ఇప్పటి మిరాశిదారులు అన్నాప్రగడవారు. కాని కౌశికగోత్రులైన నాదెండ్ల వంశ్యులు లేరు. బహుశః ఆవంశం నశించి వుండవచ్చును.

మంత్రి అనేమాట ఆపవేల నియోగి బ్రాహ్మణులకు ప్రాచీన కాలంనుండి బహుళంగా నామాంతమైనట్లు కనబడుతున్నది. వారు రాజకార్యధురంధరులై వుండడంవల్ల ఇది యేర్పడి వుండవచ్చును. లేదా మంత్రవిద్యానిష్ఠత్వంవల్ల యేర్పడి ఉండవచ్చును. మంత్రదీక్షను పొందినవారికి మంత్రి అనికూడా వ్యవహారం దృష్టం

**प्राणायामैः पवित्रीकृततनुरथ मन्त्री ।** [प्र. सा. ९]
**मेधावी भवति च वत्सरेण मन्त्री ।** [प्र. सा. १२]
**त्रिलक्षमेनं प्रजपेच्च मन्त्री ।** [प्र. सा. १२]

(ప్రాణాయామాలచేత శరీరాన్ని పవిత్రపరచి పిమ్మట మంత్రి.)
(సంవత్సరంలో మంత్రి మేధావి కాగలడు.)
(మూడులక్షలు దీనిని మంత్రి జపించవలెను.)

అని శ్రీశంకరాచార్యులు. ఇట్లా అనేకస్థలాల్లో దృష్టం. ఉపనిషత్తుల్లో పర్యంకవిద్య, పంచాగ్నివిద్య, అని ఈతీరున ఉపాసనావిధానానికి విద్య అని ప్రతీతిగలదు. మంత్రశాస్త్రంలో శ్రీచక్రోపాసనాత్మకమైన దానికి శ్రీవిద్య అని వ్యవహారం ప్రఖ్యాతం. కాదివిద్య, హాదివిద్య, అగస్త్యవిద్య, లోపాముద్రావిద్య, కామకళావిద్య అని ఇట్లా ఉపాసనాక్రమం వ్యవహృతమవుతున్నది. నిరుపాధికంగా ఇది విద్య అని కూడా ఉక్తం.

" षट्त्रिंशत्तत्त्वात्मा तत्त्वातीताच केवला विद्या ॥"
" आसीनः श्रीपीठे कृतयुगकाले गुरुः शिवो विद्याम् ॥" [का. वि.]

[విద్య (పఞ్చదశాక్షరి) షట్త్రింశత్తత్త్వాత్మా (శివాదిక్షిత్యన్త విగ్రహా) తత్త్వోత్తీర్ణా యేకాకినీ అయివున్నది].

[కృతయుగకాలంలో గురువు శివుడు శ్రీపీఠమందు ఆసీనుడై విద్యను (స్వశక్తి విమర్శరూపిణీ అయిన ఆకామేశ్వరికి వుపదేశించాడు).]

అని పుణ్యానందులు. కాకతీయులకాలంలో ఈవిద్య ఆంధ్రదేశంలో యెక్కువగా వర్ధిల్లినట్లు కనబడుతున్నది. కాకతీయులకాలంలోనివాడైన మొదటి మల్లినాథుడి పుత్రుడు కపర్దివిషయమై

" मल्लिनाथात्मजः श्रीमान् कपर्दी मन्त्रकोविदः ॥"
[चं. व्या. ప్రతాపరుద్రీయపీఠికలో త్రివేదిచే ఉదాహృతం]

అని వున్నచోట మంత్రశబ్దం మంత్రవిద్యాపరమని చెప్పవచ్చును. ప్రతాపరుద్రీయకర్త విద్యానాథుడు, వేదభాష్యప్రణేతా మహావిజ్ఞానసంపన్నులూ అయిన విద్యారణ్యులు, వీరి యీ నామాల్లోవున్న విద్యాశబ్దానికి మంత్రవిద్యాపరత్వంకూడా వాచ్యమని విదితం.విద్యానాథుడు మంత్రవిద్యాబలంతో ప్రతాపరుద్రుడికి శ్రేయశ్చింతకుడుగా, విద్యారణ్యులు మంత్రవిద్యాపటువులై విజయనగరపు రాజులకు మంత్రిగా

రక్షాపరాయణుడుగా వుండినట్లు విశ్రుతమవుతున్నది. నాదెండ్ల గోపమంత్రి సయితం తంత్రగ్రంథాలనుండి ఉదాహరించకపోయినా ఇడ, పింగళ, సుషుమ్న, మూలాధారం, సహస్రారం మొదలైన ముఖ్యవిషయాలను ద్వితీయనాందీపద్యవ్యాఖ్యలో ప్రస్తావించాడు. వ్యాఖ్యాంతంలోకూడా ఇతడి ఉపాసకత్వం వ్యక్తం.

ఆంధ్రదేశంలో మంత్రిశబ్దంవలెనే కాశ్మీరదేశంలో "కౌల" అనేది కొందరికి నామాంతరంగా వుంటున్నది. ఉదా—పండితమధుసూదన కౌలశాస్త్రి, తంత్రాలోక టిప్పణకర్త. కైలాసనాథకౌల, ఆనంద కౌల అని. శాక్తోపాసకుల్లో సమయిభిన్నులైనవారికి కౌలులని ప్రతీతి కలదు.

"उत्पादयन्ति चानन्दं मत्प्रिये कौलिकाश्च ते ॥"
अप्रबुद्धा पशोः शक्तिः प्रबुद्धा कौलिकस्य च ॥ [कु. त.]

ఆనందాన్ని కలిగిస్తారు. ఓ నాప్రియురాలా, వారు కౌలికులు. పశువుశక్తి అప్రబుద్ధం. కౌలుడిశక్తి ప్రబుద్ధం.

అని కులార్ణవ తంత్రకారుడు.

కాశ్మీరంలో కౌలశబ్దంవలెనే ఆంధ్రదేశంలో మంత్రి అనేది వాడబడి వుండవచ్చును. రూఢమైనపిమ్మట దానిపర్యాయపదాలైన అమాత్యాదిశబ్దాలు వాడుకలోకి వచ్చివుండవచ్చును. లేదా మొదట చెప్పినట్లు రాజనీతిధురంధరులై మంత్రులుగా వుండడంవల్ల యేర్పడి వుండవచ్చును. అనుషంగికంగా వచ్చిన ఈవిచారణ ఇంతటితో ముగించి ప్రకృతానికి వస్తాను.

సాళ్వతిమ్మమంత్రి, నాదెండ్ల గోపమంత్రివంటి విద్వాంసులకు ఆంధ్రదేశంలో ఉచితస్థానంలేక కర్ణాటానికి పోవలసివచ్చిన దుర్దశ యేర్పడినదన్నాను.

ఆంధ్రదేశపుదుర్గాలను యీ కర్ణాటులుజయిస్తే,

(1) "కొండవీడగలించె"
(2) "వినుకొండ మాటమాత్రనె హరించె."
(3) "బెల్లముకొండ అచ్చెల్లఁ జెరిచె." (ముక్కుతిమ్మన. పా. జా.)

అని ఒక ఆంధ్రగ్రంథకర్త ఆసంగతి సంతోషిస్తూ స్తుతించాడు. కర్ణాట రాజు తెలుగుదేశపు గ్రామాలను అల్లకల్లోలం చేస్తే

"వడ్డాదిమసి యొనర్చె" "కనకగిరి స్ఫూర్తిఁగరఁచె" "గౌతమిఁ గ్రాఁచె, ఔరాతోక చిచ్చున." [పెద్దన. మ. ను.]

అని మరియొక ఆంధ్రుడు ఆపనిని కీర్తించాడు. ఇంతకంటె ఆంధ్రులకు నికృష్టస్థితి మరియేమి సంభవించగలదు ?

ఇప్పటికీ యీ నికృష్టదాస్యందశలోనే వున్నాము. అంతటా ఉద్వేగంతో ఆంధ్రుల ఉత్కృష్టతను ప్రకటించే ప్రతాపరుద్రీయాన్ని విస్మరించాము. ప్రతాపరుద్రీయపు ప్రతిని కాశ్మీరంనుండి సయితం ప్రతిని తెప్పించి పాఠనిర్ణయంచేసి టీకచేర్చి బొంబాయి ప్రభుత్వంవారితోడ్పాటుతో ప్రకటించడానికి అనాంధ్రుడు త్రివేది వహించిన శ్రద్ధలో సూక్ష్మాంశమైనా ఆగ్రంథంయొక్క అవగమనానికి గాని, ప్రచారానికిగాని ఆంధ్రులమైన మనము కనబరచడం లేదు.

ఆంధ్రుల వీరత్వాలను ప్రకటించి ఆంధ్రసామ్రాజ్యాన్ని ప్రతిష్ఠితంజేసిన కాకతీయాంధ్రరాజులను మరచినాము. విజ్ఞానోజ్జీవనం చేసి ఆంధ్రులకు ఆరాధ్యులై యశోభ్యుదయాలు సమకూర్చిన గణపతిదేవుణ్ణిగాని రుద్రదేవినిగాని ప్రతాపరుద్రుణ్ణిగాని మనవారని విశిష్టబుద్ధితో జ్ఞప్తికి తెచ్చుకోనము. పైగా ఆంధ్రుల అపజయాన్ని ప్రకటించే కథను వ్రాసుకొని దానికి ప్రతాపరుద్రీయమని పేరుపెట్టి దాన్ని ఆడుతుంటే చూసి మురుస్తూ చప్పట్లు కొట్టుకుంటున్నాము. రెడ్డిరాజులను వేమనకాటయవేమ మొదలైన విద్వాంసులను అస్మదీయులని విలక్షణదృష్టితో తలంపునకు తేము కాని ఆంధ్రులనురాక్షసులుగా హతంజేసిన చాళుక్యవంశ్యులలోని రాజులకు పట్టాభిషేక

సభలు చేస్తున్నాము. ఆయన పేర సంచికలు ప్రకటిస్తున్నాము. కాకతీయ సంచిక అని యేమో కొంత ఇతరులతో కలిపి ఆచరించినమాత్రాన వారి యందు స్వత్వబుద్ధి ప్రకటించినట్లు కాదుగదా. చోళుడైన నల్లసిద్ధదేవుడికి ఆంధ్రుడైన కాటమరాజుకు, కలహం సంభవిస్తే చోళుడిపక్షాన ఆంధ్రుడు రణతిక్కన చేరి ఆంధ్రుడైన కాటమరాజుమీద పోట్లాడితే అదంతా ఒక విశేషమని మనము బుజాలు తట్టుకొంటున్నాము. ఆంధ్ర గ్రామాలను తగలబెట్టి ఆంధ్రుల దుర్గాలను పాడుబెట్టిన కర్ణాటరాజుకు సంవత్సరోత్సవాలు చేస్తున్నాము.

ఆంధ్రోత్కలాంశాలతో కళింగమనేది వేరుగా వ్యవహరించబడినా భాషాదులచేత ఆంధ్రుల్లోనివాడనే అనదగి

" असौ महेन्द्राद्रिसमानसारः पतिर्महेन्द्रस्य महोदधेश्च ।
यस्य क्षरत्सैन्यगजच्छलेन यात्रासु यातीव पुरो महेन्द्रः ॥"

(ఇతడు మహేంద్రాద్రితో సమానమైన బలంగలవాడు మహేంద్రానికి, మహోదధికి అధిపతి. మదధారలు కారే సైన్యగజాలనే వ్యాజంతో ఇతడియాత్రలయందు మహేంద్రపర్వతం ముందు నడుస్తున్నట్లుంటుంది.)

అని గజసంపదకు కాళిదాసుచేత సయితం ప్రశంసితుడైన కళింగభూపతిపరంపరలో చేరిన గజపతిని అనాంధ్రరాజు అవమానపరచి అతడిపుత్రికను పెండ్లాడితే ఆవృత్తాంతాన్ని నవలలుగా పద్యపుస్తకాలుగా వ్రాసుకొని మురుస్తున్నాము.

విజయనగరరాజుల పూర్వులు కాకతీయులవద్ద వుండినారు గనుక ఆంధ్రులు కావచ్చునేమో నంటారా? ఒకవేళ అయినాగూడా పేర్లు, బిరుదులు మొదలైన సంప్రదాయాల్లో కర్ణాటీకృతులై ఆంధ్రత్వం కోల్పోయి వాఙ్మయంలో కర్ణాటులుగా విదితులవుతున్నారు.

గనుక ప్రకృతవిచారణలో కర్ణాటులనే గృహీతులు.అందువల్ల పైవాదం ఇక్కడ ప్రసక్తం కాదు.

అవును గాని వైదికవాఙ్మయాన్ని అనేకవిధాల వర్ధిల్లజేసి మహమ్మదీయులపైన ప్రతిక్రియనడపిన విజయనగరరాజులు మనవాండ్లు కారనుకొనడం అసంభావ్యం గదా అంటే చెప్పుతున్నాను.

" परैः परिभवे प्राप्ते वयं पञ्चोत्तरं शतम् ॥ [म. व. २९४]

(పరులపరిభవంప్రాప్తిస్తే మేము 105 మందిమి) అని ధర్మరాజన్నట్లు భారతీయేతరులసందర్భంలో కృష్ణరాయాదులు మనవార లనుకొనడం అత్యంతం వాంఛనీయమేను. కాని ఆంధ్రులు ఆంధ్రేతరులు అనే విచారణలోమాత్రం వారు అనాంధ్రులు అనక తప్పదంటున్నాను. ఇట్లా అనాంధ్రులైన జేతల శత్రువులపేర్లు దేశంలో కొన్ని భాగాలకు పెట్టి రాయలసీమ చాళుక్యసీమ అని బుజాలు కొట్టుకుంటున్నాము. రాజరాజనరేంద్రగ్రంథాలయమని కృష్ణదేవరాయాంధ్రగ్రంథనిలయమని కృష్ణరాయగ్రంథమాల అని యిట్లా వీరిపేర్లు గ్రంథాలయాలకు గ్రంథమాలలకు తగిలిస్తున్నాము.

ఇంతకంటె మనదాస్యవృత్తి హెచ్చుజాలదు. ఈదాస్య చిత్తవృత్తితోనే బంగాళీగాని, మరాటీగాని, పంజాబీగాని, గుజరాతీగాని, లేదా ద్రావిడుడుగాని యేదైనా చెప్పితే దానికి తాళంవేయడమే గొప్పని అని అనుకొనవలసిన దశలో వున్నాము.

అధికులైనవారు యేదైనా ఉపదేశిస్తే వినగూడదని కాదుగాని మనగుణదోషాలేవో మనము తెలుసుకొని వాటివర్ధనానికి హానానికి యత్నించడం లేకుండా అనాంధ్రులు చెప్పితేనేగాని అవుగు కదలించలేనిస్థితిలో వుండడం అత్యంతం తుచ్ఛలక్షణ మంటున్నాను. చివరకు అనాంధ్రులతో మాట్లాడడమే ఒక గొప్పఅని అనుకొంటున్నాము.

ఆంధ్రదేశపు సరిహద్దులు దాటితే నోరు విప్పలేము. ఒకవేళ విప్పితే అక్కడివారిని అనుసరించి వారికి అనుగుణంగా నాలుక ఆడించడం

తప్ప ఆంధ్రేతరులకు ప్రసాదించే స్వీయమైన ఉత్తమవిజ్ఞాన సంప్రదాయాలబలం లేక అధోగతిలో వున్నాము. సర్ రాధాకృష్ణులవంటివారు యెవరైనా వున్నా ఆంధ్రుల ఈ దుర్దశాఫలంగా కాబోలు వారి ఆంధ్రత్వాన్ని తెలియకుండా చేసేమార్గాలను నామాంతాలు మొదలైనవాటిలో అవలంబించవలసినవారవుతున్నారు. ఆంధ్రుల విశిష్టసంప్రదాయాలేవైనా వుత్తమమైనవి వుంటే వాటిని కనుగొనడం లోకానికి ప్రసాదించడం ముఖ్యం. ఆంధ్రేతరులప్రసక్తి లేక మనలో మనమైతే అధికార్యనధికారిభేదం లేకుండా నోటికి వచ్చినదంతా మాట్లాడి చేతికివచ్చినదంతా వ్రాసి పత్రికలు పుస్తకాలు నింపి అజ్ఞానవంచన చేస్తూ ఆత్మవంచనపాలవుతున్నాము. చివరకు గుణదోషవివేకానికి కావలసిన విజ్ఞానంగాని యత్నంగాని స్వపరపరిమాణవిచారణగాని మాని నేనంటే నేనని బోలుగౌరవాలకు పరమానందాయశిష్యులవలె కీచులాడుతున్నాము. ఇట్లాటిదాస్యచిత్తవృత్తిలో వున్న ఆంధ్రులకు మనకు, అనాంధ్రులు ఆంధ్రులపై రాజ్యం చేసినవారు, అయిన హైహయుల వృత్తం, పల్నాటివీరచరిత్ర మన బానిసతనాన్నే గట్టిపరుస్తుంది కనుక ఇది అభిమానికంగా మనకు వుపాదేయం కాదు. లోకేతిహాసంలో ఒక భాగంగా గ్రహిస్తే గ్రహించవచ్చునే గాని మనకు అభిమానికవిషయం కాజాలదు అంటే

సమాధానం

చెప్పుతున్నాను. తటస్థాక్షేపవాదాన్ని కాదనజాలను గాని ముద్రారాక్షసంలోని చంద్రగుప్తుడివలె హైహయరాజులు సచివాయత్తసిద్ధులై ప్రతిమాతుల్యులుగా వున్నారు గనుకను బ్రహ్మనాయుడు, బాలచంద్రుడు, నాయకురాలు, కన్నమనీడు మొదలయిన ప్రధానకార్యపురుషులందరు ఆంధ్రులే గనుకను కొంతవరకైనా మనకు అభిమానవిషయంగా వుండగలదని మాత్రం చెప్పుతాను.

## వీరచరిత్రయందలి కొన్ని అంశాల సంక్షిప్తవిచారణ.

ఐ తా ం బ.

---

ఐత, బాలచంద్రుడి ప్రాణాలవిషయమై చూపిన ఆతురత భారతీయ క్షాత్రధర్మానికి విరుద్ధంగావున్నది.

**"यदर्थं क्षत्रिया सूते तस्य कालोऽयमागतः" [म. उ. ९०-७५]**

**"काले हि समनुप्राप्ते त्यक्तव्यमपि जीवनम्" [७७]**

(దేనికొరకు క్షత్రియస్త్రీ సంతతిని కంటున్నదో దానికి సమయ మిప్పుడు వచ్చింది.

సమయం సంప్రాప్త మయినప్పుడు జీవనంకూడా వదలవలసి వుంటుంది కదా)

అని శ్రీకృష్ణుడిద్వారా భీమార్జునులకు

**"विक्रमेणार्जितान्भोगान्वृणीतं जीविताद्वि" [७८]**

(జీవితం కంటె కూడా యెక్కువగా విక్రమార్జితాలైన భోగాలను వరించండి) అని నకులసహదేవులకు చెప్పిపంపగలిగిన భారతీయ వీరమాత కుంతికి యీమె ప్రతియోగినిగా కనబడుతుంది. బహుశః కృతికర్త యిక్కడ స్త్రీఅధీరతను ప్రదర్శించదలచి వుండవచ్చును. వ్యాసుడు కూడా ఒకసందర్భంలో

**"न मां माधव वैधव्य नार्थनाशो न वैरिता ।**
**तथा शोकाय दहति यथा पुत्रैर्विना भवः ॥" [म. उ. ९०-६९]**

(పుత్రులు లేని బ్రతుకువలె మాధవుడా వైధవ్యంగాని అర్థనాశంగాని విరోధంగాని నన్ను దుఃఖపడేటట్లు దహించదు)

అని కుంతిచేత చెప్పిస్తాడు.

## వేశ్య.

యుద్ధానికి వెంటపిలుచుకొని పోయ్యే మిషతో బాలచంద్రుడు వేశ్యను సందర్శించి కామవశుడు కావడం యీకాలపు మనకు కొంత రోతగా కనబడుతుంది. అయితే ఆకాలపువారు అట్లా తలచినట్లు కన బడదు. ప్రాచీన భరతవర్షంలో ఒకప్పుడు వేశ్యలకు గౌరవప్రతిపత్తి వుండినట్లు గోచరిస్తున్నది. పురాణవాఙ్మయంలో వీరివృత్తం విస్తరించి కలదు. భరతవంశపు జనని దేవవేశ్యయొక్క కూతురు. ఇంకా పురా ణాల్లోవున్న వేశ్యాకథలను విస్తరభీతిచేత వివరించక వదలుతున్నాను. ఇప్పటివలె గద హేతువులుగాకూడా గాక

"जात्यन्थाय च दुर्मुखायच जराजीर्णाखिलाङ्गाय च ।
ग्रामीणाय च दुष्कुलाय च गलत्कुष्ठाभिभूताय च ।
यच्छन्तीषु मनोहरं निजवपुर्लक्ष्मीलवश्रद्धया ।
पण्यास्त्रीषु विवेककल्पलतिकाशस्त्रीषु रज्येत कः ॥"
"वेश्यासौ मदनज्वाला रूपेन्धनविवर्धिता ।
कामिभिर्यत्र हूयन्ते यौवनानि धनानि च ॥" [भ.]

(వివేకమనే కల్పలతకు శస్త్రంవంటివారై పుట్టుగుడ్డికి, దుర్ముఖుడికి, ముసలితనంచేత జీర్ణించిన అంగాలుగలవాడికి, పల్లెటూరి మోటువాడికి, కుష్ఠరోగికి, మనోహరమైన తన శరీరాన్ని కొద్దిడబ్బుకాశపడి సమర్పించే వేశ్యలయందు యెవడు అనురాగం పొందుతాడు?)

(వేశ్య యీమె రూపమనే కట్టెలచేత ప్రజ్వరిల్లిన మదనజ్వాల; దాంట్లో ధనాలను యౌవనాన్ని కామిపురుషులు హుతంచేస్తున్నారు.)

అని భర్తృహరి, ఇట్లానే మరికొందరు విజ్ఞులు వీరిని ఒకవైపున నిందిస్తూ వుండినప్పటికీ దేశంలో వీరు సుప్రతిష్ఠితలై వుండినట్లు గోచరి స్తున్నది. అదిగాక వీరు రూపసౌష్ఠవంకూడా కలిగివున్నట్లు విదితమవు

తున్నది. "రూపాజీవ" "రూపేన్ధనవివర్ధిత" అనే యిట్లాటిమాటలు ఆ సంగతినే వ్యక్తం చేస్తున్నవి.

శ్రుతి వాఙ్మయంలోకూడా వేశ్యావర్గపుస్త్రీల ప్రస్తావన కనబడుతున్నది.

"ब्रह्मचारीत्वरीरतम्" [नै. १७]

అని మహావ్రతమనే యజ్ఞంలో జరుగవలసిన బ్రహ్మచారీత్వరీరతాన్ని శ్రీహర్షుడు పూర్వపక్షవాదిచేత ఆక్షేపింపజేసిన సందర్భంవంటిచోట్ల ఇత్వరి పుంశ్చలీపర్యాయనామంగా గృహీతమైనా అది వేశ్యావర్గపుస్త్రీలకు అన్వయిస్తుందని

"इदावत्सरायातीत्वरीम्" [शु. य. ३०-१५]

అని ఇట్లాటి శ్రుతివాక్యాలవల్ల తెలుసుకోనవచ్చును.

"अधिपेशांसि वपते नृतूरिव" [ऋ. १-९२-४]

అనే ఋక్కులో నృతూ అనేశబ్దానికి నర్తకి అనేఅర్థాన్ని సాక్షికంగా విద్యారణ్యులవారు ప్రతిపాదిస్తున్నారు. దేవవేశ్య అయిన ఊర్వశికి పురూరవుడికి జరిగినసంవాదం ఋక్సంహితలో విశ్రుత మవుతున్నది.

"हये जाये मनसा तिष्ठ घोरो वचांसि मिश्रा कृणवा है नु"

[ऋ. १०-९५-१]

అని ఋక్కు.

"ఓఘోరా కారిణీ ప్రియురాలా! (ఊర్వశీ) నామీద అనురాగం గలిగిన మనస్సుతో సమీపాన వుండు. ఉక్తి ప్రత్యుక్తి రూపమైన సంవాదాన్ని ఇప్పుడు చేస్తాము."

అని విద్యారణ్యభాష్యాన్ని అనుసరించి పైవాక్యాలకు అర్థం.

ఈసందర్భంలో ఊర్వశీ పురూరవుల కథను పద్యరూపాన తెలిపి

విద్యారణ్యులు ఈక్రింది శతపథబ్రాహ్మణవాక్యాలను ఉదాహరించారు.

"अत्र वाजसनेयकं

ऊर्वशीहाप्सराः पुरूरवसमैल चकमते । तं ह विन्दमानोवाच" ।

[श. ब्रा. ११-५-१]

[ఊర్వశి అనే అప్సర ఇలాపుత్రుణ్ని పురూరవుణ్ణి కామించింది అతణ్ని చేపట్టి (యిట్లా) అన్నది....]

వేశ్యావర్గపుస్త్రీలు శ్రుతివాఙ్మయంలో ప్రస్తుతులయినవిధం తెలిపినాను.

వేశ్యాసంపర్కం విహితంగాని, నిషిద్ధంగాని కాకపోవడంవల్ల పాప హేతువు కాదని

"अवरवर्णास्वनिरवसितासु वेश्यासु पुनर्भूषु च न शिष्टो न प्रतिषिद्धः सुखार्थत्वात्" [वा. का. १-५-३]

[నిరవసితలు కాని తక్కువజాతిస్త్రీలయందు, వేశ్యలయందు పునర్భువు (మారుమనుముస్త్రీ)లయందు ప్రయుజ్యమానమైన కామం సుఖార్థమైనది గనుక విహితం కాదు. నిషిద్ధం కాదు.]

అనే పఙ్క్తుల్లో వాత్స్యాయనుడు తెలుపుతున్నాడు.

ప్రతాపరుద్రీయంలో కుమారస్వామి ఉదాహరించిన వచనంలో **चारुयोषिति** అని వున్నా వేశ్య యెదురైతే కూడా శుభమని నిమిత్తజ్ఞుల అభిప్రాయం. వర్షపుమానమైన ఆఢకంయొక్క సాంకేతికస్థితుల్లో ఒక దానికి గణికాహస్తాన్ని నిర్దేశించి

"आढको गणिकाहस्तं गतः सस्याभिवृद्धिकृत्"

అని ఆగణికాహస్తస్థితి శ్రేయఃఫలకమని చెప్పుతున్నారు.

కొన్నిచోట్ల రూపకంలో సంస్కృతం వుపయోగించవలసినపాత్రలను చెప్పుతూ

"मन्त्रिजावेश्ययोः क्वचित्" [द. रू.]

అని మహాదేవీమంత్రిపుత్రికలతో పాటు వేశ్యనుకూడా ధనంజయుడు చేర్చాడు. సాహిత్యదర్పణకర్తకూడా యీసంగతినే తెలిపినాడు. ఒకరిఅధీనంలో ఉన్న వేశ్యను మరియొకడు పొందినట్లైతే

"रूपाजीवामन्योपरुद्ध गच्छतः" [अ. ३-२० प्र]

అని దండంవిధించి కౌటిల్యుడు వేశ్యాసంబంధానికి రాజరక్షణకూడా కల్పించాడు.

వాత్స్యాయనుడిచేత ఉచితానురాగ విషయంగా గృహీత అయిన పునర్భువును ఉపేక్షించినట్టి సాహిత్యవేత్తలు వేశ్యను, ఉత్తమ కోటిలో చేర్చకపోయినా,

"अथ नायिका त्रिविधा स्वान्या साधारणस्त्रीति" [सा. ३]

అని కావ్యనాయికగా వుండడానికి అంగీకరించారు. ఆవేశ్యకుల కాంతవలె స్థిరానురాగవతి అయితే మృచ్ఛకటికలో వసంతసేనవలె ఉత్తమ కార్యంలోకూడా నాయికగా ఉండవచ్చునని వారి అభిప్రాయం. కాళిదాసు

"पादन्यासैः क्वणितरशनास्तत्रलीलावधूतै
रत्नच्छायाखचितवलिभिश्चामरैः क्लान्तहस्ताः ।
वैश्यास्त्वत्तो नखपदसुखान् प्राप्य वर्षाग्रबिन्दू
नामोक्ष्यन्ते त्वयि मधुकरश्रेणिदीर्घान् कटाक्षान् ॥

[ఆవుజ్జయినిలో నృత్తపు అడుగులచేత మ్రోగుతున్న వడ్డాణంతోను విలాసంగా కదలించబడి కంకణరత్నకాంతి ఖచితమైన దండాలుగల చామరాలచేత అలసినహస్తాలతోను వున్న వేశ్యలు నీవల్ల నఖక్షతసుఖహేతువులైనవానతొలిచినుకులనుపొంది తుమ్మెదపఙ్క్తివలె దీర్ఘమైన కడగంటిచూపులను నీయందు ప్రసరింపజేస్తారు.]

అని ఉజ్జయినివేశ్యల విలాసాలను ప్రతిపాదించి వారిని మేఘుడికి సుఖహేతుకోటిలో చేర్చాడు.

(కామినీదర్శనీయత్వం పుణ్యఫలమని అభిప్రాయమని మల్లినాథుడు.)

"श्रुत्वा त्वत्परिवारवारवनितागीतानि भृङ्गाङ्गना
लीयन्ते कुसुमान्तरेषु......" [रत्ना]

[నీపరివారవారవనితల గీతాలను విని ఆడతుమ్మెదలు (లజ్జితలైనట్లు) కుసుమాంతరాల్లో లీనమవుతున్నవి.]

అని వాసవదత్తయొక్క పరివారవేశ్యలగీతాలశ్లాఘను శ్రీహర్షుడు వత్సరాజుచేతనే చేయించాడు.

"कर्णाटीदशनाङ्कितः शितमहाराष्ट्रीकटाक्षाहतः
प्रौढान्ध्रीस्तनपीडितः प्रणयिनीभ्रूभन्डगवित्रासितः ।
लाटीबाहुविवेष्टितश्च मलयस्त्रीतर्जनीभर्जितः
सोऽयं सम्प्रति राजशेखरकविर्वाराणसीं वाञ्छति ॥"

(కర్ణాటి పంటిచేత నొక్కబడి, మహారాష్ట్రికడగంటిచూపుచేత కొట్టబడి, ప్రౌఢాంధ్రి స్తనాలచేత పీడించబడి, ప్రణయిని బొమముడిచేత భయపెట్టబడి, లాటిచేతులచేత ఆవరించబడి, మలయస్త్రీతర్జనిచేత వేచబడిన ఆ ఈ రాజశేఖరకవి యిప్పుడు కాశీని కోరుతున్నాడు.)

అనే అభియుక్తోక్తి యథార్థమైతే రాజశేఖరుడు బహుదేశస్త్రీలతో సుఖించానని ప్రకటించుకోనడం గౌరవాపాదకంగానే భావించివుండవచ్చును.

ఈ వేశ్యలలో కొందరు విద్యావతులుగా ధనవతులుగా ఉండేవారు. గణిక అనేసంజ్ఞ ఇట్లాటి వేశ్యలకే నని విదితం.

"कुम्भदासी परिचारिका कुलटा स्वैरिणी नटी शिल्पकारिका प्रकाशविनष्टा रूपाजीवा गणिकाचेति वेश्या विशेषाः । [वा. का. ६-६-५४]

[కుంభదాసి (అంట్లుతోమడం మొదలైనపనులవల్ల జీవించే దాసి) పరిచారిక, కులట (భర్తకానకుండా వ్యభిచరించేస్త్రీ), స్వైరిణి (భర్తను తిరస్కరించి వ్యభిచరించేది), నటి (రంగస్త్రీ), శిల్పకారిక (రజకతంతువాయాది భార్య), ప్రకాశవినష్ట (భర్త బ్రతికివున్నా గతించినా అతనిని వదలి బహిరంగంగా అన్యసంగత అయినది), రూపాజీవ (రూపంమీాద ఆధారపడి జీవించేవేశ్య), గణిక (రూపవతి కళాప్రవీణ అయినవేశ్య) అని (పైన ఉదాహృతలైనస్త్రీలు) వేశ్యావిశేషాలు.]

అని వాత్స్యాయనుడు

కుంభదాసి, రూపాజీవ, గణిక, కాక తక్కినఆర్గురు అవలంబించేది వేశ్యావృత్తంవంటిదే గనుక వారుకూడా వేశ్యలలోనే చేర్చబడినారు.

"रूपादिभिर्नायिकागुणैः कलादिभि
श्चान्विता उत्तमगणिकाः गुणानाञ्च
कलानां च पादार्थाभ्यां शून्या
मध्यमाधमाः ॥" [६-५-२५ ज. व्या]

(నాయికాగుణాలైన రూపాదులు, గుణాదులు, కలిగిన వేశ్యలు ఉత్తమగణికలు. ఈగుణాల్లో నాలుగవవంతు తక్కువైతే మధ్యమగణికలు. సగం తక్కువైతే అధమగణికలు.)

అని జయమంగళుడు.

కౌటిల్యమతాన్ని అనుసరించి వేతనాలిచ్చి వేశ్యలను రాజసేవయందు స్థాపిస్తుండినట్లు వారివ్యవహారాలను గణికాధ్యక్షులు పరిపాలిస్తుండినట్లును, అర్థశాస్త్రంవల్ల విదితమవుతున్నది. గణికలకు గీతాది విద్యలను నేర్పే ఆచార్యుడికి రాజమండలంనుండి వృత్తిని యేర్పరచవలెనని కౌటిల్యుడు చెప్పుతున్నాడు.

"गीतवाद्यपाठ्यनृत्तनाट्याक्षरचित्रवीणावेणुपरचित्तज्ञानगन्धमाल्यसं-यूहनसम्पादनसंवाहनवैशिककलाज्ञानानि गणिका दासी रङ्गोपजीविनीश्च ग्राहयतो राजमण्डलादाजीवंकुर्यात् ॥" [अ. २-२७]

[గణికలకు దాసీలకు నటాదిస్త్రీలకు గీతవాద్యాలు, నృత్తం, నాట్యం, లిపి, చిత్రం, (చిత్రాలుగీయడం,) వీణ, వేణువు, మృదంగం, పరచిత్తజ్ఞానం, గంధయుక్తి, మాల్యసంపాదనం, అంగమర్దనం, వైశికం (వేశ్యావృత్తం) ఇంకా కళలు నేర్పే ఆచార్యుడికి రాజమండలంనుండి వృత్తిని కల్పించవలెను.]

అని కౌటిల్యుడు.

**तस्य षष्ठं वैशिकमधिकरणं पाटलिपुत्रिकाणां गणिकानां नियोगाद्दत्तकः पृथक्चकार ॥** [वा. का. १-१-११]

అనేవాక్యాల్లో వీరసేన మొదలైన పాటలీపుత్ర గణికల నియోగంవల్ల దత్తకుడనే విద్వాంసుడు బాభ్రవ్యగ్రంథమందలి వైశికాధికరణాన్ని (వేశ్యల పురుషరంజన విధానాన్ని) పృథక్కరించాడని వాత్స్యాయనుడు తెలుపుతున్నాడు.

ఇతడు తనకామసూత్రంలో ఒక అధికరణం అధికరణం వేశ్యా విషయకథనానికి వినియోగించాడు. దేశాధీశ్వరులంతటివారికికూడా వేశ్యామైత్రి న్యూనతగా వుండినట్లు కనబడదు. మణిమేఖల అనే వేశ్యాపుత్రిని పొందడానికి రాజకుమారుడంతటివాడు యత్నించాడని తమిళవాఙ్మయజ్ఞులు చెప్పుతున్నారు.

**रतियोगे हि कीलया गणिकां चित्रसेनां चोलराजो जघान ॥**

**[वा. २-७-२०]**

(రతియోగమందు కీల అనే ప్రహణనవిశేషంచేత చిత్రసేన అనే గణికను చోళరాజు చంపినాడు.) అని చిత్రసేన అనే వేశ్యతోడి చోళ రాజమైత్రిని వాత్స్యాయనుడు విశదం చేస్తున్నాడు. ఈతీరుగా వేశ్యా మైత్రి ఆకాలంలో న్యూనతకు హేతువు కాలేదు.

అయినప్పటికీ బాలచంద్రయుద్ధంలోని వేశ్యాఘట్టమంతా అప్రస్తుతంగా కనబడుతుంది. సత్యభామ శ్రీకృష్ణుని అనుసరించినట్లు బాల

చంద్రుడితో ఈమె యుద్ధభూమికి పోయివుంటే ఈ ఘట్టం సంగతంగా వుండేది; కాని ఆమె అట్లాపోక వారిసంగతి శృంగారంతోటే సమాప్తం కావడంవల్ల కృతికర్త దీనిని వదలివేయడమే వుచితంగా వుండేది.

## వే శ్య మా త

వేశ్యాప్రసక్తి వచ్చినచోట వేశ్యమాతను ప్రదర్శించడం చాలామట్టుకు తెలుగుగ్రంథకర్తల ఆచారంగా కనబడుతున్నది. నిరంకుశోపాఖ్యానం మొదలయినవి ఉదాహరణం. వాత్స్యాయన కాలం నుండి యీ వేశ్యమాత వాఙ్మయంలో ప్రసక్తి వహించింది.

**मातरि च क्रूरशीलायां अर्थपरायां च आयत्ता स्यात्तदभावे मातृकायाम्॥**

**[वा. का. ६-२-२]**

(క్రూరశీల, అర్థాసక్త, అయిన తల్లిఅధీనంలో ఉండవలసినది. తల్లి లేకపోతే కృతకమాత అధీనంలో ఉండవలసినది.)

అని వాత్స్యాయనుడు.

**"सौभाग्यभङ्गे मातृकां कुर्यात्"** **[अ. २-२७]**

[(ముసలితనంచేత రూపయౌవనాలు చెడినప్పుడు (ఆమెను భోగ్యగణికకు) మాతృకగా చేయవలెను. అంటే తల్లిలేని భోగ్య వేశ్యకు మాతృస్థానీయనుగా ఆమెను చేయవలెను.]

అని కౌటిల్యుడు

వేశ్యకూతురును బలాత్కరించినందుకు దండం విధిస్తూ దానికి పదహారురెట్లు వేశ్యమాతకు భోగశుల్కంగా ఇప్పించవలెనని

**"गणिकादुहितरं प्रकुर्वतश्चतुष्पञ्चाशत्पणो दण्डः ।**
**शुल्कं मातुर्भोगः षोडशगुणः ॥"**

అనే వాక్యాల్లో కౌటిల్యుడు, చెప్పుతున్నాడు. సామాన్య నాయికావృత్తం నిర్దేసిస్తూ ఈమెనాయకుణ్ని నిర్ధనుణ్ని చేసి చివరకు పునస్సంధాన కాంక్షతో తల్లిచేత వెళ్లగొట్టించ వలెనని సాహిత్య వేత్తలు తెలుపుతున్నారు.

"**काममङ्गीकृतमपि परिक्षीणधनं नरम् ।**
**मात्रा निष्कासयेदेषा पुनः सन्धानकाङ्क्षया ॥**" [सा. ३]

(బాగా అంగీకృతు డయినప్పటికీ క్షీణధనుణ్ని వేశ్య పునః సంధానకాంక్షతో తల్లిచేత వెళ్లగొట్టించవలెను.)

అని విశ్వనాథుడు.

"**निस्वान्मात्रा विवासयेत्**" [दश. ३]

(ధనంలేనివాండ్లను తల్లిచేత పంపించివేయవలెను.)

అని ధనంజయుడు.

ఈవేశ్యమాత ప్రస్తావన తెలుగుకృతికర్తల స్వమార్గం కాక పూర్వసంప్రదాయానుసారిగా వున్నట్లు స్పష్టమవుతున్నది. ఈమెను వెగటుగా పరిస్తూవచ్చారు.

"విటసమూహావిలంఘ్యమానసానాసచోరఖిల్లి దాని తల్లి
వేశ్యమాత విషమువేము విషము.

పైశాచసమితిలోపలి వికారంబెల్లఁగపికోటిలోనుండు కాంక్ష............
.....................................................................ల్ల
దీసి.........నిర్మించె బ్రహ్మ......లంజ తల్లిగాఁగ"

(ని. 2)

అని కంసాలిరుద్రయ్య.

"సూనశరభుక్తనిర్ముక్త శుష్కపత్రభాజనములైన వృద్ధవేశ్యాజనములు.
.....................................................................
కాచుజాగిలములువోలెఁ గాచియుండ్రు

వేశ్యమాతలు తద్ద్వారవేదికలను,

.......................................................

వివిధమాయా ప్రభూత యవ్వేశ్యమాత"

అని సారంగు తమ్మయ. (వై. వి)

" తల్లిగలుగు సానితగులుటరోతరా." (వే. శ.)

అని వేమన.

పై మార్గాన్ని అనుసరించే వీరచరిత్రకర్త వేశ్యమాతను మిక్కిలి వికారంగా ప్రదర్శించాడు. అవి ముందుపుటల్లో ద్రష్టవ్యం.

## భార్యాసమాగమం.

---

యుద్ధానికి బయలుదేరబోయే సమయంలో వేణీసంహారంలో

**द्रौ—नाथ—असुरसमराभिमुखस्य हरेरिव मङ्गलं युष्माकं भवतु ।**
**यच्चाम्बा कुन्त्याशास्ते तद्युष्माकं भवतु ॥"** **[छाया]**

(కన్నీరు ఆపుకొంటూ) నాథా అసురయుద్ధాభిముఖుడైన విష్ణువుకువలె మీకు మంగళమగుగాక. అంబ కుంతి ఆశాసిస్తున్నది మీకు కలుగును గాక.)

అనేచోట భీమసేనుడివలె బాలచంద్రుడు భార్య ఆశీస్సులను స్వీకరిస్తాడు. ఇంతటితో వూరుకొంటే వుచితంగా వుండేది. కాని ఆమెను చూడగానే బాలచంద్రుడు కామపరవశు డవుతాడు. రణదీక్షితుడు ఇట్లా కామవశుడు కావడం భారతీయ వీరధర్మానికి విరుద్ధం. అనార్యుడై పరాజయం పొందబోతున్న వాలికి వాల్మీకి

**तं तु तारा परिष्वज्य वालिनं प्रियवादिनी ।**
**चकार रुदती मन्दं दक्षिणा सा प्रदक्षिणम् ॥** **[रा. कि]**

(దక్షిణ ప్రియవాదిని అయిన తార ఆవాలిని కౌగిలించుకొని విలపిస్తూ తిన్నగా ప్రదక్షిణం చేసింది.)

అని భార్యాపరిష్వంగం ప్రతి పాదిస్తాడు.

విజయనగరరాజ్యంనాటి పారిజాతాపహరణ కర్త తమ శత్రువులను మహమ్మదీయులను మనస్సులో పెట్టుకొని కాబోలు అభాగ్యుడైన కృష్ణశత్రువు యుద్ధానికి పోతూ తనభార్యను కౌగిలించుకొన్నాడని చెప్పినాడు. ఇట్లా యుద్ధానికిపోతూ భార్యలను స్పృశించడం అనార్యుల ఆచారమై వుండవచ్చును. రావణుడికైనా యీకార్యం వాల్మీకి కనబరచలేదు. యుద్ధమాసన్నమై వున్నప్పుడు దుర్యోధనుడు భార్యనుచూసి మదనచేష్టలను ఆరంభించినట్లు భట్టనారాయణుడు వేణీ సంహారంలో చెప్పితే అది అనుచితమని ఆకాండంలో ప్రథనమనే దోషమని

**अकाण्डे प्रथनं यथा—वेणीसंहारे द्वितीयेऽङ्केऽनेकवीरक्षये प्रवृत्ते भानुमत्या सह दुर्योधनस्य शृङ्गारवर्णनम् ॥ [का. प्र. ७]**

(అనవసరమందు వర్ణనానికి ఉదాహరణం—వేణీసంహారనాటకంలో ద్వితీయాంకంలో అనేకవీరక్షయం ప్రవృత్తమైనప్పుడు భానుమతితో దుర్యోధనుడి శృంగారంయొక్క వర్ణనం.)

అనేకచోట్ల మమ్మటుడు నిరసించాడు. భార్యను కలిసికొనడానికి అదేచివరసారి గనుకను తల్లికోరింది గనుకను బాలచంద్రుడట్లా చేశాడేమో నంటారా, చెప్పుతున్నాను. పరలోకానికికూడా భార్య తనను అనుసరించబోతున్నదని సంప్రదాయం ప్రబోధిస్తూవుంటే తన క్షాత్రధర్మంకోసం ప్రాణాలనుసైతం సమర్పించబోయ్యేవీరుడు సర్వత్యాగదీక్ష వహించవలసిన ఆసమయంలో యేకారణంచేతగాని యింద్రియ వశుడు కావడం దీక్షాభంజకంగదా. కోడి మొదలైన ప్రాణులతో ఆడే జూదానికి సమాహ్వయమని పేరు. ప్రాణంలేనిపాచికలు మొదలైనవాటితో ఆడేదానికి ద్యూతమని పేరు. ద్యూతసమాహ్వయాలకు ధర్మశాస్త్రంలోగల నిషేధం, రాజ్యవ్యవహారంలో కౌటిల్యమతాన్ని అనుసరించి

వాటినియతత్వం ధర్మరాజు ద్యూతంలోవలె బ్రహ్మనాయుడు సమాహ్వాంయలో ప్రవర్తించడంయొక్క ఉచితానుచితత్వం, కార్యంపూడిలో అదివరకుజరిగిన యుద్ధాలు, అర్ధరాత్రంలోకన్నమనీడి యుద్ధరంగదర్శనం, యుద్ధరంగశుద్ధి, అక్కడి యెరుకలసాని, పిశాచాదులు, నీళ్లపైన తేలుతూవచ్చి నవ్విన తలపుర్రె, జలధిసోముడు, సాక్షిగా నిల్వబెట్టిన యుద్ధస్తంభం, శివపురి, రమపురి, అప్పటి ఇప్పటి స్త్రీపురుష వస్త్రధారణ రీతులవివేకం, తెలుగుదేశంలో శైవవైష్ణవమతవ్యాప్తి, మహాకాళి ఆరాధన, తాంత్రికమతాభిరతి మొదలైన వాటినిగురించి చర్చించదలచాను గాని కొన్ని కారణాలచేత ఆవిచారణ ఇప్పుడు మానుతున్నాను.

## వీరమతం.

వీరత్వం మిక్కిలి ప్రాచీనకాలంనుండి ఆరాధ్యంగా సంభావితమవుతున్నది. ఋగ్వేదంలో పూజ్యుడైన ఇంద్రుడికి వీర అని సంబోధనం కలదు.

"सुप्रवाचनं तव वीर……" [२-१३-११]

అని ఋక్కు.

"वीर बलवन् हे इन्द्र" [ऋ. भा.]

అని శ్రీవిద్యారణ్యులు. శ్రుతుల్లో అగ్నికికూడా వీరుడని ప్రశంస కలదు. వీరహత్య ఒకగొప్పపాపంగా పరిగణిత మవుతూవుండేది.

"वीरहा वा एष देहिनां योऽग्निमुद्वासयते न वा एतस्य ब्राह्मणा ऋतायवः पुरान्नमक्षन्" [कृ. य. ५-१-२]

అని కృష్ణయజస్సు. వేదభాష్యంలో

"देवानां मध्ये वीरोऽग्निः तद्वधकारिणः यजमानस्यान्नं ऋतायवः सत्यमिच्छन्तो ब्राह्मणाः पुरा नैवाक्षन् नैव भुक्तवन्तः"

(దేవతలమధ్య అగ్నివీరుడు. అగ్నివివధించిన యజమానుడి అన్నాన్ని సత్యాభిలాషులైన బ్రాహ్మణులు పూర్వం తినలేదు.)

అని శ్రీవిద్యారణ్యులు వివరించారు. వీరశబ్దం శ్రుతుల్లో కొన్ని చోట్లపుత్రపరంగాకూడా వ్యాఖ్యాతం.

తైత్తిరీయ బ్రాహ్మణంలో

"वीरहा ब्रह्महणि" [तै. ब्रा. ३-८]

అనేచోట వీరశబ్దం క్షత్రియవాచి అని కొందరంటారని అది పుత్రవాచకమని

"वीरहा गर्भघाती क्षत्रियवाचीत्येके" [भ.]

అనేపఙ్క్తుల్లో భట్టభాస్కరులు తెలుపుతున్నారు. ఋగ్వేదభాష్యంలో కొన్నిచోట్ల వీరశబ్దానికి శ్రీవిద్యారణ్యులు పుత్రపరంగా వ్యాఖ్య చేశారు.

"अवीरायाश्च योषितः" [म. ४-२१३]

అని వీరభార్యఅయినా వీరమాత అయినా కానటువంటి స్త్రీచేతి అన్నం తినగూడదని మనువు నిషేధిస్తున్నాడు. ఇక్కడ వీరశబ్దం పుత్రవాచిగాకూడా వ్యాఖ్యాతం. దుర్బలులైన శిశువులు త్యక్తులై, దేశరక్షకులు కాగల దృఢకాయులైన శిశువులుమాత్రం రక్షితులుగా వుండిన పురాతనపుగ్రీసుదేశంలోవలె, ఇప్పుడు ఇటలీవంటి దేశాల్లో వలె, ఒకప్పుడు భారతవర్షపు ఆర్యుల్లో వర్ధిల్లిన పురుషులందరూ చాలా మట్టుకు వీరులుగానే వుండిన కాలాన్ని పై శ్రుతిస్మృతి పఙ్క్తులు సూచించగలవేమో నని అనుకొంటున్నాను. క్షాత్రప్రతిపత్తిలో పుత్రుడు వీరుడు కనుకనే

"वीरप्रसवा भूयाः" [उत्तर]

"अपरा वीरमजीजनत् सुतम्" [रघु]

అని వీరపుత్రుణ్ణే భావిస్తూ వచ్చారు. మహాభాష్యంలో అనేక స్థలాల్లో వీరశబ్దం ప్రస్తావించబడింది. శాస్త్రంలో మంగళార్థకశబ్ద ప్రయోగాన్ని ప్రశంసిస్తూ

"मङ्गलादीनि मङ्गलमध्यानि मङ्गलान्तानि च शास्त्राणि प्रथन्ते वीरपुरुषकाण्यायुष्मत्पुरुषकाणि च भवन्ति" [महा]

[(మంగళాదులు, మంగళమధ్యాలు, మంగళాంతాలు, అయిన శాస్త్రాలు ప్రసిద్ధి చెందుతున్నవి. ఆయుష్మత్పురుషకాలు, వీరపురుషకాలు అవుతున్నవి. (వాటిని చదివినవారు ఆయుష్మంతులు వీరులు అవుతున్నారు.)]

అని పతంజలివీరత్వాన్ని సంభావించాడు.

మంత్రశాస్త్రంలోకూడా

"निस्सङ्गो निर्भयो वीरो निर्द्वन्द्वो निष्कुतूहलः" [कु]

(వీతరాగుడు నిర్భయుడు నిర్ద్వంద్వుడు నిష్కుతూహలుడు ............అయి వీరుడు)

అని వీరశబ్దం సాధకపరంగా అర్పితమవుతున్నది. ఇట్లానే మరి కొన్నిచోట్ల కలదు. యోగశాస్త్రంలో కూడా ఈవీరశబ్దాన్ని స్వీకరించి వీరాసనమనే ఒకఆసనాన్ని ప్రతిపాదించారు. దీన్నే

"वीरासनैध्यानजुषामृषीणां" [र]

(వీరాసనాలతో కూర్చుండి ధ్యానించే ఋషులయొక్క)

అనేచోట కాళిదాసు ప్రస్తావించాడు. శృంగారసందర్భంలో కూడా

"मनसि नः स्मरं वीर यच्छसि" [श्री. भा. १०]

[ఓ వీరుడా (కృష్ణుడా) మామనస్సులో మన్మథుణ్ణి ప్రభవించచేస్తున్నావు]

అని గోపికలచేత శ్రీభాగవతకారుడు వీరశబ్దాన్ని ప్రయోగించ జేశాడు. రామాయణంలో

"वीर्यशुल्केति मे कन्या स्थापितेयमयोनिजा" [रा. बा]

అని జనకుడు తనపుత్రిక వీర్యశుల్క అని ప్రకటించాడు. ఈ వీర్యశుల్క అనేమాటలనే కాళిదాసు

"दृष्टसारमथ रुद्रकार्मुके, वीर्यशुल्कमभिनन्द्य मैथिलः" [र. ११]

(పిమ్మట జనకుడు రుద్రకార్ముకమందు కనబడ్డ సారంకల వీర్యశుల్కానికి సంతోషించి) అనేచోట స్వీకరించి గౌరవాన్ని తెలిపినాడు. వీరమాతృత్వం, వీరపత్నీత్వం, మిక్కిలి ఆరాధ్యమైనవిగా ప్రాచీనకాలంలో సంభావిత మవుతూవుండేవి.

"वीरसूर्वीरपत्नी त्वं" [म. उ. ९०-९२]

(ఓకుంతీ, నీవు వీరజననివి వీరభార్యవు) అని శ్రీకృష్ణుడు కుంతిని అభినందిస్తాడు.

"भर्त्रासि वीरपत्नीनां श्लाघ्यानां स्थापिता धुरि ।
वीरसूरिति शब्दोऽयं तनयात्त्वामुपस्थितः ॥" [मा. ५]

[శ్లాఘ్యులైన వీరపత్నుల అగ్రాన భర్తచేత నిల్పబడ్డావు. (ఇక) వీరజనని అనే ఈశబ్దం (బిరుదం) కుమారుడివల్ల నిన్ను చేరింది.] అని కాళిదాసు ఈధర్మాలపూజ్యతను విశదం చేస్తాడు. శివోద్భూతుడైన వీరభద్రుడి వీరత్వం ప్రసిద్ధమయ్యే వున్నది. తదారాధకులు ఇప్పటికీ వీరాంగాన్ని ఉద్బోధకంగా వెలయిస్తున్నారు. విష్ణువుయొక్క పది అవతారాల్లో నృసింహుడు, శ్రీరాముడు, పరశురాముడు, బలరాముడు యుద్ధవీరులే అయివున్నారు. వైదికమతరక్షణాదులు విశేషలక్షణాలు వారికివున్నా వారు యుద్ధవీరుల్లో చేరినసంగతి నిర్వివాదం. బుద్ధుడు దయావీరుడు.

भो लङ्केश्वर दीयतां जनकजा रामः स्वयं याचते ।
कोऽयं ते मतिविभ्रमः स्मर नयं नाद्यापि किंचिद्गतम् ॥
नैवं चेत् खरदूषणत्रिशिरसां कण्ठासृजा पङ्किलः ।
पत्त्री नैष सहिष्यते मम धनुर्ज्याबन्धबन्धूकृतः ॥

(ఓ రావణా! సీత నియ్యవలసినది. రాముడు స్వయంగా యాచిస్తున్నాడు. నీకీ మతివిభ్రమ మేమిటి? నీతినిస్మరించు. ఇంకా యేమీ మించిపోలేదు. అట్లాకాదా, ఖరదూషణత్రిశిరుల కంఠరక్తం చేత పంకిలమైన యీబాణంనా ధనుర్జ్యాబంధానికి సంధించబడి సహించదుసుమా) అనే వాక్యాలను సాహిత్యదర్పణకర్త యుద్ధవీరుడైన శ్రీరాముడికి వుదాహరణంగా చూపినాడు. శ్రీరాముడికి వీరరాఘవత్వప్రతీతివిదితం. భవభూతికృతిలో శ్రీరాముడు మహావీరుడుగా ప్రసిద్ధుడు. అవతారవీరుల్లో నృసింహ శ్రీరాముల కిప్పటికీ ఆలయాల్లో పూజలు జరుగుతున్నవి. ఇంతకూ చెప్పదలచిం దేమంటే వీరారాధనం భారతవర్షానికి నూతనంకాదని. అయితే "భవిష్యద్రాజేతిహాసం" అని పురాణాల్లో ప్రదర్శితులైన రాజులకాలానికి పిమ్మట పల్నాటి వీరులవలెదైవత్వ మారోపించి పూజితులవుతున్న యుద్ధవీరులు ఇంతవరకు భారతవర్షంలో మృగ్యులు. భారతవర్షమందలి యుతర దేశాల్లో యిట్లాటివీరారాధనం నాకు తెలిసినంతవరకు వున్నట్లు తోచదు. నేను కలకత్తాలో వుండేరోజుల్లో "Birbhum" (వీరభూమి) అనేపేరుగలఒకప్రదేశం వంగదేశంలో వున్నట్లు విన్నాను. కాని యిట్లాటి వీరమతప్రతిపత్తి అక్కడవున్నట్లు నేను వినలేదు. ఇటీవల పరాక్రమప్రధానమైన సిక్కు జాతిలోకూడా ఈరీతులు కనబడవు. మహమ్మదీయులు "మొహరం" సమయంలో ఆచరించే ఆరాధన కొంతవరకు దీన్ని పోలివున్నది. కార్లైలు వీరపూజను గురించి యూరపుఖండంలో యెక్కువప్రచారం చేశాడు. పల్నాటి వీరారాధనంవంటి మతప్రస్థాన మెక్కడా యేర్పడివుండలేదు. స్కాన్

డినేవియాయందలి నార్సుమతం జపాన్‌నందలి షింటోమతం యుద్ధ వీరారాధనతో సంబంధం కలవని తెలుస్తున్నది. ఈవీరమతం ఆంధ్ర దేశపు గొప్పవిశేషంగా కనపడుతున్నది.

బుద్ధభగవానుడిచేత ఆరబ్ధమై పిమ్మట రామానుజాదులు కొంత వరకు అనుసరించిన వర్ణాధికారసామ్యం యిందు ప్రతిపాదితం గనుక లోకతంత్రంలో సయితమిది ప్రస్ఫుటస్థాన మాక్రమిస్తున్నది. దీంట్లో జాతిభేదం లేదు. బ్రాహ్మణుడు మొదలు చండాలుడిపర్యంతం అందరికీ దీంట్లో ప్రవేశం కలదు. చండాలుడైన కన్నమనీడు బ్రహ్మనాయుడి పుత్రుడుగా భావింపబడ్డాడు. దక్షిణదేశమందు బ్రాహ్మణేతరులైన కొందరు ఆళ్వారులవలె ఇతడు పూజనీయుడుగా వున్నాడు.

బ్రహ్మనాయుడి సైన్యంలో అన్నిజాతులవీరులు వుండేవారు. అందులో పంచములకు గోసంగులని పేరు. బ్రాహ్మణుడు చాకలి మంగలి కుమ్మరి మొదలైన నానాజాతియోధులు బాలచంద్రుడికి సోదరతుల్యులైన పరమమిత్రులు. వీరభక్తులైన యిద్దరు మహమ్మదీయుల గోరీలు కూడా వీరాలయంలో వున్నవి.

प्रद्योतस्य प्रियदुहितरं वत्सराजोऽत्र जह्रे ।
हैमं तालद्रुमवनमभूदत्र तस्यैव राज्ञः ॥
अत्रोद्भ्रान्तः किल नलगिरिः स्तम्भमुत्पाट्य दर्पा ।
दित्यागन्तून् रमयति जनो यत्र बन्धूनभिज्ञः ॥ [मेघ]

[ప్రద్యోతుడి ప్రియపుత్రికను వత్సరాజిక్కడ హరించాడు, ఆరాజుకే (ప్రద్యోతుడికే) ఇక్కడ బంగారుతాటితోపు వుండినది, ఇక్కడ స్తంభంపెరికి నలగిరి (యేనుగు) దర్పంతో పైకెగిసింది గదా, అని ఆగంతులైన బంధువులను అభిజ్ఞజనుడు అక్కడ (ఉజ్జయినిలో) వినోదపరుస్తుంటాడు.]

అనే కాళిదాసోక్తులను పోలి

ఇచ్చోట భుజియించి రేకకార్యస్థులై
సామంతనృపతులు చాపకూడు
ఇచ్చోటఁ జింతించె నిచ్చనుపాయంబు
నళినాక్షి యార్వెల్లి నాయురాలు
నిజమనశ్శుద్ధికై నిప్పులయేటిలో
నోలాడె నిచ్చోట బీ(శీ)లసాని
యిచ్చోట బోరినారిలపణంబుగఁ గొల్ల
సవతితల్లుల బిడ్డ లవనిపతులు
ధీరులగువార లేవురు వీరపురుషు
లై మదోద్ధతినిచ్చోట నాజిఁబడిరి
అనుచుఁ జెప్పుదు రైతిహ్యామచటనచటఁ
జనుప పెద్దలు పల్లెదేశములయందు. (శ్రీ. రా.)

అని వీరచరిత్రవిషయాలను తిక్కిరిబిక్కిరిగా తెలిపే శ్రీడాభిరామపద్యంలోని చాపకూడు నానాజాతుల యేకపఙ్క్తి భోజనంవంటిదిగా తోస్తున్నది. ఈ వీరమతస్థులందరికీ పాంగ్యం అని పారిభాషిక వ్యపదేశం. అన్ని అవైదికమతాలవలెనే ఈవీరమతంకూడా వైదికమతం ముందు తలవంచింది. ఉత్సవదినాలు గడచిపోగానే పాంగ్యం వారు సాధారణమతమార్గాల్లోనే వర్తిస్తున్నారు. దీనికి ఆచార్యులు బ్రాహ్మణులైన పిడుగువారు. వీరోత్సవంలో ఆచార్యప్రవృత్తిని చూచినప్పుడు కృపుడు, అశ్వత్థామ, ద్రోణుడు, పరశురాముడు ఇట్లాటి మహావీరుల సంప్రదాయాలు చిహ్నమాత్రంగానైనా ఆంధ్రదేశమందు నిల్చివున్నవి గదా అని సంతృప్తి చిత్తోన్నతి కలుగకమానవు. మహమ్మదీయులు దేశంవెంట దేశం అన్ని దేశాలను గ్రసిస్తూ ఉత్తరభారతవర్షాన్ని సంక్షోభపరుస్తుండినసమయాన విజృంభించిన భారతీయప్రతాపాగ్నియొక్క ఒక్కకణమే ఆంధ్రదేశంలో పల్నాటియందు భ్రాతృయుద్ధరూపాన వెలిగింది. ఆవశ్యకసమయంలో దేశాన్ని రక్షించగల

వీరత్వం దైవత్వాంశగా పరిణమింపజేసి జాతిమతాభేద ప్రతిపత్తితో దేశ ప్రజలను యేకవర్గస్థులనుగా చేయయత్నించిన ఈవీరమతాచార్యులు మనకు అవశ్యం స్మరణీయు లవుతున్నారు.

ఇట్లా ఆచార్యులు సర్వవర్ణసామరస్యంతో యుద్ధక్రతుదీక్ష వహించడం దేశేతిహాసంలో గణించదగిన అంశం.

## భారతవర్షేతిహాసంలో వీరచరిత్రప్రాధాన్యం.

కలిశకం 43-వ శతాబ్దిలో చేదిదేశపు హైహాయులు ఉత్తర భారతంలో అదృశ్యులైనారని వారేతీరుగా అదృశ్యులైనారో తెలియడం లేదని ఆధునికుడైన పాశ్చాత్యేతిహాసికుడు విన్సెంట్ స్మిత్తు చెప్పుతున్నాడు. ఈతీరుగా ఐతిహాసికులకు అగోచరమైన హైహాయాందర్శనాన్ని, ఇంకా కల్యాణమేలిన పశ్చిమచాళుక్యవంశపుక్షయాన్ని ఈ పల్నాటివీరచరిత్ర వ్యక్తపరుస్తున్నది. క. 43-వ శతాబ్ది భారతవర్షేతిహాసంలో పూర్వోత్తరాలనుకలిపే ప్రముఖమైన ఒకగణుపుగా పల్నాటివీరచరిత్ర కనబడుతున్నది.

## హై హ యు లు.

ఈహైహాయరాజవంశాలు ఇప్పుడే రూపాన యెక్కడవున్నవో చెప్పజాలను. భారతవర్షపు హైహాయక్షత్రియుల మహాసభ యీ నడుమ అలహాబాదులో జరిగినదని విన్నాను. పూర్వం వీరికి నర్మదాతీరమందలి మాహిష్మతిరాజధానిగా ఉండినట్లు విదిత మవుతున్నది. వీరికి మిక్కిలి ప్రాచీనకాలంనుండి ఒకవిధమైనవక్రత వాఙ్మయంలో విశ్రుతం. మాహిష్మతీస్త్రీలు స్వైరిణులుగా ఉండినారని భారతం చెప్పుతున్నది.

"एवमग्निर्वरं प्रादात् स्त्रीणामप्रतिवारणम्
स्वैरिण्यस्तत्र नार्यो हि यथेष्टं प्रचरन्त्युत"

[म. स. २७ ३९]

(ఇట్లా అగ్ని దేవుడు స్త్రీలకు అప్రతివారణమైన వరమిచ్చాడు. అక్కడ స్త్రీలు స్వైరిణులై యథేష్టంగా సంచరిస్తారు).

శ్రీకృష్ణవిరోధి శిశుపాలుడు ఈ చేదిదేశపురాజే. జమదగ్నిని చంపి బహుక్షత్రియవినాశకారణమైన పరశురామకోపాన్ని ప్రజ్వలింప జేసినది ఈ హైహయవంశమేను. వీరులకాలంలో అనుగురాజాదులు తమపూర్వులు చేసినపాపాలు తొలగించుకొనడానికి దేశభ్రష్టు లయినారని వీరచరిత్రకర్త చెప్పినవిషయం హైహయుల అనుస్యూతమైన న్యూనతకు అనుగుణంగానే ఉన్నది. వీరభద్రరావువారు వివరించిన కోనసీమహైహయులు ఈపల్నాటివీరుల వర్గంలోనివారే అయి వుండ వచ్చును.

వీరులకాలంనాటికి చేదిదేశపురాజధాని త్రిపుర అయినట్లు తెలుస్తున్నది. త్రిపుర రేవానదీసమీపంలో ఉన్నట్లు రేవామాహాత్మ్యంలో ఉక్తం. తమరాజధాని త్రిపురను స్మరించడానికి కాబోలు ఈ హైహయులే పల్నాటిప్రాంతాల్లో త్రిపురాపురం, త్రిపురాంతకం అనేగ్రామాలను నిర్మించి ఉంటారని అనుకొంటున్నాను. త్రిపురాపూర్ణిమ వచ్చే కార్తికమాసంలోనే పల్నాటివీరుల ఉత్సవంకూడా జరుగుతున్నది.

పల్నాటివీరచరిత్రలో హైహయులు పాలమాచాపురినుండి వచ్చినారని చెప్పబడినది. ఈపాలమాచాపురికి చేదిదేశంలో అవికృత నామమేదో నేను చెప్పజాలను. మత్స్యపురి అని వూహిస్తే అది చేది దేశంలో వున్నదో లేదో నిశ్చయించలేను. త్రిపుర కాక పాలమాచాపురికి ప్రకృతి అయిన పేరుగల మరిఒకస్థలంలో కూడా వారు నివసిస్తుండి వుండవచ్చును. జంభనాపురి అని వీరచరిత్రలోనే మరియొకచోట కలదు. ఇది జబ్బల్పురమై వుండవచ్చునని అనుకొంటున్నాను. వీరచరిత్ర చంపువుగా వ్రాసిన వీరభద్రుడు జబలాపురమనే చెప్పినాడు.

29091
7.9.87

ఇప్పుడు వేంకటగిరి రాజవంశానికి బ్రహ్మనాయుడిసంబంధం ఉక్త మవుతున్నది. పల్నాటియుద్ధంలో బ్రహ్మనాయుడు మొదలైనవారు ఆవిష్కరింపజేసిన శౌర్యానలం పిమ్మటకాలాన అణగి తిరిగి తదనంతరం లైన బొబ్బిలివీరుల్లో ప్రజ్వరిల్లింది.

UNIVERSITY OF HYDERABAD
LIBRARY
HYDERABAD

## వెలమ—నాయుడు—రావు.

---

తెలుగుదేశంలో క్షాత్రసంప్రదాయాలను నిలవబెట్టిన నియోగి, వెలమ, రెడ్డి, కమ్మ, శాఖలవారిలో మనకు సన్నిహితకాలంలో శౌర్యధైర్యాదులను లోకోత్తరంగా వెలయించినది వెలమవారేను. ఈ వెలమలు హైహయులతో తెలుగుదేశంలో ప్రవేశించిన క్షాత్రధర్మ పరాయణులని, అందువల్ల వైదేశికులని, భావిస్తే బ్రహ్మనాయుడితండ్రి దొడ్డనాయుడని దక్షిణదేశపు పేరుతో ఉండడం ప్రతిబంధకం. అనుగు రాజపుత్రుల్లో ఒకరు పెరుమాళ్లరాజని పేరు వహించడం కూడా విచారణీయం. అవకాశం లేక ఆచర్చ వదలుతున్నాను. పల్నాటివీరుల కాలంలో వెలమవారికి నాయుడు, నీడు అని నామాంతాలు కనబడు తున్నవి. సంస్కృతంలోని నాయ అనే శబ్దంనుండి నాయుడు అని యేర్పడి ఉండవచ్చును.

" श्रिणीभुवोऽनुपसर्गे (३-३-२४)

అనే సూత్రం ప్రకారం నీధాతువునుండి నాయశబ్దం ఉత్పన్న మైనది. నాయ అనగా నీతి. అదిగలవాడు **नायः** అని, **'भुक्ता ब्राह्मणाः'** అన్నచోట భుక్తశబ్దంవలె అది అచ్ ప్రత్యయాంతమని, భావించవచ్చును. లేదా నాయడు అనేది కేవలం దేశ్యమై ఉండ వచ్చును. ఈ నాయుడుశబ్దానికి ఆకాలంలో గతి గౌరవాన్ని బట్టి కమ్మ, ఈడిగ, చాకలి, మంగలి, మొదలైనశాఖలవా రెందరో దాన్ని తరువాతకాలంలో తమకు చేర్చుకొన్నట్లు అనుమేయం. అయితే

ఆంధ్రులకు అలవాటైన అనుచితానుకరణధోరణిలో కర్ణాటరాజులను మహారాష్ట్రులను చూసి మంత్రి, అమాత్య, భట్ట, వర్యులు, మొదలైనవాటిని విడిచి బ్రాహ్మణులు రాయులు, రావులు, పంతుళ్లు, అయిన దశలో వెలమలు సయితం, తమ నాయుడుశబ్దాన్ని వదలి రావులు, నాయనింగారు అనేదాన్ని వదలి రాయనింగార్లు, అయినట్లు కనబడుతున్నది. రెడ్డిరాజులకాలంలోనే ఇది ఆరంభమైనట్లు విదితమవుతున్నా రెడ్లుమటుకు అనేకులు ఈఅనౌచిత్యానికి పాల్పడి రావులైనట్లు గోచరించదు. రెండు జేకులుజేకి మూడుసాకులు సాకమన్నట్లు అదీకావలె యిదీకావలెనని కొందరు రావుపంతుళ్లు, అయ్యపంతుళ్లు, అయిన విధాన ఈవెలమలలో కొందరు రావునాయుళ్లు కూడా అయినారని విదితం. ఈరావు అనేది యిప్పుడు మిక్కిలి దుర్వినియోగం చేయబడుతున్నది. కొన్నివంశవర్గాలను వేరుపరచి తెలపడమే నామాంతాల యొక్క ప్రయోజనం. కనుకనే ఇంగ్లాండు మొదలైన అభారతీయదేశాల్లోసయితం నామాంతాలు వంశవర్గాలనే తెలుపుతున్నవి. పిళ్ల, మొదలియార్, అయ్యర్, అయ్యంగార్, మొదలైననామాంతాలు దక్షిణదేశంలోను,సర్కార్, బెనర్జి,ముఖర్జి, మొదలైనవి వుత్తరభారతంలోను శాఖలను తెలపడంవల్ల ప్రయోజనవంతమై చరితార్థ మవుతున్నవి. లేదా వీటికి ఫలమేలేక అజాగళస్తనాలు కాగలవు. బ్రాహ్మణులు, కోమటి, కమ్మ, వెలమ, చాకలి, కుమ్మరి, మంగలి, బోయ, యానాది మొదలైనశాఖలవా రందరు తోచినట్లు రావుశబ్దం అనాలోచితంగా తగిలించుకొంటున్నారు. కనుక రావు ఇప్పుడు అర్థంలేనిదై పనికిమాలినదై పోయినది. ఇది తెలుగుదేశపు అవివేకాల్లో ఒకటి అని భావిస్తున్నాను. తెలుగుదేశంలో సర్వవర్ణసాధారణమైన అయ్య, అన్నలవలె, యీరావునుకూడా అంగీకరించగూడదా అని అంటే దేశీయమైన అయ్య, అన్నలు ఉండగా పరదేశస్థులరావును స్వీకరించడం అప్రశస్తమని, ప్రయోజనం లేకుండా స్వీయంవదలి పరకీయానికి చేతులు

చాచడం చిల్లరపని అని, వాటికితోడు ఇది ఒకటి అని చెప్పితే అనావశ్యకం గనుక కల్పనాగౌరవ మనేదోషం సంభవిస్తుందని, అయ్య అన్నలలోకంటె రావులో విశేష మేమిలేదని చెప్పుతున్నాను. వేంకటరామన్ సూర్యనారాయణ భాగవతర్ రాధాకృష్ణన్ అని ఈతీరున ఆంధ్రుల అరవనామాంతాల అనుచితత్వం కూడా ఇట్లానే వ్యాఖ్యేయమని చెప్పుతున్నాను. తెలుగుదేశంలో చాలాకాలంనుండి కొన్ని దురాచారాలు ఉన్నమాట యథార్థం. అయ్య, అన్న, అమ్మ, అక్కలకు అసమంజసంగా ఇకారాంతాలమీద, త్ర్యధికాక్షర సంస్కృతశబ్దాల మీదకూడా, సంధిచేసి ఆపేర్లను చప్పబడవేయడం, గోరుచుట్టుపైన రోకటిపోటున్నట్లు పురుషులు సీతయ్య, లక్ష్మయ్య, అంబయ్య, అని ఈతీరున ఆడపేర్లు పెట్టుకోనడం; స్త్రీలు రామమ్మ, హనుమమ్మ, శంకరమ్మ, సూరమ్మ, రాఘవమ్మ,అని ఈతీరున మగపేర్లు పెట్టుకోనడం; రామనాథం విశ్వనాథం ఇట్లా కొన్ని పేర్లు ద్వితీయాంతంగా ఉండడం తరుచుగా వుపలబ్ధ మవుతున్నవి. అయ్య,అమ్మ, మొదలైనవాటికి దాక్షిణాత్యుల్లో వలె గౌరవార్థం గారు వారు అని చేర్చి వాటిని పేర్లతో కలపకుండా మీనాక్షి అమ్మగారు మీనాక్షి అమ్మవారు విశ్వనాథ అయ్యగారు, రామస్వామిఅయ్యవారు అని యిట్లా ఈతీరున ప్రయోగించడం వుచితం. దురాచారాలు తొలగించుకోనడం సదాచారాలు స్వీకరించడం ఆవశ్యకమే అయినా వివిధదేశసంప్రదాయాల పరిజ్ఞానం,స్వసంప్రదాయానుభవం వుండి వివేకంతో ఆపని చేయవలసివుంటుంది. గాంధి, గోఖ్లే, తిలక్, మొదలైనపేర్లవలె వంశసూచకంగా వుండడం వుచితమని కాబోలు కొందరు పేర్లను పొడి అక్షరాలుచేసి వేపప్రభృతుల వలె యింటిపేర్లతో వ్యవహరింపబడుతున్నారు. వంశసంప్రదాయాభిరతిని తెలిపే యీమార్గం ఉపాదేయమేను. ఇంటిపేర్లను పొడి అక్షరాలుచేసి పేర్లకు అయోమయత్వం కల్పించడంకంటె ఈ మార్గం ప్రశస్తం. తిక్కనాదులవలె యింటిపేరు పూర్తిగా మాని

వేస్తే మానివేయవచ్చును. పాడిఅక్షరాలు చేయదలిస్తే పేర్లను మట్టుకే క్లిష్టంచేయడం మంచిది. లేదా పేరు ఇంటిపేరు అన్నీ వుదాహరిస్తే మేలేను. అనపాయమై గౌరవసూచకమైన పూర్వసంప్రదాయాలను వదలిపెట్టడం యేదేశంలోనైనా అవివేకసూచకం అనర్థహేతువు కాగలదు. ఒక్కొక్కశాఖ, ఒక్కొకవంశం తన వుపాదేయసంప్రదాయాలను,ఆజాతి నాగరకతారాశికి కొంతచేర్చి లోకకల్యాణ హేతువగుతున్నది. ఆనుషంగికంగా వచ్చిన యీవిచారణ యిక చాలిస్తాను.

బ్రహ్మానాయుడికి ఇతడితల్లిపేర శీలం బ్రహ్మానాయుడని పల్నాటిలో వ్యవహారం కలదు. కాని శీలం అనే యింటిపేరు వెలమశాఖకు చెందని నాయుడుశబ్దవాచ్యుల్లో కూడా కనబడుతున్నది. గౌరవార్థం వీరియింటిపేరు స్వీకరించారని అనుకొనవచ్చును. మతదీక్షకోసం మీరాబాయివలె అనేకక్లేశాలకోర్చి యిష్టదైవమైన మద్దులేటిస్వామికి అధీన అయి చివరకు బాధపెట్టిన అత్తమామ మొదలైనవారినికూడా తనపక్షానికి తిప్పుకొనగలిగిన చిన్నఅమ్మవారు శీలంవారియింటి ఆడబిడ్డేను.

ప్రస్తావవశానవచ్చిన యీ అంశాలనువదలి ప్రకృతానికి వస్తాను. పల్నాటివీరచరిత్రవంటివే కాటంరాజుకథ మొదలైన వీరగీతాలు ఇతిహాససంబంధాలు మరికొన్ని కలవు. కాటంరాజుకథకూడా శ్రీనాథ రచితమని ప్రతీతి కలదు. ఇవి దేశప్రభువులకు వారితో సంపర్కంగల వీరపురుషులకు సంబంధించిన యుద్ధాదులను తెలుపుతున్నవి. అవి ఇతిహాసజ్ఞానానికి సాధనమైన మూలగ్రంథాల్లో చేరినవైవున్నవి.

"आन्ध्राणामेव काले तु बहवो म्लेच्छवंशजाः
सिन्धुतीर्त्वाभियास्यन्ति भारतश्रीजिघृक्षया"

(क. रा.)

(ఆంధ్రులకాలాన్నే అనేకులు మ్లేచ్ఛవంశజులు భారతశ్రీని ఆపేక్షించి సింధునదిని దాటివస్తారు.) అని పురాణకర్త ఖేదపడ్డట్లు మ్లేచ్ఛజాతులు భారతవర్షాన్ని ఆక్రమించినకాలంలో అస్తమించే సూర్యుడివలె భారతీయపరాక్రమం ఒక్కసారి దిక్తటాలను మహాతేజః ప్రదీప్తం జేసింది. ఆపరాక్రమావిష్కరణంలో యేసందర్భంలో నైతేనేమి ఆంధ్రదేశం తక్కినదేశాలకు తీసిపోనివిధాన ప్రవర్తించింది. కాటంరాజు చరిత్రం వంటి వీరగీతాలు ఆవృత్తాంతాన్ని వ్యక్తపరుస్తున్నవి. జిజ్ఞాసువులైన ఐతిహాసికులకు విజ్ఞానసాధనాలై భారతీయవీరత్వప్రవృత్తి విశేషాలను ప్రదర్శించే ఈ వీరగీతాలు ఉపాదేయమని చెప్పి ఈవిచారణ విస్తరభీతిచేత ముగిస్తున్నాను. నృత్త (లాస్యతాండవ) ప్రాముఖ్యం కలిగి జంపె, త్రిపుట, రగడ, చంద్రిక మొదలైన దేశ్యగీతవైఖరులతో అర్థోక్తులతో సముదాయ గానవిధానంతో, అత్యంతం వినోదహేతువులైన యక్ష గానప్రయోగాలను విస్మరించడంవల్ల ఆంధ్రుల ఒకవిశిష్ట సంప్రదాయానికి క్షతియే గాక అపేక్ష్యవినోదక్రమవినాశమనే అనర్థం గూడా ఆపతిత మవుతున్నది గనుక విక్రమోత్తేజకాలైన వీరగీతాలతోపాటు అవికూడా మనకు రక్షణీయమని ఆనుషంగికంగా చెప్పి వేరేఅంశానికి వస్తాను.

## మాచర్ల చెన్నకేశవస్వామి ఆలయం.

దీనిని బ్రహ్మనాయుడు నిర్మించాడని పరంపరంగా చెప్పుతున్నారు. దీనికి దానంచేసినవారిలో వెంకటగిరి వెలుగోటి రాజవంశపు స్త్రీ ఒకరని అక్కడి శాసనంవల్ల తెలుస్తున్నది. ఇది ఒకప్పుడు బహుభాగవతమహితమై వుండవచ్చును. కాని యిప్పుడు ఉత్సవసమయాల్లో తప్ప తక్కిన రోజుల్లో పూజాదర్శనాలకు వచ్చేజనులసంఖ్య మిక్కిలి స్వల్పం.

## మతం—దేవాలయం.

దేవుడొకడున్నాడని ప్రత్యయంలేని తత్త్వజిజ్ఞాసువులు కొందరుండవచ్చును. వారు సాధారణంగా శమదమాది సంపత్తిగలవారై ఆత్మవంతులై వుంటారు గనుక వారివల్ల లోకధర్మవిప్లవం సంభవించజాలదు. అయితే అట్లాటిస్పృహణీయగుణసంపద మామూలు ప్రజల్లో వుండగలగడం అరుదు గనుక నాస్తికత సాధారణజనుల్లో హింసలు, కలహాలు, పరధనాపహరణాదులు, విషయలోలత మొదలయిన హేయలక్షణాలకే ప్రేరకంకాగలదు. కనుక నాస్తికత యేదేశంలోగాని సాధారణజనులకు మతంగా వుండడానికి అర్హమయినది కాదు. తత్త్వజిజ్ఞాస లేతీరుగా ప్రవర్తిల్లినా రష్యా మొదలయినదేశాల్లో నాస్తికత యేమార్గంలో నడుస్తున్నా దైవభక్తి ముఖ్యలక్షణంగా గలమతంయొక్క ఆవశ్యకత లోకసంగ్రహానికి అనివార్య మవుతున్నది. మానవుల యందలి హేయగుణాలను చంపి అభ్యుదయప్రదమయిన కల్యాణగుణాలు వర్ధిల్లజేసి అందు గుప్తమయివున్న దైవత్వాన్ని ప్రస్ఫుటం జేయడమే మతంయొక్క ప్రకృష్టప్రయోజనం. చిహ్నధారణాదిబాహ్యలక్షణాలే మతంకావు గాని యేమీలేకుండా వుండడంకంటె అవి కొంత మేలనవచ్చును. యేదశయందైనా యెప్పటికైనా అవి వాటికి సమీపానవున్న శ్రేయః పథాన్ని చూపించవచ్చును. కొందరు తమ దుష్టచిత్తవృత్తులను కప్పిపుచ్చి లోకాన్ని వంచించడానికి బాహ్యలక్షణాలను ధరిస్తుండడం సత్యం. అయితే అది మతంయొక్క మిథ్యాయోగం. అంతమాత్రంచేత మతం దుష్టం కాజాలదు. మిథ్యాయోగంయొక్క నింద్యతను వస్తువునకు ఆరోపించడం అనుచితం గదా. ఈ దేవాలయాలు ప్రజలకు సమాగమస్థానాలని నేను భావిస్తున్నాను. ధనాదులచేత ప్రవేశం నియమితమై ప్రాకృతక్రీడాసుఖాలకోసం చేరే పాశ్చాత్యుల క్లబ్బులవలె గాక మన దేవాలయాలు నిర్ధనులకు సైతం నిరవధికంగా ప్రవేశం ప్రసాదిస్తున్నవి.

" निरवधिजनताविश्रमार्हावकाशं............
युवयोराहुरास्थानरत्नम् " [श्री. गु]

మీ ఆస్థానరత్నం మితిలేని జనసమూహంయొక్క విశ్రమానికి అర్హమైన అవకాశం గలది అని అంటారు.) అని పరాశరభట్టు శ్రీవిష్ణుసభను వర్ణిస్తూ చెప్పినమాటల్లో పై అభిప్రాయంకూడా గర్భితమని వ్యాఖ్య చేయవచ్చును.

ఈ ఆలయాలు అక్కడ కొంచెంసేపైనా కూర్చుండవలెనని ఉత్తమధర్మాలను గురించి చింతించవలెనని వినేయులను ఉన్ముఖులను చేస్తున్నవి. భారతీయదేవాలయాల్లో ఆనందం, వినోదం, జిహ్వాతృప్తికూడా ఉపలబ్ధ మవుతున్నవి. అయితే అవి దైవనివేదితం కావడంవల్ల వాటికి ఉండగల మాలిన్యాన్ని వదలుతున్నవి. దేవాలయం మతానికి ప్రధానావాసం. మతంయొక్క సింహాసనాస్థానంగాను తత్త్వజిజ్ఞాసాచోదకంగాను ఉండడమే కాక దేవాలయం సౌందర్యం గానం శిల్పం కవిత మొదలైనవాటికి సమావేశస్థానంగా కనబడుతున్నది. లోకంయొక్క సర్వసమృద్ధి, కమనీయత, శ్రీ, లక్ష్మి అనేనామాలతో లోకస్థితికారకుడైన విష్ణువుకు హృదయాసాదితంగా ఆరాధించబడడం, మాన్యత, శుభత, సాధ్వీత, ఆర్య, సర్వమంగళ, సతి, అనేపేర్లతో పరమశివుడి దేహంలో ఒకభాగంగా అర్పితం కావడం, భావకచేతస్సులకు వికాసం కలిగించక మానవు. ధనుర్దాసుడికి తన నత్యంతం ఆకర్షించినభార్యకంటె భగవంతు డెక్కువ మనోజ్ఞతతో గోచరించడం, ఆముక్తమాల్యద (గోదఆండాళ్), వేదవల్లి, పాదుషాపుత్రి మనుష్యాకృతులు నిరసించి భగవంతుడి వదనానికి మాధుర్యంతో పరతంత్రలు కావడం, వైష్ణవుల దివ్యసౌందర్యభావనయొక్క స్వరూపాన్ని కొంతవరకైనా తెలుపగలవు. మధురసమీపంలోవున్న స్వర్ణమయ విష్ణువు సుందరరాజు (అళగర్). सुन्दरः, मनोहरः [म. वि] అని

సాధకులు విష్ణువును ఆరాధిస్తున్నారు. శైవుల్లో కూడా ఇట్లాటి భావన ప్రసిద్ధం. శాక్తుల్లో ఒకప్రధానశాఖకు దేవత త్రిపురసుందరి. మధురలో మీనాక్షీప్రియుడైన శివుడు సుందరేశ్వరుడు. తామ్రపర్ణి తీరాన కైలాసనాథుడు సౌందర్యవల్లీవల్లభుడు. కామాక్షి, కోమలవల్లి, సుగంధికుంతల, కాంతిమతి అని ఈతీరున దక్షిణదేశంలో వెలసిన మాంగల్యదేవతలు ఈసౌందర్యాంశను వ్యక్తం చేస్తున్నారు.

"त्वदीयं सौन्दर्यं तुहिनगिरिकन्ये तुलयितुम्"

(ఓ తుహినగిరికన్యా నీసౌందర్యాన్ని పోల్చడానికి)

అని

"तनोतु क्षेमं नस्तव वदनसौन्दर्यलहरीपरीवाहस्रोतस्सरणिरिव सीमन्तसरणिः ।"

(నీవదనసౌందర్యప్రవాహంయొక్క అలుగుకు కాల్వవలె ఉన్న సీమంతమార్గం మాకు క్షేమంకలిగించును గాక) అని శంకరాచార్యులు శ్రీచక్రాధిదేవతయందు,

1 "श्रीरङ्गहर्म्याङ्गणकनकलते"

2 "श्रीरङ्गेश्वरगेहलक्ष्मि"

3 "सौन्दर्यामृतसेकशीतलमिदं लावण्यसूत्रार्पितम्"

4 "प्रकृतिमधुरं गात्रं जागर्ति मुग्धविभूषणैः"

5 "श्रीरङ्गधाममणिमञ्जरि"

1. శ్రీరంగవిమానాంగణమందలి కనకలతా.

2. శ్రీరంగేశ్వరగేహలక్ష్మీ.

3. సౌందర్యామృతం చల్లడంచేత శీతలమైనది లావణ్యసూత్రార్పితమైనది అయి నీకోమలాంగకుసుమాల కూర్పు శ్రీరంగేశ్వరీ.

4. స్వభావమధురమైనగాత్రం (ఓరంగనాయికా) మనోజ్ఞ భూష ణాలచేత ప్రకాశిస్తున్నది.

5. ఓ శ్రీరంగవిమానమణిమంజరీ.

అని పరాశరభట్టు శ్రీరంగనాయికయందు,

**या सौन्दर्यधुनीतरङ्गततिषु व्यालोलहंसायते ॥** [मू.]

[సౌందర్యనదీతరంగాలయందు హంసవలె ఉండే (స్మితం)]

అని పంచశతికారుడు కామాక్షియందు

**सहस्ररतिसौन्दर्यशरीरिण्यै ॥**

[సహస్రరతి సౌందర్యశరీర అయినదేవికి (నమస్సు)]

అని ఉపాసకులు లలితయందు విషయాస్పృష్టమైన ఈ దివ్య సౌందర్యాన్నే దర్శించారని వ్యక్తం. దక్షిణదేశపు శైవవైష్ణవమత సంప్రదాయాల్లో దివ్యసౌందర్యం స్ఫుటాంశంగా పరిగణిత మవుతున్న దని స్పష్టం. శాక్తుల్లో ఇది ప్రసిద్ధమే గనుక వివరించవలసినపని లేదు. ఇంతేకాక దేవాలయాల్లో శిల్పాలంకరణాల ప్రత్యక్షసౌందర్యం ప్రకటం. దేవాలయంలో స్త్రీచిత్రాన్ని యతి కౌగిలించుకొన్నాడని కళాపూర్ణోదయాష్టమాశ్వాసంలో చెప్పిన పింగళిసూరన ఈ శిల్ప మనోజ్ఞతనే తెలిపినాడు. ప్రఖ్యాతగాయనులు తమకౌశలాన్ని దేవా లయాల్లో పవిత్రపరుస్తుండినట్లు విదిత మవుతున్నది.

**ततः प्रविशति वीणां वादयन्ती ॥** [नागा]

[అంతట వీణవాయిస్తూ (మలయవతి) ప్రవేశిస్తున్నది.]

అనే పఙ్క్తుల్లో మలయవతి మలయపర్వతమందలి దేవాల యంలో గానం చేస్తుండినదని శ్రీహర్షుడు తెలుపుతున్నాడు.

గోకర్ణనిలయుడైన శివుణ్ణి వీణాగానంతో సేవించడానికి నారదుడు పోతుండినట్లు

**अथ रोधसि दक्षिणोदधेः श्रितगोकर्णनिकेतमीश्वरम्**
**उपवीणयितुं ययौ......** [रघु]

(గోకర్ణక్షేత్రంలోవున్న యీశ్వరుణ్ణి వీణతో కీర్తించడానికి నారదుడు పోయినాడు.)

అనేవాక్యాల్లో కాళిదాసు తెలుపుతున్నాడు. దేవాలయాల్లో వున్న సీతారామాదులప్రతిమలు మూర్తమైన వాల్మీకి భావసృష్టే నని అనవచ్చును. గీతాదాత పార్థసారథి, వ్యాసుడు చిత్రించినట్లే గోచరిస్తున్నాడు. సర్వాంకుశ అయిన, జగన్నియంత్రియొక్క కరాళ స్వరూపానికి దృష్టినిమరల్చి మానుషచిత్తవృత్తులకు ఒకవిధంగా పరిణతి కలిగించే భీభత్సభయానకాల నిష్పత్తికి సాధనాలైన కొన్ని దేవాలయాలు కలవు. దివ్యకవితాప్రయోగస్థానాలుగా కూడా దేవాలయాలు నాకు గోచరిస్తుంటవి.

**दयावत्या दत्तं द्रविडशिशुरास्वाद्य तव यत् ।**
**कवीनां प्रौढानामजनि कमनीयः कवयिता ॥** [सौं]

[దయావతివి నీవిచ్చిన స్తన్యం తాగి ద్రవిడశిశువు ప్రౌఢకవుల్లో కమనీయకవి అయినాడు.]

అని శ్రీశంకరాచార్యులు,

**त्वत्प्रेयसः श्रवणयोरमृतायमानां तुल्यां त्वदीयमणिनूपुरशिञ्जितेन ।**
**गोदे त्वमेव जननि त्वदभिष्टवार्हां वाचं प्रसन्नमधुरां मम संविधेहि ॥**
[गो]

(ఓ గోదాదేవీ! తల్లీ! నీప్రియుడిచెవులకు అమృతంవంటిది, నీమణినూపురశింజితంతో సమానమైనది, ప్రసన్నమధురమైనది, నిన్ను స్తుతిం

చడానికి అర్హమైనది అయిన వాక్కును నీవే నాకు కలిగేటట్లు చేయవలసినది.)

అని వేదాంతదేశికులును

**कवित्वश्रीकन्दः** [मू.]

[కవిత్వవైభవకందం (అయిన కామాక్షి)]

అని మూకుడు

**सूक्तिं समग्रयतु नस्स्वयमेव लक्ष्मीः ।**
**श्रीरङ्गराजमहिषी मधुरैः कटाक्षैः ॥**

(శ్రీరంగరాజమహిషి లక్ష్మి స్వయంగానే మధురకటాక్షాలచేత మంచివాక్కును మాకు సమగ్రం చేయునుగాక)

అని శ్రీ గుణరత్నకోశకారులు ఈదివ్యకవితను స్మరిస్తున్నారు.

**कलानिधिः काव्यकला रसज्ञा रसशेवधिः ॥** [ल. स]

(కళానిధి, కావ్యకళ, రసజ్ఞ, రసనిధి)

అని లలితను కావ్యకళగా ఉపాసించేసాధకులు ఈ దివ్యకవితనే సూచిస్తున్నారు.

పద్మపురాణకర్త దుఃఖించినట్లు ఆశ్రమాలు యవనధ్వస్తాలు కాగా మీమాంసకుల కర్మవాదపాటవం దేశంలో క్షీణించగా విజ్ఞానపీఠం అరణ్యాలను వదలి ఆలయాలకు మరలినట్లు కనబడుతున్నది. ఇంతేకాక భారతవర్షమందలి మతసంరక్షకు లెందరో దేవాలయాలతో సంబంధించివున్నారు.

వ్యాసుడు అగస్త్యుడు దేవాలయాలతో సంబద్ధులై ఉన్నారని కాశీఖండం చెప్పుతున్నది. మహాభాష్యకర్త పతంజలి చిదంబరక్షేత్రంలో ప్రవచించినట్లు వృద్ధవ్యవహారం కలదు. శ్రీరామానుజా

చార్యుల ఆవిర్భావానికి తిరువల్లిక్కేణి పార్థసారథి కృపావిశేషం ప్రేరకమని సంప్రదాయజ్ఞులు చెప్పుతున్నారు. బౌద్ధతర్కాలకు అడ్డుకట్ట వేసి వైదికమతాన్ని కాపాడిన మహావిజ్ఞానసంపన్నుడు కుసుమాంజలి కర్త ఉదయనాచార్యులు పురుషోత్తమ (జగన్నాథ) క్షేత్రాన్ని సేవిస్తుండినట్లు విదిత మవుతున్నది.

ऐश्वर्यमदमत्तोऽसि मामवज्ञाय वर्तसे ।
उपस्थितेषु बौद्धेषु मदधीना तव स्थितिः ॥

[ఐశ్వర్యమదమత్తుడవై నన్నవమానపరచి వర్తిస్తున్నావు. బౌద్ధులు దగ్గరకు వచ్చినప్పుడు నీస్థితి నాచేతులో వుంటుంది. (అంటే నాస్తికులవాదాలను నాతర్కంతో ఖండించి ఈశ్వరసద్భావాన్ని నేను సమర్థించవలసి ఉంటుంది).

అని ఒకప్పుడు ఉదయనాచార్యులవారు పురుషోత్తమదేవుణ్ణి ఉద్దేశించి పలికినట్లు ప్రతీతి కలదు.

श्रीरङ्गे शरदश्शतं...युष्मत्पादसरोरुहान्तररजः स्याम ॥ [श्रीगु]

[శ్రీరంగక్షేత్రంలో నూరేండ్లు (దాస్యరసికమైన ఉత్కృష్టసమృద్ధిని అనుభవించి) నీపాదాలనే కమలాలమధ్య రేణువు అగుదుము గాక] అని శ్రీరంగంలో నూరుసంవత్సరాలవునికిని పరాశరభట్టు అభిలషించాడు.

మాచర్ల చెన్నకేశవస్వామి అనుగ్రహం బాలచంద్రజన్మకారణమని వీరచరిత్ర తెలుపుతున్నది.

శ్రీరంగం శ్రీవిల్లిపుత్తూరువంటిచోట్ల దేవాలయాల్లో వైష్ణవ సంప్రదాయాలు వికసించినవి. కులశేఖరుడు విష్ణుచిత్తుడు మొదలైన మునిశ్రేష్ఠులు విద్వాంసులు ఆ క్షేత్రాల్లో వర్ధిల్లినారు.

దేవాలయాలయొక్క జీవద్దశ, సమృద్ధి, దేశమందలి ప్రజలమత పరాయణత్వదార్ఢ్యానికి చిహ్నాలని చెప్పవచ్చును. మతమంటే పట్టీపట్టక అది యెప్పుడో ఒకప్పుడు యెదటివాండ్ల తృప్తికై అవలంబించే లాంఛనంగా మారిన మనుష్యుల్లో లఘుచేతస్కత్వం, భీరుత్వంతోకూడిన అధర్మలాలసత్వం, జీవితవిధానమందు పశుతుల్యత, ఆపతితం గాక మానవు. తెలుగుదేశంలో కొన్నిచోట్ల దేవాలయాలు పిల్లకాయలకు క్రీడాభూములుగాను తుంటరులకు సమావేశస్థలాలుగాను మారడం నే నెరుగుదును.

దక్షిణభారతంలో ఆళ్వారులు నయినారులు యామున రామానుజులు మొదలైనవారివలె, ఉత్తరభారతంలో చైతన్యప్రభృతులవలె ప్రజలమధ్య మతధర్మాలను ప్రవచించి ప్రత్యక్షంగా ఆచరణాదులచేత ఉద్బోధం కలిగించిన ఆచార్యులు అంతగా లేకపోవడమే ఈదుర్దశకు హేతువై ఉండవచ్చును. వల్లభనింబార్కులవంటి ఉత్కృష్టపురుషులు పుట్టికూడా తమతేజః ప్రవచనాలను మనకు ప్రసాదించక ఆంధ్రేతర దేశాల్లో తమజీవితం గడపడం మనదురదృష్టమే నని అనుకొనవచ్చును. కాకతీయులకాలానవచ్చిన కాలాముఖశైవాచార్యులు, విజయనగర కర్ణాటరాజులు పంపిన వైష్ణవాచార్యులు, ఆవశ్యకమయినంతగా మతవిజ్ఞానాన్ని ప్రజల్లో ప్రతిష్ఠితం చేయలేదు. అక్కడక్కడ అప్పుడప్పుడూ వున్న ఒకరిద్దరు రామదాస నారాయణతీర్థులంటి భక్తులవల్ల తగినంతపని జరుగలేదు. ఆంధ్రదేశపు హద్దులలోవున్న వేంకటాచలాలయంకూడా అనాంధ్రులైన మహాంతులచేతుల్లో వున్నది.

అదిగాక ద్రావిడుల ప్రాబల్యంవల్ల తిరుమల తిరుపతి అనే అరవ పేర్లు దానికి ప్రధానంగా యేర్పడినవి. అహోబలక్షేత్రంలోగూడా ద్రావిడుల ప్రాబల్యమే దృష్టమవుతున్నది. పురాణాల్లోనేకాక భవభూతి బాణుడు, శ్రీహర్షుడు ఇట్లాంటి ప్రాచీనభారతీయ విజ్ఞులకృతుల్లో సైతం

ప్రస్తావించబడిన మన శ్రీశైలక్షేత్రాన్ని గురించి తగినంత శ్రద్ధవహించక వుదాసీనులంగా వున్నాము. ప్రస్తుతదీనస్థితికి కారణాలేవైనా మేలుకొని మనదేవాలయాల శోచనీయదశను తెలిసికోనడం మనకు కర్తవ్యమని చెప్పి ఈవిచారణ ముగిస్తాను.

మాచర్ల చెన్నకేశవస్వామి ఆలయపు ప్రాకారంలోపల శివుడి గుడివున్నది. ఇది ఉత్తరహరివంశాదుల్లో ప్రతిపాదితమై శంకరాదుల చేతఅనుష్ఠించబడి స్మార్తులకు అపేక్ష్యమైన హరిహరారాధనకు ద్యోతకమని తోచవచ్చును గాని నెల్లూరు మొదలైనచోట్లను దక్షిణంలో కొన్నిస్థలాల్లోనువలె హరిహరాలయాలు వేరుగా ఉండడంవల్ల విప్రతిపత్తి కనబడుతున్నది.

**विष्णोर्नाभेस्समुद्भूतो वेधाः कमलजस्ततः ।**
**विष्णुरेवेश इत्याहुर्लोके भागवता जनाः ॥**
**शिवस्य पादावन्वेष्टुं शार्ङ्ग्यशक्तस्ततश्शिवः ।**
**ईशो न विष्णुरित्याहुश्शैवा अगममानिनः ॥** [पञ्च]

(విష్ణువుయొక్క నాభియందు బ్రహ్మపుట్టినాడు కనుక విష్ణువే దేవుడు అని లోకంలో భాగవతు లంటారు.)

(శివుడిపాదాలను వెతకడానికి విష్ణువు అశక్తుడైనాడు కనుక శివుడు దేవుడు, విష్ణువు కాడు అని ఆగమమానులైన శైవులు చెప్తారు.)

అని శ్రీవిద్యారణ్యులు తెలిపినట్లు విష్ణువుకు విముఖులయ్యే వీరశైవులు శివనామం చెప్పఁబడనీయని వీరవైష్ణవులు ప్రబలినకాలంలో వైష్ణవులు శివుణ్ణి శైవులు విష్ణువును లింగంగా ఆరాధిస్తుండిన మార్గానికి ఇది చిహ్నమని అనుమానించవచ్చును. శైవుడైన లీలాశుకుడు హరిప్రియుడు కావడం, ఇల్లాటి ప్రవృత్తియొక్క ఫలమేనని అనుకోవచ్చును.

శరీరాన్ని బుద్ధిని దహించి జాడ్యం, మాంద్యం, మొదలయిన తమోగుణాలను పెంచే కారపుముద్దలు అధికంగా తినడంలో గాని, ఆరోగ్యప్రదం కాక కేశాదులకు పారుష్యం గలిగించే కటికిస్నానం సాధారణంగా ఆచరించడంలో గాని, అంతఃకచ్ఛం లేకుండా, ఒక్కొక్కప్పుడు కటిప్రదేశాలనుకూడా కనబరుస్తూ వీధుల్లో వెంట అప్పుడప్పుడూ నాకుతూ ఉండే గోచీలతో, వస్త్రం ధరించడంలో గాని పల్నాడు తక్కిన ఆంధ్రదేశంవలెనే వున్నా

**कक्षाबन्धं विदधति न ये सर्वदैवाविशुद्धाः । [विक्र १८–९७]**

మొలతాడుధరించక యెప్పుడూ అశుచిగా వుంటారు

అని బిల్హణుడు గుజరాతీలను దూషించినట్లు పల్నాటిసీమ వారిని శ్రీనాథుడు విశేషించి నిందించాడు. జొన్నల సజ్జల అన్నం, తేళ్లు, పాములు, రాళ్లు, మొదలయినవి యితడినిందకు విషయాలని విదితం. పాములేమో కాని తేళ్లుమటుకు పిన్నలి (అప్పకవి పింగళి) వంటిచోట్ల యెక్కువగా వున్నమాట వాస్తవం. జొన్నలు సజ్జలు దార్ఢ్యప్రదం గనుక దూష్యం కావు. సారవంతమయి శరీరపాటవం కలిగించి దేశానికి బలసమృద్ధిని సమకూర్చే ఆహారం దూష్య మనుకోనడం గొప్ప అవివేకం. అందులో మరబియ్యపు అన్నం తిని నీరసులయివున్న యిప్పటివా రెవరయినా ఆమాటలు విని సంతోషి స్తే అది అత్యంతం మతిమాలినపనే కాగలదు. తక్కినవి అసంగతాలు పాటించదగనివి కనుక విచారించక వదలుతున్నాను. కొన్ని శ్రీనాథుడివి వుంటే మరి కొన్ని బహుశః పిమ్మటివారు రచించి అతడికి తగిలించి వుండవచ్చును. ఇతడి విద్యాప్రావీణ్యాన్ని కనుగొని ఆదరించగలిగిన ప్రభువులు, విద్వాంసులు అక్కడ అంతగా లేకపోవడం కారణమై ఉండవచ్చును. లేదా

యిప్పటికంటె కొంచె మెక్కువ దుర్దశలో వుండివుండవచ్చును. ఆ పద్యాలు ప్రథమభూమికలో ద్రష్టవ్యం.

## పల్నాడు.

...समासादिताश्चर्यमन्त्रसिद्धिप्रभावा श्रीपर्वते कापालिकव्रतं धारयति । [मालती]

[(ఆసౌదామిని) ఆశ్చర్యమంత్రసిద్ధిప్రభావం పొంది (ఇప్పుడు) శ్రీశైలంలో కాపాలికవ్రతం ధరిస్తున్నది.)]

అని భవభూతిచేత

सकलप्रणयिमनोरथसिद्धिश्रीपर्वतो हर्षः । [हर्ष]

श्रीपर्वताश्चर्यवार्तासहस्राभिज्ञेन । [का]

[సకలార్థుల మనోరథసిద్ధికి శ్రీశైలం (మల్లికార్జున నివాసభూమి) అయిన హర్షుడు.]

అని

(శ్రీశైలాన్ని గురించి అనేకాశ్చర్యవార్తలను తెలిసిన)

అని బాణుడిచేత

अद्य किल भर्ता श्रीपर्वतादागतस्य श्रीखण्डदासनामधेयस्य धार्मिकस्य सकाशात् । [रत्ना]

(ఈనాడు రాజు శ్రీశైలంనుండి వచ్చిన శ్రీఖండదాసుడనే ధార్మికుడి వద్దనుండి)

అని హర్షుడిచేత ప్రస్తావించబడి

శైవులు పవిత్రంగా గణించే కాశి, ఉజ్జయిని, కేదారం మొదలైన ద్వాదశమహాక్షేత్రాల్లో అన్యతమమైన శ్రీశైలాన్ని ఆనుకొని

కృష్ణానదీతీరాన ఈపల్నాడు ఉన్నది. భారతవర్షేతిహాసంలో ప్రసిద్ధుడై సాతవాహనమంత్రి అయిన గుణాఢ్యుడు కథాసరిత్సాగరంలో

> **तस्य नागार्जुनो नाम बोधिसत्त्वांशसम्भवः**
> **दयालुर्दानशीलश्च मन्त्री विज्ञानवानभूत् ।**
> **यः सर्वौषधियुक्तिज्ञश्चक्रे सिद्धरसायनं**
> **आत्मानं च राजानं विजरंचिरजीवितम् ॥** **[कथा. रत्न ७]**

[అతడికి (చిరాయువనే రాజుకు) నాగార్జునుడని బోధిసత్త్వాంశ సంభవుడైన మంత్రి వుండినాడు. ఆయన దయాళువు, దానశీలుడు, విజ్ఞానవంతుడు. అతడు సర్వౌషధియోగజ్ఞుడై రసాయనమహిమచేత తనను ఆరాజును ముసలితనంలేకుండా చిరాయువులుగా వుండేటట్లు చేశాడు.]

అనే పద్యాల్లో ప్రశంసించిన బౌద్ధమతాచార్యుడు నాగార్జునుడు నివసిస్తుండబట్టి కాబోలు నాగార్జునకొండ అని పేరువహించిన ప్రదేశం పల్నాటిసీమలోనే వున్నది. నాగార్జునకొండ ఉన్న ప్రదేశం ఇప్పుడు రాజకీయులు తవ్విస్తున్నారు. అక్కడ పురాతనవస్తువిశేషాలు గణనీయమైనవి కొన్ని కనపడ్డట్లు తెలుస్తున్నది. విశ్వబ్రాహ్మణులను యాచించే పంజలవారి ప్రశంసలవలన విదితమయ్యే ఆంధ్రశిల్పనివాస భూమి పెందోట పల్నాటిలోనే ఉన్నది.

ఒకప్పుడు మహావీరులకు క్షేత్రమైన పల్నాడు ఈ మధ్యకాలంలో లక్ష్మి అమ్మవారి మహాత్మ్యాన్ని ప్రదర్శించగలిగింది. కటికకుటుంబపు కోడలిక్లేశాలన్నీ అనుభవించి ప్రాణాలు విడిచేసమయంలోకూడా చంపుతున్న భర్తహస్తపు కరుణాస్పర్శను అభిలషించిన యీ సాధ్వి స్థానం దుర్గి. ఈమె కమ్మవంశానికి చెందినది. తండ్రి దిగుమర్తి ముసలప్ప నాయుడు. ఆంగ్లకవిఒథెల్లోను స్మరింపజేసే చిరుమామిళ్ల వెంకా

నాయుడు లింగాపురనివాసి ఈమె భర్త. ధర్మపరతంత్ర అయిన ఉదాత్త భారతీయగృహిణికి సర్వకాలాల్లో ఉదాహరణంగా ఉండ గలిగిన యీమె యిప్పటికీ పూజిత అవుతున్నది. ఈమె ఇతిహాసం సంచారికథకులు బొబ్బిలికథాదులవలె ఇప్పటికీ కీర్తిస్తున్నారు.

## పల్నాటివీరచరిత్ర.

పల్నాడు+వీరులు = పల్నాటివీరులు. పల్నాడు అనే ప్రదేశానికి సంబంధించిన వీరులు పల్నాటివీరులు. షష్ఠీతత్పురుషం. ఇక్కడ షష్ఠి సంబంధసామాన్యాన్ని తెలుపుతుంది. ట్వాదేశం సమాసాశ్రయకార్యం. వివరణం భాషావ్యాకరణంలో చూడవలెను. పల్నాటివీరులయొక్క చరిత్ర పల్నాటివీరచరిత్ర. షష్ఠీతత్పురుషం. పల్నాడు అనేశబ్దం ప్రథమ భూమికలో వ్యాఖ్యాతం. వీరశబ్దం ఇందే వ్యాఖ్యాతపూర్వం.

## चर्+इत्र=चरित्रम्

"**चरेर्वृत्ते**" అనే సూత్రంచేత "**णित्रन्**" ప్రత్యయం వచ్చి చారిత్రం అనికూడా రూప మేర్పడుతుంది. "ఇత్ర‌ణిత్రన్" ప్రత్యయాలు ఔణాదికాలు. చరిత్రశబ్దానికి '**अण्**' ప్రత్యయం చేరిస్తేకూడా 'చారిత్రం' అని రూపమేర్పడుతుంది. అయితే స్వరంలోమాత్రం భేదం. 'చరిత్ర' శబ్దం వృత్తవాచకం.

## పల్నాటివీరచరిత్ర ప్రకటనం.

దీనిని మొదట నేను ప్రకటించి ద్వితీయభూమికారంభకాలానికి 23 సంవత్సరాలైనదని ఉక్తం. ప్రకటించిన కొద్దికాలానికి తక్కినభాగాలను ముద్రింపించవలసినదని దానికి శ్రీమహారాజువారి తోడ్పాటు లభించగలదని శ్రీపిఠాపురం మహారాజువారి ఆత్మీయకార్యదర్శికథాశేషులూ అయిన శ్రీ మొక్కపాటి సుబ్బారాయుడువారు నాకు వుత్తరం వ్రాశారు. తక్కినభాగాల్లో శ్రీనాథరచన అంతగా లేదని అక్కడక్కడ ద్విపదీఖండాలతో చాలామట్టుకు సల్లుమాటలతో నిండివున్నదని ఇదే

శ్రీవీరభద్రఅయ్యవారిగ్రంథమని ఇట్లాటి అంశాలు సూచిస్తూ వున్నది వున్నట్లు ప్రకటించడం గాని క్రమమైనగద్యంలో తిరగవ్రాసి ప్రకటించడం గాని మీకు సమ్మతమైతే ఆపని చేస్తానని నేను ప్రతివచనం వ్రాశాను. పిమ్మట కొంతకాలానికి వీరచరిత్ర తక్కినభాగాలను శ్రీ జయంతి రామయ్యవారు ప్రకటించబోతున్నారని సాహిత్యపరిషత్పత్రికలో వెల్లడించారు. ఆంధ్రపత్రికలో యీసంగతినిగురించి నేను క. శ. 5015 వైశాఖ బ. ష॥ శుక్రవారం ఒక ఉత్తరం, జ్యేష్ఠ శు. వి॥ బుధవారం మరివొక ఉత్తరం, రెండుత్తరాలు ప్రకటించాను. రెంటిలోను విషయమొక్కటే గనుక ఒకదానిని ఉదాహరిస్తున్నాను.

"పల్నాటివీరచరిత్రలో నొకభాగమైన బాలచంద్రయుద్ధమును బ్రకటించి యుంటిని. దీనిని నైజాముదేశమునుండి తెప్పించితిని. మఱి రెండు మా పల్నాటిసీమలో దొరికినవి. ఈభాగము కాక తక్కినది పల్నాడుతాలూకా కారెంపూడి నివాసులగు పిడుగు వీరభద్రయ్యగారివద్ద నున్నదని తెలిసికొని వారిగ్రంథమున కొకప్రతిని వ్రాసితిని. చెన్నపురి లిఖితపుస్తకాగారములోఁ గొన్నిప్రతు లున్నవిగాని వాని కర్తలు కొండయ్య ప్రభృతులు. ఈవిషయ మా పుస్తకములలో నే వ్రాయఁబడి యున్నది. వీరభద్రయ్యగారి ప్రతియొక్క ధోరణి చూడఁగా యతి గణ జ్ఞానముకూడ లేని సామాన్యుఁడు అపభ్రంశములతో వ్రాసినట్లు కన్పడెను. ఏల యిట్లున్నదని యడుగఁగాఁ బిచ్చికుంటవాండ్రు చెప్పఁగా విని వ్రాసిరనియు, నిది యిటీవలిప్రతియే యనియు వీరభద్రయ్యగారు నాకుఁ జెప్పిరి. కొండయ్యప్రభృతుల గ్రంథములు దీనికంటె ననేకభంగుల శ్రేష్ఠములుగా నున్నవి.

అచ్చుఖర్చులను మే మొసఁగెదము. పల్నాటివీరచరిత్ర తక్కిన భాగమును బ్రకటింపవలసినది అని శ్రీపిఠాపురము రాజాగారు నాకుఁ దెలిపినప్పుడు, ఉన్నస్థితి వివరించి చివరకు శ్రీనాథకృతగ్రంథము దొరకలేదనియుఁ దప్పుల తడకగా వ్యర్థపదములతోఁ గూడియున్న

ప్రతి (వీరభద్రయ్య ప్రతి) యున్నదనియు, దానిని సవరించి ప్రచురించుటకంటె గ్రొత్తది వచనముగా వ్రాసి ప్రకటించుట మేలు. లేదా, కొండయ్యగ్రంథమును బ్రకటించుట మేలు అనియు నేను వ్రాసితిని. శ్రీనాథకృతమే కావలెననియు, దదితర మక్కరలేదనియు వారు తెల్పిరి. వీరభద్రయ్యప్రతినే నేను సంపాదించితినని జయంతి రామయ్యపంతులుగారు నాతో నొకపర్యాయము చెప్పియుండిరి. దానినే పరిషత్తు ప్రకటింపఁ బోవుచున్నట్లు...సంవత్సర కార్యనివేదనమువలన నాకు సూచనగాఁ దెలియుచున్నది.

పరిషత్తు ప్రకటింపఁబోవునది, వీరభద్రయ్యప్రతియే యైనయెడల నే నిదివఱకు రాజాగారికిఁ దెలిపినగ్రంథమే కాని యది వేఱుకాదనియు, దీనికిని నేను బ్రకటించిన బాలచంద్రయుద్ధమునకును ఎట్టి సంబంధము లేదనియు, బాలచంద్రయుద్ధము దీనితోఁ జేరినభాగమని తలఁచుట భ్రమ యనియు, బరిషత్కార్యనిర్వాహకులకు విన్నవించుచున్నాఁడను ... ... ... ... ...

రాయవాచకమునువలె దీని నున్నదున్నట్లు ముద్రించినను ఒక విధమున మేలె. పల్నాటిసీమమాటల వ్యవహారము కొంతవఱకుఁ దెలియును. కథకొఱకైనయెడల దీనినిబట్టి వచనము వ్రాసి ప్రకటించుట మంచిది. ఇదివఱ కెందరో వ్రాసి, వ్రాయనున్న భారతరామాయణవచనములకంటె నిది యెక్కువ యుపయోగకరమైనది."

## ముగింపు.

ఈవీరచరిత్రను రెండవపర్యాయం ముద్రితం చేయడానికి కలిశకం 5034-వ సంవత్సరంలో ఆరంభించాను. మద్రాసు విశ్వవిద్యాల

యంలో 5035-వ సంవత్సరపు బి. యే. పరీక్షకు ఇది పాఠ్యగ్రంథంగా నిర్ణీతమైనది. దీని ప్రథమభూమికాసంస్కరణం ద్వితీయభూమికారచన 5032 లో ప్రవేశించిన కుజమహాదశలో ఆరంభించాను. ఇంతకు పూర్వం మొదలుపెట్టిన రఘువంశఖండకావ్యప్రకాశ వివరణాలప్రకటనం చాలాకాలం క్రిందటనే ఆగిపోయింది. ఈ ఉద్యమానికి అనారోగ్యం మొదలైనవిఘ్నాలు అడ్డుపడుతూ పడుతూ ఉంటే వాటిని నెట్టుకుంటూ నెట్టుకుంటూ ఇప్పటికి ముగించగలిగినాను. 5027-వ సంవత్సరంనాటికే వీరచరిత్రప్రతులు అయిపోయినవి. అందుకే ఈగ్రంథం కావలెనని నాకు వ్రాసినవారికి పంపజాలక పోయినాను. దీనిని తిరిగి ప్రకటించడం ఆవశ్యకమని నే ననుకొంటూ ఉన్నసమయంలో శ్రీ వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రులవారు ప్రకటననుగురించి ప్రస్తావించి దానిభారం దయతో అంగీకరించారు. అందుకు వారికి అనేకనమస్కృతు లర్పిస్తున్నాను. అచ్చుచిత్తులు దిద్ది పంపడానికి జరిగిన ఆలస్యాన్ని సహించడంలో శ్రీ వావిళ్ల ముద్రాశాలాధికారులు చూపినక్షమకు దయకు నేను కృతజ్ఞతాబద్ధుడ నని విన్నవిస్తున్నాను.

ఈ ద్వితీయభూమికను సిద్ధపరచడంలో నాకు తోడ్పడిన విద్యార్థుల్లో శ్రీమార్ ఆలంపూరు కృష్ణస్వామి బి. యే., శ్రీమార్ కొమరవోలు చంద్రశేఖరమంత్రి శ్రీమార్ మదనగోపాల్, ముఖ్యంగా గణించదగినవారు. కుశాగ్రబుద్ధి, విద్యాపరతంత్రుడు అయిన శ్రీమార్ కృష్ణస్వామి దీని సమాప్తి చూడకముందే కథాశేషు డయినందుకు మిక్కిలి చింతపడుతున్నాను. తత్కృతమయిన రఘువంశైకదేశానువాదం శ్రీమార్ చంద్రశేఖరమంత్రి సమాహరించిన లక్ష్యఖండంలో ప్రకటితం. కృష్ణస్వామిమృతివల్ల సేవాపరతంత్రుల్లో, విజ్ఞానోజ్జీవనాభిలాషుల్లో ఒకరిని తెలుగుదేశం కోలుపోయింది. ఈసందర్భంలో ఉపకరించిన శ్రీమార్ గుణభూషణ, బి. యే, సుదర్శనలాల్, చలపతి

మొదలైన తక్కిన విద్యార్థులను మిత్రులను సక్తితో స్మరిస్తున్నాను. లేఖనాదుల్లో, అందులో ముఖ్యంగా అనారోగ్యదశల్లో ఈ విజ్ఞాన కాంతులతోడ్పాటు లేకుండా యీ ద్వితీయప్రకటనం ఇంతత్వరలో ముగిసివుండేది కాదు. కనుక, కార్యసిద్ధి హేతువుల్లో వీరి వ్యాపృతి ప్రధానమైనదని నేనెప్పుడూ అత్యంతం అనురక్తితో భావిస్తుంటాను.

చెన్నపట్టణం,
కII 5038, వైశాఖ బII పంII ఆదివారం.

ఉమాకాన్తుడు.

## Preface to the 2nd Edition.

Palnati Veeracharitra is the history of the fratricidal war, that took place during the latter part of the 42nd century Kali Era (12th century A. D.) between two princes of the Hyhaya family that had migrated into Palnad from Chedi, throwing side lights on the great socialistic movement led by Brahma Naidu, supposed to be the ancestor of the family of the Maharajah of Venkatagiri. The Chapakudu of Palnad heroes mentioned by the author of Kreedabhiramam may be taken as something like cosmopolitan dinner of the present day. The army of Brahma Naidu includes people from all classes irrespective of caste, from Brahmin to Panchama. Kannama, a Panchama hero considered as the son of Brahma Naidu, has a temple at Karampudi even to this day. The ballad also gives an account of the heroism of our people of those ages and also their religious readiness to lay down even their lives at the call of what they considered their Dharma. The military prowess which shone with splendour in Brahma Naidu and Balachandra eight hundred years ago at Karyamapudi again manifested itself in their distant kinsmen, the Velama heroes of Bobbili like Vengalaraya.

**Palnati Veera Charitra.**

Palnati Veera Charitra may be considered as an important, original Telugu work fulfilling a few of the conditions of an epic poem. (महाप्रबन्ध) The subject matter viewed as a whole from Gurzala Kodipor to the end is extensive and grand with some episodes, and the characters also are to some extent varied in type. Mallidevaraj and

his opponent Nalagamaraj are inactive heroes like Chandragupta of Mudrarakshasa, and Indian literary critics name such a hero as सचिवायत्तसिद्धिः (one whose purpose is achieved by his assistants). Anapotu, Balachandra, Brahma Nayudu, Alaraju, Perneedu and Kommaraj are all noble heroes for whom life was not an end in itself but only a means to Dharma to which it could be sacrificed if necessary at any moment. Of them Brahma Nayudu is treated as an incarnation of Vishnu but his human side is more prominent throughout the poem. His rebuke of his son for having shown the back to the battlefied, is befitting a true Indian hero. The female characters also are chaste and heroic. Rekhamba's pursuasion of her daughter not to prevent Balachandra from marching to battlefield, and Manchala's blessing to her husband when handing over the sword to him, cannot but stand before us for all time as noble examples of Indian womanhood. Rathnala Peridevi, reproaching her father for his wicked act and performing Sahagamana with her husband shows the high phase of the life of a Hindu wife. Nayakuralu is the abode of evil like Satan in Paradise Lost, Ravana in Ramayana and Sakuni in Mahabharata. Inspite of her vicious nature, she is represented here and there as a thoughtful diplomat and her negotiations for peace before the commencement of war show her diplomacy. It is the misfortune of great heroes to have a rival in women. Brahma Naidu had it. Bhishma actually withdrew from the field at the sight of Sikhandi. Brahma Naidu avoided Nayakural in battle in accordance with the Indian military traditions. In places of heroism the author rises to the occasion, and exhibits high fervour as in the dialogue between Balachandra and his parents and his other speeches.

He shows some tendency and also skill for portraying scenes of awe as Kannama's midnight visit to the battle field and the ecstasy of the devils during the night after the close of the war. In other situations he is quite common-place, and does not rise above the ordinary level. Setting aside the waste trash such as పరగ, సరగున, చయ్యన, ఒయ్యన, the narration is on the whole impressive and in some places vigorous.

As in Mahabharata, the end is disastrous to both parties and the predominant Rasa may be taken as Shanta, the auxiliary Rasas being Veera, Karuna etc. Unlike other classics, Palnati Veera Charitra is written in one continuous Dwipadee metre and in one strain.

Palnati Veera Charitra is deficient in graphic descriptions of even relevant naturesceneries in their picturesqueness and grandeur as in Ramayana, Mahabharata, Kumarasambhava etc. It also lacks in conversational or non-conversational utterances of importance like Ajavilapa in Raghuvamsa.

Palnati Veera Charitra cannot claim a very high place from a literary point of view according to the *canons* of advanced literary criticism. When I say that, I do not mean that it is inferior to other Telugu works. It is as good as any other Telugu work. It is even superior to many of them. I only intend to point out that it is not an exception to the general order of Telugu works, and does not exhibit any extraordinary high merit.

### Telugu works and Palnati Veera Charitra.

Before actually taking up Palnati Veera Charitra, I shall mention briefly some points about the general state of Telugu works. Telugu literature began with Puranic

briefs and other such things. Later, some other works of the Manu and Vasu Charitra type and similar productions sprang up.

Translations are mutilated and deformed, and important poetic details are left off. Srinadha's Nishadha belongs to the same group. Palnati Veera Charitra too as said before is not of high literary excellence. Either in bringing out striking situations or in expressing illuminating and lofty sentiments, its author does not generally rise above the ordinary level. As will be shown presently, it was intended for the lower order of people as other Telugu works. Aswaghosha's Buddha Charitra, though history, is of a far superior poetic interest.

In ancient and mediaeval times, Telugu was not the medium of instruction in the higher courses of study. All higher learning was received through Sanskrit, and Sanskrit was the cultural language of the country. Great scholars did not choose to write in Telugu on cultural subjects in several departments of knowledge, including literary criticisms. Telugu was thus relegated to an unimportant position, and had no place in academical courses. This backward position was not special to Telugu. It was common with all the Prakrit languages. The characters to whom Prakrit is allotted in Sanskrit Drama also to some extent indicate the position which they held in the academic circles. Perhaps, Pali, which was raised to the dignity of cultural and religious language by Bhagavan Buddha, was an exception to the general order of Prakrits. It is truly said that Tamil holds the same place in Southern India as Pali in the North. But the champions of Vedic culture had not recognised Buddha's step and had not allowed Pali to take the place of Sanskrit. Even Tamil which rose up as an

ally and not as an enemy was not looked upon with favour by them. Some of them went even a step further, and prohibited the adaptation of Vernacular words into Sanskrit and denounced them as incorrect. So says Nagesa, the great Grammarian, in his Manjusha,

देशभाषानुसारेण कृतानां कुञ्चीमञ्ची आप्यकोण्डेत्यादि नाम्नामसाधुत्वमेव [वै.सि.म.] (Substantives formed according to the Vernaculars like 'Kunchi' 'Manchi' and 'Apyakonda' are verily incorrect.)

The progress of Pali stopped with the decay of Buddhism. The other non-religious Vernaculars of India were in their undeveloped condition, and Telugu was one of them. Leaving aside the departments of learning, in poetry, Prakrits made same mark, though mostly in love sentiment. Men of cultural attainments wrote original works in Prakrits some of which drew the attention of great scholars like Bana, and provided examples for the celebrated literary critics like Anandavardhana in their treatment of poetic charm.

As Prakrits were taken up by such eminent scholars, even original Prakrit dramas, transgressing in some details some of the Sanskrit Dramatic conventions, rose up like the Karpuramanjari of Rajasekhara which is now available. But even in this field, Telugu did not emerge out of its infant state on account of the crudeness of its verse and also other causes which will be explained below. Telugu works were intended for people of a lower status who had not access to the treasures of Sanskrit lore. They were intended to give an idea of the Puranas to the lower order of people for the guidance of their social and religious conduct. The leaving out of Bhagavadgita and other important portions by the translators of Mahabharatha ; the avoidance of writing Dramas, the highest form of poetry according to

Indian tradition and original poems and sastraic works in Telugu by famous scholars like Sreenatha, under the patronage of Ruling chiefs like Komati Vema Reddy, Kataya Vema and Kumaragiri Reddy who were themselves outstanding men of letters and commentators on classical works; and the very mutilated forms of translations like Telugu Naishadha, seem definitely to point out to the above fact. I do not propose here to enter into a detailed discussion on the additions and contractions in Mahabharata, writings of authors like Vemana and Pingali Suranna, the works of Manu and Vasu charitra type which do not generally present high thought or subtler feelings of human heart or relevant imagery of endless charam. I do not also give a full account of how these Telugu works and poems are not useful even to the lower type of people and how they misguide the intermediate class of quacks. The misfortune of Telugu always stands strikingly before my eyes whenever I ponder over the fact that a person like Ahobala Pandita, deeply interested in Telugu, had to leave some of his extremely valuable writings in Sanskrit only.

Perhaps such measures were the attempts, though unsuccessful, of people like him to attract real scholars to Telugu. Whatever it may be, it is plain that Telugu was not the medium of higher culture, and that Telugu works were intended only for people of inferior order. Ahobala Panditha, the commentator of Andhrasabda Chinthamani, in his scholarly discussion on Telugu observes thus.

"संस्कृतपुराणपठनाक्षमाणां तच्छ्रवणेऽप्यलालसानां मुमुक्षूणां शूद्रादीनां प्राधान्येन ज्ञानोपयोगीन्यान्ध्रपुराणानि भवन्त्येवेति"

(The Telugu Puranic works are essentially useful to Sudras etc., who aspire for liberation (Moksha) and who

are not capable of reading Sanskrit Puranas and who are not anxious even to hear them)

The situation has not altered after the advent of the Madras University.

English has taken the place of Sanskrit. On the one hand, the majority of educated Telugus have been cut off from touch with Sanskrit in which the invaluable treasures of Indian culture are stored up. On the other hand, they have not been able to properly assimilate alien culture, the customs, traditions and sentiments being different in many respects. To-day the majority of educated people in the Telugu country receive higher education through English, and some still through Sanskrit.

For further details on this topic my preface to Kavya-prakasa may be consulted. Then I come to scholars. Mature thinkers of the stamp of Sir S. Radhakrishna do not choose or try to express their thoughts in Telugu. This is evidently due to the fact that Telugu has no proper place in the realm of higher culture or thought at present. It is not the medium of higher education in collegiate courses in the Madras or Andhra University, and all higher knowledge is received, and imparted through English and also Sanskrit though in a limited atmosphere. Our ancients though great scholars, did not give us valuable works in Telugu as they intended Telugu only for the lower order of people. Our present authors, equipped with the study of the trivial works of ancients, are capable only of producing similar or still more trivial works in Telugu. Perhaps the majority of our present Telugu writers are the worst sinners in India today in using quack Sanskrit. This guess language always reminds me of the famous story of the Sanskrit of the crack-brained daughter-in-law of a Somapeethin.

"స్వస్తిశ్రీ శకవర్షంబులు ౧౦౭౭ అగునేటి విషుసంక్రాంతినిమిత్తమున పలనాడు మహీమండలమండనంబైన దామలూరివిభుండును............చతుర్థవంశతిలకుండును శ్రీమన్మహామండలేశ్వర కుళోత్తుంగచోడ గొంకమహేశ్వరపదారాధకుండునైన కొమ్మ నాయకుండు............

श्लो॥ अस्तिस्वस्तिमदग्रहारनगरग्रामै स्समग्रश्रिया
जुष्टः, पुष्टजनो.........

………पलनाड्डुनामवोषयो………
शाकाब्दे मुनिशैलखेन्दुगणिते श्रीधान्यवाटीपुरे'

కార్యమపూడి వీరాయములోఁ దూర్పువైపుబండమీఁది నల్లాంచక్రవర్తులశాసనమునందు "పలినాటివారు" అని వ్రాయఁబడియున్నది. పలినా డనునది పలనాడు యొక్క వికృతరూపమే కాని వేఱొండు కాదు. తనకంటె బూర్వులు గ్రంథములయందును శాసనములయందును "బలనాడు" "పల్నాడు" అని ప్రయోగించియుండ

గీ. "పల్లెనాటను నూటతొంబదియు నాల్గు
గ్రామముల నీడుగానక కామనూరి
వెంగనార్యుఁడు వేదవేదాంగములను
బ్రస్తుతికినెక్కె మాఱుట బ్రహ్మయనఁగ." (అప్ప)

అను పద్యమున నప్పకవి ప్రాకృతజనచోచ్చారణిం బల్లెనాడని చెప్పుట ప్రామాదికము. వీనినన్నింటినిఁ బట్టిచూడ "పలునాడు" అనునది యథార్థనామమనియు "పలనాడు" "పల్నాడు" అనురూపములు వ్యవహారమున రూఢములైనవనియు స్పష్టమగుచున్నది. గ్రంథవిస్తరభీతిచేఁ బల్నాటివిషయ మింతటితో ముగించి ప్రస్తుతవిషయ వీరచరిత్రమునకు వచ్చెదను. వీరులనఁగా నెవరు? యుద్ధముచేయువారు మాత్రమే వీరులు కారు. ఎవ్వరి సంకల్పము లమోఘంబులో, ఎవ్వరి చరిత్రములు కర్మమార్గప్రదర్శకంబులో, ఎవ్వరి వచనంబులు మానవుల నాకర్షించి జీవితపరమార్థంబైన చిత్తవిశ్రాంతి యొసఁగుచున్నవో, యెవ్వరి నిశ్చంచలమనోవృత్తిచేఁ లోకములందలి మహాకార్యములన్నియుఁ గావింపఁబడినవో, ఎవ్వరియందుఁ బరమాత్మ పరిపూర్ణతను సమీపించియుండునో యా భగవదంశసంభూతులందఱు వీరులే నని వ్యాఖ్యచేయవచ్చును. సత్యసంధుండై గురుభక్తిపరాయణుండై సమరరంగంబుల నసమానపరాక్రమశాలియైన భీష్ముఁడు వీరుఁడు. నిశ్చల సంకల్పుఁడై, యమోఘబాణుండై నిజనామసంచకితశాత్రవబలుం డైన బ్రహ్మనాయుఁడు వీరుఁడు. తత్వరహస్యంబుల బోధించి కుమతఖండనంబు గావించి జగద్గురువనం బ్రఖ్యాతిఁగాంచి నిఖిల జనవందనీయుండైన శంకరుండు వీరుఁడు. అనేకవిధంబులఁ గాలవశంబున వీరు లచ్చటచ్చటఁ బొడకట్టుచుందురు. ఏ దేశమందీ పూజ్యులు జన్మించినను జనులు వారి నసాధారణులుగ భావించుచున్నారు. వారి నామములు పవిత్రములుగ స్మరింపఁబడుచున్నవి. వారి సంకల్పములు కార్యరూపములుగఁ బరిణమించి శాశ్వతమై యున్నవి. వారి వచనంబులు జనుల కర్ణంబులందు

ఘంటానాదమై మ్రోఁగుచున్నవి. కవు లీ మహానుభావుల చరిత్రముల గానముచేసి యున్నారు. శిల్పు లీ పరమగురువుల ప్రతిమల శిలలపైఁ జెక్కియున్నారు. చిత్రకారు లీ పుణ్యపురుషుల యాకారమును మనోజ్ఞవర్ణములతో లిఖించియున్నారు. వారు మాటలాడుట చాలించియుఁ జాలించినవారు కారు. బోధించుట మానియు మానినవారు కారు. లోకమును విడిచియు విడిచినవారు కారు. మన కథానాయకులగు పలనాటివీరు లుత్తరదేశమునఁ దమ నివాసము వదలి దక్షిణాపథమునకు వచ్చి పల్నాటి సీమను శ్వశురదత్తమును స్వాధీనము చేసికొని యచ్చటనే స్థిరపడిరి. అప్పటినుండి వారు పల్నాటివారని పేర్కొనఁబడుచుండిరి. వీరు పలనాటి సీమరాజ్యభారము నిర్వహించుచుండిరి. ప్రజలసౌఖ్యమునకై యెక్కువగాఁ బాటుపడిరి. ఇప్పటికిని వీరు నిర్మించిన పట్టణములు గలవు; త్రవ్వించిన తటాకములు గలవు; కట్టించిన దేవాలయములు గలవు; కావించిన కోటలు గలవు. జనుల మతనాగరకతల యందు వీరివలనఁ బెక్కుమార్పులు కలిగినవి. వీరు కొద్దికాలము మాత్రమే రాజ్యము చేసిరి. ఈ కొద్దికాలములోనే జనులయొక్క విశ్వాసమునకు గౌరవమునకుఁ బ్రేమకుఁ బాత్రులై రామరాజ్యముగఁ బ్రభుత్వము చేసి సపత్నీపుత్రులకు సంభవించిన ఘోరయుద్ధంబున నసమాన పరాక్రమంబు నమానుషశౌర్యంబు నశ్రుతపూర్వధైర్యంబు కనఁబఱచి రణమొనరించి ఒకరినొకరు పరిమాణ్యమని మానవాతీతులని జనులచే భావింపఁబడిరి. మహామహులఁ జూచినప్పుడుగాని వారినిఁగుఱించి వినినప్పుడుగాని తనబుద్ధి కగోచరంబైన యొకశక్తి వారియందుఁ గలదని యెంచి పరమోత్కృష్టులుగఁ దలంచుట మానవునికి సహజము. వీరి నారాధించుట కాలయములు నెలకొల్పఁబడినవి. వీరి యాకారములు శిలలమీదఁ జెక్కఁబడినవి. వీరి నామములకు జ్ఞాపకముగా బ్రతిసంవత్సరము గొప్పయుత్సవములు జరుగుచున్నవి. కులమతభేదములు లేక జనులందఱు వీరి నర్చించుచున్నారు. ప్రస్తుతము కార్యమపూడిలోనున్న వీరాలయ మొక మహమ్మదీయునిచేఁ గట్టఁబడినట్లీ క్రిందివృత్తాంతము చెప్పుదురు. మహమ్మదీయుల కాలమున నొక గొప్పసైన్యము దక్షిణమునుండి హైదరాబాదునకుఁ బోవుచు కార్యమపూడిలో నాగు లేటియొడ్డున విడిసి యచ్చటనున్న వీరులలింగంబులు పొయిగడ్డలుగఁ జేసి యన్నము వండికొనఁగా సైన్యమంతయు సర్పదష్టమై మూర్ఛిలుభంగి నేలకు వ్రాలెనఁట. అప్పుడు సేనాధిపతి యేమితోఁపక నివ్వెఱపడియుండ నొక బ్రాహ్మణుఁ డా మార్గమునఁ బోవుచు నిదియేమని యడిగెనఁట. అతఁడంతయు సవిస్తరముగఁ జెప్పిన మీఁద దీనికిఁ గారణము వీరుల కపచారము చేయుటయే యనియు వారి కాలయము కట్టించెదనని మ్రొక్కినచో సైన్యము తత్క్షణమే లేచుననియుఁ జెప్పి కొంతదూర మేగి

యదృశ్యుండయ్యెనఁట. ఆ తురుష్కుఁ డాపదలోనున్నవాఁడు గాన నట్లే మ్రొక్కఁగా సైనికులు నిద్రవోయి మేల్కాంచినట్లు లేచిరఁట. అంతట నతఁడు లింగములకు గుడి కట్టించి వీరులయం దత్యంతభక్తికలవాఁడయి వారి యమానుషశౌర్యపరాక్రమము లోకనాఁడు వినవిన నతనికి నతని తమ్మునికి నావేశము కలిగి యొఱలలోనుండి కత్తులు దూసి నిర్భరోద్రేకంబునఁ బొడిచికొని ప్రాణములు విడువ నా సోదరశవముల వీరాలయములోనే పాతిపెట్టిరఁట. దీనిలో గొంత సత్యముండక మానదు. వారిగోరీ లిప్పటికిఁ జెడకుండ నున్నవి. ఈ తురుష్కవీరులకుఁగూడఁ బల్నాటివీరులతోఁబాటు పూజలు జరుగుచున్నవి. తురుష్కుం డననేల? పంచమకుల సంజాతుఁడైన యొక వీరునికిఁ బ్రత్యేకముగా వీరాలయములో గుడి నిర్మింపఁబడియున్నది. ఆహా! ఎంత శౌర్యము! ఎంత పరాక్రమము! ఎంత నిష్కళంకత! నిరుపమాన తేజోవిభాసితులై, యవ్యాజమనోవిరాజితులై నిజధర్మపథానుసారులగు పుణ్యపురుషు లేకులమున జన్మించిన నేమి? ఏ దేశమునఁ బ్రభవించిన నేమి? సర్వజన పూజనీయులు. ఒక్కపల్నాటిసీమవారు మాత్రమే కాక యాంధ్రదేశముయొక్క నానాభాగములనుండి వేలకొలఁది జనులు ప్రతిసంవత్సరము వీరోత్సవమునకుఁ గార్యమపూడికి వచ్చుచున్నారు. కాని రానురాను జనులు వారివిగ్రహములకుఁ బూజచేసి వారినిఁ గేవలము దేవతలని భావించుచున్నారు. ఇప్పు డనేకులు తమకు జబ్బులు వచ్చినప్పుడుగాని యాపదలు సంభవించినప్పుడుగాని ఇతరదైవములకు వలె వీరులకు మ్రొక్కి కడగండ్లు గడచినచో ముడుపులు చెల్లించుచున్నారు. శుభకార్యములలో వీరుల నారాధించుచున్నారు. వీరపూజ లోక ముండునంతకాల ముండునదియే పోవునది కాదు. జ్ఞానము హెచ్చినకొలఁది మహాపురుషులయందు గౌరవము హెచ్చుచుండును. ఆధ్యాత్మికముగఁ దనకంటె నధికుని మహాత్ముని గారవించుటకంటె మానవునకు ఉత్తమగుణము మఱియొకటి యుండనేరదు. ఈ విషయమింతటితో ముగించి యిఁక ఇతిహాసాంశములఁ జర్చించెదను. కథలోఁ జెప్పఁబడినట్లుత్తరదేశమునుండి పలనాటికివచ్చిన రాజు "అనుగురాజు." ఈతఁడు ప్రబలసైన్యసమేతుఁడై దక్షిణాపథమునకు వచ్చెను. ఈయన కార్తవీర్యార్జునుని వంశస్థుఁడని చెప్పఁబడినది. కార్తవీర్యుఁడు హైహయ వంశసంజాతుఁడు. ఈ వంశపురాజులు హైయహయులని చెప్పఁబడుదురు. కనుక ననుగురాజు హైహయుఁడే యగును. నాకు లభించిన వీరచరిత్ర తాళపత్ర సంపుటముయొక్క ప్రథమభాగములో ననుగురాజు వంశక్రమ మీక్రిందివిధమున నున్నది.




ఇది వీరకామేంద్రునివఱకు సరిగాలేదు. ఈ వంశక్రమమునకును ముదిగొండ వీరభద్రుని పద్యగ్రంథములోని వంశక్రమమునకును భేద మగపడుచున్నది. అనుగురాజు సుందర చక్రవర్తికొడుకని వీరభద్రుఁడు చెప్పినాఁడు. అనుగురాజు పుత్రుని పేరు వీరకామేంద్రుఁడు. సాధారణముగఁ దాతపేరు మనుమనికిఁ బెట్టుచుండుదురు. కావున ననుగురాజు తండ్రి పేరు వీరభద్రుఁడు చెప్పినట్లు సుందరచక్రవర్తికాక వీరకామేంద్రుఁ డేయై యుండవలయును. అనుగురా జుత్తరదేశమునుండి వచ్చెనని చెప్పియుంటిమి.

అది యేదేశమో విచారింపవలసియున్నది. ఇతఁ డుత్తరదేశములో స్వరాజ్యము విడిచి వచ్చెనని వీరచరిత్ర ప్రథమభాగములోని యీక్రింది వాక్యములవలనఁ దెలియుచున్నది.

ద్వి. "ఒగినన్గుభూపు డయోధ్యపాలుండు
తమతాత చేసిన తగుపాతకముల
పో గొట్టవలెనని పొందుగా దలచి
ఉత్తరాదినినుండి ఉర్వీశు డపుడు
ఘనదక్షిణాదికి గదలెదువేళ."

ఇందులో నయోధ్యపాలుఁడనియున్నందువలన నితఁడయోధ్యదేశము నేలినవాఁడని భ్రమ కలుగుచున్నది గాని వీరచరిత్రము సాకల్యముగఁ జదివినచో నీ భ్రమ పోవును. ఇతని రాజధాని పాలమాచాపురి. దీనికి జంభన్నాపురియని నామాంతరము. ఉత్తరదేశములనుండి వచ్చినరాజుల నయోధ్యరాజులని చెప్పుట మనవారికి వాడుకగా నుండినట్లు తోఁచుచున్నది. చాళుక్యులుకూడ నయోధ్యరాజులనియే యొకచోటఁ జెప్పఁబడినది. అనుగురాజు కార్తవీర్యుని వంశమువాఁడని యిదివఱకే తెల్పియుంటిని. ఈ వంశమువారికి హైహయులని పేరు. హైహయు లేదేశపురాజులో చూతము. ఈ హైహయులు క్రీ॥ శ॥ 12-వ శతాబ్ద్యంతమువఱకు రాజ్యముచేసినట్లు శిలాశాసనములవలనఁ దెలియుచున్నది. మిర్జాపురమునకుఁ బోవురోడ్డుసమీపమున బిల్వారివద్ద హైహయుల శాసనమొకటి పరిశోధకులచే కనుఁగొనఁబడెను. ఇది యొకరాతిమీదఁ జెక్కఁబడి 84 సంస్కృతశ్లోకములతో నున్నది. వీనిలోఁ గొన్ని స్రగ్ధరలు, శార్దూలములు మఱి వివిధవృత్తములు గలవు. శాసనమంతయు నుదాహరించినచో నిదియే యొక చిన్న గ్రంథమగును గాన మనకుఁ గావలసిన ముఖ్యాంశముల మాత్రము దెలిపెదను.

... ... ... ...
... ... ... ...

सोयं सोमाभिधानस्तिलकयतिकळामौळिमस्यैव शम्भो
रस्मादेव प्रवृत्तः किमपरमप्यन्वयो हैहयानां ॥

8. अस्मिंश्च वन्द्यतमताङ्गमिते बुधाद्यै
राद्यैर्नृपै र्नृपति रर्जुनइत्युदारः।
आसीद्विषद्विपिनकर्तनकीर्तनीय
कीर्तिच्छटाच्छुरितदीर्घदिगन्तराळः ॥

55. किंस्तूयतेऽसौ मुनिपुङ्गवोऽथवा
श्रीचेदिचन्द्रो नृपतिः कृतादरः।
सद्वृत्तभूपप्रहितैरुपायनैः
प्रदर्श्य भक्तिं विधिना निनाय यम्॥

58. अथ स विहितकृत्यश्चेदिनाथः समर्थः
... ... ... ...
दिशमतिशयरम्यां सम्प्रतस्थे प्रतीचीं
अहितजनितभीति दुर्निवारप्रचारः॥

69. यस्योत्तुङ्गगजेन्द्रमज्जनगळद्दानाम्बुभिर्मिश्रितं
रेवावारिविविक्ततिक्तमुचितस्नानेन तन्वीजनः।
... ... ... ... ...
सर्वाङ्गं स्मरसौरभेण महता निर्व्याजमायोजितः॥"(इं. आ)

శాసనము పూర్తిగ నుదాహరించిన జదువరులకు విషయములు బాగుగ విశదమవునుగాని గ్రంథవిస్తరభీతిచే నింతటితోఁ జాలించితి. ఈ శాసనములో హైహయ వంశస్థుఁడైన యువరాజ దేవుని వంశానుక్రమణిక కోకల్లునివద్దనుండి చెప్పఁబడినది. రెండియుఁ గోకల్లుఁడు మొదలు యువరాజదేవునివఱకు వారికార్యములు పరాక్రమములు వర్ణింపఁబడినవి. 55-వ శ్లోకములోఁ జేదిరాజు కృతాదరుఁడై హృదయశివుఁడను మునికిఁ గానుకలిచ్చినట్లు చెప్పఁబడినది. "**श्रीचेदिचन्द्रो नृपतिः**" అనునది యువరాజు దేవుని తాతయైన కేయూరవర్షుని కన్వయించును. ఇచ్చటఁ జేదిచంద్రుఁ డనగాఁ గేయూరవర్షుఁడే. 58-వ శ్లోకములో యువరాజదేవుని తండ్రియైన లక్ష్మణుఁడు ససైన్యముగఁ బశ్చిమదిక్కునకేగెనని యున్నది. ఈ శ్లోకములోనే లక్ష్మణునికిఁ 'చేదినాథః' యను విశేషణము చేర్పఁబడినది. దీనివలన హైహయులు రాజ్యముచేసినది చేది దేశమయినట్లు స్పష్టపడును. ఈ హైహయులదే మఱియొక శాసనము 'కరంబేలు' (Karambel) అను గ్రామమువద్ద దొరకినది. ఇదియు సంస్కృతశాసనమే. దీనిలోను 44 శ్లోకములు నొకపెద్ద గద్యముగలదు. దీనినిఁగూడఁ బూర్తిగ నుదాహరింపఁజాలక యచ్చటచ్చట ముఖ్యాంశముల వివరించుచున్నాఁడ.

5. श्लो॥ हेलागृहीतपुनरुक्तसमस्तशक्तो
गोत्रे जयत्यधिकमस्य स कार्तवीर्यः।
अत्रैव हैहयनृपान्वयपूर्वपुंसि
राजेतिनाम शशलक्ष्मणि चक्रमे यः॥

7. तस्यान्वये नयवतां प्रवरो नरेन्द्रः
आसीन्मदान्धनृपगन्धगजाधिराज
निर्माथकेसरियुवा युवराजदेवः ॥

25. रमणगुणनिकेतः केतनं मङ्गलानां
प्रचुरतरयशोभिःशोभितस्तत्तनूजः ।
नृपतिरवनिभानुर्विश्वविश्रान्तभानु-
र्जयति विजयसिंहः संहतारातिसिंहः ॥

स च परमभट्टारक महाराजाधिराजपरमेश्वर श्रीवामदेवपादानुध्याता परमभट्टारक महाराजाधिराज परमेश्वर परममाहेश्वर त्रिकलिङ्गाधिपति निजभुजोपार्जिताश्वपति गजपति नरपति राजत्रयाधिपति श्रीमद्विजयसिंहदेवपते विजयिनः महाराज्ञो श्रीमहाकुमार श्रीअजयसिंहदेव महामन्त्रिशैवाचार्य भट्टारक श्रीमद्राजगुरु विद्यादेव महापुरोहित पण्डित श्रीयज्ञधरधर्मप्रधान महामात्यठक्कुर श्रीकीकोमहाक्षपटलिक महाप्रधानार्थलेखी-ठक्कुर श्रीदशमूलिकवत्सराज महासान्धिविग्रहठक्कुर श्रीपुरुषोत्तममहाप्रतीहार दुष्टसाध्य-चराध्यक्ष भाण्डारिक प्रवात्ववार अश्वसाधनक इत्येतानन्यांश्च प्रदास्यमानग्रामनिवासि जनपदांश्च आहूय यथार्हमानयति बोधयति समाज्ञापयति च यथा विदितमस्तु भवतां संवत् ९३२ श्रीमत्तिपुर्यां …… नर्मदायां विधिवत् स्नात्वा श्रीमहादेवं समभ्यर्च्य मातापित्रोरात्मनश्च पुण्ययशोभिवृद्धये साम्बलापत्तलायां चोरलायाग्रामः……………… सावर्ण्यगोत्राय भार्गवच्यावन आप्नवान और्वजामदग्न्येति पञ्चप्रवराय छन्दोमशाखिने पण्डितश्रीजनार्दनप्रपौत्राय पण्डितश्रीसूल्हणपौत्राय पण्डितश्रिछिक्कूपुत्राय पण्डित श्रीसोढ-शर्मणे ब्राह्मणाय उदकपूर्वकत्वेन शासनीकृत्य अस्मदभ्यनुज्ञया मातृश्रीकोसलदेव्या प्रदत्तः ॥(इं. आ)

44. श्लो. आम्यदरस्य पौत्रेण श्रीधर्मस्यसूनुना ।
लिखितं वत्सराजेन चेदीशदशमूलिना ॥

ఈ శాసనమునందు హైహాయసంజాతుఁడైన విజయసింహుని వంశవృత్తము యువరాజదేవునివద్దనుండి వర్ణింపఁబడినది. ఈయువరాజదేవుఁడు వెనుకటి శాసనములోని యువరాజదేవుఁడేయై యుండవచ్చును. శాసనమందలి సంస్కృతగద్యములో విజయసింహుఁడు తనదశమూలియైన వత్సరాజు మొదలగు వారలఁ బిలిపించి దానకాలమున బోధించి యాజ్ఞాపించినట్లు వ్రాయఁబడినది. 44-వ శ్లోకములో వత్సరాజునకుఁ '**चेदीशदशमूलिना**' యను విశేషణము చేర్పఁబడినది. వత్సరాజు విజయసింహుని దశమూలి. '**चेदीशमूलिना**' యని వత్సరాజునకు విశేషణముంచుటవలన విజయసింహుఁడు చేదీశుఁడైనట్లు విశదమగుచున్నది. విజయసింహుఁడు హైహాయుఁడు గాన

హైహయులు చేదీశులని నిర్ణయింపవలయును. స్మిత్ గారు తమ పూర్వహిందూదేశ చరిత్రలో 351-వ పుటయం దిట్లు వ్రాయుచున్నారు:—"The Kalachuri or Haihaya Rajas of Chedi are last mentioned in an inscription of the year 1181 A. D. and the manner of their disappearance is not exactly known (చేదీశులగు కలచూరి లేక హైహయ రాజులు క్రీ॥ శ॥ 1181-వ సంవత్సర శాసనమునం గడసారి యుదాహరింపఁబడి యున్నారు. వీరెట్లు నశించిరని సరిగాఁ దెలియదు)" ఈవాక్యములలో స్మిత్తుగారును హైహయులు చేదీశులనియే చెప్పిరి. ఇంకఁ జాల నిదర్శనములు గలవు గాని యివి చాలునని యెంచి హైహయులు చేదీశులేయని స్పష్టముచేసికొని చేదిదేశ మెచ్చటిదో వివరించెదను. చేదిస్థలనిర్దేశమున కీ శాసనములయందే కొన్ని యాధారములు కాన్పించుచున్నవి. మొదటిశాసనముయొక్క 69-వ శ్లోకములో యువరాజదేవునిఁగూర్చి "ఎవ్వని యుత్తుంగగజేంద్రములు మజ్జనము చేయుటవలన జారిన దానజలముతోఁ గూడి తిక్తమై వివిక్తమైన రేవా (నర్మదా) నదీనీరమును స్నానముచేయుటచేఁ బొంది తన్వీజనము నిర్వ్యాజముగ దేహమంతటను గొప్ప స్మరసౌరభముతోఁ గూడినదో" యని వర్ణింపఁబడినది. దీనినిఁబట్టిచూడ యువరాజదేవుఁడు రాజ్యముచేసినది నర్మదా నదీప్రాంతదేశమై యుండవలెనని తేలుచున్నది. మఱియు రెండవశాసనముయొక్క గద్యమునందు '**त्रिपुर्यां नर्मदायां स्नात्वा**' అని లిఖింపఁబడియున్నది. విజయసింహుఁడు దానమిచ్చుటకుముందు నర్మదానదియందు స్నానముచేసి నర్మదా నదీ జలమునే దాన కాలమున వాడినాడు. విజయసింహుఁడు రాజ్యముచేసినది త్రిపురిరాజధానిగాఁగల నర్మదానదీతీరదేశమేయని దీనినిఁబట్టి విశదమగుచున్నది. యువరాజదేవుఁడు విజయసింహుఁడు హైహయులే గావున నీరెండుశాసనములవలన హైహయులు రాజ్యము చేసినది నర్మదానదీప్రాంతదేశమే యని స్పష్టపడెననుటకు సందియములేదు. భాగవత నవమస్కంధములో కార్తవీర్యుడు నర్మదానదిలో జలక్రీడ సల్పినట్లుగలదు అది యితఁడాప్రాంతదేశమునే పరిపాలించుటను సూచించుచున్నది. ఇట్లు పురాణములవలనఁగూడ హైహయులు నర్మదానదీప్రాంతదేశమునే యేలినట్లు తెలియుచున్నది. మఱియు మనకుదొరకిన రెండు సంస్కృతశాసనములును నర్మదానదీ సమీపప్రదేశములలోనే కనుఁగొనఁబడినవి. మొదటిది నర్మదానదీ సమీపమున నున్న జబ్బల్పూరునకు 50 మైళ్ళదూరమున బిల్హారియను గ్రామమునందు మిర్జాపురమునకుఁ బోవు రోడ్డుపద్ద దొరకినది. రెండవదికూడ జబ్బల్పూరునకు దాపున "కరంబేలు" (Karanbel) అను గ్రామములోఁ గనుఁగొనఁబడినది. ఈ శాసనములచ్చుట నుండుట

హైహయులు నర్మదానదీప్రాంత దేశమును బాలించిరనుటకు నిదర్శనముగ నున్నది. చేదీశునిది కాకపోయినను జేదీశుఁడుదాహరింపఁబడినశాసనము నర్మదానదికుత్తరమున జబ్బల్పురమునకు దూరముగ గ్వాలియరులో భిల్సాకోటయందొకటి కనుఁగొనఁబడినది గాని దానినిఁగూడ నుదాహరించుట యనావశ్యకమని వదలుచున్నాను. ఈప్రబల దృష్టాంతము లన్నింటివలనను హైహయులు రాజ్యము చేసినది నర్మదానదీప్రాంత దేశమే యని నిర్ధారణచేయుట సంశయమేమియుఁ గానరాదు. హైహయ లేలినది చేది దేశమని యిదివఱకు స్పష్టపఱుపఁబడినది. కనుక నర్మదానదీప్రాంత దేశమే చేది దేశమని నిశ్శంకముగాఁ జెప్పవచ్చును. రెండవదియైన కరంబేలు శాసనముయొక్క గద్యములోని "సాంబల" జబ్బల్పురమనియే తోఁచుచున్నది. లేదా "సంబల్పూర్" అయియుండును. ఇదియు నాప్రాంతములోనిదే. ప్రస్తుతము జబ్బల్పురముజిల్లాలోఁ గొంతభాగమైనను జేది దేశముగా నుండునని విష్ణుపురాణమును భాషాంతరీకరించిన విల్సను (Wilson) గారు నుడివిరి. హూనుత్సాంగను చైనాయాత్రికుఁ డుజ్జయినినుండి చాల దూర(one thousand miles) మీశాన్యముగఁ బ్రయాణము చేసిన తరువాతఁ జేరిన ("Tchi-ki-to") అనునది చేది దేశమేయని కొందఱు పాశ్చాత్యపండితు లభిప్రాయపడియున్నారు. హూనుత్సాంగుయాత్రలను భాషాంతరీకరించిన జూల్లియన్ (Jullien) గారు "Tchi-ki-to"ను చిత్తూరని నిశ్చయించినారు గాని చిత్తూ రుజ్జయినికి వాయవ్యదిశనుండుటవలన నయ్యది ప్రామాదికమని యెంచవలయును. కొందరభిప్రాయములో "ప్రాచీనభూగోళ శాస్త్రచిత్రసంపుటము" (Atlas of Ancient Geography, classical and Biblical) అను గ్రంథములో హిందూదేశచిత్రమునందు జబ్బల్పురము చుట్టుప్రక్కలనున్న దేశమే దేది దేశముగాఁ గర్నలుయూలు (Colonel Yule) గారు లిఖించినారు. స్మిత్తుగారు తన అర్లి హిస్టరి ఆఫ్ ఇండియా (Early History of India) అను గ్రంథమున నిట్లు వ్రాసిరి:—

"And the extensive region to the south of Bandalkhand, which is now under the administration of the Chief Commissioner of Central provinces nearly corresponds with the old Kingdom of Chedi. (బండలు ఖండునకు దక్షిణమునఁ బ్రస్తుతము "మధ్యపరగణా"ల చీఫ్ కమిషనరు పరిపాలన క్రిందనున్న విశాలదేశము దాదాపుగఁ బూర్వపు చేదిరాజ్యమై యున్నది)." దీనినిఁబట్టి చూచినను జేది నర్మదాప్రాంత దేశమే యగుచున్నది. ఇట్లు ఐతిహాసకుల వచనములే కాక పైని నప్రతర్క్యములైన శిలాశాసన నిదర్శనములు చూపఁబడినవి. కావున నర్మదానదీ ప్రాంతమున జబ్బల్పురమును

బొట్టుకొని నాగపూరువఱకు వ్యాపించియున్న దేశమే చేదిదేశమని నిశ్చయింపవచ్చును. హైహయులు రాజ్యముచేసిన దీ దేశమే కనుకఁ దద్వంశస్థుఁడైన యనుగురాజు చేది దేశమునుండియే పలనాటికి వచ్చియుండవలయును. ఈతఁ డిచ్చటనుండి వచ్చెననుటకు వీరచరిత్రమునందు మఱియొకని దర్శనముగలదు. శ్రీనాథరచితమని చెప్పఁబడునట్టియు నాకు లభించినదియు నగు తాళపత్రగ్రంథమున

"ద్వి. కాశికి డెబ్బది యామడకనగ నయోధ్య
అచ్చటికి మఱియావలనున్న
యఱువదియామడగలదా కనకాద్రి
కనకజంభనాపురి ఘనమెట్లటన్న."

అని గణభంగముగల ద్విపదీపజ్తులయం దనుగురాజు పట్టణము జంభనాపురి యని చెప్పఁబడినది. జబ్బల్పురమే జంభనాపురియని యూహింపవచ్చును. ఊహయేల? ముదిగొండ వీరభద్రుఁడు వీరభాగవతమందు "కాంతాసహితంబుగా భల్లాతకి తైలార్ద్రవస్త్రంబులు కట్టికొని జబలాపురంబు చేరి" యనుచోట జబలాపురమని స్పష్టముగఁ జెప్పినాఁడు. కనుక ననుగురాజు పట్టణము జబ్బల్పురమేయై యుండును. హైహయుఁడైన యనుగురాజు పలనాటికి వచ్చినది చేదిదేశమునుండియే యని నిస్సందేహముగఁ జెప్పవచ్చును. ఇఁక వీరి కాలమునుగూర్చి యోచింతము. వీరొనర్చిన యుద్ధముయొక్క కాలమును నిర్ణయించినచో వీరికాలము తేలును గాన నాయుద్ధకాలమును మొదట నిశ్చయింపఁ గడగెదను. దీనికిఁ గొన్నియాధారములు వీరచరిత్రమునందే కలవు. బ్రహ్మనాయుఁడు వైష్ణవమతస్థుఁ డగుటయు, నీచజాతివారు కొందఱు వైష్ణవమత మవలంబించుటయు, శైవ వైష్ణవుల పరస్పరద్వేషములును,వీరచరిత్రయందుఁ గానవచ్చుటచేతఁ బలనాటివీరుల యుద్ధము రామానుజునిచే స్థాపింపఁబడిన వైష్ణవమతము వ్యాపించినతరువాతనే జరిగియుండవలయునని యెంచనగును. రామానుజుఁడు క్రీ॥ శ॥ 1017-వ సంవత్సరములోఁ బుట్టెనని తచ్చరిత్రకారుల అభిప్రాయము. కనుక నీయుద్ధము 11-వ శతాబ్దికి పూర్వము జరిగియుండనేరదు. ఇంతియకాదు, వీరచరిత్రలో నొకభాగమై నాకు లభించిన "అలరాజు రాయబారముకథ" గల తాళపత్రగ్రంథమున లక్షణరహిత ద్విపదులలో నీక్రిందివిధమున వ్రాయఁబడినది.

1. ద్వి. "విరజాజిమల్లెలు విభూతిపత్రి
లింగనికీరీతి పూజలుచేసి"

2. "లింగపూజలు చేసి నిజముగా దాను
విభూతిరేఖలు తిన్నగా దీర్చి"

అలరాజు భోజనము చేయుటకుఁ బూర్వము లింగపూజచేసినట్లును రాయబారమునకుఁ బోవుటకుముందు లింగపూజచేసి విభూతిరేఖలు దిద్దినట్లునుఁ బై ద్విపదీపద్యములు చెప్పుచున్నవి. మఱియు నా గ్రంథములోనే

ద్వి. "పిలుమనిజంగాల బిలిపించె రాజు
వచ్చిరి అప్పుడు పుణ్యజంగాలు
పసిడి పాత్రలవారు పదులఱువదులు
పెడమటము జంగాలు పెద్దల బిలిపించిరి"

అని యలరాజుతో నతనిభార్యయగు రత్నాలపేరాంబ సహగమనము చేయు పట్టున వ్రాయఁబడినది. వీనినిఁబట్టిచూడఁ బల్నాటి వీరుల యుద్ధకాలమునాఁటికి జంగము లుండిరనియు, లింగపూజలు ప్రబలినవనియు విశదమగుచున్నది. బాలచంద్ర యుద్ధముయొక్క 7-వ పుటలోని

"అందెల బసవన్న యాదినాథుండ
కరినంది బసవన్న కంచి వరదుడ"

అనుపద్యములును బై విషయమును స్థిరీకరించుచున్నవి. వీరచరిత్ర ప్రథమభాగమైన తాళపత్రగ్రంథమున నలరాజుతాత, శివశింగురాజుమీదికి యుద్ధమునకుఁ బోవునప్పుడీ క్రిందితీరున వర్ణింపఁబడినది.

ద్వి. "గుఱి శివనందుల కోటకు వారు
యుద్ధసన్నద్ధులై ఉర్వికంపింప
వారితోడనె కూడి వడియజంగాలు
నల్లబొంతలవారు నాలుగువేలు
ఎఱ్ఱబొంతలవార లెనుబదివేలు
... ... ... ...
వారిపేరులఁగొన్ని వరుస జెప్పెదను
మేడయ్యపడమటి మేటి బస్వయ్య
బోడశివయ్య బొబ్బోడి బుగ్గయ్య
... ... ... ...
కఱకంఠ లింగయ్య కల్యాణబసువ

అక్కయ్య కుక్కయ్య ఆదిమల్లయ్య
... ... ... ...
నిజలింగ చిక్కయ్య నీలకంఠయ్య
ఉరమున లింగాలు మెఱసెడువారు
గళముల రుద్రాక్ష గలిగినవారు.”

పల్నాటి వీరుల యుద్ధకాలమునాటికి జంగములు ప్రబలముగా నుండిరనుట కింతకంటె విశ్వసనీయ సాక్ష్యము వేఱొండేమి కావలయును? కాబట్టి లింగధారి మతము స్థాపింపఁబడి జంగములు బయలుదేఱిన తరువాతనే పల్నాటియుద్ధము జరిగె ననుట నిర్వివాదం. లింగధారిమతము బసవనిచే స్థాపింపఁబడినది. వీరి మతగ్రంథము లైన బసవపురాణము, ప్రభులింగలీల, పండితారాధ్యచరిత్రము మొదలగునవి చదువఁగాఁ బురాణములలో సహజముగానుండు నద్భుతకల్పనలుపోను వీరి మతస్వభావము బసవని చరిత్రము కొంత తెలియఁగలదు. పాల్కురికి సోమనారాధ్యుని బసవపురాణములోని

“ద్వి. జినసమయస్థుల శిరములు దునిమి
మనువిష్ణుసమయుల ముక్కులుగోసి
అద్వైతులను హతహతము గావించి
విద్వేషగాథుల విటతటమాడి
చార్వాకవాదుల గర్వంబులణచి”

యను పద్యములవలన వీరి మతలక్షణము కొంచెము తెలియును. మత మెట్లున్నను మనకు గావలసినది ఇతిహాసమున నావిషయముల వివరించెదను. లింగధారిమతమును స్థాపించిన బసవేశ్వరుఁడు కర్ణాటదేశమునందలి హింగుళేశ్వరాగ్రహారములో మండెంగ మాదిరాజను బ్రాహ్మణునిపుత్త్రుఁడు. తల్లిపేరు మాదాంబ. పాల్కురికి సోమనరచిత బసవపురాణమునందలి కొన్ని ముఖ్యములైన పద్యముల నుదాహరించి దానినుండి తెలియవచ్చు ఇతిహాసమును వ్రాసెదను.—

“ద్వి. పాండురంగవిభుని......బిజ్జలుని
బండారిబలదేవ దండనాయకుఁడు
శివభక్తునికిఁ బెండ్లి సేయుదునన్న
ప్రవిమలమగుతొంటి బాస తలంచి

యిట్టిభక్తునికీక యింక నాకూతు
సెట్టివారికి మఱి నేవిత్తునంచు
బసవకుమారుని పాలికిఁబోయి"
"మఖలీలబిజ్జలక్షోణీశ్వరుండు
తానునుబసవన దండనాయకుఁడు."

బసవేశ్వరుఁడు తండ్రిమతమున కిష్టపడక యుపనయనసంస్కారము నిరాకరించి, తలిదండ్రులవదలి తోఁబుట్టువైన యక్కనాగమ్మను వెంటఁబెట్టికొని కల్యాణమునకుఁ బాఱిపోయి యచ్చట రాజ్యము చేయుచున్న బిజ్జలునియొక్క దండనాయకుని కూతును వివాహమాడి తనమామయనంతరమునఁ తానే బిజ్జలునివద్ద దండనాయకుఁడాయెను. ఇతని క్రొత్తమతమువలన నితనికనేకులు విరోధు లేర్పడిరి. రాజైన బిజ్జలునికి నితనికిఁ బరస్పర ద్వేషము హెచ్చి కలహము సంభవించెను. ఈకలహములో బిజ్జలుఁడు ప్రాణములఁ గోల్పోయెను. తరువాత బసవేశ్వరుఁడు కపిలసంగమమువద్ద లింగమందైక్యమైపోయెను. కల్యాణపురము రాజధానిగ రాజ్యము చేసిన పశ్చిమచాళుక్యులలో నొకఁడైన క్రీ॥ శ॥ 1150-వ సం॥రం మొదలుకొని 1163-వ సం॥వఱకుఁ బరిపాలించిన రెండవ తైలపునివద్ద నీ బిజ్జలుఁడు దండనాయకుఁడుగానుండి ప్రబలుఁడై చివరకు రాజుమీఁద దిరుగఁబాటొనర్చి సింహాసన మాక్రమించుకొనినట్లు తెలియవచ్చుచున్నది. ఇతఁ డంతకుముందే కల్యాణపురము స్వాధీనము చేసికొన్నను క్రీ॥ శ॥ 1162-వ సంవత్సరములో మాత్రమే రాజబిరుదముల వహించెను. ఇతని శాసనములు క్రీ॥ శ॥ 1157 సం॥ మొదలుకొని కానవచ్చుచున్నవి. 1157-వ సంవత్సర మితనిరాజ్యకాలమున రెండవ సంవత్సరమని యొక శాసనమునఁ జెప్పఁబడినది కనుక క్రీ॥ శ॥ 1156-వ సంవత్సరమున నితని పరిపాలన ప్రారంభించి యుండును. ఈ బిజ్జలుని దండనాయకుఁడు నాకాలముననే యుండిలీరవలయును. పలనాటియుద్ధము బసవనిచే లింగధారి (వీరశైవ) మతము స్థాపింపఁబడినతరువాత జరిగినదని యిదివఱకే తెల్పఁబడినది గావున నీ యుద్ధము క్రీ॥ శ॥ 1150-వ సం॥ రమునకంటెఁ బూర్వమున జరిగియుండ నేరదు. అనుగురాజు కుమారుఁ డగు మల్లదేవుఁడు కల్యాణపురరాజైన వీరసోమునికూతును వివాహమాడినట్లు వీరచరిత్ర ప్రథమభాగమునఁ జెప్పఁబడినది. చదువరులకుఁ దెలియుటకై యీక్రిందిపద్యముల నుదహరించుచున్నాను:—

ద్వి. "పయనము చేసెను బ్రహ్మ తానప్డు
సుంకరికన్నను సొంపుగరాగ
తనవెంట దోడ్కొని తరలిబ్రహ్మన్న
కల్యాణనగరంబు కడువేగ చేరి

ఆపట్టణంబేలు నట్టిభూపతులు
అల్లాణరాజును భల్లాణరాజు
నందిసోముడు మఱి నాగసోముడును
కంచుసోముడు మఱి పెంచుసోముడును
జలములకర్తన జలసోమరాజు
అందఱకును బైని నావీరసోము
తమ్ములేడ్గురు కలధరణీశు కపుడు
పుత్రులు నల్వురు పుత్రియు నొకతె."

కల్యాణపురము నిజామురాజ్యములో బీదరునకు 35 మైళ్లదూరమున నున్నది. కల్యాణము నేలిన కలచూరి వంశపురాజులలో నొక వీరసోముఁడును జళుక్యవంశపురాజులలో నల్వురు వీరసోములును గలరు. చాళుక్య వీరసోములలో మొదటి ముప్వురు బసవేశ్వరునిచే వీరశైవమతము స్థాపింపఁబడకపూర్వమే రాజ్యము చేసినవారు గావున నైనచో మల్లదేవుని మామ నాల్గవ వీరసోముఁడే యైయుండవలయును. కలచూరి వీరసోముఁడును లింగాయత మతస్థాపనానంతరమం దున్నవాఁడు కావున నితఁడును విచారణీయుఁడే. మొదలు చాలుక్య వీరసోముని గుఱించి తెలిసికొనుటకై యతని వంశక్రమము వివరించెదను. దక్షిణహిందూదేశమును బాలించిన రాజవంశములలోఁ జళుక్యవంశము మిక్కిలి పురాతనమైనది. గుజరాతునం దన్హల్వారపట్టణమున రాజ్యముచేసిన సాలంకీవంశమునకును దీనికిని సంబంధ ముండియుండవచ్చును. చాళుక్యు లుత్తరహిందూస్థానములఁ బరిపాలించిన రాజపుత్ర సంతతివారైనట్లు కానవచ్చుచున్నది. ద్రుపదుని కాపద కలుగఁజేయుటకై శపించిన ద్రోణుని చుళుక (పుడిసిలి) జలమునం దొకఁడు జనించెననియు, నతఁడు చుళుకజలమందుఁ బుట్టినవాఁడు గావునఁ జౌళుక్యుఁ డయ్యెననియు, నతనివంశమే చౌళుక్య (చాళుక్య) వంశమనియుఁ జేది దేశపు మొదటిశాసనములో వ్రాయఁబడినది.

ఈ వంశమునుగూర్చి వేలువేలుచోట్ల వేలువేలుగఁ జెప్పఁబడియున్నది. చాళుక్యులు రెండుశాఖలుగా నున్నారు. కళ్యాణపురము రాజధానిగ నేలినవారు పశ్చిమ చాళుక్యులనియు, రాజమహేంద్రవరము రాజధానిగ నేలినవారు తూర్పు చాళుక్యులనియుఁ నితిహాసమున బేర్కొనఁబడుదురు. పశ్చిమచాళుక్యుల వంశవృక్ష మీక్రింది విధమున నితిహాసవేత్తలగ్రంథములలో కనఁబడుచున్నది.

- జయసింహుఁడు
  - రాజసింహుఁడు (రణరాఘవుఁడు)
    - పులకేశి
      - కీర్తివర్మ
        - సత్యాశ్రయుఁడు
          - అమరుఁడు
            - ఆదిత్యవర్మ
              - విక్రమాదిత్యుఁడు
                - వినయాదిత్యుఁడు (యుద్ధమల్లుఁడు)
                  - విజయాదిత్యుఁడు
                    - విక్రమాదిత్యుఁడు
                      - కీర్తివర్మ
                        - ౦
                    - ...
                      - కీర్తివర్మ
                        - తైలపుఁడు I
                          - భీమరాజు
                            - అయ్యన
                              - విజితాదిత్యుఁడు
      - మంగళేశుఁడు
        - ౦

* తైలభూపవిక్రమాదిత్యుఁడు
- సత్యాశ్రయుఁడు
- దాసవర్మ
  - విక్రమాదిత్యుఁడు
  - అయ్యన
    - ౦
  - జయసింహుఁడు (జగదేకమల్లుఁడు)
    - సోమేశ్వరదేవుఁడు I (త్రైలోక్యమల్లుఁడు, ఆహవ మల్లుఁడు)
      - సోమేశ్వరదేవుఁడు II (భువనైకమల్లుఁడు
      - విక్రమాదిత్యుఁడు (కలివిక్రముఁడు వీర పెరుమాడిరాయలు)
        - సోమేశ్వరదేవుఁడు III (భూలోకమల్లుఁడు)
          - ...(జగదేకమల్లుఁడు)
          - తైలపుఁడు II (నురుమాడి తైలుఁడు, త్రైలోక్యమల్లుఁడు)
            - సోమేశ్వరదేవుఁడు IV (త్రిభువనమల్లుఁడు)

జయసింహుఁడు:—ఇతఁడు రాష్ట్రకూటుల రాజైన కృష్ణుని జయించెను. ఇతని పూర్వికులు 59 మంది అయోధ్యరాజులుగ నుండిరి.

రాజసింహుఁడు:—జయసింహుని కుమారుఁడు. ఇతనికి రణరాఘవుఁడని బిరుదనామము గలదు.

పులకేశి:—రాజసింహుని కుమారుఁడు. ఇతనిచేఁ గాకుండిన దేశముపై నధికారిగ నియమింపఁబడిన నీలసాంద్ర వంశజుఁడగు శివనందుని తామ్రశాసనమువలన నితఁడు క్రీ॥ శ॥ 489-వ సం॥ లో రాజ్యముచేయుచు మిక్కిలి పరాక్రమముగలవాఁడుగా నుండినట్లు తెలియుచున్నది. ఈవూరి శాసనమువలన నితఁడు వాతాపిపురాధీశ్వరుఁడని కూడఁ దెలియుచున్నది.

కీర్తివర్మ:—పులకేశి మొదటికుమారుఁడు.

మంగళేశుఁడు—పులకేశి రెండవ కుమారుఁడు. కలచూరిరాజుల నోడించెను.

సత్యాశ్రయుఁడు—కీర్తివర్మపుత్త్రుఁడు. పులకేశి మనుమఁడు. ఇతనివలన నీవంశమునకు సత్యాశ్రయకులమని పేరు వచ్చినది. ధార్వాడకు నాలుగైదుమైళ్ళదూరమున నున్న అమీర్‌భావియను గ్రామములోని శాసనమువలన నితఁడు క్రీ॥ శ॥ 566-వ సం॥ లో రాజ్యముచేయుచుండినట్లు తెలియుచున్నది.

అమరుఁడు—సత్యాశ్రయుని కుమారుఁడు.

ఆదిత్యవర్మ—అమరుని కుమారుఁడు.

విక్రమాదిత్యుఁడు—ఆదిత్యవర్మ కుమారుఁడు. ఇతని రాజ్యారంభకాలము క్రీ॥ శ॥ 592-వ సంవత్సరము.

వినయాదిత్యుఁడు—విక్రమాదిత్యుని కొమరుఁడు. ఇతనికి యుద్ధమల్లుఁడని బిరుద నామము గలదు.

విజయాదిత్యుఁడు—విక్రమాదిత్యుని పౌత్త్రుఁడు. ఇతఁడు క్రీ॥ శ॥ 695 సం॥ మొదలు 733 వఱకు రాజ్యము చేసెను.

విక్రమాదిత్యుఁడు—విజయాదిత్యుని కుమారుఁడు. క్రీ॥ శ॥ 733 సం॥ లో రాజ్యము నకు వచ్చెను.

కీర్తివర్మ—విక్రమాదిత్యుని మొదటి కుమారుఁడు.

కీర్తివర్మ—విక్రమాదిత్యుని మనుమఁడు. అనఁగాఁ బేరు తెలియని విక్రమార్క ద్వితీయ పుత్త్రుని కుమారుఁడు.

తైలపుఁడు ]—కీర్తివర్మకొడుకు.

భీమరాజు—తైలపుని కుమారుఁడు.

అయ్యన—భీమరాజు కుమారుఁడు. కృష్ణనందనుని జయించెను.

విజితాదిత్యుఁడు—అయ్యనపుత్త్రుఁడు. నైజాము రాజ్యములోని యావూరి గ్రామమునం దుత్తరదిశనున్న బసవేశ్వరాలయములో నిల్వఁబెట్టఁబడిన రాతిమీది శాసనమున నితఁడు ఛేది (చేది?) వంశ్యుఁడైన లక్ష్మణరాజు కూతురు బొంతదేవిని వివాహ మాడినట్లు తెలియుచున్నది. చేదిదేశపు మొదటిశాసనమునందలి యువరాజదేవుని తండ్రి లక్ష్మణరాజే యాలక్ష్మణరాజైన యెడల నాశాసనకాల మొకవిధముగ నిర్ణయింపవచ్చును.

తైలభూపవిక్రమాదిత్యుఁడు—విజితాదిత్యుని కుమారుఁడు. దేశము చాలమట్టుకు రాష్ట్రకూటు లాక్రమించియుండ వారిని జయించి చళుక్యరాజ్యము నుద్ధరించెను.

ఇతఁడు క్రీ॥ శ॥ 973 సం॥ మొదలు 997 సం॥ వఱకు రాజ్యము చేసెను. ఇతఁ డాహవ మల్ల బిరుదాంచితుఁడు. భార్య జాకబ్య.

సత్యాశ్రయుండు—తైలభూపుని కుమారుఁడు. క్రీ॥ శ॥997 సం॥ మొదలుకొని 1008 వఱకుఁ బ్రభుత్వము చేసెను. భార్య అంబికాదేవి. సంతానహీనుఁ డైనందున సోదరుని కుమారు లితని తరువాత రాజ్యమునకు వచ్చిరి.

దాసవర్మ—సత్యాశ్రయుని సోదరుఁడు. తైలభూపునికొడుకు.

విక్రమాదిత్యుఁడు—దాసవర్మ పుత్రుఁడు. క్రీ॥ శ॥ 1008 మొదలు 1018 వఱకు రాజ్యము చేసినాఁడు.

అయ్యన—దాసవర్మ రెండవ కుమారుఁడు. కొడుకులు లేరు.

జయసింహుఁడు—దాసవర్మ మూఁడవకుమారుఁడు. ఇతనికి జగదేకమల్లుఁడని బిరుద నామము గలదు. క్రీ॥ శ॥ 1018 సం॥ మొదలుకొని 1040 వఱకుఁ బరిపాలించెను.

సోమేశ్వరదేవుఁడు I—జయసింహునికుమారుఁడు. ఆహవమల్లుఁడు, త్రైలోక్యమల్లుఁడని రెండు బిరుదము లితనికిఁ గలవు. క్రీ॥ శ॥ 1040 సం॥ మొదలు 1069 వఱకు రాజ్యము చేసెను.

సోమేశ్వరదేవుఁడు II—ఒకటవ సోమేశ్వరదేవుని కొడుకు. భువనైకమల్లుఁడని బిరుద నామము. ప్రజారంజకుఁడు గాఁడు. క్రీ॥ శ॥ 1069-వ సం॥ మొదలుకొని 1076 సం॥ వఱకుఁ బ్రభుత్వ మొనరించెను.

విక్రమాదిత్యుఁడు—ఒకటవ సోమేశ్వరదేవుని కుమారుఁడు. కలివిక్రముఁడు, వీరపెరుమాడిరాయలునని బిరుదములు కలవు. వివేకహీనుఁడైన సోదరుని రాజ్యభ్రష్టునిఁ జేసి చాళుక్యులందఱిలో నెక్కువ ప్రతాపశాలియై క్రీ॥ శ॥ 1076 సం॥ మొదలుకొని 1127 సం॥ వఱకు 51 సంవత్సరములు నిరంకుశముగఁ బరిపాలించెను. ఇతఁడు బహుభార్యా సమేతుఁడు. ఇతని రాజ్యాంతకాలమున ద్వారసముద్రపు భల్లాణుఁడు కల్యాణముమీదికి రాఁగా నితనిదక్షిణమండలేశ్వరుఁడు వెడలఁగొట్టెను.

సోమేశ్వరదేవుఁడు III—విక్రమాదిత్యుని కుమారుఁడు. భూలోకమల్లుఁడు, త్రైలోక్య మల్లుఁడని రెండు బిరుదనామములు గలవు. క్రీ॥ శ॥ 1127 మొదలుకొని 1138 వఱకుఁ బరిపాలించెను.

జగదేకమల్లుఁడు—మూఁడవ సోమేశ్వరదేవుని మొదటికుమారుఁడు. జగదేకమల్లుఁడను నది బిరుదనామముగాని వ్యావహారికనామము కాదు. క్రీ॥ శ॥ 1138 సం॥ మొదలు 1150 వఱకు రాజ్యము జేసెను. ఇతనిపేరు శాసనములలోఁ గాన రాదు.

తైలపుఁడు II—మూఁడవ సోమేశ్వరుని రెండవ కుమారుఁడు. త్రైలోక్యమల్లుఁడని బిరుదము. నురుమాడితైలుఁడని నామాంతరము. క్రీ॥ శ॥ 1150 సం॥ మొదలు కొని 1163 వఱకుఁ బ్రభుత్వము చేసెను. కలచూరివంశస్థుఁడైన బిజ్జలుఁడు తైల పునివద్ద దండనాయకుఁడుగా నుండి మిక్కిలి యధికారము సంపాదించి చిట్ట చివరకు దిరుగఁ బాటొనర్చి సింహాసన మాక్రమించుకొనఁగాఁ దైలపుఁ డసహా యుఁడై దక్షిణభాగమునకుఁ బాఱిపోయి పడమటి కనుమలలో డాఁగియుం డెను. బిజ్జలుఁడు రాజును వెడలఁగొట్టి రాజ్య మాక్రమించుకొన్నను గొన్ని సంవత్సరములవఱ కేకారణముచేతనో శాసనములందు దండనాయకోచితబిరుద ములే యుదాహరించుచు క్రీ॥ శ॥ 1162-వ సంవత్సరములో దక్షిణమునకుఁ బోయి ఏకచ్ఛత్రాధిపత్యాది రాజబిరుదముల వహించెను. ఇతఁడు క్రీ॥ శ॥ 1156-వ సంవత్సరములో సింహాసన మధిష్ఠించెను. తైలపుని శాసనములు క్రీ॥శ॥ 1150 సం॥ మొదలుకొని 1163 వఱకుఁ గానవచ్చుచున్నవి. క్రీ॥శ॥ 1157-వ సం॥రములో నితఁడు కల్యాణపురములో రాజ్యము చేయుచుండినట్లు కానం బడుచున్నది గాని యితని చిట్టచివరసంవత్సరమైన 1163-వ సంవత్సరపు శాసన ములో బనవాసియందు రాజ్యము చేయుచుండినట్లు తెల్పఁబడినది.

సోమేశ్వరదేవుఁడు IV—రెండవతైలపుని కుమారుఁడు. త్రిభువనమల్లుఁడని బిరుద నామము. వీరసోముఁడని నామాంతరము. తైలపునివద్దనుండి యన్యాక్రాంతమైన కల్యాణపురము నితఁడు క్రీ॥ శ॥ 1182-వ సంవత్సరములో స్వాధీనము చేసి కొని చాళుక్యరాజ్యము పునరుద్ధారణ చేసెను. బిజ్జలుఁడు నతని కుమారుఁడును బసవేశ్వరుని లింగాయతమతకలహములలోఁ జిక్కియుండుటచే సోమేశ్వ రుని కంతగా నాటంకములు లేకుండినట్లు తెలియవచ్చుచున్నది. మల్లదేవునికిఁ గూతునిచ్చినదీ వీరసోముఁడేయై యుండునేమో. ఇంకను దీనినిఁగూర్చి స్థలాంతరమునఁ జర్చింపఁబడును. యుద్ధప్రారంభమునకు ముందు నాయకురాలు సంధికై బ్రహ్మనాయునివద్దకుఁ బంపిన రాయబారులపేరు లీ గ్రంథము యొక్క 83 దవ పుటలో నిట్లు చెప్పఁబడినవి.

"కొండయన్నమరాజు కోటకేతుండు
కూరిమిహితుడు మాడ్గులవీరరెడ్డి
పరమాప్తుడా చింతపల్లి రెడ్డియును"

వీరిలోఁ గోటకేతుఁడు సుప్రసిద్ధుఁడైన ధరణికోటరాజు. ఇతనిశాసనము లమరావతిలోను వేల్పూరి రామేశ్వరస్వామి యాలయములోను బెక్కులుగలవు. ఇతనికి ధర్మముగానిచ్చినవియుం నితనిభోగస్త్రీ లిచ్చినవియు శాసనములు గుంటూరుతాలూకాలోని యనమదల వీరభద్రస్వామి యాలయమునందును వేల్పూరి రామేశ్వరస్వామి యాలయమునందును గలవు. అమరావతిలోనున్న యతని శాసనమొకటి యుదాహరించుచున్నాను. కొన్ని సంస్కృతశ్లోకములు కొంత తెలుఁగు గద్యముగలిగి శాసనము పెద్దదిగానుండుటవలనఁ గావలసినంతవఱకుమాత్ర ముదాహరించెదను.—

'श्लो ॥ अस्ति श्रीधान्यकटकं (अमरावती) पुरं सुरपुराद्वरं
यत्रामरेश्वरो शम्भुरमरेश्वरपूजितः ।
बुद्धो देवस्ससान्निध्यो यत्रधात्रा प्रपूजितः
चैत्यमत्युन्नतं यत्र सर्वं चित्रसुचित्रितम् ॥

... ... ... ...

शाकाब्दे युगखेन्दुरूपगणिते माघे दशम्यां तिथौ
शुक्लायां गुरुवासरे शुभदिने सम्प्राप्तराज्योन्नतिः ।
श्रीमत्केतनृपस्समस्तगुरवे ग्रामान् वरेण्यान् बहून्
सम्प्रादात्सुगतेश्वराय विपुलश्रीब्रह्मसम्पद्वतः ॥

స్వస్తిశ్రీ చతుస్సముద్రముద్రిత నిఖిలవసుంధరాపరిపాలక శ్రీమత్త్రిణయనపల్లవ ప్రసాదాసాదిత కృష్ణవేణీనదీ దక్షిణషట్సహస్రావనీవల్లభ భయలోభదుర్లభ చోళచాళుక్యసామంతమదానేకప మృగేంద్ర విభవవామరేంద్ర శ్రీమదమరేశ్వరదేవ దివ్య శ్రీపద పద్మారాధక పరబలసాధక శ్రీధాన్య కటకపురవరాధీశ్వర ప్రతాపలంకేశ్వర కళిగళమోగ దక్కె బెడ్డరగవక్కె గండరగండ గండభేరుండ జగమెచ్చుగండ అగ్నిమార్తాండ నామాది ప్రశస్తసహిత శ్రీమన్మహామండలేశ్వర కోటకేతమహారాజులు శకవర్షంబులు ౧౧౦౮ అగునేటి మాఘ శు ౧౦ గురువారంనాడు శ్రీమద్బుద్ధదేవరకు నాచంద్ర తారార్కంగా నిచ్చిన యూళ్ళుకంద్రవాటిలోని కంతేరు కొండపడమటిలోని మేడికొండూరు, డోకిపఱ్ఱు.

ఈ ధర్మం నడపనివారు పంచమహాపాతకములు చేసినవారు. వారణాశివచ్చిన వారు తమపెద్దకొడుకు కపాలము కుడిచినవారు.

'श्लो ॥ स्वदत्तां परदत्तां वा यो हरेत वसुन्धराम्
षष्टिर्वर्षसहस्राणि विष्ठायां जायते क्रिमिः ' ॥

కోటకేతుని కాలమునాఁటికి బౌద్ధమత మాంధ్రదేశమునందుఁ బూర్తిగ నశింపనట్లే యీ శాసనమువలనఁ దెలియుచున్నది ! ఈ శాసనప్రకారము కోటకేతుఁడు క్రీ॥శ॥ 1182-వ సం॥రమునకు సరియైన శా॥శ॥ 1104-వ సం॥ మాఘశుద్ధ దశమినాఁడు రాజ్యమునకు వచ్చెను. శాసనములోఁ దెల్పఁబడిన వంశక్రమమం దీ కోటకేతుని తండ్రి పేరు భీమదేవుఁడని చెప్పఁబడినది. అమరావతిలోని కోటకేతుని శాసనములలో మఱియొకదానిలోని

'श्लो ॥ गोङ्कक्षितीशशशिनो भगिनी गुणाढ्या
सब्बाह्वया कमलचारुतरा स्फुटश्रीः ।
तस्याभवत् प्रियतमा पुरुषोत्तमस्य
तस्मात्तस्यां समजनि सुधारश्मिकान्तिर्विवस्व
त्तेजोराशिर्गुणगणनिधिः केतभूपोऽभिरूपः ' ॥

అను శ్లోకములవలనఁ గేతనృపునితండ్రి భీమదేవుఁడు గొంకరాజు సోదరిని వివాహమాడినట్లును .నాదంపతులకుఁ గేతరాజుపుట్టినట్లును మనకుఁ దెలియుచున్నది. దీనినిఁబట్టి కోటకేతుఁడు గొంకరాజు మేనల్లుఁడగును. ఈగొంకరాజు క్రీ॥ శ॥ 1127-వ సం॥రం మొదలుకొని 1158-వ సం॥ వఱకు రాజమహేంద్రవరము రాజధానిగ రాజ్యముచేసిన తూర్పు చాళుక్యుఁడు. వేల్పూరి రామేశ్వరస్వామి యాలయములోఁ గోటకేతుఁడు క్రీ॥ శ॥ 1182 సంవత్సరమునఁ దనతల్లి సుబ్బమదేవికి ధర్మార్థముగా బ్రాహ్మణులకు భూదానముచేసిన శాసనములో

'श्लो ॥ ग्रामं कोकल्लुनामानं प्रशस्तं सस्यसम्पदा ।
विद्वद्भ्यो द्विजवर्येभ्यो जननीश्रेयसेऽददात् ' ॥

అను శ్లోకమున నితఁడు కోకల్లుగ్రామమిచ్చినట్లు కలదు. నే నుదాహరించిన చేదిదేశపుశాసనముల రెంటిలో మొదటిదానియందు యువరాజదేవుని వంశావళి కోకల్లుని

వద్దనుండి ప్రారంభింపఁబడినది. ఆకోకల్లుని పేరే యీ గ్రామమునకుఁ బెట్టఁబడినయెడలఁ గోటకేతుఁడు హైహయుఁడనియుఁ, దనపూర్వికుఁడైన కోకల్లుని గౌరవార్థముగా గ్రామమున కీపేరు పెట్టియుండుననియుఁ, జేదిదేశపు మొదటి శాశనమునుబట్టి హైహయులకుఁ జాళుక్యులకు సంబంధబాంధవ్యము లున్నట్లు తెలియుచున్నది గనుకనే కోటకేతుని తండ్రి భీమదేవుఁడు చళుక్యవంశజయైన సబ్బను వివాహమాడెననియు, మనయనుగురాజు కొడుకులు పెదమల్ల దేవరాజు నలగామరాజు హైహయులే యైనందున స్వవంశమువారు కలహించి చెడిపోవుదురను తలంపుతోఁ గోటకేతుఁడు సంధి కుదుర్చుటకై రాయబారిగ పోయియుండవచ్చుననియు నూహించినచో నసందర్భమేమి గానరాదు. వేల్పూరి రామేశ్వరస్వామి యాలయములోనే కోటకేతరాజుకొడుకు గణపయదేవర దివ్య శ్రీపాదపంకజభక్తి పరాయణుండైన కేతనబాలుఁడు క్రీ॥ శ॥ 1240-వ సం॥లో తమ తల్లికి ధర్మార్థముగ నిచ్చిన దానశాసనము కలదు. దీనినిఁబట్టి కోటకేతుని కొడుకు గణపరాజు క్రీ॥ శ॥ 1240-వ సం॥రములో రాజ్యము చేయుచుండినట్లు తేలుచున్నది. కనుకఁ గోటకేతుఁడు క్రీ॥శ॥ 1182-వ సం॥రము మొదలుకొని 1240-వ సం॥రమువఱకో లేక కొన్ని సంవత్సరములు తఱుఁగుగనో ప్రభుత్వ మొనర్చియుండును. పల్నాటి యుద్ధము కోటకేతుఁడు సింహాసన మారోహింపకపూర్వమే జరిగినట్లు కానంబడుచున్నది. ఈయుద్ధలో నలగామరాజు తనకు సహాయులుగా రమ్మని కొంతమంది రాజులకు లేఖలు వ్రాసెను. ఆరాజుల పేరు లీ గ్రంథముయొక్క 26, 27 పుటలలోఁ జూడనగును.

"ద్వి. ధరణికోటపురికి దక్షుడైనట్టి
భీమదేవుండను పృథ్వీశునకును."

అను 26-వ పుటలోని పఙ్తులవలన ధరణికోట రాజప్పుడు భీమదేవుఁడనియుఁ గోటకేతుఁడు కాఁడనియు నేర్పడుచున్నది. ధరణికోటకు వెనుక ధరణాలకోట, ధన్నాలకోటయను పేరులుఁండినట్లు గ్రంథమువలనఁ దెలియఁచున్నది. పల్నాటియుద్ధకాలమున ధరణికోటరాజుగానున్న భీమదేవుఁడు కోటకేతుని తండ్రియే. క్రీ॥ శ॥ 1127 మొదలుకొని 1158 వఱకు రాజ్యముచేసిన గొంకరాజు తోఁబుట్టువును వివాహమాడెను గాన నితఁడు క్రీ॥ శ॥ 1140-వ సం॥రముననో లేక యాప్రాంతముననో రాజ్యము చేయుట కారంభించి క్రీ॥ శ॥ 1182 సం॥రమువఱకుఁ బాలించియుండును. పల్నాటియుద్ధము జరుగునప్పటికిఁ గోటకేతుఁడు సింహాసన మధిష్ఠింపకపోయినను రాయబారము మొదలగు రాచకార్యములు నిర్వర్తించుటకుఁ దగిన వయస్సుగలవాఁడై యుండుటచేత రాజ్యభారము వహించుటకు సిద్ధముగానుండి యుండవలయును. కావునఁ బల్నాటియుద్ధము

క్రీ॥ శ॥ 1182-వ సంవత్సరమునకుఁ బూర్వము కొద్దికాలముక్రిందటనే జరిగియుండును. అనఁగాఁ గొంచెము హెచ్చుతక్కువగ క్రీ॥ శ॥ 1176, 1182 సం॥ రములమధ్యమున జరిగెనని చెప్పవచ్చును. నలగాముఁడు లేఖలు వ్రాసినవారిలో వీరభల్లాణుఁడుగూడ నున్నాఁడు. వీరభల్లాణు లిద్దఱుగలరు. లింగాయమతము స్థాపింపఁబడిన తరువాతనున్నది రెండవ వీరభల్లాణుఁడు. కనుకఁ బల్నాటి యుద్ధకాలముననున్న దితఁడే కావలెను. ఈ యనద్వార సముద్రము రాజధానిగ క్రీ॥ శ॥ 1173 మొదలు 1224 వఱకు రాజ్యము చేసెను గావునఁ బల్నాటియుద్ధము 1173 సం॥రమునకుఁ బూర్వము జరిగియుండ నేరదు. కోటకేతుఁడు సింహాసన మెక్కకముందే జరిగెనని నిర్ధారణచేయఁబడియుండుటచేత 1182సం॥కుఁ బిమ్మటను జరిగియుండ నేరదు. కాఁబట్టి పల్నాటియుద్ధము 1173, 1182 సం॥రముల మధ్యమున జరిగినదని నిశ్చయముగఁ జెప్పవచ్చును. నలగామరాజునకు సహాయుఁడుగా సాగిపోతరాజను నతఁడు వచ్చినట్లు చెన్నపట్టణమునందలి లిఖితపుస్తకాగారములోని ప్రతిలోఁ గానవచ్చుచున్నది. సాగిపోతరాజు గుడిమెట్ట నేలినవాఁడు. రెల్లూరి తిరుమలయ్య తనగుఱ్ఱము నపహరించిన పోతరాజు నేఁడుదినములకుం జావఁ దిట్టిన చాటుధారయని యప్పకవి యుదాహరించినట్టి

ఉ. "వాయమదిసీతపోతవసుధాధిపుఁడారయ రావణుండు ని
శ్చయముగ నేనురాఘవుఁడ సహ్యజవారిధిమారుఁడంజనా
ప్రియతనయుండు లచ్చనవిభీషణుఁడా గుడిమెట్టలంక నా
జయమునుబోతరక్కసుని చావును నేవడనాఁడు సూడుఁడీ."

యను పద్యమీ సాగిపోతరాజును గూర్చియే. గుడిమెట్ట కృష్ణాజిల్లాలో నందిగామకు 8 మైళ్ళదూరమునఁ గృష్ణానదీతీరమం దున్నది. సాగిపోతరాజుయొక్క క్రీ॥ శ॥ 1199-వ సంవత్సరపు శాసనము బెజవాడ దుర్గామల్లేశ్వరస్వామి కల్యాణమండపములో నీశాన్యభాగ స్తంభపు తూర్పు పలకమీదఁ జూచితిని. ఇప్పుడు దీనిలోని యక్షరములు చాలవఱకు మాసిపోయి యస్ఫుటముగఁ గానవచ్చుచున్నవి. ఇతనిశాసనములు మఱికొన్ని కనుఁగొనఁబడినవి. వీనివలన నీయన 1199 సం॥రమునకుఁ బూర్వమే రాజ్యభారము వహించి 13-వ శతాబ్ద్యాదియందుఁ గొన్నిసంవత్సరములు జీవించియుండినట్లు తెలియుచున్నది గావునఁ బల్నాటి యుద్ధములోనుండియే యుండవచ్చును. యుద్ధమిఁక సుమారు నాలుగు సంవత్సరముల యాఱుమాసములకు జరుగుననఁగా నలగామరాజు మల్లదేవునికొనర్చిన మందపోటు నుపద్రవములో నీక్రిందిరాజుల సాహాయ్యము కోరుమని నాయకురాలు నలగామున కాలోచనసెప్పినట్లు శ్రీనాథరచితమని

చెప్పఁబడుచుండి నాకు లభించిన తాళపత్ర గ్రంథములోని మాదపోటుకథయం దీ పఙ్క్తులు వ్రాయఁబడినవి.—

ద్వి. "ఎంతటైనను మననేమి చేసెదరు
భల్లాణదేవుండు పంచపాండ్యుండు
తెలియఁగ విజ్జలదేశంగు విభుడు
కాశీమహారాజు గంగుదయుండు
వెలనాటిచోడుడు విక్రమాఢ్యుండు
మలిదేవుడన్నను మాడుచుండుకురు."

వీనిలో వెలనాటిచోడుఁ డుదాహరింపఁబడినాఁడు. ఇప్పుడు చందవోలు బాపట్ల చుట్టుప్రక్కలనున్న దేశమే వెలనాడని శాసనములవలనఁ దెలియుచున్నది. వెలనాటికిఁ గమ్మనాడను నామాంతరము గలదు. వెలనాటిచోడుఁడు కులోత్తుంగ చోళ గొంకరాజు కుమారుఁడు. ఇతని యసలు పేరు రాజేంద్రచోడుఁడు. రాజేంద్రచోడునికి వెలనాటిచోడుఁడని నామాంతర మున్నట్లు మంచనకేయూరబాహుచరిత్రములోని యీక్రింది పద్యములవలనఁ దెలియుచున్నది.—

క. "ధీరుండాగోవిందన, కూరిమినందనుఁడు వెలసెఁ గొమ్మనగొంక
క్ష్మారమణునకుదయించిన, వీరుఁడు రాజేంద్రచోడవిభు ప్రెగ్గడయై.

సీ. నవకోటిపరిమితద్రవిణమే భూపాలు, భండారమున నెప్డు పాయకుండు
నేకోనశతదంతు లేరాజునగరిలో, నీలమేఘంబుల లీలగ్రాలు
బలవేగరేఖనల్వదివేలతురగంబు, లేనరేంద్రునివాగె నెపుడుదిరుగుఁ
బ్రతివాసరంబు డెబ్బదియేనుపుట్లునే,యేవిభు మందల నెపుడుకలుగు

గీ. నట్టియధికవిభవుఁడగుకులోత్తుంగరా
జేంద్రచోడనృపతికిష్ట సచివ
తంత్రముఖ్యుఁడనుగుమంత్రి గోవింద నం
దనుఁడు కొమ్మనప్రధానుఁడొప్పు.

ఉ. ఇల వెలనాటిచోడ మనుజేంద్రునమాత్యత యానవాలుగాఁ
గులతిలకంబుగా మనినకొమ్మనప్రెగ్గడ కీర్తిమాటలన్
దెలుపఁగనేల తత్క్రియఁ బ్రతిష్ఠితమైన తటాకదేవతా
నిలయమహాగ్రహారతతి నేఁటికి నెల్లెడఁదానచెప్పఁగన్."

ఈ పద్యములలోని కొమ్మనమంత్రి శాసనము బాపట్ల భావనారాయణస్వామి యాలయములో నొకటి గలదు. రాజేంద్రచోడుఁడే వెలనాటిచోడుఁడైనట్లు వీని వలన స్పష్టపడినది. ఇతఁడు క్రీ॥ శ॥ 1158 సం॥ మొదలు 1200 వఱకు రాజ్యముచేసి నట్లు విదితమగుచున్నది. కావున నొకవేళ యుద్ధము 1182-వ సం॥రములోనే జరిగినను మందపోటు సమయమున నితఁ డుండియుండుననుట కాక్షేపమేమియు లేదు. అనుగు రాజు కుమారుఁడగు మల్లదేవునికిఁ గూఁతునిచ్చిన సోమేశ్వరుఁడు కల్యాణాధిపతియైన నాల్గవ సోమేశ్వరుండై యుండవచ్చునని యనుమానముగఁ జెప్పితిమి. చేదిదేశములో జబ్బల్పూరువద్దనున్న బిల్హారియందలి శాసనమున యువరాజదేవుని తాత కేయూర వర్షుఁడు చళుక్యవంశజయైన నోహలాదేవినిఁ బెండ్లాడినట్లున్నది. దీనివలన హైహయు లకుఁ జళుక్యులకు పూర్వమునుండి సంబంధబాంధవ్యము లున్నట్లు తెలియుచున్నది. కావున హైహయుఁడగు మల్లదేవుఁడు చాళుక్యుఁడగు వీరసోమునికూఁతును వివాహమాడిన నాడి యుండవచ్చును. ఈ యభిప్రాయముతోడనే యీగ్రంథముయొక్క 4-వ పుటలోని పద పఙ్క్తిని వ్రాసితిని. తరువాత నాకు దొరకిన "యలరాజు రాయబారము" కథ గల గ్రంథము చూడ విషయములు వేఱుగఁ గాన్పించుచున్నవి. అలరాజు రాయబారము కథలోఁ (యుద్ధమునకు ముందు) గొమ్మరాజుభార్య బ్రహ్మనాయునితో నీక్రింది వాక్య ములు చెప్పినట్లు గలదు.—

"ద్వి. వినవయ్య నాయుండ విన్నవించెదను
తరుణిమాయత్తకు దనయు లేడుగురు
ఏడ్వురికొక్కఁడె యెలమినాసుతుడు
కల్యాణమేలుచు ఘనుడుమామామ
ఆడదేవరగొల్చి హరిపురికేగె
బదుగురుతనయులు బదితెర్వులైరి."

ఈ వాక్యములవలన నలరాజు రాయబారమునాఁటికే (యుద్ధమునకుముందే) కొమ్మరాజు తండ్రి వీరసోముఁడు మృతినొందినట్లు స్పష్టపడుచున్నది. కొమ్మరాజుతండ్రి యే పెదమల్లదేవుని మామ. చాళుక్యుఁడైన నాల్గవ వీరసోముఁడు 1182-వ సంవత్సర ములో సింహాసనమునకు వచ్చి పల్నాటియుద్ధము జరిగినతరువాతఁ గూడఁ గొన్ని సంవ త్సరములు బ్రతికినాఁడు. కనుక మల్లదేవునిమామ చాళుక్యవీరసోముఁడు కాక మఱి యొక వీరసోముఁడై యుండవలయునని విశదమగుచున్నది. మల్లదేవుని పెండ్లి నాఁటి కతనిమామయైన వీరసోముఁడు కల్యాణము నేలుచుండినట్లే గ్రంథములోఁ జెప్పఁబడి

నది. విచారింప బసవేశ్వరుని లింగాయతమతము స్థాపింపఁబడినతరువాత మల్లదేవుని పెండ్లికాలమునఁ గల్యాణము నేలుచు యుద్ధమునకుఁబూర్వమే చనిపోయిన వీరసోముఁడొకఁడు కలఁడని చరిత్రవలనఁ దెలియుచున్నది. ఇతఁడే మల్లదేవుని మామ, లేక కొమ్మరాజుతండ్రియై యుండవలయును. ఇతఁడు కలచూరి వంశస్థుఁడు; రెండవతైలపుని రాజ్యమునుండి వెడలఁగొట్టి కల్యాణపురము స్వాధీనముచేసికొనిన బిజ్జలుని కుమారుఁడు. బిజ్జలుఁడు క్రీ॥ శ॥ 1156-వ సంవత్సరము మొదలుకొని 1165-వ సం॥వఱకు రాజ్యముచేసి గతింపఁగా నితఁడు సింహాసన మధిష్ఠించి 1165 సం॥ మొదలు 1176 సం॥ వఱకుఁ బాలించినట్లు శాసనవేత్తల అభిప్రాయము. మురారి సోమదేవరయనియుం, వీర బిజ్జలుఁడనియు, సోమేశ్వరదేవుఁడనియుం నితనికి మూఁడు నామములు. ఇతని రాజ్యకాలము 1165-వ సం॥ మొదలు 1176-వ సం॥వఱ కగుటవలన యుద్ధమునకుఁ బూర్వము సుమారు 10 సంవత్సరముల క్రిందట జరిగిన మల్లదేవుని పెండ్లికాలమునఁ గల్యాణము నేలుచుండి యుద్ధము జరగకముందే చనిపోయిన వీరసోముఁ డితఁడే యగును. కావున మల్లదేవుని మామయైయుండుటకు సందియములేదు. కనుక బిజ్జలుని కుమారుఁడైన యీవీరసోముఁడే కొమ్మరాజుతండ్రి యగును. కొమ్మరాజు యుద్ధమునకుఁ బోవునపుడతని ననుసరించియున్న యంకాళశక్తి

"ద్వి. శీలము రఘురామ చెప్పెద వినుము
మావారు కల్యాణమందుననుండి
ఘనరాజ్యసంపదల్ కడకు బోద్రోలి
పొలుపొందగా విష్ణు పోరుకందఱము
లోనయివచ్చుట లోకంబులెఱుగు
నీవు పెట్టినచిక్కు నీవెఱుంగుదువు
అందఱ మాయచే హతముగావించి
పరగ నీవిటువంటి పనియూహచేసి
నన్నెడబాపుట న్యాయమా నీకు."

అని బ్రహ్మనాయునితోఁ బలికినట్లు వీరచరిత్రములో నొకభాగమైన కొమ్మరాజు యుద్ధములోఁ జెప్పఁబడినది. కల్యాణపట్టణములో ద న్నాదరించువారు లేరనియుఁ బలనాటిలోనున్న కొమ్మరాజొక్కఁడు యుద్ధరంగమునకుఁ బోవుచున్నాఁడనియుఁ దనకిఁక నాధారము లేదనియుం నంకాళశక్తి విలపించినట్లు పై నుదహరింపఁబడిన ద్విపదుల వలన నర్థము కాఁగలదు. దీనినిఁబట్టిచూడఁ బల్నాటి యుద్ధకాలమునఁ గొమ్మరాజు

వంశమువారికిఁ గల్యాణపట్టణములో నధికారము క్షీణించినదని తెలియుచున్నది. తత్కాలమునఁ గల్యాణమున నధికారకర్త్రయైనది కలచూరివంశమే కాని చళుక్య వంశము కాదు. కనుకఁ గొమ్మరాజుతండ్రి, లేక మల్లదేవుని మామ క్రీ॥ శ॥ 1165 సం॥ మొదలుకొని 1176 సం॥ వఱకుఁ బాలించిన కలచూరి సోమేశ్వరుఁడే కాని క్రీ॥ శ॥ 1182 సం॥ మొదలు 1189-వ సం॥ వఱకు రాజ్యముచేసిన చాళుక్యుఁడగు నాల్గవ సోమేశ్వరుఁడు కాఁడని స్పష్టముగఁ జెప్పవచ్చును. యుద్ధమునకుముందే కొమ్మరాజు తండ్రియగు సోమేశ్వరుఁడు మృతినొందినట్లు చెప్పఁబడుటవలన యుద్ధము క్రీ॥ శ॥ 1176-వ సం॥ తరువాతనే జరిగియుండవలయును. ఈకాల మిదివఱకుఁ గ్రీ॥ శ॥ 1173, 1182 సం॥ల మధ్యమున జరిగియుండవలయునని నిర్ధారణచేసినకాలమునకు సరిపోవుచున్నది. యుద్ధమునాఁటికిఁ గలచూరివంశము బొత్తిగ క్షీణదశలోనున్నదని చెప్పఁబడుటవలనను, గలచూరివంశము క్రీ॥ శ॥ 1182-వ సంవత్సరమునఁ బూర్తిగ నశించినందువలనను యుద్ధము 1182-వ సం॥ నకుఁ బూర్వము కడు స్వల్పకాలము లోనే జరిగియుండవలెను. ఇది 1173, 1182 సం॥ల మధ్యమున జరిగినట్లు నిర్ధారణ చేయఁబడినది గనుక జరిగిన సంవత్సరము 1182 సం॥ రకు దగ్గఱగను 1173 సం॥ నకు దూరముగను నుండితీరవలయును. ఇట్టి సంవత్సరము 1178 సం॥ నకు వెనుకనుండ నేరదు గనుకను యుద్ధమునకుఁ బూర్వము కొమ్మరాజు తండ్రి చచ్చియుండుటవలన నది 1176 సం॥ నకుఁ బిమ్మటనే జరిగియుండును గనుకను మఱింతసూటిగాఁ గ్రీ॥ శ॥ 1178, 1182 సంవత్సరముల మధ్యమునఁ బల్నాటియుద్ధము చేయఁబడినదని నిశ్చయింపవచ్చును. గ్రంథములో ననుగురాజు కార్తవీర్యుని కేడవతరమువాఁడుగాఁ జెప్పఁబడినదని యిదివఱకే తెల్పియుంటిని. రావణుఁడు నర్మదానదీతీరమున శివపూజచేయుచుండఁగా కార్తవీర్యార్జునుఁడు నర్మదలో జలక్రీడలు సల్పుటయు, నతనివేయిచేతులచేత నడ్డగింపఁబడిన జలప్రవాహ మెగఁదట్టి రావణునిపైఁ దొట్టుటయుం వారిద్దఱు కలహించుటయుఁ బురాణప్రసిద్ధవిషయంబులు గానఁ గార్తవీర్యుఁడు రావణునికి సమకాలీనుఁడై యుండవలయును. రావణుఁడు రాముఁడు నేకకాలమందుండినవారు. రామాయణ కాలము క్రీ॥ పూ॥ 13-వ శతాబ్దికి ముందేకాని తరువాత నైయుండదని రమేశ చంద్రదత్తు మొదలగు పండితులు వ్రాసియున్నారు. అనఁగా నిప్పటికి మూఁడువేల రెండువందల సంవత్సరములకుఁ బూర్వమున నగును. కార్తవీర్యార్జునుఁడు రామాయణ కాలముననుండినవాఁడగుటచే నతఁడును మూఁడువేలసంవత్సరముల క్రిందనే యుండితీర వలయును. అనుగురాజు కార్తవీర్యుని కేడవతరమువాఁడే యైనయెడలఁ దరమునకుఁ బూర్తిగ నూఱేండ్లప్రకారము చూచినను సుమారు రెండువేలసంవత్సరముల క్రిందట

ననుగురాజుండినవాఁ డగును. కురుక్షేత్రయుద్ధము జరిగినతరువాత నాఱువందల సంవత్సరములకో యేడువందల సంవత్సరములకో పల్నాటియుద్ధము జరిగియుండును. ఇదియే నిజమైనచో వీరభల్లాణుని భీమదేవుని నాకాలమునకు నెట్టి శాసనములు రద్దుపఱచి భారతేతిహాసము తలక్రిందు చేయవలసియుండును. కావున ననుగురాజు కార్తవీర్యుని కేడవతరమువాఁడని వ్రాసినవ్రాఁత నిరాధారపు వ్రాఁతయని స్పష్టము కాకమానదు. మెకంజీ దొరగారు సేకరించిన లిఖితగ్రంథములను విమర్శించినట్టి విల్సను (Wilson) గారు వీరచరిత్రనుగూర్చి యిట్లు వ్రాసియున్నారు.—"Account of seven years war from 1080 A, D. to 1087, which was carried on by Brahma Nayudu and Twelve other land-holders and graziers against two towns, Gurzala and Macherla in the Palnad country and which originated in a dispute at a Cock-fight. In. Ant. Vo. I. page 273 (1080 సం॥ మొదలు 1087 సం॥ వఱకు జరిగిన యేడుసంవత్సరముల యుద్ధచరిత్రము. బ్రహ్మనాయుఁడు మఱి పన్నిద్దఱు భూస్వాములుఁ పశువుల మేపరులు గలిసి పల్నాటి దేశములోని మాచెర్ల, గురిజాల అను రెండు పట్టణములమీద యుద్ధముచేసిరి. ఒకకోడిపందెములో సంభవించిన కలహ మీయుద్ధమునకు మూలకారణము)." వీరు నిర్ణయించిన కాలమున కాధారములు చూపఁబడకపోవుట యటులుండఁగా యుద్ధమునుగుఱించి యిచ్చిన యభిప్రాయమునుఁబట్టి చరిత్ర మెంతమట్టుకు గ్రహించిరో చదువరులే యూహింపఁగలరు. గతానుగతికులై టెయిలరు (Taylor) మొదలగువారిట్లే నిరాధారముగా విపరీతములు వ్రాసినారు గాని యవియన్నియు నిటఁ దెల్పుట యనవసరము.

> క. గజనభగుణ చంద్రాదుల
> భజనుండాషాఢశుద్ధ పక్షంబందున్
> (విజయసమబాహుబలుఁడ
> క్క్రజముగఁ) బల్నాటివీరగజమనిఁ బడియెన్.

అను నొకచాటుపద్యము వాడుకలో నున్నది. ఈపద్యము దుష్టమగుటకుఁదోడు దీనిప్రకారము యుద్ధకాలము శా॥ 1308 లేక క్రీ॥ 1386-వ సంవత్సరమగుచున్నది. ఈకాలమునాఁటికి దేశము కొండవీటిరెడ్ల స్వాధీనమైనది. కాన నీపద్యమెంతవిశ్వాస్యమో నేను వివరింపఁబనిలేదు.

పైనిఁ జూపఁబడిన నిదర్శనములన్నిటివలనఁ బలనాటివీరులు చేదిదేశమునుండి 12-వ శతాబ్దియందు వచ్చి 1178, 1182 సం॥ మధ్యమున యుద్ధముచేసిరని స్పష్ట

ముగాఁ దేలుచున్నది. అనుగురాజు చేదిదేశమునువిడిచి పల్నాటికేలవచ్చెనో చూతము. కార్తవీర్యుఁడు చేసినపాతకములు బాధింపఁగా బ్రాహ్మణుల యాలోచనవలన జీడినూనె గుడ్డలఁ ధరించి ససైన్యుఁడు సామాత్యుఁడు సకుటుంబుఁడై రాజ్యమునువదలి యిలువేలుపైన చెన్నకేశవుని వెంటఁబెట్టికొని తీర్థయాత్రకువెడలి వచ్చివచ్చి * కృష్ణానదిలో స్నానముచేసినప్పుడు తాముధరించిన నల్లగుడ్డలు తెల్లనాయెననియు నంతటఁ బాపవిముక్తులైరనియుఁ జందవోలులో నప్పుడున్న రాజనుగుభూపాలునకుఁ గూఁతునొసఁగి పలనాడు హరణమిచ్చెననియుఁ గార్తవీర్యుఁడు చేసినపాపములు పట్టణము నంటియుండుటవలనఁ దిరిగి స్వదేశమునకుఁ బోవుట కిలువేల్పయిన చెన్నకేశవుఁ డిష్టపడలేదనియుఁ, నందుచేఁ బలనాటిలోనే స్థిరపడిరనియు గ్రంథములోఁ జెప్పఁబడినది. ఎన్ని సంవత్సరముల క్రిందటనో కార్తవీర్యుఁడు చేసినపాపము లతనిపూర్వుల నెవరిని బాధింపక యనుగురాజునే యేల బాధించెనో తెలియరాదు. తీర్థయాత్రకు వెడలినచో రాజ్యమునఁ దమ ప్రతినిధి నెవ్వరినోయుంచి బయలుదేఱుదురు కాని దేశము నరాజకము చేసి యిలువేల్పును గూడఁ బెఱికికొని కట్టగట్టుక యందఱు నొక్కసారి బయలువెడలియుండరు. కార్తవీర్యుఁడు చేసినపాపములు చేదిదేశమునంటికొని వదలకయుంట దురవగాహము. ఏది యెట్లున్నను దాను దేశము విడిచిపోవలసి వచ్చినప్పుడు తనపూర్వుఁడైన కార్తవీర్యుఁడు చేసిన పాపము లనుగురాజునకు జ్ఞప్తికివచ్చియుండుట వాస్తవము.

ప్రాచీనభారతకథేతిహాసము (Early History of India) వ్రాసిన స్మిత్తు దొరగా రిట్లు నుడువుచున్నారు.—"The Kalachuri or Haihaya Rajas of Chedi are last mentioned in an inscription of the year 1181 A. D. and the manner of their disappearance is not exactly known; but there is reason to believe that they were supplanted by the Bhugels of Rewa. (చేదిదేశముయొక్క కలచూరి లేక హైహయ వంశపురాజులు క్రీ॥ శ॥ 1181-వ సంవత్సరపు శాసనములోఁ జివరసారి యుదాహరింపఁబడియున్నారు. వారెట్లు పోయినది సరిగాఁ దెలియదు. కాని రీవాభగేలులు వారిస్థానమునకు వచ్చిరని నమ్ముటకుఁ గారణము కలదు.)" 11-వ శతాబ్దప్రారంభమునుండి చేదిదేశము విభజింపఁబడి యొకరికంటె నెక్కువమంది రాజుల క్రింద నుండినట్లు చరిత్రవలనఁ దెలియుచున్నది. పల్నాటి యుద్ధకాలమున హిందూదేశముమీఁదికి మహమ్మదీయులు దండెత్తివచ్చుచుండిరి. ఈమహమ్మదీయుల

* చంద్రవంకలోనని కొందఱు చెప్పుచున్నారు. ఈకథగల గ్రంథభాగము దొరకలేదు.

తొండములవలననో స్మిత్తుదొరగారు చెప్పినట్లు రీవాధ గేలులవలననో లేక యన్యశత్రువుల వలననో యనుగురాజు రాజ్యమును గోలుపోయి ససైన్యముగఁ బలనాటికి వచ్చియుండును. ఇతఁడు వచ్చినతరువాతఁ దక్కిన హైహయులు 1181-వ సంవత్సరమువఱకు నుండి వారు కూడ రాజ్యభ్రష్టు లై యుండురు. ఇట్టికష్టకాలమున ననుగురాజు తనదురదృష్టమునకుఁ గారణము కార్తవీర్యుఁడు చేసిన పాపములే యని భావించుట యొకవింత కాదు. అనుగురాజు నిజదేశమువిడిచి వచ్చి చందవోలురాజుకూఁతును వివాహమాడ నతఁడు కుమార్తెకరణముగాఁ బల్నాడిచ్చినట్లు వీరభద్రకవియొక్క—

''శా. నానాచిత్రపటుప్రతానములు రత్నస్వర్ణభూషావళుల్
ధేనువ్రాతమిభాశ్వసంఘు మతిభక్తిస్ఫూర్తిగాఁ గన్యకా
దానప్రోత్సవవేళ నల్లునకుఁ జేతఃప్రీతిగా నిచ్చె స
న్మానంబొప్ప నొసంగెఁ బుత్రికకుఁ బల్నాడైదు దేశంబులున్.''

అను పద్యమువలనఁ దెలియును. ''పల్నాడైదు దేశంబులున్'' అనఁగా నైదు దేశములు కలిసిన పల్నాడో పల్నాడుమఱియు నైదు దేశములో వివరములేదు. చందవోలు రాజప్పుడు ధవళశంఖుఁడని యావీరభద్రకవి వ్రాయుచున్నాఁడు. ధవళశంఖుని శాసనము లెచ్చటఁ గానరావు. అతనిపేరు చరిత్రలో నెచ్చటఁ గనఁబడదు. పల్నాడంత దేశము నన్యులకు సర్వస్వతంత్రరాజు లీవలయును గాని తక్కినవారీఁజాలరు. అనుగురాజిక్కడకు వచ్చునప్పటికి దేశమునందు సర్వస్వతంత్రరాజులు తూర్పుచాళుక్యులు. చాళుక్యులలో ధవళశంఖుఁడు లేఁడు. ఆకాలపుశాసనములు చందవోలులో వెలనాటి గొంకరాజుది యొకటి వెలనాటిచోడునిది మఱియొకటి కానవచ్చుచున్నవి గాని ధవళశంఖుని శాసనములులేవు. చెన్నపట్టణమునందలి లిఖితపుస్తకభాండాగారములోని ప్రతియందుఁదనకు సహాయులుగారమ్మని నలగామరాజు రాజులకు లేఖలు వ్రాసిన స్థలమున ''మామగు తమగొంకమహీపాలునకును'' అని లిఖింపఁబడినది. ఈముద్రితగ్రంథములో ''మామగుండముకోట మనుజేశునకును'' అని వ్రాయఁబడియున్నది. లిఖితపుస్తకాగారములోని ప్రతిప్రకారము నలగామరాజు మామగొంకఁడేయైన పక్షమున ననుగురాజునకుఁ గూఁతునిచ్చినది 1127 సంll మొదలుకొని 1158 సంll వఱకు రాజ్యముచేసిన కులోత్తుంగ చోడ గొంకరాజై యుండవలయును. దీనికి నిదర్శనముగాఁ బల్నాడాకాలమునఁ గులోత్తుంగ చోడగొంకరాజు స్వాధీనములో నున్నదని తెల్పుటకై కారెంపూడి సురేశ్వరస్వామియాలయములో 115+ సంllన నతనిశాసనముకలదు. నలగామ రాజుమామయని చెప్పఁబడిన గొంకమహీపాలుఁడు వెలనాటిచోడుఁడగును.

వెలనాటిచోడునికి గొంకరాజనునామాంతరమున్నట్లు సూయల్ పట్టికలో ఉదాహృత మైన బాపట్ల భావనారాయణాలయశాసనమువలన తెలియుచున్నది. ఆశాసనమిట నుదాహరించెదను.

"స్వస్తిశ్రీ శకవర్షంబులు ౧౦౮౨ అగునేటి ఉత్తరాయణ నిమిత్తమున స్వస్తి శ్రీ సమస్తప్రశస్తసహిత శ్రీమన్మహామండలేశ్వర కుళోత్తుంగ చోడగొంకరాజులు శ్రీమత్సంధివిగ్రహ కొమ్మనప్రెగడ కమ్మనాటిలోని భావనారాయణ దేవరకు నఖండ దీపము తమతండ్రి గోవిందప్రెగ్గడకు తమతల్లి కేతసానికి ధర్మముగా నిల్పి........"

ఈ శాసనములోని కొమ్మనప్రెగ్గడ కేయూరబాహుచరిత్రమునందలి కొమ్మన ప్రెగ్గడయే. కనుక శాసన సంవత్సరమునుబట్టియుఁ గేయూరబాహుచరిత్ర ప్రథమాశ్వా సములోని 19, 20, 21, 22, 23, 24, 25 పద్యములనుబట్టియుఁ బైశాసనములోని కుళోత్తుంగ గొంకరాజు వెలనాటిచోడుఁడే యని స్పష్టపడక మానదు. అయినను బొన్నూరు డివిజనులోఁ జేరిన నిడుబ్రోలు గ్రామ మధ్యముననున్న చోడేశ్వరస్వామి యాలయముముందఱ రాతిమీది శాసనమువలనను నర్సరావుపేట తాలూకాయందలి యల్లమంద కోటీశ్వరాలయములోని శాసనమువలనను వెలనాటి గొంకరాజును రాజేంద్ర చోడుఁడును జతుర్థకులజులని తెలియుచున్నది గాన నీవిషయ మింకను విచారణీయము. మల్ల దేవుఁడు మాచెర్ల విడిచి మండాదికి వలసపోవునప్పటి కనుగురాజు నలువదియేండ్లును నలగామరాజు పదుమూఁడేండ్లును బల్నాటిలో రాజ్యముచేసినట్లు మండాదివలన కథలో వ్రాయఁబడినది. మండాదివలస తరువాత షుమారు 7 సంవత్సరముల 6 మాసము లకు యుద్ధము జరిగినది. యుద్ధము 1178, 1182 సంవత్సరముల మధ్యమున జరిగినదని యిదివఱకే నిర్ధారణచేయఁబడినది. ఇది 1178-వ సం॥లో జరిగినను లేక 1182సం॥లో జరిగినను మండాదివలస నాఁటి కనుగురాజు 40 సం॥లును నలగామరాజు 13 సం॥లును రాజ్యము చేసినది నిజమేయైనపక్షమున ననుగురాజు పల్నాటికధిపతియైన సంవత్సరము 1118-వ సంవత్సరమో లేక 1122-వ సంవత్సరమో యగును. కాని యనుగురాజు పల్నాటికధిపతియైనది 1127 సం॥ మొదలుకొని 1158 సం॥ వఱకు రాజ్యముచేసిన కుళోత్తుంగ చోడగొంకరాజుకాలములోనని యింతకుముందు విశదపఱచియుంటిని. కావున ననుగురాజో నలగామరాజో మండాదివలస కథలోఁ జెప్పఁబడినట్లు గాక కొన్ని సంవత్సరములు తక్కువగా రాజ్యముచేసియుండవలెను. అనుగురాజు వివాహ మాడిన కథగల గ్రంథభాగము, శ్రీనాథవిరచితము, నాకు లభింపలేదు. దానిలో నెట్లుండునో తెలిసినయెడల మఱియెక్కువ నిశ్చయముగా వ్రాయవచ్చును. హైహ

యులశాసనములు తెలుఁగుదేశమున మిక్కిలి విస్తారముగఁ గానరావు. క్రీ॥ శ॥ 1403 సం॥ లోఁ గార్తవీర్యుని వంశస్థుఁడును మధ్యదేశాధీశుఁడు నైన చోడునిశాసనము విశాఖపట్టణము జిల్లా సర్వసిద్ధితాలూకా పంచధార ధర్మలింగేశ్వరస్వామి యాలయములోఁ గలదు. పల్నాడు తాలూకా కార్యమపూడి వీరాలయములోఁ గన్నమదాసు మంటపము వెనుకనున్న బండమీద నయోధ్యరాజు శాసనమొకటియున్నది. అది స్ఫుటముగాఁ గనఁబడుటలేదు. ప్రయత్నముచేయఁగా నీక్రిందియక్షరములు చదువఁగలిగితిని. "స్వస్తిశ్రీమన్మహామండలేశ్వర అయోధ్యాపురవరాధీశ్వర.........లసింగుమండలేశ్వరుని సన్నిధిని చెన్నరాయులవారి గుడి యెత్తించ.........దు కొనిలమస్యంది శకవర్షంబులు ౧౨౪౮ క్రోధిసంవత్సర.........కార్తిక......౧౦ గు॥ చండప్రసిద్ధ గరుడగంబ" ఈ శాసనకాలమునకు షుమారు 4 సంవత్సరముల క్రిందటనే ప్రతాపరుద్రుఁడు మహమ్మదీయులచే ఢిల్లీకిఁ బట్టుకొనిపోఁబడి దేశము తురుష్కుల స్వాధీనమాయెను. శాసనము బొత్తిగ నగుపడుటలేదనియు నయోధ్యరాజు కొల్వులో నున్న యొకవణిజుఁడేమో కట్టించి శాసనము వ్రాయించెననియు సూయలుగారు వ్రాసి యున్నారు. ఎరునతాన్వయరాజు భార్యయైన మైలమాదేవి శాసనము ద్రాక్షారామ భీమేశ్వరాలయములో నున్నట్లు సూయలు శాసనపట్టికలో నుదాహరించినాఁడుగాని యాశాసనము నాకు లభింపకపోవుటచేత నామైలమాదేవి యనుగురాజుభార్యయైన మైలమాదేవియోకాదో చెప్పఁజాలకున్నాను. పల్నాటివీరులపేరులుగల గ్రామము లిప్పటికిఁ గలవు. అనుగురాజుపేర నలుగురాజుపల్లె పల్నాటిలోఁ గలదు. అనుగురాజని శ్రీనాథగ్రంథమందు నలుగురాజని వీరభద్రకవిగ్రంథమందుఁ గానఁబడుచున్నది. అలుగురాజను నామమే యథార్థనామమై యుండవచ్చును. అలరాచమల్లుపేర మాచెర్ల కాఱుమైళ్లదూరమున రాచమల్లు పాడుగలదు. ఝట్టిరాజుపేరఁ దుమ్మకోటకు నాలుగు మైళ్లదూరమున ఝట్టిపాలెము కలదు. తుమ్మకోటవద్దనున్న మల్లవరము మల్లదేవుని పేరి గ్రామమైయుండును. అనుగురాజు సముద్రస్నానమునకు వెళ్లినపుడు దొడ్డనాయుని పేర నాయునిపల్లెయు శీలాంబపేరఁ జీరాలయుయుఁ బేర్నిని పేరఁ బేరాలయుఁ గట్టిరని వీరభద్రకవి వ్రాసినాఁడు. నాయకురాలిపేర "నాయకురాలికనుమ" అని యొక కనుమగలదు. ఇది కార్యమపూడికిని మేళ్ళవాగునకును మధ్యమున నున్నది. వీరమేడపి నుండి బాలచంద్రుఁడు యుద్ధమునకు వచ్చుచుండఁ గార్యమపూడి కనుమలో నాయకురాలు వంగచాచి యడ్డముగ నిల్చుండెననియు నదిచూచి బాలచంద్రుఁ డాడువారితోఁ గలహించుట యుచితముకాదని ఖడ్గముచేఁ గొండయొక్క యొకప్రక్కను నఱికి త్రోవచేసికొని కార్యమపూడి చేరెననియు జనులు చెప్పుదురు. బాలచంద్రుఁ డెక్కి

వచ్చిన వాహనపు గిట్టెవలనఁ బడినదని కార్యమపూడి నాగులేటియొద్దున నొక గుఱుతు నిప్పటికిఁ బ్రజలు చూపుచున్నారు. నలగామరాజువద్దనుండి చీలి బ్రహ్మనాయుఁడును మల్లదేవులును మాచెర్లకుఁ బోయిరని కథాసారము చదివినచోఁ దేటపడఁగలదు. వారు గురిజాలనుండి బయలుదేఱి యొకచో మజిలీచేసి యచ్చటఁ బట్టణముకట్టిరనియు మజిలీ చేసిన పట్టణముగాన దానికి మాచెర్లయని పేరువచ్చినదనియు వీరచరిత్రములో వ్రాయఁ బడినది. పూర్వము మారీచుఁడేలినది మాచెర్ల, ఖరుఁడేలినది కార్యమపూడి, దూషణుఁడేలినది దుర్గియని యచ్చటిజనులు చెప్పుకొందురు. శాసనములలో "మహాదేవిచెర్ల" అని యున్నది. మహాదేవిచెర్లయే మాచెర్లగా మాఱియుండవచ్చును. మాచెర్లలోనున్న చెన్నకేశవుని దేవాలయము బ్రహ్మనాయుఁడు కట్టించెనని ప్రతీతిగలదు. ఈ యాలయములోని పనితనము, హనుమకొండ వేయిస్తంభముల గుడిలోని పనితనము నొక్కతీరుగ నున్నవి. ఫర్గ్యుసన్ గారు "ఈస్టరన్ అండు ఇండియన్ ఆర్కిటెక్చర్ (Eastern and Indian Architecture) అను గ్రంథమున హనుమకొండ యాలయమును గుఱించి యిట్లు వ్రాసిరి. "According to an inscription on its walls the temple was erected in 1164 A. D. by Pratapa Rudra who, thoughnot exactly himself a Chalukya in blood, succeeded to their possessions and style." దీనివలనఁ బ్రతాపరుద్రునిచేఁగట్టఁబడిన యాదేవాలయములోఁ జాళుక్యశిల్పము కలదని తెలియుచున్నది. మాచెర్లయాలయములోని శిల్పము నట్టిదే కాన నదికూడఁ జాళుక్యశిల్పమై యుండును. బ్రహ్మనాయుఁడు చాళుక్యులకాలములోని వాఁడగుటవలన మాచెర్లయాలయము చాళుక్యశైలి ననుసరించి యతఁడే కట్టించెనని చెప్పవచ్చును. యుద్ధావసానము పూర్తిగవర్ణింపఁబడిన శ్రీనాథరచిత గ్రంథభాగము నాకు దొరకలేదు. బ్రహ్మనాయుఁడు యుద్ధములోఁ జచ్చినవారినందఱ బ్రతికించి వెంటఁబెట్టికొని గుత్తికొండ బిలములోఁ బ్రవేశించెననియు నందఱు నిజస్వరూపములు గైకొనిరనియు నందులో బ్రహ్మనాయుఁడు విష్ణురూపము నాయకురాలు యోగమాయారూపమునందిరనియు వీరభద్రకవి వ్రాసినాఁడు. మల్లయ్యయనునొకఁ డీవీరచరిత్ర ద్విపదలలో రచించినాఁడు. అది చెన్నపట్టణమునందలి లిఖితపుస్తకాలయములో నున్నది. చిట్టచివరకు బ్రహ్మనాయుఁడును బచకుల బ్రహ్మయుఁ బోరాడిరనియుఁ బచకుల బ్రహ్మ హతుఁడాయెననియుఁ దరువాతఁ జింతపల్లి రెడ్డి బ్రహ్మనాయునిమీఁదికిఁబోయి మూర్ఛిల్లి పడిపోయెననియుఁ బిమ్మట నాయకురాలు కదియఁగ స్త్రీలతోఁ బోరాడుట యుచితముకాదని బ్రహ్మనాయుఁ డూరకుండ నాయకురాలే యతనిని బొడిచెననియుఁ నతఁ డామెయెక్కిన గుఱ్ఱమునుబొడిచి చంపఁగా దిగి పాఱి

పోయి నలగామరాజును గలిసికొని యిద్దఱు కొండమగుండ్లకుఁ బోయి విప్రుల యిండ్లలో డాఁగిరనియు బ్రహ్మనాయఁడు దచటికిఁ దఱుముచుఁ బోవ బ్రాహ్మణులు వచ్చి రాజును మన్నింపుమని యతనిని బ్రతిమాలికొనిరనియు నతఁడును వారిని క్షమించి నలగామ రాజును గురిజాలసింహాసన మెక్కించెననియు మల్లయ్య గ్రంథమువలనఁ దెలియు చున్నది. వీరచరిత్రమును ద్విపదములలో వ్రాసిన మఱియొకరు కొండయ గలఁడు. ఇతని గ్రంథములోఁగూడ యుద్ధావసానము మల్లయ్యగ్రంథములోనున్నట్లే యున్నది. యుద్ధా నంతరము వీరు దీర్ఘకాలము రాజ్యము చేసినట్లు కనఁబడదు. యుద్ధము జరిగినతరువాత సుమారు 50 సం॥ ల లోనే దేశము కాకతీయగణపతిరాజుల యధీనమైనది. పల్నాటి వీరులఁగుఱించి వీరచరిత్రమునఁగాక ఇతిహాస గ్రంథాంతరములయం దెచ్చటనైనఁ గలదేమోయని విచారింపఁగాఁ గొండవీటి దండకవిలెలో మోహనరాజు గోపాల రాజు నను నిద్దఱు జైనులు ఉత్తరాదినుండి కుష్ఠవ్యాధి బాధితులై యనేక తీర్థ యాత్రలుచేయుచు గుంటూరునకు వచ్చి గుండువద్ద నెట్టిచెఱువులో స్నానము చేయఁగా వ్యాధి కుదిరెననియు వారచ్చటనేయుండి యగస్త్యేశ్వరునికి మంటపప్రాకార ములు కట్టించి ధనమును వినియోగించిరనియు వ్రాయఁబడియున్నది. ఇది మన యనుగు రాజు మొదలగువారి విషయముగనే కన్పట్టును. దండకవిలె వ్రాసినయతఁడు వినికిడినిఁ బట్టి నిజము తెలియక యిట్లు వ్రాసియుండును. దండకవిలెలో విషయము లెంతసూటిగా వ్రాయఁబడినవో యాగ్రంథములోని యాక్రింది వాక్యములవలనఁ దేటపడఁగలదు— "ఈఅయిదుగురు ధర్మం నడిచిరి. అటుతరువాత ముక్కంటి అందురు. ఇతఁడే యోరు గంటి ప్రతాపరుద్రుఁడు.............స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహన శక వర్షంబులు 836 అగు నేటి దుందుభిసంవత్సరమున ఈ ఓరుగంటి ప్రతాపరుద్రుఁడు పరరాజుచేతఁ బట్టువడును." ప్రతాపరుద్రుఁడు వాస్తవమునకు క్రీ॥ శ॥ 1323-వ సం॥లోఁ బట్టుపడినాఁడు. కనుకఁ బైవాక్యములలోని వ్యత్యాసములు ఇతిహాసము చదివిన వారికి తేలికగాఁ బోడకట్టఁగలవు. అనుగురాజు తీర్థయాత్రావశమున వచ్చెనని కథలు వ్యాపించియుండెను గాన నవికర్ణాకర్ణిగవిని నిజమైన పేరులు విషయములు తెలియక కవిలెకారుఁ డట్లు వ్రాసినాఁడని చెప్పవచ్చును.

అనుగురాజు వంశస్థులజాడ యీప్రాంతములఁ గానరాదు. కాని వెలమయైన బ్రహ్మనాయుని గోత్రమువారు మాత్రము కలరు. వారు వెంకటగిరి సంస్థానాధీశులైన వెలుగోటివారు. బ్రహ్మనాయఁడు రేచెర్లగోత్రుఁడు. వెలుగోటివారును రేచెర్ల గోత్రులే. వెంకటగిరి సంస్థానవంశచారిత్రమునందు వంశకథనము చేవిరెడ్డివద్దనుండి చెప్పఁ బడినది. చేవిరెడ్డియు మఱియొక మాలవాఁడును బొలముదున్నుచుండఁగా ధనముదొరకె

ననియు నాధనమున కా మాలవానిని బలియిచ్చి వాని యభీష్టప్రకారము చేవిరెడ్డి తన గోత్రనామము రేచెర్లగా మార్చెననియుఁ దచ్చరిత్రమునందు వ్రాయఁబడియున్నది. చేవిరెడ్డి కాకతీయ గణపతి దేవుని కాలములోనివాఁడై నట్లా సంస్థాన చరిత్రమువలనఁ దెలియఁగలదు. గణపతిదేవుఁడు 13-వ శతాబ్దియందుండినవాఁడు కనుక వెంకటగిరి సంస్థానాధిపతులు 13-వ శతాబ్దినుండియే రేచెర్లగోత్రమువారయిరని దీనిచేఁ దేలును. కాని వెలమయుం రేచెర్లగోత్రుఁడునైన బ్రహ్మనాయుఁడు 13-వ శతాబ్దికిఁ బూర్వమందే యుండుటచేతఁ బైనిఁజెప్పఁబడిన చేవిరెడ్డి కథయొక్క యాథార్థ్యమును సంశయింపవలసియున్నది. వెలుగోటివారు బ్రహ్మనాయుని వంశమువారేయైయుందురు. వీరిగోత్రమునకు రేచెర్లనామము చేవిరెడ్డివద్దనుండికాక యంతకుఁ బూర్వమునుండి వచ్చుచున్నదని నమ్మవలయును. రేచెర్లయను గ్రామమువలన గోత్రమున కాపేరు వచ్చి యుండును. పల్నాటియుద్ధము జరిగిన కాలము భారతేతిహాసమునందు ముఖ్యమైనదిగా నున్నది. యుద్ధము జరిగినకాలమునం దుత్తరమునఁ దేశదేశములో హైహయుల రాజ్యము నశించెను. దక్షిణమునఁ బశ్చిమచళుక్యవంశ మంతరించెను. తరువాత స్వల్ప కాలములోనే యుత్తరహిందూస్థానమంతయుఁ జాలమట్టుకు మహమ్మదుగోరి లోఁ బఱచుకొనెను. దక్షిణహిందూస్థానమున ద్వారసముద్రపు భల్లాణరాజులు దేవగిరి యాదవరాజులు ప్రబలిరి. చివరకుఁ జాళుక్యరాజ్యమంతయు యాదవుల స్వాధీన మాయెను. అప్పటి దేశస్థితి, పల్నాటివీరుల యాచారములు, నాగరకత, మతము మొద లగు నంశములు గ్రంథాంతరమందుఁ దెలుపఁదలఁచి వీరుల ఇతిహాసవిషయ మింతటితో సమాప్తము కావించెదను. వీరచరిత్రమును ద్విపదిలో మొదట రచించినది

# శ్రీ నా థుఁ డు

## శ్రీనాథ జీవిత సంగ్రహము.

ఈయన శృంగారనైషధము, భీమేశ్వరపురాణము, కాశీఖండము, హారవిలాసము రచించెను. పాకనాటి నియోగిబ్రాహ్మణుఁడు. భారద్వాజగోత్రుఁడు; ఆపస్తంబ సూత్రుఁడు; శైవమతస్థుఁడు. ఇతని తాత పద్మపురాణ సంగ్రహము రచించిన కమల నాభుఁడు; తండ్రి మారయ; తల్లి భీమాంబ; జన్మస్థలము కొండవీటి సీమయని కొందఱు వ్రాసిరిగాని యీ విషయమై కొంతసందేహముగ నున్నది. కర్ణాటదేశమితని జన్మభూమి యైన ట్లగపడును. సుప్రసిద్ధాంధ్రవిద్వాంసుడు కర్ణాటదేశీయుఁడనుట పలువురికి రుచింపకపోయినను మీదు మిక్కిలి నాకు నిష్టములేకపోయినను యథార్థముగఁ గనఁబడు చున్నది నమ్మకపోవుట సంభవింపనేరదు గాన నాయభిప్రాయము తెలుపుచున్నాను.

ఈయంశము నాలోచించుటకు సత్యాన్వేషణులు ప్రార్థితులు. శ్రీనాథుఁడు కాశీ ఖండములోని

సీ. "చిన్నారిపొన్నారి చిఱుతకూకటినాఁడు రచియించితిని మరుత్రాట్చరిత్ర
నూనూగుమీసాల నూత్నయౌవనమున శాలివాహనసప్తశతి నొడివితి
సంతరించితి నిండుజవ్వనంబునయందు హర్షనైషధకావ్య మాంధ్రభాషఁ
బ్రౌఢనిర్భరవయఃపరిపాకమునఁ గొనియాడితిభీమనాయకుని మహిమఁ

బ్రాయమింతకు మిగులఁ గైవ్రాలకుండఁ
గాశికాఖండమను మహాగ్రంథమేను
దెలుఁగు చేసెదఁ గర్ణాటదేశకటక
పద్మవనహేళి శ్రీనాథభట్టసుకవి."

అను పద్యమున "కర్ణాటదేశకటకపద్మవనహేళి" (కర్ణాటదేశ పట్టణములను కమలములకు సూర్యుఁడు) అను విశేషణము తనకుఁ జేర్చికొనినాఁడు. జన్మస్థలమునందలి యభిమానమువలన నట్లు చెప్పికొనియుండును. మఱియు భీమేశ్వరపురాణములోని

గీ. ప్రౌఢిపరికింప సంస్కృతభాషయందు
పలుకునుడికారమున నాంధ్రభాషయందు
రెవ్వరేమన్ననందు నాకేమికొఱంత
నాకవిత్వంబు నిజము కర్ణాటభాష."

అను పద్యమునందలి "నాకవిత్వంబు నిజము కర్ణాటభాష" యన్న వాక్య మతనికిఁ గర్ణాటభాషయందుఁగల ప్రేమను సూచించుచున్నది. ఈపద్యములోని 'కర్ణాటభాష' యనుదాని కంధ్రభాషయని యర్థమనియు నాకాలమున నంధ్రరాజులను గర్ణాట రాజులని చెప్పుచుండిరనియు నొకరు వ్రాసిరి గాని యదియప్రామాణికము. ఆకాలమునఁ గర్ణాటరాజులు నంధ్రరాజులు వేఱుగానుండిరనియు నంధ్రభాష, కర్ణాటభాష వేఱు వేఱుగ నెంచఁబడుచుండెననియు శ్రీనాథకృతగ్రంథములలోని యీక్రింది పద్యముల వలనఁ దెలియఁగలదు.

శా. "కర్ణాటోత్కళపారశీకనృపసఖ్యప్రాభవశ్రీనిధీ
యర్ణోరాశిపరీతభూభువన మధ్యాంధ్రక్షమాధీశ్వరా
కర్ణాభ్యర్ణవిశాలనేత్ర జగనేకప్రాజ్యసామ్రాజ్యదృ
క్పూర్ణాధీశ్వరహారభక్తినిరతక్ష్మాపాలచూడామణీ. కాశీ. ఆ. 3.

సీ. రఘూదేశవనసప్తమాడె బారుహదొంతివంతునాదిక్షితీశ్వరుల గెలిచి
యొడ్డాదిమత్స్యవంశోదయార్జునుచేతఁ బల్లవాధిపుచేతఁ బలచమంది
దండకారణ్యమధ్యపుళిందరాజరంభాహివంశజులకు నభయమొసఁగి
భానుమత్కులవీరభద్రాన్న వేమేంద్రగర్వసంరంభంబుఁ గట్టిపెట్టి

గీ. యవనకర్ణాటకటకభూధవులతోడ
బలిమివాటించి యేలించెఁ దెలుఁగుభూమిఁ
దననిజస్వామి యల్లాడ ధరణినాథు
ధళిర యరియేటిలింగన ప్రభువరుండు. భీమ. ఆ. ౧.

మ. అరబీభాష తురుష్కభాష గజకర్ణాటాంధ్ర గాంధారఘూ
ర్జరభాషల్ మళయాళభాషశకభాషా సింధుసౌవీర బ
ర్బరభాషల్ కరహాటభాష మఱియుం భాషావిశేషంబుల
చ్చెరువై వచ్చునరేటియన్ననికి గోష్ఠీసంప్రయోగంబులన్. భీమ. ఆ. ౧.

ఇట్టిపద్యము లింకను గలవు. కర్ణాటదేశమనఁగా నంధ్రదేశమని కాని కర్ణాటభాషయన నంధ్రభాషయనిగాని శ్రీనాథునికభిప్రాయము లేనట్లు పైపద్యమువలన స్పష్టము కాఁగలదు. భీమఖండములో

మ. "కనకక్ష్మాధరధీరు వారిధితటీకాల్పట్టణాధీశ్వరున్
ఘనునిం బద్మపురాణసంగ్రహకళాకావ్యప్రబంధాధిపున్
వినమజ్జ్యాంతరసార్వభౌముఁ గవితావిద్యాధరుం గొల్తునా
యనుఁగుందాతఁ బ్రదాత శ్రీకమలనాభామాత్యచూడామణిన్."

అను పద్యమునఁ దనతాత సముద్రతీరమందలి 'కాల్' అను పట్టణమున కధిపతియని చెప్పినాఁడు. ఇది పశ్చిమసముద్రతీర పట్టణమై కర్ణాటములోఁ జేరియుండును. కొండవీటి కైఫియ్యతులోనున్న ప్రకారమితఁడు కోమటివెంకారెడ్డి యాస్థానకవిగానుండి విజయనగరమునకుఁబోవుట కర్ణాటదేశమందలి ప్రేమను దెలియఁజేయుచున్నది. వీథినాటకములోని

శా. "కుళ్ళాయుంచితిఁ గోకసుట్టితి మహాకూర్పాసముందొడ్గితిన్
వెల్లుల్లిన్ దిలపిష్టమున్ బిసికితిన్ విశ్వస్త వడ్డింపఁగాఁ

జల్లాయంబలిత్రావితిన్ రుచులుదోసంబంచుఁ బోనాడితిన్
దల్లీకన్నడరాజ్యలక్ష్మీ ! దయలేదా నేను శ్రీనాథుఁడన్."

అను పద్యమునఁ గర్ణాటరాజ్యమును దల్లీయని సంబోధించినాఁడు. ఈతని కవితయందే మొదటఁ గన్నడపదము లెక్కువగఁ గాన్పించుచున్నవి. ఈ నిదర్శనములన్నియు శ్రీనాథుని జన్మభూమి కర్ణాటదేశమని చాటుచున్నవి. ఈయన కర్ణాటదేశమందు జన్మించినను దలిదండ్రులితని శైశవముననే యుద్యోగవశముననో లేక మఱియొక కారణముననో కొండవిటిసీమకు వచ్చియుందురు. శ్రీనాథుని గ్రంథములు చదివినచో నంధ్రభాష యతని స్వభాషగనే కాన్పించును. ఇంతభాషాకౌశలము పఠనమాత్ర సాధ్యము కాదు. కాననితఁడు బాల్యమునుండి తెలుఁగుదేశములో నుండెననుటకు సంశయములేదు. బాగుగ మాటలాడ నేర్చినప్పటినుండి తెలుఁగే మాట్లాడియుండును. తలిదండ్రులతో నింట నప్పుడప్పుడు మిశ్రమ కర్ణాటము మాటలాడుచుండినను నివసించినది కొండవీటిసీమ కావునఁ దెలుఁగువారితోఁ గలసిమెలసి తెలుఁగువారితో సహవాసముచేసి ప్రాతఃకాలము మొదలు సాయంత్రమువఱకుఁ దెనుఁగులోనే మునిఁగి తేలుచుండవలసినవాఁడై చివరకుఁ దెనుంగుదేశస్థుఁడుగా మాఱియుండును. కాఁబట్టియే బెండపూడియన్నమంత్రి "పాక నాటింటివాఁడవు బాంధవుఁడవు" అని చెప్పినాఁడు. ఇతఁడు రాజమహేంద్రవరమును బాలించిన రెడ్ల యాస్థానకవి అని కొందఱు వ్రాసియున్నారు. కాశీఖండము వీరభద్రారెడ్డికి, భీమఖండము తన్మంత్రియైన బెండపూడి అన్నయ్యకును నంకితము చేయుటయే వీరుదానికిఁజూపు కారణములై యున్నవి. ఇతఁడు తాను రచించిన గ్రంథములలోఁ జాలభాగము కొండవీటివారికే యంకితము చేసెను. పండితారాధ్యాది పెక్కుకృతులనందిన మామిడిప్రెగడయ్యది కొండవీటిసీమలోని బలిజేపల్లి. శృంగారనైషధకృతినందిన మామిడిసింగనప్రెగడయ్యతమ్ముఁడు. హరవిలాసకృతినందిన తిప్పయ్య కొండవీటి కుమారగిరి భూపాలునకు సుగంధద్రవ్యము లిచ్చువాఁడు. కొండవీటి కైఫియ్యతులో నీ క్రింది విషయము వ్రాయఁబడినది. కుమారగిరి భూపాలుని కుమారుఁడగు కోమటివెంకారెడ్డివద్ద శ్రీనాథుఁడాస్థానకవీశ్వరుఁడుగానుండి కర్ణాటరాజుల రాజధానియైన విద్యానగరమునకుఁ బోయెను. అప్పుడు రాజ్యముచేయుచుండిన హరిహరరాయలితనిని గౌరవించి నీవునివసించు స్థలమేదియనఁగా నతఁ డీ క్రిందిపద్యము చెప్పెను.—

సీ. "పరరాజగిరిదుర్గవరవైభవశ్రీలఁ గొనికొని చెడనాడుకొండవీడు
పరిపంథిరాజన్యబలముల బంధించి కొమరుమించినబోడు కొండవీడు
ముగురురాజులకును మోహంబుపుట్టించు గుఱుతైనయుఱిత్రాడు కొండవీడు
చటులవిక్రమకళాసాహసంబొనరించు కుటిలాత్ములకుఁగాడు కొండవీడు

జవనఘోటకసామంత సరసవీర
భటనటానేక హాటకప్రకటగంధ
సింధురారవమోహనశ్రీలఁ దనరు
కూర్మి యమరావతికిజోడు కొండవీడు."

హరిహరరాయలొంటిస్తంభపుమేడ కట్టింపఁదలఁచి సభలోఁగూర్చుండి యెవరైన నొంటిస్తంభపుమేడ యిదివఱకుఁ గట్టినారా యని యడుగ శ్రీనాథుఁడు లేచి కోమటి వెంకారెడ్డి కొండవీటిలోఁ గట్టించుచుండెనని చెప్పెను. వాస్తవమున కప్పుడు వెంకారెడ్డి కట్టించుచుండలేదు. కావున హరిహరరాయలు పోయిచూచినచోఁ దనమాట యసత్యముకాకుండ శ్రీనాథుఁడు నిజశక్తిచే నవులూరిలోనున్న బ్రహ్మాండమైన తుమ్మచెట్టును గొండవీటికి రప్పించి మేడనిర్మింపఁబడునట్లు చేసెను. హరిహరరాయలు దూతనుబంపి కనుఁగొనఁగా శ్రీనాథుఁడు చెప్పినది నిజమాయెను. అతఁడు మెచ్చి అతనికి జాగీరొసఁగెను. ఒంటిస్తంభము మేడవిషయమెట్లున్నను శ్రీనాథుఁడు కోమటి వెంకారెడ్డి యాస్థానమందుండెనని పైయంశములు తెలుపుచున్నవి. పల్నాటి వీరచరిత్రము కొండవీటిసీమప్రాంతములయందుండియే వ్రాసినాఁడు. పైనిఁ జెప్పఁబడినరీతి నితఁడువ్రాసిన గ్రంథములలో రెండుతప్పఁ దక్కినవన్ని కొండవీటివారికే యంకితము చేసినాఁడు. కొండవీటి వేమారెడ్డివద్దను, కోమటి వెంకారెడ్డివద్దను నీయన ఉండెనని కొండవీటికైఫియ్యతు చాటుచున్నది. ఇన్ని ప్రబల నిదర్శనములు శ్రీనాథుఁడు కొండవీటిరెడ్ల యాస్థానవిద్వాంసుఁడని ఘోషించుచుండఁ గాశీఖండము భీమఖండము రెండు గ్రంథములు రాజమహేంద్రవరమువారి కంకితము చేసెనన్న కారణమున నతఁడు రాజమహేంద్రవరపురెడ్ల యాస్థానమున నుండెనని చెప్పుట కారణమునకు దూరముగ నుండును. తననివాసస్థలమైన కొండవీటిసీమలో నఖండసామ్రాజ్యధురంధురులుండ వారిని విడిచి వారిచేనీయంబడిన కొద్దిరాజ్యమేలెడు రాజమహేంద్రవర రెడ్లకాస్థాన విద్వాంసు డయ్యెననుట యసంభవము. కావున

"వీరభద్రారెడ్డి విద్వాంసుముంజేత వియ్యమందెనుగదా వెదురుగోడియ"

అను సీసపద్యపాదమునకుఁ దార్వాపర్యము విచారించి వీరభద్రారెడ్డికిఁ బ్రియుఁడైన విద్వాంసుఁడని యర్థము చెప్పవలయునుగాని యాస్థానవిద్వాంసుఁడని యర్థముచెప్ప నవకాశములేదు. కొండవీటిరెడ్లకు బంధువులుగాన రాజమహేంద్రవరపురెడ్లు శ్రీనాథుని సన్మానించి కృతులందియుందురు. గ్రంథములవలన నితఁడు 1397 సం॥ మొదలు 1422 సం॥ వఱకు రాజ్యముచేసిన * ఫిరోజషాకాలములోను, 1381 సం॥ మొదలు 1395

సం॥ వఱకు రాజ్యము చేసిన కుమారగిరిభూపాలుని కాలములోను, 1379 సం॥ మొదలు 1401 వఱకు రాజ్యము చేసిన హరిహరరాయల కాలములోను, 1395 సం॥ మొదలు 1423 వఱకు రాజ్యము చేసన కోమటి వెంకారెడ్డి కాలములోను, వీరభద్రారెడ్డి పేరుగ 1415 సంవత్సరమునకుఁ బూర్వమే రాజ్యమునకువచ్చి 1436 సం॥ వఱకు రాజ్యము చేసినట్లు దృష్టాంతములుగల యల్లాడ వేమారెడ్డి కాలములోను నున్నట్లు తెలియఁగలదు. ఇతఁడు భీమకాశీఖండములల్లాడ వేమారెడ్డి కాలములో రచించెను. కాశీఖండములోని "చిన్నారిపొన్నారి" యను పద్యమువలన నితనికి నైషధము రచించునాఁటికి 20 సంవత్సరములును, భీమఖండము రచించునాఁటికి 40 సంవత్సరములును వయస్సుండినట్లూహింపవచ్చును.

భీమేశ్వరపురాణములోని

ఉ. "అన్నయమంత్రిశేఖరుఁ డహమ్మదుశాసనదానభూమిభృ
త్సన్నిధికిన్ మదిన్ సముచితంబుగ నేమమహీసురేంద్ర రా
జ్యోన్నతి సంతతాభ్యుదయ మొందఁగఁ బారసిభాష వ్రాసినం
గన్నులపండువై యమరుఁ గాకితమందలివర్ణపద్ధతుల్."

అను పద్యమువలన నహమ్మదుషా రాజ్యమునకువచ్చిన తరువాతనే భీమఖండము రచింపఁబడినట్లు తేలుచున్నది. కల్బరిగ (Kulburga) రాజధానిగఁ బరిపాలన చేసిన భామినీరాజులలో నహమ్మదుషా యొకఁడు. ఈయన క్రీ॥ శ॥ 1422 సం॥ మొదలు 1435 సం॥ వఱకు రాజ్యము చేసెను. దీనినిఁబట్టి భీమఖండము 1424 సం॥ ప్రాంతమున శ్రీనాథుఁడు రచించియుండునని చెప్పనగును. కావున నితఁడు క్రీ॥ శ॥ 1384 సం॥ ప్రాంతమున జన్మించి, 1404 సం॥న నైషధము, 1424 సం॥ ప్రాంతమున భీమఖండము, 1432 సం॥ ప్రాంతమునఁ గాశీఖండము నాంధ్రీకరించియుండును.

శ్రీనాథుఁడాచారమునకుఁ వీరశైవుఁడైనను శివుఁడని విష్ణువని పోరాడెడు బుద్ధిమంతులవలెఁగాక న్యాయాదిశాస్త్రము లభ్యసించి జ్ఞానదృష్టిగలిగిన వేదాంతిగాఁ గన్పట్టుచున్నాఁడు. హరవిలాసములోని

గీ. "ఆవగించంత బూదిమైనల దటేని
వెలఁదిగుమ్మడికాయంత వెట్టిపుట్టు."

అను పద్యపాదముల వలనను మఱికొన్ని పద్యములవలనను భస్మధారణాది బాహ్యవేషములయం దితనికెక్కువ నమ్మకము లేనట్లు కనఁబడుచున్నది. ఈయనగొప్ప

పౌరాణికుఁడు. తర్క వ్యాకరణాదుల పరిచయమితఁడు తన గ్రంథములలోఁ గనబరచెను. భీమఖండకృతినాయక వంశవర్ణనములోని

"కంసాసురధ్వంసిచరణపల్లవంబులు దనకుఁబుట్టినిల్లు కావునఁ గారణగుణసంక్రమణంబునంబోలెఁ జామరచ్ఛత్రధనుఃఖడ్గాది చిహ్నోపశోభితంబై"
యను వాక్యములును

సీ. "ముక్కంటిదరహాసమున కనుప్రాసంబు మిన్నేటిపేటికి మిక్కుటంబు
శారదాజ్యోత్స్నాప్రసాదంబునకు పీస్పనలువశుద్ధాంతమ్మునకనుభావ
కల్పకారామలేఖకుఁ బ్రతిచ్ఛందంబు త్రిదశేంద్రు కరటికాడ్రేడితంబు
పుండరీకారణ్యమునకు నధ్యాహారమమృతాంబునిధికభిధాంతరంబు."

అనువాక్యములును శ్రీనాథుని తర్కవ్యాకరణజ్ఞానమును దిఙ్మాత్రము సూచించుచున్నవి. తర్కపరిభాషాపదములైన "ప్రధ్వంసాభావము, ప్రాగభావము" అనునవి వాడఁబడిన పద్యమొకటి వీథిలోఁ గలదు గాని యది యశ్లీలముగ నుంటచే నుదాహరింపఁజాలను. ఈ పద్యము శ్రీనాథరచితమో కాదో కూడ విచారింపవలసియున్నది. శ్రీనాథుఁ డాంధ్రీకరించిన కాశీఖండము నైషధము "కాశీఖండమయఃపిండం, నైషధం విద్వదౌషధం" అని ప్రతీతిగన్న గ్రంథములు. ఇంద్రియలోలత్వ మీయన కారోపించి యనేక కథలు చెప్పుచున్నారు. యౌవనమున స్వేచ్ఛగాఁ దిరిగినమాట వాస్తవమైనట్లే తెలియుచున్నది. ఇది యితనికిఁగల కళంకమని చెప్పక తప్పదు. కాని కాశీఖండము రచించునాఁటి కితని మనోవృత్తియందును బ్రవర్తనమునందును సంపూర్ణమైన మార్పు కలిగినట్లు కాన్పించుచున్నది. శ్రీనాథుఁడు రచించిన గ్రంథములు మరుద్రాజచరిత్రము, శాలివాహన సప్తశతి, పండితారాధ్య చరిత్రము, భీమఖండము, కాశీఖండము, వీథి, హరవిలాసము, పల్నాటివీరచరిత్రము. నందనందన శతకముకూడ రచించినట్లు తెలియవచ్చుచున్నది. వీనిలో మరుద్రాజచరిత్రము, శాలివాహనసప్తశతి, పండితారాధ్య చరిత్రము నిప్పుడు కానరావు. వీథి అనఁబడు చిన్నపుస్తకమొకటి ఇప్పుడున్నది కాని యది శ్రీనాథకృతమో కాదో సందేహముగ నున్నది. వీథి దశవిధరూపకములలో నొకటి. దీనికి లక్షణము దశరూపకమునం దీక్రిందివిధమునఁ జెప్పఁబడినది:—

'वीथी तु कैशिकीवृत्तौ सन्ध्यङ्गाङ्कैस्तु भाणवत्
रसः सूच्यस्तु श्रृङ्गारः स्पृशेदपि रसान्तरम् ।
युक्ता प्रस्तवनाख्यातैरङ्गैरुद्घात्यकादिभिः
एवं वीथी विधातव्या ह्येकपात्रप्रयोजिता' ॥

దీనిలోఁ బ్రధానరసము శృంగారము. సంధ్యంగాంకములు భాణములోరీతి నుండును. ప్రస్తావనలో నుద్ఘాత్యకాద్యంగము లుండవలయును. మహావిద్వాంసుఁడైన శ్రీనాథుఁడు పూర్వోక్తలక్షణ లక్షితంబగు వీథీరచన కారంభించి యసందర్భములైన వెట్టితొట్టిపద్యములతో గ్రంథము నింపియుండుట సంభవింపనేరదు. శ్రీనాథుఁడు సలక్షణమైన వీథి రచించియుండును. అది యేకారణముచేతనో నశింపఁగఁ గొన్ని శ్రీనాథ రచిత చాటుపద్యములను గొన్నియన్య వికృతములను గైకొని గ్రంథ మీరూపమును దాల్చియుండును. దీనిలోఁ గొన్నిపద్యములు గౌరవహీనులైన వ్యర్థులు వ్రాసినవిగాఁ గనఁబడుచున్నవి.

లెస్లిస్టిఫెన్ (Leslie stephen) అనునతఁడు జార్జి ఎలియట్ (George Eliot) జీవచరిత్రములో "A strong imaginative genius is developed early; it is an overmastering faculty which forces its possession into activity often before knowledge or serious thought has accumulated; draws romances, epic poems, and dramas from children in their teens; and suggests that not only the material surroundings, but even the storage of intellectual accomplishments is but an accidental stimulus to the innate creative power" అనిచెప్పినట్లు శ్రీనాథుఁడు బాల్యమునుండి పద్యాలు రచించుచుండెడువాఁడు. బుద్ధివిజ్ఞానయుతము కాకముందే యపూర్వమేధావంతుల నిర్భరశక్తి పొంగి పొరలి బయటికివచ్చుచుండుట సహజము. సీ. "చిన్నారి పొన్నారి చిఱుతకూకటినాఁడు రచియించితిని మరుద్రాజచరిత" అనుపాదమువలన నీయనపిల్లజుట్టునాఁడే మరుద్రాజచరిత్రము వ్రాసెనని తెలియఁగలదు. భీమఖండములోని "భాషించినాఁడవు బహుదేశబుధులతో విద్యాపరీక్షణవేళలందు" అనువాక్యమువలన గృహమునో లేక తన్నాదరించు సంస్థానమునో కనిపెట్టికొనియుండు తక్కిన వారివలెఁ గాక యంధ్రదేశమంతయుఁ గలయఁ దిరిగినట్లు కాన్పించుచున్నది. రెడ్డిరాజాస్థానమందు విద్యాధికారిగానుండి అనేకదేశపండితులను పరీక్షించెనని తెలియుచున్నది. వాస్తవముగా శ్రీనాథుఁడు తెలుగుదేశములో పుట్టిన మహావిద్వాంసులలో ఒకడు. వేంకటగిరి ప్రభువగు సర్వజ్ఞసింగమనాయుని యాస్థానమునకుఁ బోయినప్పుడు "గోలకొండ, మాలముండ, పూలదండ, కొత్తకుండ" యను పదములనుంచి భారతార్థమువచ్చునట్లు పద్యము చెప్పుమని యడుగ నీక్రిందివిధమునఁ జెప్పెనని వాడుకగలదు—

గీ. "ఓయిధృతరాష్ట్ర నీ కొడుకుత్త గోల
కొండ విధ మాలముండఁ గృష్ణుండు కాచి
పాండుసూనుల గెల్పించు నండయగుచు
నుదరమునఁ బూలదండ రే కొత్తకుండ."

[ఉత్తగోల=వట్టి యవివేకి; కొండవిధము = కొండవలె నభేద్యమై; ఆలము = యుద్ధము; ఉండన్ =ఉండఁగా; ఉదరమున = మెడలో వేసికొనిననుదరము పైఁబడి యుండు; పూలదండరేకు = పువ్వులదండరేకు; ఒత్తకుండ = ఒత్తుకొనకుండ ననఁగా నలఁగకుండ; మెడలో వేసికొన్న పూలదండయొక్క రేకైన నలఁగకుండు నంతభద్రముగా రక్షించి కృష్ణుఁడు పాండవుల గెలిపించునని యర్థము].

మఱియు నితని చాటుపద్యములని యీ క్రిందివి వాడుకలో నున్నవి :—

సీ. దీనారటంకాలఁ దీర్థమాడించితి దక్షిణాధీశు ముత్యాలశాలఁ
బలుకుతోడై తాంధ్రభాషామహాకావ్య నైషధగ్రంథ సందర్భమందుఁ
బగులఁగొట్టించి తుద్భటవివాదప్రౌఢి గౌడడిండిమభట్టుకంచుఢక్క
చంద్రశేఖరక్రియాశక్తిరాయలయొద్దఁ బాదుకొల్పితి సార్వభౌమబిరుద
మెఁటులమెప్పించెదో నన్నునింకమీఁద, రావుసింగమహీపాలుఁ డీవిశాలు
నింటఁగొలువున నెలకొనియుండినీవు, సరససద్గుణ నికురుంబ శారదాంబ. 1

సీ. కవిరాజుకంఠంబు కౌఁగిలించెనుగదా పురవీథినెదురెండ పొగడదండ
సార్వభౌముని భుజాస్తంభమెక్కెనుగదా నగరివాకిటనుండు నల్లగుండు
ఆంధ్రనైషధకర్తయంఘ్రియుగ్మంబునఁ దగిలియుండెనుగదా నిగళయుగము
వీరభద్రారెడ్డి విద్వాంసుముంజేత వియ్యమందెనుగదా వెదురుగొడియ
కృష్ణవేణమ్మ గొనిపోయె నింతఫలము, బిలబిలాక్షులు తినిపోయెఁ దిలలు పెసలు
బొడ్డుపల్లెను గొడ్డేఱి మోసపోతి, నెట్లు చెల్లింతుఁ దంకంబు లేదునూళ్లు. 2

సీ. కాశికావిశ్వేశుఁ గలిసె వీరారెడ్డి రత్నాంబరంబు లేరాయఁ డిచ్చుఁ
గైలాసగిరిఁబండె మైలారువిభుఁ డేగె దినవెచ్చ మేరాజు తీర్పఁగలఁడు
రంభఁగూడెఁ దెనుంగురాయరాహుత్తుండు కస్తురికేరాజుఁ బ్రస్తుతింతు
స్వర్గస్థుఁడయ్యె విస్సనమంత్రి మఱిహేమపాత్రాన్న మెవ్వనిపఙ్క్తిఁ గలదు
భాస్కరుఁడు మున్నె దేవునిపాలికరిగెఁ, గలియుగంబుననింకనుండఁ గష్టమనుచు
దివిజకవివరుగుండియల్ దిగ్గురనఁగ, నరుగుచున్నాఁడు శ్రీనాథుఁ డమరపురికి. 3

శా. అత్యుత్యంబుగ సాంపరాయని తెలంగాధీశ కస్తూరికా
భిక్షాదానము చేయుమా సుకవిరా డ్బృందారక శ్రేణికిన్
దాక్షారామచళుక్యభీమవర గంధర్వాప్సరో భామినీ
వక్షోజద్వయకుంభికుంభములపై వాసించునవ్వాసనల్. 4

వీనిలోని 1, 4 పద్యములు వీథినాటకమునఁ గానవచ్చుచున్నవి.

ఈయన దేశసంచారము చేసెనుగావున నే తెలుఁగు దేశమందలి యాచారములను నడవడికలను సంపూర్ణముగ గ్రహించెను. వివిధ దేశములం దిరుగునప్పుడు నానావిధ జనులతోఁ గలియుట సంభవించును గదా. ఈతనికృతులకు వైశిష్ట్యము కలిగించిన కారణములలో బహుదేశసంచారమే ముఖ్యమైనదని చెప్పవచ్చును.

శ్రీనాథుఁడు మొదటఁ బల్నాటిసీమకుఁబోయినప్పు డతనివైదుష్యము నచ్చటి ప్రజలదివర కెఱుఁగమిచేఁగాఁబో లంత గౌరవము చూపఁబడినట్లు కాన్పింపదు. అతఁడును దనకుఁ గలిగిన యనాదరణ సూచకముగఁ గొన్నిగ్రామముల మీదఁ బద్యములు చెప్పినాఁడని జనులిప్పటికి వాడుకొనుచున్నారు. వానిలోఁ గొన్నిపద్యముల నిం దుదాహరించెదను.—

క. నెమలిపురి యమపురంబుగ, యముఁడాయెను బసివిరెడ్డి యంతకుమిగులన్
యమదూతలైరి కాపులు, క్రమమెఱుఁగని దున్నలైరి కరణాలెల్లన్.

క. గుడిమీదికోతిచేతను, గుడిలోపలిలంబివారి కోడలిచేతన్
నడివీథిలంజచేతను, నడిగొప్పులయోరుగాలి నణఁగితినుమీ.

క. జొన్నకలి జొన్నయంబలి, జొన్నన్నము జొన్నపిసరు జొన్నలెతప్పన్
సన్నన్నము సున్నసుమీ, పన్నుగఁబల్నాటిసీమ ప్రజలందఱకున్.

క. లేకులమందై బోనము, పాలాయెను మంచినీళ్ళుపడియుండుటకే
నేలేక ఱవై పోయెను, గాలిసగుర్జాలనిష్టకామేశహరా.

గీ. ఊరు వ్యాఘ్రనగర (పులిపాడు) మురగంబు (శేషయ్య) కరణంబు
కాపుకపివరుండు (హనుమయ్య) కసవు (పుల్లయ్య)నీఁడు
గుంపుగాఁగఁజేరి గురిజాలసీమలో
నోగులంతగూడి రొక్కచోట.

కార్యమపూడిని శ్లాఘించుచు నీక్రిందిపద్యమును జెప్పెనఁట:—

ఉ. "వీరులుదివ్యలింగములు, విష్ణువునాయఁడు, కల్లిపోతరా
జారయ భైరవుండు (తుహినాద్రి జయంకమ, నిర్మలాంబువై)
కేరెడు గంగధారమడుగేమణి కన్యక యన్నిభంగులం
గారెమపూడిపట్టణము కాశిసుమీ కనుఁగొన్నవారికిన్."

ప్రథమమున గౌరవము వడయకపోయినను రానురాను శ్రీనాథుఁడు పల్నాటి వారితో మిక్కిలి మైత్రి వాటించి తనవార్ధకమునంతయు నచ్చటనే గడపెను. పల్నాటి వీరచరిత్ర మచ్చటనుండియే వ్రాసినాఁడు. ఇప్పుడు కానవచ్చుచున్న గ్రంథములలో నితఁడు మొదట రచించినది శృంగారనైషధము. ఇతనికిఁ బూర్వము కృతికర్తలందరు విస్తారముగఁ బురాణములఁ దెనిఁగించిరి. క్రొత్తమార్గ మవలంబించి యితఁడు శ్రీహర్ష రచిత నైషధకావ్యము నాంధ్రీకరించి కొండవీటి పేమారెడ్డి మంత్రియైన మామిడిసింగన కంకిత మొనర్చెను. మామిడిసింగన కొండవీటిసీమలోని బలిజేపల్లి నివాసి. బలిజేపల్లిలో నిప్పటికి మామిడివారు గలరు. నైషధమునఁ దనయాంధ్రీకరణపద్ధతిని గూర్చి యిట్లు చెప్పికొనినాఁడు.—

"భట్టహర్ష మహాకవీశ్వరుండు కవికులాదృష్టాధ్వపాంథుం డొనర్చిన * నైషధ శృంగార కావ్యంబాంధ్ర భాషావిశేషంబున నశేషమనీషి హృదయంగమంబుగ శయ్యనను సరించియు నభిప్రాయంబు గుఱించియు భావం బుపలక్షించియు రసంబుపోషించియు నలంకారంబు భూషించియు నౌచిత్యం బాదరించియు ననౌచిత్యంబు పరిహరించియు మాతృకానుసారంబుగఁ జెప్పఁబడిన యీభాషా నైషధకావ్యంబు"

ఇతఁడు చాలాశ్లోకాలను సరిగా తెనిగించలేదు.

---

* కావ్యాస్వాదానికి అనుకూలమై రసప్రలుబ్ధమైన బుద్ధియొక్క వినాశం అధికంగా తెలుగుదేశంలో తెలుఁగుపద్యకర్తల్లో నన్నయకాలంనుండీ ఆరంభమై శ్రీనాథుడిసమయంవరకు సమగ్రతను సమీపించినట్లు కనబడుతున్నది. కనుకనే కాళిదాసు రఘువంశాది కావ్యాలుండగా వాటిను పేక్షించి తదపేక్షచేత, అధమకావ్యమనదగిన నైషధంమీదికి అతడిదృష్టిపోయి "కవికులాదృష్టాధ్వపాంథుండు" అని శ్రీహర్షుణ్ణి పొగడివుంటాడు. కుమారసంభవంలోని కొన్నిశ్లోకాల నితడు తెలిగించినా దాన్ని ప్రధానంగా పాటించలేదు. విస్తరంనైషధ తత్త్వజిజ్ఞాసలో ద్రష్టవ్యం. ఇట్లానే పింగళి సూరన్న శుష్కమైన శ్లేషపద్యరచనకు ఆశపడ్డాడు. ఈతీరుగా కాల ప్రభావం, నన్నయ్యపద్యంయొక్క దుర్లక్షణాలైన వళిప్రాసలచెత్త, అణచివేస్తున్నప్పు

श्लो तव रूपमिदं तया विना विफलं पुष्पमिवावकेशिनः ।
इय मृद्धदना वृथावनी स्ववनी सम्प्रवदत्पिकाऽपि का ॥ स २ ॥

దీనిని.—

గీ. "సౌరభములేనియట్టి పుష్పంబువోలె
గండుఁగోయిలవెలిదైన కానవోలె
నధిప దమయంతితోడ సఖ్యంబులేని
నీదుసౌందర్య విభవంబు నిష్ఫలంబు."

అని తెనిఁగించెను. సంస్కృతమున "అవకేశినః విఫలంపుష్పమివ (వంధ్యవృక్షము యొక్క ఫలరహితమైన పుష్పమువలె)" అనియుండ 'సౌరభములేని యట్టి పుష్పంబు వోలె' నని తప్పుగా తెలిగించినాడు. "ఇయమృద్ధధనావృథావనీ" అనునది విడిచిపెట్టినాఁడు. "స్వవనీ సంప్రవదత్పికాపి కా (కూయుచున్నకోకిలలుగల సోద్యానవనము నిరర్థకము)" అనియుండ దీనిభావము పరిత్యజించి "గండుఁగోయిలవెలిదైన కాన వోలె" నని అపానువాదం చేసినాడు.

श्लो तरुमूरुयुगेन सुन्दरी किमु रम्भां परिणाहिना परं ।
तरुणीमपि जिष्णुरेव तां धनदापत्यतपःफलस्तनीम् ॥ स २ ॥

దీనిని.—

మ. వనజాతేక్షణ యూరుయుగ్మమును లావణ్యంబునుం గేలికా
ననసంక్రందన పట్టణప్రకటజనస్థానలన్ రంభలన్
ధనదాపత్యతపఃఫలస్తనుల నత్యంతాభిరామాంగులన్
మనుజాధీశయధఃకరించుఁ బొగడన్ మాబోంట్లకున్ శక్యమే.

అని యాంధ్రీకరించినాఁడు. దీనిలో మూలమునలేని 'కేలికాననసంక్రందన పట్టణ ప్రకటజనస్థానలన్'' అను క్రొత్తవిశేషణము చేర్చినాఁడు. మూలములోని "ధనదాపత్య తపఃఫలస్తనీం" అనునది తరుణీపరమైన రంభాశబ్దమునకు విశేషణముకాని తరుపరమైన రంభాశబ్దమునకు విశేషణముకాదు. ఈతఁడీ విశేణము రెంటికిఁ జేర్చినాఁడు.

---

టికీ శ్రీనాథుడు పింగళి సూరన అక్కడక్కడ వాటిని అతిక్రమించి నిసర్గకవితాపరత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. వీరిద్దరిలో భావసౌకుమార్యాదుల్లో పింగళి సూరన్న మేలన వచ్చును. మురికిపద్యాలకు వీరుబలిగాకుంటే వీరివల్ల తెలుగుదేశాని కెంత ప్రకృష్టమైన కృతులు లభించి ఉండేవో అని సంభావిస్తుంటాను.

మూలములోఁ దరుతరుణీవాచకములైన రంభాశబ్దములకు రెంటికి వేఱువేఱువిశేషణము లుండ నితఁడు విశేషణములన్నియు రెంటికిఁ గలిపిచెప్పెను. పద్యమునకు శ్లోకమునకు నర్థములోఁగూడఁ గొంత భేదము కన్పట్టుచున్నది. ఇట్లే యెన్నోచోట్ల తప్పుత్రోవ ననుసరించి దోషవంతమైన అనువాదములు చేసినాడు. మూలములోనున్న శ్లోకముల నొకదానివెంట నొకటిని క్రమముగఁ దెనిఁగింపలేదు. "నిపీయయస్య క్షితిరక్షిణః కథాః" అను ప్రథమశ్లోకము బొత్తిగ వదలిపెట్టి "సువర్ణదండైకసితాతపత్రితజ్వలత్ప్రతాపావళికీర్తిమండలః" అను రెండవశ్లోకములోని భాగమును, "పవిత్రమత్రాతనుతేజగద్యుగే స్మృతారసక్షాళనయేవతత్కథా" అను మూఁడవ శ్లోకభాగమును "అముష్యవిద్యారసనాగ్రనర్తకీ" అను నైదవశ్లోకములోని భాగమును "స్ఫురద్ధనుర్నిస్వనతద్ఘనాశుగ ప్రగల్భవృష్టిర్వ్యయితస్యసంగరే" అను తొమ్మిదవశ్లోకములోని భాగమునుజేర్చి కథాప్రారంభమందలి మొదటిపద్యము చెప్పినాఁడు. ప్రథమసర్గమును ప్రథమాశ్వాసముగ నాంధ్రీకరించి ద్వితీయ తృతీయ చతుర్థసర్గముల ద్వితీయాశ్వాసమందును; 5, 6, 7 సర్గములఁ దృతీయాశ్వాసమందును; 8, 9 సర్గములను 10-వ సర్గములోని 87 శ్లోకములను జతుర్థాశ్వాసమందును; 10-వ సర్గములో మిగిలినశ్లోకములను, 11, 12, 13 సర్గములను, 14-వ సర్గములోని 47 శ్లోకములను పంచమాశ్వాసమందును; 14-వ సర్గములో మిగిలిన శ్లోకములను, 15-వ సర్గమును, 16-వ సర్గములోని 113 శ్లోకములను, షష్ఠాశ్వాసమందును; 16-వ సర్గములో మిగిలిన శ్లోకములను, 17, 18 సర్గములను సప్తమాశ్వాసమందును; 19, 20, 21, 22 సర్గముల నష్టమాశ్వాసమందును నిమిడ్చినాఁడు. సంస్కృతములోని నైషధము నిట్లు తుంచికూర్చి వికృతం చేసినాడు."సంస్కృతమునందున్న స్వయంవర సమయమున సరస్వతీ వచనానుసారముగ దమయంతీదేవి నలునికంఠమున మధూకదామమును వేసిన తరువాత, ననఁగా నలవరణానంతరమున, నింద్రాదులు స్వస్వరూపములఁ దాల్చినట్లు సంస్కృత నైషధమునఁ జతుర్దశ సర్గమునందుఁ జెప్పఁబడియుండ నలుని కంఠమున దమయంతి పుష్పమాల వేయకముందే యింద్రాదులు నలాకారము విడిచిరని యాంధ్రనైషధ పంచమాశ్వాసమున నున్నది. కాలక్రమము మఱచిపోయి "పాకశాసనుండు, పావకుండు, పరేతపతి, పాశహస్తుండు, పంచముండనైన నేను నియ్యేపురముం బాండవులు పాంచాలింబోలెఁ బంచికొని యనుభవింతము" అని కలి పలికినట్లు సప్తమాశ్వాసమునఁ జెప్పినాఁడు. రాజతరంగిణి యను గ్రంథములో

శ్లో 'शतेषु षट्सु सार्धेषु त्र्यधिकेषु च भूतले ।
कलेर्गतेषु वर्षेषु प्राभवन् कुरुपाण्डवाः '॥

అని కలియుగమునఁ గొన్ని సంవత్సరములు గడచినతరువాతఁ గురుపాండవు లున్నట్లు చెప్పఁబడినది. ఇదిగాక బృహదశ్వుఁడు నలోపాఖ్యానము ధర్మజునకుఁ జెప్పుట పురాణసిద్ధము. కనుకఁ బాండవులకంటెను నలుఁడు మిక్కిలి పూర్వుఁడనుట నిర్వివాదాంశము. ఈ పొరపాటు శ్రీనాథునిదికాదు. శ్రీహర్షుఁడే

श्लो 'यतस्त्वं सहकर्तुं मां पाञ्चाली पाण्डवैरिव ।
सापि पञ्चभिरस्माभिः संविभिज्यैव भुज्यताम्' ॥

అని సప్తదశసర్గమునఁ జెప్పెను. దీనినే శ్రీనాథుఁ డాంధ్రీకరించెను.

నైషధమునకు వ్యాఖ్యానము వ్రాసిన నారాయణ పండితుఁ డీ విషయము నిట్లు సమర్థించినాఁడు:—

"पाण्डवानामग्रभावित्वात्तदानीं दृष्टान्तत्वेन
कलेर्योगित्वाद्भविष्यदर्थज्ञानसामर्थ्याद्वचनं युक्तम्" ॥

"जगत्प्रवाहानादितया पाण्डवपाञ्चालीवृत्तान्ताना
मतीतत्वात्तदुदाहरणीकृत्यैतदुक्तमितिवा ॥" (పాండవుల యగ్రభావిత్వము (ముందుండుట) వలన నప్పటి దృష్టాంతత్వముచేఁ గలియొక్క యోగిత్వ భవిష్యదర్థజ్ఞాన సామర్థ్యకారణమున వచనము యుక్తము. లేదా, జగత్ప్రవాహముయొక్క యనాదితచేతఁ బాండవపాంచాలీ వృత్తాంతముల యతీతత్వమువలన నది యుదాహరణముచేసి చెప్పఁబడినది.)

ఇతఁడు శ్రీహర్షునియందలి గౌరవాతిశయముచే నెటులైన సమర్థింపవలెనని యత్నించెఁగాని జ్ఞానదృష్టితోఁ జూచినయెడల నీసమర్థనము యుక్తియుక్తముగఁ గాన్పింపదు. కవి ప్రమాదమునొందెననుటయే సమంజసముగా నుండును. బహుశః రచనావేగమున నీ పొరపా టతఁడు కనుఁగొని యుండకపోవచ్చును. "ప్రమాదో ధీమతామపి" యను నార్యోక్తి కలదుగదా.

నైషధమునందు నలచరిత్ర సంపూర్ణముగ లేదు. నలుఁడు దమయంతిని బెండ్లాడి స్వనగరము ప్రవేశించిన తరువాతఁ గలి యచ్చటికివచ్చి మందిరోద్యానమునందలి పొదలోని తాండ్రచెట్టు తొఱ్ఱలోనుండి నలునియందు రంధ్రాన్వేషణము చేయుచుండ నూతన దంపతు లిష్టోపభోగములఁ బొందునప్పుడు ప్రొద్దుగ్రుంకఁగా నుదయించిన చంద్రుని వర్ణనముతో గ్రంథము సమాప్తి గావించినాఁడు. శ్రీహర్షుఁడు నైషధము సంపూర్ణముగ నలువది సర్గములలో రచించెనని కొంద ఱందురుగాని యది యవిశ్వాస్యము.

ఈవిషయమై నైషధమునకు వ్యాఖ్యానము వ్రాసిన నారాయణ పండితుఁ డిట్లు నుడువుచున్నాఁడు:—

"महाभारतादौ वर्णितस्याप्युत्तरनलचरितस्य नीरसत्वान्नायकानुदयवर्णनेन रसभङ्गसद्भावाच्च काव्यस्य च सहृदयाह्लादनफलत्वाच्चात्रोत्तरनलचरित्रं श्रीहर्षेण न वर्णित मित्यादि ज्ञातव्यम्"

(మహాభారతాదులయందు వర్ణింపఁబడినప్పటికి నుత్తర నలచరిత్రయొక్క నీర సత్వమువలనను, నాయకానుదయ వర్ణనముచే రసభంగము గలుగుటవలనను సహృద యాహ్లాదము కావ్యమునకు ఫలమగుటవలనను నీనైషధకావ్యమునం దుత్తరనలచరిత్రము శ్రీహర్షునిచేత వర్ణింపఁబడలేదని యెఱుఁగఁదగినది.)"

శ్రీహర్షుఁడు వర్ణించినమట్టుకు శ్రీనాథుఁ డాంధ్రీకరింప నెంచెను.

* ఇతఁడు సరిగా తెలిగించయత్నించిన కొన్ని సంస్కృతపద్యములు వాని అను వాదపద్యములు ఉదాహరించెదను.

---

* సరిగా తెలిగించయత్నించినప్పటికీ కృతార్థుఁడు కాలేదు. నన్నయపద్యం యొక్క దుష్టలక్షణాలైన వళిప్రాసలదరువు, ఉచితపద్యనిర్ణయం లేకపోవడం, దండగ మాటలకు అధికవిశేషణాలకు కారణమైనందువల్ల మూలంలోని అంశాలు యథారూపాన్ని కోలుపోయినవి. ఇక అపానువాదాలు మొదలయినవి అధమాధికారుల కెట్లా వుంటేనేమి విచారించే దెవరని చేసివుంటాడు. "అశేషమనీషిహృదయంగమంబుగ" అన్నచోటి మనీషులు, తెలుగుకృతులు అధిమాధికారులకే ననేకోటిలోని వారే అయి వుంటారు. కాకుంటే ఇట్లాటి అనుచితానువాదాలు హృదయంగమంకాజాలవుకదా. అల్పబుద్ధులకోసం భారతాదులను పూర్వులు సంగ్రహాలుగా తోచినట్లు రచిస్తే రచించ వచ్చును గాని సర్వకాలం సర్వదశలందూ అవే పరమగ్రథాలని మనము గంతులువే స్తుండడంమాత్రం వివేకం మాలినపనే కాగలదు. పైపద్యాల్లో గీతలుగీసినవి మూలం లోలేని అధికప్రసంగం. ఇట్లానే దండగచెత్త అనేకపద్యాలలో దృష్టమవుతున్నది. ఇక తీసివేతలు మార్పులు ప్రస్ఫుటమేను. నన్నయపద్యంలో రచనచేస్తే ఊహోహాలు, కావ్యాత్మ అయిన వ్యంగ్యంయొక్క వినాశం, యెవరికైనా తప్పవు. మూలభాష తెలి యనివారికి మూలంలోని అంశాలు ఉన్నవి ఉన్నట్లు అవికృతంగా తెలపడమే అనువాదం యొక్క పరమప్రయోజనం. మూలంలోవున్నది తీసివేయక లేనిది కుక్కకచేసిన అను వాదాలకు లక్ష్యఖండంలోని రఘువంశానువాదం, గీతానువాదం మొదలైనవి చూడ దగును.

1. శ్లో. అయం దరిద్రో భవితేతి వైధసీం
లిపింలలాటేఽర్థిజనస్య జాగ్రతీం,
మృషాం న చక్రేఽల్పితకల్పపాదపః
ప్రణీయ దారిద్ర్యదరిద్రతాం నృపః. స. ౧.

చ. ఇతఁడు దరిద్రుఁ డౌననుచు నేర్పడనర్థిలలాటపట్టికన్
శతధృతి వ్రాసినట్టి లిపిజాలమనర్థము కానియట్లుగా
వితరణఖేలనాభిభవవిభ్రమనిర్జితకల్పభూరుహుం
డతఁడు దరిద్రతాగుణమునందు దరిద్రుని జేయునాతనిన్. ఆ ౧.

2. శ్లో. సరసీః పరిశీలితుం మయా గమికర్మీకృతనైకనీవృతా
అతిథిత్వమనాయి సాదృశోః సదసత్సంశయగోచరోదరీ. స. ౨.

మ. కమలేందీవర షండమండితలసత్కాసారసేవారతిన్
గమికర్మీకృతనైకనీవృతుఁడనై కంటిన్ విదర్భంబునన్
రమణిం బల్లవపాణిఁ బద్మనయనన్ రాకేందుబింబాననన్
సమపీనస్తన నస్తినాస్తి విచికిత్సాహేతు శాతోదరిన్. ఆ. ౨.

3. శ్లో. విరహిణో విముఖస్య విధూదయే
శమనదిక్పవనస్సన దక్షిణః
సుమనసో నమయన్నటనాధను
స్తవతు బాహురసౌ యది దక్షిణః. స. ౪.

ఉ. రాకసుధాంశుమండలము రాకకు మాఱుమొగంబు సేయుచో
దీకొనివచ్చు దండధరదిక్పవమానమ దక్షిణంబగుం
గాక వియోగికిం గుసుమకార్ముకశృంగము వంగఁజేయుం నీ
యాకరపంకజాతము రతీశ్వరదక్షిణమైననాఁటికిన్. ఆ. ౨.

4. శ్లో. దృశౌ కిమస్యాశ్చపలస్వభావే
నదూరమాక్రమ్య మిథో మిలేతాం
న చేత్కృతః స్యాదనయోః ప్రయాణే
విఘ్నః శ్రవఃకూపనిపాతభీత్యా. ఆ. ౭.

గీ. శ్రవణపుటకూపవినిపాతసాధ్వసమున
నిగిడి యవ్వలికటుపోక నిల్చెఁగాక
యధికచపలస్వభావంబు లైనయట్టి
దీనికన్నులు తలచుట్టు తిరిగిరావె. ఆ. 3.

5. శ్లో. వృథాపరీహాస ఇతి ప్రగల్భతా
న నేతిచ త్వాదృశి వాగ్విగర్హణా
భవత్యవజ్ఞా చ భవత్యనుత్తరా
దతః ప్రదత్సుః ప్రతివాచమస్మి తే. స. ౯.

గీ. కలికినవ్వు ప్రగల్భతాకారణంబు
కాదుకాదంటవాచావిగర్హణంబు
పలుకకుంట తిరస్కారకలనముద్ర
గాన ప్రత్యుత్తరంబిచ్చుదాన నీకు. ఆ. ౪.

6. శ్లో. నిస్త్రింశత్రుటితారివారణఘటాకుంభాస్థికూటావట
స్థానస్థాయుక మౌక్తికోత్కరకిరః కేరస్య నాయంకరః
ఉన్నీతశ్చతురంగసైన్యసమరత్వంగత్తురంగక్షురా
క్షుణ్ణాసు క్షితిషు క్షిపన్నివ యశః క్షోణీజబీజవ్రజం. స. ౧౨.

శా. క్రూరాసిత్రుటితారివారణఘటాకుంభస్థకూటస్థలీ
రారాజన్నవమౌక్తికోత్కరకరారంభక్రమోజ్జృంభియై
యీరాజన్యుకరంబు పోరులఁ గరం బేపారు సత్కీర్తిబీ
జారోపం బొనరించుభంగి హయరింఖాగ్రక్షతక్షోణులన్. ఆ. ౫.

7. శ్లో. అహర్నిశావేతిరతాయపృచ్ఛతి
క్రమోష్ణశీతాన్నకరార్పణాద్విటే
హ్రియా విదగ్ధా కిల తన్నిషేధినీ
న్యధత్త సంధ్యామధురేఽధరేఽంగులిం. స. ౧౬.

గీ. ఉష్ణశీతాన్నకబళంబులొకఁడుసూపఁ
బవలో రాత్రియొ యొడఁగూడనవసరమని
దానికుత్తరమొకలతాతన్వియిచ్చె
నధరబింబంబు విఱిచి సంధ్యాగమమని. ఆ. ౬.

8. శ్లో. నిజాదనువ్రజ్య సమండలావధే
ర్నలం నివృత్తౌ చటులావతాం గతః
తడాగకల్లోల ఇవానిలం తటా
ద్ధ్రుతానతిర్వ్యావవృతే వరాటరాట్. స. ౧౬.

గీ. ఆత్మమండలమవధిగా ననుసరించి
అవనినాథుఁడు జామాతననిపి మరలె
నాప్రతీరంబు గంధవాహంబు ననిచి
మరలివచ్చు తటాకంపుతరఁగవోలె. ఆ. ౭.

9. శ్లో. పితాత్మనః పుణ్యమనాపదఃక్షమా
ధనం మనస్తుష్టిరథాఖిలం నలః
అతఃపరం పుత్రి న కోపి తేహమి
త్యుదస్రురేష వ్యసృజన్నిజౌరసీం. స. ౧౬.

మ. గురువన్నన్ ధనమన్నఁ బుణ్యమనినన్ గోత్రోదయంబన్న దే
వరయన్నన్ మనమన్నఁ దుష్టియనినన్ వాత్సల్యమన్నన్ నిజే
శ్వరుఁడన్నన్ బరమోపకారమనినన్ సర్వంబునన్నన్ దలో
దరి నీకున్ నిషధాధినాథుఁడె సుమీ తథ్యంబుగాఁ జెప్పితిన్. ఆ. ౭.

10. శ్లో. విశ్వరూప కృతవిశ్వ కియత్తే
వైభవాద్భుతమణౌ హృది కుర్వే
హేమ నహ్యతి కియన్నిజచీరే
కాంచనాద్రి మధిగత్య దరిద్రః. స. ౨౧.

గీ. విశ్వరూప భవద్భూరివిభవమహిమ
యెంత వర్ణింపఁజాలునీ యీమనంబు
ప్రాంతపైచీరచెఱఁగున బడుఁగువాఁడు
హేమశైలంబు చిదిపి రాలెన్ని ముడుచు. ఆ. వ.

11. శ్లో. స్వధాకృతం యత్తనయైః పితృభ్యః
శ్రద్ధాపవిత్రం తిలచిత్రమంభః
చంద్రం పితృస్థానతయోపతస్థే
తదంకరోచిః ఖచితాను ధైవ.

గీ. చంద్రమండలమిది పితృస్థానమగుట
జనసమావర్జితస్వధాసలిలతిలలు
మంత్రబలమున నెక్కె నీమధ్యమునకుఁ
జంద్రబింబాస్యలాంఛన చ్ఛాయగాదు.

నైషధము తరువాత నితఁడు రచించినది *భీమేశ్వరపురాణము. సంస్కృతమున 32 అధ్యాయములలోనున్న భీమఖండము తెలుఁగున నాఱాశ్వాసములుగ రచించెను. ద్వితీయాశ్వాసములోఁ బీఠికాపురవర్ణనము స్వేచ్ఛగఁ జేసినాఁడు. సూర్యాస్తమయ చంద్రోదయ సూర్యోదయవర్ణనముల నధికముగఁ జేర్చినాఁడు. మూలమననుసరించి ఇత డనువదింపఁ దలపెట్టిన కొన్ని శ్లోకములు వ్రాసి అనువాదవాక్యములు ఈక్రింద ఉదాహరింపబడినవి.

శ్లో. అహో కిమేతస్మై బ్రూహి వైవర్ణ్యం వదనే తవ
దృశ్యతే నేత్రయోర్దైన్యం మానసవ్యథయానఘ
కచ్చిన్న జాతో వాగ్వాదో లోలార్కేణ సమం తవ
ఢుంఠివిఘ్నేశ్వరః కచ్చిన్న త్వాం ధిక్కృతవాన్ రుషా
కచిత్త్వం క్షుధితః కాలే విశాలాక్ష్యా న వంచితః
న కచ్చిత్త్వయ్యనుచితం భైరవేణ కృతం ముధా
కథం త్యక్తం త్వయా గంగావాహినీసైకతస్థలం
కథం తత్పరమం స్థానం వ్యసృజః క్రోశపంచకం
కథం త్వం ముక్తవాన్ ప్రాప్యామవిముక్తవసుంధరాం
కథం విశ్వేశ్వరం దేవం సతాముజ్ఝితవాన్ ధనం.

గీ. ఆననమునందు వైవర్ణ్య మగ్గలించెఁ
గన్నుగవయందు దైన్యంబు గానఁబడియె
నార్తి యేదేని యొకటి నీయంతరంగ
మూనియున్నది యిది యెట్టులొక్కొ యనఘ.

సీ. లోలార్కునకు నీకులోలోన నేమేనిఁబోటిపుట్టదుగదా మాటమాట
వెనకయ్య శ్రీఢుంఠివిఘ్నేశ్వరస్వామి ధిక్కరింపఁడు గదా తెగువ నిన్ను
నాఁకొన్న నిన్ను మధ్యాహ్నకాలంబున నరయకుండదు గదా యన్నపూర్ణ
నెపమేమియునులేక నీయెడాటమ్మునఁ బాటిదప్పఁడు గదా భైరవుండు

* తుంచడం కూర్చడం మొదలైనవాటితో భీమఖండంకూడా దూషితమైనది.

ఎట్టు పాసితి మిన్నేటి యిసుకతిప్ప
ఎట్టు పాసితి వాస్థలంబేనుకొను
లెట్టు పాసితి పవిముక్తహట్టభూమి
ఎట్టు పాసితి విశ్వేశు నిందుధరుని.

1. శ్లో. అథ క్రోధస్సముద్భూతః క్షుధార్త్యా హృదయే మమ
తేన క్రోధాంధకారేణ ప్రవృద్ధే నాహముద్ధతః
కిమప్యదృష్ట్వా సహసా భిక్షాపాత్రాణ్యపాతయం
శిలాయాం శతధా భిన్నం శిష్యేషు భయకంపిషు. అధ్యా. ౧౫.

శా. కుక్షిప్రోద్భవనిష్ఠురక్షుధితదుష్క్రోధాంధకారంబునం
జక్షుల్ రెండును జిమ్మచీకటులుగా సంరంభశుంభద్గతిం
బ్రేక్షచ్ఛాత్రులు భీతినొందఁ గడునుద్రేకించి హట్టంబునన్
భిక్షాపాత్రలు రాతిమీద శతధాభిన్నంబుగా వైచితిన్. ఆ. ౨.

2. శ్లో. సర్వే తద్వాక్యమాకర్ణ్య తమవోచన్నిదం వచః
న నివర్తయితుం శక్యమమోఘం తే వచోఽనఘ
తస్మాదన్యేన మార్గేణ కరిష్యామశ్శివం వయం. అధ్యా. ౨౧.

గీ. అనుటయును వారలామాట లాదరించి
క్రమ్మఱుపరాదు పలుక మోఘమ్ము మాకు
నీవ యిప్పుడు చెప్పినహితమునూది
వేఱుచందాన మేలు గావింతుమింక. ఆ. ౪.

3. శ్లో. సముచ్ఛలత్పయోవీచీమాలికాపరిశోభితా
దూరీకృతేశ గోవిందధామ సిద్ధవసుంధరా
జవాతిశయశీర్ణాద్రి ధామరేణుచయావిలా
వివేశ గౌతమీగంగా దక్షవాటమహాపురీం.

ఉ. మలఁగిమలంగి భీమపతి మందిరమండలసిద్ధభూమికిన్
దొలఁగితొలంగి యుచ్ఛలితతోయతరంగపరంపరోద్ధతిన్
జెలఁగిచెలంగి యారభటిశీర్ణధరాధర ధాతురేణులం
గలఁగికలంగి పాఱె వడిగౌతమకన్యకదక్షవాటికన్. ఆ. ౪.

శ్లో. తిష్ఠన్స్వాత్రోఽపి వాసిష్ఠో వసిష్ఠసదృశోఽపి వా
దక్షవాటీ పురస్థాతా మోక్షం యాతి న సంశయః. అధ్యా. 3౨.

క. తిష్ఠన్స్వాతునకైన వ, సిష్ఠప్రతిమానుఁడైన శిష్టునకైనన్
నిష్ఠాత్మ గలిగెనేనియుం, నిష్ఠాకాలంబుము క్తినియమం బచటన్. ఆ. ౬.

సంస్కృతమున 32-వ అధ్యాయములో ముగింపువాక్యమైన "యజ్ఞావసాన సమయే భీమేశం వీక్షితుం యయుః" అనుదానిని "యజ్ఞావసానసమయంబున శ్రీమన్మహా దేవుని సందర్శింపంజనిరి" అని తెనిఁగించి కథముగించి తరువాత సంస్కృతములో నున్నట్లే తాను గూడ ఫలశ్రుతి చెప్పి గ్రంథము సమాప్తికావించినాఁడు. దీని పిమ్మట నతఁడు రచించినది *కాశీఖండము.

మూలానుసారముగా నితఁడు తెలుఁగు చేయఁబూనిన కొన్ని మూలశ్లోకాలను వాని అనువాదపద్యాలను చూపుచున్నాను.

1. శ్లో. అరుంధతీం ధ్రువం చైవ విష్ణోస్త్రీణి పదాని చ
ఆసన్నమృత్యుర్నో పశ్యేచ్చతుర్థం మాతృమండలం.

ఉ. కానఁడరుంధతిన్ ధ్రువునిఁ గానఁడు విష్ణుపదత్రయంబునుం
గానఁడు మాతృమండలము కానఁడు కన్నులు కల్గియేని యే
మానవుఁ డమ్మనుష్యునకు మాసములాఱు విరామమొందఁగాఁ
గానఁగవచ్చుఁ గుంభభవ! కాలునిబంధురసౌధవీథికల్. ఆ. ౫.

2. శ్లో. మృదు విజ్ఞాపనం చక్రుః పాకశాలాధికారిణః
నజానామో వయం నాథ త్వత్ర ఏతాపభయార్దితః
కుస్వత్వ్యాచకయాచిద్వా నష్టో వై శ్వానరః పురాత్
తథాపి సూర్యపాకేన సిద్ధా పజ్త్కిర్హి కాచన.

గీ. అవధరింపుము నీ ప్రతాపాతిశయము
గరిమమున కోహటించియో కాక వహ్ని

* సంస్కృతంతో సరిచూడకుండా గుడ్డిగా చదివినప్పు డెట్లావున్నా మూలాపేక్షచేత ఇదికూడా నైషధంవలెనే ఉటంకులతో మార్పుడాలతో అక్షరవినోదపుదోషాలతో నిండి మూలంలోని అంశాలు నైషధభీమఖండాల్లోకంటె అధికంగా స్వరూపాన్ని కోల్పోయినవి.

కాశికాపట్టణమున నివేశమునకుఁ
బదిలమైయుండనోపక పాఱిపోయె.

ఉ. అంబుజబాంధవాన్వయనృపాగ్రణిబోనము నేఁడు సూర్యపా
కంబున నాయితంబయిన ఖజ్జము భోజనశాలలోనఁ బ
ళ్యంబిడినారు పంకజదళాక్షులు రెండవజాముగంట ప్రే
యంబడె నారగింప సమయంబని చెచ్చెర విన్నవించినన్.

3. శ్లో. కస్మై దేయా మయా కన్యా సురమ్యేయం సులక్షణా
అస్యా అనుగుణో లభ్యః క్వ మయా వర ఉత్తమః.
కులేన వయసా చాపి శీలేనాపి శ్రుతేన చ
రూపేణార్థేన సంయుక్తః కస్మై దత్వా సుఖం లభే.
ఇతి చింతయతస్తస్య జ్వరోఽభూదతిదారుణః.
యశ్చింతాఖ్యో జ్వరో పుంసామౌషధైర్నోపశామ్యతి
తన్మూలర్క్షవిపాకేన చింతాఖ్యేన జ్వరేణ చ
స విప్రః పంచతాం ప్రాప్తస్త్యక్త్వా సర్వం గృహాదికం.

గీ. తగినవరుఁ డెవ్వఁడొక్కొ యీతలిరుఁబోఁడి
కనుగుణుం డెవ్వఁడొకొ విశుద్ధాభిజాత్య
పరమసౌభాగ్యభాగ్యసంపదలకనుచు
నిత్యమును దండ్రి యాత్మఁ జింతించుచుండె.

గీ. మూలనక్షత్రమునయందు మొదలికాలఁ
గన్యగండానఁ బుట్టిన కారణమునఁ
గర్తుఁడు విప్రుఁడానందకాననమునఁ
జచ్చెఁ జింతాజ్వరముపైని జ్వరముతాఁకి.

100-వ అధ్యాయములో 87-వ శ్లోకమువఱకుఁ దెనిఁగించి తక్కిన 59 శ్లోకముల నొక్క పద్యములో నిమిడ్చినాఁడు. కాశీఖండము తరువాత నితఁడు రచించినది హరవిలాసము. కాశీఖండమందలి "చిన్నారిపొన్నారి" యనుపద్యమున హరవిలాసముదాహరింపఁబడక పోవుటచేతను నీకృతిపతియై శ్రీనాథునికి బాలసఖుఁడైన తిప్పఁడు "మంటి బహువత్సరంబులు" అని చెప్పియుండుటవలనను నిది కాశీఖండము రచించిన తరువాతనే వృద్ధత్వమున రచించెనని భావింపవలసియున్నది. శైలికూడ నీవిషయమునే

బలపఱచుచున్నది. ఈ గ్రంథములోని చిఱుతొండనంబి చరిత్రము పాల్కురికి సోమనారాధ్యుని బసవపురాణమునుండి గైకొనఁబడినది. శ్రీనాథుఁడు పేర్లు మార్చినాఁడు. బసవపురాణమునుబట్టి కొడుకును జంపి మాయజోగికి కాహారము పెట్టినవాఁడు సిరియాలుఁడు. సిరియాలునికే మఱియొక పేరు చిఱుతొండనంబి. కొడుకు పేరు లేదు. సిరియాలుని భార్య తిరువెంగాణి. కర్ణాటభాషలో భీమకవిరచించిన బసవపురాణములోని పేర్లకు సోమనారాధ్యుని బసవపురాణములోని వానికి వ్యత్యాసము కలదు. హరవిలాసమునుబట్టి చిఱుతొండనంబి కుమారుఁడు సిరియాలుఁడు. సిరియాలుని తల్లి తిరువెంగనాచి. బసవపురాణములో నున్న చిఱుతొండనంబి చరిత్రము పూర్తిగ శ్రీనాథుఁడు హరవిలాసమునఁ జెప్పలేదు. కైలాసమున కేగినతరువాత సిరియాలుఁడు తనంతటిభక్తుఁడు లేఁడని విఱ్ఱవీఁగఁగా శివుఁడతనిని భూలోకమునకు మరలఁ దీసికొనివచ్చి నిమ్మవ్వహాలాయుధుల వృత్తాంతములు చూపి గర్వభంగము కావించి తిరిగి కైలాసమునకుఁ గొంపోయిన కథ విడిచిపెట్టినాఁడు. ద్వితీయవిలాసంబైన గౌరీకల్యాణము చాలవఱకుఁ గాళిదాసుని కుమారసంభవమునకుఁ దెనుఁగు. హరవిలాసము స్వకల్పితముగా రచింపఁబూని నడుమ నిట్లుచేయుట కాళిదాసుని కవితయందుఁగల గౌరవము వలననని తోఁచెడిని. తారకాసురుని వధదనుకఁ గుమారసంభవము 17 సర్గములుగా నున్నది. శ్రీనాథుఁడు కుమారసంభవములోని ఉపోత్తమ శ్లోకమైన

శ్లో. అథ విబుధగణాంస్తానిందుమౌళిర్విసృజ్య
క్షితిధరపతికన్యా మాదదానః కరేణ
కనకకలశయుక్తం భక్తిశోభాసనాథం
క్షితివిరచితశయ్యం కౌతుకాగారమాగాత్.

అనుదానిని—

గీ. "కనకకలశాది భక్త్యలంకారయుతము
నైనకౌతుకరత్నగేహంబు సొచ్చి
పార్వతియుఁ దాను నీహారభానుమౌళి
పవ్వళించెను ముదమునఁ బాన్పుమీద."

అని తెనిఁగించి మిగిలిన 10 సర్గములలో వర్ణింపఁబడిన కుమారజనన మాదిగఁ దారకాసురవధవఱకుఁగల కథనంత యెనిమిది గద్యపఙ్క్తులలోఁ జెప్పినాఁడు. 8-వ సర్గములో సంభోగవర్ణనము మిక్కిలి విస్తారముగనున్నది. శృంగారవర్ణనమన్న ముందంజ వేయు శ్రీనాథుఁడు సంభోగవర్ణనము తెనిఁగింపక కొద్ది వాక్యములలో ముగించుట

మాడఁగ హారవిలాసమును రచించునాఁటికేండ్లు గడచినవాఁడై మనోవృత్తియందు గొప్పమార్పుచెందినట్లు కానంబడుచున్నది. ఏండ్లు గడచినను స్వాభావికచాపలము బొత్తిగఁ బోదనియెడు పక్షమున నేడవసర్గము తరువాతఁగల గ్రంథ మతనికి లభింపక పోయియుండును. 8-వ సర్గములోని సంభోగవర్ణనము చాలవఱకశ్లీలముగను ననుచిత ముగ నుండుటచే నేడుసర్గములే కాళిదాసుఁడు రచించెననియు మిగిలిన 10 సర్గములు నతని పిమ్మట నెవ్వరో రచించి కాళిదాసుపేరు పెట్టిరనియుఁ గొంతమంది పండితుల యభిప్రాయము. కాని పూర్వమునుండి 8-వ సర్గముకూడఁ గాళిదాసుని దేయని భావింపఁ బడినట్లు దృష్టాంతములు గలవు. విశ్వనాథకవి సాహిత్యదర్పణమను నలంకార గ్రంథము నందు నాయికా ప్రణయమానమునకు "నాయికాయాయథా కుమారసంభవే సంధ్యా వర్ణనావసరే" యని నుడివినాఁడు. ఈ సంధ్యావర్ణన మెనిమిదవ సర్గములోనున్నది. మఱియు దోష భేద సందర్భమునఁ బ్రకృతివిపర్యయమునుగూర్చి వ్రాయునప్పుడు "ప్రకృతయో దివ్యా అదివ్యాదివ్యాది వ్యశ్చేతి, తేషాం ధీరోదాత్తాదితా, తేషామ ప్యుత్తమాధమమధ్యత్వం, తేషుచ యోయథా భూతస్తస్యాయథావర్ణనే ప్రకృతివిప ర్యయోదోషః, ధీరోదాత్తస్య ధీరోద్ధతవత్ ఛద్మనావాలివధః, యథావాకుమార సంభవే ఉత్తమదేవతయోః పార్వతీపరమేశ్వరయోః సంభోగశృంగారవర్ణనం" అని చెప్పినాఁడు. ఈ సంభోగశృంగారవర్ణనము 8-వ సర్గములోనిదే. ధనంజయుఁడు దశ రూపకమునందు వ్యభిచారిభావముల లక్షణలక్ష్యములు చెప్పుచో జడతకు లక్ష్యముగా

శ్లో. "ఏవమాలినిగృహీతసాధ్వసం శంకరో రహసి సేవ్యతామితి
సా సఖీభిరుపదిష్ట మాకులా నాస్మరత్ప్రముఖవర్తిని ప్రియే."

అను శ్లోకము నుదాహరించినాఁడు. ఇది కుమారసంభవాష్టమ సర్గములోని 4-వ శ్లోకమైయున్నది. ఈ నిదర్శనములవలనఁ గొందఱనునట్లు 7-వ సర్గము తరువాతఁ గల గ్రంథము మఱియెవ్వరో కాక కాళిదాసుఁడే రచించెనని పూర్వమునుండి భావింపఁబడు చుండుట విశదమగుచున్నది. ఇతఁడు మూలమునకు సరిగా ఆంధ్రీకరింపబూనిన కొన్ని కుమారసంభవశ్లోకములను వాని అనువాదపద్యముల నుదాహరించుచున్నాను.

1. శ్లో. తయా దుహిత్రా సుతరాం సవిత్రీ
స్ఫురత్ప్రభామండలయా చకాశే
విదూరభూమి ర్నవమేఘశబ్దా
దుద్భిన్నయా రత్నశలాకయేవ. స. ౧.

గీ. జననివిద్యుల్లతాభమా చాయగలిగి
క్రొత్తయుదయించినట్టి యాకూఁతువలనఁ
గారుకాలంబు మణిశలాకయునుబోలె
నొప్పెడు విదూరభూమిని యుద్దియయ్యె. ఆ. 3.

2. శ్లో. పురే తావంత మేవాస్య తనోతి రవిరాతపం
దీర్ఘికాకమలోన్మేషః యావన్మాత్రేణ సాధ్యతే. స. ౨.

గీ. దానవునివీటిలోన మార్తాండుఁడెండ
యంతమాత్రంబకాని కాయంగ వెఱచు
నెంతమాత్రముకాసిన నెలమిఁబొందుఁ
గేళిదీర్ఘికలందుఁ బంకేరుహములు. ఆ. 3.

3. శ్లో. కామేకపత్నీ వ్రతదుఃఖశీలాం
లోలం మనశ్చారుతయా ప్రవిష్టాం
నితంబినీమిచ్ఛసి ముక్తలజ్జాం
కంఠేస్వయంగ్రాహనిషక్తబాహుం. స. 3.

గీ. ఏకభర్తృవ్రతస్థయై యేలతాంగి
నీకుఁజేయూడు ధర్మంబునిలుపనెంచె
నదివినిర్ముక్తలజ్జయై యమరరాజుఁ
జేయుఁగాంత స్వయంగ్రహాశ్లేషణంబు. ఆ. 3.

4. శ్లో. హృదయేవససీతి మత్ప్రియం యదవోచస్తదవైమి కైతవం
ఉపచారపదం న చేదిదం త్వమనంగః కథమక్షతారతిః. స. ౪.

గీ. హృదయముననుండి యెప్పుడు హృదయనాథ
ప్రియముచెప్పెదనను టెట్లు భేషజంబు
హృదయముననుంట నిజమేని మదనయెట్లు
భస్మమైతివి నేనెట్లు బ్రతుకుఁగంటి. ఆ. 3.

5. శ్లో. అపిక్రియార్థం సులభం సమిత్కుశం జలాన్యపి స్నానవిధిక్షమాణి తే
అపి స్వశక్త్యా తపసి ప్రవర్తసే శరీరమాద్యం ఖలు ధర్మసాధనం.

సీ. సలిలంబు త్రిషవణస్నానక్షమంబౌనె యంభోజపత్త్ర దీర్ఘాయతాక్షి
కుసుమంబులును నిధ్మకుశపల్లవంబులు సులభంబులై యున్నె సుందరాంగి
సత్వంబులన్యోన్య జాతివైరముదక్కి శాంతిఁగైకొనియున్నె చంద్రవదన
యనుదినంబును దేహయాత్రకాయితమౌనె నీవారపాకాది పూఁపుఁబోఁడి

గీ. శక్తికొలఁది తపశ్చర్య సంఘటించితే, ఫలముపై నాసనాగ్రహబంధముడిగి
తామ్రబింబోష్ఠి ధర్మసాధనములందు, నాద్యమగు సాధనంబు దేహంబ కాదె.

6. శ్లో. తామగౌరవ భేదేన మునీంశ్చాపశ్యదీశ్వరః
స్త్రీపుమానిత్యనాస్థైషా వృత్తం హిమహితం సతాం. స. ౬.

గీ. అంధకారి యరుంధతినాదరించె, గౌరవంబున భేదంబు కలుగకుండఁ
బెద్దవారికి స్త్రీపుంవిభేదమేల, మాననీయంబు పుణ్యాకర్మంబుగాక. ఆ. ౪.

దారుకావనవిహారము, హాలాహలభక్షణము, కిరాతార్జునీయమునను, మిగిలిన భాగములు పురాణకథల ననుసరించి స్వయముగ రచించినాఁడు. భారవికృత కిరాతార్జునీయములోని యీ అపసర్గ మునందలి

శ్లో. మనసాజపైః ప్రణతిభిస్సముపేయివా నధిపతింసదివః
సహజేతరాజయశమాదధతీబిభరాంబభూవ యుగపన్మహసీ

అను శ్లోకములోని యుత్తరార్థమును, హరవిలాసకిరాతార్జునీయకథయందలి

గీ. "వీరరసగర్భితంబయ్యు విస్తరిల్లె, శాంతరసమెంతయును సవ్యసాచియందు"

అను వాక్యములలోని భావము నొకటిగనున్నవి కాని యీ భావము శ్రీనాథుఁడు భారవినుండి గైకొనెనని చెప్పఁబనిలేదు. హ్యాంలెట్ (Hamlet) అను నాటకమునఁ గొమరునికిఁ బొలోనియసు (Polonius) చెప్పినట్లుగా షేక్స్పియరు (Shakespeare) వచించిన

" .... .... .... Beware
of entrance to a quarrel, but being in,
Bear it that the oppossed may beware of thee."

అను వాక్యములలోని భావమును గాశీఖండమందలి

క. "ఎవ్వనితోనెచ్చోటం, జివ్వకుఁ జేఁజాపపలదు చేఁజాచినచో
నివ్వలనవ్వలనెవ్వరు, నవ్వకయుండంగఁబగసనందీర్పఁదగున్."

అను వాక్యములలోని భావము నొకటిగానున్నది. షేక్స్పియరు కాశీఖండములో జూచిగాని, కాశీఖండకర్త షేక్స్పియరు గ్రంథములోఁ జూచిగాని వ్రాసెననిచెప్పుటకు వీలులేదుగదా. ఒకటేయూహ అనేకులకుఁ దట్టుచుండుట సహజము.

హరవిలాసము తరువాత నితఁడు రచించినది పల్నాటివీరచరిత్రము. వీరచరిత్రము యొక్క పౌర్వాపర్యము తెలిసికొనుట కా గ్రంథమున నాధారములు కన్పట్టుచున్నవి. బాలచంద్రుని యుద్ధఘట్టమున

ద్వి. "ఎసఁగెడు శివకంచి యేకామ్రపతికిఁ
జిఱుతొండభక్తుఁడు చెలఁగుమాతండ్రి
సెంకెలసిరువను చెలువమాతల్లి
సిరియాళుఁడనఁబుట్టి చెన్నొందినాఁడ"

అని తన హరవిలాసములోని చిఱుతొండనంబి కథను సూచించి యున్నాఁడు. కనుకఁ బల్నాటి వీరచరిత్రమే యితఁడు రచించిన గ్రంథములలో నెల్లఁ జివరగ్రంథమని చెప్పవలయును. శైలినిఁబట్టికూడ నిట్లే తలంపవలసియున్నది. వీరచరిత్రము తరువాత నేమియుం రచించినట్లు కన్పట్టదు. ఇతఁడు వీరచరిత్ర రచనకుఁ గడంగుటనుగూర్చి యనేక కథలు గలవు. నారికుఱుపుచే బాధపడుచు శోకభరమున నీ సుద్దులు చెప్పెనని కొంద అందురు. ఈ క్రిందికథకూడ వాడుకలోఁ గలదు. ఇతఁడు యౌవనప్రాయమందు స్వేచ్ఛగఁ దిరుగుటచే శరీరము చెడిపోయియుండెనఁట. పల్నాటికిఁ బోయి గ్రామంబుల సంచారము చేయుచుఁ జంద్రవంక నదీతీరమందున్న మాచెర్లకు జని యానదియందు స్నానము చేసి చెన్నకేశవుని సందర్శింపఁగ రోగము కొంత యుపశమించెనఁట. ఆ దినమే రాత్రి చెన్నకేశవుఁడు స్వప్నమున సాక్షాత్కరించి యతనితో మత్సేవారతులు నఖండపరాక్రములునైన పల్నాటివీరుల చరిత్రము రచించి మా కంకిత మొనర్పుమని చెప్పి యంతర్హితుం డయ్యెనఁట. శ్రీనాథుఁడును మేల్కాంచి స్వప్నవృత్తాంతమునకు సంతసించి పల్నాటివారి హృదయసీమలయం దచిరకాలవిజృంభణముతో నాటియుండిన ఇతిహాసాంశములఁ జక్కఁగ గ్రహించి గ్రంథరచనకుఁ దొడఁగి తాను రోగపీడితుఁడు వయసుమీఱినవాఁడు నగుటచే వ్రాయుటకు శక్తిలేక యేడుగురు శిష్యులలేఖకులుగా నియోగించి చెన్నకేశవుని యాలయములోఁ గూర్చుండి చెప్పుచు దాదాపు భారతమంత పెద్దదిగానున్న యీ గ్రంథమును రెండు మాసములలోఁ బూర్తిగావించెనఁట. గ్రంథము సమాప్తియగువఱకు రోగముకూడఁ బూర్ణముగఁ గుదిరెనఁట. గ్రంథము పూర్తియైన తరువాత నేకారణముననో మనస్సు

చలించి తొంటియట్ల విషయప్రవృత్తుండుకాఁగాఁ జెన్నకేశవుఁడు కోపించి ప్రతిదినము పగలే శ్రీనాథునికిఁ బ్రత్యక్షమగువాఁడారోజతనికి దర్శనమీక స్వప్నమునం దగుపడి నీవు పతితుఁడవైతివిగాన నీ గ్రంథము నేను బరిగ్రహింపఁజాల నది మాలమాదిగలపాలౌ గాక యని వాక్రుచ్చి యదృశ్యుండయ్యెనఁట. మఱునాఁడు శ్రీనాథుఁడు మేల్కాంచి యశుభస్వప్నంబునకు వగచి యెంతయోకష్టముతో రచించిన యమ్మహాగ్రంథము భగవంతుఁడు చేకొననిచో దాన ఫలమేమియని దుఃఖావేశంబునఁ జేతనున్న తాళపత్ర సంపుటము చింపి చిందఱవందఱగాఁ బాఱవేసెనఁట. మాలలు మాదిగలు మొదలైనవారెవరికి దొరకిన పత్రములు వా రేఱికొనిరఁట. ఈకథయొక్క సత్యమెట్లున్నను గ్రంథమొకచోటను సంపూర్ణముగ లేక శకలములుగా నొకరివద్దఁ గొంత మఱియొకరివద్దఁ గొంతగఁ జాలమట్టుకుఁ బిచ్చుకుంటులు మాలలు మొదలగు నిమ్నకులుల యధీనములోనే యున్నమాట వాస్తవము. అట్టివారిచేతులలో నున్నందువలన నస్పృశ్యమనియు, నశ్రావ్యమనియు, నగ్రాహ్యమనియుఁ దలఁచి, జ్ఞానశూన్యులై విద్యాగంధము లేకపోయినప్పటికి నగ్రజన్ములమని గర్వముమాత్రము వదలని పండితంమన్యులు చూపిన యనాదరణమే గ్రంథ మిన్నిదినముల దనుక దుఃస్థితిలో నుండుటకుఁ గారణమై యుండును. జనసామాన్యమునకు వీరులయందుఁగల భక్తితాత్పర్యములచే నేమి, గ్రంథము యొక్క ఉత్కృష్టతవలననేమి యాదరణానాదరణములకు లోనుగాక నేఁటివఱకు జీవముతోడ నున్నది. శ్రీనాథుఁడు రచింపకముం దీకథ గద్యరూపముననో గేయరూపముననో యుండియుండును. ఇతఁడు దీనిని ద్విపదిలో రచించెను. శ్రీనాథునికిఁ బూర్వము రంగనాథాదులు ద్విపదీకృతుల రచించిరి.

సీ. "కందభేదములాఱుగాక యుత్సాహంబు తరువోజ మధ్యమాక్కరలునైదు
దీపించుమంజరీ ద్విపదత్రిపద చతుష్పద పంచపాద షట్పదవిధములు
తొమ్మిదివిధములతో నొప్పు రగడలు కళికలు నుత్కళికలును గూడ
జాతులు నవవిధగీతంబులును సీసస్తకంబును నుపజాతులయ్యె

ననుచు నన్నయభట్టు భీమనయుఁ బెద్ద
సచివుఁడును మూర్తితాత నొజ్జయుననంత
మంత్రియును దిమ్మరాజు నిమ్మాడ్కిఁ జెప్పి
రందముగ వారుచేసిన ఛందములను."

అని యప్పకవిచెప్పినదానినిఁబట్టి నన్నయభట్టునకుఁ బూర్వమునుండి ద్విపది యున్నట్లే కాన్పించుచున్నది. తరువోజ, అక్కరమొదలగు తక్కినజాతులనువలె ద్విపదీ

కృతులలో మిశ్రముగా నచ్చటచ్చటఁ జెప్పుటలేదు. నన్నయభట్టారకుఁడు భారతము నందుఁ దరువోజ, మధ్యాక్కర, అక్కర, మధురాక్కర, ఉత్సాహము, కందము నుపయోగించెనుగాని ద్విపదను జెప్పలేదు. సోమయాజులు నెఱ్ఱాప్రెగ్గడ యీఫక్కికనే యవలంబించిరి. అల్లసాని పెద్దన మనుచరిత్రమునందు రగడను జెప్పినాఁడుగాని ద్విపది నుపయోగింపలేదు. యక్షగానములలోమాత్రము ద్విపది నచ్చటచ్చట వాడుదురు. వీనినిఁ బట్టిచూడ వివిధపద్య మిశ్రములైన కావ్యములలో ద్విపదిని జేర్పక ద్విపదీకావ్యములఁ వేరుగా రచించుచువచ్చినట్లు నిశ్చయమగుచున్నది. మనలోనున్న కావ్యములన్నియుఁ చాలామట్టుకు చంపువులేకాని పద్యకృతులు (నిర్గద్యములు) మిక్కిలి తక్కువగా నున్నది. సంస్కృతమునందుఁ బద్యకావ్యములే మెండు. చంపువులు తక్కువ. సంస్కృత పద్యకృతులకుఁ దెలుఁగు పద్యకృతులకు భేదముకలదు. సంస్కృతకవులొక్కొక్క సర్గమును సామాన్యముగా నేకవిధశ్లోకముతో రచించుచు వచ్చిరి. సర్గాంతమందు మాత్రము వృత్తముల మార్చిరి. కాళిదాసుఁడు మేఘసందేశమంతయు నేకవిధ శ్లోకముతో రచించెను. ఆంగ్లేయ కవులుకూడఁ జాలవఱకీ నియమమునే పాటించిరి. తెలుఁగువారట్లుగాక యొక యాశ్వాసముననే బహువిధవృత్తములు, జాతులు నుపజాతులు వ్రాయు దురభ్యాసము కలిగియున్నారు. సర్గమంతయుఁ బలువిధవృత్తములతో రచించినవారు సంస్కృతకవులలోఁగూడఁ గలరు గాని యీ విషయమునఁ దెలుఁగు వారివలె వెర్రి లోనికి దిగలేదు. విశ్వనాథు డేకవృత్తమయపద్యములతో నే సర్గ రచన అని ఉన్నాడు. ఆశ్వాసాంతమునందు గాక తక్కినచోట ఇట్టి వృత్తసాంకర్య మనుచితము. పద్యకావ్యములయందు బహువిధపద్యముల గలుపుట దోషమను భావ మరిస్టాటిల్ (Aristotle) అను గ్రీకువిద్వాంసుఁడుకూడ నీ క్రిందివాక్యములలోఁ గనఁబఱచి యున్నాఁడు. "Still more absurd would it be to mix different metres as was done by Charemon" తెలుఁగునఁ బద్యకృతులు (నిర్గద్యములు) లేని లోపమును నివారింపఁ బూనియె కాబోలు తిక్కనసోమయాజి ఉత్తరరామాయణమును బద్యమయముగ రచించెను. కాని బహువిధపద్యములతో రచించు దురభ్యాసముమాత్రము మానలేదు. అచలజిహ్వోక్తి, నిరోష్ఠ్య, శుద్ధాంధ్ర ప్రముఖ నిరర్థక నియమములలో నిర్గద్య మొకనియమముగాఁ బాటించి పెద్దపెద్ద బిరుదనామములు పెట్టి డంబమునకు రచించుచు వచ్చిరి గాని సాధారణముగఁ బద్యగ్రంథములన్నియు నట్లురచించినవారు కారు. గ్రంథమంతయు నొకటేవిధమైన పద్యములుండుటవలనఁ జదువువారికి విసుగుగాదాయనికొంద అందురుగాని యయ్యది విచారితంబు. సంస్కృతమున మేఘసందేశాది కావ్యములఁ జదివి యానం

దించు రసజ్ఞులు విసుగునొందుదురా? సుప్రసిద్ధులగు నాంగ్లేయకవులకావ్యములఁ బఠించి పరవశులగు పండితులు విసుగునొందుదురా? మన యంధ్రభాషయందుఁ గలకృతులఁ బరిశోధింపఁగాఁ బై నుదాహరింపఁబడిన దోషములులేనివి ద్విపదలు శతకములు గన్పట్టుచున్నవి. తెలుఁగులో శార్దూలాది పద్యములకంటె చిన్నపాదములు గల ద్విపద్యాదులె యెక్కువ మనోజ్ఞముగా నుండును. మాదిరికొక యుదాహరణము చూపెదను. వాల్మీకిరామాయణ బాలకాండమునందలి 34-వ సర్గములోని

శ్లో. "గతోర్థరాత్రః కాకుత్స్థ కథాః కథయ తోమమ
నిద్రామభ్యేహి భద్రంతే మాభూద్విఘ్నోఽధ్వనీహనః,
నిష్పన్దా స్తరవ స్సర్వే నిలీనా మృగపక్షిణః
నైశేన తమసా వ్యాప్తా దిశశ్చ రఘునందన.
శనైర్వియుజ్యతే సంధ్యా నభో నేత్రైరివావృతం
నక్షత్ర తారాగహనం జ్యోతిర్భిరవభాస్యతే,
ఉత్తిష్ఠతిచ శీతాంశుశ్శశీ లోకతమోనుదః
హ్లాదయన్ ప్రాణినాం లోకే మనాంసి ప్రభయా విభో.
నైశాని సర్వభూతాని ప్రచరన్తి తత స్తతః
యక్షరాక్షససంఘాశ్చ రౌద్రాశ్చపి తాశనాః,
ఏవముక్త్వా మహాతేజా విరరామ మహామునిః
సాధుసాధ్వితి తం సర్వే మునయో హ్యభ్యపూజయన్.

అను శ్లోకములు భాస్కరరామాయణమున

క. "రక్షోయక్షవిహారస, మక్షంబునిలీనమృగచయంబు నిమీల
త్పక్షికులాక్షమునిశ్చల, వృక్షమ్మునిశాటభూత విహృతిస్థలమున్.

వ. అగుచు నిప్పనమున్నది మఱియుం.

చ. గగనము తారకాగ్రహవికాసవిభాసితమై వెలింగెడున్
మొగిసినచీఁకటిం జెఱచి ముంగలిదిక్కులు తెల్ల సేయుచున్
జగములకుత్సవంబొదవఁ జంద్రికగాయుచు భాసమానుఁడై
నెగడెడునింగిఁ జందురుఁడు నిద్దురపోయెడినెల్ల జీవులున్.

క. వినుమర్ధరాత్రమయ్యెన్, జనవర నిద్రింపుమీవు సౌమిత్రియునిం
కనిపలికియూరకుండెన్, మునివరుఁడపుడఖిలమునులు మోదముతోడన్."

అనియు రంగనాథరామాయణమున

ద్వి. "నడురాత్రి యేతెంచె నరలోకనాథ
కడుడస్సినాఁడవు కనుమోడ్తుగాక
చలియింపకున్నవి సకల వృక్షములు
మెలఁగవు వనభూమి మృగసమూహములు
నెఱివిహంగంబులు నీడముల్ చేఱి
మఱచియున్నవి తమ మంజులధ్వనులు
యామినీచరులైన యక్షరాక్షసులు
భూమి విచ్చలవిడిఁ బొరిచరించెదరు
దీటుగఁ జీఁకటి చెసలునాకసము
కాటుకపూసిన కరణి నున్నదియు
నీలాంబరంబున నిండుముత్తెములు
గీలించి బ్రహ్మాండగేహగోళమునఁ
గడుఁగొప్పగా మేలు కట్లెత్తినట్టు
లుడుగణంబులతోడ నున్నది నింగి
యడరంగ జనులకు నానందమొదవ
నుడురాజు పొడతెంచుచున్నాఁడఁటన్న
నామాటలకు మెచ్చి యఖిలసంయములు."

అనియు నాంధ్రీకరింపఁబడినవి. భాస్కరరామాయణములోని కందగద్యవృత్తములలో కంటె రంగనాథరామాయణమునందలి ద్విపదీపఙ్క్తులలో భావ మెక్కువహృదయంగమ ముగను నానందజనకముగను బ్రకటింపఁబడినదని యొప్పుకొనక తప్పదు. ద్విపదీచరణం బులు నాతిదీర్ఘంబులై నాతిహ్రస్వంబులై యుండును గావునఁ గరచరణాది సమస్తావయ వంబులు నిరవధికముగ నొక్కతఱి దృగ్గోచరంబగు పరిమిత పరిమాణచిత్రపటంబుభంగి నిరంతరాయముగ సమగ్రముగ గ్రాహ్యంబులై తదనుగుణమైన అవిచ్ఛిన్నానందమును గలి గించుచుండును. శ్రీనాథుఁ డుపయోగించినది మంజరీ ద్విపది. మంజరీద్విపదినిగూర్చి కవిజనాశ్రయములో

ద్వి. "ద్విపదగణంబులె తెచ్చియన్నిటికిఁ
బ్రాసంబులిడకయె పలుకఁజాలినను
మూఁడవగణమున మొగి విశ్రమముగ
మంజరియందురు మధురవాక్పణితి"

అని చెప్పఁబడినది. కవిజనాశ్రయములోనేకాక నన్నయభట్టు ఛందములోఁ గూడ మంజరీ ద్విపది యుదాహరింపఁబడినట్లే యప్పుకవీయమువలనఁ దెలియుచున్నది. కాని శ్రీనాథునికిఁ బూర్వము మంజరీ కావ్యము రచించినవా రెవరును లేరు. ఇతఁడువ్రాసిన గ్రంథములలో నిది చివరదియుఁ బరిణామావస్థలో వ్రాయఁబడినదియుఁ గనుక వ్రాయునాఁటికి లోకానుభవ మధికముగా గలిగినట్లు గనబడుచున్నది.

శ్రీనాథుఁడు ఈగ్రంథమున ఉపమానముల స్వాభావికముగఁ జెప్పినాఁడు. మాదిరికై రెండుమూఁ డుదాహరించెదను. చేతికిఁజిక్కిన శత్రువును విడిచి యతనితోఁ గలహించుటకు

"చెట్టెక్కిఫలమును జేనంటిచూచి
వేగమె దిగి రాత వేసినట్లగును"

అనియుఁ జిన్నవాఁడయ్యుఁ బరాక్రమవంతుఁ డనుటకు

"పిడుగుచిన్నదికాదె భేదించుఁగొండఁ
జిన్నమిర్యమునందుఁ జేమనె కారంబు
ఘనకపాలము కెక్కి కాకనొందించు
మానక నోరెల్ల మంటను లెస్స."

అనియుఁ గొండలు ప్రతిధ్వను లీనెననుటకు

"ధరణీధరంబులు తల్లడంబంది
గుహలను నోళ్ళతోఁ గూయంగసాగె"

అని చెప్పెను. గ్రంథవిస్తరభీతిచేఁ గొన్నింటిమాత్రమె యుదాహరించితి. మల్లదేవరాజంపిన బ్రహ్మనాయుఁడు ... నలగామరాజుతోడను, నాయకురాలు నలగామరాజుతోడను జెప్పిన ధర్మములు యుక్తియుక్తములుగనుండి శ్రీనాథుని రాజనీతికౌశలముం బ్రకాశింపఁజేయుచున్నవి. నలగామరాజు సభలో వేశ్యానాట్యసందర్భమునఁ జెప్పిన సంగీతరహస్యము లాతఁ డాదియందు

ద్వి. "సంగీతసాహిత్య చాతుర్యకవిత
చెప్ప నేర్చినవాఁడఁ జెలఁగి మాచెర్ల
చెన్న కేశవ పాదసేవారతుండ"

అని చెప్పుకొన్న విషయమును ధ్రువపఱచుచున్నవి. బాలచంద్రుఁడు వేశ్యనుగర్హించి

ద్వి. "కుటిలాత్ములారసీ గుణములు తెలిసె
మటుమాయ చేఁజిక్కి మానముధనము
నీపాలు చేసితి నేఁగాననైతిఁ
గామాంధకారంబు కష్టపువిద్య
నీతిమాలినచర్య నేఁటికిఁ దెలిసె
నింటిలోభోజనం బిచ్చుకురాక
పరులయెంగిలి కాసపడితిని నేను"

అని పల్కిన వాక్యములును ననపోతు వేశ్యల విషయమై బాలచంద్రునితో

ద్వి. "వారకాంతలరీతి వర్ణింపరాదు
బిడ్డలకోసఁగక ప్రియురాలికీక
చీమలుగూర్చిన చెలువునఁగూర్చి
ధనవంతులగువారి ధనమెల్లదోఁచి
ముంజికాంద్రను జేసి ముగిపెమడంప
వ్యర్థులై విటవృత్తి వసుమతిమీదఁ
బోయిరి బ్రదికెడు పొందికలేక"

అని చెప్పినవాక్యములను నీతిబోధకములైనవి. 41-వ పుటలో బాలచంద్రుఁడై తాంబకుఁ జేసిన వైరాగ్యోపదేశము, బాలచంద్రుఁడు యుద్ధమునకుఁ బోవుసంకల్పము సూచించినప్పుడు తల్లియైన యైతాంబ పలుకని బ్రతిమాలి ఆమె పొందినశోకము, బాలచంద్రుఁడు నిజసంకల్పంబు వదలక తల్లి నూరార్చి సకారణంబుగఁ బలికిన వీరధర్మ వాక్యంబులు, ఉచితముగ నున్నవి. బాలచంద్రుఁడు వీరులతో బాలత్వమునుగూర్చి చెప్పినవిషయములు స్మరింపఁదగినవి. ఆవాక్యముల నుదాహరించుచున్నాను.

ద్వి. "పేరెబాలుఁడుగాని బిరుదుమగండఁ
బగవారిఁగొట్టని బ్రతుకదియేల
తలిదండ్రులను బోవఁ దనయుఁడే కర్త
మానాభిమానముల్ మగఁటిమి మించఁ
బ్రబలింపఁగలవారు బాలురేసుమ్ము
బాలురె పెద్దలు బల్లిదుల్ వారె
బాలురకేవృద్ధి పరికించిచూడఁ
బెద్దలు మతిచెడి పిటికి పాఱుదురు

పాంచభౌతిక దేహ పటిమ క్షీణించు
ధైర్యంబుతగ్గు నుత్సాహంబు లుడుగు
వయసుమీఱినవేళ వచ్చునా బలిమి
కీర్తికైనను నపకీర్తికైన
బాలురపైనుండు భారమంతయును.”

బ్రాహ్మణక్షేత్ర సంజాతుఁడైన యనపోతును యుద్ధమునకు రానీక వెనుకకుఁ బంపి బాలచంద్రుఁ డేగినపిమ్మట నతఁడు పల్కిన వీరవాక్యంబులు

శ్లో. “అగ్రతశ్చతురో వేదాః పృష్ఠతస్సశరంధనుః,
ఇదం బ్రాహ్మమిదం క్షాత్రం శాపాదపిశరాదపి.”

అని పరశురాముఁడు చెప్పిన వాక్యములను జ్ఞప్తికిఁ దెచ్చుచున్నవి. అనపోతు బ్రాహ్మణుఁడు; ఆఱువేలనియోగి; గృహనామము “ఒడ్డి” పెద్దనపౌత్రుఁడు; మల్లపరాజు పుత్రుఁడు; తల్లి పేరమ్మ; చతుర్వేదాధ్యయనము చేసినవాఁడు; బాకుయుద్ధమునందు నిపుణుఁడు. అనపోతుతండ్రి మల్లదేవునివద్ద వ్రాయసకాఁడుగా నుండెను. శ్రీనాథునికిఁ బిమ్మట వీరచరిత్రమును వీరభద్రుఁడు పద్యమయముగను, మల్లయ్య, బలరామిసెట్టికొడుకు కొండయ్య యను నిరువురు ద్విపదిగాను రచించిరి. కొండయ్యయు మల్లయ్యయుఁ దమగ్రంథములలో శ్రీనాథు నుదాహరించియున్నారు. వీరు తమ గ్రంథములఁ జాలవఱకు శ్రీనాథు ననుసరించియే చెప్పిరి. వీరొక్కొకచోట లేనివి కొన్నికలిపి, యున్నవి కొన్ని తీసివేసిరి. బొంగరము పుట్టుకయని కొండయ్య యొక వింతకథ కల్పించినాఁడు; శ్యామాంగి (సబ్బాయి) తమ్ముఁ డంతర్వేదిగాని కథయొక్కవగఁ జెప్పినాఁడు; ద్విపదీకృతి వ్రాయువాఁడయ్యును బాలచంద్రుఁడు బొంగరములాడు కథాసందర్భమునఁ గ్రొత్తగాఁ బద్యమొకటి చేర్చినాఁడు. దానినిఁ జూపుచున్నాను:—

క. “నెఱిగలిగి నాఁటినాఁటికి, సరిగడవఁగ బిరుదుకచకుచద్వయమొరయన్
చిఱుతొడల నడుమునెక్కన, విఱిగెనొయనఁ జెలులుదాను వెఱచుచునడచెన్.”

ఈపద్యము నన్నెచోడుని కుమారసంభవమునందుఁ గనఁబడుచున్నది.

మఱియుఁ గథాంశములయందుఁగూడ నచ్చటచ్చట మార్పులు చేసినాఁడు. కొండయ్య, మల్లయ్య, శ్రీనాథునిగ్రంథ మేరీతి ననుసరించిరో తెలియుటకై ముగ్వురగ్రంథములనుండి యొకటే సందర్భమునందలి కొన్ని పఙ్క్తుల నుదాహరించుచున్నాను.

## కోమటిస్త్రీకి బొంగరము తాఁకినకథ.

శ్రీనాథుఁడు:—

ద్వి. "పొక్కుచుఁ జేరెను బొలఁతులగుంపు
కప్పిరి పలుపలు కర్ణంబులందుఁ
గర్పూరరజమును గలయంగ నూఱి
పదతలంబులయందుఁ బాణులయందు
గస్తూరిగంధంబుఁ గలిపిపట్టించి
సఖులెల్ల శైత్యోపచారముల్ సలిపి
చింతింపఁబోకుఁడీ చెలి లేచునిపుడె
యని పల్కునంతలో నామూర్ఛ దెలిసి
ముకుళితహస్తుఁడై ముందఱ నున్న
బాలునిఁ గనుఁగొని బలుకోపమునను"

కొండయ్య:—

ద్వి. "ఏమనివగతుము ఏమి చేయుదుము
ఏమనిమామకు నెఱుఁగఁ దెల్పుదుము
నినుఁబాసి భువిమీద నిల్వనోపుదుమె
వనజాక్షి నీవెంట వత్తుమటంచు
నెఱి బ్రహ్మపుత్త్రుఁడు నీవిధియంచు
గరియాన లిరుగడఁ గదిసి చల్లఁగను
భామలందఱు కూడి పలుతెఱంగులను
గోమలి కుపచరణ కొంతగైసేయఁ
జెలికిఁ గప్పినమూర్ఛ తెలిసి శీఘ్రముగఁ
దలవంచి తనకాలు తప్పక చూచి
యిది యేరిబొంగరం బింతచక్కనిది
యిది యెవ్వరిదెయమ్మ యీవెలలేని
దప్పుడు చెలికత్తె లందఱు చూచి
యప్పరో వినవమ్మ యతఁడు బాలుండు

అవిచారితముగా శ్రీ వీరేశలింగంపంతులుగారీపద్యములే శ్రీనాథునివైనట్లు తజ్జీవితచరిత్రములో నుదాహరించినారు.

మల్లయ్య:—

ద్వి. "అంతలో జెలికిని నటుమూర్ఛదెలిసి
ముకుళితహస్తుఁడై ముందఱనున్న

తెప్పిరిబాలుని తెరగెల్ల జూచి
నిప్పులుచెదరగ నెలఁతయిట్లనియె
కావర మేలన్న కట్టిఁడిదుష్ట."

## వృద్ధవేశ్యావర్ణనము.

శ్రీనాథుఁడు:—

ద్వి. "కోఁతివంటిది వృద్ధగురుతరకోపె
కోలపట్టుకవచ్చె గూతుదగ్గఱకు
విఱిగినరొండియు వ్రేలుచన్దోయి
యుఱిసిపోయినయొళ్ళు నూచలుకాళ్లు
వంగిననడుమును వదలినపండ్లు
పీలచేతులుగూని పీనుగుమోము
చిక్కగనరిసిన చింపిరితలయు
వ్రాలిన బొమముడి వదలినమేను
మెడమీద గణతియు మీగాళ్ళబూత
పలుచనిగడ్డంబు పైని బుల్పిరియుం
మూతిమీసపుమొల్క ముక్కురోమములు
తలవడంకును మాట తబ్బిబ్బుమఱపు
చొల్లుగాఱెడునోర శుభ్రంపుకంపు
కన్నులఁబుసులును గాంతుమిక్కుటము."

కొండయ్య:—

ద్వి. "కల్లలపుట్టిల్లు కడునోడలెల్ల
శిస్తువెడలినచింత చివికినగంత
పత్తిగింజలసంత పరదేశిబొంత
ఊదుపోవనిడొక్క ఉరిపడ్డనక్క
... ... ... ...
ఉచితంబెఱుంగని యూడలితొత్తు
... ... ... ...
తెరలు యీదనవెల్లి దేవాంగపిల్లి
మాయలకతకారి మందులమారి

కాయనిపడుచెట్టు కడుబాడుచెట్టు
దొందరలినగండి తొమ్మండ్ర దొండి
అందతుకులబొడ్డి ఆమిదెపుమడ్డి
అఖిలకోతలవెల్లి యాసబ్బతల్లి.''

మల్లయ్య:—

ద్వి. ''వృద్ధవానరమైన వెసరాగముండ
దద్దరింపుచులేచి తగునూతకోల
విఱిగినరొండియు నూచలాకాళ్లు
ఉరిసిపోయినయొళ్ళు నూడినతలయు
తోలుశల్యములతో దూగాడునడుము
పీలచేతులు నడపీనుగురీతి.''

కొండయ్య శబ్దసౌష్ఠవము పాటింపక యిచ్చవచ్చినట్లు చెప్పినాఁడు. మల్లయ్య రచనలోఁ జాలవఱకు శ్రీనాథుని వాక్యములే యున్నవి.

నాకుదొరికిన తాళపత్రగ్రంథములో కొన్నిచోట్లఁ బఱ్ఱ్కులుపోయినవి. పోయిన చోట్లను, బోయిన ట్లగుపడినచోట్లను నా నీరసవాక్యములతోఁ బూర్తిచేసి కుండలిం చితిని. ఒకటి రెండుపదములు పూర్తిచేసినచోట్లఁ గుండలము లుంచలేదు. కథా భాగములకు శీర్షికలు నేను చేర్చినవేను. అచ్చుకూర్చువారి పొరపాటువలననైన నేమి నాపొరపాటువలననైన నేమి 25, 38, 43, 50, 60, 102 పుటలలో నేను బూరించిన కొన్నిపఱ్ఱ్కులకుఁ గుండలములు విడిచిపెట్టఁబడినవి. అవసరమనితోఁచిన స్థలములలోఁ జదువరులకు సుబోధముగ నుండుటకై గచ్ఛద్వ్యాఖ్యను కూర్చినాఁడను. అన్యపండితుల సంస్కృతాంగ్లేయవాక్యముల నుదాహరించినప్పుడు పలయుచోట్ల వానికి సరియైన తెలుగువాక్యములు వ్రాసితిని. బాలచంద్రుని వేశ్యనామము సబ్బాయి యనియుండ శ్యామాంగియని దిద్దితిని. ప్రాచీనగ్రంథాలలో ఉన్న ప్రకారము పలనాటివీరచరిత్రయని నామ ముంచితిని. బహుధన సాధ్యములయ్యుఁ జిత్రములను గొంతమంది మిత్రుల యనుగ్రహముచే సమకూర్పఁ దలంచితిఁగాని వారిసాహాయ్యము సమయమునకు రాక పోవుటవలన వీలైనది కాదు. యుద్ధకాలమును నలుగురాజు జన్మదేశమును నాకు లభ్య మైన కొద్దిగ్రంథసామగ్రితోడను శిలాతామ్రశాసనములతోడను నిర్ణయించితిని. ఇతి హాసవిదులు వీరచరిత్రముయొక్క యేభాగమైన దయయుంచి యెవరేని నా కందఁ జేయఁగలిగినయెడల నది వ్రాసికొని వారిగ్రంథము వందనములతో మరల వారికిఁ

బంపెదను. గ్రంథము ముద్రించుట కిదియే ప్రథమపర్యాయము గావున నేమైన లోపము లుండెనేని క్షమింపఁ బ్రార్థించుచున్నాను.

ఈ గ్రంథవిషయమునఁ దోడ్పడిన మిత్రులందఱకు నమస్కారము లాచరించుచున్నాఁడను. అందులో నేను శ్రమపడుట యటులుండ నాకొఱకు శ్రమపడి నిజాము రాజ్యమునుండి గ్రంథమును దెప్పించి వ్రాయించి యిప్పించిన మ-రా-రా-శ్రీ, అక్కిరాజు శంకరనారాయణగారికిని, జల్లగుండ్ల పిచ్చయ్యగారికిని, గ్రంథాంతరము నందఁజేసిన జానపాటి వేంకటప్పయ్యగారికిని వీరచరిత్ర ప్రథమభాగము నొసంగిన పిడుగు వీరభద్రయ్యగారికినిఁ దగినసమయములఁ దోడ్పడుచు వచ్చిన తాడేపల్లి సీతారామయ్యగారికిని, ముద్రణాదివ్యయమున కేఁబదిరూప్యము లొడఁగూర్చి సాహాయ్యముచేసిన మహారాజరాజశ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులుగారికిని నామనఃపూర్వకవందనములు సమర్పించుచున్నాఁడను.

గుంటూరు,
జులై, 1-వ తేది 1911. ఉమాకాంతుడు.

☞ ప్రథమభూమికయందలి 53, 57, 61, 63 పేజీలలోని గద్యభాగవ్యాఖ్యలు ద్వితీయావృత్తిసమయాన వ్రాసినవి.

## వీరచరిత్రకథాసారము.

ఉత్తరదేశమునఁ బాలమాచాపురి యనుపట్టణము కలదు. జంభనాపురియని దీనికి నామాంతరము. దీని ననుగురాజు యేలుచుండెను. ఇతఁడు కార్తవీర్యార్జునున కేడవతరమువాఁడు. కార్తవీర్యుఁడు చేసినపాపములు బాధింపఁగా ననుగురాజు బ్రాహ్మణోత్తముల యాలోచనవలన జీడినూనె గుడ్డలు ధరించి ససైన్యుఁడు, సామాత్యుఁడు, సధనుఁడు, సకులదేవుఁడునై రాజ్యమువిడిచి, పాపపరిహారార్థము తీర్థయాత్రలకు వెడలి నానాక్షేత్రంబుల సేవించుచు నదులలో మునుఁగుచు నంధ్రదేశమునకు వచ్చి యమరావతిరేవున కృష్ణానదిలో స్నానముచేయఁగా నల్లని జీడినూనె గుడ్డలు తెల్లనాయెను. ఇట్లు వస్త్రములు తెల్లనగుటయే పాపవిమోచనమునకుఁ జిహ్నమని బ్రాహ్మణు లనుగురాజునకుఁ బ్రథమమునఁ జెప్పియుండిరి. అనుగురాజప్పుడు చందవోలులో రాజ్యము చేయుచున్న రాజుకూతును వివాహమాడెను. ఆమెపేరు మైలాంబ. కూతునకుఁ జందవోలురాజు పల్నా డరణమిచ్చినందున ననుగురాజు గురిజాలరాజధానిగ పల్నాటి కధి

పతి యయ్యెను. అనుగురాజునకు భార్యలు ముప్వురు. వీరవిద్యాదేవి, భూరమాదేవి, మైలమాదేవి. వీరవిద్యాదేవియందుఁ బెదమల్లదేవుఁడు, పినమల్లదేవుఁడు, బాలమల్లదేవుఁడు నను ముప్వురుపుత్రులు గలిగిరి. భూరమాదేవియందు కామరాజు, నరసింహభూపతి, ఝుట్టిరాజు, పెరుమాళ్లరాజు నను నల్వురుసుతు లుద్భవించిరి. అనుగురాజు మంత్రి దొడ్డనాయఁడు. ఇతఁడు వెలమ; జేతినాయనికుమారుఁడు. బాదరాజునకుఁ బెద్దన్న యని నామాంతరము కలదు. సంతానము కలుగకముం దనుగురాజుచే బాదరాజు పెంచుకొనఁబడి క్షత్రియుండును గంచర్లపురాధీశుఁడు నైన కృష్ణగంధర్వుని కూతును లవాంబను బెండ్లాడెను. బ్రహ్మనాయఁడు విష్ణువుగా భావింపఁ బడుచున్నాఁడు. కురుక్షేత్రయుద్ధమునఁ గృష్ణుఁ డెంతముఖ్యుఁడుగ నుండెనో పల్నాటి యుద్ధమున బ్రహ్మనాయఁ డంతముఖ్యుఁడుగా నుండెను. ఈయన పల్నాటికృష్ణుఁడని పేర్కొనఁ బడుచున్నాఁడు. ఇతనికుమారుఁడు బాలచంద్రుఁడు. కన్నమదాసని మఱి యొకఁడు గలఁడు.

ఇట్లు దొడ్డనాయఁడు మంత్రిగ ననుగురాజు కొంతకాలము పరిపాలించి మృతి నొందెను. దొడ్డనాయఁడుకూడ స్వర్గమున కేగెను. నలగామరాజు పట్టాభిషిక్తుఁ డాయెను. నాయకురాలను నొకయువతి నిజశక్తిచేత ననుగురాజునను గ్రహము సంపాదించి యతఁడు చనిపోయినవెనుక నలగామరాజువద్ద మంత్రిణి యయ్యెను. ఈనాయకురాలి యసలుపేరు నాగాంబ. నాయకురాలనియే సాధారణముగా వ్యవహరింపఁబడుచున్నది.

“నాయకురాలి జన్మస్థలము పల్నాడుతాలుకాలో నాగులేటియొద్దుననున్న జిట్టగామాలపాడను నొక చిన్నగ్రామము. ఈమె పంటరెడ్లకులమునఁ బుట్టినది. తండ్రిపేరు ఛాదరి రామిరెడ్డి. మేనమామపేరు మేకపోతు సింగారెడ్డి. ఈమెయింటిపేరరవల్లివారని చెప్పఁబడినది. ఇది తల్లిగారింటిపేరో యత్తగారింటిపేరో తెలియదు. ఈమెభర్తనామ మెచ్చటఁ గానరాదు. పల్నాటియుద్ధమున కీమెయే కారకురాలు. అతిపరాక్రమశాలిని. గురిజాల పురవరాధీశ్వరులగు నలగామరాజాదు లీమె చేతిలో కీలుబొమ్మలవలె నుండువారు. ఈమె బ్రహ్మనాయని కిరుపోటిగా రాజ్యతంత్రము నడపిన సమర్థురాలు. యుద్ధావసానమువరకుఁ జలనమునొందక మగబిరుదు కట్టి యశ్వారూఢమై బ్రహ్మనాయనితోఁ బోర సమకట్టిన శూరురాలు. ఈమె మంత్రిణి యగునప్పటికి వీరవిద్యాదేవికి జన్మించిన మల్లదేవాదులు బాలురుగా నుండిరి. బ్రహ్మనాయఁడు వీరిని దగ్గఱకుఁ దీసి రాజ్యములోఁ గొంతభాగ మిప్పించి

[1] గురిజాలనుండి పోయి [2] మాచెర్ల పట్టణము నిర్మించుకొని వారు యుక్తవయస్కులు కానంతన వారికి బదులుగఁ దానే పరిపాలించుచుండెను. వారు పెద్దవారైనతరువాతఁ గల్యాణపట్టణాధీశుఁడైన వీరసోముని కుమార్తెల నిప్పించి వివాహముచేసి పెదమల్లదేవుని మాచెర్లకుఁ బట్టాభిషిక్తునిఁ జేసెను. అనుగురాజు చనిపోవునపుడు కొడుకులనందఱను బ్రహ్మనాయనికి ఒప్పగించెను. నలగామరాజు నాయకురాలిని మంత్రిణిగాఁ జేసికొన్నను మల్లదేవులకుఁ బెండ్లిచేసిన తరువాత బ్రహ్మనాయఁడు ద్వేషబుద్ధిలేక నలగామరాజునకు భూరమాదేవిపుత్రులకుఁ గట్నము లిచ్చుటకై గురిజాలకుఁ బోయెను. వారును దగినవిధముల గారవించిరి. గురిజాలలో బ్రహ్మనాయనికి నాయకురాలు విషము పెట్టించెనుగాని యామె ప్రయత్నము నిష్ఫలమాయెను. మాయ చేసి నాయకురా లాతనినిఁ గోడిపందెమున కొడఁబఱచెను. ఓడిపోయినవా రేడుసంవత్సరములు రాజ్యము విడచిపెట్టి పరభూములకుఁ బోవలయునని పందెపుటొడంబడిక. పందెములో బ్రహ్మనాయఁ డోడి గోపన్నను గోల్పోయి మల్లదేవుల వెంటఁబెట్టికొని మాచెర్ల విడిచి కృష్ణానదిని దాఁటి మండాదిపట్టణమునకు వలసపోయెను. పిమ్మటివృత్తమునకు వక్ష్యమాణమైన "పల్నాటివీరులకథలు" అను గద్యకృతినిఁ జూడదగును.

1 పల్నాటిసీమలోనున్నది. 2 పల్నాటిసీమలో చంద్రవంకనదిమీద ఉన్నది. పల్నాడు గుంటూరుజిల్లాలో ఒకసీమ.

# INTRODUCTION.

Ever since the evolution of man began from the brutal state, Great Persons have stepped into and passed away from this world leaving behind their marks in the annals of the progress of mankind. They are the light guiding and shaping men's thoughts and actions in their bewildering journey of life. They are the proclaimers of the unspeakable significance, the unreachable height, the immeasurable breadth and the unfathomable depth of the Infinite Power. By them the whole world moves; in them the whole world rests; for them the whole world longs. The history of the world is the history of these Great Men. Leaving the prehistorical periods, a little thoughtful mind can, from the dawn of documentary history down to modern times, perceive how the world has been affected by the appearance of the personages like Sri Rama, Buddha, Christ, Sankara, Kalidas and Shakespeare. These Great Men or Heroes, as they are justly called, are not confined to a certain country or to a certain age. They have been making their appearance in different corners in different ages. Wherever they appeared, whether in the meditative East or in the practical West, they were received with divine honour, regarded with admiration and adored with prostration. "The worship of a Hero" truly says Carlyle, "is transcendent admiration of a Great Man......No nobler feeling than this of admiration for one higher than himself dwells in the breast of man." Architects built temples in their honour;

sculptors carved their pictures on wood and stone; painters drew their figures in beautiful colours ; poets sang their heroic deeds. Sreenatha sang the valour of the Heroes of the *Palnad* and it is the history of these Palnad Heroes, depicted by Sreenatha that is found in the following pages of this book. These warriors had left their distant home on the banks of the Narmada, migrated for political reasons into the broad grand plains of the Palnad as a place of refuge and settled there —settled never to return. They obtained rights in the country as a matrimonial gift and ever since Palnad has been called their home and they have been styled, "Palnad Heroes." They held undisputed sway over it and diffused their religion and civilization among the people. They built villages, made tanks, constructed anicuts, dug canals, erected temples and raised fortresses in the Palnad and the surrounding country, traces of which remain to this day whispering in the listening ears, dumb as they are, various tales about the activities of of their makers in days gone by. Fortunately or unfortunately, the country had their rule only for a short time. During that short period, they held a wonderful sway over the country. Their love for the subjects was unlimited. Their indomitable valour was unparalleled. The chaotic battle-field was their sporting ground. The roar of the trumpets was their delightful sound. The bare flashing sword was their walking-stick. They were brave but not ferocious; they were valiant but not cruel. Timidity they did not know. Lawlessness they did not tolerate After ably governing the country for a short period, in a great fratricidal war that ensued,they, sacrificing their lives in defence of their rights,

displayed astounding and superhuman prowess which, as was naturally the case in those ancient times, held them deified in the eyes of the people dumb with awe and wonder. What with their humane government and what with their extraordinary character, they earned the love, respect and admiration of the people as no other ephemeral sovereign had done. Villages are named after them. Temples are dedicated to them. Their pictures are carved upon stones. Gorgeous processions are held in their honour. People vie with each other in paying their adoration irrespective of caste and creed. I cannot refrain from quoting in this connection the following lines of that famous archæologist, Robert Sewell, concerning these Heroes :—

" It is a curious fact that, while the Palnad Heroes themselves worshipped indiscriminately Vishnu and Siva and while this mixture of worship is still largely observed in this out of the way part of the country, we have in this Heroes' temple a sort of Mussalman coalition into the bargain. The Mussalmans take part in the anuual festival and pay their devotions to the souls of the Heroes ; and the walls of the temple are discolored with the splashes of chunam water and red paint thrown on them by Muhammadan admirers." Lists of Ant. Vol. I.

The construction of the temple itself is attributed to a Mahammadan whose grave is still to be seen within the precincts of the temple. Our admiration is all the more increased when we read the story of a female of Panta Reddi family, who, as the leading figure one the side of Nalagama, made such wild charges, evinced such gigantic valour and fought with such stupendous courage as would excite the wonder of Nelsons and Nopoleans. Thousands

of people flock together every year at Karempudi, the scene of the great battle, from almost all parts of the Telugu country. The people are very ardent in their faith in the Heroes. They worship them as Gods. In marriages and such like ceremonies, the symbols of the Heroes stand on the sacred altars in the houses of the people even to this day. It is really interesting to see how Veroism (Hero-worship) which resembles to some extent the Norse faith of Scandinavia and the Shintoism of Japan, originated in the Palnad and extended its influence throughout the Telugu country. This Hero worship has been continuing here for eight centuries and, though an orthodox religionist may coldly speak, a gloomy theologian may disapprove, and a haughty atheist may laugh at the idea, yet must continue as long as the Earth turns round the Sun.

The author of this Ballad Sreenatha is a Vira Saivite for ceremony, but he seems to belong to the school of rational philosophers as they may be called. Though we cannot claim for him subtler elements of social morality according to tradition, his movements seem to be entirely in high society and he was one of the most celebrated scholars of his age in the Telugu country.

This Palnati Veeracharitra, has been uupublished and unknown to the general public until this time. It, in the course of four hundred and more years through which it kept its existence, underwent many changes, though not radical, in its composition. Somehow or other the book, from very early times, has always been in the hands of the illiterate low caste beggars who sing the story to the people and receive something as reward from

them. These illiterate people who possess the book never like the idea of publishing it thinking that, if published, every one would know those poems. Orthodox Brahmins, in general, think it madness to pay close attention to the singing of these beggars and disgrace to hold conversation with them. Moreover, this voluminous poem is not in one place with one person but portions of it are scattered throughout the Telugu country. Under such circumstances, the readers can imagine the awkward position in which I was when trying to get the book and the difficulties that would present themselves before finally succeeding in the attempt. In a way, I have now published this part of the whole poem and eagerly expect encouragement from the Telugu Public to bring out the remaining portions also within a short time. I have fixed the date of the war and the original home of the Heroes in my Telugu introduction with the light of the few historical accounts, Puranas and inscriptions I could have access to and if students of history kindly give their valuable suggestions upon the points, I shall feel highly grateful to them and acknowledge my indebtedness to them. Although the book had been given to the press nearly one year back, it could not be completed till now owing to the limited means and time that I could devote for it in the midst of other duties. My thanks are, however, due to Sri D. Kesava Row Pantulu Garu, Proprietor of the Vani Press, for the kind and timely help he rendered in many ways in bringing the book to its present form at least so early as this. I must express my feelings of gratitude to Sri Akkiraju Sankarayana Garu,

Sri Challagundla Pichayya Garu, and Sri Janapati Venkatappayya Garu and Sri Unnava Lakshminarayana Pantulu Garu, for their kind aid in the publication of this work.

BEZWADA,
*9th June, 1911.*

☞ THE EDITOR.

# పలనాటివీరచరిత్ర

## బాలచంద్రయుద్ధము.

శ్రీరఘునాయకు జిత్తమందుంచి
శ్రీకంఠుపరమేశు శివునాత్మఁదలచి
పార్వతీదేవికి భావించిమ్రొక్కి
శివగణంబులనెల్ల చింతించిపొగడి
ప్రాకటంబుగవిష్ణు ప్రార్థనజేసి
యిందిరాదేవిని నిచ్చలోనిలిపి
విష్ణుభక్తులనెల్ల వినుతులుసేసి
జలజజుగొనియాడి శారదనెంచి
అఖిలవిద్యలకెల్ల ఆద్యుడైనట్టి
గజముఖువిఘ్నేశు ఘనతకీర్తించి
వీరభద్రునిశౌర్య విభవంబులెన్ని
* సంగమేశ్వరునకు చక్కఁగామ్రొక్కి
గుర్జాలగంగను గోరిప్రార్థించి
భక్తి † గోగులపాటి భైరవుదలచి
నీలమేఘశ్యాము నిజమూర్తియయిన
‡ శీలమ్మనాయుని చిత్తమందుంచి
కడువేడ్క పోతలింగము గొనియాడి
§ మాచెర్లచెన్నుని మదిలోనదలచి
ఆంధ్రకవుల నుతులమరగావించి
గీర్వాణకవులను కీర్తించిమ్రొక్కి
సంగీతసాహిత్య చాతుర్యకవిత
చెప్పనేర్చినవాడ చెలగి "మాచెర్ల"
చెన్నకేశవపాదసేవారతుండ
వలను భారద్వాజ వంశవర్ధనుడ
కవిసార్వభౌముడ ఘనతగన్నట్టి
శ్రీనాథుడనువాడ శివభక్తిపరుడ

---

* కృష్ణా, మాలాపహారిణీ నదులు సంగమించుచోట సంగమేశ్వర క్షేత్రము గలదు. మఱికొన్నిచోట్లఁగూడ సంగమేశ్వరాలయములు గలవు.

† గురిజాలకుఁ దూర్పుగానున్నది.

‡ శీలమ్మ పుత్రుఁడు అనగా బ్రహ్మనాయుఁడు.

§ పల్నాడుతాలూకాలోఁ జంద్రవంక తీరమందున్నది దీనికి మహాదేవిచెర్ల అనికూడ పేరు కలదు.

శాశ్వతంబైనట్టి సద్గ్రంథ మొకటి
చెప్పబూనితిమనసు చెలరేగియుండ
శ్రీరమ్యవక్షుండు శ్రితవత్సలుండు
వారిజనేత్రుండు వల్లవీవిటుడు
శమితభక్తజనార్తి శాశ్వతకీర్తి
కందర్పజనకుండు కనకాంబరుండు
సురరాజవిహితుండు శుభవీక్షణుండు
కరుణాంతరంగుండు కలుషభంగుండు
ఎల్లజగంబుల నేలెడుఘనుడు
పాలమున్నీటిపై బవళించువాడు
సొరిదినెల్లప్డు భూసురరక్షకుండు
గిరిధర్తు డగు చంద్రగిరిరంగవిభుని
వేంకటాద్రిపునకు వెలయనొక్కొక్క
సరసునకును రణసాహసాంకునకు
అలరాజుబాకున కవతారమొంది
మలసినాటొక్క బొమ్మలపెండేరంబు
చెలగిడాకాలనుంచిన మహాఘనుడు
చిలుకలపైకొక్క జిక్కుడువాడు
చేకొన్నమాచెర్ల చెన్నకేశవుడు
నాకలలోవచ్చి నయ మొప్పబలికె
వినవోయిసత్కవి వేడ్కనామాట
మనమున నాకు సమ్మతమైనదొకటి.
అనవిని దేవ మహాప్రసాదంబు
దృఢముగనానతి యిమ్మునాకిప్వ
దనచెన్నకేశవు దప్పుడిట్లనియె
కార్యంబుపుణ్యంబు సమకూర్చినట్టి
పలనాటివీరుల భాగవతంబు
ప్రకటితంబుగనీవు రచియించిమాకు
అంకితంబొనరింప నమవొందుసూవి
అనుచును శ్రీకాంతు డరిగినపిదప
మేలెంచిమనమున మేలయ్యెననుచు
విలసిల్లు పలనాటి వీరులచరిత
జనులెల్ల భక్తిచే చదువుటకొరకు
* మంజరీద్విపదగా మన్నించి నేను
చెప్పబూనితివచః శ్రీ మెరయంగ.
ప్రకటితంబైనట్టి పలనాటిలోన
భావింపగావిష్ణు భక్తిని మెరసి
నరనాథసింహంబు నలగామరాజు
మహితచారిత్రుడు మలిదేవరాజు
ధారుణినేలుచు తమలోనబోరి
† కార్యమపూడి శ్రీకదనంబునందు
నరపాలచంద్రుండు నలగాముతాక
పంపిన ‡ బాలుండు బాహువిక్రముడు
తోరంపుగజములు తురగచయంబు

---

* ఈద్విపదయందుఁ బ్రాసము లేదు.

† పల్నాఁటిలో నాగులేటితీరమున నున్నది.

‡ బ్రహ్మనాయుని కొడుకు.

మన్నీలబలముల మహితశౌర్యమున
చెదరిపారగఁబోఁడ్చి చీకాకుసేసి
నలగామురాజును నరసింగునెదిరి
మర్దించిరణమున మడిసినవిధము
ప్రచురింతువీనుల పండువుగాను

(కథాప్రారంభము.)

గణుతింప తత్కథాక్రమమెట్టి దనిన
అరయ † మేడపిలోన * అలరాజుచావు
వీరవిక్రమత చే వీరసాహసత
పరగిననాయకుల్ పటుపరాక్రములు
వీరనాయకులెల్ల వినివెరగంది
భావించితలపోసి బాలమల్దేవు
బిరుదురాజును దెచ్చి పృథ్వివెలయఁగ
నయమైనయట్టి లగ్నంబునందతని
పట్టంబుగట్టిరి పరగ మేడపిని.
భూమీశసుతునిట్లు పుడమిని నిలిపి
భాస్కరసమతేజు బాలుని దెచ్చి
సచివకార్యంబున సమ్మతినుంచి
ఆటకరణపుకార్య మనపోతుకిచ్చి
మాడచియనునట్టి మగువను దెచ్చి
రాణివాసముగావ రక్తితోనుంచి
ఆనందమునుబొంది రంతటవారు.

(మలిదేవరాజు, బ్రహ్మనాయుఁడు మొదలయినవారు కార్యమవ్వాడి యుద్ధరంగమునకు బయలుదేరి పోవుట)

అటమీదభూమీశు డధికోత్సవముల
ఘనకార్యమావ్వాడి కదనరంగంబు
చేరబోవుటకునై చింతించియపుడు
ప్రజలతో మేడపి బదిలంబుసేసి
పరగముప్వరుపతుల్ పైనంబుగాఁగ
ఎలమిభూసుర పురోహితులెల్ల పూని
జయమంత్ర ముబెట్టి చనుమని చెప్ప
తొల్లియేకాదశి దురమానటంచు
రణభేరి వేయించె రమణీయముగను
అతులసాహసవృత్తి నాడంబు వెడలె
‡ గొల్లెనల్ గట్టిన గొప్పతాబంట్లు
బల్లాని పెట్టెలు పట్టెమంచములు
తరుచైనపీటలు § తమ్మపడిగెలును
వింతమందసములు వెలయుగొడ్గులును
కాశ్మీరకస్తూరి గంధకర్పూర
మాదిగావాసన లమరుపెట్టెలును

† బ్రహ్మనాయుఁడితనిని రాయబారమునకుఁ బంపఁగా నాయకురాలు కుట్రచేసి చంపించెను.

* వినుకొండతాలూకాలోనున్నది. మలిదేవరాజాదులు తమ రాజధానియైన మాచెర్లవిడిచి మడాందికివలసపోయి తిరిగివచ్చి యీ మేడపిని నిర్మించికొనిరి.

‡ గుడారము.

§ తాంబూలము వేసికొన్న తరువాతనుమ్మివేయుటకై యుంచికొనునొకవిధమైనపాత్ర.

బోకెcసంఖులబల్వు బోనగావళ్ళ
జవ్వాజిపిట్టలు శారికాకీర
పంజరములుంపట్టు పరిచారకులును
కోడెకాంద్రదలించి కొట్టెడురెడ్లు
పడివాగెతేజీలు పాలకీజోళ్ళ
అష్టభాగ్యంబుల అంగళ్ళవారు
సందడిపడదండు చయ్యనగదలె
పెంపైనపాలకి పెదమల్లుగదలె
పినమల్లుగదలెను పృథ్వీశువెనుక
తమ్ముడుగదలెను ధరణీశువెంట
పచ్చలులింగాలు పట్టుగాజెక్కc
బాగుచేసినయట్టి పాలకియెక్కc
పలుమారుపుత్రుకై పలువరింపుచును
కొలువులోనాయుండు కొనకట్టపట్టి
♦ కులపగదీర్పనీ కొడుకితడంచు
పెట్టెనాచేతిలో ప్రియతనూజాతు
బాలునితెగువ యేపాటిదోయనుచు
* కొమ్మభూమీశుండు గొబ్బునగదలె
అల్లాణరాజులు అచ్చోటినృపులు
అన్నలుదమ్ములు అందరుగూడి
సూర్యవంశమువారు సొంపుతోచనిరి.

వారికిపిరికి వరమంత్రియైన
నీలవర్ణుండును నియతచిత్తుండు
బ్రహ్మన్నగదలెను పాయనివేడ్కc
పట్టిరిగొడుగులు పాలకికెత్తి
సూర్యాతపంబు పైసోకనియట్లు
పాలకీలకురెండు పార్శ్వంబులందు
అందంబుగాబట్టి రరిగెలజోళ్లు
వింజామరంబులు వెలయగానెమిలి
కుంచెలవారును గూడివీవంగ
నాయుండురాజులు నయములోచనగ
ముందు † డమాయీలు మురజసంఘంబు
బూరలుభేరీలు పోటుధారలును
కాహాళవంకిణి కాలికొమ్ములును
శంఖసమూహంబు సన్నాయిజోళ్ళ
మురళిచయంబును ముఖవీణవితతి
నరగలుతప్పెటల్ నయమైనడోళ్ళు
తమ్మటమ్ములుమెంచదగువీరణములు
ఘనమైనరుంజలు ‡ కనకతప్పెటలు
చేగంటలును మరి చిరుగంటచయము
ఘనమైనమ్రోతచే గగనంబుగప్ప
కుంభిణివణకంగ కులగిరులెల్ల

♦ ఇది దినవెచ్చమువంటిది.

* ఇతcడు క్రీ। శ। 1188-వ సంవత్సరమునందు కల్యాణమును పాలించుచున్న నాలుగవ సోమేశ్వరుని కుమారుcడు. ఇతనిపుత్రుc డలరాజు. కొమ్మరాజును అలరాజును పలనాటిలోc జనిపోయినందున కల్యాణమునేలు పశ్చిమచళుక్య వంశము వీరితో నశించెను.

† చర్మనిర్మితమైన వాద్యయంత్రవిశేషము.

‡ బంగారుతప్పెటలు కావు. ఒకరకపు తప్పెటలు.

మూరుమ్రోతలనీదు మనసులుప్పొంగ
ఆవాలవారును ఆణెమువారు
కొండ్లవిందులవారు గోవిందువారు
ముత్తసానివారును ముయ్యూర్యారువారు
నర్మాలవారును నాయఁనివారు
పైడిచుక్కల పాలపర్తివారలును
బలుమూరివారును పాలెమువారు
రేవనూళ్లలవారు రేచెర్లవారు
ఆట్లూరి ముట్లూరి యాఖ్యలవారు
చెవులవారునుమరి చిల్లరవారు
గురియైననాయకుల్ గూడియేతేర
గండువారేగురు గదిసినవేడ్క
చనిరిబిరుదులతో సాహసమడర
ఒప్పుగానిందరు నురువైనబండ్లు
ఘోటకంబులు మేటి కుంజరావళులు
ఉత్సాహమున హుటాహుటినడువంగ
భట్టువారలుమించి బహువిధంబులను
బిరుదుపద్యంబులు పెల్లుగాఁజదువ
ఉద్ధతి * మస్తీలు నొనరనిర్వంక
భైరవఖడ్గముల్ పట్టుకరాఁగ
శీలమ్మతనయుని సింహవిక్రముడు
కరమర్థి కనుకుల కన్నమనడిచె
సకలవీరచయంబు సంతతోత్సాహ
పౌరుషంబులుమీర † బ్రహ్మకిట్లనియె.
"మముఁజూడునాయఁడామాలావుకొలఁది
మముఁజూడుబ్రహ్మన్న మాకార్యపటిమ
సింధురంబులమీద జెన్నుగాదుమికి
కుంభస్థలంబులు క్రుంగఁజేసెదము
కొదమసింగంబుల గూలఁద్రోసెదము
గండభేరుండాల ఖండింతుమలుక
వాయువుబోసిక వడినాపగలము
జాతవేదునిబట్టి చమిరివేసెదము
ఘనసముద్రముజొచ్చి కలఁగఁజేసెదము
కుంభినికాళ్లతో క్రుంగఁదన్నెదము
కులగిరులైనను కొట్టివేసెదము
గురిజాలనేలెడు కువలయేశ్వరుని
కులుకఁగైపట్టి క్రొవ్వణఁగించి
చలమునవిడువక చంపఁగాఁగలము"
అనిపెక్కుపంతంబు లాడుచునడువ
చూచినవారలు చోద్యంబుగాఁగ
పటువిక్రమాఢ్యులు పలనాటివీర
వరులంచుబొగడుచు వర్ణించిపలుక
మలదేవభూతి, మంత్రిబ్రహ్మన్న
కంపింపభూస్థలి కదలిరావేళ.

(మలిదేవరాజు, బ్రహ్మనాయఁడు త్రిపురాంతకము జేరుట.)

‡ త్రిపురాంతకమునకు తిన్నగావచ్చి

* శస్త్రవిద్యావిశారదులు.
† బ్రహ్మనాయఁడు.
‡ శ్రీశైలమునకుఁబోవు త్రోవలోనున్నది.

మహితచారిత్రుడు మలిదేవనృపతి
రాజులుమంత్రులు రసికులుదొరలు
పాటించిసుంకర వారితోగూడ
ఆవేళనీశ్వరు నతిభక్తిజూచి
సాష్టాంగదండముల్ సయ్యనజేసి
హస్తముల్ ముకుళించి అనియెబ్రహ్మన్న
గౌరీమనోహర గంగోత్తమాంగ
నాగకంకణశివ నందివాహనుడ
కాంచనగిరిచాప కంధితూణీర
గరుడాసనాంబక కైలాసవాస
ఘనగజాసురభంగ కామభస్మాంగ
లాలితశ్రీకంఠ లయకాలకర్త
సకలభూతేశ్వర శరభావతార
ఫాలాక్షభూతేశ పరమేశయిపుడు
విన్నవించెదనేను వినుముసత్కరుణ
* శివపురిలోనుండి తెచ్చినయట్టి
భూతరాట్స్తంభంబు పొందుగానుంచి
మితిజేసిచనితిమి మీనగరంబు
మృతివచ్చెనేటికి మీకృపచేత
కార్యమీడేర్పంగ కర్తలేమీర
లనుచు ప్రార్థనజేసి యచ్చటనున్న
కంబముగనుగొని కడుభక్తిమ్రొక్క
యినుము పిత్తళి కంచు హేమతామ్రముల
పంచలోహంబుల ప్రబలినదాన
నాలుగుముఖముల నయమొప్పమరియు
ఎనిమిదిముఖముల నెన్నికైనావు
ముగురుమూర్తులునొక్క ముఖమందునిలిచి
ఒకటసిద్ధులుమరి నొక్కటమునులు
గంగయుదుర్గయు కాలభైరవుడు
నిలిచిభూదేవియుం నీయాననముల
గంధర్వపతులతో కాచుచునుందు
రనుచుప్రార్థనజేసి ఆబ్రహ్మపలికె
ఘనకార్యమాపూడి కలనులోపలను
నలగామరాజుతో నయముగాపోరి
మడియంగవచ్చిరి మన్నెనాయకులు
రణరంగపట్టపు రాజవైనీవు
సాక్షివైయుండవే సర్వభూతేశ
భుక్తినిచ్చెదనీకు భూతేశుడెరుగ
దాహంబుదీర్చుకో తడుచురక్తమున
ఇప్పుడాహారంబ యిదిగోకొమ్మంచు
కంబమునకునిట్లు గట్టిగాజెప్పి
పెక్కువిధంబుల పిండివంటలును
పరమాన్నమునుమంచి పప్పుకూరలును
పానకంబులుజున్ను పచ్చళ్లునెయ్యి

* శివపురియనునది శివసింగురాజుయొక్క పట్టణము. కల్యాణపట్టణరాజయిన వీరసోముండీపట్టణముమీద దండెత్తినపుడు బ్రహ్మనాయుండు వీరసోమునికి సహాయుండుగాబోయి శివపురి ధ్వంసముగావించి యచ్చటనున్న శక్తులందెచ్చి త్రిపురాంతకములో నిల్పెను.

ఖండశర్కర తియ్య కందగడ్డలును
కొని తెచ్చి గంధము కొండలరీతి
కస్తూరి కర్పూర కాశ్మీరసహిత
చందనలేపంబు సరివిసొనర్చి
మైసాక్షి సాంబ్రాణి మంచిగుగ్గిలము
తోడుత లెస్సగా ధూపమర్పించి
ఘనమైనపోతుతో గావుజెల్లించి
ఆహారమంతట అర్పించి పిదప
* కంబమునుంచినయట్టి ఘనమైనశకట
నిచయంబుదరలింప నిలిచి బ్రహ్మన్న
శకటచక్రంబులు సమ్మతిగావ
నాయకావళి నెల్ల నయముతో బిలిచి
వితరణచతురుడై విడియంబులిచ్చి
యెనయంగమనవీట నెసగునెద్దులను
కనుగొని తెప్పించి కాండ్లకుగట్టి
చయ్యనబండ్లను సాగింపుమనియె.

(నాయకులు శకటంబులకుఁ
బూన్చుటకై యెద్దులనుఁ బేరు
పేరునఁ బిలుచుట)

అనివీడుకొలిపిన నంతంతవారు
పేరుపేరునవాని బిలిచిరీరీతి
అందెలబసవన్న ఆదినాధుండ
నందులపిడిఘంట నాగవాసయ్య
గోవులవిటకాడ గోగుబయ్యన్న
వంటరిపలిజంకు వరపెరుమాళ్ళు
కట్టనికలుకోట కరినందిరంకె
అకలంకగాత్రుండ అంబుధిశయన
బిరుదుగరుత్మంత భీమునిగజమ
గోవర్ధనాచల గోపాలదేవ
కరినందిబసవన్న కంచివరదుడ
నెలబాలచంద్రుండ నీలవర్ణుండ
జల్లులదర్దజ జయకంఠనాద
వైకుంఠవాసుడ వాసుదేవయ్య
పుట్టలభూపతి వెంజెల్గుపెద్ద
ఇంద్రునివజ్రమా యిప్పగిరీశ
గోగుభైరవమూర్తి గోవిందరాజ
చెంచులయోబయ్య చెన్నమల్లయ్య
కంచియేకామ్రుడా కాశికానాథ
మధురాపురిప్రియా మానందినాథ
కాముడా సోముడా కాయజవరుడ
రాముడా భీముడా రంకెలుసలుపు
మీరీతిపిలిచిన నేపుమీరంగ
వచ్చినయెద్దుల వరుసతో జూచి
వన్నెలు చిన్నెలు వడిజెప్పికొనుచు
నెత్తురుకొమ్ముల నేటైనవాని
గణుపుతోకలుగల కరిబొల్లివాని
అచ్చగాకరివన్నె లమరినవాని
మూపురంబులతోడ మొనసినవాని
నుదుటచుక్కలుగల నునుపైనవాని
తెల్లనివన్నెల తెలిపైనవాని

* త్రిపురాంతకమునుండి కంబమును దరలించుచున్నారు.

పచ్చనివజ్రాలు ప్రబలినవాని
ఇటువంటియొద్దుల నెంతయుంనేర్చి
గంటలుగజ్జలు గణగణమ్రోయ
గ్రక్కునయొద్దుల గాండ్లగట్టించి
మోకులబంధించి ముందుగానపుడు
పంచవన్నెలకూడు పైబారదివిచి
కంబముదర్శించె కమలనాభుండు
*మర్రివేములదాటి మండలేశుండు
ఘూర్ణిల్లురవముతో † గుమ్మడంపాడు
చేరియచ్చటనిల్వ చిత్తంబువిడిచి
‡ గరికెపాటికివచ్చి కాలూనకచట
§ కంకణంబులపల్లె కడనునాథులు
కంకణంబులుగట్టి కదలిరావేళ
పట్టభద్రులు ♦ పైడిపాటికివచ్చి
పరగవీరులకెల్ల పైనంబుజెప్పి
మెరసినమన్నీలు మేటినాయకులు
ప్రభువులుదొరలును బంధువర్గంబు
వీరవర్యులుగొప్ప విద్యలవారు
మిక్కిలిబిరుదులు మెరయుసాహసులు
కవులునుశెట్టిలు కలిసియుందంద

(మలిదేవరాజాదులు త్రిపురాంతకమునుండి మేళ్ళవాగుం జేరుట.)

$ మేళ్ళవాగుననిల్చె మించినదండు.
అందరుగొల్లైన లమరంగనెత్తి
యుండిరినాయకు లుత్తలపడక
అంతలోదినకరు డస్తాద్రికరిగె
సాంద్రమైచీకట్లు జగమెల్లగప్పె
విలసిల్లెచుక్కలు వినువీథియందు
గుమిగూడిపక్షులు గూళ్ళలోజేర
గూబకదుపుమించి కూయంగసాగె
చక్రవాకంబుల సంతసంబడగె
ఘనచకోరంబులు కౌతుకంబందె
కొలకులకమలముల్ కుందుచుమొగిడె
వికసించెకుముదముల్ విచ్చలవిడిని
జారకాముకులెల్ల సంతోషమునను
మగలనిద్దురబుచ్చి మనసులుబెదర
కెరలివిటులగూడి గృహములువెడలి
మించిసాహసమున మేరలుమీరి
తోడికోడండ్రును తోడివారలును

---

* వినుకొండతాలూకాలో నున్నది.

† వినుకొండకుఁ గొంచె మీశాన్యముగ 18 మైళ్ళదూరమున నున్నది.

‡ వినుకొండకు ఉత్తరముగ 19 మైళ్ళదూరమున నున్నది.

§, ♦ ఇవియుం వినుకొండతాలూకాలో నున్నవి.

$ నాయకురాలి కనుమదాటినతర్వాత నున్నది. కార్యమపూడికి 6 మైళ్ళదూరములో దక్షిణముగా నున్నది.

గురువులు బంధువులు గుర్తెరింగినను
నిందింతురనిశంక నిలుపకమదిని
వాగులవంతల వనములయందు
ఇసుకదిబ్బలయందు నిరవైనపొదల
కుంటెనకత్తెలు కూడికా పాడ
మనసులతమిమించ మదనుడావేళ
పూబాణములువింటబూనిసంధించి
మర్మములనొవ్వంగ మాటికినేయ
మంచిగంధముబూయ మనసుఖిల్ల
పువ్వులుముడువను బుద్ధియులేక
ఘననఖక్షతదంత ఘాతలువీడి
రతికూజితంబుల రంతులుమాని
బంధచాతురియందు భావంబువిడక
కొందరు నేలను గొందరునిలిచి
నయముతో గొందరు నానావిధముల
కలసిరి మేనుల కంపంబులలర
చోరులుసాహస స్ఫూర్తులతోడ
ప్రాణంబులకుదెగి భార్యలనుమరచి
బ్రతికివచ్చెదమను భావంబువదలి
పట్టణంబులయందు పల్లెలయందు
ధనికులగృహముల తారొందినదోచి
సారెకుదిరుగంగ సాగిరావేళ

(కార్యమాపూడి రణరంగమును
బరీక్షించుటకై బ్రహ్మనాయుడు
కన్నమనీని నర్ధరాత్రంబునఁ
బంపుట.)

అంతట బ్రహ్మన్న యానడిరాత్రి
కనుకులదాసుండు ఘనబాహుబలుడు
కన్నమయనువాని గ్రక్కునబిలిచి
వెనుకటిరాజులు విక్రమస్ఫూర్తి
పోరాడిసమసిన బూడిదవెంట
యిలభీమమైనట్టి యెముకలపోగు
లెసగినరణభూమి యెన్నికగాను
పావనంబుగజేసి బహుకాలమందు
కనిపెట్టియున్నట్టి ఘనరాజవితతి
దురముగోపలనుండి తొలగింపవలయు
ఇరవుగాకలనిలో నీరాత్రివేళ
ఎవ్వరెవ్వరుగాచి యెట్లున్నవారో
అరసిరమ్మనిపంప నావీరఘనుడు
వాసనవెల్లెన వనమాలగదల
కరముల * గుజ్జరి కడియములమెరయ
నేటైనపిడిఘంట నెమలిసోగలును
నల్లనిదట్టిని నయమొప్పగట్టి
అర్ధనారీశ్వర్లకాదులనమర
ఘోరభైరవగద ఘోరమీసములు
ఎగుభుజంబులుమించ నెరజేరుగడ్డ
ఘనమైనదేహంబు కాలివెండెరము
వెరవైనభీకర వేషంబుతోడ
కదలెకన్నమనీడు కదనభూమికిని
కాటుకకొండయై కదిసినయట్లు

* గుజ్జరి అనునది ఘూర్జరశబ్దభవము. ఘూర్జరదేశమునే యిప్పుడు గుజరాతని చెప్పుదురు.

గరిమతోఁ జీకటిగ్రమ్మినయట్లు
హరిహరాదులమూర్తి యతనికిఁగలిగి
నడికలనింజొచ్చి నలుదెసల్ జూచె
అక్కడఁగాపున్న యఖిలరాక్షసులు
గండభైరవమూర్తి ఘనభూతవితతి
గుంపులైయున్నట్టి కొరవిదయ్యములు
ఇరవుననున్నట్టి యెరుకలసాని
యున్నతావుకువచ్చి యొయ్యననసియె
వింటివేవార్తలు వినవిచిత్రంబు
గొల్లెనలచ్చటకుదురుగాఁ జేసి
యీరుద్రభూమికి నీతఁడువచ్చె
ఏమికార్యముకాని యెరుఁగంగరాదు
మదముననున్నాఁడు మనుజా బిపీను
తెలిసికోవలెపీని తెరగెల్లనిప్పు
డనిడగ్రకోపాన నార్పులునిగుడ
కత్తులుద్రిప్పుచు గదిసికూయుచును
గట్టిగానిలిచిరి కన్నమమీఁద
అంతటకన్నమ అధికరోషమున
కాలాగ్నిరుద్రుఁడై కత్తినిదీసి
మెరపులైపడినిల్వ మెచ్చెభూతములు
వల్లకాటికిధైర్య వైభవంబెసఁగ
ఎవ్వఁడేతెంచెనో యెరుఁగరాదిప్పు
డీశ్మశానములోన నెసగురుద్రుండో
బ్రహ్మయోవిష్ణుఁడో పాకశాసనుఁడో
అగ్నిహోత్రుఁడో లేక యమధర్మరాజో
అలనైరృతుఁడో లేక అంబుధిపతియో
పవనుఁడోధనదుఁడో ఫాలనేత్రుండో
మునివితతికినెల్ల ముఖ్యుఁడోయేమొ
తెలియుందమంచును దిన్నగానదిరి
ఎవఁడవురాయోరి యీభూమిజొచ్చి
యేమికార్యముకొర కేతెంచినాఁడ
వేరాజుబంటవో యెరిగింపుమనిన
పలికెఁగన్నమనీఁడు పటుశక్తిమెరయ
సోమవంశంబున శోభిల్లుచున్న
అనుగురాజేంద్రున కంగనలైన
విద్యలదేవికి విభవంబుమీర
ముక్కంటివరమున ముగ్గురుసుతులు
మల్లికార్జునుయొక్క మానసరూపు
లనఁగజన్మించిరి అందులోమేటి
పెదమలిదేవుఁడు పృథ్వీతలేశు
డారాజునకుమంత్రి ఆదిదేవుండు
దొరసినరేచర్ల దొడ్డనాయునికి 2/10
పడతిశీలమయను పద్మనేత్రకును
కలికికృష్ణుండైన కారుణ్యమూర్తి
పుట్టెనుబ్రహ్మన్న భూలోకమందు
అతనికిదాసుఁడ నాదును నేను
మాలలకునుబుట్టి మాలనైపోక
విష్ణుపాదముబట్టి విశ్వంబులోన
తెప్పలినాయుండు తెరవయైనట్టి
వికచాబ్జలోచన పెమ్మసానికిని
శ్రీమించుమాచెర్ల చెన్నునిపేన
పెంపొందఁదుతులసి పెదవనమాల
వరమునఁగన్నట్టి పరపుణ్యసుతుఁడ
కన్నమనాపేరు కమలాక్షివినవె

కాముని కదిరించి కదనంబుఁ గోరి
పగరపైఁ దండెత్తి బవరంబునకును
వచ్చిరి మావారు వైభవం బలర
భండనక్రియకిది పట్టైనచోటు
వెనుకటి రాజులు విక్రమస్ఫూర్తి
పోరాడి వచ్చిన పుడుకల వెంట
తొలగించి శుచి సేయ వలెనంచుఁ దలచి
కాముని బలముల ఖండించి వైచి
మడియంగ వచ్చిరి మన్నె నాయకులు
పరభయంకరమైన భండనభూమి
అరసి రమ్మని పంపె నవతారపురుషు
డైనట్టి బ్రహ్మన్న యనుచు జెప్పంగ
విని యొరుకలసాని విస్మయం బంది
ప్రళయకాలేశుండు పార్వతీశ్వరుని
పాదసేవకులైన ప్రమథులు వార
లిపుడిటు వచ్చుట నెసగె సంతసము
మనసులో కోరిక మాకు సిద్ధించె
బ్రహ్మనాయుండు వచ్చి భండనభూమి
పాదరేణువు చేత పావనత్వమ్ము
వెలయింపవలసిన వేళయే తెంచె
కడు వేగరమ్మను కన్నమా నేడె
అనిన కన్నమ విని యాశక్తికపుడు
దండనమస్కృతుల్ తగ జేసి మగిడి
బ్రహ్మనాయుని జూచి పదముల కెరగి
కమలవల్లభ విను కంటిని వింత
కంటికొరుకసాని కంటి దైత్యులను
జయమగు వేంచేయుం జలజలోచనుడ

(బ్రహ్మనాయుఁడు కార్యమపూడి
యుద్ధరంగముఁ జేరబోవుట.)

అనుచు నచ్చటి వృత్త మఖిలంబు చెప్ప
విని బ్రహ్మనాయుండు వీరధైర్యమున
ద్వాదశసూర్యులు ప్రబలినరీతి
నెవ్వరి కెరిగింప కేగె నావేళ
పొలుపొందనా రుద్రభూమికే తెంచి
నాలుగు కరముల నాయుండు నిలిచె
ఆరుద్రవసుమతి నాశ్చర్యముగను
కూలిన శల్యముల్ కురుచ తుండములు
సొక్కిన చర్మముల్ చుట్టలై యున్న
పేగులు నరములు పెంటలై యున్న
యేడు మాసంబుల యెముకలు పగిలి
రాలినట్టంబైన రాసులు తరుచు
మునిగి దుర్గంధంబు మొనసిన మెదడు
గాలికి దూలెడు ఘనశిరోజములు
కాలికుప్పలు బడ్డ కాయవిభూతి
చిదిమిన శవములు చెదరుకొరువులు
నానావిధంబుల నాట్యముల్ సలుపు
భూతకోటులతోడ పొందుగా నుండె
తలకాయపుర్రెల దగుబంతులాడు
శాకినుల్ మొదలైన సకలభూతములు
బెదరక వాదించు భేతాళచయము
పిల్లాటలాడెడు పెనుపిశాచములు
మిణుగురుల్ దిక్కుల మించి రాల్చుచును
కొమరొప్పఁ బరుగిడు కొరవిదయ్యములు
వేదమంత్రంబులు వెసబఠించుచును

బ్రహ్మనాయునిజూచి భయసంభ్రమమున
ఆశీర్వదించుచు నటుకుచుతొలగి
పరుగులుపెట్టెడు బ్రహ్మరాక్షసులు
కలగి బ్రహ్మన్నను కనినంతలోన
పారిరిభయమున బలుదైత్యవితతి
ఇటువంటిరణభూమి నెసగనీక్షించి
ఘనకార్యములకెల్ల కారణంబగుచు
ఎముకలపెంటయై యేహ్యమైయున్న
కార్యమాపురిపుణ్య ఖనియగునట్లు
కావింతుదేవతల్ గనిసంతసింప
ధీరత శ్రీవీరతిరుపతి సేయ
వలెనంచునూహించి వైరులపాలి
కాలమృత్యువువంటి ఘనుడుబ్రహ్మన్న
భయదమౌ రణభూమి ప్రబలుడైనిలిచి
మూడుకాలంబుల ముచ్చటలెల్ల
తెలిసినయెరుకల తెరపనీక్షించి
బలువైనబ్రహ్మాండ పఙ్క్తులనెల్ల
పుట్టింపరక్షింప పొలియింపనేర్చు
బ్రహ్మదేవునివిష్ణు ఫాలలోచనుల
ప్రార్థించికీర్తించి ప్రణతులుచేసి
హరియొక్క పదియైన యవతారములను
మనమునదలపోసి మానంబురోసి
భువనరక్షణచేయ బుద్ధిలోనిలిపి
పరమేశ్వరునిగూర్చి పలికెబ్రహ్మయ్య
"ఓచక్రధర! స్వామి ఓకంజనాభ
జలముపైపవళించు సర్వభూతేశ
ప్రమథావతారులు బలువీరవరులు
ప్రధనవసుమతిలోన ప్రాభవమొప్ప
ఇత్తుముప్రాణంబు లీయనినంచు
వచ్చియున్నారదె వైభవంబలర
వీరసింహంబులు వీరనాట్యంబు
చేయుందురిప్పుడు స్థిరబుద్ధితోడ
పూతత్వహీనత పొరయనీభూమి
నిర్దుష్టముగజేయ నిన్నువేడెదము
నీచరణంబున నెరిజనియించి
గంగయై ఖ్యాతినిగాంచి లోకముల
క్షాళితమ్మొనరించె గద పూర్వమందు
ఆజలరూపమై యమరుమేఘంబు
వర్షించియీభూమి పరమపూతంబు
చేసెడునట్లుగా సెలవిమ్ముతండ్రి"
అనుచుబ్రహ్మనవేడ నాలించిహరియుం
ఫణిశాయియైయుండి పంపెదేవేంద్రు
నతడుప్రేరేపింప నానీలమేఘ
మాకాశమెల్లను నల్లినట్లుండి
గాఢాంధకారంబు గప్పెభూస్థలిని
ఘూర్ణిల్లుధ్వనులతో కుంభినిమీద
ఉరుములుపిడుగులు నొయ్యనబడగ
తళతళ మెరుపులు తరచుగామెరయ
వడగండ్లురాలంగ వాయువువిసర
వాగువంతలనీళ్లు వరదలైపార
గుంటమిట్టనరాక కుంభినినెల్ల
ముంచెదేవతలంత మూకలైచూడ
జలజనాభునిపాద జనితమైనట్టి
గంగలోకములెల్ల క్రమ్మెనోయనగ
ఏకార్ణవంబుగా హెచ్చివర్షించె

అప్పుడాజలమధ్య మందుండిరొక్క
పునుకజలముపైన బొర్లాడికొంచు
పడమరగావచ్చి బ్రహ్మన్నవద్ద
నిల్చిహాసించెను నిష్కారణముగ
అపుడుబ్రహ్మన్నయు నానవ్వుజూచి
తలపుత్రితోనట దగువాక్యములను
నవ్విన హేతువు నాతోడ జెప్పు
వీనులనిండగా వినగోరినాడ
అనిననాయనితోడ నాపుత్రివలికె
నాపూర్వమంత విన్నపము చేసెదను
శంఖచక్రాంకిత సకలలోకేశ
ఇందిరామందిరా యినచంద్రనేత్ర
జలజజ జనకుండ శార్ఙ్గశరాస
సకలవేదమయాత్మ శ్యామలవర్ణ
సకలధర్మంబులు సమసెడువేళ
తగినరూపముదాల్చి ధరబ్రోతువెపుడు
వేదశాస్త్రంబులు వినుతులు సేయ
చాలగజడనిధిశయనించుచుందు
దనుజేంద్రసంహార తార్క్ష్యవాహనుడ
యొత్తితీయవతార మీయుగమందు
శోభిల్లునీమేను జాడంగగలిగె
తప్పజూడకవిను తగుమనముంచి
దానవుడనుగాను దయ్యముగాను
భూరిభయంకర భూతంబుగాను
వాసియారాయా కాశ వాణినిగాను
రహిమించగా బ్రహ్మరక్షస్సుగాను
జలనిధిశోటమై చక్కనైయుందు
దక్షిణజలనిధి దండనున్నట్టి
రమపురమను పేర రాజిల్లుచున్న
పట్టణంబేలెడు పరమధర్ముండ
జలధిసోముడనేను సర్వజ్ఞతిలక
ద్వాపరయుగమున ధైర్యంబుతోడ
బహుతరాక్షౌహిణుల్ బలములగూర్చి
ధూర్జటికెదిరించి దురమొనరించి
కరులుగుర్రంబులు కాలిమానుసులు
హతమైనప్పుడు నాలంబులోన
పడితినిపగవారి పంతంబు గెలువ
రణధూర్తుడనుగాను రాజునుగాని
సర్వయుగజనులు సమసినకలని
గతిగానకీలాగు కాలంబుబుచ్చు
చెదురుచూచుచునుంటి నెంతయుమేము
వీరాగ్రగణ్యత వెలసిననీవు
కదనవిక్రముడవై కలనికివచ్చి
శోధింపదిరిగితి శూరధర్మమున
పరమాత్మమాజన్మ పావనంబాయె
వైకుంఠపట్టణ వైభవంబెల్ల
కంటినాయునిమూర్తి గన్నందుచేత
నీపాదములధూళి నెరసినకతన
పావనంబాయెనీ భండనభూమి.
ఇటువంటికలనిలో నేపునమీరు
కదననాట్యముసల్ప కడువంతసిల్లి
శంకరుడింద్రుండు సకలదేవతలు
ఎదురుగా చనుదెంచి యిత్తురిష్టములు
ఘనపవిత్రులుగాగ కలియుగమందు

వీరపుంగవులయి వెలయంగగలరు
వరువడిచనిన భూపతులలోగలసి
దివికేగెదము మేము దేవదేవేశ
అనిచెప్పి బ్రహ్మచే నంపించికొనిరి
కరమొప్పఖండెండు గడియలతడవు
కుంభవర్షంబయ్యె కుంభినియందు
నీతిచేఘాతముల్ నిల్చికొల్వంగ
కలనికికత్రియై ఘనమైనశక్తి
గరిమబ్రహ్మన్నను గాంచియునిల్చె
నిలిచినగనుగొని నీలవర్ణుండు
"ఓవిశ్వమయమూర్తి ఓవిశ్వకర్త్రి
ఓలోకపావనీ యోజగద్ధాత్రి
యోశాంభవీదేవి యోలోకసేవ్య
సమరంబునకునీవు సాక్షివైయుండు"
మనుచుప్రార్థనజేసి యాబ్రహ్మనీడు
మరిడెమనోవేగ మానితగతిని
వేగుజాముకువచ్చి విడిదిలోనిలిచె
తెల్లవారగనప్డు దివిజులుపొంగ
చుక్కలకాంతులు శూన్యమైయడగె
కలువలమిత్రుని కాంతులుతగ్గె
చీకటిగుహలలో జేరియుండాగె
గుడ్లగూబలుపోయి (గొందులనణగె)
చక్రవాకంబులు సంతసంబందె
కమలముల్ వికసించె గలువలుమొగిడె
తమతమకార్యముల్ తగజేసికొంచు
మోదంబునొందిరి భూజనులెల్ల
వేదమంత్రంబుల వినుతులు జేసి 3/10
అఖిలభూసురతతి అర్ఘ్యంబులియ్య
పూర్వపర్వతశిరః పూజ్యాగ్రమందు
ఘనతరమాణిక్య ఖచితసౌవర్ణ
కుంభంబువలెవెల్చి గురుతేజమునను

(ససైన్యంబుగ మలిదేవరాజు కార్యమువ్రాడింజేయుట.)

భానుండుదిక్కుల బ్రబలెనావేళ.
తరువాతమలిదేవ ధరణీశ్వరుండు
పాలుపొందకార్యము పురికేగదలచి
తానుబ్రహ్మగలసి తగవిచారించి
ఘనమైనడేరాలు గట్టిసబండ్లు
ఇతరవస్తులుమోసి యేతెంచునట్టి
యెద్దులనొంటెల నెల్లముందుగను
సాగించియంతట సంతోషమునను
కాలిబలంబుల ఘనఘోటకముల
మదమునవిలసిల్లు మంచియేనుగుల
నాలుగుదిశలను నడువంగజేసి
వీరనాయకులూని వెనజొట్టినడువ
తమ్ముడునాయుడు తగుబంధుజనులు
తమతమవాహనోత్తములనెక్కి
వెంబడియేతేర విభవంబుమీర
తరుచుగారత్నముల్ స్థాపించినట్టి
పాలకిలోనెక్కి బట్లునుతింప
ఇరువంక * దరిగెల కాత్రిక్రమ్మంగ

* ఢాలు.

పటువేత్రకుల్ జరా బరులొనరించి
"అవధారురాజేంద్ర" యని హెచ్చరింప
పూజ్యుడు మలిదేవభూపతి చనియె
ఐదువిధంబుల నమరు వాద్యంబు
లాకాశమంతయు నదరెడునట్లు
సాంద్రధ్వనుల్ హెచ్చ సంతసంబంది
కదనరంగంబైన కార్యమపూడి
పుణ్యభూమిని జేరి పొందుగా దండు
విడిసెను వైరులు వెక్కసంబంద.
వేదశాస్త్రజ్ఞులు విప్రులందరును
అధిపునాశీర్వాద మమరంగ జేసి
సరసంపుభూమి ప్రశస్తంబొనర్ప
చెన్నకేశవదేవు శ్రీపాదజలము
తివిరిపూజారులు దెచ్చుట జేసి
తులసిపత్రంబులతోడ తీర్థంబు
ఆచోటచల్లించి అలరు లగ్నమున
శంకుసంస్థాపన సమ్మతిజేసి
నిక్షేపముగ రత్న నిచయంబులుంచి
తెచ్చినకంబంబు ధీరతతోడ
నడికలనిన్నిల్పె నరనాథవరుడు
కాశ్మీరకస్తూరి కర్పూరయుక్త
పరిమళగంధంబు బాగుగాబూసి
మైసాక్షిగుగ్గులు మహితధూపంబు
అర్పించిఅటమీద నారగింపంగ
మృగములమాంసంబు మెప్పుగావండి
పంచామృతంబులు పాయసాన్నములు
పేరైనపచ్చళ్లు పిండివంటలును
భూతగాట్టునకప్డు భోజనంబిచ్చి
అఖిలభూతంబుల కాచారముగను
ఘనమైనపోతుల గావుచెల్లించి
తరువాత * సర్పాఖ్య తటినిలోపల
పటు † గంగధారనా బరగినమడుగు
పొంతకుజని వీరపుంగవులెల్ల
తమతమనామముల్ ధరలోనదరుచు
ప్రఖ్యాతినొందంగ భక్తితోనందు
స్నానంబుజేసి (విశాలతీరమున)
నిలిపిరి ‡ లింగముల్ నేమంబుతోడ
తరువాతమలిదేవ ధరణీశ్వరుండు
నాయునితోడను నదికినేతెంచి
కాలోచితక్రియల్ క్రమముగా జేసి

---

* నాగులేఱు.

† ఈమడుగిప్పటికిని గార్యమపూడివద్దగలదు. ఇది నాగులేటిలోనిదే. దీనిలోని నీటినే సాధారణముగా నచ్చటిజనులు త్రాగుట కుపయోగించెదరు.

‡ వీరునిలిపిన లింగములివియేయని కొన్నిలింగములను జనులిప్పటికిని జూపుచున్నారు. ఇవి గంగధార మడుగునొద్దనుగల గుడిలోనున్నవి. వీనికి పూజలుకూడ సల్పబడును.

నానాతీర్థంబులు నయమొప్పదీర్చి
పటకుటీరములకు బన్నుగావచ్చి
సకలనాయకతతి సన్నిధినుండ
కొలువునగూర్చుండె శుభరాశిరీతి
అప్పుడు బ్రహ్మన్న అవనీశుతోడ
ఉచితవిచారంబు నొనరించిపిదప
చెలగుచుసమరంబు చేయగావలెను
తరచైనబలముతో తరలిరమ్మనుచు
పొలుపొందునలగామ భూమీశుకడకు

(నాయుఁడు నలగామరాజువద్దకు
భట్టును రాయబారమున కంపుట)

భట్టునుపొమ్మన్న పయనమైతాను
వాయువేగముగల వాజిపైనెక్కి
బంగారుగుబ్బతో భాసిల్లుగొడుగు
పట్టుకముందర భటుడొకడేగ
విలసిల్లుజల్లుల వింజామరంబు
లీవలావలనుండి యిద్దరువీవ
* గురిజాలకేతెంచి కువలయభర్త
తావుకుముందర తగజెప్పినంపె
వినికామభూపతి విభవంబుమెరయ
కొలువుశృంగారింప గూర్చినవారి
పంపించెవారలు పరిచారజనుల
రప్పించితీర్చిరి రమణీయముగను
కస్తూరిచేతను గలయంగనలికి
ముత్యాలతోడుత ముగ్గులువెట్టి
కర్పూరముదకంబు కలిపిముందటను
(కలయంపిచల్లి నిష్కల్మషభంగి)
శ్రీరామకథలును శ్రీకృష్ణకథలు
పన్నుగా వ్రాసిన పటములదెచ్చి
కట్టిరిగోడలు కనుపడకుండ
మాణిక్యమంజీర మంజుపుంజంబు
వ్రేలాడుచుండెడు వివిధవర్ణముల
ఘనవితానమ్ములు కట్టిరిమీద
నిలువుటద్దంబులు నిలిపిరిదిశల
తంతుపటములు (విస్తరముగబరచి)
వన్నెలపటములు వానిపైబరచి
పరచినవానిపై పంచవర్ణముల
రత్నకంబళములు రంగుగాబరచి
కాంచననవరత్న ఖచితమైనట్టి
పీఠమొక్కటిదెచ్చి పెద్దకొల్వునను
నిలిపిరిదిక్కుల నిగ్గులుదేర
చెలువుగా నీరీతి జేసినవార్త

(నలగామరాజు కొల్వుకూటమున
కేతెంచుట)

వినినంత నలగామపృథ్వీశ్వరుండు
సరసంపుపన్నీట జలకంబులాడి
ఘనశుచివస్త్రముల్ కటియందుదాల్చి
చిత్రాసనంబుపై జేరికూర్చుండి
నిలువుటద్దముజూచి నేరుపుమీర
తిలకంబునుదుట సుస్థితిమీరదిద్ది

* గురిగింజతీగెలు విస్తారముగా నుండుటవలన దీని కీపేరు వచ్చిన దని కొందఱు చెప్పుదురు.

సంధ్యాదికృత్యముల్ సమ్మతిజేసి
భుజియించితరువాత పునుగుజవ్వాజి
కస్తూరిరసమును గలిపినయట్టి
శ్రీచందనము మేన చెలువుగాబూసి
తగటుకూనంబులు ధరియించితలకు
ఒకవింతయుష్ణీష మొప్పుగాగట్టి
నవరత్నమాల కంఠంబునవ్రేల
డంబుగా కర్ణకుండలములు మెరయ
భుజకీర్తులనియెడు భూషలుదాల్చి
మేనికిరక్షయై మించుతాయెతులు
దండచేతులకొంట ధారణచేసి
మురుగులుగొలుసులు ముంజేతులందు
తిరముగావ్రేళ్ళ ముద్రికలనుబెట్టి
నవరత్నఖచితంపు నడికట్టుదాల్చి
గండపెండేరంబు కాలికిబెట్టి
బంగారుదుప్పటి పైననుగప్పి
పావుకోళ్ళనుకొండు పదములదొడిగి
కటికివారలుమ్రోల కనుపించిపొగడ
ఈవలావలజేరి హెచ్చరింపంగ
వేత్రహస్తులుగూడి విచ్చలవిడిని
సందడిదూరమై చనునట్లుచేయ
(రహిమించ) నంతఃపురంబును వెడలి
కొలువునకేతెంచి కుతుకంబుమీర
నిలిచెళ్ళంగారంబు నేర్పునుగనగ
అంతటకింకరు లతివేగమునను
తూలికాతల్పంబు దూర్చినయట్టి
ముఖమల్లుగుడ్డలు మునుకొనితెచ్చి
పరచి పీఠముమీద బాగైనదిండ్ల
ఉంచినగనుగొని యుర్వీశుడైన
కామభూమీశుండు గద్దైపైనుండె
వెనుకను నరసింగవిభుడుగూర్చుండె
* నాగమయొకవంక నమ్రతనుండె
బంధుజనముచుట్టు బలిసికొల్వంగ
వేదశాస్త్రజ్ఞులు విద్వాంసులెల్ల
ఆశీర్వదించుచు ఆసీనులైరి
సకలదేశాధీశ సచివపుంగవులు
ముకుళితహస్తులై ముందరనుండ్రి
శాస్త్రపారగులును సంస్కారయుతులు
కవులునుభటులును కనిపెట్టియుండ్రి

(నలగామరాజు సభయందు విద్యా
వినోదములు జరుగుట.)

వింతగాగాయనుల్ వీణలబూని
తంత్రులుబిగియించి తగసుతిబెట్ట
సరిగమేళములైన స్వరసప్తకంబు
ఆరోహణావరోహణభేదములను
బహురాగసంప్రాప్తి పట్టుగాజేర్చి
సంచారిసంస్థాయి సరసభావముల
మృదుతరశబ్దార్థ మిళితమైనట్టి
ఘనతరాలంకార గతిపరంపరలు
† మూర్ఛనల్ మొదలైన ముఖ్యధర్మములు

* నాయకురాలీమెయే.

† సంగీతమునందు స్వరములయొక్క ఆరోహావరోహక్రమము.

జంత్రంబుగాత్రంబు జంటగావించి
చెలగియొండిన చెట్లు చిగిరించునట్లు
పాడిరితమతమ ప్రావీణ్యమెసగ
పాకశాసనుకొల్వు పగిదినున్నట్టి
వేళ నేతెంచిరి విద్యాధికతను
నాట్యమేళమువారు నవవిలాసముల
వచ్చినమ్రతమ్రొక్కి త్రొక్కగానిల్వ
ఘనవైభవంబున కామభూవిభుడు
నవ్వుచు సెలవిచ్చె నాట్యంబుచేయ
వరమృదంగము లెస్స వాయించు మేటి
కుడిభాగమునయందు కుదురుగానిలిచె
తాళమానజ్ఞులు దాపటిదిశను
నిలిచిరుత్సాహంబు నేరుపుమీర
ముఖవీణవాయించు ముఖ్యుడొకండు
రాగమాలాపించు రమణులిద్దరును
నిండువేడుకతోడ నిలిచిరివెనుక
కంజలోచనయను ఘనమైనపాత్ర
మదనుపట్టపుదంతి మంజులవాణి
భరతశాస్త్రోచిత బహురాగములను
గరిమతోనేర్చిన కంతుబాణంబు
వచ్చిసభాసదుల్ వర్ణించిచూడ
నిలిచినాట్యమునకు నేర్పరియైన
వేత్రపాణికిదగ వినయంబుజూపి
ఆతడొసంగినగజ్జ లతిభక్తితోడ
పాదములంగట్టి పంచవర్ణముల
కాశగట్టిగగట్టి కడుజవంబడర
మద్దెలతాళాల మధ్యనిల్చుండి
ఓరచూపునరాజు నొయ్యనజూచి
సమపాదయుతమైన స్థానకస్థితిని
తాత్పర్యమున దేవతలకును మ్రొక్కి
పుష్పాంజలియొసంగి పూనినాట్యంబు
సమకట్టినాదంబు సభయెల్లగ్రమ్మ
కైకోలువిడుదలల్ ఘనకళాశాలి
* కైముడికట్నముల్ కనుపింపజేసి
వెలయంగతొమ్మిది విధములయినట్టి
భూచారినాట్యంబు పొందుగాసలిపి
పదునారువిధములై పరగినయట్టి
ఆకాశచారియు నమరంగనాడి
అంగహారాఖ్యగలట్టినాట్యంబు
విదితమౌతొమ్మిది విధములనాడి
గతిచారిభేదముల్ గనుపడునట్టు
భ్రమణసంయుతదీప్త పటిమమీరంగ
పాణిభేదములను బాటించిచూపి
స్థానకసంచయ సంయుక్తి అమర 4/10
ప్రేరణిదేశిని ప్రేంఖణశుద్ధ
దండికాకుండలి తగుబాహుచారి
సప్తతాండవములు సల్పెచిత్రముగ
సభవారలాశ్చర్య సంయుక్తులైరి
తరువాతనిరుమేల దగుచెలులమర
సంయుతాసంయుతా చలనసంకుచిత
నానార్థకరములు నాట్యహస్తములు
శిరమునుచూపులు చెక్కిళ్లుబొమలు

* తాళవాద్యవిశేషము.

దంతోష్ఠకంఠముల్ తగు చుబుకంబు
ముఖరాగవక్షముల్ మొదలుగా నెన్న
అంగంబులారు ఉపాంగంబులారు
ప్రత్యంగసముదయం బారునుంగూడి
యెనిమిదిపదియగు నెసగునంగంబు
లమరంగనభినయం బాశ్చర్యముగను
మాచెర్లచెన్నుని మహిమంబు దెలుపు
ఆంధ్రసంస్కృతవాఙ్మయాదిగీతముల
భావంబు లెస్సగా ప్రకటంబు చేయ
చూచిరంభాదులు చోద్యంబునొంది
శిరసులువంచియు సిగ్గును జెంది
రప్పుడుభూమీశు డాదరం బొప్ప
వస్త్రభూషణములు వారలకిచ్చి
భట్టునురమ్మని పంపించె పిదప

(రాయబారమునకు వచ్చిన భట్టు
నలగామరాజుసభయందుఁ
బ్రవేశించుట.)

తురగంబుపై నెక్కి దుమికించికొనుచు
వచ్చికొల్వును జేరి వాజినిడిగ్గి
భూమీశు నెదుటను బొందుగానిలిచి
రాజాధిరాజ విరాజితకీర్తి
రాజవేశ్యావిట ప్రాభవప్రకట
గండరగండాంక ఘనదానచతుర
ధైర్యనిర్జితమేరు ధరణీధరేంద్ర
శౌర్యవిక్రమకళా సంపూర్ణచంద్ర
భాస్కరసమ తేజప్రౌఢగుణాఢ్య
మానదుర్యోధన మైలమ్మసుతుడ
అనుగుభూపతిపుత్ర అంచితగాత్ర
వీరకామనరేంద్ర విభవదేవేంద్ర
రాయబారమునకు రాజుపంపించ
వచ్చిన * అల్లుని వధియించినారు
మనసున క్రోధించి మలిదేవరాజు
తమ్ములుతానును దనబంధుజనులు
వీరనాయకతతి విఖ్యాతిమెరసి
ఖరదూషణాదులు గతమైనచోటు
శ్రీశైలభూమిలో శ్రేష్ఠమైనట్టి
కార్యమపురిభూమి ఘనపుణ్యరాశి
పటుతరవిక్రమ వైభవంబలర
ధాటిమైనిల్చిరి దండుతోగూడ
అలరాజుతోడనే హతమాదుమంచు
చలమునకోపంబు సంవృద్ధినొంద
వీరనాయకులును వేగిరపడగ
మలిదేవభూపతి మన్నించియిటకు
నన్ను బుత్తెంచెను నరనాథవినుము

(భట్టు నలగామరాజునకు
రాజనీతి విశేషంబులఁ దెల్పుట.)

పగవృద్ధిబొందించు భ్రష్టులెకాని
అడగించునేర్పరు లవనిలో లేరు

* ఇతడు "అలరాజు" ఇదివరకు బ్రహ్మనాయుఁడు రాయబారమునకై అలరాజును బంపినాఁడు. అలరాజు నలగామరాజున కల్లుఁడైనప్పటికి విరోధులపక్షమున రాయబారమునకు వచ్చినాఁడుగనుక నతనిఁ జంపిరి.

నరసింగభూమీశు నమ్మికమీరు
తమ్ముఁడా మలిదేవధరణీశుకడకు
పంపుడియేకమై పగలనునణఁచి
పలనాడుమొదలైన బహుభూములెల్ల
ఎదురెవ్వరునులేక యేలుఁడిసుఖిత
శృంగారయుతు నరసింగుభూమీశు
పంపుముమలిదేవ పతిగలయంగ
పోరుమంచిదిగాదు భూమికొక్కఁడను
పాడౌనుదేశంబు పగమించెనేని
ప్రజలెల్లనశియించి పారిపోవుదురు
బండారమునకును పైకంబులేదు
రాణువఅందుచే రహిచెడియుండు
చేజీతగాండ్లెల్ల జెలగికోపించి
యీగలజీతంబు లిమ్మందురపుడు
పతిబంటుమేరలు పరిహృతమగును
పంపినపనిచేయ పాలుమాలుదురు
తెలిసినశాత్రవుల్ ధీరతతోడ
భూమినిగొనుటకు బుద్ధిపెట్టుదురు
పగవారివార్తలు పరికింపలేరు
మేకొనిమీలోన మీరుపోరాడ
చూచెడువారికి (ఖలకనయాను)
(కోరిశాత్రవులుమీ గుట్టెఱుంగుదురు)
పలువలుమిము జేరి పగజావనీక
చెప్పుచునుందురు చెనటివాక్యముల
ఐకమత్యముచెడు నద్దానితోడ
చెడునుబలంబును చెడునుభాగ్యంబు
చెడునుయశంబును చెడునుశౌర్యంబు
చెడునురాజ్యంబులు చెడ్డపిమ్మటను
దేశంబు పరస్వాధీనమౌసుమ్ము
పారతంత్ర్యంబు మీపైబడగలదు
పరతంత్రజనముల పాలికష్టములు
చెప్పంగనలవియే శివునకునైన
పంజరంబుననున్న పక్షులరీతి
(బంధించిబుట్టలో పాములవాఁడు
వదలకపెట్టిన ఫణులచందమున
గంగిరెద్దులవాఁడు కావరమణఁచి
ముకుదాడుపొడిచిన పోతెద్దులట్లు
బోనులోనుంచిన పులులవిధంబు
స్వాతంత్ర్యహీనతఁబడియుండవలయు
పరికింపఁగా మనోవాక్కాయములను
ప్రథమమ్ముపట్టఁగారానిదిగాన
వాక్కాయములురెండు బంధింపఁబడును
మనసులోఁబుట్టిన మంచితలంపు
లాచరణమునందు అలవికాకున్న
జన్మఫలంబేమి చచ్చుటేమేలు.
అవ్యక్తకీట తిర్యగనేకహీన
యోనులలో నెన్నియోమార్లు పుట్టి
పడయకపడయక పడసినయట్టి
దుర్లభనరజన్మదూషితంబగును
పార్థివాయిటువంటి పారతంత్ర్యంబు
కటకటా పగవారికైనను వలదు.)
కుందబృందసితాబ్జ కుముదాప్తతార
హారడిండీరసీ హారపటీర
ఘనమరాళంబుల కాంతినిమించు

సత్కీర్తివేగమే సరవినశించు
అపకీర్తిజగముల నధికమైయుండు
ఉభయవాదులుమీర లోక్కైరెయున్న
సకలకార్యంబుల సమకూర్పవచ్చు
ప్రజలకుసుఖమాను పంటలుపండు
ధనముసంపాదింప దగియుండునపుడు
సంపూర్ణకాములై సకలసేవకులు
కాపాడుదురుమిమ్ము కనిపెట్టియుండి
పరరాజులనుగెల్వ పైకొనిపోయి
అమితమ్ముగాగ ధనాదులనెల్ల
కొనవచ్చు ధర్మముల్ కూర్పంగవచ్చు
సత్కీర్తిజగముల సాంద్రమైనిల్చు
కలహించి వెనుకటి కౌరవులెల్ల
గతిచెడిపడినట్టి కష్టముల్ వినమె
పగపెరిగించుట భావ్యంబుగాదు.
ఉభయవాదులుమీర లోక్కటికనుక
నయమొప్పజెప్పితి నామాటవినుడి
అనుచుజెప్పినసీతు లాలింపడయ్యె

(నలగాముఁడు భట్టుమూర్తిచెప్పిన వాక్యంబుల నిరాకరించుట.)

కామభూపాలుండు కనులెర్రచేసి
కోపంబుమించగా కొలువెల్లజూచి
వింటిరేసభవారు వీరలతలపు
కాణవతో మును రణభూమినిలిచి
తమ్మునంపమటన్న ధర్మమాతమకు
విన్నవారెల్లను వెరగందగలరు
పగతనంబునబుట్టి మగకాకగట్టి
మగటిమివిడనాడి మానంబువిడిచి
వారున్నతావుకు వచ్చుటతగవె
భటవృత్తివాడవై పల్కితివిట్లు
పూర్వకార్యంబుల పుట్టువుమరచి
యీరీతిబల్కితి వేమందునిన్ను
అనరాదువినగూడ దామాటలిపుడు
తమభూమినిచ్చిన దక్కించికొనగ
శక్తిగల్గినజాలు సదయుండనగుచు
ఇచ్చితితమభూమి యేలికొనంగ
అనుచువింతగబల్క నామాటలకును
భావంబుతెలియక పటురోషమంది
నవ్వుచుడగ్గరి నాయకురాలు

(నాయకురాలేకాంతంబున నలగామునకు సంధివిముఖంబులైన మాటలుచెప్పుట)

ఎవ్వరువినకుండ ఏకాంతమునను
పల్కెకామునితోడ ప్రావీణ్యమొప్ప
విను నరనాయక విన్నవించెదను
బాలరాజులుతాను బ్రహ్మనాయకుడు
కలిగినబలముతో కార్యమపూడి
కలనుప్రవేశించి కదనంబుజేయ
కనిపెట్టియున్నాడు గ్రక్కునమిమ్ము
రమ్మనిపిలిచిన రామనరాదు
కలిగినబలిమియు కలిమియువిడిచి
మగటిమివిడనాడి మానంబుదూలి
పంచిభూమినొసంగ పంతంబుగాదు
కయ్యంబుచేయుట ఘనవిచారంబు

ఇద్దరు రాజులై యేర్పడి రేని
అవనిలో పలనాడు కమరికయాయె
సిరిపొత్తు చేయుంట చెల్లును గాని
ఆజ్ఞపొత్తిచ్చుట అదినీతిగాదు
చర్చించి చూచిన జ్ఞాతియుండంగ
అగ్నితో బనియేమి అన్న వాక్యంబు
విన వె పెద్దలు చెప్ప పృథ్వీతలేంద్ర
పగరకు జోటివ్వ పాడుకో నెదరు
తరువాత బెరుకంగ ధరనసాధ్యంబు
పాండవులకు భూమి పాలిచ్చి విదప
కౌరవులేమైరి కార్యమర్మజ్ఞ
నీవెరుంగని నీతి నేనెరుంగుదునె
అనవిని భూమీశు డాత్మలో దలిసి

(నలగాముఁడు భట్టుతో మలిదేవ రాజుబలంబుఁ దృణీకరించుట.)

భట్టును కోపించి పలికె నావేళ
అలరాజు చావున కాగ్రహమంది
పగ తీర్పదము కెంత బలమది గద్దు
నాతో డబోరాద నరులెంత వారు
సేనాధిపతి లేడు సేనలు లేవు
బలువైన శూరాల బండ్లును లేవు
కరితురగంబులు కాలిమానసులు
లెక్కింపగానేమి లేవువారలకు
నేనెరుంగనిబల మెప్పుడువచ్చె
కూడిగుంపైయున్న గున్నయూ చింత
చెట్టుక్రిందికి లేదు శిబిరమంకయును
మూకంతవరిమడి మూలకు లేదు
యేమివిచారించి యిటువచ్చినావు
బవరంబొనర్చిన పట్టిబంధించి
రణబలి పెట్టింతు రణభూమియందు
ప్రాణముల్ వలసిన బాలరాజులను
తిన్నగాదోడ్కొని తిరిగిపొమ్మంచు
పటుబుద్ధిగా జెప్ప బ్రహ్మనాయునికి
అనికోపంబుతో నాభట్టు పలికె

(భట్టుమూర్తి నలగామునిఁ దూలనాడి బ్రహ్మనాయుని ప్రతాపాదులఁ జేర్కొనుట)

ఉత్తలమేటికి ఉర్వీశనీకు
కాకిమూకలరీతి క్రమ్మియున్నట్టి
బలము జూచుక గర్వ పడ నేలనయ్యా
సంధి కేతెంచిన జామాత బట్టి
చంపినవారలు జగతిలో గలరె
* ఆడుబిడ్డను జంపి అల్లుని జంపి
హింసకు రోయని హీనవర్తనుడ

* ఆఁడుబిడ్డయనఁగా నిచట నలగామరాజు కూతురు. ఈమె పేరు రత్నాల పేరమ్మ. ఈమెను నలరాజునకిచ్చి పెండ్లి చేసిరి. అలరాజు నాయకురాలికుట్రచేఁ జంపఁబడినప్పుడు, భర్తయైన అలరాజుతోఁ బేరమ్మ సహగమనము చేసెను. ఈవిధమున నలగామరాజుయొక్క అల్లుడు కూతురు నొక్కసారియే చనిపోయిరి కనుకనే "ఆడుబిడ్డను జంపి అల్లునిజంపి" యని చెప్పినాఁడు.

యెరుగవావీరుల నెరుగవా బ్రహ్మ
పగవారిగుండెలు బ్రద్దలుసేయు
పటుతరవిక్రమ వైభవాఢ్యుండు
పగరాజులబొజుంగు బ్రహ్మన్నతొల్లి
అష్టదిక్కులరాజు * లారణగండ్ల
కేతెంచిరణమున నెదిరినవేళ
కుంజరంబులమీద కొదమసింహంబు
దుమికినరీతిని దోర్బలంబొప్ప
కినిసివారలనెల్ల గెలిచియాలమున
మెప్పించిదివిజుల మేటివజ్రంబు
సమమైనకుంతంబు జక్కగాగొనియె
కువలయేశులవద్దగానె అప్పనములు
ఆదినారాయణు నవతారమూర్తి
కృష్ణనీదెసువేళ కేరిగ్రాహంబు
చంపవచ్చిన జూచి జంకింతలేక
ఖండించివైచిన ఘనశూరుడతడు
చుట్టునిప్పులమేరు శోభిల్లుచున్న
నేటైనశివపురి నీరుగాజేసి
భూతరాట్ట్రసంధంబు బుచ్చికొన్నట్టి
శూరుడుధీరుడు సుమహితుడెన్న
చెడనాడవారల జెల్లునానీకు
లక్షకొక్కడుసరి లావునయందు
పదికోట్లనైనను బవరంబునందు
తెగవేసిపుత్తురు ధీరతతోడ
ఉగ్రకోపాఢ్యులు ఉరుబాహుబలులు
అసహాయశూరులునరువదేగురును
ఖండనవిజయుల పటుపరాక్రముల
కన్నులమదమెక్కి గర్వించిపొంగి
కానకనిందింప గలుగునాఘనత
చిరినక్కకొమ్మపై చీదరరేగి
వృక్షంబుపైగంతు వేసినయట్లు
బలములుగలవని పటుగర్వమేల
యెదురునీబలముల నెన్ననేమిటికి
ఏనుగుల్ సింగము నెదిరింపగలవె
కార్చిచ్చుభంగిని గనలికోపించి
యున్నారురణమున నుత్సహించుచును
వెడలుడుకలనికి వెడలకుండినను
నడుతురుకోటకు నాయకులెల్ల
కరులు సరస్సును గలచినయట్లు
గురిజాలపురమును కోటతోగూడ
పెఁకివైతురు క్రుంగువేరులతోడ
నిన్నునీతమ్ముని నీకైనవారి
నీదునాగమ్మను నీకూర్మిసఖుల
శిక్షింతురోరాజ సిద్ధమీమాట
అనిననారణభట్టు నందరుచూచి
కోరమీసలుదువ్వి కోపించిరపుడు

---

* ధరణికోటరాజైన యుత్తరేశ్వరునికి ననుగురాజునకు నిచ్చట గొప్ప యుద్ధము జరిగినది. బ్రహ్మనాయుఁడు, ఉత్తరేశ్వరుని నతనికి సహాయులుగావచ్చిన రాజులనుఁ బూర్తిగనోడించెను. ఇది సత్తెనపల్లితాలూకాలోనున్న యమరావతికి సమీపమున నుండియుండవచ్చును.

(నాయకురాలు భట్టుతో భీకర వాక్యంబులఁ బల్కుట.)

మంత్రిణినాగమ్మ మండుచుబలికె
భటవృత్తివాడవై పల్కితివిట్లు
కామభూపతి పాద కమలంబులాన
కరి చేత ద్రొక్కింతు గట్టిగానిన్ను
భట్టువాడవుగాన బ్రతుకనిచ్చితిని
దైవంబునీపాల దయ చేసినాడు
వీరులుఘనులని వెరపింపరాకు
సమరంబులోవారు సమయంగగలరు
మఱకాఱితేనెలో మడిసినరీతి
మిడుతలుచిచ్చులో మిడిసిపడ్డట్లు
మా చేతజచ్చును మన్నీలబలము
లన్నదమ్ముల మేర లడగెసిద్ధంబు
వాజులపైబడి వడితోడబోరి
గురుతుగాశిరములు కుప్పలు చేసి
మత్తకరుల చేత మట్టించివిడుతు
పయనమైదండెత్తి పత్తుము మేము
పారకనిలుమని వార్తచ్చుపొమ్మ
టంచుకట్నములిచ్చి అతనినినంపె
అనిచినపురికేగ నప్పుడెకదలి

(భట్టు కార్యమపూడికిఁదిరిగిపోయి గురిజాలలో జరిగినవృత్తాంతము రాజునకుఁ దెల్పుట.)

కార్యమపూడికి గ్రక్కునవచ్చి
మలిదేవుబోడగని మన్ననవడసి
కాముడాడినయట్టి కఠినవాక్యములు
వీరులునాయుండు వినుచుండగాను
విన్నవించినరోష వివశులైవారు
కార్చిచ్చుభంగిని గనలికోపించి
గొబ్బుననీవేళ గురిజాలకేగి
కోటలగ్గలకెక్కి కూలద్రోసెదము
పట్టణంబంతయుం పాడుచేసెదము
అనవుడునాయకు డప్పుడిట్లనియె
దండెత్తివచ్చెదు ధరణీశువిడిచి
తగదుకోటకునేగ ధర్మంబుగాదు
వీరధర్మముదప్పి పెనగుటయేల
అనిబుద్ధిగాజెప్ప నట్లుండిరంత
గురిజాలలోపలకుంభినీశుండు

(భట్టు కార్యమపూడికిఁబోయిన తర్వాత గురిజాలలో జరిగిన వృత్తాంతము.)

నలగామభూపతి నాగమబిలిచి
మనవద్దబంట్లును మన్నెవారలును
పస్తులనన్నంబు భక్షించువారు
రొక్కజీతంబుల రూఢులౌవారు
క్షేత్రముల్ జేసుక జీవించువారు
పల్లెలుబుచ్చుక బ్రతికెడువారు
కొలగోలుప్రజలకు నెల్లరకిప్డు
పైనమైరమ్మని పరగజెప్పింపు
కరితురగంబుల గదలింపుమనుము
బలువైనకూలాల బండ్లదర్లింపు
సాగింపునీవుండి జాగు సేయకుము
నావుడుమంత్రిణి నాగమ్మపలికె

(నలగామరాజుతో నాయకురాలు
మలిదేవరాజుయొక్క బలముం
గూర్చి నిరసనవాక్యంబులాడుట.)

వినుము చెప్పెదనీకు వీరకాచేంద్ర
పిల్లసైన్యమునకు భీతిలనేల
అరువదేగురెకాని అధికులులేరు
బలములరప్పించి పన్నిపోరాడ
వారికిబలమేది ప్రారంభమందు
గుంపుగానల్లర్ల గూర్పుకవచ్చి
బాలురగొనివచ్చి బ్రహ్మనాయకుడు
భూమిగొనెదనంచు బూనియున్నాడు
నీబల్మి కల్ములు నీకగోచరము
దేవేంద్రుడునునిన్ను ధిక్కరించునొకో
వారిబింకములకు వంగగనేల
నీవురాబనిలేదు నృపకులశ్రేష్ఠ
నన్నుబలమునంపు నాయునిగెలిచి
మన్నీలవీరుల మగటిమిదూల్చి
మేదినీభర్తను మేడపిపురికి
పట్టిచేతులతోడ బంపంగజాతు
అనిననాగమతోడ ఆరాజుపలికె
కొడుకుచావునకయి కొమ్మభూవిభుడు

(నలగాముఁడు నాయకురాలితో
రాచకార్యంబులఁ జెప్పుట.)

బహుఖేదయుక్తుడై పగతీర్చికొనగ
బాలరాజులుతాను పటిమతోవచ్చి
ఉన్నాడుకలహింప ఉగ్రతేజమున
సాకులక్ష్యములేదు నాగమవినుము
నీతిశాస్త్రంబుల నిర్ణయరీతి
పగవారలతులని భావింపరాదు
కొంచెపుఫణియైన కొట్టెడుకొరకు
ఘనమైనదండమె కావలెగాని
కూడదుసన్నని కోలలగొట్ట
తప్పెనాతమకాన దరుముకవచ్చు
హెచ్చైనబలముతో ఏగుటనీతి
మరణమైనంజాలు మంచిదియంచు
తగదంపొనర్తురు దారిద్ర్యయుతులు
వేగిరపడనేల వెలదిరోమనకు
ధనధాన్యబలములు తక్కువలేవు
పట్టజాలవునిండి భండారములును
తరుగవుగాదెలు ధాన్యంబుహెచ్చి
తండ్రినాటిబలంబు తక్కువలేదు
మానాడుగలయది మంచిబలంబు
బంధుమిత్రులుచాల పట్టుగాగలుగ
అఖిలభూపతులునా ఆజ్ఞచేపట్టి
పనులనొనర్తురు భక్తితోనిప్పు
డిటువలెమనలావు హెచ్చియుండంగ
మలిదేవుకార్యంబు మనమునగాదు
కార్యస్వతంత్రత గలదెయాతనికి
భండారమాకొద్ది పగయధికంబు
ప్రకృతసైన్యమునకే ద్రవ్యంబులేదు
బలములకూర్చిన భక్షణమేది
ఈవిలేకుండిన నెవరువచ్చెదరు
వచ్చినవారలు వశ్యులవుదురె
ఒకనెలమించెనా యెవ్వరుబంట్లు
దొరబంటుమేరలు తొలగుచునుండు

కార్యముల్ చెడిపోవు కలిమి లేకున్న
ప్రతిమలనాడగ బట్టినయట్లు
నాటకవిధమున నాయుడు చేసె
కదనరంగంబున గానగనాను
మన్నీలుఁవీరులు మనశక్తియెరుగ
వేగమెచనిదండు విరియింపవలయు
చుట్టుకవారల శూలాలబొడిచి
తురిగరింఖలచేత ద్రొక్కించుదనుక
సొరయగన్నులనిండ నిద్దురవట్ట
దనియిట్లువలికిన ఆరాజుతోడ
నాగమపల్కెను నయయుక్తిమెరయ
మనకప్పనము పెట్టు మన్నె వారలకు
పంపించి లేఖలు బలములకూర్చి
పగతులశిరముల బల్మినిగొట్టి
రాలుబరచినట్లు రణమునబరచి
భద్రగజంబుల బంతిగాగట్టి
మట్టింపవలెనన్న మైలమ్మసూను
డట్టులేయనిచెప్పి అంగీకరించి

(తనకుసహాయులుగారమ్మని నలగా
ముఁడు నానా దేశ రాజులకు
లేఖలఁ బంపుట.)

వ్రాయించె లేఖలు వసుధేశతతికి
"బ్రహ్మనాయునివద్ద బలువైనకుంత
మున్నదియనిభీతి నుర్వీశులెల్ల
అప్పనాలిచ్చినా రడిగినయట్టు
లేనునుమీరలు నేకమైయిపుడు
విక్రమసంపద విశదంబుగాను
బ్రహ్మనాయునిగర్వ పాటవంబణచి
మనసులోనరవురల్ మానియుంమనము
పోరాడిశత్రుల బోరిగొనియెదము
శ్రీగిరీశునియాన చెన్నునియాన"
అనిబాసపత్రిక లపుడువ్రాయించి
మాచగుండమకోట మనుజేశునకును
* ధరణికోటపురికి దక్షుడైనట్టి
భీమదేవుండను పృథ్వీశునకును
గోలంకిభర్తకు ఘూర్జరపతికి
ఉరగసేనుండను ఉర్వీశ్వరునకును
ఏడుమాడెములేలు ఎరుకకామునికి
పొన్నాళ్ళభూపతి † పొదిలెరాజులకు

* గుంటూరునకు 20 మైళ్ళదూరమున నుత్తరముగా సత్తెనపల్లి తాలూకాలోఁ గృష్ణానదీతీరముననున్నది. దీనినిఁ ద్రిణయనపల్లవుఁడు నిర్మించెనని సంప్రదాయజ్ఞులు చెప్పుదురు. ఈ త్రిణయనపల్లవుఁడు క్రీ. శ. 2-వ శతాబ్దియందో, 3-వ శతాబ్దియందో యుండియుండునని ఇతిహాసకర్తలయభిప్రాయమైయున్నది.

† నెల్లూరుజిల్లాలో నెల్లూరునకు కొంచెము వాయవ్యముగా 84 మైళ్ళ దూరమున నున్నది.

* కటకాధిపతికిని † కల్వరాయనికి
‡ దేవాద్రినేలెడు తెలుగుబిడ్డలకు
పెదబాహుభూపతి భీమసేనులకు
సూర్యకుమారాఖ్య చోళరాజునకు
సంగ్రామవిజయుండౌ జయదేవునకును
× జయసింగునృపతికి § చంద్రాద్రిపతికి
ధీరవిక్రముడైన తిరునాళ్లపతికి
• ప్రౌఢవాధ్యుడు వీరభల్లాణునకును
అరవసింగాళ్లన కర్ణమాపతికి
బంగాళపతికిని పాండ్యేశునకును
మళయాళకర్ణాట మానవేంద్రులకు
వ్రాయించిపంపిన వారెల్లగూడి
చింతించిరీరీతిచిత్తంబులోన
నలగామరాజును నాయనివారు
పగపెట్టికొనిపోరపయనమైనారు
తనకుసహాయులై తరలిరండంచు
నయలేఖలంపెను నలగామరాజు
(4) సవతిపుత్రులకిప్డు సమకూడెపోరు
తీరదెవ్వారలో తెగటారుదనుక
కాముడుగెల్చిన గలయుప్పనములు
లేవనిపంపెను లేఖలుమనకు
కదలుదమిప్పుడు కామునికడకు
వీరకామునిగూడి వీరయుద్ధమున
బలియిచ్చిఅందరి బ్రహ్మనాయకుని
పొంగెల్లఅణగింప బోలునుమనకు
అనుచువిచారించి ఆప్రొద్దెకదలి
భేరీధ్వనులుమించి పృథ్వికంపింప
కరులుఘోటకములు కాలిమానుసులు
ధ్వజములుగొడుగులు తగుచామరములు 6/10
వేలసంఖ్యలకూర్చి వెడలివేగంబె

---

* కటకము ఇది గజపతిరాజుల ముఖ్యపట్టణము.

† కర్నూలుజిల్లాలో నంద్యాలకు 21 మైళ్లదూరమునఁ గల్వయను గ్రామముకలదు. కల్వరాయండనగా దీనినిబాలించినయతఁడేనని యూహింపవచ్చును.

‡ ఇది యాదవరాజుల రాజధానియగు దేవగిరియై యుండనోపు.

§ ఇదియే చంద్రగిరి. ఇది ఉత్తరార్కాడుజిల్లాలోఁ జిత్తూరున కీశాన్యమూలగా 29 మైళ్ళదూరములోనున్నది. యాదవరాజులలో నొకఁడయిన యిమ్మడి నరసింహభూపతిచేఁ గ్రీ. శ. 1000 సంవత్సరమునఁ గట్టఁబడినదని చెప్పఁబడు నొకప్రాంత కోట యిప్పటికి చటఁగల యొక కొండమీదనున్నదని తెలియుచున్నది.

• ఈతఁడు క్రీ. శ 1173-1224 వరకు ద్వారసముద్రము రాజధానిగా రాజ్యముచేసెను. ఇతనిపూర్వులు చళుక్యరాజులకు సామంతులుగా నుండిరికాని యితఁడు స్వాతంత్ర్యమువహించెను. ఇతఁడు రెండవ వీరభల్లాణుఁడు.

దిక్కుదిక్కుననుండి తెంపునవచ్చి
తీరైనచోటుల దిగియుండిరప్పు

(నలగాముఁడు నిజబలంబునుయుద్ధ
మునకై సన్నద్ధపఱచుట.)

డంతటనలగాము డధిక మోదమున
కొల్వున కేతెంచి గురురత్నమయత
అలరుపీఠంబున ఆసీనుడగుచు
తనమంత్రివరుల మిత్రప్రకరమును
పాలెగాండ్లదొరల బంధువర్గమును
పడవాళ్ళపిలిపించి పైనముల్ చెప్పి
రేవంతతుల్యులౌ దృఢశౌర్యయుతుల
రాహుత్తనిచయముల్ రమ్మని చెప్పి
విజయునికీడైన విలుకాండ్రగములు
బంటినిభుజియించి పావలుదొడిగి
గర్రున దేన్పుచు గరముల పైని
పిగిలిపిట్టలునుండ బెద్దసావళ్ళ
చేరిభాషించుచు జెలగిదుప్పటుల
సొగసొప్పగప్పుక సూరెలనుండ
బొట్టెలువిడియముల్ పొందించియుప్ప
మీసముల్ మెలిపెట్టి మీదికెత్తుచును
గడ్డముల్ నివురుచు గంభీరమొప్ప
కదనంబుచేసెదు కథలుసెప్పుచును
మూకలైయుండెడు మూలబలమును
ధాన్యముల్ గొనువారి ధనవేతనకుల
కెలగోలుప్రజలను హెచ్చుపంటర్ల
పిలిపించివారికి ప్రియములుచెప్పి
పయనమ్ముకమ్మని పల్కెనంతటను
వారెల్ల రోషంబు ప్రకటముగాగ
పంతముల్ మీరంగ బలువిడిమెరసి
సురియలుపరిఘముల్ శూలసంఘంబు
ప్రాసముద్గరములు పటుఖడ్గచయము
పేరైనచక్రముల్ భిండివాలములు
పరశువుల్ బల్లెముల్ బాకుకటార్లు
శార్ఙ్గముల్ ధనువులు శరధులందాల్చి
నియతిచేనందరు నిజశక్తిమెరయ
నలగామరాజును నమ్మికైనిలిచి
రటుమీదభూపాలు డానంద మొప్ప
దోడువచ్చినయట్టి దోర్బలఘనుల
పటుపరాక్రములను పార్థివేశులను
పిలిపించివారికి ప్రియములుచెప్పి
మనము చేరగవలె మనవారితోడ
గరిమకార్యమపూడి కదనరంగంబు
పైనమైరావలె వడితోడమీరు
ఘనతరసుముహూర్తకాలమునందు
భేరీనికరమును బెద్దడమాయి
నిచయంబు మ్రోగింతు నిఖిలంబెరుంగ
అనుచు జెప్పినరాజు లరిగిరందంద
ఇతరభృత్యసమూహ మెల్లనువెడల
చయ్యనపురిలోన జాటగాబంచి
నలగాముడంతట నాగమతోడ
ఘనవాజిశాలల కడకునేతెంచి
వాజులనెల్లను వరుసనుజూచి
చెలగుసాహిణులను చేరంగబిలిచి
పరగగుర్రాలను భద్రంబుచేసి

పైనమ్ముకమ్మని పలికెనంతటను
కాంచననవరత్న ఖచితమైనట్టి
పక్కెరల్ పైగట్టి బంగారుకుప్పె
కుచ్చులుజల్లులు కూడివ్రేలాడ
శార్ఙ్గశరధిఖడ్గ శరములనున్న
వజ్రాలురత్నముల్ ప్రభలదీపింప
ముఖమాలుపట్టలు మొగములగట్టి
అందెలుపదముల నాయత్తపరచి
పుత్తడిగజ్జల పొందికచేసి
కంఠదేశములందు కట్టియీలాగు
సకలజాత్యశ్వాల సవరణచేయ
రౌతులబిలిపించి రమణీయమైన
వస్త్రంబులిప్పించి వారలందరికి
వాజులరౌతుల వన్నెగాదీర్చి
కుంజరతతులను గుంపులుచేసి
పట్టుబొందులజోళ్ళ బలువైనయట్టి
గజ్జలపేరులు గంటలువచ్చి
గజములకెల్లను కట్టంగజేసి
అంకుశంబులబట్టి అలరుమావతుల
గొనకొనిరమ్మని కోపించిపలికి
ఘనమైనశూలాలు గట్టినయట్టి
శకటసమూహంబు సాగించిపిదప
పలుగుడారంబులు బరువులుమోయ
ఎద్దులనొంటెల హెచ్చైనయట్టి
వేసడంబులనెల్ల వేగంబకూర్చి
తర్లించికొనిపోవ దగిలియున్నట్టి
కొట్టికాండ్రనుబిల్చి గొబ్బునజెప్పి
తరువాతనలగామ ధరణీశ్వరుండు
జోస్యులబిలిపించి సుముహూర్తమడిగి
భేరీధమామికల్ వెల్లుగామ్రోగ
చేయింపుమనిఅంత చెప్పిపంపించె
వానిమ్రోయించెడు వారలుపటిమ
చరచినభేరుల సాంద్రనాదంబు
విన్నవారలకెల్ల వీనులుపగిలె
ఆకాశమంతయు నదరంగగడగె
ధరణీధరంబులు తల్లడంబంది
గుహలనునోళ్ళతో గూయంగసాగె
ఘనముగాభూస్థలి కంపింపదొడగె
దిగ్దంతులుముడింగె దిక్కులుమ్రోసె
తపనతురంగముల్ తప్పెమార్గంబు
ఎటువచ్చెనోయని ఎల్లదిక్పతులు
తెలియకభ్రాంతిచే దికమకపడిరి
అప్పుడునగరున కరిగియారాజు

(నలగాముడు గజారోహణంబొనర్చి యుద్ధభూమికిబయలుదేరుట.)

కాలోచితములైన కర్మముల్దీర్చి
పూసియుతొడిగియు బొందించికట్టి
సకలశృంగారంబు సమ్మతిజేసి
సర్వబలంబులు చనుదెంచినిలిచి
తొలగిరినృపతికి దూరంబుగాను
మావంతులప్పుడు మదముననిలిచి
పగవారలకునెల్ల భయములుచేయు
పటుతరోన్నతమైన భద్రగజంబు
పైనిబల్వన్నెలు పరగుచున్న
తగటుపటంబులు దంటగాజేసి

కూర్చినగంతలు కుదురుగా వెన్ను
పైగప్పిముఖమాలు పరపులు వేసి
పదునారువన్నియ బంగారుతోడ
రచియించిదానికి రత్నముల్ తాపి
తీర్చిన * చౌడోలు తెచ్చియుంకట్టి
మణిగణతపనీయ మయమైనయట్టి
చప్పరంబొక్కటి సమకూర్చిమీద
పద్మరాగప్రభా పటలి చెమించు
బంగారుశిఖరంబు బాగుగనిలిపి
గంటలుమువ్వలు గట్టిగాగట్టి
చుట్టుముత్యపుచేర్లు శోభిల్లజేసి
మణిమయమంజరి మధ్యవ్రేలాడ
చిరుతగంటలపేర్లు చెలువైనకరికి
కరమందుగూరిచి ఘంటసంధించి
పంచవర్ణంబుల ఫాలమందుంచి
ముత్యాలజల్లుల మొనసినపటము
కుంభస్థలంబున కొమరొప్ప జేసి
శుభ్రదంతంబుల శోభిల్లునట్టి
తపనీయవలయముల్ దట్టించిమొనల
ఘనశితశస్త్రముల్ ఘటనగావించి
బంగారుగొలుసులు పదములగట్టి
గంటలుప్రక్కల గణగణమ్రోయ
తొండంబుగొలుసుల తోడరంజిల్ల
శృంగారమీరీతి శీఘ్రమె చేసి
మావంతుడెక్కియూ మనుజేశునకును
చేయించెవినతిని జెలువంబుమించ
కూర్చుండజేసెను కుంభినినప్పు
డంతటఅనుచరు లతివేగమునను
పుత్తడినిచ్చెన బొందిక సేయ
సేవకుడొక్కడు చేదండయివ్వ
ఘనకరీంద్రముసెక్కె కామభూవిభుడు
వెనుకనొక్కరుడుండి వినయంబుతోడ
విడియంబొసంగుచు వింజామరములు
వీచెశీతానిలాన్వితుని జేయంగ
తరువాతలేచెను దంతావళంబు
హేమదండంబుల ఎసగుచునుండు
మౌక్తికచ్ఛత్రముల్ మనుజేశునెదుట
పట్టిరిబహుకాంతి పటలిమిన్నడర
ధ్వజములసందడి తరచుగానొప్పె
ఆయిదువిధంబుల అమరువాద్యంబు
లధికరవంబుల ఆనందమొసగ
దళములతోగూడ ధరణీశవితతి
దిక్కులెల్లనుక్రమ్మి తిన్నగానడిచె
తరువాతనెలగోలు దళములుకదలె
కదలిరిదండును గైజీతగాండ్రు
బలమునద్దిక్కుల పటిమతోనడిచె
బహుమిత్రవర్గంబు బంధుజనంబు
మంత్రిపురోహితుల్ మన్ననరాగ
పచ్చలుతాపిన పాలకిసెక్కి
నరసింగుడరిగెను నాథునివెనుక
పడవాళ్లుబలములు పదపదమనుచు
పటుతరధ్వనులచే బలికిరిహెచ్చి

---

* ఏనుఁగుమీఁదపైఁ గూర్చుండుటకై యమర్పఁబడుతొట్టి.

వేత్రహస్తులు చేరి విదళింపగాను
సందడియెడగల్గి జరుగంగసాగె
మొనయుంచుశతదండములు పరిచుట్టు
పోతుటీగకునైన బోవీలులేక
అధికమాబలమెల్ల అరుగుచునుండె
గుర్రముల్ గజములు గుంపులుంగూడి
పశ్చభాగంబుల వచ్చుచునుండె
మధ్యరాజెక్కిన మత్తగజంబు
సందుగానివ్వక జరుగంగసాగె
తురగహేషారవ స్ఫూర్తులుమించె
గజములుఘీంకార గాఢంబులాయె
ఘనతరోత్సాహులు కాలిమానుసులు
అట్టహాసంబుల నమరిరావేళ
గొప్పగుర్రంబెక్కి తుడిభాగమందు
జగడంబుచేసెడు చాతుర్యమెల్ల
నయగతిదెల్పుచు * నాగమచనియె
నగరంబువెల్వడి నలగామరాజు
దక్షిణదిశయందుఁ దనరెడుబయల
† దూబచెర్వనెడునుత్తుంగభూస్థలిని
నిలిపించెగజమును నిండినవేడ్క
వెంబడివచ్చిన విప్రులనెల్ల
వినయానబొమ్మన్న వేడ్కతోవారు
పగవారినెల్లను బలిమిమైగెల్చి
సకలరాజ్యములు వశంబుచేసికొని
ఏకాధిపతివౌచు నేలుభూస్థలము
అనుచుదీవనలిచ్చి అరిగిరివేగ
విశ్వాసపాత్రులై వెలసినయట్టి
బలములో దేరిన ప్రౌఢనాయకుల
పిలిపించివారికి ప్రియములుపల్కి
కస్తూరిగాంధ కలితులజేసి
తాంబూలములనిచ్చి ధైర్యంబుచెప్పి
నగరంబుకోట క్రన్ననమీరలంత
పగలురేయియుం పోరపాటులులేక
కలవారుమీరలేగద మాకుపూని
కాపాడవలెనన్న కదలిరివారు
పిమ్మటనాగమ పేరుపేర్వరుస
అధికారులనుబిల్చి అనియెవారలకు
గొల్లెనల్ మొదలయినగురుతరభార
నిచయంబులెల్లను నించినబండ్లు
శస్త్రాస్త్రచయమయ శకటసంఘంబు
సకలవస్తువులచే సాంద్రమైనట్టి
నానావిధంబుల నాణెంబులుండు 7/10
మందసంబులుగట్టి మసలకమోయం
వేసడంబులచ్చి వీరసేవకుల
జీతపురొక్కముల్ చేతిలోవేసి
వెంటనెపంపుడి వేగంబెమీర
లనవినివారలు అరిగిరివేగ
తరువాతకాముడు తరలించెకరిని

* ఈమెనే నాయకురాలని చెప్పుదురు. ఈమె నలగామరాజుయొక్క మంత్రిణి. శూరురాలు.

† ఇప్పటికి నీచెఱువు గురిజాలకు దక్షిణభాగమునఁ గలదు.

హయములు కాల్బలం బాజ్ఞతో నడిచె
బలపాదసంఘాత భవధూళిచయము
మేఘమార్గంబందు మేదురంబాయె
తపనునిహయములంధతవహియించె
అఖిలదిక్కులయందు నమరెడికట్లు
బలములునడుచుట బహుకష్టమాయె
జళిపించుకత్తుల సాంద్రతేజంబు
మణిగణభూషణ మంజుదీధితులు
అంతటంతట మార్గమట్టెచూపించె
అవనీధ్రలము క్రుంగ ఆదిశేషుండు
సిగ్గుచెందినయట్లు శిరములువంప
దిగ్గజంబులుమ్రొగ్గ దిశలుగంపింప
భటులుబిరుదముల పద్యముల్ చదువ
అఖిలయాచకకోటి కానందముగను
దానంబులిచ్చుచు దరలియాప్రొద్దు

(నలగాముఁడు గజారూఢుఁడై సేన
తోఁగూడి కార్యమపూడికేగుచుం
డఁద్రోవలోఁగోదమగుండ్లపౌరులు
విన్నపంబొనర్చుట.)

కోదమగుండ్లకుచేర కుంభినీశుండు
పేరైనపట్లల బెద్దలారెడ్లు
కోమటిజనములు కూడియేతెంచి
కామభూమీశుని కనుగొనిమ్రొక్కి
విన్నవించిరిమహా వినయంబుతోడ
మామాటవినదగు మైలమ్మసుతుడ
వైరంబుమీకేల వసుధాధినాథ
అన్నదమ్ములుపూర్వ మవనియేలంగ
కలహించిమడిసిరి కదనంబులోన
పగలేకయేలుట బలిమిమీకెల్ల
ప్రజలకుసుఖమాను వరులుతగ్గుదురు
బిడ్డలవిధమున బ్రీతితోమమ్ము
రక్షించుచున్నారు రాజులుమీరు
కలహించిమడిసిన కదనంబులోన
ఇతరరాజులుమాకు నేరువచ్చెదరో
మీరురాజ్యముచేయ మేదినియందు
దుష్టులనిర్భయోత్సుకతనళించె
శిష్టులకును మేలు చేకురుచుండె
ప్రాణముల్ భద్ర ముపద్రవమడగె
కరములు హెచ్చుగ గైకొంటలేదు
అనుకూలులైమీర లవనియేలంగ
కనుగొన్నమాకెల్ల కలుగుశుభంబు
హితులముగనుకమీ కెరుగజెప్పితిమి
శక్తిచాలదుమాకు సారెకుదెల్ప
అనివిన్నవించిన అనియెవారలకు
మదమునగర్వించి మలిదేవరాజు
రణముచేయగదల్చి రమ్మనిమాకు
భట్టునుబంపెను బలమెరుంగకయె
పైనమైవచ్చితి బవరంబుచేయ
వీరులనాయుని వెసమలిదేవు
బంధుమిత్రాదుల పారిపోదోలి
వేగమెవత్తుము విభవంబుమెరయ
ఎలమితోనుండుడీ యిండ్లలోనిలిచి
ఈరీతివారికి హితములుచెప్పి
పొమ్మన్నవారలు పోయిరావేళ

మరునాడునలగామ మండలేశుండు
మనమునరోషంబు మల్లడిగొనగ
కాలోచితంబైన కర్మముల్ దీర్చి
ఘనతరశృంగార కలితుడై వెడలి
భద్రకరీంద్రముల్ పైనిగూర్చుండె
తమ్ముడునరసింగ ధరణీశ్వరుండు
ఎలమితో పాలకి నెక్కెవెంబడిని
స్థిరగతిబలములు చెలగంగనేగ
ఆర్పులబొబ్బల అవనికంపింప
సాగరముప్పొంగి చనుదెంచినట్లు
మేఘముల్ వినువీథి మేదురంబగుచు
పరువులుపెట్టెడు భంగినిదోప
క్రమ్ముకకార్చిచ్చు కదిసినరీతి
పసనుండుదట్టమై పరగినమాడ్కి
వివిధబలంబులు వేగమెనడిచె
చక్రగామిరియాల సరిహద్దుదాటి
ప్రజలమేలిమిచింత పల్లెయుదాటి
కౌరవుల్ పాండవుల్ కలహంబొనర్చ

(నలగాముఁడు కార్యమపూడిఁ
జేరుట.)

పూలిచచ్చినయట్టి కురుభూమిరీతి
రౌద్రగుణోద్వీర రక్తసిక్తంబు
పావనచరితంబు పలనాటిపేర
పొలుపొందుచుండెడు పుణ్యదేశమున
కాశికిసమమైన కార్యమపూడి
రణరంగభూమిని రాజుదానిల్చి
భద్రదంతినిడిగ్గె పదిలంబుగాను
చచ్చౌకమేర్పడ సరసంపుభువిని
హేమకుంభంబుల నొసగుచునున్న
పటకుటీరంబులు పన్నుగాగట్టి
మూలబలంబులు మొనగాండ్రువచ్చి
కూర్చున్న ఘనమైన గొల్లెనల్ కూర్చి
స్వర్ణసింహాంకంబు పరగెడునట్టి
నెరిధ్వజస్తంభంబు నిల్పిరి ప్రోల
కప్పురపువిడెంబు గావించివచ్చి
కొల్వుకూటంబున కూర్చుండెరాజు
దాపట నరసభూధవుడునుదొరలు
కొండమన్నెమరాజు కోటకేతుండు
కుడిదెస రెడ్డిరాజు గురియైనయట్టి
చేరువకాండ్రును జేరికనలర
వీరఘంటలుగట్టి విలసిల్లుచుండు
సోమదేవరరాతు శూరులైనట్టి
వీరరాహుత్తులు వెలయమున్నాట
అరువదిమందిదా మట్టహాసముల
రణశూరులైనట్టి రాజపుత్రులును
పోటుబంట్లనుబట్టి పొడిచెడువారు
ఊడిగలందంప యొనరికొల్వంగ
దేవతాగణయుత దేవేశురీతి
భూపతిసభమందు పొల్పొందుచుండె
రాజువెన్కంజేరి రమణినాగమ్మ
కార్యఖడ్గముల ప్రజ్ఞావిశేషముల
తెలుపుచుగూర్చుండె ధీరతతోడ
ఇతరబలంబులు హెచ్చువేగమున
తర్లెడువారును తగనడ్చువారు

విడిచెడువారునై వెరవైనచోట్ల
తగినతావులయందు తప్పకనిల్వ
మూడుసహస్రముల్ ముఖ్యులౌబంట్లు
కలనికంగాణముల్ కనపడునూర్లు

(వివిధ దేశ రాజులువచ్చి నలగామ
భూపతిని గలిసికొనుట.)

లలిమీర వీరభళ్లాణుండువచ్చె
పటువిక్రమాఢ్యులు పండ్రెండువేలు
గడలవారొకవేయి గజచయమమర
పౌన్నాళ్లవిభుడు సముద్వృత్తివచ్చె
పదినూరువేలకాల్బలములతోడ
కూడిముప్పదివేల కుంజరావళుల
కరిసెమాళవపతి కామభూవిభుని
కడగితొమ్మిదివేల కాల్బంట్ల
నమ్మదగినయట్టి నాయకచయము
ఒకవేయిఅశ్వాల నొనర * ప్రతాప
రుద్రుడుపంపించె రూఢసంగతిని
పదివేలకాలరి బలములతోడ
ముదమున ప్రాచిదేవుండునుగలసె
నీలిటెక్కెంబుల నేర్పైనబంట్లు
వెంటరాబంగాళ విభుడునుగలసె
గజములుపదివేలు ఘనమైనబలము
ఇదివదివేలతో నేతెంచె † నొడ్డె
భువినేలు ‡ బలదేవపురుషోత్తముండు
పదివేలతురగముల్ బంట్లొకలక్ష
కూడిరాకల్యాణ ఘూర్జరపతులు
కామునిగదిసిరి గౌరవమెసగ
ధనరథాన్యుడువచ్చె దర్పంబుమీర
మహిదేవిదాసుడు మదకరుల్ వేయి
శకటసహస్రముల్ చనువునగొలువ
ఏతెంచెసాహస మెల్లవారెరుగ
దశలక్షబలము లుత్సవమునరాగ
ద్రావిడకేరళ ధరణీశవరులు
వచ్చిరినలగామ వసుధేశుకడకు
పద్మసేనుండును పరువడివచ్చె
గురుసహస్రద్వయ ఘోటకయుతుడు
గుండమదేవుడు గొబ్బూరిరాజు

---

* ఇతఁడు, ప్రతాపరుద్రీయకృతిపతియై క్రీ. శ. 1295 సం॥ మొదలుకొని 1323 సంవత్సరమువరకు రాజ్యముచేసి, రుద్రమదేవికి దౌహిత్రుఁడై ప్రఖ్యాతివడసిన ప్రతాపరుద్రుఁడు కాక, కాకతిప్రళయునితరువాత సింహాసనమెక్కి క్రీ. శ. 1140 సం॥ మొదలుకొని 1199 సం॥ వరకు రాజ్యముచేసి మొదటి ప్రతాపరుద్రుఁడని ఇతిహాసమునఁ బేర్కొనఁబడు రుద్రదేవరాజై యుండవలయును. (సోమదేవరాజీయము చూడఁదగును.)

† ఓఢ్రశబ్దభవము "ఒడ్డె" దీనినిప్పుడు "ఒరిస్సా" యందురు.

‡ ఓఢ్రదేశమునుఁబాలించిన గజపతిరాజులలో నితఁ డొకఁడు.

మొదలయినరాజులం ముఖ్యులౌబంట్లు
ఏనూరుతోఁగూడ నెనుబదిమీద
ఎనుబదివేలతో నేతెంచిరపుడు
తక్కినరాజులు తమతమబలము
లెసగగనేతెంచి రివ్విధంబునను
వచ్చినబలముల వరుసగణింప
బుద్ధిమంతులకైన పొసగదుసేర్పు
సంతోషములచేత చనుదెంచినట్టి
మనుజేంద్రులకునెల్ల మంచికట్నములు
తెప్పించియిచ్చిన తిన్నగానుండి
రంతటనాగమ్మ అశ్వంబునెక్కి
తగినయిరవుచేసె ధరణీశతతికి
మిగిలినవారికి మేలైనతావు
లమరిచివిడియించె ఆనందమొంద
ఎక్కడచూచిన నెడలేకకదిసె
ఇసుకజల్లిననైన ఇలమీదబడదు
చొరదువాయువుదండు చొచ్చినరాదు
సుపథంబుదొరకదు చోద్యమైయుండు
ఆదండులోపల అఖిలవణిజులును
సకలధాన్యంబులు సకలరత్నములు
బంగారువెండియు బహుధనవితతి
సరిగవస్త్రంబులు సరసపుంబట్టు
పటములుఘనతంతు పటములుమరియుం
కాంస్యతామ్రశ్వేతకమ్రభాండములు
రసవర్గములనెల్ల రంజనంబొప్ప
క్రయవిక్రయమ్ముల కావింతురపుడు
సౌందర్యఘనతచే సంపన్నమైన
వేశ్యవాటికలొప్పు విశదంబులగుచు
దారిద్ర్యమనునది దండులోలేదు
ధనధాన్యవృద్ధిచే దనరెడులక్ష్మి
వేలంబులోపల విలసిల్లుచుండు
అంతటబహువిక్రమాఢ్యమానసులు

(వీరులు తమకు యుద్ధమునకాజ్ఞ యిమ్మని బ్రహ్మనాయునిఁ దొందరపఱచుట.)

భండనవిజయులు పటుపరాక్రములు
వీరులుతత్సైన్య విధమెల్లజూచి
బ్రహ్మనాయునితోడ వాక్రుచ్చిరిట్లు
నలగామభూతలనాథుండుమదిని
తనకెవ్వరెదురని ధైర్యంబుపూని
భండనవిజయత ప్రబలుదునంచు
భువనభయంకర భూరిప్రతాప
పటిమగల్గినయట్టి బ్రహ్మనునిమ్ము
విజయోద్ధతాటోప వీరులమమ్ము
తలపకమాత్సర్య దర్పముల్మీర
పీపునెదురెక్కి వెరపకనిలిచె
కనియూరకుండుట కార్యంబుగాదు
పందలపలెనుంట పంతంబెమనకు
అనివార్యమైనమా యాజ్ఞాఖలీన
బద్ధులమైనిల్వ బడితిమిగాక
కత్తికినొక్కొక్క కండనుదీసి
పరిపంథిగణముల పట్టిమర్దించి
పమ్మరామమునందు కుటిలతగచ్చ

ఫలము వేసిన భాండ పటలంబు పగిలి
చెంకులై పడ్డట్లు చెనుకంప మొంది
విడిబడియె నుగుల్ వీధులబార
సకలబలంబుల సమయించి యముని
పురికంపియుండ మే భుజశౌర్య మొప్ప
ఏమివిచారించి యిటులుంటిరయ్య
సెలవిచ్చి పంపుము శీఘ్రమె మమ్ము 8/10
నాపుడు శీలమ నాయుడు పలికె

(బ్రహ్మనాయుఁడు వీరులతోఁ దొందరపడవలదని నీతు లుపదేశించుట.)

వినరయ్య వీరులు విశదంబుగాను
విదితస్వశక్తిపై విశ్వాసమున్న
ఎదిరిసామర్థ్యంబు తృణము గాదోచు
(సహజగుణంబది జంతులకెల్ల)
కానకామేశుండు కదిసెనుమనల
నలగామునిందింప న్యాయము గాదు
రణకేళిసల్పుట రాజధర్మంబు
మనకున్న బలముల మనముకూర్చికొని
పోయిశత్రువులను పోరిగొనవలయు
సాహసంబొనరింప (చనదన్నిపట్ల
సర్వకార్యములొక్క చాయన రావు
హెచ్చైనతనబల మెదిరిబలముల
కొలదులుపరికించి కొరతలుండినను
సవరించిసకలంబు సన్నద్ధపఱచి
చిత్తంబునందన్య చింతలుమాని
కార్యదీక్షవహించి కదనరంగంబు
చేరంగబోవుట స్థిరవిచారంబు
నేనుమీయుత్సాహ నిర్మలస్ఫూర్తి
తగ్గించినానని తలపగవలదు
తమకింపగూడదు తఱియగుదనుక)
నాపుడుకొమ్మ భూనాథుండుపలికె
పలికెదుచల్లని వాక్యంబులిపుడు
కొడుకునుపగరచే కోల్పోయినట్టి
దుఃఖంబుమదిలోన దొరలుచునుండ
నలగాముజంపక నామదిచింత
వాయదు నీవెన్ని పలికిననైన
ఎవ్వరుతనకెదు రీభూమినంచు
జగడంపుడేరాలు సరవినెత్తించి
ఉన్మాదుమనమీద ఉగ్రతేజమున
కమలబాంధవవంశ కర్తయైనట్టి
* బలభద్రరఘుపతి పంపుననిప్పు
డరచియుంనొకశరం బారాజుకడకు
అంపిననిలిచిన నతడునాసాటి
చెడివిర్గిపడెనేని క్షితిభర్తగాడు
పంతమియ్యదియని వాక్రుచ్చిపిదప
గాండీవసమమైన ఘనచాపమెత్తి
వాసుకికోరల వాడిగలట్టి
దొనలనుమెరయగ తూర్ణంబెతెవిచి
వెలయంగముత్యాల పేరుల్లాడ
అలుగునమణిగణం బమరంగముఖము
మధ్యాహ్నభానుని మాడ్కికన్పట్టి

---

* ఇతఁడు కొమ్మరాజుయొక్క ధనుర్విద్యాగురువై యుండును.

శరముచాపంబున చయ్యనదొడ్గి
కర్ణపర్యంతంబు గ్రక్కునలాగి
కోపంబుమించగా కోయనియార్చి
కనుగవదృష్టిని కదలకనిలిపి
వీకతోమంటలు వెళ్ళగాయుచును
బాణమువిడిచెడు పటిమకావేళ
నక్షత్రములుడొల్లె నాగేశుడులికె
అవనియుకంపించె ఆకాశమదరె
కనురెప్పపాటున కంటెవేగమున
పిడుగుపడ్డట్లుగా పృథ్వీశుడదర
ఘనమైనగొల్లెన కంబంబుదాకె
ఆదియంతతునకలై అవనిపైబడెను
పసిడికుండలుడొల్లి పడెగుడారంబు
లానందమునవార లరచిరిమించి
విడిబడియేనుగుల్ వీథులబారె
అశ్వముల్ రాహుత్తులగిరిచెదరి
బండ్లతోయెద్దులు పరువిడసాగె
సాలగుర్రంబులు సరభసమంది
కట్లుతెంచుకపారి గట్లపాలాయె
కోల్పడిగెలుపట్టు గొడుగులనెల్ల
పట్టెడువారలు పడవైచిచనిరి
కల్లోలమందుచు కామునిబలము
భయమునజనిచింత పల్లినిదాటె
వీరకామేంద్రుండు వేత్రపాణులును
పడవాళ్ళనంపించి భయములదీర్చి
జనులనుబిలిపింప చయ్యనవచ్చి
తమతమతావుల దగనుండిరపుడు
వీరులందరుతమ వేలంబులోన
నిలిచిరిసంతోష నిర్మలమతుల
ధీవరులైన జ్యోతిషికులనపుడు
పిలిపించిబ్రహ్మన్న ప్రియములుచెప్పి
సమరముచేయగ సరసమైనట్టి
సుముహూర్తమొక్కటి శోధింపుడన్న
ఆరీతిమాచెద మందులకేమి
క్షీరాబ్ధిశయనుడు శ్రీవల్లభుండు
దాసరక్షణమందు దయగలవాడు
చెన్నుడుమీవెంట చేరియున్నాడు
సకలకార్యంబులు సమకూరుచుండు
అనిచెప్పిదీవించి ఆరిగిరివార

(ఈసమయమున మేడపిలో జరిగిన
వృత్తాంతము.)

లంతట మేడపినైనవార్తలును
* తెలుపుదుజనులకు దెల్లముగాగ
పరమోత్సుకతచేత † బాలచంద్రుండు
సంగడిబాలురు చనవునగొలువ
రమణీయమైనట్టి రాచిల్కచదువు
వినుచువేడుకపుట్టి విచ్చలవిడిని
గుమ్మడికాయలు కొంతసేపాడి

---

* ఇది కవివచనము.

† బ్రహ్మనాయునికొడుకు.

చెరుకులపంటంబు చెల్వొప్ప గెలిచి
తనపంగడీలకు దయతోడనిచ్చి
తమ్ములు వెంటరా ధామము జేర.

(అనుజులతోఁగూడి బాలచంద్రుఁడు తల్లియైన ఐతమ్మవద్దకువచ్చుట.)

తల్లినిగనుగొని తనయులందరును
మ్రొక్కినదీవించి ముదమునతల్లి
పలికెనీవిధమున వారలతోడ
నాయాత్మసుతులార నాయన్నలార
పద్మనాభునిగర్భ పాథోధియందు
పూర్ణచంద్రులరీతి బుట్టినవారు
ఘనమైనభూషణ కాంతులుమీర
మీరన్నదమ్ములు మేలిమినాడు
ఎదుటనునిల్చి నన్నేమివేడెదరు

(ఐతమ్మ బాలునిమనోరథముఁ దెల్పుమని యడుగుట.)

చిత్తంబుగోర్కె జెప్పుడీయనిన
నవ్వుచుబాలుడు నాతికిట్లనియె
తరుణిరోమేమునీ తనయులమగుట
సకలవైభవములు సమకూరెమాకు
ప్రియముతోమమ్ముల పెంపుసేయంగ
ప్రొద్దుపోదేమిట పొసగంగనన్న
ముద్దులకొమరుని మోమువీక్షించి
ప్రొద్దుపోవకయున్న పుత్రరత్నంబ
పోకలాటలచేత బుచ్చుము ప్రొద్దు
ఆడుడిమత్యమ్ము లమరుబంతులును
గుంతమూపలనాడి కొనిగెల్చికొనుము
బైటనాడగవద్దు బడలెదుసుతుడ
కుటిలజంతులదెచ్చి గుడిలోననుంచి
విడిపించిపోరాడు విధమునుచూడు
రూకలకుప్పలు రూఢిగనాడు
మనినతల్లిరొవాని నాడితిమమ్మ
వానిపైనిప్రాస పడదుచిత్తంబు
కొత్తలపైన మక్కువగల్గియుండు
అనిబాలుడాడిన ఐతమ్మపలికె

(భారతయుద్ధాదికథల వినుమని యైతమ్మ బాలచంద్రునికిఁ జెప్పుట.)

ఆటపాటలపైన ఆలసితివేని
వినవయ్యబాలుడ విశదంబుగాను
విబుధులవిప్రుల పిల్వగబంచి
వినుముభాగవతంబు విజ్ఞానమొదవ
భారతరణకథ పాటించివినుము
భీష్ముడొనర్చిన వివిధశౌర్యముల
అచలితబుద్ధితో ఆలింపుపుత్ర
ద్రోణుండునెరపిన దోర్బలగరిమ
మనమునబట్టింపు మానితసుతుడ
కర్ణుండుజూపిన ఘనపరాక్రమము
సూక్ష్మంపుబుద్ధితో జూడుముతనయ
శల్యునియందున్న శస్త్రచాతురిని
బాగరూకతమెయి చర్చించుకొడుక
దుర్యోధనునిమాన ధూర్వహపటిమ
ఆసక్తితోడుత ఆరయుమాత్మ జూడ

చాపంబువిడిచిన సవ్యసాచికిని
కృష్ణుడు చెప్పిన గీతలయందు
కర్మరహస్యముల్ గాంచుకుమార
నేర్చినవానిని నేరుపుమీర
దృఢధైర్యమున ఆచరింపంగవలయు
అనినమాటలువిని ఐతమ్మతోడ
బాలుడిట్లనియెను పకపకనవ్వి

(బొంగరములాడుట నిజమనో
రథంబని బాలుఁడు తెల్పుట)

వినవమ్మతల్లిరో విమలేందువదన
ధర్మార్థకామ తత్వంబెరుంగుదును
శాస్త్రజాలంబుల చాలగవింటి
మనమునదెలిసితి మర్మంబులెల్ల
ప్రకృతకౌమార చాపల్యంబుకతన
చిత్తవిశ్రాంతికై చేరియీవేళ
బొంగరాలాడగ బుద్ధిజనించె
సెలవిచ్చిపంపుము శీఘ్రమెయమ్మ
ఈరీతిపలికిన ఏణాక్షికలగి
వెరచియుంవెరవని విధముననియె

(బొంగరము లాడవలదని తల్లి
బాలునికిఁ జెప్పుట.)

విశదంబుగాబాల వినుముద్దుతనయ
ఈబుద్ధితలపగ ఇచ్చలోవలదు
వలసలోనున్నాము పడబొంగరాల
ఆడినజేతప్పి అతివలకైన
తగుబాలురకుకైన దాకునుబోయి
పడతులుకోపించి పలుతెరంగులను
శపియింతురీమాట సత్యంబుపుత్ర
శాపింపబడుటకు సాహసమేల
నామాటగడచుట న్యాయంబుగాదు
నావుడుబాలుడు నాతికిట్లనియె

(బాలుఁడు తల్లిమాటలకుఁ
బ్రతివచనంబు సెప్పుట.)

ముదితరో నావంటి ముద్దులసుతులు
పుట్టరాభూమిని పుణ్యాంగనలకు
వారేలశపియింత్రు వనితరోనన్ను
అలిగితిట్టినపాప మనుభూతమగును
పూబోడినాదేహ పోషణార్థంబు
పెట్టనితావుల పెట్టిదాచెదవు
కొదమసింహముతన గురుశౌర్యమమర
ధరవిజృంభింపక దాగునాయెదిగి
ఏటికిభయమంద నింతిరోనీకు
అనవినిఅబ్జాక్షి ఆత్మలోగలగి

(బొంగరాలాటకూడదని తల్లి
మరలఁ జెప్పుట.)

ఏలబాలుడనీకు నింతధైర్యంబు
శాపింపబోరని సంశయమేల
దుష్టలుతులువలు దుర్భాషిణులును
తారతమ్యంబుల తగవెరుంగరయొ
కచ్చెకుముందుగ గాలుదువ్వెదరు
భావంబులిట్టివి పడతులకెల్ల
నీమేలుగనుగొని నేనోర్వలేక

పలుకుటకాదోయి బాలచంద్రుండ
అనిచెప్పినంతట ఆబాలుండనియె

(బాలుఁడు తల్లిమాటలకుఁ దగు సమాధానము చెప్పుట.)

దుష్టభావుడగాను ధూర్తుడగాను
వెలదులకెల్లను వినతిచేయుందును
దయచేయుందురువారు తనయునిమాడ్కి
తడవాయనేవచ్చి తల్లిరోయిటకు
పుత్రునిమాటలు బుద్ధిలోనుంచి
నాకాంక్షదీర్చి నన్నంపవమ్మ
బాలచంద్రుండిట్లు పలికినవేళ
ఐతమ్మనవ్వుచు నపుడునేర్పరుల

(బాలచంద్రుఁడు తల్లియొక్క లోభత్వమును దూలనాడుట.)

ఒజ్జలబిలిపించి యొప్పుగామీరు
బొంగరంబులుకొన్ని పూనిచేయంగ
తగునన్నబాలుండు తనలోననవ్వి
తల్లితోననియెను దయవచ్చునట్లు
శత్రువులబొజుంగు సాంద్రవిక్రముడు
గండుభీమనగర్భకంధిరత్నమవు
లోభమ్మునీకేల లోలాయతాక్షి!
ఏడుకోటులసంఖ్య నెసగినధనము
కలిగినఆగండుకన్నమనీని
చెల్లెలవైయుండి సిరులుచెన్నొంద
చెనటిబొంగరములు చేయించుకొరకు
ఏరీతిమనసొప్పె ఏణాక్షినీకు
బీదవాక్యమ్ముల కెదవులపైకి
తేరాదుపెద్దల తీరుకువెలితి
భావంబులోలోభ పటిమమీరంగ
గృహకార్యములు నిర్వహింపజాలెదవు
నీవంటిదానికి నీతియేచెపుమ
నీవెయుంచికొనుము నీతండ్రిసొమ్ము
సకలదేశాధీశ సంఘంబునెల్ల
సమరరంగంబున సాధించిమించి
వారిచేమాతండ్రి వలసినయట్లు
లప్పనంబులుగొన్న అధికధనంబు
పొందుగాదెప్పించి పుటముపెట్టించి
పైడిబొంగరముల పరగజేయింపు
వెండిచేములుకులు వెలయబెట్టింపు
పట్టుచేజాలెలు పన్ని పేనింపు
ముత్యాలకుచ్చులు మొదలగూర్పింపు
తెప్పించియిప్పింపు తీవ్రంబుగాను

(బాలుఁడు నిజౌదార్యమును దెల్పుట.)

దండివిక్రములైన తమ్ములునేను
ఆడుకోవలెనంచు అభిలాషపొడమె
నావంటిబాలుండు న్యాయంబుతప్పి
బీదబొంగరముల వెలది! యెట్లాడు?
చూచినవారలు చోద్యమందుదురు
ప్రజలుదూషింతురు బహువిధంబులను
సకలరాజులగెల్చి జయముచేకొన్న
బ్రహ్మనాయునిగర్భ పాథోధియందు
చంద్రునివిధమున జనియించినట్టి

బాలుని కీలేమి ప్రాప్తమాటహాహా
కాలమహిమమని గ్రహింపగలరు
కావునలోభమ్ము గాంచనీకేల

(బాలచంద్రుఁడైతమ్మకు వైరాగ్యముపదేశించుట)

కలుములు నిత్యంబుకావు మాతల్లి
మెరపు మెరయుఁరీతి మేఘంబులట్లు
బుద్బుదంబులభంగి పోవును జెదరి
ఈరీతిదలపోసి యొరుకచేమించి
సంపదవేళనే సకలభోగములు
పొందంగవలె ధర్మములు చేయవలయు
భోగానుభవముచే పుట్టిసంతృప్తి
వేసటజనియించి వెగటుగాదోచు
అటుమీదవైరాగ్య మమరుచునుండు
ధర్మముల్ చేసిన తనరు పుణ్యంబు
సజ్జనసహవాస సంప్రాప్తికలుగు
వైరాగ్యమధికమై వర్తించుబిదప
భోగధర్మంబులు పుట్టినయపుడె
సరవివిరాగిత సంసారమెడలు
సద్గురు పదసేవ చయ్యనగలుగు
అందుచే నిర్వాణమందికయగును
కావున భోగముల్ గైకొనవలయు
శాస్త్రంబులీలాగు చాటిచెప్పెడిని

ధనమందులోభంబు తగ్గింపుతల్లి
ప్రాణంబనిత్యంబు భవమనిత్యంబు
ద్రవ్యంబువచ్చు నాతవిలి వెన్వెంట
* ఇటువంటి మానవుఁడీదేహమెడలి
పోయికొన్నాళ్ళకు బుట్టునుమరలి
కర్మరహస్యముల్ గాంచినవారు
ద్రవ్యంబునకు నవస్థాద్వయమిట్లు
తనరింపుచుందురు తద్జ్ఞులుగనుక
నీవెరుంగని మర్మమే నెరుంగుదునె
వనినభూపతులెల్ల సమకూర్చినట్టి
చిత్రమౌధనములో చిన్నమేమైన
గొనిపోయిరా వెంట గూర్పంగనేల
ఆశచాలించుటే ఆనందపదవి
చెలిమినామాటలు చిత్తమందుంచి
మాకొర్కె లీడేర్చి మమ్మమన్నింపు
ధనలోభమందిన దానవుకనుక
ఇంతగా జెప్పితి ఏణాక్షినీకు
నీలోభగుణమును నేవిన్నవింతు

(బాలచంద్రుఁడైతమ్మయొక్క వెనుకటి లోభకార్యంబుఁ జెప్పుట.)

తప్పక మదికెని దారుణగాను

* "देहिनोऽस्मिन् यथा देहे कौमारं यौवनं जरा ।
तथा देहान्तरप्राप्तिर्धीरस्तत्र न मुह्यति"
అని యర్జునునకు శ్రీకృష్ణుఁడు చేసిన యుపదేశముకూడ నిట్లేయున్నది.

నీ మేనగోడలి న్నీవడ్గినపుడు
నా మేనమామలు నా పెండ్లినాడు
మా కులంబునవీలి మాడలుగలవు
తగినధనంబీక తామీయమనిరి
ఆమాటమీదట నమ్మరో నీవు
ముట్టడివేసితి మూర్ఖతతోడ
అయిదురోజులదాక నంతమామామ
అక్కవైనను నేమి అలిగిన నేమి
అడిగినధనమీయ కతివ నేనీయ
బ్రహ్మవచ్చినగాని భయపడబోను
నియమంబునాకిది నెలతరోయన్న
ఏమి కావలె నీకు నిప్పింతునిప్పు
డన్న సందేహింపక డుగవే యనిన
మాడలు తూమొకు మాకుగావలయు
ఇప్పింపువేగమె యింకొక్కమాట
అఖిలరాజులొసంగినట్టి యప్పనము
లందుదాలువిగల వతివరో వినుము
పొల్లును తాలును పోసగవుమాకు
తీరైనమాడలదెచ్చి యిమ్మన్న
మదిలోననొవ్వక మగువనీవప్పు
డూడిగీలనుబంపి ఒప్పైనధనము
తెప్పించిరాశిగా దీర్చిపోయించి
కొలిపించికొమ్మన్న కోరిమీయన్న
మెట్టొండు కట్టించి మీదదాకెక్క
హెచ్చుగాతూర్వార నెత్తెనుభువిని
చిందిపోయినవెల్ల చేసుతాలుపొల్లు
అనిరోసి మిగిలిన అర్థమంతయును
అధికమా తూమొకటపుడు తెప్పించి
ఎలమితూమునకంటె హెచ్చుగాగొలిచి
కళ్ళమద్దువితానె కావలెననుచు
తాలునుపొల్లును దానెగోరుచును
ఇండన్నిమాకని హెచ్చినకాంత
కట్టించిమాటలు కైకొని తల్లి
నేనెరుంగుదుదల్లి నీమనస్సరణి
మించినకీర్తికై మెలగితివప్పు
డన్నపుత్రునిమాట కైతమ్మనవ్వె
హెచ్చుగా నవ్వినారెనమంద్రుసుతులు
గారాబుతనయుల గడుప్రేమమదర
గూర్చుండబెట్టియు గూరిమితోడ
మెుదలురప్పించిన ముఖ్యులైనట్టి
ఒజ్జలుతనమ్రోల నుండంగజూచి
బొంగరంబులుచేయ బోసగునుమీకు
పైడియిప్పించెద బట్టినయంత

(ఐతమ్మ బొంగరంబులు చేయం
బంచుట.)

పనిముట్లుదీసుక వడిరమ్మటన్న
వారలిండ్లకుబోయి పట్టెడకారు
కమ్మచ్చులును నీరుకార్లు సుత్తెలును
ఘనమాపడచ్చును కత్తెరల్ మరియు
ఆలరుమచ్చులుగుదులాదియైనట్టి
పనిముట్లుగొని తెచ్చి భామకన్నెదుట

భక్తితో నిలిచిరి పటిమదీపింప
ఐతమ్మసెలవిచ్చె నంతటవారు
చదురేర్చికూర్చుండిసరి పనిముట్లు
పరచిముందరకడ పావకున్నిలిపి
పుష్పగంధంబుల పూజకావించి
నైవేద్య తాంబూల నతులొనరించి
కనకలక్ష్మికిదగు కమఠంబు నిలిపి
కడుగొప్పమూసలుగట్టిగా జేసి
నిజమైనబంగారు నిండించిమంచి
పలుకుల గరగించి పరికించునపుడు
కాలహేతువదేమొ ఘనలక్ష్మిమహిమ
కరగువేళలవన్నె కదలకనిల్చె
తరువాతఆశ్చర్యదంబై చెలంగ
చెదరిఅంతంతకు చీకాకునొంది
చిదురుపలాయె విచిత్రంపుభంగి
ఒగిచుట్టుకున్నట్టి ఒజ్జలందరును
కనుగొనిభీతిల్లి కంపితులైరి
బాలుడావేళను ప్రాభవం బొప్ప

(బాలచంద్రుఁడు
భౌతిక రహస్యములఁ దెల్పుట.)

తల్లితోననియెను తననేర్పుమీర
కడనెన్ని చిదురులై కరగిన నేమి
కరగినవేళల కళలేమిచెడక
నిలుచుటే కతనంబు నిశ్చయంబిదియ
అటుమీదనగుకార్య మదియేమిలెక్క
చెడనిపదార్థముల్ సీమలోలేవు
చెఱునుగట్లును నదుల్ చెట్లును లతలు
సంచారి జీవముల్ సమయుచునుండు
సమసినజీవముల్ జనియించుమరల
జడపదార్థంబులు చైతన్యమొందు
* పొలియదొక్కటివియు బొత్తిగానెపుడు
పుట్టదుక్రొత్తది భూమిలోపలను
పోయినదానిని పోయెనటంచు
ఉన్నదానినిజూచి యున్నదటంచు
భావింపగారాదు పడతిలోకనుము
కాలవశంబున గలపదార్థములు
రూపభేదంబుల రూఢిగాబొందు
ధర బ్రహ్మవ్రాతలు తప్పింపరాదు
కావునఆశ్చర్య కారణంబేమి
మాయాభవంబిది మాసిపోగలదు
హృదిలోన సంశయమేల నేతల్లి
కావింపుమమ్మ బొంగరములనెను
వేయిమాడలచేత విరచించిఅపుడు

(సిద్ధమైన బొంగరముల
బాలచంద్రునకొసంగుట.)

మాంగలియైనట్టి మాధవుకిచ్చె

---

* "नित्यं परमाणुरूपं" అని తార్కికుల మతముకూడ నైయున్నది.

కుమ్మరపట్టికి గురుతుగారెండు
వేలకు జేయించి వేగమెరయునగె
సరిమూడువేలతో చాకలచందు
బోంగరంబమరించి పొసగనిప్పించె

అలరునాలుగువేల కమరికచేసి
కంసాలిచందుకు గరుణతో నిచ్చె
అయిదువేలకు జేసి యాకమ్మరికిని
ఇప్పించెమదిలోన నెన్నికొనంగ
వెలమపట్టికి ఆరువేలకుదీరె
పదివేలతో జేసి బాపనికిచ్చె
నారాయణుండైన నాయనికొడుకు
బాలునిచేతికి పండ్రెండువేల
తీరిచివన్నెలు దీరిచిపైన
సకలరత్నంబులు సంఘటియించి

ములుకులువెండితో మొనలగదించి
ఇచ్చెను సంతోషమింపెసగంగ
పిమ్మటనొజ్జల ప్రియముతో జూచి
తగినకట్నంబుల దయమీరనొసగి
పొమ్మనిసెలవీయ పోయిరివార
లంతటఐతమ్మ ఆనందమునను
చారువర్తనవాడ చక్కనివాడ
గురుతరశేచర్ల కులవార్ధిసోమ
బాలుడనీమది పరిణామమాయె
షడ్రసోపేతమౌ సకలవస్తువుల

వంటయైయున్నది వచ్చి మీరెల్ల
భుజియించి పొందన్న పొందుగాలేచి
పానశాలలో పక్వవస్తువుల
గరిమతోభుజియించి కరములుకడిగి
పానశాలకువచ్చి వసియించిమించి
కాశ్మీరకర్పూరకస్తూరులెసగ
తెచ్చినగంధంబు దిన్నగాబూసి
చిత్రవర్ణంబుల చెలగుచునున్న
తగుపట్టువస్త్రముల్ దవిలిధరించి
బహువిధమణులచే భాస్వరమైన

అణిముత్యంబుల అమరినయట్టి
మెరుగుభూషణములు మేనులదాల్చి
భాసిల్లి శృంగారభరితులైవచ్చి
తప్పక నిలచిన తనయులజూచి
ఎలమితో ఐతమ్మ యిట్లనిపలికె

(ఐతాంబ కుమారులకు బుద్ధులు గఱపుట.)

మేడపిలోపల మేలైనయట్టి
రచ్చకొట్టంబుల రాజవీథులను
విపణిమార్గంబుల విబుధగేహముల
బొంగరాలాడగ పొసగదుసుమ్ము
కరుణతోనాబుద్ధి గైకొనిమీరు 10/10

మేడపిలోనుండి మేలుగావెడలి
ఉత్తరదిశయందు ఒప్పుచునున్న
చాలురావులకాడ సరసమైనట్టి
రమణీయమగుమొల్ల రావిక్రిందటను
ఆడుడిబొంగరాలానంద మెసగ
పొందుగాఈరీతి బుద్ధులుచెప్పి
చక్కనిముత్యాల జాలెలదెచ్చి
అందించి చేతుల కాశీర్వదించె

సేవకుల్ తగరుల శృంగారపరచి

(బాలచంద్రాదులు బొంగరము లాడఁబోవుట.)

పసిడిపల్లంబులు బాగుగాఁగట్టి
పట్టుజాలెలుదెచ్చి పరువడిగప్పి
ముందరనిలిపిరి ముద్దుపొట్టేళ్ళ
బాలచంద్రుండును భ్రాతృసంచయము
వేడ్కమీరఁగవాని వీపులనెక్కి
కమ్మరగరితలు గణములుపొంగి
వింజామరలబట్టి విసరుచునుండ
గచ్చకాయలుకొన్ని కలిగినయట్టి
తిత్తులు చిరుతలు తీరైనగోడెలు
జూదమాడుటకయి సొగటాలుకొన్ని
బంతులుపిట్టలు పంజరచయము
పేరైనడేగలు పికిలిపిట్టలును
శారికావళి కీరసంఘంబు మరియుం
ఆటలసాధనాలవి వెంటరాఁగ
రయమునజనిచాలు రావులసరస
మొల్ల పేరిటిరావి మొదటనుజేరి
తీరైనతగరుల డిగ్గి వేదికల
పైనిబరచినట్టి పలువన్నెలమరు
రత్నకంబళముపై రంజిల్లనుండి
బొంగరాలాడఁగ పూనిరావేళ
సరిస మేడపిజనుల్ సంతసంబొప్ప
బొంగరాలాడెడు పొంకమంతయును
పోయిచూడదలంచి బుద్ధులునిలిపి
వనితలుతండ్రుల పతులపుత్రులను

(అమ్మలక్కలు బొంగరా లాటఁ జూడఁబోవుట.)

అత్తలమామల అడుగుటమాని
గృహకృత్యభారంబు లెడలచాలించి
ఒక్కరినొక్కరు ఒగిబిల్చికొనుచు
తమలోనముచ్చటల్ దగజెప్పికొనుచు
రయమునబోయిరి రావులకడకు
ఆపురవరమున అలరుచునుండు
వరవిప్రకామినివైశ్యకామినియుం
ఎడలేనిపొందుచే ఎసగెడువారు
తరివిచారించిరి తమలోనదాము
నాయునిపుత్రుండు నవమన్మథుండు
బాలుడు సంతోషభరితుడైయిపుడు
తమ్ములుతానును దన నేర్పుమీర
బొంగరాలాడఁగ పూనియున్నాడు
కనుగొనవత్తము గ్రక్కునబోయి
అని పల్కబ్రాహ్మణి ఆపెతోనపుడు
ప్రకటమ్ముగావైశ్య వనితయిట్లనియె
ఓయమ్మబాలుండు ఉరుమనిపిడుగు
పాపపుణ్యంబుల భావింపడతడు
శకట సమూహంబు చనియెడువేళ
చీలలూడఁగదీయుం జేతులబట్టి
ఆడెడుపాపల అదరంటగొట్టు
వెంగలిదుష్టుండు వీతధర్ముండు
వానిజూడఁగ నేల వాంఛజనించె

సావుడుబ్రాహ్మణనారి యిట్లనియె
నేబోయివచ్చెద నెలతనీవుండు
మనినుడువంగ వైశ్యాంగన కూర్మి
పడతినీదగుప్రాందు పట్టుటమొదలు

ఎడబాసియుండుట యెన్నడులేదు
నేడునిన్నెడబాసి నేనెట్లుండు
వచ్చెదపదమని వడితోడలేచి
నీరాడికడవను నేర్పుగాబట్టి
అత్తమామలకు నతిభక్తిమ్రొక్కి
కనుగొనివత్తుము గ్రక్కునబోయి
అననవ్వి పెద్దవా రతివలనంప
కదలిరికర్పూర గంధులు చెలగి
చనిదీర్ఘికనుడిగ్గి జలములసంత
కప్పినవాచును గడకేగజేసి

నిర్మలోదకములు నించికడవల
శృంగారమొప్పగ శిరములబెట్టి
దురితబంధంబుల దొలగింపలేక
కర్మఫలంబును గడవగలేక
నెలతలు చనుదెంచి నిల్చిరచ్చోట
ఆశ్చర్యవాక్యాల అప్పుడిట్లనిరి
ఈతడేపలనాటి నేలేడుబ్రహ్మ
తనయుండు సౌందర్య దర్పకుండితడె
మార్తాండతేజుండు మహితశౌర్యాఢ్యు
డీచొప్పునీయొప్పు నీచక్కదనము

అలవియేపొగడంగ అజునకునైన
బంగారుకలశాల పన్నీరుతెచ్చి
మదనారి నభిషేక మాడించెదొల్లి
* మంచాలకాతన్న మానితయశుడు
కలితసౌందర్యుండు కందర్పసముడు
పతియేలయానని పాయనివేడ్క
ముచ్చటలాడిరి మూకలై చేరి.
† ఆసమయంబున అనపోతులేచి
పట్టుగాగిరివ్రాసిపైడిటంకంబు
నిల్పిబాలునిజూచి నెనరొప్పననియె

ఊరకయున్నాడ వోబాలచంద్ర
బొంగరాలాడెను బుద్ధితోతమ్ము
లెల్లను గనిపెట్టి యిపుడున్నవారు
నీవుముందాడక యెవరాడరాదు
మొదలిడుమనిచెప్ప ముదమున అతడు
తోరంపుసందడి తొలగింపుమనెను
బద్దలవారంత పరుగునవచ్చి
చెలగిబరాబరుల్ చేసిరిమ్రోల
తంత్రజ్ఞులగుమేటి తమ్ములులేచి
చేరిఆటలనాడ చిరునవ్వునవ్వి

(బాలచంద్రుడు బొంగరమును
ద్రిప్పుట.)

బలపరాక్రముడైన బాలచంద్రుండు
ఘనతరమాణిక్య ఖచితమైనట్టి
బొంగరంబరచేత బూనుకయుండి

* బాలచంద్రుని భార్య.

† బాలచంద్రుని యన్న. బ్రాహ్మణక్షేత్రసంజాతుడు.

నేరుపుచూడుడీ నిలిచిమీరెల్ల
తిరిగింతుచేతిలోఁ దీటులేనట్టు
లవని పైబడకుండ అనంతరమందె
పట్టియాడింపెద బహువిధగతుల
అనిచుట్టునున్నట్టి అతివలజావి
అత్తమామలభక్తి అమరినవారు
పతిమాటలకెదురు పలుకనివారు

వినయమా నామాట వినుడిమీరెల్ల
దూరాననుండుడీ తొలగికన్గొనుడీ
అనిచెప్పిబొంగరం బరచేతఁబట్టి
ముత్యాలజాలెను ముదమునఁజుట్టి
వేయెత్తిహుంకించి స్థిరబలంబునను
వేసినవడిమీర వేగమెపోయి
సంయమీశుండను చట్రాతిదాఁకి
మింటిమీఁదికెగసి మెరుగులుక్రమ్మ
* అన్నమ్మయను పేర నలరుచునున్న
చక్కనికోమటి జలజాయతాక్షి

మీఁగాలికిందాకి మించినమునికి

(అన్నమ్మయను వైశ్యకాంతను
బొంగరము దగుల నామె
మూర్ఛిల్లుట.)

అరకాలుదిగివచ్చి అవనికిదాకె
తాకినఆవైశ్య తరుణిభీతిల్లి
గగనంబుపైబడ్డ గతికంపమొంది
తరిగినఖర్జూర తరువుచందమున
తటుకునమూర్ఛచే ధరమీఁదనొరిగె
చెదరికుంతలములు చిక్కులనొందె
మిక్కిలిచెమటచే మేనివస్త్రంబు
తడిసెనుగుండీయ దడదడమనియె
మేదినీరేణువుల్ మేనెల్లగప్పె

ఈరీతిబడియున్న యేణాక్షికడకు
పోకుచుజేరెను పొలతులగుంపు
కప్పిరివలువలు కర్ణంబులందు
కర్పూరరజమును గలయంగనూరి
పదతలంబులయందు పాణులయందు
కస్తూరిగంధంబు గలిపిపట్టించి
చానలుశైత్యోపచారముల్ సలిపి
చింతింపబోకుడీ చెలిలేచునిపుడె
అనిపల్కునంతలో ఆమూర్ఛదెలిసి
ముకుళితహస్తుడై ముందరనున్న

(కోమటియన్నమ్మ బాలునిఁదిట్టుట.)

బాలునిగనుగొని బలుకోపమునను
కన్నెఱ్ఱగజేసి కాంతయిట్లనియె
ఓరిదురాత్ముడ ఓరిదుర్మార్గ
క్రిందుమీఁదెరుగక కెరలుచున్నావు
గర్వమేటికినీకు కాంతలయెడను
కలిగినదినవలె గట్టంగవలయు
ఎరుకమాలినచేష్ట లేలచేసితివి
మురియంగ నేలనీ పొంగెల్లనణగ
ముదిరెమదంబునీ మురిపెంబుత్రుంగ
తగమల్లభూపతి ధనమెల్లనీదు

* ఈమెయే విప్రస్త్రీతోఁ గూడ వచ్చిన వైశ్యతరుణి.

సదనంబు జేరిన సత్తువనుండి
త్రుళ్లుచున్నావు దుష్టచిత్తుండ
సమరంబులోనిన్ను శత్రులు గ్రమ్మ
నడిచెడుపదముల నారసాలేయ
చూచెడుకనులకు సూదులు గ్రుచ్చ
మీయయ్యలెల్లను మించినబలిమి
చేరివైరులతోడ శ్రీయుద్ధభూమి
నుప్పొంగుచున్నవా రుర్వీశునెదుట
వారిలోగలయు నీవడికానవచ్చు
పోతుసింహమురీతి పొదలుచున్నావు

మదముపట్టినగిత్త మాడ్కి మేడపైని
నున్నావు కావర ముడిగెడుగాక
అనితూలనాడిన అధికరోషమున
కలుషించిఅనపోతు కనులెఱ్ఱ చేసి
పట్టుజాలెదుబూని భామలనెల్ల
పరమసాహసమున పారంగదోలె
అప్పుడాఅనపోతు సమరంగజూచి
పలికెబాలుడునీతి పటిమచెలంగ
వనితలనదలింప వచ్చునామనకు
అందుచే పాతక మంటునుమనల

అనిచెప్పితరువాత ఆవైశ్యవనిత

(తప్పుక్షమింపుమని బాలచంద్రుఁ
డన్నమను బ్రార్థించుట.)

కాదరమొప్పగ ననియెబాలుండు
"నొప్పికల్గుటచేత నోరాపలేక
అనరానిమాటల ఆడితిగాని
నీమీదపగచేత చేసేయలేదు
బాలుల కాటలు పథ్యంబుగనుక
ఆడితిబొంగరం బదినిన్నుదాకె
దైవకృత్యంబని తలపకాడితివి
నిన్నింకనేమందు నీరజనేత్ర
అబలవునిన్నేమి యనవలదైన
నాతప్పుమన్నింపు నయభావమునను
కరుణింపు"మనుచును కాంతకావేళ
పచ్చవన్నెలపట్టు పటము లేచించి
ఘనమైనమందులే కాలగట్టించి
మాన్పికొనుటకును మాడలేనూరు
ప్రియముననిప్పించి వెలదితోననియె
అమ్మమాతల్లి నీవైతమ్మమారు
* మాయయ్యలెల్లను మలసిదండెత్తి
పోయియేదిక్కున బూనియున్నారు
తలపోసిచెప్పవే తరుణిరోనేడు
నావుడుకోమటి నారియిట్లనియె
కదలింపకుమునన్ను గన్నమాయయ్య
కాలికయిననొప్పి ఘనమాయెగనుక
కోపించిపలికితి గురుతెరుంగకయె

* "మీయయ్యలెల్లను మించినబలిమిఁ । జేరివైరులతోడ శ్రీయుద్ధభూమి । నుప్పొంగుచున్నవా రుర్వీశునెదుట । వారిలోఁగలయు నీవడికానవచ్చు" అని యీ కోమటిస్త్రీ యన్నది గనుక బాలచంద్రుఁ డీప్రశ్న నడుగుచున్నాఁడు.

మీయయ్యచనిన సమిద్రంగమరయ
ఇలమీద నెచటనో యేను నెరుంగ
ఐతమ్మ యెరుగు నన్నడుగకుమన్న
ఆటలజాలించి అనుజులుదాను

(బాలచంద్రుఁడు తల్లివద్దకేగి బ్రహ్మనాయుఁడు పోయిన యుద్ధరంగ మేదియో యడుగుట.)

మేలైనవీథుల మేడకేగి
వేగమె యిలుచొచ్చి వినయంబుతోడ
తల్లికిమ్రొక్కి తనయులందరును
మ్రొక్కనదీవించి మురియుచునున్న
తల్లితో బాలుండు తానిట్లువలికె
వెలదిరో మేడపై వెలవెలబోయి
కళదప్పియున్నది కారణంబేమి
నయమొప్పనాయుండు నాయకులెల్ల
ఎక్కడికరిగిరో యెరిగింపవమ్మ
అనుడునావాక్యంబు లతివకర్ణముల

(బాలునిమాటలువిని యైతమ్మ మూర్ఛిల్లుట.)

ఘనతరశరముల గతినేచనులికి
తరిగినకదళికా స్తంభంబురీతి
గుండెలుపరియలై కుంభినినొరగె
చంద్రమండలమందు సాంద్రంబుగాను
జలదంబుకప్పిన చందంబువెలయ
సలలితకుంతల జాలంబుచెదరి
కప్పినవదనంబు కనుపింపదాయె
కన్నులనీరాని కాటుకచెదరె
గళబద్ధనవరత్నకాంచనయుక్త
హారజాలములెల్ల నటునిటుదొలగె
జమిలిముత్యపుచేర్లు చక్కనైయున్న
పాపటబొట్టూడి ప్రక్కనబడియె
వేనలిదురిమిన విరులెల్ల జారి
పడెనుభూస్థలిమీద బరచినయట్లు
కొంతసేపునకామె గొబ్బునలేచి
ఘనమైనదుఃఖంబు గ్రమ్మంగబలికె

(ఐతమ్మ యుద్ధవిముఖములైన మాటలు బాలునికిఁ జెప్పుట.)

చేసినధర్మముల్ చెడిపోయెనిపుడు
పరపుణ్యజాలంబు వరదనుగలసె
నాభాగ్యమునకెల్ల నాశంబుదోచె
ఇటువంటికార్యంబు నిచ్చలోఁదలచి
నాలుకెట్లాడెను నన్నడ్గనీకు
బాలుఁడా నీకేమి భారంబువచ్చె
వినగననిటువంటి వెర్రినెక్కడను
కాలంబునవలె గానినిన్నన్న
ఫలమేమియని చాలభయమునుబొంది
పుత్రుడువిడనాడి పోవకయుండు
బొంకుమాటలదల్లి పొరిపొరనసియె
తనయుఁడావినునీదు తండ్రులుమామ
లెల్లవిచారించి యేకభావమున
మలిదేవుమన్నన మట్టాయెగనుక
ఇచ్చోటువిడనాడి యేగిరివార
లేదిశబోయిరో యెరుగనుసుతుడ

అనినబాలుడుతల్లి కప్పుడిట్లనియె
ఎన్నడసత్యంబు లెరుగనినీవు

(బాలుడు నిజధర్మముల
వివరించుట.)

తగవటేనాతోడ దబ్బరలాడ
చెలగి కార్యమపూడి శ్రీయుద్ధభూమి
మలిదేవసహితులై మాయయ్యలెల్ల
చలముననున్నారు సమరంబుసేయ
అవలశాత్రవచయ మతివిక్రమమున
మూకలై బ్రహ్మన్న మొదలైనవారి
గహనముల్ దావాగ్ని కాలిచినట్లు
దగ్ధంబుచేయంగ దలచినవార
లీసమయంబున నేనేగకున్న
అపకీర్తి పాలౌదు హానియువచ్చు
తండ్రికష్టంబును దప్పింపలేని
పుత్రుడుండిననేమి పోయిననేమి
* జనకుడేపుత్రుడై జనియించునంచు
గొల్లునవేదముల్ ఘోషించుచుండు
తల్లిరో కావున తనయునిబలిమి
తనబల్మియేయని తండ్రిదలంచు
పితకుపుత్రునికిట్లు భేదంబులేదు
కార్యమపురికేను గదలంగవలయు
కదలినసీవల్ల గానున్నదేమి?
అనివిచారించుట అబ్బబ్బతగదు
తల్లిరో నాకసాధ్యంబిలలేదు
బ్రహ్మాండములబట్టి బంతులాడుదును
మృత్యుదేవతకైన మెదిపివేసెదను
హరిహరుల్ మెచ్చగా అనిచేసిమించి
కామభూవిభునకు గలబలంబెల్ల
ఖండించివైచెద కలియుంగమందు
వీరచరిత్రలు వెలయజేయుదును
తల్లిపంపుమునన్ను తడయంగనేల
చిత్తంబుచెడిపోవ చింతింపబోకు
మనినపుత్రునిమాట కైతమ్మపలికె
తమకంబుకూడదు తాళుముతనయ
తెలిసివిచారించి తెలిపెదనీకు
ఉండుమీవనిచెప్పి యొయ్యననేగి

(ఐతమ్మ శీలమ్మ నాలోచన
యడుగుట.)

అత్తయాశీలమ్మ అతిభక్తిజూచి
కరములు ముకుళించి కార్యమంతయును
వినిపింపచిత్తంబు వెరగునుబొంది
తలపోసిశీలమ్మ దైవజ్ఞవితతి
పిలిపించి బాలునిపేరటలెస్స
గ్రహగణభావంబు గ్రహియించిపిదప
ఐతమ్మతోడుత ననియెనీరీతి
పటుపరాక్రముడైన బాలచంద్రుండు

(శీలమ్మ యుపాయంబు సెప్పుట.)

పదునేనుదినముల పరిణామమొందు
చెప్పంగబడెనిట్లు సిద్ధాంతమందు
ఎడలేకఅడలెద వింతిరోనీవు

* "अङ्गादङ्गात्संभवसि" అనియు, "आत्मा वै पुत्रनामासि" అనియు శ్రుతి.

నీవెంతఆడలిన నిల్వడాతండు
కాలమెవ్వరికైన గడవగరాదు
బ్రహ్మవ్రాసినవ్రాలు వశమెతప్పింప
నీమాటకాతడు నిలువంగబోడు

కన్నకడుపుగాన కాంతరోనీవు
పడవలసిన పాట్లు పడవలెగాని
ఊరకయుండుట ఉచితంబుగాదు
శంబరాసురవైరిజాయహస్తమున
చెలువందనిల్చిన చిలుకకుసమము
* మంచాల శర్ద్రాప మహిమగన్గొన్న
చాలింపగలడమ్మ సకియనీసుతుడు
నావినిఐతమ్మ నాతికిమ్రొక్కి
పీడనిచింత చే వెడలితావచ్చి
తనకుమారునిజూచి దయనిట్టులనియె

(భయంకరరణరంగవర్ణనతోనైతమ్మ
బాలుని భయపెట్టుట)

ఓయయ్యబాలుడా ఒప్పుగావినుము
పరరాజసైన్యమ్ము పైకొనిరాగ
వాద్యసమూహంబు వడితోడమ్రోయ
ఘనకరీంద్రముల ఘీంకారరావంబు
సాంద్రతురంగహేషావిజృంభణము
రథనేమిసంకుల ప్రబలశబ్దంబు
లమితపదాతిచ యాట్టహాసంబు
భేరీధమామల భేళ్ళనుమ్రోత
యేకమైమించిన నెట్లుతాళెదవు
విలుకాండ్రు చెలరేగి విచ్చలవిడిని
జడివానపట్టిన చందంబుతోడ
దట్టమౌశరవర్ష ధారలుగురియ
తప్పించుకొనలేవు ధైర్యంబుమీర
అలుగులమెరుగులు అవనిపైనిండ
కన్నులచీకటి గ్రమ్మగజేయు
బద్దలఈటెలు పట్టుకతూరి
మైబడ్డధైర్యంబు బట్టగలేవు
కత్తులుఝళిపింప గనుగొనినీవు
తాళెదవేరీతి తందరపడక
నీవేడరణమేడ నీబలమేడ

బాలులతోనాడు పగిదిగాదోయి
చెక్కులుమీటిన జెందునుపాలు
నుదురుమీటినగడు నూనెవెళ్లెడును
గంద్రతనంబుల గైకొనుతనయ
పిన్నవునీకిట్లు బిరుదులువలదు
ననువీడిపోవుట న్యాయంబుగాదు
నావుడుబాలుండు నాతికిట్లనియె

(బాలచంద్రుండు నిజబలోన్మేషం
బుఁ దల్లికెఱింగించుట.)

భయమేలచెప్పెదు భామనాకిపుడు
పుత్రమోహంబున బొంకెదుగాని
యెరుగవేనాబల్మి యిందీవరాక్షీ
నలగామునెరుగును నాదుశౌర్యంబు
ప్రళయకాలమునాటి భైరవురీతి

---

* బాలచంద్రుభానిభార్య, గండు కన్నమనాయకుని కూతురు.

సైంధవవధవేళ సాహసస్ఫూర్తి
విజయుండు రణములో వెలసినకరణి
కౌరవసేనలో గదబట్టితూరి
వడిమడియనిలోన వ్రాలినవిధము
వాయుపుత్రుడు లంకవడితోడ జొచ్చి
భస్మంబుగా గాల్చి ప్రబలినభంగి
రాక్షసరణములో రామచంద్రుండు
వీరపరాక్రమ విధిజెందినట్లు

జలధిమధ్యంబున చరియించినట్టి
మందరమనియెడి క్ష్మాధరమ్మట్లు
ఫాలాక్షుడతిరౌద్ర పటిమమీరంగ
త్రిపురంబులను సంహరించిన గరిమ
కాలాగ్నిలోకముల్ గాల్చినపోల్కి
స్థావరజంగమజగతినుద్ధతిని
ప్రళయంబుముంపంగ పరగినరీతి
కామభూపతిసేన గడగడవణక
విక్రమక్రమశక్తి విడివడజొచ్చి
పృథ్వీపైపీనుగు పెంటలుగాంగ

విహరింతుమదిలోన వేడుకకొలది
ఉర్వీశుదళముల కురుమనిపిడుగ
గర్వించుపగవారి కంటిలోనెరస
ఎదురవ్వరేనాకు నీభువిలోన
నలగాముబలముల నలినలిచేసి
పండంగతరిగిన వడువుననరికి
నెత్తురుమడుగులు నిండనొనర్తు
దహనునికడ్డంబె దట్టకూవనము
బడబాగ్నినార్చునే పాథోధిజలము
భయదంపు పులికిని పశుగణంబెదురె

జింకలకదుపులు సింహముకీడె
బాలుడననినన్ను భావింపవలదు
చిన్నమిరియమందు చెడునెకారంబు
నావిని సుతునకు నాతియిట్లనియె

(సంతానమునకై పడ్డకష్టముల
నోచిన వ్రతముల నైతమ్మ
వేర్వేరఁ జెప్పుట.)

వినవయ్యబాలుడ వీరశేఖరుడ
(కన్నకడుపుగానఁ గాంక్షమిక్కుటము
పుత్రమోహమువంటి మోహంబులేదు
దశరథప్రముఖ భూతలనాథవరులు
పడిరిపుత్రులకయి పదరానిపాట్లు
పుత్రులులేనట్టి పురుషభాగ్యంబు

విపినంబులోఁగాయు వెన్నెలరీతి
కొడుకులులేనట్టి కోమలిబ్రతుకు
పూచికాయనియట్టి భూజంబువిధము
* పున్నామనరకంబు పొందకుండంగ
తల్లిదండ్రులఁగావ తనయుఁడెకర్త
బాలుడాననునీవు పాయుదువేని
నిమిషకాలంబైన నిల్వంగనోప)
సంతానమేలేక చాలకష్టించి

* "पुन्नाम्नो नरकात्त्रायत इति पुत्रः" అని పుత్రశబ్దమునకు ఒక వ్యుత్పత్తి.

అవనిలోగల నోములన్నియునోచి
తరచుగా జేసితి దానధర్మములు

తాంబూలములను సద్భక్తిదక్షిణల
కూర్చిచూరవిడిచి కుమ్మరామముల
ఆడెడుగానుగ లవిగొల్ల పెట్టి
పెండ్లిండ్లు చేసితి పేదవిప్రులకు
పాడైనదైవత భవనంబులందు
పూజాదికంబుల పొందించిభక్తి
ఆమడామడమీద అన్నసత్రముల
వెలయంగ జేసితి విస్తారమైన
వనములోపల చలిపందిళ్ళునుంచి
శ్రీగిరికేగెడు శివభక్తతతికి

చెలగఇచ్చితిరాగి చేనిర్మితముల
ఘన కమండలువులు కప్పెరచయము
శ్రీభ్రమరాంబకు శ్రీశైలపతికి
రజతకాంచనముల రంజిల్లునట్టి
కూష్మాండఫలముల గూర్చిదక్షిణలు
కానుకలిచ్చితి కడుభక్తితోడ
గౌరీమహేశ్వర ఘననామశిఖరి
ఎక్కియునోమితి నేలేశ్వరంబు
దిగివచ్చినోచితి తిలపర్వతమున
మొగివిష్ణుకాంత నోమును సలిపితిని 12/10

తగనొనర్చితిని సంధ్యావర్తినోము
అలయకనోమితి అజగజ్జ్యోతి
ఏగురువనితలసింపుగగూర్చి
యేకబాణమునోము నెలమినోచితిని
పదుగురువనితల బాగుగగూర్చి
పచ్చవిల్తునినోము పట్టినోమితిని
నందికిపులగంబు నయతనిచ్చితిని
శ్రీశైలపథమున చెలువంబుమీర
అశ్వత్థపత్తుల అభివృద్ధిచేసి
రజత కాంచనమయ రమ్యతంతువుల

అశ్వత్థతరువుల కలరజుట్టించి
పెంటిపోతులకును పెండ్లిచేసితిని
చీకటింటనునోము చేసితిభక్తి
నియతికేదారేశు నిల్పినోమితిని
గోనకోనికనుగొన్న గుంటికినెల్ల
చేయెత్తిమ్రొక్కితి చెప్పనేసిగ్గు
కరమెత్తిమ్రొక్కితి కాట్రేనికేను
పలునోములీరీతి భక్తితోజేయ
ఏదేవుడైనను ఇచ్చలోమెచ్చి
వరమీయడాయెనా వ్రాతకేమందు

అనిచింత చేయుచు అసురుసురంచు
దైవంబుదూరుచు దలకెడువేళ

(బాలచంద్రుని జన్మప్రకారము.)

వింటెనివచనంబు వినువీథియందు
గజనిమ్మనోమిన గలుగుసంతాన
మనువాక్యమునకప్వా డానందమొంది
పెద్దలౌవిప్రుల పిల్వగబంపి
ముకుళితహస్తనై మ్రొక్కి ఆమీద
వారితోజెప్పితి వాక్యలక్షణము
వినివారుసంతోష విశ్రాంతమతిని
వ్రతకల్పములనెల్ల వడివిచారించి

శోధించిచెప్పిరి శుభముహూర్తమున

శాస్త్రమందున్నది చానయీవ్రతము
సంవత్సరమునిండ సల్పగావలయు
ఇదివిష్ణుదేవుని కింపైనవ్రతము
శాస్త్రోక్తదినమున స్నానకృత్యమును
వాక్రుచ్చుచున్నది వ్రతవిధానమ్ము
చంద్రభాగానది సదృశశైవలిని
కలుగదుపలునాటి గడ్డయందెల్ల
కృష్ణకుసమమిది కీర్తనీయంబ
ఎడమభాగమ్మున కెనయు చెన్నునికి
దాపుగబారు ఉత్తరముఖంబుగను
స్నానమానది జేసి సరిగంచుపట్టు
కోకలుధరియించి కుంకుమపసుపు
తాల్చిగంధంబును తనువునబూసి
సంతోషమునబోయి స్వామియైనట్టి
చెన్నకేశవునకు జేసిజోహారు
దీపనైవేద్యముల్ తీరుగానిచ్చి
వైకుంఠశృంగార వనములోపలను
చెన్నారుఆనిమ్మ చెట్టునకేగి
చుట్టులెస్సగజేసి శుద్ధిచేయించి
అలికించిముగ్గుల అచటబెట్టించి
వనదేవతనుభక్తి వర్ణనచేసి
నయముగఆవాహ నంబుగావించి
* పలకలబావిలోపల నీరుముంచి
పాదులోపల గడుభక్తితోబోసి
సకలప్రకారోపచారముల్ చేసి
భూసురులందరు భుజియించుకొరకు
తగినవస్తువులిచ్చి తప్పకయుండ
ఫలములఆహార పటిమతగ్గించి
పరమేశుచెన్నుని భావించికొనుచు
ఎడపకదినముల నీలాగుజరుప
కొన్నాళ్ళకానిమ్మ కొమ్మలిగిర్చి
ఫలతతుల్గన్పించి పరిపక్వమాను
వర్షాంతమందనివార్యంపుభక్తి
చెట్టుఫలంబుల చెన్నునికిమ్ము
సంతానమబ్బును సంశయపడకు

* ఈ బావినిగుఱించి విచారింపఁగా నచ్చటి శ్రీ శాతంరాజు కృష్ణారావు వారీ తీరునఁ దెల్పినారు. పలకలబావియని పిలువఁబడు బావి యిప్పుడు మాచర్లలో లేదు. కాని చెన్నకేశవుని యాలయములో నీశాన్యభాగమం దొక బావిగలదు. అది బ్రహ్మనాయుని కాలమునఁ ద్రవ్వఁబడినదని ప్రతీతిగలదు. తత్పూర్వకపు శిలా దర్శిత పౌరాతన్యంబా ప్రతీతిని స్థిరీకరించుచున్నది. ఈ బావిలో మఱియొక చేదుడుబావి గలఁదట. నీరిప్పుడు నెండిపోవుటచేఁ దానినిఁజూచినవా రేరును లేరు. అగాధమై జనోపద్రవకరముగ నుండ రాతిపలకలతో మూసివేసి యుండురు. బహుశః దానివలన నీ బావికిఁ బలకలబావియని పేరువచ్చినదేమో. మఱియుఁ జంద్రవంకమధ్యభాగమం దొక తలుపులబావియున్నట్లు చాలమంది జనులు సాధారణముగాఁ జెప్పుదురు. ఈ తలుపులబావినే యొకప్పుడు పలకల బావియని పిలుచుచుండిరేమో!

మనుచుభూసురులెల్ల ఆడిరిగనుక
సంవత్సరమునిండ సల్పితివ్రతము
కడపటిదినమునకడు మోదమునను
పూజాదికంబుల పొందుగాతీర్చి

విప్రభార్యలనెల్ల బిల్వగబంచి
సకలోపచారముల్ సమ్మతిజేసి
చెట్టుఫలములను జిదిమి తెప్పించి
పసిడితోజేసిన పళ్ళెరంబందు
పోయించిభయభక్తి పూర్వంబుగాను
చేతులబట్టుక చెన్ననికడకు
వెడలితిచెల్లెంద్రు వేడుకతోడ
కానుకల్ మొదలగు కలవస్తువులను
కొనివెంటజనుదేర కూరిమిమీర
సర్వవాద్యంబులు సాంద్రతమ్రోయ
వారకాంతలునాట్య పళతచేజనగ
బహువిధగీతముల్ పాఠకుల్ చదువ
వివిధవిద్యలవారు వెన్వెంటరాగ
* చనిజమ్మివృక్షంపు సవ్యభాగమున
చెన్ననికెదుటను చిత్తముప్పొంగ
నిలిచితిమపుడేము నిశ్చలమతిని
పూజారివార లప్పుడుచనుదెంచి
తలుపులుతెరచిరి తాళముల్ దీసి
చిత్తజుజనకుని చెన్ననిరూపు
కన్నులపండువు గాగజూచితిమి

ఫలములుంచినజాలవల్లికస్వామి
కర్పించిశరణంబు నందెదమనుచు
చనువేళ చెన్నుడు సత్కృపమాని
పడమటిముఖమాయె భావమెట్టిదోకో

* ఈచెట్టునుగురించి శ్రీశాఖంరాజు కృష్ణారావువారీ క్రిందివృత్తాంతము నాకు వ్రాసిరి. ఈజమ్మివృక్ష మిప్పటికి 10సంవత్సరముల క్రిందటివఱకు చెన్నకేశవస్వామి కోవెలలో ధ్వజస్తంభమునకు నైఋతభాగమున నైదుగజముల దూరమున నున్న దని చూచినవారు చెప్పుచున్నారు. 20 సంవత్సరముల క్రిందటనే యిది నశించి నది. ఆచెట్టుచుట్టు వలయమేర్పడి మధ్యభాగము క్రిందనుండి పైభాగమువఱకు తొఱ్ఱ యయుండునదఁట. ఆ తొఱ్ఱపైన కొద్దికొమ్మలుమాత్ర ముండునవియఁట. దీనిని జూచినవారందఱు తమ తండ్రులు తాతలు ముత్తాతలెఱుఁగని పూర్వ కాలమునుండియు నావృక్ష మచ్చటనున్నట్లు చెప్పఁబడుచుండెనని వక్కా ణించుచున్నారు. బ్రహ్మనాయఁడు మాచర్లకురాకముందే యీచెట్టు చిన్న మొక్కగా నచట నుండెననియు, వచ్చినతరువాతఁ జెన్నకేశవుని యాలయము విస్తృతముచేసి కట్టించుచు నీచెట్టును గొట్టివేయక కడుమక్కువతోఁ బెంచి దాని యందు మిక్కిలి యనురాగముగలవాఁడై యుండెననియు నచ్చటి జనులం పూర్వకాలమునుండి పరంపరగాఁ జెప్పుకొనుచున్నారు. చెట్టు పూర్వమందు న్నట్లు పాఁదు మొదలయిన యస్ఫుటచిహ్నములు కాన్పించుచున్నవి.

తపియించె చిత్తమ్ము తత్సమయమున
సంచలించెనుగుండె ఝల్లుఁగదలె
గద్గదస్వరములు గళములగలిగె
తడఁబాటునడలకు దారొక్కెనె మేన
చెమటలుజారగ చీకట్లుగ్రమ్మె
పరవశంబునఁబడితిమా వేళ

తెలివొందియంతలో ధీరతనిల్పి
పటుతరరౌద్రంబు భావమందలర
పలికితినిబ్బంగి భయమింత లేక
అదియేమిస్వామి మాఅపరాధమేమి
తల్లియుం దండ్రియుం దైవంబుగురువు
నీవకాకితరంబు నెరుగమెవ్వారి
ఇహపరంబులకెల్ల ఇంటిదేవతవు
తనువులుప్రాణముల్ ధనధాన్యవితతి
పశుపుత్రమిత్రులు పరిజనంబంత
నీకధీనులు మేము నీసేవజేయు

వారమునూకెల్ల ప్రభుడవునీవు
మరవవుదాసుల మదిలోననెపుడు
నీవాడననుచును నిశ్చలబుద్ధి
శరణన్నమాత్రాన సంరక్షచేయ
* వ్రతమునాకంచును రామరూపమున
అనతియిచ్చితి వఖిలమువినగ
† సకలధర్మంబుల సరవిత్యజించి
నన్నొక్కనినె శరణంబంది తేని
సర్వపాపంబుల సమయజేయుదును
వగవకుమదిలోన వలదుభయంబు

సత్యమీమాటని సవ్యసాచికిని
దయతోడ కృష్ణావతారంబునందు
పలికినాడవుగాన భక్తితోసివె
శరణనియంటిమి చానలమేము
పడతులు మొరపెట్ట పాలనగలదు
వనితలరక్షించు వాడవునీవు
‡ గౌతమభామిని కాంచెపూతతను
శ్రీమించునీ పాదరేణువుచేత

---

* విభీషణుఁడన్నచే పరిభవింపఁబడి శరణార్థియై రామునివద్దకురాఁగా సుగ్రీవుఁడు రాక్షసమాయలు నమ్మరాదని శ్రీరామునితోఁ జెప్ప నతఁడు "**अभयं सर्वभूतेभ्यो ददाम्येतद्व्रतं मम**" (रा. यु) అని వాక్రుచ్చినట్లు రామాయణములో యుద్ధకాండమునందుఁ జెప్పఁబడినది.

† **सर्वधर्मान् परित्यज्य मामेकं शरणं व्रज । अहं त्वा सर्वपापेभ्यो मोक्षयिष्यामि मा शुचः ॥ (गी)** అని గీతాశాస్త్రంబున మోక్షసన్యాసయోగమునందు శ్రీకృష్ణుఁడు సెప్పిన వాక్యములనే శ్రీనాథుఁ డిచట సూచించియున్నాఁడు.

‡ ఈమెపే రహల్య. దేవేంద్రునితో సంగమించినదని భర్తయైన గౌతముఁ డీమెను శిల యగునట్లు శపించెను. తరువాత శ్రీరాముఁడు సీతను వివాహము చేసికొనుటకయి మిథిలాపట్టణమునకుఁ బోవుచు గౌతమాశ్రమమున నున్న యాశిలను దనపాదముతో స్పృశింపఁగనే శాపవిమోచనమై యహల్యశరీరము దాల్చెను.

కరుణచేకుబ్జకు * కాంక్షదీర్చితివి
వల్లవీజనముల వాంఛదీర్చితివి

† ద్రౌపదిమానము దక్కఁజేసితివి
‡ కాచితివుత్తర కడుప్రేమతోడ
పూనికాంతలనిట్లు పోషించినావు
ప్రాణులపోషింప భారంబునీది
మిక్కిలిదయగద్దు మెలతలయందు
ఈపట్లనీమది యినుమాయెనేమి
కటకటానీకింత కాఠిన్యమేల
నీచరణంబులె నెరనమ్మినాము
తిరిగిచూడవుమాకు దిక్కెవరయ్య
కరగదునీమది కాసంతయైన

ఈజీవనంబేల యీదేహమేల
నీకైనప్రాణముల్ నీకెఅర్పింతు
మబలలమనియెంచ అర్హంబుగాదు
నెత్తురునీమీద నిండజల్లెదము
చూడుమాసాహస స్ఫూర్తులనుచు
ఆగకరోషసమావేశమెసగ
ఒరలమట్టుకు కత్తు లురవడిదూసి
వక్షస్థలంబుల వదలకయుంచ

---

* ఈమె కంసునికి గంధము మొదలగు పరిమళద్రవ్యములు దెచ్చియిచ్చెడు పరిచారిక. ఈమె మఱుగుజ్జుదై వక్రదేహము గలిగియుండెను. శ్రీకృష్ణుఁడును బలరాముఁడునుగలసి వ్రేపల్లెనుండి మధురకుఁబోవునప్పుడు వివిధగంధద్రవ్యముల పాత్రను గంసునివద్దకుఁ గొనిపోవుచున్న కుబ్జనుఁజూచి యామెవద్దనున్న కలపముల పాత్ర నడిగి తీసికొని వారిద్దఱుఁబూసికొనిరి. శ్రీకృష్ణుఁడు కుబ్జనుమెచ్చి కొని యామెకుబ్జత్వము పోవునట్లనుగ్రహించెను.

† కపటద్యూతమున ధర్మరాజు పరాజితుఁడైనతరువాత సభాంతరమున కీడ్చితేఁబడ్డ ద్రౌపదియొక్క పుట్టంబులు దుర్యోధనునిశాసనమున దుశ్శాసనుఁడొలుచునప్పుడు శ్రీకృష్ణుఁడు కరుణించి యొకవస్త్రమువిడువఁగనే మఱియొక వస్త్ర మామెజఘనమండలమునఁ బాయకయుండునట్లుచేసి యామెమానముఁ గాపాడెను.

‡ సకలమైన పాండవసంతానము విషయంబుగ నశ్వత్థామ యస్త్రప్రమోచనంబు చేసినప్పు డయ్యస్త్ర ముత్తరగర్భంబుననున్న పిండమును హింసింప శ్రీకృష్ణుఁ డా పిండమును రక్షించెను.

మారుముఖంబాయె మగిడిచెన్నుండు
ఫలములపళ్లెంబు స్వామిసన్నిధిని
ఉత్సాహముననుంచి ఒయ్యనమ్రొక్కి
చేతులందట్టించి శిరములువంచి
కమలామనోహర గజరాజవరద
కాంచనాచలధీర కందర్పజనక
పక్షీంద్రవాహన పన్నగశయన
శశిరవిలోచన జలజాతనాభ
పరమదయాకర పాపవిదూర
కామితమందార ఘననీలవర్ణ
మాకాంక్షలీడేర్పు మాచర్లచెన్న
అనిసన్నుతులుచేసి అబలలమెల్ల
కనుచూపుపదముల గట్టిగానిలిపి
నియమంబుతోడుత నిల్చినవేళ
అర్చించువైష్ణవు నంతరమందు
ఆవేళమైపల్కె అందరువినగ
కోపింపమీమీద కూరిమికలదు
మనసులనిల్కడ మర్మంబుదెలియ
అరయంగదలచి నేనటుమల్లినాడ
భక్తికిమెచ్చితి భయమందగూడ
దనిపల్కునంతలో అధికవేగమున
పళ్లెంబులోపలి ఫలమొక్కటెగిరి
వచ్చినాచేతుల వ్రాలినచిత్త
ముబ్బంగిజోహారు లొయ్యనజేసి
గుడినుండివెల్వడి కోర్కెలుమీర
విజనమాడసకేగి విప్రభామినికి
ఫలమిచ్చిమాకెల్ల పంచియిమ్మన్న
ఎనిమిదిఖండంబు లేర్పడజేసి
ఆర్వురుకాంతల కారుఖండములు
మేరతోడుతనిచ్చి మేలైనదొకటి
నాచేతికందిచ్చి నాతితానొకటి
పుచ్చికొన్నప్పుడు పొలతితోనంటి
బ్రాహ్మణకులమున ప్రభవించినావు
సర్వజనముమీకు సాటిరాదగదు
పొలతిముందరనీవు భుజియింపవమ్మ
అటుమీద మేమెల్ల ఆరగించెదము
నావిని బ్రాహ్మణ నారిఆరీతి
చేసినతర్వాత చెలగిమేమంత
ఫలఖండములగొని భక్షణచేసి
కరముఖపాదముల్ కడిగిఆమీద
పోయిస్వామికిమ్రొక్కి పూజారివచ్చి
పొలుపొందతీర్థమ్ము మొదలైనవిచ్చి
చెలువైనపదపీఠి శిరములబెట్ట
వెనుకకునడచుచు వేడుకతోడ
మామాగృహములకు మరలినయప్డు
గర్భంబులాయెను కంటిరినిన్ను
చాలకష్టముమీద జనియించినావు
ననుబాసిపోవుట న్యాయమానీకు

(ఐతమ్మ శోకభరంబునం
బలవించుట.)

ఎలమితోనొక్కనా డెదుటలేకున్న
ప్రాణంబులేభంగి పట్టంగగలను

చనియెనుమీతండ్రి సమరంబొనర్ప
తోడునీవుండిన దుఃఖంబులేదు 13/10
పోషింతువీవని బుద్ధినమ్మితిని
పడ్డకష్టంబెల్ల పరులపాలాయె
సంతానహీనసై చాలదినములు
బహుళదుఃఖంబుల పాలైతికొడుక
స్వామికరుణచేత జనియించినాడ
వానాటనుండియు అడగెఖేదంబు
వేములుపూసెను వేములుకాసె
కడసారిఫలములు కాకులకాయె
మనుజరక్షణలేని మల్లెపూదోట
వడిచూరపోయిన వడుపయ్యెదండ్రి

జలముడుక్క పెనముపై చల్లినభంగి
కప్పినకుంపటి గాల్చినరీతి
అణగినవగపెల్ల అధికమైపారలె
నీడనిధానంబు నిలిచికన్నట్లు
వడ్లలోవజ్రంబు వడిగన్నమాడ్కి
గుడిజొచ్చిదేవు గన్గొనినవిధంబు
కంటినిపుత్రుడ కాంక్షతోనిన్ను
తాడెక్కుపురుషుని తల్లికిఅట్లె
గడమీదనాడు కర్కశునితల్లికిని
* శూరునితల్లికి సుఖమేమిలేదు

పందలై పుట్టిన బ్రతుకంగగలరు
ముందరనీవున్న మురిపెంబుమీరు
దూరాననిల్చిన దొడరునుజాలి
కుంతాలవారికి గురుదేవకృపను
సంతతికలిగెను చక్కగనంచు
సకలభూములజనుల్ సంతోషపడిరి
తప్పుజాచెనుగదా దైవమీవేళ
బవరంబునకు నేగ పైనమైనావు
వీరమాతలకును వీరభార్యలకు
విషమిచ్చియేగుట విహితంబునీకు

తరువాతమీతండ్రి దగ్గరకరుగు
మునియుట్లువగచెడు ఐతమ్మజూచి
బాలుడీగతి బల్కెపటుశౌర్యమలర
అమ్మరోయిబ్బంగి అడలగనేల

(బాలచంద్రుఁడు వీరధర్మప్రభా
వంబు దల్లికిఁ జెప్పుట)

కార్యమపురమందు ఘనపరాక్రమత
తండ్రులునిల్చుండి దండుచేయంగ
నేనింటనుండుట నీతియేతల్లి ?
ఉండుమంటకునీకు ఒప్పునామనసు ?
నీవెరుంగనిధర్మ మేనెరుగుదునె
ప్రాకృతభామల పగిదిబల్కెదవు

వెర్రితనంబేల వీరమానినికి
కాయమనిత్యంబు కల్మి హుళక్కి
జలబుద్బుదవిధంబు క్షణభంగురములు

* ["मा शूरं मा च पण्डितम्" అని కుంత్యుక్తత్వంతో ప్రసిద్ధమైనవచన మిట్లాటి అభిప్రాయాన్నే తెలుపుతున్నది.]

షట్చక్రవర్తులు సకలభూపతులు
చనిరి బ్రహ్మేంద్రాది సర్వదేవతలు
భూతంబులైదును పొలియుచునుండు
శౌర్యసత్కీర్తులు సమయవెన్నటికి
సకలపురాణముల్ సద్ధర్మకథలు
నీతిశాస్త్రంబులు నీవెరుంగుదువు
పౌరుషాధికతచే బ్రతుకుటలెస్స
జననమరణములం జనులకునిక్క
మాలయంబుననున్న అడవిలోనున్న
తప్పక తార్కాను తథ్యంబుగాను
పుణ్యలోకంబును బొందుమార్గముల
వినిపింతునేతల్లి విశదంబుగాను
* సజ్జనసంగతి సంసారమెడల
గురువుబోధించిన గురిమీదమనసు
నిలిపిమరణమొందు నిశ్చలుండొకడు
ప్రాజ్యసామ్రాజ్య సంరక్షణమందు
ఘనరణమ్మునరొమ్ము గాయాలనొంద
మనసుచలింపక మరణంబునొందు
శౌర్యపరాక్రమ సంపన్నుడొకడు
వీరలిద్దరులెస్స వినువీథికేగి
ఆదిత్యమండలం బరుదారచించి
పోయిపుణ్యంబుల భూమిజెందుదురు
మొదటికార్యముబూను ముఖ్యతలేదు
కార్యంబుచేమాను సంపాద్యమగును
వినిపింతు నికనొక్కవిహిత ధర్మంబు

(బాలచంద్రుడు స్వధర్మ నిరూప
ణంబు సేయుట.)

చిత్తంబునిల్పియు చెవియొగ్గి వినుము
ప్రప్రథమంబున బ్రహ్మనిర్మించె
పరవిప్రరాజన్య వైశ్యశూద్రులను
వేదవిద్యలయందు విప్రులనుంచె
రణకార్యములయందు రాజులనుంచె
క్రయవిక్రయాది కార్యంబులయందు
వైశ్యులనియమించి వశులగాజేసె
చర్చింపనీమూడు జాతులవారి
శుశ్రూషవులజేసె శూద్రులనెల్ల
సరవినాలవజాతి జననంబుమాకు
వెలమలమైతిమి వీరజీవనత
విప్రులసేవింప విజ్ఞానమొదవు
క్షత్రియసేవచే శౌర్యంబుగలుగు
కడువైశ్యసేవచే గలుగుసంపత్తి
మేమురాజులగొల్చి మెరయుచుండుదుము
విక్రమక్రమరూఢి వెలయుంటజేసి
తమసరిగా మమ్ముదయచేయుచుంద్రు
శస్త్రధారులకెల్ల సమరంబు † కూడు
శౌర్యంబుచాలించి సకలధర్మములు

---

* ఈ విషయమే శుక్రనీతియందుఁగూడఁ జతుర్థాధ్యాయములో సేనానిరూపణ మను షష్ఠప్రకరణంబునఁ జెప్పఁబడియున్నది.

† ఆహారము.

చేసినసత్కీర్తి చెందదుమాకు
మనువుబోధించిన మార్గమేయిదియౌ

పరమాత్మకృష్ణుండు ఖండనభూమి
సవ్యసాచికిదెల్పె సకలధర్మముల
అటుమీదజేయించె అధికరణంబు
జనులకుకష్టంబు సమకూరునపుడు
శ్రీవీరవీర్యంబు చెదరంగజేయు
దేశంబు పరనృపాధీనమానపుడు
శ్రీవీరసత్వంబు చిక్కంగబట్టు
సామ్రాజ్యతరువెండి చచ్చెడునపుడు
శ్రీవీరరక్తంబు చిగిరింపజేయు
రాజసేవకులకు రణమేసుఖంబు.

ఇదిగాకయింకొక్క హేతువువినుమి
* అలరాజు కాముచే హతుడైనవెనుక
కొమ్మభూమీశుండు కోపించినపుడు
అనఘుడునాకండ్రి నాచెయ్యిబట్టి
కొనిపోయిఒప్పించె కొమ్మభూపతికి
తీర్చునుమనపగ ధీరుడితండె
యిల్లడచేసితినే బాలచంద్రు
అనిపల్కెనోయమ్మ అరమరలేక
ఆనాటనుండియు ఆఒప్పగింత
నాటియున్నదిసువ్వె నామదియందు

ఆహారనిద్రల కరుగదుమనసు
కార్యమీవేళను గదిసెనుపూని
ప్రాణమైననునిత్తు పగయైనదీర్తు
తప్పితేవారికి దాసుండనగుదు

మనసొప్పదిందుకు మముగన్నతల్లి
అరలేకచెప్పితి అంతరంగంబు
బిరుదుకొమరుడగాని పిన్ననుగాను
మగువలుండెడు నట్టిమందిరంబందు
ఉండుటకొమరుల కుచితకార్యంబె
యెక్కువపల్కకయిక నూరకుండు

జననమరణములు చాలుపుమనకు
పుట్టుపుట్టువునకు పుత్రులునీకు
జన్మజన్మంబున జననులునాకు
కలుగుచుండుదు రిదికమలజునియతి
దుఃఖింపబనిలేదు తోయజగంధి
దీవించినన్నంపు ధీరతతోడ
భయమందకీలాగు బాలుడుపలుక

(భార్యకుజెప్పి యుద్ధమునకేగుమని
బాలచంద్రునితో నైతమ్మచెప్పుట.)

ఐతమ్మకొడుకుతో అనియెనీరీతి
సమరంబునకునేగు శౌర్యవంతులకు
తల్లిదీవనబొంది తగభార్యచేత

దీవనగొనిపోవ తేజంబుసుమ్ము
నడచిరిపెద్దలీనయమార్గమునను
మనసుంచినామాట మన్నింపుసుతుడ
అనవిని ఐతమ్మకనియె బాలుండు
తల్లినీదీవన తరుగదుమాకు
కులకాంతదీవన కొనుటయేలాగు
నాగుర్తెరుంగదు నాతిమాంచాల

* మూడవ పుటలో వివరణపఙ్క్తి చూడదగును.

యేనాపెపోలిక యెట్టిదోయెరుగ
మనయిల్లెరుంగదు మగువమాంచాల
చానయింటికి నేను చనుటయే లేదు

నీమాటవినకున్న నీతి కాదనుచు
వేగంబపోయిన ప్రియురాలుకినిసి
తప్పులెన్నును చిన్నతనమగునాకు
సాహసల్ మూర్ఖలు సకియలెల్లెడల
మాటమంచిదిగాని మనసుకత్తెరయె
పూర్వజన్మఫలంబు పొందికబట్టి
ఆలుమగలజేసె అజుడుమమ్ములను
నాభాగ్యమేమియు నాతియెరుంగ
దింతికిదుఃఖంబు హెచ్చుగనుండె
అపరాధమధికంబె అమ్మనాయందు

ఈసమయంబున నేనేగరాదు
నాతులభావముల్ నమ్మగలేను
నావినిసుతునకు నాతియిట్లనియె

(ఐతాంబ మాంచాలదగ్గర
కేగుట.)

ఆటజనివృత్తాంత మారసివత్తు
ఇచ్చటనేయుండు మెచటికిబోక
అనుచు నేరాండ్రు తానందిలాలెక్కి
* గండువారింటికి గ్రక్కునజనిరి
ముత్యాలలఘువమ్మ ముందరనేగ
ఘనమైన పేర్నేని గౌరమ్మయరిగె
దంటగావెన్వెంట దాదులువెడలి

రైతమ్మయీరీతి ఆనందగరిమ
వచ్చుటగ్రహియించి వారనిప్రీతి
† చెలువొందరేఖాంబ చెల్లెంద్రనెల్ల
వివరించిపిలిచెను వేడుకతోడ
వెలమనాయునిభీమ వేగమేరమ్ము
మలినేనియాచమ మముజేరరమ్ము
పినమలినాయుని ప్రియురాలవైన
చందమ్మయిచటికి చయ్యనరమ్ము
గోపినాయునికూర్మి కులకాంతలక్ష్మి
ననుజేరరావమ్మ నాతియటంచు

పిలిచినవచ్చిరి ప్రియమెసలార
వారునుదానును వాంఛలుమీర
ఐతమ్మకెదురుగ ఆరిగికొంపోయి
కనకపీఠంబుల గరిమతోనుంచ
అప్పుడు మేడపై అలరుచున్న
మంచాలదిగివచ్చి మర్యాదయెసగ
అత్తలకెల్ల దానమరంగమ్రొక్కి
కస్తూరిపునుగును గలిపినయట్టి
చందనమ్మునలంది సకియలకపుడు
చేకట్లుకడియముల్ చెలువుగనిచ్చె

మరియును మాణిక్యమయమైనభూష
లందరికినొసంగి హర్షమొందింప
కోమలులందరు కూర్చున్నవేళ
పదినెయూ ఐతమ్మవదనంబుచూచి
వినయంబుతోడుత వెలదిరేఖాంబ

---

* బాలచంద్రునిమామయైన కన్నమనీని యింటిపేరు.

† ఈమె కన్నమనీని భార్య. బాలచంద్రుని యత్త. మంచాలయొక్క తల్లి.

అక్కలుచెల్లెండ్రు అత్యంతకరుణ
అందోళి కారూఢలగుచుమీరల్ల
మముజూడవచ్చుట మాభాగ్యమరయ
మీరువచ్చినపని మీకోడలైన
మరునిపట్టపుదంతిమాంచాలయెరుగు

తక్కినవారికితరముకాదనెను
తనతల్లిమాటకు తనయమాంచాల
నవ్వుచువాక్రుచ్చెనయభావమునను
మాఅత్తతనకొడుక్కు మగటిమిచెలగ
ఆజిరంగంబున కరిగెదనన్న
అలుదీవనగాని అరుగుమాయనెను
మొగముచెల్లమిరాక మొగిదలవంచె
పిలిపింపుమనివచ్చె వేగనాకడకు
బ్రహ్మగూర్చెనుమమ్ము బాల్యంబునందు
నమరానఅతఁడు సమసినవెనుక

14/10

వెంటనేగెదఅత్త వినుపుమీమాట
పంపుము పుత్రుని బవరంబుచేయ
అనినభీతిల్లుచు ఐతాంబవలికె
పరమపాతివ్రత్య పావనమూర్తి
పతిభక్తిగల్గిన పద్మాయతాక్షి
నేనువచ్చినకార్య మీవెరింగియును
ఇబ్భంగిబలుక్కట యేటిక్రమంబు ?
పతినెడబాయుట భావ్యంబెనీకు
నేరంబులతనివి నిలుపకుమదిని
రట్టుచేసితివేని రాడువాడిటకు

నిన్నువీక్షించిన నిలుపంగనోపు
అనియిట్లుపలికిన అత్తకుమ్రొక్కి
వాక్రుచ్చెమాంచాల ప్రౌఢభావమున
ఇసుమంతనాసౌఖ్య మెరుగడునీదు
తనయుండో అత్తరో దైవంబుకెరుక
పాపపుమాటలు పలుకంగవలదు
వెలయఘటించుట వేశ్యగేహమున
విడియంబుచేయుట వెలయాలియింట
సౌఖ్యంబుపొందుట సానిధామమున
నానోముఫలమే మొ నగినజానియతి

చేసినన్ విడిపింప జేసెనానాతి
భోగంబునొందెదు పొలతులువారు
చావనోచినయట్టి సకియనునేను
సరిచేసియీమాట సభనెన్నరాదు
నీపుత్రునడవడి నీచిత్తమెరుగు
నీవుకర్తవిమాకు నేమివాక్రుత్తు
ఆడవలయుమాట లాడితిగాని
నీబుద్ధికెన్నదు నేవెలిగాను
తెరవరోమదిని సంశయముడువదలి
పంపుముబాలుని పగతీర్చుటకును

పోయెడుపయనంపు బుద్ధిమాన్పింతు
ఏడేండ్లనుండితా నేమారనట్టి
వేశ్యపైమోహంబు విడువనొనర్తు
నీయానసిద్ధంబు నేకల్లలాడ
అనిపల్కికోడలి నాలింగనంబు
చేసిపుత్తడికమ్మి చీరలురత్న
కాంచనమయమైన ఘనభూషణములు
పెట్టికోడలికప్పు ప్రియమేపుమీర
కొల్వులోపలినుండి గొబ్బునలేచి

వియ్యపురాలిని వెసకౌగిలించి
కోర్కెతో శీలాంబ కోడండ్రుతిరిగి
అందలంబులనెక్కి అతులమోదమున
తమతమయిండ్లకు దారేగిరప్పు
డైతాంబసుతుజూచి అనియెనీరీతి
రావయ్యబాలుడ రాజులదిగుల
గండువారింటికి గదలంగవచ్చు
అలిచేదీవన నందంగవచ్చు
అనిచెప్పిపుత్రుని కధికధనంబు
మాడలుచీరలు మణిభూషణములు
సురభియైనట్టి కస్తూరిచందనము
బాగాలుచక్కని పక్వపర్ణములు
తగువారిచేనంపె తనయునివెంట
బ్రాహ్మణజనులకు భట్రాజులకును
ఆటపాటలవారి కఖిలార్థితతికి
దాసజనాళికి దాదులకెల్ల
దానంబొనర్పుము తగినమార్గమున
అత్తలుమొదలుగ అంగనాతతికి
వినయంబుతోనిమ్ము వేర్వేరసొమ్ము
రాజుకుమంత్రియై రంజిల్లుచున్న
బ్రహ్మన్నసుతుడవు పటుదాతవరయ
అర్థంబుగలవారి కల్లుడవీవు
కీర్తిసంగ్రహబుద్ధి కీలింపుమదిని
అనిచెప్పిచనుమన అధికసాహసుడు
పొమ్మన్నమాటకు పూనెహర్షంబు
వృద్ధశీలాంబకు వేడ్కతోమ్రొక్కి
ఐతాంబమొదలైన అమ్మలనెల్ల
తిన్నగసేవించి దీవనవడసి
యెలమినితమ్ములు నిరుదెసగొలువ
బ్రాహ్మణుల్ దీవింప భట్టులుపొగడ
ఆటపాటలవార రాడుచురాగ
సానిగేహమునకు చయ్యననేగి
వాకిటిముందర బాలుండునిలిచె
* శ్యామాంగియప్పుడు సకియనుజూచి
బడలియున్నదటంచు పలుకుముపోయి

(బాలచంద్రుఁడు వేశ్యయింటికిఁ జనుట.)

అనగనాసకియ బయటికినేతెంచి
తలనొప్పిచేజిక్కి తమమొక్కనేడు
పాన్పుపైబొరలుచు బాధనొందుచును
ఉన్నదియంచును ఒయ్యనచెప్ప
బాలచంద్రుడువిని పలికెనీరీతి
గరిమకార్యముపూడి కలనికినేను
పోవుచుధనమిచ్చి పోవలెనంచు
వచ్చితినింతలో వనితగర్వించి
ప్రేమమైసిరిరాక పెడచేతద్రోసె
భామకిప్పట్టున భాగ్యంబులేదు
దైవమీయదుసొమ్ము తరుణికివేళ
అనవినిచనిఆవె ఆవార్తచెప్ప

* బాలచంద్రుని వేశ్య సబ్బమ యని, సబ్బాయి యని ఈమెకు ఖ్యాత నామములు.

శ్యామాంగిత త్తరమంది తాలేచి
త్వరగనాయతమాయె బాలునిబిల్వ
కస్తూరిజవ్వాజి కలిపినయట్టి

మలయజమోపిక మైనిండనలది
చెలగుచుజాళువా చీరధరించి
రాజిల్లుహొంబట్టు రవికనుదొడిగి
కుంతలంబులదువ్వి కొప్పునుబెట్టి
అలరుచునవరత్న హారచయంబు
వక్షోజయుగళంబుపై చిందులాడ
గళమునదాలిచి కరములయందు
హేమకంకణములు హెచ్చుగమెరయ
చక్కనిముత్యాల జల్లులునమర
సౌందర్యఖనియైన శ్యామాంగియపుడు

వివిధచిత్రంబుల వెలయుచునున్న
సౌధంబుపైకెక్కి స్వప్రతిబింబ
మద్దంబులోజూచి అటునిటుదిద్ది
అంతటదిగివచ్చి హర్షముప్పొంగ
వీరులందరికిని విడియములొసగుచు
కడువేడ్కబాలుని గానగబోయి
పన్నీరుదప్పించి పదములగడిగి
యొనమంద్రకప్పుడ యిచ్చివిద్యములు
వెలదిబాలునికట్ట విడువకపట్టి
మేడపైకెక్కించె మెలతసౌందర్య
మహిమమాచిరణంబు మరచెబాలుండు.
ద్వారసమీపాన తమ్ములందరును
కనిపెట్టియుండిరి కడుభక్తిమీర
బాలుడుపవళించె పట్టెమంచమున

(బాలచంద్రుఁడు వేశ్యమాయలకు
లోఁబడుట.)

చెలియప్రేమ పరీక్షచేయుటకొరకు
తలవాంచియుండెను దరుణినంటకయె
బాలునిభావంబు పల్లటిల్లుటను
తెలిసిఆశ్యామాంగి తిన్నగననియె
నినుబాసిదినములు నేటికైదాయె
ఐదేండ్లవలెదోచె అక్కటనేను

నీకుసంతసమిచ్చు నెలతనుగాను
కరుణనాపైదప్పె కాంతుడనీకు
దయదప్పినప్పుడెంతగ వచించినను
నీమదికెక్కదు నేనేమొనర్తు
నామనంబెరుగును నావికారంబు
విరహతాపముదొట్టి వేసటపుట్టి
* పదియవస్థలుమేన ప్రాప్తించిమించ
బహువేదనలబడి పారంబులేక

* ఈయవస్థలు మన్మథావస్థలనఁబడును. కామశాస్త్రనుసారముగా నివి పండ్రెండుకాని యాలంకారికులుమాత్రము పదియనియే విశేషించి చెప్పియున్నారు. భావప్రకాశకారుఁ డీటిరున దెలిపెను. "दशधा मन्मथावस्था भवद्[illegible] वा। इच्छोत्कण्ठाभिलाषाश्च चिन्ता स्मृतिगुणस्तुती। उद्वेगोऽथ प्रलापः स्यादुन्मादो व्याधिरेव च।

ఉసురసురంచును నుడుగనిజాలి
భావంబులోనుండి భయమునుబొంది
తనువుకంపింపగ తగుమాటమరచి
యెప్పుడునీరూపు నేజూతునంచు
వాక్యంబుపల్కన వగరుపుట్టు
నిట్టూర్పువిడుచుచు నిన్నెచింతించి
పారిసిగ్గువిడిచియుం భుజియింపమాని
తపియింప దేహంబు తరచైన కాక
తడబడసాలుక తల్లడంబంది
జీవంబుదోలగంగ చింతయొనర్చి
పరవశంబుననుంటి పానుపుమీద
తలనొప్పిఘనమాయె తాపంబు హెచ్చె
నీవువచ్చుటజేసి నీమాటవింటి
అడగెనుతలనొప్పి అనిమేషమున
ఎంతగనీమీద నేమోహపడిన
నీమదిదయలేదు నేనేమి చేయ
అనితలవాలిచి శ్యామాంగియపుడు
కన్నీటిబిందువుల్ క్రక్కునజారి
వక్షస్థలంబున వరదలై పార
విహ్వలభావయై విలపింపదొడగె
బాలుడుముందరి పాటెరుంగకయ
పట్టిదుఃఖంబని భావింపలేక
కామాంధకారంబు కన్నులదట్టి
శ్యామాంగినతిప్రేమ అక్కున జేర్చి
కాటుకచెదరంగ కన్నీరుతుడిచి
చెదరినకురులను చిక్కులుదీసి
సీమంత మొగిదీర్చి చేర్చుక్కనిలిపి
కౌగిటబిగియించి కాంచనరత్న

---

**जाड्यं मरणमित्याद्ये द्वैकैश्च द्वर्जिते बुधैः**'' [మన్మథావస్థలు పది లేక పండ్రెండువిధములు. 1 ఇచ్ఛ (కోరిక), 2 ఉత్కంఠ (కోరినవానినిఁ బొందుట యందలి తహతహ), 3 అభిలాషము (సర్వాంగ సుందరుఁడైన పురుషునిఁ జూచినప్పుడుగాని విన్నప్పుడుగాని జనించు స్పృహ), 4 చింత (విచారము), 5 స్మృతి (తలఁచుకొనుట), 6 గుణస్తుతి(గుణములనుతించుట), 7 ఉద్వేగము (భయము), 8 ప్రలాపము (ప్రియసంశ్లిష్టగుణములఁ బలవరించుట), 9 ఉన్మాదము (చేతనాచేతనములయందుఁ దుల్యవర్తిత్వము), 10 వ్యాధి (తాపాధిక్యము), 11 జాడ్యము (శూన్యాంతఃకరణత్వము), 12 మరణము (మరణార్థమై ప్రయత్నము) అని పండ్రెండు మన్మథావస్థలు. వీనిలో మొదటిరెంటినిఁ గొంతమంది బుధులు విడిచిపెట్టెదరు. (కనుక అభిలాషము మొదలుకొని మరణమువరకుఁ బదియవస్థలగును]. ధనంజయుఁడు పదియనియే చెప్పినాఁడు. ''**दशावस्थः स तत्रादावभिलषोऽथ चिन्तनं। स्मृतिर्गुणकथोद्वेगप्रलापोन्मादसंज्वराः। जडता मरणंचेति दुरवस्थं यथोत्तरम्**''(द). అని దశరూపకము.

హారంబు లెదమీద నమరికచేసి
కెరలి మోహమున చెక్కిళ్లుముద్దాడి
యేనూరుమాడల నిచ్చె కామినికి
బాలునిగనుగొని పల్కెనాలేమ

పైనమైవచ్చిన భావంబుతోఁ జె
తెలుపగావలెనాకు తిన్ననికరుణ
అన విని వాక్రుచ్చె అపుడు బాలుండు
చెలగి కార్యమపూడి శ్రీరయుద్ధభూమి
వీరులగలయంగ వెసబోవుచుంటి
ప్రియురాలివని నిన్ను బిలుపవచ్చితిని
కరువడినీవును పైనమైరమ్ము
జాగు చేయకుమన్న సకియ తానవ్వి
బాలుడ నీకేల పట్టెను వెర్రి
యెక్కడిమోహం బదెక్కడిపొందు

సరసుడవౌదువు సాటినీకెవ్వ
రీయెడనీబుద్ధి యెక్కడికేగె
కాని సొమ్మునకీవు కాంక్షచేసెదవు
జగములోనిటువంటి సమయంబుగలదె
అడవిలోగాసిన అమ్లఫలంబు
ఉదధిలోలవణంబు నొగిగూడినట్లు
జరిగెనీకును నాకు సంగతివినుము
సరిలేని ఇహసౌఖ్య సాధనాలేము
పరసౌఖ్యమునకు నీకడతిసాధనము

(బాలుఁడు వారకాంతలఁ దూల
నాడుట.)

అని పల్క విని బాలుడాగ్రహమొప్ప
సరవిముందరనున్న శ్యామాంగిజూచి
కుటిలాత్మురాల నీ గుణములు తెలిసె
మటుమాయ చేజిక్కి మానముధనము
నీపాలు చేసితి నేగానకైతి
కామాంధకారంబు కష్టపువిద్య
నీతిమాలినచర్య నేటికిదలిసె
ఇంటిలోభోజనం బిచ్చకురాక
పరులయెంగిలికాస పడితిని గాదె
అనిదూరికోపించి అమహామహుడు
కాలాగ్నిరుద్రుడై కనలుచు లేచి

పోవగ శ్యామాంగి పోనీకపట్టి
పకపకనవ్వుచు బాలునికనియె
నీబుద్ధి పేదది నినునమ్మరాదు
నీమదినిల్కడ నేగాంచగోరి

(శ్యామాంగి మాయాలాపంబు
లాడుట.)

పలికితి తప్పుగ భావించనేల?
పురుషులనమ్మంగబోలదటంచు
మాటికిజెప్పిరి మా పెద్దలెల్ల
పత్త్రాగ్రములయందు పట్టుకన్రేలు
జలబిందుతతివలె చలనంబునొందు
మనసౌకచందంబు మాటొకతీరు 15/10
స్వాధీనుడంగన పార్శ్వమందున్న
ఇల్లు వెళ్లినవాని నెవరుపట్టెదరు
క్రొత్తలపైకెస్స కూరిమినిలిపి
ప్రాతలవిడనాడు భావముంచుదురు
తమతప్పులేమియుం దలపరులోన
ఒకరితప్పులనెన్న నోదరుసుమ్ము

కరుణకుమూలంబు కాంతకోపంబు
సాహసంబొసరింత్రు శౌర్యసంపన్ను
లందు చేమనమున అలుగంగరాదు
మనలోనభేదంబు మానుటనీతి

నరికితేజలములు నడిమికిదగవు
తరువును లతయును దంటగానుండ
చెట్టువినాశంబు చెందినయపుడు
తీగెకాధారంబు తిన్నగజెడును
తీగెనాశంబున చెడిపోదుచెట్టు
మనసున నీభంగి మరవగవలదు
తగదీగెచేనాదు తరువవునీవు
భూమిలోకాంతకు పురుషుడాదరువు
* మాయక్కకంటెను మరివేగమునను
నీతోడవైకుంఠ నిలయంబుచూతు

అనిన బాలుడుమెచ్చె అంగననపుడు
చయ్యన అగసాలచంద్రుని బిలిచి
వేయిమాడలనిమ్ము వెలదికిననిన
ఇచ్చెను గైకొనె ఇందీవరాక్షి
మాపెద్దలకునీవు మక్కువనోలి
యిప్పింపుమనిచెప్పి యింటికిశీఘ్రముగ
దాసిచేబిలిపించె తమతల్లినపుడు

(వేశ్యమాత బాలునిఁ గదియుట.)

కోలివంటిది వృద్ధ గురుకోపయుక్త
కోలపట్టుకవచ్చె కూతురుకడకు
విరిగినకొండియు వ్రేలుచన్దోయి
ఊరిసిపోయినబళ్లనూచలుకాళ్లు
వంగిననడుమును వదలినపండ్లు
పీలచేతులుగూని పీనుగుమోము
చిక్కగనరిసిన చింపిరితలయును
వ్రాలినబొమముడి వదిలినమేను

మెడమీదకణతియు మీగాళ్లపూత
పలుచనిగడ్డంబు పైనిపుల్పిరియు
మూతిమీసపుమొల్క ముక్కురోమములు
తలవడంకును మాట తబ్బిబ్బుమరపు
కంపుగొట్టుచుచొల్లుగారెడునోరు

కన్నులపుసులును కాంతిమిక్కుటము
సొక్కుచునీల్గుచు సోలుచువచ్చి
చేవెలుంగునబాలు చెచ్చెరజూచి
ఒరుగుపోయిననోటి నొయ్యనదెరచి
పలికె కంపముమీర బాలునితోడ

దొరలజూచినయంత తొలగంగవలయు
వారితోపొందైన వడిసుడివచ్చు
మాసరివారితో మాలిమిమేలు
తగినఅతడుమాకు దక్కినయెడల
చేనికికాపగు చెప్పినపనులు

భక్తిమైచేయును పశువులునెరయు
అలసిసొలసినప్పు డాదరువగును
ముక్కుకుగానట్టి ముత్యంబువలదు
నామాటవినుమని నాశక్తికొలది
చెప్పినవివదాయె చెలియనేమందు

* బాలచంద్రుని భార్యయైన మాంచాల.

కడసారిదయచేయం గలవారిపొందు
నీకేమిచేసితో నీకేమరగెను
నిశ్చయించెనుభామ నీవెంటజనగ
బ్రతుకుమాదిద్దరి పాలుచేసెనో కో
ఒకనాడుమాయింటి కొయ్యనవచ్చి

వేడినసొమ్మిచ్చు విటకానికైన
చిక్కులబెట్టుదు చీకాకొనర్తు
సంప్రదాయంబిది సకలవేశ్యలకు
మనసునీపాలాయె మమ్మెల్లవిడిచె
అనుకొన్నఫలమేమి ఆపెకెతెలియు
మెల్లనిమాటకు మీరదునీకు
నేనుగద్దించిన నిలువదుమ్రోల
తెలిసియేయుండు నాతీరులోకమున
సర్వకాలమునేను సాకినదాన
సత్యంబునీవెంట సాగిపోనీయ

కెరలిననాతోడ గెల్వరెవ్వారు
అనుచుతొడచరచి ఆగ్రహమంది
అడిగినద్రవ్యంబు నలరనాకిమ్ము
నీవెంటపంపింతు నెలతనునేను
సమ్మతిదీవింతు సర్వేశునాన
వెలయగబండ్రెండు వేలరొక్కంబు
ఎలమినుంతువగాగ ఇప్పింపుమన్న
అవిచారముగబాలు డందుకునొప్పి
వెలమలదోర్న్నిని వేగంబపిలిచి
యేడువేలధనంబు నింటికినిమ్ము

కూరిమితమ్ముడ కుమ్మరిపట్టి
మూడువేలధనంబు ముదిదానికిమ్ము
కంసాలిచందన్న కడమవిరెండు
వేలమాడలనిమ్ము వృద్ధభామినికి
అనిచెప్పియిప్పింప అతివదాగొనియు
కరములుముకుళించి గ్రక్కునమ్రొక్కి
ముదివానరమువంటి ముదుసలిపలికె
చక్కదనముకుప్ప సరసంపుతెప్ప
మదనునిబాణంబు మాకుప్రాణంబు
దక్కించికొంటివి తగనిటువంటి

పుత్తడిబొమ్మ నీపుణ్యముకతన
చేరినదూరక సిద్ధించునట్లు
పట్టుపచ్చడమిమ్ము భక్తితోనాకు
నీమారుగాజూతు నేపెద్దదాన
అనుచువేడిననిచ్చె అప్పుడునవ్వి
యింతిదాబుచ్చుక యింటికినేగె
ఈరీతిదనతల్లి యేగినవెనుక
బాలచంద్రునితోడ పల్కెశ్యామాంగి
ఉల్లంబుచల్లనై ఉత్సాహమొదవె
ఎల్లికార్యమకూడి కేగంగవలయుం

మల్లభూమీశుని మన్ననపడసి
గొల్లెనలోపల కొలువులోనుండి
ముదిలోననన్నూర్చి మరిచిపోయెదవు
రాజులునెలవీక రారాదుమరలి
యెన్నినాళ్లగునో యీకార్యసరణి
అన్నపుఖర్చున కాకుపోకలకు
ఈనున్నదేమైన ఇపుడెయిప్పింపు
మనినబాలుడువిని హర్షంబునొంది
చయ్యనకంసాలిచంద్రునిపిలిచి

ఈపెరునాల్గువేలిమ్ము తమ్ముండ

అనినమంచిదియంచు నందరివద్ద
అరసిఆద్రవ్యంబు నంతయునిచ్చె
తరువాతబాలుండు తరుణినిజూచి
పైనమైయుందుము పద్మాయతాక్షి
ఘనతకార్యమఖూడి కదనరంగంబు

చూపింతునీమది చోద్యమందంగ
అనిచెప్పిఒప్పించి అనుజులుదాను
శ్యామాంగిసదనంబు చయ్యనవిడిచి
పంచవాద్యంబుల పటలిమ్రోయంగ
బ్రాహ్మణుల్ దీవింప భట్లుపొగడగ

ఆనందమునవీథి కపుడరుదెంచి
గుంపులైయున్న భిక్షువులనుగాంచి
వీరికందరికిని వేడినధనము
దూరిమినొసగుము తమ్మరపట్టి
అనిపల్కెబాలుని నాతడుచూచి

తల్లియిచ్చినయట్టి ద్రవ్యమంతయును
వ్యయమయ్యెనేభంగి అర్థులకిత్తు
అనిచెప్పతమ్ముల నందరిబిలిచి
అడిగినవారల్ల ననిరివ్విధమున
ఆసమయంబున ఆనపోతులేచి

పటుకోపమునబల్కె బాలునితోడ
ఇంతగర్వంబేల యీమదమేల

(ఆనపోతు బాలచంద్రుని
ప్రవర్తనను దెగడుట.)

కామాంధకారంబు కన్నులదట్టి
క్రిందుమీదెరుగక కేరుచున్నావు
కలధనమెల్ల బోగముదానికిచ్చి
చేసితిపాపంబు చెడ్డవెచ్చంబు
ఇహపరదూరపు టీవృత్తియేమి ?
శ్యామాంగిపైప్రేమ సర్వనాశంబు
సానిదానికిమ్రొక్కి సొమ్మెల్లనిచ్చి
యిందరినడిగిన నేమిలాభంబు

వారకాంతలరీతి వర్ణింపరాదు
బిడ్డలనొసగక ప్రియురాలికీక
చీమలుగూర్చిన చెలువునగూర్చి
ధనవంతులగువారి ధనమెల్లదోచి
* ముంజికాండ్రను జేసి మురిపెమడంప
వ్యర్థులైవిటవృత్తి వసుమతిమీద
పోయిరిబ్రతికెడు పొందికలేక
ఉర్విపైవేశ్యలకోలియిచ్చుటలు
వినలేదుకనలేదు వేడబంబిడ్డి
అనిదూరిపలికిన ఆబాలుడరసి

తలపంచిమరుమాట తానాడలేక
వెలమలదోర్నిని వేగమెపిలిచి
మలిచుట్టుతప్పించి మాణిక్యఖచిత
కనకమయూంచిత కటిసూత్రమపుడు

* బ్రహ్మచారులు.

తీసి చేతికొసంగి దీనిమూల్యంబు
బ్రాహ్మణులకునిమ్ము భట్టులకిమ్ము
బీదవారలకిమ్ము భిక్షులకిమ్ము
నావుడాతండు ధనంబు తెప్పించి
సకలార్థులకునిచ్చె సంతుష్టులైరి
తరువాత బాలుండు తాత్పర్యమొప్ప

(బాలచంద్రుఁడు గండువారింటి కేగుట.)

వైభవంబునగండు వారింటికేగ
విపణిమార్గంబుల వెలయుంచురాగ
వరవిప్రకాంతలు వడితోడవచ్చి
హారతులిచ్చినా రానందమొదవ
పలుకానుకలొసంగె బ్రాహ్మణజనము
బాలుండుశృంగార భరితమైయొప్ప
గండువారిగృహము కదిసిఆవేళ
మాణిక్యతోరణ మండితంబైన
ద్వారమునంజొచ్చి దాటుచుజూచె
ఘనచిత్రకర్మసంకలితపటాలి

గోడలుకనరాక గుత్తమానట్లు
చేసివితానంబు చెలువొప్పగట్టి
సరసంబొనర్చిన చవికెలోపలను
రత్నకంబళముల రామణీయకము
అరసిచూచుచు బాలు డాసీనుడయ్యె
తమ్ములందరువచ్చి తగినతావులను
వసియించిరచ్చట వైభవంబలర
ద్రాక్షాగుళుచ్ఛముల్ దాడిమ్మపండ్లు
నారికేళాదులు నారింజపండ్లు
జాలవల్లికలతో నరగునదెచ్చి

ముందరనిల్పిరి ముదముమీరంగ
వింజామరంబులు విసరిరిలెస్స
బాలుండు సురరాజు భంగిగన్పట్టె
కనుగొన్నవారల కన్నులకప్పు
డలరంగ చెలికత్తె లమితహర్షమున
మంచాలనకుపుగ మక్కువతోడ
శృంగారమొనరించు చిత్తంబులుంచి

(చెలికత్తెలు మంచాల నలంకరించుట.)

సంపెంగతైలంబు చయ్యనదెచ్చి
మగువకుశిరసంటి మంచిగంధమున
ఆటకలిరాచియు అనుంగెపోవ

బంగారుబిందెల పన్నీరుతెచ్చి
స్నానమాడించిరి సంతసంబొప్ప
తడితీర్చిరప్పుడు తగినవస్త్రమున
ఒకపాడివసనంబు నొప్పుగగట్టి
కూర్చుండబెట్టిరి గురుహేమపీఠి

బంభరచయమును భయమందజేసి
కాటుకకాకచే కందగజేసి
చీకటిగుహలలో జేరగదించి
కాలాంబుదంబుల గట్టులజేర్చి
దీర్ఘమైనునుపైతి తీరైనకురుల 16/10

కూర్చినున్నగదువ్వి కొప్పుగీలించి
బంగారుపూచేర్లు బాగుగాజుట్టి
మదనుకుంతముకు సమంపుపాపటను
మణిహేమమౌక్తిక మండితంబైన

చేర్చుకొక్కెరిచి చిత్రంబుగాను
పాలుపొందకశిరవి భూషణయుగము
పాపటకిరువంక భాసిల్లనిలిపి
మాణిక్యహాటక మయబింబమొకటి
తలవెన్క మెరయగ దట్టించిరెలమి
నగముచంద్రునితోడ నమమైనయట్టి

ఘనఫాలదేశంబు కాంతులుగ్రక్క
నిఖిలజగత్తుల నిర్జించునట్టి
కందర్పువిండ్లను ఖండించివైచు
బొమలుకంటికిమధ్య పొందికగాను
కస్తూరిబిందువు ఘటనగావించి

ముక్కునముత్యంబు ముంగరనిలిపి
చంద్రఖండంబుల సారెకుదూరు
గండభాగంబుల కస్తూరితోడ
మకరికాపత్రముల్ మానుగవ్రాసి
శ్రీనవసంఖ్యల చిరునవ్వునవ్వ

వీనులు మితిలేని విభవంబునొంద
దీపితరత్నమౌక్తిక హేమయుక్త
తాటంకభూషణ ద్వయముగీలించి
ముత్యాలకుచ్చులు మురుకొనివ్రేలు
* బవిరలు † కుంటేండ్లు కనమీరబెట్టి
కర్ణాగ్రదేశముల్ కాంతులనీన
కుప్పెలముత్యాల కుచ్చులురెండు
ఘనకుంతలంబుల గదియించిమరియు

కాశ్మీరకర్పూర కస్తూరులెనగు
మలయజంబలర హేమకమంపువేన

విశదంబుగాబూసి విసరిరంతటను
పువ్వులగుత్తుల బొంగరంబులను
మానితకందుక మాలారతతుల
చయ్యననిరసించు చన్నులపైన
బంగారుపువ్వుల పట్టుకంచుకము
తొడిగినేరుపుతోడ దూముడివేసి
ముత్యాలరత్నాల మురిపెంపుపేర్లు
పతకాలుపవడాలు బన్నసరాలు
పక్షస్థలమ్మున పరుసగవేసి
కంబుసన్నిభమైన గళభాగమందు

ముత్యాలపట్టెడ ముదముతోబెట్టి
మర్రియూడలతోడ మార్కొనిగెల్చు
సుమమాలికలసొంపు చూరలువుచ్చు
చెలువొందుచుండెడు చేతులకెంట
రత్నాలుచెక్కిన రమ్యాంగదములు
దండకడియములు దంటతాయెతులు
మక్కువతోగట్టి మనికట్టునెగువ
నీలాలగాజులు నేర్పునదొడిగి
పచ్చలకంకణాల్ భాసిల్లబెట్టి
‡ చామలాకడియముల్ సంధింపజేసి

సొబగైనచేకట్లు సొమ్ములుదాల్చి
మాణిక్యతపనీయ మంజులోర్మికల

* ఒక విధమైన కర్ణాభరణము.

† ఒక విధమైన పూర్వకాలపు సొమ్ము. ఇవి యిప్పుడంతగా వాడుకలోలేవు.

‡ కంకణ విశేషము.

అంగుళంబులకెల్ల అమరంగగూర్చి
పాపటసవరించి బంగారుతగటు
ముయ్యంచుచేలంబు మోహనమొప్ప
కటియందుసంధించి గజ్జలుత్రేలు
తపనీయకాంచిని దట్టించిముడిచి
పయ్యెదరొమ్మున బాగుగజేర్చి
అందెలుగొలుసులు నమరగబెట్టి
భర్మనిర్మిత బహువిధదీప్త
* భూషణంబులుత్రేళ్ళ పొందుగబెట్టి
పదములలత్తుక ప్రకటంబుచేసి
పద్మపాణినాల భ్రమనొందజేసి
చెవులపర్యంతము వెలగునేత్రముల
కాటుకవెలయించి కాంతలీరీతి

శృంగారమొనరింప చెలగిమాంచాన
తల్లికిమ్రొక్కుడి దయరాగననియె
అమ్మనీయల్లుని నసలెనెరుంగ
ఏరీతిదెలియుదు నేయుపాయంబు
పతియనియితరుల భావింపగూడ

దాభంగిజేసిన అపరాధమగును
హాస్యంబుచేయుదు రక్కడివారు
పంపుముగిరిచెప్పి పణతిరోయనిన
మంచాలకప్పుడు మాతయిట్లనియె
నీవటుపోయిన నినుజూచినపుడు
లేతురుమరదులు లేవడువరుడు
గురుతుచెప్పితినేగు కూతురాయనిన
తల్లినిసేవించి తానేగెనపుడు

(మాంచాల భర్తదగ్గరకేగుట)

భూదేవితనరూపు పొలతినిజేసి
బాలునిభ్రమియింప బంపెనోయనగ

సౌందర్యఖనియైన చానమాంచాల
నిల్చివారలజూచి నివ్వెరపడగ
మరదులార్వురుగూడి మక్కువతోడ
వేగమేలేచిరి వెలదినిగాంచి
పతిలేవకుండెను బ్రాహ్మణోత్తముడు

లేచినపాపంబు లేమకుజెందు
అనుచులేవకపోయె అపుడుమంచాల
యిద్దరిలోభర్త నెరుగగలేక
కాంచనవర్ణప్రకాశుడైనట్టి
బ్రాహ్మణుడనపోతు పాదంబుపట్టి

పన్నీటగడుగంగ భావనచేయ
భయమున అనపోతు పలికెవేగంబ
నేనుబాలుడగాను నిజమూమాతల్లి
మరదిబ్రాహ్మణుడను మగువనానామ
మనపోతునాబిల్తు రందరుజనులు

విప్రుడీరీతిని వెలదితోబలుక
అనపోతుతోనసె అపుడుమాంచాల
మరదియోయెరుగను మగడోయెరుగ
భయమొందనేటికి బ్రాహ్మణోత్తముడ
అనిపల్కుమాంచాల కావిప్రుడనియె

అమ్మనీపెనిమిటి యతండు; నామంబు
బాలుండు; శాత్రవ భయదుండుసుమ్ము

---

* కాలిప్రేళ్ళకని యర్థము.

నీమనోహరు సేన నియతిమై జేసి
తరువాత మమ్మెల్ల దయ నాదరింపు
మనినంతనతనితో ఆలేమపలికె
వినవయ్య విభ్రుడ విన్న పంబొకటి
ఇద్దరికినిమీర లెలమితో పెండ్లి
చేసెదునాడొక చెనటివిభ్రుండు
చూడగాలేక అసూయ పెంపొంద
సౌందర్యమన్నది చానకున్న
యెట్లుగావించి నారీవివాహంబు
అనిపల్కెనోయేమొ యటుకాకయున్న
బాలుడివ్విధమున భావంబువిడిచి
నన్నేలవిడనాడు నయమార్గ మెడలి
పరిచయ మేలేదు పతికినినాకు
బాలచంద్రుండిప్డు వచ్చెనుగనుక
నేనుపూర్వమునందు నియమంబుతోడ
చేసినతపమంత సిద్ధించెననుచు
హర్షంబునొందితి అత్తలోపలను
బాలుడుమమ్మిక పాయకయున్న
మాభాగ్యమిల అసమానంబుగాదె
బ్రహ్మకులంబున ప్రభవించినావు
వేదాదివిద్యల విజ్ఞానివనుచు
నీచరణంబులు నేనుపూజింప
పట్టితినాకన్య భావంబులేదు
మనసునిశ్చయమిది మరదినాకంచు
అనువొప్ప గాబల్కి ఆత్మేశుజూచి
పన్నీరుదెప్పించి పాదములుగడిగి
పచియించెనిబ్బంగి ప్రౌఢవాక్యముల
ప్రాణాంగనలగన వచ్చెదునన్న
డితరులదెచ్చుట యేపాటినీతి?
* అనినబాలుడుకంపె అనుజులకెల్ల
పోవుచు జెప్పిరి పోసగనవ్వుచును
బవరంబునకు నేగు పయనంబునిలిచె
మనసుభయంబందె మక్కువమీర
కులవైరమందిర్చు కోర్కియేమాయె
బవరంబునకు నేగు పైనమేమాయె
నవ్వరాయీమాట నాయకుల్విన్న
కలనిలోనున్నట్టి ఘనులెవ్వరయ్య
యీసుఖమేదక్కె నెవరునాకేల
అనిచూడగూడునా అపకీర్తివచ్చు
అనిపల్కువాక్యంబు లాలించియపుడు
బాలచంద్రుడుపల్కె భ్రాతలతోడ
ఇంతగానాకు మీరేల చెప్పెదరు
బవరంబునకు నేగు పైనంబుమరవ
కులవిరోధములోన కుములుచునుండె
కాయమిచ్చుటబుద్ధి కలనిలోపలను
నివసించియున్నది నిశ్చయంబిదియు
శ్రీగిరీశునియాన చెన్నునియాన
మాయమ్మమాటకు మారాడలేక
యిటువచ్చినాడ మీరేమి చెప్పెదరు
రయమునవచ్చెద రమ్మందురేసి
మీరెల్లనిలుమన్న మీరకనిల్తు
ఎన్నినాళ్లుందునే నెరిగింపుడనిన
ఏడుజాములదాక నిచ్చోటనుండు
మంతటమిలివచ్చు అరుగంగవలయు

---

* ["जातानुरागार्या......शेषजनविसृष्टिः" (वा. का)] (నాయిక అనురక్త అయినప్పుడు శేషజనులను పంపవలెను'') అని వాత్స్యాయనుడు.

సర్వజ్ఞుడవునీవు జడులము మేము
వచ్చెనా అపకీర్తి వచ్చునందరికి
ఒత్తి చెప్పుటలుమాకుచితధర్మంబె
అనిపల్కి శీఘ్రమే అకొల్వువెడలి

తమతమయిండ్లకు తమ్ములుచనిరి
తరువాతమాంచాల తనభర్తయైన

(బాలచంద్రుఁడు నతనిభార్యయు
నంతఃపురంబునఁ గ్రీడించుట)

బాలచంద్రునితోడ భావముప్పొంగ
మేడమీదికిబోయి మేలైనయట్టి
చిత్తర్వుజూపుచు చిలుకలచదువు

వినిపించి శృంగార విపినంబుజూపి
పెద్దలుతనమీఁద ప్రియముమీరంగ
ప్రొద్దుపోవుటకునై పొందించినట్టి
ధర్మపాంచాలికావ్రాతముజూపి
అందులోనొకబొమ్మ నాడంగజేసె

అందు కాతడు కరమానందమొందె
అటుమీఁదనిద్దరు నధికమోహమున
చిత్తర్వుమేడకు జేరబాలుండు
హంసతూలికపాన్పు నందుపరుండె
ప్రియురాలుముత్యాల పీటపైనుండి

తాంబూలమిచ్చుచు తనమదిలోన
బాలునిభావంబు బాగుగనెరిగి
ఆయత్తపడివత్తు ననిమ్రొక్కి లేచి
జననియొద్దకుబోయి జలకంబులాడి

(మాంచాలతల్లిదగ్గర కేగుట.)

ముత్యాలుగూర్చిన ముంగొంగు మెరయ

ప్రతిమలువ్రాసిన పట్టువస్త్రంబు
కటియందుధరియించి కనకమాణిక్య
మౌక్తికసంయుక్త మంజులంబైన
భూషణవితతిని పొందుగాదాల్చి
చెలగి పాదముల మంజీరయుగంబు

సంధించిముత్యాల జల్లులువ్రేల
బహువిధశృంగార భరితురాలగుచు
(బిడ్డలయాశలఁ బ్రియమునఁదీర్ప
జననితోసమమైన జంతువులేదు
కావునదనకున్న కష్టంబులెల్ల

పోగొట్టునసియోచు బుద్ధితోనాపె
తల్లితోడుత నివ్విధంబునఁబల్కె
కాంచక కాంచక కాంచితిఁబతిని
కాంచితినేకాని కలలోనివార్త
కదనరంగమునకుఁ గదలుచున్నాఁడు

చిరవియోగముమాకు సిద్ధించునొక్కొ)
దైవమీలాగున దయదప్పినన్ను
పుట్టింపగానేల (భూస్థలిమీఁద)
అడవిగాసినవెన్నెలాయె నాబ్రతుకు
తల్లిరోనేనెట్లు తాళగలాను

(బాలునిఁబోకుండఁ బట్టుటయెట్లు
దరియేమినాకని తల్లడంబంద
తరుణియిట్లనిపల్కెఁ దనయనుజూచి

(రేఖాంబతనకూతురైనమాంచాల
కుపదేశించినజ్ఞానప్రకారము.)

ముద్దులమాంచాల ముదమునవినుము
జన్మవృక్షమునకుఁ జవిగలయట్టి

పటుతరకమనీయ ఫలములురెండు
కెరలుభోగములొందు కీర్తిరెండవది
తొలుపండుచవిచూచి తొలఁగునొకండు
మలుపండు చవిచూచి మలఁగునొకండు
వీరలిద్దఱికిని భేదంబుహెచ్చు

మొదటిఫలంబున మొనసెడురసము
క్షరభగురంబది సమసిపోఁగలదు
రెండవఫలమున రెక్కొనురసము
శాశ్వతంబాచు దిశలుగలదాఁక
సవిత్రుఁడుగలదాఁక శశిగలదాఁక

తారలుగలదాఁక ధరగలదాఁక
వారిధిగలదాఁక వరలుచునుండుఁ
బ్రకటఫలద్వయ రసమునుగ్రోలి
యనుభవించెడు వారలరుదుభూస్థలిని
ప్రాకృతజనములం ప్రథమఫలంబు

ప్రాపించిసంతృప్తి వడయంగఁగలరు
వీరాంశమునఁబుట్టి వెలయువారలకు
మొదటిఫలంబది ముఖ్యంబుగాదు
మహిమాస్పదంబయి మనసుజ్వలింపఁ
బరుగెత్తుదురు రెండవఫలంబుకొఱకు

వెలదిరోసిభర్త వీరశేఖరుఁడు
కీర్తికాముకుఁడయి కేరుచున్నాఁడు
నీవుభోగములపై నిరతిఁద్యజించి
బాలచంద్రుని భద్రభావంబెఱింగి
భావిమానవుల హృద్భవనంబులందు

తావకీనయశోల తావివర్ధనము
సేయంగఁగోరుము చెలువరోయిపుడు
బాలచంద్రునినాగఁ బట్టంగవలదు
నావుడుమాంచాల నమ్రతతోడ
జననికిఁదా నమస్కారంబుచేసి)

భర్తదగ్గరకేగి భక్తితోనిల్వ
(దనమునిబాలుండు తలపోసెనిట్లు)
లెక్కడిసౌందర్య మెంతయొయ్యార
మేమనియెన్నుదు నీయింతి వెలవు

(బాలచంద్రుఁడు తనపూర్వప్రవర్త
నకుఁ బశ్చాత్తాపమొందుట.)

నరలోకసురలోక నాగలోకముల

సరిలేరుభామకు సౌందర్యగరిమ
ఇటువంటికాంతపై నిచ్చబోవిడిచి
పశుబుద్ధితోడనే భావంబుమరచి
నిందపాలైతిని నిఖిలరాజ్యముల
పరలోకసౌఖ్యంబు పారదోలితిని
మిత్రులుచుట్టాలు మేటిబంధువులు
తిట్టిదూషింతురు తెలియలేనైతి
ఆశ్రితజనముల నరయుటమాని
పరియాచకము చేయుం వారలకిచ్చు
భ్రష్టులపోలిక భార్యనుబాసి

వెలయాలిప్రేమించి వీరిడినైతి

ఏగతిచింతింతు నేమందువిధిని
నాకర్మఫలమేమొ నాగతియేమొ
తరమెనా కెరుగంగ దైవంబెయెరుగు
అనితలపోసెడు ఆబాలుజేరి
మాంచాలగూర్చుండె మక్కువతోడ
బాలుండుమోహంబు ప్రకటంబుచేయ

(బాలచంద్రుఁడు భార్యతో వినోదంబులు సల్పుట.)

* చేవేగమునచీర చెంగునునొడిసి
పట్టినఆచీరపై నున్నయట్టి
ముత్యాలచేరులు మొదటికితెగెను
చెదరిరాలినగని చేయఖీతిల్లి
చిన్నబోయెను మోముచెలువెల్లదోలగ
వెలదివెల్వెలబోవ విభుడప్పుడనియె
చింతింపబనిలేదు చిత్తంబులోన
అంతకుబాగుగ అమరింతుచీర
అనిలేచిసంభ్రమ మచ్చుపడంగ
చెక్కులుకరముల చెన్నుగనిమిరి
తగునేర్పుతోడ ముత్యంబులనెత్తి
చీకాకుపడజేసి చిక్కులబెట్టి
కాలంబునీరీతి గడుపంగమించి
జాములేమునుదాటె తరుణిమాంచాల
బాలునితోననె భావంబెఱింగి
నాతోబెనంగిన నయమేమిలేదు
కడువడికలసికి గదలుడిమీరు
కులవైరముందీర్చ గురుసాహసుండు
పరికించిచూడ నెవ్వరుమీరుదక్క
అనిపల్కుచుండంగ ఆసమయమున

(బాలచంద్రుని యనుజులు దుందుడుకు సేయుట)

ఆటకారులైనట్టి యనుజులువచ్చి
గంపువారింటిదగ్గర జేరిపిలిచి
ధ్వనియొనర్చిరిహెచ్చు తమకంబుమీర
వినిబాలుడడిగెను వెలదినిజూచి
మేడపిచెన్నుని మేలైనసేవ
అనితెల్పగా బాలుడాసక్తితోడ
మాత్తికమాలలమరుపగడంగె
తమ్ములందరునప్డు తత్తరపడుచు
ఘనరౌద్రముగనుండు కత్తులుదూసి
వెడలినకోపాగ్ని వీరులెవ్వరును
మారయంగక కేరు మదకరులట్లు
పురముతల్లడమంద భూధ్రముల్ కదల
భీకరంబుగనార్చి పెడబొబ్బలిడిరి
అదిబాలుడాలించి ఆయుధమంది
ఓడకోడకుమంచు ఉవిదలబలికి
పెనగొన్నకోపాన పెరికికటారి
అట్టహాసముచేసె అనుజులమీద
పలికిరితమ్ములు బాలునితోడ

(బాలచంద్రుండనుజులపైఁగవయ వారు లజ్జాకరంబులగు మాటలాడుట.)

త్రుప్పుపట్టినకత్తి దూయుటతగవె

---

* ["केशहस्ते वस्त्रान्ते नीव्यामित्यवलम्बनम्' (वा. का)] (కేశపాశమందు, చీరచెంగునందు, చీరముడియందు (రతోపక్రమానికి) పట్టుకొనడం (ఉచితం).] అని వాత్స్యాయనుడు.

ఘనమైనశౌర్యంబు గలవాడవౌర
ప్రబలుచునున్నట్టి వైరులవిడిచి
అనుజులమీదనా? ఔద్ధత్యగరిమ
భోరునకార్యమ పురమునకేగు

సమరకార్యమునీవు చాలించినావు
కొలువులోమీమాను కొమ్మభూపతికి
ఇల్లడచేసెని న్నెలమి బ్రహ్మన్న
అలరాజుపగరచే హతుడైనవెనుక
పెండెంబునందయు భేతాళమనెడు

ఖడ్గంబుమొదలైన కలబిరుదముల
ఒసగుమంచునునీకు సర్వేశుడంపె
వినుమినుమునురాగి యిత్తడికంచు
పెట్టెచేసినయట్టి బిరుదులుగలవు
రజతజాంబూనద రచితమైనట్టి

వెలలేనిసొమ్ములు వెసనీకుదక్క
సన్నుతికెక్కనీ సరసత్వమెల్ల
కట్టిడివాడవు కరుణలేదాయె
మనఅక్క వెలలేని మాణిక్యమరయ
చచ్చిఆకైలాస శైలంబునందు

అలరాజుగలసిన దాశ్చర్యసరణి
సరసిజలోచన చావువిన్నపుడు
దరికొనదా? మది దావాగ్నిరీతి
అన్నమెట్టులులోని కరుగునునీకు
కంటికినిదుర యేగతివచ్చునయ్యా

బంటుతనంబును పాడియువిడిచి
కులవైరముందీర్చు కోరికవదలి
ఇంటికాసించుట యేనీతియగును?
బాలుడా!మమ్మంపు బవరంబునకును
కులవైరముందీర్చి గురుశౌర్యమమర
తక్కించెదమునీకు దరిలేనికీర్తి
అనినబాలుడువిని అడకువమీర
సిగ్గుచేతలవంచె శీఘ్రమెతిరిగి
మాంచాలమందిర మార్గంబుపట్టి
పురుషునిరాకడ బుద్ధిగ్రహించి

వాకిటిపొంతను వడినెదురేగ
అతివచేతికిబాలు డాయుధమిచ్చె

(మాంచాల భర్తనుదీవించి
ఖడ్గంబు చేతికిచ్చి యుద్ధమున
కంపుట.)

నవ్వుచుదీవించె నలినాయతాక్షి
రతిరాజసుందరా రణరంగధీర
కమలబాంధవతేజ కరుణాలవాల
వినతాత్మజునిలావు వెసనీకుగలుగు
సామీరికుండిన సాహసంబబ్బు
కృష్ణునికీమగా కీర్తిమిన్నెల్లు
రవికాంతియుతుడవై రంజిల్లుచుండి
అలరాజుపగదీర్పు మనుజులతోడ

పటుతరవిక్రమ వైభవంబలర
శ్రీగిరిలింగంబు చెన్నకేశవుడు
వరములొసంగగ వర్ధిల్లగలరు
శాత్రవవిజయంబు సమకూరుమీకు
ఈయాయుధము వడినిచ్చునుజయము
కలియుగంబునమీకు ఘనపూజలమరు

అని ప్రాణనాథుని ఆశీర్వదించి
ఆయుధం బిచ్చిన అతఁడు గైకొనియె
బాలునితో పక్కె పడతిమాంచాల
కలహంబునకుమీరు కదలుచున్నారు 160
జయమపజయము నీశ్వరునకుఁ దెలియు
విప్రుఁడా అనపోతు వెంటరాదలఁచు
బ్రహ్మహత్యఘటిల్లు పాపము వచ్చు
బహుజన్మములకైన పాయదా కీడు
* పరమేశ్వరుండైన పార్వతీజాని
పాపికొనఁగలేక పలుపాట్లువడియె
మనుజులెంతటివారు మదివిచారించి
మగుడంగ బంపుము మాయ చేసైన
అనిన సమ్మతమొంది అపుడు బాలుండు

---

* శివునికి బ్రహ్మహత్యయెట్లు సంభవించెననఁగా:—

తొల్లి బ్రహ్మ మేరుపర్వతకూటస్థలియందుఁ గొలువుతీరియుండఁ బరతత్వం బెద్దియో తెల్పుమని సభాస్తారులైన మును లతని నడుగ నేనేపరతత్వమనియుఁ నేనొక్కరుండ నీశ్వరుండనియుఁ నాకధీశ్వరుండు లేఁడనియుఁ బ్రహ్మ వాక్రుచ్చె. అంతట నచటనున్న క్రతుపురుషుండు దరహాస్యవిజృంభితుఁడై బ్రహ్మతో నీవు లేనిపెద్దఱికంబు వహించెదవు, నేను సాక్షాన్నారాయణుండను యజ్ఞపురుషుండ, జగత్ప్రభుండ నని పలికెను. వీరిద్ద ఱిట్లు పరస్పరజయకాంక్షులగుచు తమతారతమ్యంబు వేదంబులనడిగిరి. చతుర్వేదం బులును రుద్రుండవ్యయతత్వం బన్యులయందాశబ్దవాచ్యత్వంబు సంప్రతిష్ఠితంబు గానేర దని సాక్ష్యంబిడియె. వల్లకాటియందుఁ గాంతాసహితుఁడైయుండు రుద్రునకుఁ బరబ్రహ్మ భావంబెట్లుకలుగునని సరించియు యజ్ఞపురుషుఁడును వేదంబుల సాక్ష్యంబంగీకరింపరైరి. పిమ్మటఁ బ్రణవంబుమూర్తిమంతంబై రుద్రుండే పరమాత్మయని చాటిచెప్పెనుగాని ప్రణవ వాక్యంబులంగూడ నిరాకరించిరి. అప్పుడొకయఖండదివ్యతేజోమధ్యంబున హరుం డుద్భవించెను. ఆతనింజూచి బ్రహ్మ ఓయిశివుఁడా నీవు నాలలాటస్థలంబునఁ బుట్టితివి గాన నీవు నాపుత్రుఁడవు నన్నాశ్రయించి బ్రతుకుము నావుఁడు భర్గుఁడు నితాంతరోష సంరంభంబున విజృంభింప భైరవుఁడుపుట్టెను. భైరవుఁడు శివునాజ్ఞనొంది గర్వించు చున్న బ్రహ్మయొక్క పంచమవదనంబు నఖరధారం ద్రుంచివైచెను. యజ్ఞపురుషుఁడు, విరించియునంతటభయపడి స్తోత్రంబుగావించిరి. శివుఁడు భైరవునింజూచి యీకసీకోపంబు చాలించి బ్రహ్మకపాలంబుదాల్చి, లోకాచార ప్రకటనార్థంబు భిక్షాన్నంబుఁగొనుచుఁ గాపాలికవ్రతముతోఁ జరియింపుమనిచెప్పెను. తరువాత శివుఁడు బ్రహ్మహత్యను సృజించి భైరవుని వెంటఁబంపెను. బ్రహ్మహత్యతోడనవర్తింప జగమ్ములుగ్రుమ్మరుచు నొక్కనాఁడు

(ఐతాంబ, కుమారుని దీవించి యుద్ధ
రంగమున కంపుట.)

మాంచాలవీడ్కొని మనసు చలింప

తనయింటికేతెంచి దండికూరుండు
తల్లి చేనన్నంబు తానారగించి
చందనపరిలిప్త సర్వాంగుడగుచు
తగటువస్త్రంబులు తగజుట్టితొడిగి
భర్మమౌక్తికరత్న బహుభూషణములు

తగినఅంగములందు దాలిచిమించి
తల్లికిమ్రొక్కిన తనరదీవించి
సురనాథు విభవంబు సొంపొప్పగలుగు
వీరభద్రునికట్లు విజయంబుగలుగు
వినతాతనూజాత వేగంబుగలుగు

రఘునాయకులయొక్క రాజసమొప్ప
పవనపుత్రునిమహా బలముసిద్ధించు
విచ్చేయుమనితల్లి వేడుక బలికె
తగినట్టిదీవన తల్లి చేసంది
దట్టమౌకో పానతన మొగసాల

కరుదెంచిఆబాలు డానందమొంది
* భూమండలపుకోట పొందుగ గెలిచి
పాండ్యులజేకొనె పటువిక్రమమున
† బలువైనజగజంపు భద్రసాలేయ
మదిపంపుమని వార్తనంపెతల్లికిని

భైరవుండు కాశీపట్టణంబుచొచ్చెను. చొచ్చినంతనే బ్రహ్మహత్య మొఱవెట్టుచుఁ బాతాళంబునఁబడియెను. కరంబునయున్న బ్రహ్మకపాలంబు భూతలంబునంబడియెను. ఈశ్వరరూపాంతరమైన భైరవునికి బ్రహ్మహత్యా పాతకంబు తొలఁగిపోయెను. అనియివ్విధమున స్కాందపురాణాంతర్గతంబైన కాశీఖండంబునం జెప్పఁబడినది. బ్రహ్మ పంచముఖుఁడై యుండిన కాలమున నొకనాఁడు త్రిమూర్తులుఁ కొల్వుదీరియుండఁ బార్వతి యచటికి వచ్చి పంచాననులైన శివబ్రహ్మలలోఁ దనభర్తయెవ్వరైనది తెలిసికొనలేక విభ్రాంతిచెంద శివుఁడు కనుసైగ చేసెను. అకనుసన్న నెఱింగి పార్వతి శివుని వద్దకుఁబోయెను. తనభార్య కింతభ్రాంతి కలుగుటకు బ్రహ్మకైదు ముఖములుండుటయే కారణమని గ్రహించి యా యైదుముఖములలో నొకదానినిఁ దీసివైచి యతఁడు బ్రహ్మను జతుర్ముఖునిం జేసెను. అందుకు బ్రహ్మకోపించి శివునకుఁ గాపాలికత్వమును భిక్షావృత్తియుఁగలుగునట్లు శపియించెను. ఈబ్రహ్మహత్యాపాప నివారణకొఱకు విష్ణుబోధితుఁడై శివుఁడు తీర్థయాత్ర చేసెను. ఇట్లు తీర్థయాత్ర సల్పుచుఁ గాశీపురికిరాఁగా నచట నప్పాపమువలన విముక్తుఁ డయ్యెను. అని మఱియొకకథగలదు.

* సత్తెనపల్లి తాలూకాలోని ధరణికోటయై యుండును.

† ఇది ఛత్రనామము.

తనయునివాక్యంబు తామీరలేక
తెప్పించియిప్పించె దీవనతోడ
రాచబిరుదులంది రణరంగమైన
కార్యమపురి చేర గదలగదలచి
మేడపి వెడలెను మితిలేనిపటిమ

(అనపోతును వెనుక కంపుటకు
బాలచంద్రుఁ డుపాయంబు
పన్నుట.)

తోడిబడి బాలచంద్రుండూహ చేసి
తమ్ముల కెరిగించి తనమర్మమెల్ల
కనుచూపుమేరను గదలకనిలిచి
తమకంపుపైనాన దగుమోసమాయె
ఏమి చేయుదునింక నిటమీద నేను

మసలియీపైనంబు మానితినేని
దుశ్శకునంబగు దొడరునుగీడు
కుమ్మరపట్టినా కూర్మితమ్ముండ
వడితోడ జనుము మీవదినెనుగనుము
ముత్యాలగళమాల ముద్దుటుంగరము
మరచివచ్చితి దెమ్ము మసలకయిప్పు
డసినకుమ్మరిపట్టి అతనితోననియె
అనఘాత్మ నాదేహ మలసటనొంచె
నడవనోపగ లేను నరకుంజరంబ
అరసిచాకలచందు నాలాగుపలికె

కమ్మరపట్టియీ కరణివచించె
మేడపికేగెద మెలతజూచెదను
రయమునమిము జేర రాలేనుసుమ్ము
వెలమలదోర్ణ్ని వేడనిట్లనియె

నీప్రొద్దుతిరిగిరా నేనలక్షితిని
కలయవచ్చెద రేపు కలనిలోపలికి
కోదునయిద్దర వేడి కొనినంతవారు
పోలేమటంచును బొంకిరి వేగ
అంతనవ్వుచుబాలు డనపోతుకనియె
నమ్మినతమ్ముడ నయశాస్త్రవిదుడ

పేరమ్మతనయుండ పెద్దనపౌత్ర
ఒడ్డిమల్లపరాజు నొయ్యారిపట్టి
అందనితరువుల యాకులుదీసి
వ్రాయుదులెక్కలు వసుధేశతతికి
బ్రహ్మవంశజలోకపావనమూర్తి
నాఆత్మసఖుడవు నను జేరరమ్ము
గ్రక్కునపదినెను కనుగొనివేడి
ముత్యాలగళమాల ముద్దుటుంగరము
కొని తెమ్ముతమ్ముడ గురునీతిపరుడ
అనఅనపోతు చిహ్నాంబులనడిగె

పెనగొన్న వేడ్కతో పీటపైనుండి
ముత్యాలుగూర్చిన మొనచీరకొంగు
చేపట్టియీడ్చిన చెదరముత్యములు
కసికూర్పగాబోవ గనుపట్టదాయె
ఇదియానవాలని యింతితోపలుకు
హితవొప్పసాని వా రింటికిబోయె
అడుగువారానవా లడిగిన జెప్పు
అరటిఫలంబుల ఆమరుచర్మంబు
ఫలమనియిచ్చెను పడతినావేళ
ఇదియానవాలని యెరుకగపల్కు
మనిచెప్పిపొమ్మన్న నప్పుడేకదలి

వడి పాదఘట్టనవశమునధూళి
చనివేగవినువీథి సాంద్రమైపర్వ
అనహాయశూరుడయి అనపోతుపోయె
బాలుడు బ్రాహ్మణు బలునేర్పు మెరయ
మాయామతంబున మగుడబంపించి
తమ్ములుదాను తాత్పర్యమునను
కడువడి * త్రిపురాంతకమునకువచ్చి
అచటఆసక్తితో నాసీనుడగుచు
తెప్పించెఘంటంబు తీరైనఆకు
వ్రాసినాడొకయుత్తరము స్వహస్తమున
ఆదిరాజిశోమ్మల కంటగట్టించి
వీరులేగినత్రోవ వెంబడినడచె
పల్లెలవారెల్ల బాలునిజూడ
చనుదెంచిరెంతయు సంతసంబొప్ప
ముటుకూరి కాపులు మ్రొక్కుచునపిరి
విందారగింపుడు విశ్రమింపుండు
తరువాతదరలుట తగుశకునంబు
వినుమన్నవారితో వీరుడుపలికె
కార్యమపురమున కదిసెనుపోరు
నిల్వరాదియ్యెడ నిల్వుడిమీర
లీరితెనని బాలు డేగినవేళ
† గరికెపాటనుగల కాపులువచ్చి
కనిమ్రొక్కినంతట ఘనుడువారలకు
పోకలాకులొసంగి పొమ్మనిపంపె
‡ మేళ్ళవాగునుజేరి మితిలేనియట్టి
పోటుమూకలువెంట బొబ్బరింపంగ
ఘనశైలగహనముల్ కనుమలుగడచి
తార్క్ష్యుండుగిరులపై దాటినయట్లు

(బాలచంద్రుఁడు నలగొండను డాయుట.)

భానునికైరాహు పరువెత్తినట్లు
భయవర్జితుండయిన బాలుడార్చుచును
పరదళంబులువిన్న పరుగెత్తిపోవ
నరసింగభూతల నాథుచిత్తమున
కులవిరోధమునకై గురిచేసినిల్పి
కోదమసింగంబులు గూడినభంగి
అనుజులువెనువెంట అరుగుదేరంగ
§ కురువకునేతెంచె గురుశౌర్యమమర
ఎక్కెనా ♦ నలగొండ యెదురేమిలేక

* మార్కాపురమున కీశాన్యమునఁ 2 మైళ్ళ దూరమునఁ గర్నూలు జిల్లాలోనున్నది. శ్రీశైలమునకుఁబోవు త్రోవలోనుండును.

† 8-వ పుటలో వివరణము చూడఁదగును.

‡ 8-వ పుటలోని వివరణము చూడఁదగును.

§ దీనినే నాయకురాలి కనుమయని చెప్పుదురు. ఈ కనుమగుండ వాగులేఱు ప్రవహించును. ఇది కార్యమపూఁడికిని మేళ్ళవాగునకును మధ్యమునున్నది.

♦ ఈకొండ నాయకురాలి కనుమపద్దనే యున్నది.

(కుంజరసైనిక ఘోటకావళుల
బృంహిత భాషిత హేషితంబులును
పటహారావంబులు ప్రబలుచునున్న)
కార్యమాపూడిశ్రీ కదనరంగంబు
(బాలుఁడంతశక్తి ప్రజ్వలింపంగ)
నలగొండశిఖరంబు నన్నిల్చి చూచి
కుమ్మరపట్టిపై కుడిహస్తముంచి
వెలమలదొర్నిని వెసజేరబిలిచి
ప్రథితుఁడాబాలరాజు పగదీర్పవచ్చి
ఒక్కఁడ నేగుట యనుచితంబుగాదు
వెనుకజిక్కినయట్టి వీరపుంగవులు
కలయవచ్చినదాక గడియకాలంబు
విశ్రమింతమటంచు వేడ్కతోనుండె
* ఆటమున్నెకలనిలో నైనకార్యంబు
వివరింతుజనులకు విశదంబుగాను
నలగాముకొల్వులో నాయకురాలు

(సంధికయి నాయకురాలు
రాయబార మంపుట.)

తలపోసిమదిలోన తగినవారలను
వాసిగబ్రహ్మన్న వద్దకుబంపి
బవరంబుగాకుండ పట్టుటకార్య
మనిపెద్దలనదగు ఆప్తవర్గమును
కొండ † అన్నమరాజు కోటకేతుండు
కూరిమిహితుడు మాడ్గులవీరరెడ్డి
పరమాప్తుడా చింత పల్లిరెడ్డియును
మొదలయినసువిచారముఖ్యులైనట్టి
చనవర్లబిలిపించి సమబుద్ధిననియె
బాహుపరాక్రమ ప్రాభవులైన
వీరులురాజులు వెలయశోభిల్లు
కొల్వులోనికిబోయి కూరిమిమీర
సమరంబుగాకుండ సంధియౌనట్లు
మాటాడిఆటమీద మాచెర్లభాగ
మేలుకొమ్మనిచెప్పు మింకొకమాట
నాయునివద్దకు నరసింగుదెచ్చి
కులవైరమడతుము కోరిమీరంద
రొక్కటికమ్మని యొప్పించిరండు
మగిడిపోవలయును మనదేశమునకు
అనిపిలుకొలిపిన నంతటవారు
పైనమైయేతెంచి పట్టపురాజు

(రాయబారులు మలిదేవమహీపతి
కొల్వునకు వచ్చుట.)

మలిదేవుదర్శించి మన్ననవడయ
చెలువొందజోహారు చేసిరందరును
కూర్చుండనియమించె కుంభినీశ్వరుడు
వచ్చినవారలు వారితోననిరి
క్షితియేమికలసెనో నిన్నిదినములు
తడసితిరిచటికి తడవాయెవచ్చి
యేమికార్యంబొ మా కెరిగింపుడనిన

* ఇది కవి వచనము.

† "మన్నెమరాజు" అని పాఠాంతరము.

మీరెఱుంగని కార్య మేదియుయ్యెడల
తెలిసియుండడిగిన దెలుపగవలయు
సంధికార్యమునకు జను లెఱుగంగ
అలరాజునంపిన నామహీశ్వరుని
హేయమనక పట్టి హింసించుటెల్ల
తీర్పరులౌమీకు దెలిసిన మేలు
నలగాముతమ్ముడు నరసింగురాజు
తలగోసికొనగ పంతంబొనరించి
కులవైరముందీర్ప కుతుకంబుతోడ
విఖ్యాతయశులగు వీరపుంగవులు
నిలిచిరిరణభూమి నిశ్చలప్రజ్ఞ
ఎత్తివచ్చినవార లికబోవరాదు
సమరంబు చేయుట సంతోషకరము
బ్రతుకులస్థిరములు పడుటసిద్ధంబు
సంపదల్నిలువవు జలబుద్బుదములు
సత్కీర్తియొక్కటి సమయదెన్నటికి
వెరగందిపందలై వెనుదీయకుండ
అనిచేయమీరెల్ల నాయత్తపడుచు
పరుగునరమ్మని బ్రహ్మన్నపలికె
వినికోటకేతుండు వివరించిచెప్పె
వినవయ్యనాయుడ విన్నపంబొకటి
అలివివేకులుమీర లఖిలరాజ్యముల
మీదృశులయినట్టి మేటివిక్రములు
నీతిమంతులులేరు నిశ్చయంబిదియు
గొంతుగోయగమీరు కోరినయట్టి
నరసింగరాజును నయమునదెచ్చి
యిచ్చెదమామీద నేమైనలెస్స
సరవిరక్షించిన సంహరించినను
భారంబుమీపైన పాదుకయుండు
మునుపటిరీతిని ముదమొప్పమీరు
మాచెర్లభాగంబు మక్కువనేలి
సంరక్షణము చేయు జనములనెల్ల
ఉభయరాజులుమీర లొక్కటైయున్న
మావంటివారికి మానసంబలరు
అఖిలాధిపతులుమీ ఆజ్ఞ చేయుదురు
మీరెరింగిననీతి మేమెరుగుదుమె
ఉభయసంస్థానంబు లొక్కటిమాకు
* అనుగురాజేంద్రుడు హరిపురికేగు
సమయానతనపుత్రచయమును చూపి
మీకుసమర్పించి మేనుత్యజించె
తర్వాత నిర్వాహదశయెల్లనీది
ఒకయిల్లు రెండుగనొప్పనొనర్చి
తద్దయునాకొండె నేయపుడెవరైన
మతిచెడియీలోన మనసులుగలగె
అందుచేపగ హెచ్చెనీర్ష్యజనించ
కోడిపోరాడుట కూడదటంచు
ఇచ్చతోజెప్పిన నెవ్వరువినిరి
గురిజాలపురికిని కోడిపోరాడ
ఎవ్వరువచ్చినా రిదియేమిమాయ
ఐనట్టికార్యంబులన్నియునీకు
తెలిసియేయున్నవి (తేటతెల్లముగ)

* ఇతడు మలిదేవరాజాదుల తండ్రి. చనిపోవునప్పు డతడు తన భార్యలను బుత్రులను నెదుటికి రప్పించి బ్రహ్మనాయుని కొప్పగించెను. తరువాత నాయకురాలికుట్రచే ననుగురాజు పుత్రులైన నలగామ మలిదేవాదులు వేఱైరి. మలిదేవులకు బ్రహ్మనాయుడును, నలగామరాజాదులకు నాయకురాలును అమాత్యులైరి.

గత జలంబుల కడ్డుగట్టినరీతి
(జరిగినదానికిఁ జర్చలేమిటికి
ఆవలీవలి వారినరసిరక్షింప
భారంబునీయది బ్రహ్మనాయఁడ
కౌరవతతి నెల్ల కదనంబునందు
కూఁకటివేళ్ళతోఁ గూల్చియామీఁద
బహుళార్తినడవుల పాలైరిగాక
పాండవులేమేలు పడసిరి చెపుమా?
చేరిమీరొక నరసింగునికొరకు
సకలభూపతులను సమయంగఁజేసి
పాడైనరాజ్యంబు పైనిబెట్టికొని
చివరకుఫలమేమి చెందంగఁగలరు
పొందికఁగలహంపు బుద్ధులుమాని
సవతిపుత్రులకిప్డు సంధియొనర్చి
అనుకూలమునసుంట యర్హంబుమీకు)
అరయనింతియ కార్య * మనుగురాజాన
సీయానమే మింక నిల్వమిచ్చోట
నాయినిఆవీర నాయకులనిరి

(వీరులు రోష వాక్యము లాడుట.)

పాపంబుచేసిన పగవాడువచ్చి
కనుపట్టశిక్షింప కర్తవ్యమగును
సమానంబొనర్చిన జనులుదూషించి
భయపడిరంచును పరిహాసించెదరు
పగవారియెడ దయ పాటింపదగదు
హత మొనర్చుట మంచిదనువైనవేళ
† భాండంబునెగబట్టి బలురాతిమీద
వేసిపగిల్చిన విధమునమించి
తరిచూచిశత్రుని దండింపవలయు
హస్తగతుండైన యట్టిశాత్రవుని
పొమ్మనిసెలవిచ్చి పోరాడుటెంచ
చెట్టెక్కిఫలమును చేనంటిచూచి
వేగమెదిగి రాతవేసినట్లగును
తెంపునవీరు లీతీరుననిన

(కొమ్మరాజు వీరుల వాక్యములఁ బూర్వపక్షము సేయుట.)

చెవులుకెందునుమూసి శ్రీకంఠుదలచి
నయమునకొమ్మ భూనాథుడిట్లనియె
చేతికిచ్చినవాని ఛేదించినట్టి
పాపంబునెబ్బంగి పాపికోవచ్చు
(చిన్నరహస్యంబు సెప్పెదవినుము
చతురంగబలముల చందమట్లుంచి
మానసంబైనట్టి మర్మంబుకనుము
ప్రజ్వరిల్లెడు వీరభావంబుమీద
స్వకృతాపరాధంబు ప్రాబల్యమొంది
తొడిబడజల్లని తుంపురుల్ చల్ల
జ్వలనంబుక్షీణించి చల్లారగడగి
ధర్మతత్పరుడైన తద్జ్ఞునియెదుట
మలుగఁబోయెడి చిరుమంటయైయుండు
సైరించితలవంచి శరణనివేడి
సగముక్షీణించిన శత్రుసిబట్టి

---

* మలిదేవరాజుయొక్కయు, నలగామరాజుయొక్కయుం తండ్రి.

† [ఈపద్ధతి ఆదిపర్వంలో కణికుడు చెప్పినవచనాన్ని అనుసరించినది.

"ततः प्रत्यागते काले भिन्द्याद्घटमिवाश्मनि"

అని కణికోక్తి.]

చంపుటయేనీతి? సర్వజ్ఞులార
అలరాజుఁ జంపిన యట్టి నేరంబు
మహితుఁడౌ నలగాము మానసమందు
చురుకుచురుకుమన సూదియైపొడువ
తానొనర్చినయది తప్పని తెలిసి
సిగ్గు చేదలవంచి చేరియున్నాఁడు)
శరణనివచ్చిన శత్రువునైన
కాచిరక్షించుటే ఖండించుటరయ
కాదనికసిపోవ ఖండింతుమేని
ఇహముననిందింతురెల్ల వారలును
పరముననరకంబు ప్రాప్తించుసుమ్ము
పగవానితమ్ముఁడు పాదంబుబట్ట
రక్షింపఁడా? మును రామభూజాని
అని భానుకులనాథుఁ డాడుమాటలకు
మనసులోశోకంబు మానినాయకులు
సంధికార్యమునకు సమ్మతులైరి
అటవీరవరులకు హర్యక్షుఁడైన

(బాలచంద్రుఁడు నలగొండ శిఖర
మునుండి రణరంగంబు
నవలోకించుట.)

బల్లరగండఁడు బాలచంద్రుఁడు
* నలగొండపైనుండి నాలుగుదిశలఁ
పరికించికనుగొని భావముప్పొంగ
వెలమదోర్నీనితో వివరించిపలికె
ఎరిగియుండుదువె నీవీశిబిరంబు
అడిగెదగురుతుల నవిచెప్పవలయు
అనినదోర్నీఁడను అతనితోఁడ
చెప్పశక్యముగాదు సేనలతెరఁగు
వెలయఅంబుధివెల్లి విరిసినరీతి
నలగామభూమీశు నమ్మినసేన
ఉన్నదినామది ఉత్తలపడఁగ
ఇసుకచల్లినబడ నెడమేమిలేదు
నేలయీనినరీతి నిండియెసంగు
చుట్టుకొండలఁ నిల్వజూడనొప్పుచును
రణరంగభూమివిరాజిల్లసాగె
(వెనుకటిరాజులు విక్రమస్ఫూర్తి
గట్టునచెలరేగి కదనంబుసల్ప
వీరులరక్తంబు విసువకత్రాగి
మత్తిల్లియల్లన మలయుచునున్న
నాగులేరల్లదె నాయునిసుతుఁడ)
పాలేటికరముచే పగిలిభూధరము
నాగాధిపతి ప్రాణనాశంబుచేసి
నడుమునఁగా పారిన నాగులేరాయె
కన్నులపండువై కన్పించెచూడు

---

* [ఇట్లానే రాముడు సువేలాద్రిని, రావణుడు తన ప్రాసాదశిఖరాన్ని యెక్కి శిబిరాలను చూస్తారు.

"सुवेलं साधुशैलेन्द्र मिमं धातुशतैश्चितम्,
अध्यारोहामहे सर्वे………………………
लंकांचालोकयिष्यामो निलयं तस्य रक्षसः।" (रा. यु.)

అని.

"इत्युक्त्वा परुषं वाक्यं रावणो राक्षसाधिपः।
आरुरोह ततः श्रीमान् प्रासादं हिमपाण्डरम् ॥" (रा. यु.)

అని వాల్మీకి.]

ఉభయపక్షంబుల ఒప్పైనబలము
నివసించియున్నది నిశ్చలమతిని
హద్దులుచెప్పెద నవిచిత్తగింపు

(దోర్నీడు శిబిరంబునకు హద్దులు
వివరించుట.)

* జువ్వలకల్లను సొగసైనపల్లె
† సన్నెగండ్లఅనంగ జవరనియూరు
తూరుపుదిక్కున తుదిమేరసుమ్ము
దక్షిణదిశహద్దుతగ వివరింతు
నాగులేటికి తూర్పు నలగొండకాని
చెలువైన ఆ ‡ వప్పిచెర్ల చెలంగు
పడమటికినిహద్దు బాలచంద్రుండ
కొదమగుండ్లయనెడి గురగ్రామమొకటి
ప్రజలమేలిమి § చింతపల్లియునొకటి
ఉత్తరదిశ యెల్ల లొయ్యనగాంచు
ఇకగొన్ని గురికొండ్ల నేర్చెదవినుము
జన్ని దేవరగుళ్లు ♦ సపనాలమేడ
వంగతోటలబైలు వన్నియకెక్క
సింగభూపతిచెర్వు శ్రీకరమైన
సంగడిగుళ్లను సర్వేశుడైన
ఉత్తరేశునిగుళ్లు నూర్జితాకృతిని
ఉయ్యాలకంబంబు నున్నట్టితావు
గరుడకంబముదాకి కలజువ్విచుట్టి
నల్లగొండనుహత్తినాగులేరంటి
విడిసియున్నదిదండు విభవంబుతోడ
ఆశ్చర్యమైతోచె అదియేమొమదికి
నరనాథుడైనట్టి నలగామరాజు
గొల్లెనచుట్టునుగూడికాపాడు
సేనాధిపతులను చెప్పెదవినుము
పడమటిదిక్కున పాజుల బ్రహ్మ
సంకోజిగణపతి సరవితూర్పునను

నాయకురాల్ దక్షిణంపుదిక్కునను
దంటలైయుండిరి దక్షతమెరయ
అంచెలరాముండు నానెమలిపురి
ముమ్మడిరెడ్డియు మొనతీర్చినట్టి
$ పొందుగులను నేలు భూరివిక్రముడు
వీరమల్లునట్టి విఖ్యాతుడొకడు
ఉత్తరభాగాననుండిరి వేడ్క
ఇందరినెల్లను హెచ్చరించుచును
తిరుగుచునరసింగ ధీవరుడుండె
విక్రమసింహంబు వీరకామేంద్రు

డబ్బంగి సేనతో నచ్చటవిడిసె
మాన్యబలుండైన మలిదేవుసేన
మార్కొనియున్నది మనసుంచికనుము

---

* కార్యమపూడికిఁ దూర్పుగ షుమారు 3 మైళ్లదూరముననున్నది.

† కార్యమపూడికిఁ గొంచెమాగ్నేయ దిశయందు $1\frac{1}{2}$ మైళ్లదూరమున నున్నది. దీనినే పేటసన్నెగండ్ల యని కూడఁ జెప్పుదురు.

‡ కార్యమపూడికిఁ బడమర $1\frac{1}{2}$ మైళ్లదూరమున నున్నది.

§ కార్యమపూడికి వాయవ్యదిశయందు $1\frac{1}{2}$ మైళ్లదూరమున నున్నది.

♦ ఇది వెనుక యజ్ఞములు సల్పుచోటైయుండును.

$ ఇది పల్నాటిలో కృష్ణాతీరమున ఉన్నది.

ఘనమైనతురగముల్ కాలిబలంబు
బల్లాని పెట్టెలు పటువీరవరులు
మహితనాగానది మహాగండ చేసి
వరలు రేవంతుని బైలులోపలను
దీపించుపడమటి తీరంబునందు
పరవీరభయదమై బలమెల్లవిడిసె
చాలుపు తేరులు సమదేభములును

మనవారికెనయైన మానవుల్ గలరె
ఒక్కొకవీరుడె యొక్కొకలక్ష
దళమును సమయింప దగియున్నవాడు
చెలువైననలగాము సేనకునెదిరి
కడలికిచెలియలికట్ట చందమున
మనబలమున్నది మహిమమీరంగ
అని తెల్పుదోర్బ్ని కనియెబాలుండు

(నలగొండ దిగి రాజవర్గనఘునకుఁ
బోవుటకై బాలచంద్రుఁడు
గమకించుట.)

బలమెల్లసాంద్రమై వ్యాపించిదిశల
కిక్కిరిసిచెలంగు కేరివీక్షింప
ఎక్కడసందులే దిసుమంతయైన
మార్గంబుగనదుసూక్ష్మంపుమాడ్కియైను
రాడాయెనంచును రాజు చింతించు
ఆలస్యమిచ్చటనాయెను మనకు
అపకీర్తిపాలౌదు ఆడికవచ్చు
తెంపుననొకదిక్కు తెగటార్చికొనుచు
శౌర్యసంపదమీరచయ్యనబోయి
కలసినవీరులు కలహించిమనల

ఎంతకోపింతురో యేమిపల్కుదురో
అరువదేగురునుతా మటులుండగానె
పడుచుతనంబున బాలుడువచ్చి
యెంగిలిచేసి నాయెదుటిబలంబు
నేనుందమీపట్ల నీపిన్నవాని
అనినిందచేయుందురల జడియగును
తెగనికార్యంబాయె తెలియదుమనకు
ఇరుగడవారల ఇచ్చలీవేళ
ఎబ్బంగిచెలియుద మెవరుచెప్పెదరు
సంధికార్యంబింత సమకూడెనేని
విచ్ఛిన్నమైపోవు వేసుకతగ్గు
పొందినకార్యంబు పొసగంగనీక
పగతెచ్చెవీడని ప్రజలాడగలరు

నవ్వుదురవనిపుల్ నామోముచూచి
ఛీకొట్టగలరిక సిగ్గెల్లబోవు
నాతండ్రికొడుకని నన్నుచేపట్ట
డనిపలువిధముల హర్షంబుతగ్గి
పలుకంగచెలికాండ్రు బాలునికనిరి
వినుబాలచంద్రుడ విద్వేషదభయద

(బాలచంద్రుఁడు కార్యముపూఁడిం
జేరఁగదలుట.)

పరశురాముడవీవు బాహులబల్మి
పరగజమార్యక్ష పావనమూర్తి
శౌర్యగంగాధర సర్వజ్ఞచంద్ర
కదనగాండీవికి కడుపునబుట్టి
ఈనిందపొందుట కేమికారణము

కులవైరముం దీర్చి కొనవలె భూమి
పోనివ్వ గూడదు పోరు నిశ్చయము
కూర్మితో మలిదేవు కొల్వులో జొచ్చి
వీరుల గనుగొని వేడ్కమై మ్రొక్కి
కలనిలో మీరున్న కారణంబేమి
అనతెండని వారి నడుగంగ వలయు
కామునితో సంధి కార్యంబు చేయ
ఉన్నార మితరంబు లొప్పవు మాకు
అని మాటలాడిన ఆవలి కేగి

దర్పింత మప్పుడు ధరణీశవరుని
రాజు పంపగ బోయి రణ మొనరింప
ప్రాప్తమా దేవేంద్ర పట్టణవాస
మనిపల్క బాలుండు హర్షంబు నొంది
శైలంబు పైనుండి సాహసం బొప్ప
బిట్టురెక్క భూమిపై పృథ్వి పుల్వడక
బలువైన మందర భ్రమణంబు కతన
కలక జెందినయట్టి కంధిచందమున
తరితీపు ప్రాపించి ధైర్యంబు వదలి
బలమెల్ల భయపడి పారగసాగె

తురగముల్ గజములు ధూళి మిన్నులమ
బంధంబు లూడ్చుక పరువులు పెట్టె
దండెల్ల నీరీతి దత్తర మొందె
తమ్ములు బలమును తనవారలెల్ల
కలసిరి బాలుని ఘనమోద మలర
అంతట ఆబాలు డధిక శౌర్యమున
పరిఘముల్ టెక్కముల్ బలుసాధనములు
శస్త్రమైతగు భద్రసాలేయము కాడు
జగజంపు ఛత్రంబు జయమున గొన్న
సకలమా బిరుదులు సరసరంజిల్ల

భయదమై నరసింగు పాలిటి మృత్యు
వీరూపమున వచ్చి యొదిరించె ననగ
బ్రహ్మన్న తనయుండు పటుసాహసుండు
తొలగుడీ తొలగుడి దూరానటండు
డెదుట నిల్వకుడంచు హెచ్చరించుచును
బలముల నన్నిటి పాయదోలుచును
మలిదేవు గొల్లైన మార్గంబు వట్టి
వచ్చెడు చందంబు భావించి చూచి
సంధి కార్యమునకు చనుదెంచినట్టి
దొరల మొగంబుల తొలగె తేజంబు

వెలవెల బారుచు వేడుక లుడిగె
ఒకరి మొగం బొక్క రొయ్యన జూచి
ఇక నేమి చక్కటి యేమి కార్యంబ
దితడు రాకుండిన కొనగును సంధి
ఇక సాగ దవ్వారి హితవిచారంబు
దైవకృతం బేరు తప్పింపలేరు
అని చింత సేయుచు నక్కటా యనుచు
కళ తప్పి నిలిచిరి కడు చిన్నపోయి
మలిదేవభూపతి మంత్రియైనట్టి
బ్రహ్మనీడాతని బంధువర్గంబు

సమరసంతోషితాత్సకలవీరులును
కొల్వుకూటంబున కూర్చుండి రెలమి
బాలచంద్రుండంత ప్రాభవం బొప్ప
రాచబిరుదులతో రంజిల్లుచుండి
తమ్ములు కొల్వగ దరగని వేడ్క

* వనజాక్షసుతురీతి వచ్చెనాసభకు

(బాలచంద్రుఁడుసభలోఁబ్రవేశించి
రాజదర్శనమునకు మార్గ
మిమ్మని సభాస్తారుల నడుగుట.)

వీరులుకైతవ విభవంబెసంగ
కార్చిచ్చుభంగినికనలి కోపించి
భూవరుదర్శింప బోవసందీక
ఉన్నభావము బాలుఁడొయ్యనఁదెలిసి

సౌందర్యసాంద్ర రాజ సభాస్థలంబు
కనుగొంటి సంతోషకలితుడనైతి
విష్ణుసన్నిభుడైన విభునిజూచెదను
తెరుచీయవలెమాకు ధీరాత్ములార
అవదానిఆలింక మెప్పొడుకినిసి
బాసదబ్బరగండ బ్రహ్మన్నసుతుఁడు
(మంచుకారడువుల మంటచందముల
రణరంగమునయందు రాజిలువాఁడు
ప్రారబ్ధకార్యంబు వదలనివాఁడు
కొరగానికోర్కులు కోరనివాఁడు

సుఖదుఃఖభేదంబు చూడనివాఁడు
తనదేహకష్టంబు తలపనివాఁడు
పరులకార్యములకై పనిచేయువాఁడు
ఆత్మధర్మాధీనుఁడైనట్టివాఁడు
పల్నాటివారికిఁ బ్రాణహితుండు
మహావీరవరులకు మార్గదర్శకుఁడు)
వాసిగరేచెర్ల వంశవర్ధనుడు
(ప్రయతచిత్తుండగు బాలచంద్రుడు)
పదములందట్టించి బాహువులెత్తి
సాహసోత్సాహుడై శౌర్యంబుమెరయ

కలికిసింగపుపిల్ల గంతుకొన్నట్లు
కుప్పించిదుమికెను గురుజవమొప్ప
వసుధేశుసన్నిధి వ్రాలెనువేగ
పిడుగుపడ్డవిధంబు పృథివికంపించె
సన్నిధినిల్చుండి జగదీశుజూచి
అతిభక్తిమ్రొక్కిన నటుమొగమాఱె
కడుభయభ్రాంతుడై కరములుమోడ్చి
ఏమిచేసితిరాజ యేలకన్గొనవు
నాయందుతప్పేమి నన్నేలువాడ
అనిప్రార్థనముచేయ అకొల్వులోన

(బాలచంద్ర కన్నమదాసుల
సంవాదము.)

గాసిల్లుకన్నమ కడురోషవశత
ఉలికిపాటునలేచి ఉగ్రుడైమెరసి
ఘనరౌద్రభరితుడై ఖడ్గంబుదూసి
చయ్యనజళిపించి సభజూచిపలికె
కంటిరాబాలుని గద్దరిపనులు
తనసాటిబలియుండు ధరలేడటంచు
మత్తిల్లిమరచెను మావంటివారి
చులకనైతిమి వీనిచూపులకేము
దండిశూరులుచూడ దట్టించినిన్ను

---

* కర్ణుఁడు.

ఖండించివైచెద గనియలుగాఁగ

ఏపాటిదంటవు నీవుమాకన్న
మాపేరువిన్నంత మదిలోనబెగడి
ఉభయదళంబులు సులుకుచునుండు
సభలోననీవుంట సహ్యంబుగాదు
సరసుడవగుదువు చయ్యనచనిన

అనవినియాబాలు డప్పుడిట్లనియె
బంట్లుమీరలుగాక బవరంబునందు
మే మేడబంట్లము మీసాటిగాము
సరిగబంచినయూళ్లు సర్వంబు విడిచి
విపినశైలంబులు వేసటలేక

తిరిగితిరెవ్వరు దీటులేరైరి
వాగులనీళ్లను వనములబండ్లు
తినుచునుమితిలైన దినములన్నియును
జరగఁగాఁజేయుచు సమరంబుమరచి
ఉన్నందుచే వీరయోధులామీదు

శూలఖడ్గములకు త్రుప్పులుపట్టె
పాపికొనగ మీకు బవరంబులేదు
పగవారుకన్నుల బడకున్నవారు
పగచేసిమముగూల్చి పాపికోత్రుప్పు
సభలోననేనిట్లు చౌకళించితిని

పార్థివుబోడగాంచ వచ్చినయప్పు
డెవ్వరునెదమీయరే నీతిచెపుమ?
పంతంబుచెడినేను బ్రతిమాలలేక
ఒయ్యనమీదుగా నురవడిజనితి
తప్పేమినాయందు దగవర్లనడుగు
కులవైరముండిర్ప గూర్చుండుటేమి

పరభూములందెల్ల పరువులువారి
వనములకృశియించి వచ్చినందునను
మేనునబడలికల్ మించెనోయేమొ
అరితిబడలికలంటెనా మీకు

పగవారివిసరి బండికన్నగును
భావించికొనదగు శౌర్యములుమీర
లనినకన్నమ పల్కె నాబాలుతోడ
పడుచువాడవునీవు పలుమాటలేల
కొలువులోవిషయంబు గురుతెరుంగకయ

ఈతేపపలికిన నీకత్తిచేత
తలతెగవేయుదు ధరణీశునెదుట
అనినతామసపడి అపుడుబాలుండు
కులశైలధీరత గొబ్బునపలికె
కడలిమధ్యంబున గడ్డయున్నట్లు

వ్రాలియున్నారు శాత్రవులమధ్యమున
మున్నీరుపెరిగినా మునుగునుదిన్నె
శాత్రవబలములు సమయంబుచూచి
నల్దిక్కులను ద్రొక్కి నడచినవేళ
ఏమాదురోమీర లెరుగకయుండి

రిపువిచారింపక యేలవచ్చితిరి
మీరుమాత్రమె రాక మేదినీశ్వరుని
ఏటికిదెచ్చితి రీస్థలంబునకు
ప్రజలాడికొనుటలు పరికించివినరు
గొల్లెనలోజేరి కోపంబుచేసి

పదరినమాత్రన ఫలమేమిచెపుమ
బ్రహ్మనాయుడు నీకుబంధువుడెట్లొ
వినిపింపుకన్నమ వివరంబుగాఁగ

అనినకన్నమవల్కె నాతనితోడ
నాయుండువిష్ణువు నారాయణుండు
ప్రకటదయాంబుధి వరముఁలోసంగె
తగజనించితినేను తల్లిగర్భమున
పరమపావనమూర్తి బ్రహ్మనాయునికి
పాదసేవకుడనై పరగినవాడ
భుజములముద్రలం పూనినవాడ

క్షుద్రమార్గులజొప్పు చూడనివాడ
ప్రాసాదజీవినై ప్రబలినవాడ
జ్యేష్ఠపుత్త్రుడనంగ చెలగినవాడ
పుట్టితివీవన్న పురుషోత్తమునకు
దట్టించిపలికెదు ధరణీశునెదుట

పడుచువాడవునీకు వాగ్గర్వమేల
అనవినిఆబాలు డప్పుడిట్లనియె
చెలగిబ్రహ్మన్నకు జ్యేష్ఠపుత్త్రుడవు
తలదన్నిపుట్టిన తమ్ముడనేను
కదిసిఅగ్రజుతోడఁ గద్దలంచేసి

త్రొక్కుచుబోవచ్చు తోడరినకూర్మి
ధరణీశుబోడగన దాటితినన్న
అంతమాత్రమెసుమ్ము హంకారమెరుగ
అనిపల్కెకన్నమ అటతలవంచి
భైరవఖడ్గంబు పదవైచిధరణి

చిరునవ్వునవ్వుచు చేరిసోదరుని
ఒనరంగజెత్తుక ఉర్వీకిదించి
తప్పునాయెడనుండె తమ్ముడాయనను
బాలచంద్రుడు హర్షభావమునొంది
భ్రాతలునుందాను రాజునుజూచి

జోహారుచేసిన చూడకాభూపు
డూరకతలవంచియుండెను బాలుం
డందుకువెరగంది అనుజులకనియె

(బాలచంద్రుఁడు మలిదేవభూపతిని
సమ్ముఖమున దూషించుట.)

తెలిసెనా? ధరణీశు తెరగెల్లమీకు
పగతీర్చికొనుటకు బవరంబుచేయ
మితిమాడుకాలలని మేకొనిచెప్ప
మదిలోననామితి మరచెనోయేమొ
యెందకన్నెరుగని యీరాజచంద్రు
డవనిశాత్రవులకు నర్పించిపెక్కు
కానలద్రిమ్మరి కాయంబుడస్సి

నీడలనిలిచిన నీళ్ళద్రావి
పొలపుదూరలుచాల భుజియించెగాన
పనరుకన్నులకెక్కె పలుకకున్నాడు
మంచిమందిచ్చిన మానునువేగ
అనిపల్కుమాటల కదరుచుగండు

(గండుకన్నమనీఁడు బాలచంద్రుని
వాక్యంబులఁ బూర్వపక్షము
చేయుట)

కన్నప్పయల్లుని గనికోపకలన
భర్జించిఅనువైన పల్కులననియె
ఇటువంటిమాటల నేమిఫలంబు
తప్పంతమనయందు దట్టమైనిల్చె
ఏలికతనవియెదవే కొరిగింతు

పగవారిచర్యలు భావమందెరిగి
కులవైరమునుదీర్చికొనుటకు మనము
వచ్చుచుతగవుకు వసుధాతలేంద్ర
తెచ్చుటయొకతప్పు త్రిపురాంతకమున
కలహమేర్పరచక కలనుకంబంబు
తర్లింపరెండవ తప్పనియెరుగు
కంకణంబులపల్లె కడహస్తములను
కంకణధారణ కాంచమూడవది
తెగిరణభూమిలో దిగుటనాల్గవది
తరిమిశత్రులువచ్చి తారొక్కన్నపిదప

కలయవిచారించు కార్యమైదవది
యీరైదునేరము లెవ్వరివగును?
పంచాపరాధముల్ వైరులయందు
కలవవిచెప్పెద గ్రహియింపగడగు
పరిరాజ్యమోర్వక సంగ్రహబుద్ధి
కోడిపోరునగెల్చి కొనుటమొదటిది
పసులకుపంపుట పరుసరెండవది
జామాతజంపుట సరవిమూడవది
భట్టునుమనవారు పంపించినపుడు
వెళ్ళదోలించిన విధమునాల్గవది

కూటువమూకల గూర్చుకవచ్చి
గర్వించినిల్చిన కార్యమైదవది
ఎక్కువతక్కువ లీరీతినుండ
తెలియకధరణీశు డెగిమాటలాడ
అపరాధమంటదా యదిసీతియౌనె
యెక్కువమాటల నికనాడబోకు
మనసురాకుండిన మగిడిపోవేగ
అనిపల్కుమాటల కాబాలుడనియె

(కన్నమనీనివాక్యంబులకు బాల
చంద్రుండు ప్రత్యుత్తరం బిచ్చుట.)

మేరతప్పెనటంచు మీరిపల్కితివి
మేటిబ్రహ్మనవాకు మితితప్పరాదు

చుక్కలురాలిన సూర్యుండుతప్పి
పడమటబొడిచిన పాథోధిమించి
చెలియలికట్టపై చెంగలించినను
చల్లనైననువహ్ని సత్యసంధుండు
నాయునిమాటకు నమ్మికగలదు
పగవారికలుకుచు పలికితివయ్య
ఇటువంటికార్యము లెందుకుజరుగు
పగవానిసేనలో బల్విడిజొచ్చి
కరములుశిరములు ఖండించివైతు
దగ్ధముచేతుందు దావాగ్నిరీతి

చిన్నవాడంటివి చెలగియాకలన
అలనాడుగురిజాల నయినట్టిపగకు
చేపట్టియిల్లడ చేయగాలేదె
అపుడుబాలుడనాడు అఖిలభూపతుల
కెదిరియుద్ధముచేయ నేనిల్చినప్పు
డపకీర్తిమాటల నాడుటతగనె
వినగూడదీమాట విడువుముచాలు
అనిచెప్పిసభలోన నందరువినగ
వీరులవేశ్వేర పిలిచిరోషమున
మలిదేవుసన్నిధి మండుచుబలికె

ధీరాగ్రణీవంకి దేవరాజేశ

(బాలచంద్రుఁడు యోధులకు రోషమువచ్చు మాట లాడుట.)

(వీరుఁడనని పేరు పెట్టుకనీవు
ప్రతికియుండంగనే పగరునీసుతుని
పట్టిచంపిరిగదా భయమింతలేక
కార్యంబునీయందు చచ్చెనాయేమి?
ముక్కుదూలముమీదఁ బొడిచినయపుడు
గుర్రమనగలేని కోపమెన్నటికి)
శంకింపగానేల సమరంబుకదిసె
వీరనిసుద్దుల దగజాలవేల
ధనువుశింజినిలాగి ధ్వనిచేసితేని 21/10
బ్రహ్మాండభాండము ల్పగిలినట్లుండు
ఎనలేనివిలుకాడ విటువంటినీవు
తనయునిచావుకు తాళెదవెట్లు?
అవాలనాయుడా అపుడుపంతములు
పలికిననీవేల పరవశుడైతి
తలపోయగా వీరధర్మంబుమరచి
నిద్రించుచుండుట నీతియౌనీకు
విముఖతలేనట్టి వీరుడవీవు
కట్టితివి దాశౌర కత్తిపట్టితివి
పగయాదలేనట్టి పౌరుషమేమి?
మితిమూడునెలలాయె మెదలకున్నావు
నీవంటిజగజెట్టి నేజూడలేదు
మామకన్నమనీడ మగటిమియేది
కదలనికంబంబు కాలినంకెలలం
పొందించిచావుకై భూనినిల్పితిరి
కంబంబుచెదలంటె కదలించిచూడు
సంకరరాముడా చుట్టుడొంకెనలు
త్రుప్పలువట్టెను దొడరవదేల
చెవులనాయకులార చెరగాడుబంటు
లిచ్చగించరుమని సెంగిలిపోటు

మేటిశూరులనాజి మెచ్చనియట్టి
నమ్మినజంగిలి నాయకులార
తగుబల్లికేడెముల్ దండచక్రములు
పోగొట్టిపోరయ్య పోరుమీకేల
వీరయోధులుగదా పెనుమాలవారు
గాయగోవాళాఖ్య గలబిరుదములు
పగతురుగనకుండ పాతుడిభూమి
బాదన్నరాహుత్త పాటవమేడ
సంపెటనారన్న జయమగుబిరుద
మెక్కడికేగెనీ వెందుదాగితివి

(జడతనిద్రించెదు కార్యాత్ములార
యుద్ధతయుద్ధ సూర్యోదయంబయ్యె
తరచుగాఁగల్గు కర్తవ్యముల్ గలవు
లెండుకాలంబయ్యె లెండులెండిక)
అనిబాలుడుగ్రుడై అదలించిపలుక
వినిబ్రహ్మనాయుడు వేగమెలేచి
తనయునికెదురేగి తాగారవించి
అర్ధాసనంబున ఆసీనుజేసి
పలనొప్పదంటగ వచ్చినవారి
కొల్వకుబిలిపించి కూర్చుండుడనిన
కూర్చుండిరందరు కూరిమిమెరయ

కూర్చినవారల కుశలంబులడిగి
తన కార్యమంతయుం దగవినిపింప
వినిబాలుడీర్ష్యతో వివరించిపల్కె
శాత్రవు * లలరాజు చంపినయట్టి
కోపంబు మదిలోన గూర్చుటమాని
పందమాటలు పల్క పంతమామీకు
ఉద్వేగభరజనితోగ్ర రోషాగ్ని
భస్మీకృతాఖిల పరరాజవిపిన
బ్రహ్మన్న నాతోడ బల్కకుమయ్య

వదలకరాజును వంచించినపుడె
నా చేతికత్తితో నాయకుల్ జూడ
తల తెగగొట్టుదు ధరణీశు నెదుట
సత్యంబుపల్కితి శంక నాకేల

(కొమ్మరాజు బాలచంద్రుని
కోపంబు చల్లార్చుట.)

అనకొమ్మభూపతి అల్లునిడాసి
వినయంబుతో రెట్టవిడువకపట్టి
నాయన్న వినుమయ్య నలినాప్తతేజ
సంధికార్యంబేగి శత్రులచేత
పరగజచ్చినవాడె బాలుడుసువ్వె
అరయమాసుతుడైన అలరాజవీవె

వచ్చిమనలజూచి వారనిభీతి
బిరుదులుత్యజియించి పిరికిపారుచును
అనుజునిలోబడి అర్చించినపుడె
క్షత్రియజాతికి చచ్చుటసుమ్ము
చలమునబోరాడ సారస్యమేమి
చేతికిచ్చినశత్రు చెలగివధింప
పలుపాతకంబని పల్కె వేదంబు
లెన్నిజన్మములకు నేక్రియనైన
పాయదు పాపంబు పట్టిపీడించు
అనియితిహాసంబు లతనికిజెప్పి

కౌగిటజేరిచి కడుబుజ్జగించి
మనసు పెట్టకుమన్న మసలకుమన్న
మామాటవినుమన్న మన్నింపుమన్న
వినిబాలచంద్రుడు వినయుడైయుండె
చలమెల్ల విడనాడి సంధిమేకొనిరి
తరువాతకొందరు దర్పముల్ మీర
నేచేటుపాటైన నేమిమాకేల
విందులుభుజియించి వేగమెపురికి
పోవలెజాడ్యంబు పూనకుడనిరి
ఇరుపక్షములవారు నింపుసొంపెసగ

పొదలిన సంతోషమున నాడుచుండి

(అనపోతు మేడపికేగుట.)

రంతట మేడపి కనపోతుచేరి
మాంచాల మేడకు మక్కువ నేగి
వినయంబుతోడ ఆవెలదినిజూచి
పల్లవమృదుపాణి బంభరవేణి
కంజాతలోచన కరిరాజగమన
శంబరరిపుబాణ సాధుసమ్మాన

* 19-వ పుటలో వివరణముఁ జూడుము.

గంధఫలీనాస కౌముదీహాస
పావనగుణసీమ భామాలలామ
(అధరనిర్జితబింబ) అధికనితంబ

వరవసంతునిపిక వనములచిలుక
లావణ్యవదన ఓరాకేందువదన
రమణినేవచ్చిన రాకనాలింపు
* అన్నబాలుడుపంపె అతివనీవద్ద
ముత్యాలహారంబు ముద్దుటుంగరము
కలవవితెమ్మన్న గదలివచ్చితిని
మరచినవస్తువుల్ మాచేతికిమ్ము
త్వరగబోవలెనేను బాలునికడకు
అనఅనపోతుతో ననియెమాంచాల
యేమానవాలయ్య యాపదార్థముల

కనబ్రాహ్మణోత్తము డావెనుజూచి
కూరిమిపాన్పుపై కూర్చుండితాను
పైటకొంగొయ్యన బట్టిలాగినను
ముత్యపుచేరులు మొదటికితెగిన
అవికనలేకుంట అనవాలమ్మ

అననినిమాంచాల అవునయ్యతత్వ
శాస్త్రముల్ వేదముల్ చదివినవాడ
విరుగపైతివిగదా యారహస్యంబు
తమ్ములంపిలిచిన తరితీపుతోడ
విడివడ్డముత్యముల్ వెదకికూర్పంగ

వ్యవధిలేకుంటచే బాలుడువెడలె
మాటతెల్విడినీవు మదివిచారింపు
కారణమేలేదు కలనికిబోవ
మీయన్నబాలుని మితిచేసివారు
పౌసగపట్టము గట్టమూడుమాసములు
మితివెళ్లెగావున మీవారిగలయ
చనియెనుమీయన్న సమరంబుకడకు
వీరమేడపినీవు వెలయరక్షింప
బాలచంద్రుడునీకు పట్టముగట్టె
అందుచేరణమున కరుగంగగూడ

దనవినిబ్రాహ్మణు డత్యుగ్రుడగుచు
విముఖుడైయచ్చోటు వెడలియేతెంచి

(అనపోతు శ్యామాంగి గృహ
మునకుఁ జనుట.)

శ్యామాంగి యింటికి చయ్యనవచ్చి
పలికెనాయనపోతు భామతోనపుడు
ముత్యాలగళమాల ముద్దుటుంగరము
మరచివచ్చితినేను మగిడినీవేగి
అడిగితెమ్మని పంపెనానవాలడిగె
కదళీఫలాలపైకల్గుచర్మంబు
ఇచ్చితిఫలమని యిదియానవాల
టన్నభామినినవ్వి అనపోతుకనియె

ఆసలేనట్టియీ ఆనవాలంది
యెందుకువచ్చితివిది పొల్లుమాట
మరచుటదాచుట మావద్దలేదు
మాయమాటలుచెప్పి మరలపంపించె
కనలేకవచ్చితెగద భూసురేంద్ర

* సోదరుఁడు. అనిన నని యర్థముకాదు.

అనిపల్క బ్రాహ్మణుం డమితరోషమున
వెడలుకోపాగ్ని చే వెడలుచువేగ

(బాలచంద్రుఁడు మేడపైనుండి
మరలుట.)

కదలిఆ త్రిపురాంతకమునకువచ్చి
బాలుని తెరగెల్ల ప్రజలనడిగె
ఆతీరు మేమేమి అరయుటలేదు

మూకలుగూడెను ముందరిదెసను
తెలిసికొమ్మనివారు తెల్పదివ్రముగ
అచ్చటికేగియా అవనీసురేంద్రు
డశ్వత్థతరువున కమరంచినట్టి

(బాలచంద్రుఁడు వ్రాసిన పత్రము
ననపోతు చదువుట.)

పొందైనపత్రిక పుటనెగనెత్తి
తిన్నగాజదివె నీతీరునదాని
శ్రీగిరీశునియాన చెన్నునియాన
మలిదేవరాజాన మాతండ్రియాన
అర్వదార్గురువీరు లందరియాన
త్రోసివచ్చితివేని ద్రోహమంటెడును

బాలునిమిత్రుల ప్రాణంబులకును
తప్పినలాగౌను తరలితివేని
ఆనలుమీరుట అదినీతిగాదు
తనసంగడీలతో తరలెబాలుండు
సాహసముననీవు సాగిరాగూడ

దనునట్టికతినంపు టానలుచదివి
చండాగ్నిపైనూనె చల్లినరీతి
భీకరకోపాగ్ని పెనగెచిత్తమున
అప్పుడుభూసురు డధికదుఃఖమున

(అనపోతు బాలచంద్రునిగూర్చి
నిష్ఠురవాక్యంబులాడుట.)

దంటనౌననువీడ ధర్మమానీకు
మంచితనంబున మన్నించినన్ను
పొమ్మన్నపనులకు పోయితిగాని
తప్పానవాలని తలపకపోతి
నిజమనిచెప్పిన నీయానవాలు
తబ్బిబ్బులంచెగ తాళిసనిపిరి
నిజమువిచారించి నీవున్నకడకు
వచ్చితివిడనాడి వడినేగినావు
వగవనేసందుకు వరగుణశాలి!
నీనాతిమాంచాల నీపొందుకత్తె
హాస్యంబుచేసినారానవాలెరిగి

వెంగలినైతిని వెలమలవద్ద
కలిమికోసమువచ్చి కలియుటలేదు
కులమునకొదవని కూడుటలేదు
తల్లినిదండ్రిని దాయాదజనుల
ఎడబాసినీపొందు నేనమ్మియుంటి

పగవాడనైతిని బాంధవతతికి
సాసిపోదగునయ్య బ్రహ్మన్నతనయ
కెల్లగాబోయితి ఖిన్నునిజేసి
న్యాయంబువిడనాడి నమ్మినవాని
ఒంటరిగానుంచ నొప్పెనాచిత్త

మెన్నడునాలావు నిసుమంతయైన
కనుగొనవైతివి కట్టడివాడ
బ్రాహ్మణుడీతడు బవరంబుచూచి

భయపడునంచును భావించితకట
అటులైనజూచితే అని నొననన్ను

బ్రాహ్మణమరణంబు పాపమటంచు
చనితివిదయలేక సర్వజ్ఞచంద్ర
ధర్మశాస్త్రంబుల దారినీకెరుక
తను నేలినట్టి ఆధరణీశునెదుట
సమరంబులోపల చచ్చినయపుడు

పాపమనగరాదు బలిమినిబట్టి
ఖండించివైచిన కలుషంబువచ్చు
ద్రోణుండుకృపుడును ద్రోణసుతుండు
సమరంబుచేయరా సాహసమొప్ప
గురువైనద్రోణుండు కూలెయుద్ధమున

ఆకిల్బిషమ్మంటె నాయేరికైన
ఈవెరుంగుదుదీని నింతిమాటలకు
నన్నెడబాసితి నాకర్మమేమొ
కామునిబలములు కదిసినమీద
బల్లియములవారి బవరంబునందు 22/10

గెలువగవలెనంచు కోరుచునుంటి
ఈతెరగాయెను హితమైనవాంఛ
యేమిసేయగలాడ నేమందువిధిని
అడవిపాల్చేసితివన్న! సోదరుని
వీరవిక్రమయుద్ధ విభవంబుగనగ

భాగ్యంబులేదాయె పాపినినేను
పూర్వజన్మంబున పొందులుదీసి
యెవ్వరెవ్వరినినే నెడబాపినానొ
అనుభవింపగవచ్చె నాఫలంబిప్పు
డీవుపాసినయట్టి ఈదేహమొల్ల

(జన్మమెత్తితిఁగాని సఫలంబుగాదు
సఫలంబుకాని యీజన్మంబదేల
తనవారిరక్షింపఁ దరివచ్చినపుడు
వినియోగపడనట్టి వీరరక్తంబు
రక్తమే కలుషనీరంబగుఁగాక

ఉప్పొంగుచున్నది యుజ్జ్వలశక్తి
అడఁగదు నేనెంత అడఁచిననైన
దహియించుచున్నది దావాగ్నిరీతి
ప్రాణంబులిఁక నేను బట్టఁగఁజాల
తివిరివ్యర్థంబైన దేహంబువిడుతు

స్వర్గలోకమునందు బాలునిరాక
కెదురుచూచుచునుందు నెంతయువేడ్క)
పుణ్యనివాసంబుపొందియుందు
అనిచింత సేయుచు నయ్యయోయనుచు
ఉన్నంతలోపల నొయ్యననపుడు

గరిగెమాడచియను కాంతయొకర్తు
వీరమేడపినుండి వీరులగలయ
చనుదానినచోట చయ్యనజూచి
అంజలిచేసినా డనపోతుతెలిసి
బ్రాహ్మణుడాయిట్లు పలుకంగరాదు

తగమునీవొనరించు దండముగొనగ
ఏలయిచ్చుటనుంటి కరిగింపుడనిన
అనపోతుమాడచి కనియెనావేళ
బాలునికలనికి బంపియిచోట
నిల్వగారణమయ్యె నెలతరోనాకు

అన్నబాలునికిదే అంజలిచేసి
విన్నవించెదనేను వినిపింపవమ్మ

నామాటగా జెప్పు నాసోదరునికి
కూరిమిత్రముల గూడుకనన్ను
వలదనిపోయితి వగచినవాడ

ఆలస్యమిక చేయ నాయుత్తపడితి
ఇందులకిల్పనం బెనయదునీకు
నీరాకచూచెద నేస్వర్గమందు
ననుగూడరావయ్య నాబాలచంద్ర
అనిచెప్పిమదిలోన నధికనియతిని

ఈషణత్రయమునం దిచ్చనువదలి
ఇంద్రియదశకంబు నేర్పడనిల్పి
తల్లిదండ్రులకెంచి దండంబుపెట్టి
పరమాత్మమదిలోన పాయకతలచి
ఆడపంబువారిని అతిప్రీతితోడ

గొడుగువారిని ప్రేమ గూడగబిలిచి
విరతురురక్తంబు వెడలుటచూచి
యీదెసనిల్వక యేగుడుతొలగి
పాపమనుచునన్ను పట్టంగబోకు
అనిచెప్పిబ్రాహ్మణు డత్యంతభక్తి

ఇంటివేల్పులనంగ నేర్పడియున్న
శ్రీగిరిలింగంబు చెన్నకేశవుల
భక్తితో ప్రార్థించి ప్రభుడైనయట్టి
బ్రహ్మన్ననామంబు భావించియెంచి
సంగడీలనుచాల సన్నుతిచేసి

బంగారుజందెంబు పాదంబుబిరుదు
మాడచికినొసంగి మన్నించినీవు
బాలునికిమ్మని పణతికిజెప్పి
తనతలగోసుకధరమీదవ్రాలె
తలఆవలించెను దటుకునసెగిరి
కన్నులువిప్పెను ఘనముగనవ్వె
ఎటువంటిభావంబొ యీశ్వరుడెరుగు
వెసఆడపమువారు వెతగొడ్గువారు
తద్గతితెల్పిరి తల్లిదండ్రులకు
వినిమూర్ఛనొందిరి వేగమెవారు

(అనపోతు తలిదండ్రులు కుమారుని మృతకళేబరముం జూచి విలపించుట.)

కొంతసేపటికిని కొంచెముతెలిసి
కుందుచుజనుదెంచి కొడుకుపైవ్రాలి
(కొమ్ముగుద్దికొనుచు రోలుచుంబడుచు)
తనయుండామాపుణ్య దశయిట్టులాయె
(మాయచావయ్యెను మాముద్దుకొడుక
ఇచ్చోటనుండెనా మృత్యువునీకు ?
చెలువుండామస్మేమి చేసిపోయితివి
చెలికాండ్రకేమేమి చెప్పిపోయితివి
మాకోర్కెలెల్లను మంటంగల్పితివి
కటాకటాకడుపును కాల్చిపోయితివి

మూండుకాళ్లముసళ్లు ముంచిపోయితివి
బాలచంద్రుడెపుడు పాయంగలేవు)
నాల్గువేదంబులు నయమొప్పజదివి
అఖిలదేశముల విఖ్యాతినిగాంచి
చెల్లితివానేడు చెలికానివిడిచి

(దైవమానీకెంత దయలేకపోయె
అనిచింతనొందుచు నయ్యయోయనుచు
కంటికింగడవెడు గాంగనేడ్చుచును
విలపించుచుండగ విప్రబాంధవులు

కాలంబునేఁటితోఁ గడచెనీతనికి

నిప్పుడో యెప్పుడో యీశరీరములు
పడిపోవఁగలవు శాశ్వతములుకావు
జన్మించువానికి చావునిక్కంబు
చైతన్యమెడలిన శవమునుజూచి
విలపింప బ్రతుకునా వెఱ్ఱితనంబు)

దహన కార్యముచేయ దగునంచుబలుక
గంధపుచెక్కలు ఘనకాష్ఠవితతి
తెప్పించిపేర్పించి తీర్చిరివేగ
తగుశాస్త్రమార్గంబు తప్పిపోకుండ

(అనపోతు దహనసంస్కారము)

జాయ వెంబడినేగ సమ్మతిరాగ
దంపతులిద్దరి దహనునికిచ్చి
చనిరి గేహములకు స్నానముల్ చేసి
అంతటమాడచి ఆయత్తపడుచు
తరచునెత్తుటిచేత దడిసినయట్టి

(మాడచి కార్యమాపూఁడిలోని
శిబిరము సొచ్చుట.)

బిరుదునుజందెంబు పెట్టెలోబెట్టి
ఆందోళికారూఢయై త్వరితముగ
చనుదెంచిధరణీశు సన్నిధినిలిచె
విందులుభుజియింప వివరంబుగాను
వీరులుదొరలును వేడుకమీర
పత్తినిగూర్చున్న బానసీలపుడు

వండినవస్తువుల్ వడ్డించిపిదప
చమురులువడ్డించు సమయంబునందు
మాడచియటకేగి మదిదలపోసి
తెలిసిమేడపినుండి తెచ్చినయట్టి
మధురవస్తువులెల్ల మరవకయిచ్చి

పలికెబాలునిజూచి పడతిధైర్యమున
వీనికంటెను కడుప్రియమైనమేలు
వస్తువులివిగోన వలయునటంచు
తరచురక్తంబున దడిసినయట్టి
జందెంబుబిరుదంబు చయ్యనవిచ్చె

(రక్తసిక్తంబైన జందెము, బిరుదు
చూచి బాలచంద్రుఁడార్చుట.)

చూచినయంతనె ఛురికాగ్రమునను
వక్షంబుబొడిచిన వడువునగలగి
బాలచంద్రుడులేచి పగరువినంగ
పెడబొబ్బపెట్టెను పృథ్వీశులదర
ఒప్పివారునువీరు నొక్కటియైన

శంకింపకెదురెక్క శాత్రవచయము
బారులపైబడి ప్రకటశౌర్యమున
బ్రహ్మప్రముఖ వీరవరులనుగదిసి
అనిలోనముందుగ హతముగావించి
తరువాత కాముని దళముపైదుమికి

కాలిబలంబుల గజవాజివితతి
పీనుగుపెంటలు వెల్లుగజేసి
తమకించి నరసింగు తలనుఖండించి
కొమ్మభూపతికిచ్చి కులవిరోధంబు
తీరిచిపంతంబు దీర్చెదజూడు

అనిబాలుడాడిన అప్పుడుతెలిసి

(సంధి కాదని యంపరు నాళ
వదలుట.)

వీరులందొరలును వేగ మెలేచి
సంధికార్యము మాని * జాహ్నవి కేగి
ఆముద్దులో వేసి రన్న మంతయును
చివరకు కార్యంపు స్థితి విచారించి

రాయబారులతోడ రాజులిట్లనిరి
కాకున్న కార్యంబు కాకపోదిప్పు
డెక్కడి బంధుత్వ మెక్కడి చెలిమి
బాలునితమకంబు పట్టలేరవ్వ
రనివీడుకొల్పిన ఆరాయబార్లు

కాముని కడకేగి కరములు మోడ్చి
వినిపింపసాగిరి విషయమంతయును
మమ్మంపితిరిమీరు మలిదేవుకడకు
విన్నవించితి మంతవీరులయెదుట
ఒనరంగ సంధికి ఒప్పియా వేళ

వీరులు రాజులు వేడ్కనుప్పొంగి
విందులుభుజియింప వివిధవస్తువులు
పచనంబు చేసిరి పజ్జులుసాగె
ఇరుపక్షములవారు నింపుమీరంగ
కూర్చుండిరరలేని కూరిమితోడ

బానసీలన్నంబు పట్టుకవచ్చి
వడ్డించి చమురులు వడ్డించు వేళ
గరిగె మాడచివచ్చి కలవరపడగ
అనపోతు తెరగెల్ల అపుడు బాలునికి
తెలుపగ నాతడు తెంపున లేచి
ఇడినట్టి అన్నంబు ఏటిలో గలిపి
ఉగ్రుడై రణమున కుద్యుక్తుడయ్యె
మలిదేవరాజును మన్నె నాయకులు
మముబంపిరంతట మగిడివచ్చితిమి
కాగలకార్యంబు గతిమీకెరుక

(బాలచంద్రుడు సోదరులదగ్గరకుఁ
బిల్చుట.)

అంతటనబ్బాలు డతికోపమునను
భుజములనెగబెంచి పొడవుగానిక్కి
ఉదుటుపంతములాడు చున్నంతలోన
గురుతరరణలక్ష్మి గొబ్బునవచ్చి
ఆవేళమైనిల్చె నాతనియందు

కేరితమ్ములతోడ కిలకిలనార్చి
నిండుధైర్యముమీర నిశ్శంకుడగుచు
కనుగొనుచుండెను కామునిదళము
తమకంబు హెచ్చంగ దాలిమియెసగ
బవరంబునకుతాము పైనమైపోవ

సుముహూర్తమొక్కటి చూడగనపుడు
దైవజ్ఞులను సమ్మతంబుగ నడిగె
వీరాగ్రగణ్యుండు విఖ్యాతసద్గుణుడు
హాటకాచలధీరు డబ్ధిగంభీరు
డరిజయసంశీలు డైతమ్ముసుతుడు

గంగడీలకు ప్రాణసఖుడైనవాడు
నిర్మలుడగు బ్రహ్మనిజతనూజాత
భగవదంశముగల బాలచంద్రుండు

* గంగధార మడుగు.

పులినిదండంబుతో పొడిచినయట్లు
కొల్వులోపలినుండి గొబ్బునలేచి

తనప్రాణసఖులను దగ్గరజేర్చి
వెన్నిచ్చిపగరకు వెనుకాశపడవు
విరిగినవైరుల వెన్నాడిచనవు
కులమునవెలమవు క్రోధంబుహెచ్చు
సకలశాత్రవులకు సమవర్తివీవు

వన్నెతెచ్చితివోర వంశమంతకును
ననుజేరరావయ్య నమ్మినవాడ
మేటియోజ్జలలోన మేటివైనట్టి
కమ్మరపట్టి నాకడకురావయ్య
తగవింజమోజుకు తనయుండవైన

కంసాలచందు! దగ్గరకురావయ్య
గురువైనబిరుదుల కుమ్మరపట్టి
మరియుచాకలచందు మంగలమల్లు
నమ్మినమిత్రులు ననుజేరరండి
అనియిట్లులార్చెర అతిభక్తిబిల్వ 23/10

సంతోషమునబాలు సన్నిధికేగి
వరుసతోమ్రొక్కిరి వదనముల్ వాంచి
తరువాతబాలుడు ధైర్యచిత్తమున

(బాలచంద్రుఁడు వీరులకు నిజ
మనోరథంబుఁ దెల్పుట.)

వీరనాయకులను వేడుకజూచి
విన్నవించెనుకార్య విభవంబెసంగ
దేవతల్ చూడంగ తీక్ష్ణతమెరయ
మనసునశంకలు మట్టుగాజేసి
బ్రతుకులపైనాశ పారగద్రోలి
పిరికిప్రేవులువీడి బెగడుటమాని
లోభమోహంబుల లోలతద్రెంచి

సూర్యతేజంబున శూరతమీర
కామంబుక్రోధంబు కడకేగనెట్టి
కామభూపతిగెల్తు గదనంబునందు
సత్యవ్రతోత్సాహ సాహసులార
నిర్మలగుణయుక్త నిశ్చలులార

జయులారదేవాంశ సంభూతులార
ధర్మమర్మవిచార తత్పరులార
విజ్ఞానశోభిత వీరాత్ములార
సజ్జనావనులయి జగములలోన
వీరకార్యంబుల వెలసినయట్టి

అరువదేగురుమేటి అయ్యలుమీరు
మీబంటుబ్రహ్మన్న మితిలేనిగరిమ
పూర్వమొనర్చిన భుజవిక్రమములు
విందుముమీరెల్ల వినిపించుచుండ
బ్రహ్మన్నకెదిరెడు పగవాడుగలడె

అటువంటిబ్రహ్మన్న కనుగుపుత్రుడను
భీతిచేబగరకు బెదరనునేను
తాతతండ్రులకును దగుమామలకును
కడుపిన్ననవిమీరు గారాబమలర
ఎత్తిముద్దాడుట యీమేలుమీది

కన్నెకయ్యమునందు గలిగెపుణ్యంబు
స్వర్గంబుగొనుటకు చాలినవాడ
నాపంతమరయుడీ నాయకులార
కామునితమ్ముని కలనిలోచంపి
తలదెచ్చిమీకిత్తుధరణీశు నెదుట

చంపుదురణమందు సకలశాత్రవుల
ప్రతినతీర్పకయున్న బాలుడగాను
నాపుడువిని వీరనాయకులనిరి

(వీరులు బాలచంద్రుని
వారించుట.)

వలదుబాలుడ పిన్నవాడవునీవు
సన్నపుపని కాదు సమర కార్యంబు

దళము విస్తారంబు తగదుశౌర్యంబు
పడుచువాడవునీవు పటిమకొంచెంబు
వలనొప్పుశీలము వారికందరికి
సంతానమే లేక సంతోషమెడలి
పండ్రెండువర్షాల పరిమితిగడచె

మాచెర్లచెన్నుని మన్ననవడసి
ఐతాంబనినుగనె అధికమోహమున
సంతతివృద్ధియై జరుగంగనిమ్ము
సమరంబునకునేగు సాహసమేల
మీతలిదండ్రుల మిగులమన్నించి

మమ్మాదరించియుం మామాటవినుమ
టంచుబల్కినవారి కనియెబాలుండు
కడుతెంపుమీరగ గలకలనవ్వి

(బాలచంద్రుఁడు వీరులకుఁ
బ్రతివచన మిచ్చుట.)

ఈరీతిపల్క మీకిదిధర్మమౌనె
అసహాయశూరులౌ అయ్యలుమీరు

తనరినయాగంగధారకువచ్చి
అనఘులు మడుగులో అందరుమీరు
స్నానముల్ చేసి ప్రశస్తివహించ
భక్తిలింగంబుల పట్టుకవచ్చి
ధరణిప్రతిష్ఠించి ధైర్యసంపత్తి

అన్నంబువెసముట్టి ఆరాజుచేత
విడియముల్ గొన్నట్టి వీరులుమీరు
ప్రథమతాంబూలంబు పట్టితినేను
వీరులునాయకుల్ వేడుకజూచి
శ్రీరణమొనరింతు చెన్నుడుమెచ్చ

ఎంగిలిపోటగు నిప్పుడుమీకు
సురలోకవైభవస్ఫూర్తినాకగును

(బాలచంద్రుఁడు తన పూర్వ
జన్మముల వృత్తాంతము
తెల్పుట.)

బాలుడీతండని పలుకగరాదు
నాపూర్వమంత విన్నపమొనరింతు
వీరనాయకులార విఖ్యాతులార

వినుడుచెవులనొగ్గి విశదముగాఁగ
ఉరుతరనగరమయోధ్య బాలించి
చనినట్టియాహరిశ్చంద్రభూపతికి
చంద్రమతికినేను జనియించిమించి

* లోహితాస్యుడనైతి లోకము లెరుగ
నాడు బాలుడగానె నాయకులార
కనకకశిపునకు కాంక్షలు హెచ్చ
ప్రహ్లాదుడను పేర పరగ పుట్టితిని
చేసితిదుర్ఘట చేష్టలు కొన్ని
అతులమన స్థైర్యమగ పరచితిని

నాడు బాలుడగానె నాయకులార
యేలెడు శివకంచి యేకామ్రపతికి
చిరుతొండనంబినా చెలగు భక్తునికి
శెంకెలశిరువను సీమంతినికిని
సిరియాళుడన బుట్టి చెన్నొందినాడ
తలిదండ్రులపుడు నిర్దయతమర్దించి
యిష్టభోజనముగానే మీశ్వరునకు
నిన్ని య్యనుంటిమి నీవేమియందు
వనినన్ను ప్రశ్నింప నౌనుగాదనక
సమ్మతించితివారి సత్కారమునకు
జీవముతోడనె శివునితో గూడ
కాంచీపురంబున కాపురమున్న
ఏడువాడలవారి కింపుదళొక్కత్త
ఘనపుణ్యావాసంబు కైలాసమునకు
కొనిపోయితిని నేను గురుతరభక్తి

నాడు బాలుడగానె నాయకులార
కిష్కింధనేలెడు కీశాధిపతికి
తారకంగదుడనై ధరబుట్టినాడ
రామచోదితుడనై రావణుకడకు
రాయబారిగ నేగి రాక్షసుల్ గ్రమ్మ
వారిని ఖండించి వడిచూపినాడ
నాడు బాలుడగానె నాయకులార
రఘువంశమునయందు రామచంద్రునకు
కుశుడనై పుట్టితి గురుశూరుడైతి

---

[ * హరిశ్చంద్ర పుత్రుడు రోహితుడని

"तस्य ह पुत्रो जज्ञे रोहितो नाम" (ऐ. ब्रा.)

అనే శ్రుతి చెప్పుతున్నది. ఇట్లానే

"......पुत्रो जातस्तु रोहितः" (श्री. भा. न.)

అని శ్రీ భాగవతకారుడు.

ఈ కథయొక్క విస్తరం మార్కండేయపురాణంలో కలదు. మార్కండేయ పురాణప్రతుల్లో రోహితాస్యుడని, రోహితాశ్వుడని రెండు పాఠాలు ఉపలబ్ధం. మారనాదులకృతుల లోహితాస్యుడనే పాఠం రలల అభేదాన్ని అనుసరించినది.]

నాడుబాలుడగాని నాయకులార

పాండుభూవరునకు పౌత్రుడనగుచు
అభిమన్యుడను పేర అవనిజన్మించి
వీరధర్మముచూపి వెలసినవాడ
నాడుబాలుడగాని నాయకులార
ఇటువంటిజన్మంబు లెన్ని యోకలవు

చెప్పశక్యముగాదు చెన్నునియాన
ఒక్కొక్కజన్మమం దొప్పువిక్రమము
శ్రీపురాణంబులు చెప్పుచునుండు
కలియుగంబుననిప్డు కడసారికేను
కుంతాలవారింట కూరిమిమీర

బ్రహ్మనాయునికిని పడతిఐతమకు
బాలునిపేరిట పల్నాటిలోన
జననమొందినవాడ సమరశూరుండ
పేర బాలుడుగాని బిరుదు మగండ
పగవారిగొట్టని బ్రతుకదియేల?

తలిదండ్రులను బ్రోవ తనయుండెకర్త
మానంబుదక్షత మగటిమిమించ
ప్రబలింపగలవారు బాలురెసుమ్ము
బాలురె పెద్దలు బల్లిదుల్ వారె
బాలురకే వృద్ధిపరికించిచూడ

పెద్దలుమతిచెడి పిరికిపారుదురు
పాంచభౌతికదేహ పటిమక్షీణించు
మనసుచలించును మాటిమాటికిని
ధైర్యంబుతగ్గు నుత్సాహంబులుడుగు
వయసుమీరినవేళ వచ్చునాబలిమి

కీర్తికైనను నపకీర్తికైన
బాలురపైనుండు భారమంతయును
మైలమకాముని మడియంగ జేసి
నాయకురాలిని నయహీనజేసి

పరదళంబులజంపి పంతంబుతీర్తు
పడుదునురణభూమి బవరంబుచేసి
చూచిఆస్వర్గంబు చూరలుగొందు
అనియిట్టులాబాలు డాడినమాట

(బ్రహ్మనాయుఁడు బాలచంద్రుని
సాహసము వారించుట.)

వినితండ్రులెల్లరు విశ్వాసమునను
గాఢంబుగాగ్రుచ్చి కౌగిటజేర్చి

బాదన్న మొదలైన భ్రాతృవర్గంబు
వేరుచింతలుమాని వినుచుండగాను
బాలచంద్రునితోడ బ్రహ్మన్నపలికె
నాఆత్మనందన నాకూర్మిపట్టి
పుట్టినదాదిగ బుధులనుగొల్వ

ఇట్టిధీరత్వంబు నీదిట్టతనము
ఏరీతినీకబ్బె నిదియేమివింత
ఒకబుద్ధిచెప్పెద నొప్పుగవినుము
ఘోటకంబులు మేటి కుంజరావళులు
కాలిబలంబులు ఘనఖడ్గవితతి

కుంతంబులునుగండ్ర గొడ్డండ్లుగదలు
ముసలముద్గరములు మొనలకటార్లు
చక్రతోమరములు శార్ఙ్గసంఘంబు
ఛురికలుబాణముల్ శూలచయమ్ము
మొదలైనశస్త్రాస్త్రములనెల్లజూచి

భావంబుచెదరిన పంతముల్ గావు
పలికినరీతిని బవరంబునందు
విక్రమంబుననిల్చి విధమద్భుతంబు
సమరకాలంబున సకలదేవతలు
కనిచిత్రచలనంబు గావించుచుండ్రు

గణపతి భైరవుల్ కాళికాదేవి
విఘ్నమ్మొనర్తురు విసురణవేళ
* పార్థుడంతటివాడు ప్రధనరంగమున
కర్ణునిరాకడ గనిభీతినొంది
బ్రతికితేశుభములు పడయంగవచ్చు
అరదంబుమరలింపు మయ్యశ్రీకృష్ణ
అనివిన్నపముచేసె ఆశ్చర్యభంగి
ఇతరులమాటలికేల వచింప
అమోదపౌరుష మంతయుంబోవు
అన పల్కవిని బాలు డెల్లననవ్వె

(బాలచంద్రుండు నిజశౌర్యంబు తండ్రికిఁ దెల్పుట.)

తండ్రితోననియెను ధైర్యంబుమీర
పిడ్గుచిన్నదికాద భేదించుకొండ
చిన్నమిర్యమునందు చెఱుచెకార్యంబు
ఘనకపాలము కెక్కి కాకనొందించు
మానకనోరంత మండును లెస్స
కాలుదావాగ్నికి కారడవెదుర
హనుమానుడేగురు నాఅచౌటిపడెలు
వారిధిలంఘించి వడిదాటుగాక
బాలుడుచిల్లర బలముపైబడడు
కాముని తమ్ముని గదిసిమర్దించి
తలగోసితెచ్చును ధైర్యంబెసంగ
అనుచుబాలుండుపల్కె నందరువినగ
తరవాతనాయుండు తనయునిజూచి

(బాలచంద్రుండు యుద్ధమునకుఁ బోవుటకు సమ్మతించి బ్రహ్మనాయుఁడతనికి రణధర్మంబుల నుపదేశించుట.)

విను బాలచంద్రుడ విశదముగాగ
ధరలోననాపేరు దశదిశలందు

---

* [ఈవాక్యాలు
"जीवन् प्राप्नोति पुरुषः सङ्ख्ये जयपराजयौ ।
मृतस्य तु हृषीकेश भङ्ग एव कुतो जयः ॥
एष कर्णो रणे भाति मध्याह्न इव भास्करः ।
निवर्तय रथं कृष्ण जीवन् भद्राणि पश्यति ॥" ( म·क )
అని అర్జునవచనంగా చెప్పబడిన పద్యాలననుసరించినవి.

ఇట్లాటి అభిప్రాయాన్నే -
" विनाशे बहवो दोषा जीवन्भद्राणि पश्यति । " ( रा·सु )
అని అశోకవనస్థుడైన హనుమంతుడి చేత వాల్మీకి విశదం చేయిస్తాడు.]

ప్రఖ్యాతినొందెను బ్రహ్మనాయుండ
మండలేశులకెల్ల మదికల్లడమయి
చెల్లినమన పేరు చెడిపోవనీకు
పృథ్విబిరుదముల పెంపునొందింపు
ఘనమైననా పేరు కల్ల చేయకుము

ముల్లుచూశౌర్యంబు మొక్కపోనీకు
మిలలోనమనలావు నెన్నలేరెవ్వ
(రాజియనంగ నేమనితలంచెదవు)

(యుద్ధరంగ తత్త్వము.)

శౌర్యంబునకు బాదుస్వర్గంపుద్రోవ
యెల్లసుఖంబుల కిదిపట్టుగొమ్మ
* యిదిముక్తిసోపాన మిదిమూలధనము
(అగర్భశూరుల కాటప్రదేశ)
మిది దేవపితతుల నెన్న నా మేలు
హెచ్చైనవీరుల కిదిపుట్టినిల్లు
(ధర్మసంరక్షణార్థంబయి బుధులు 24/10

కదలకరక్తంబు కార్చెడుచోటు)
పటుకీర్తినొందించు బ్రహ్మాండమందు
ఇదిసమరావని యిదిపుణ్యభూమి
శ్రీకంఠుశిరసంటి చెప్పెదనీకు

(బ్రహ్మనాయుఁడు కుమారునకు
రణనీతి నుపదేశించుట.)

కామనృపాలుండు కల్మిపెంపొంద
సకలభూమీశుల సంగ్రామమునకు
పిలిపింపవచ్చిరి పేర్మినిజాప
ఖండనపటిమచే ప్రబలినవారు
చతురంగబలములు చాలుపచోట
శూర్వంబుమనతోడ పోరాడలేక

చిక్కిచెప్పినయట్లు చేయుచునుండి
పగవారితో చేరి పరతెంచినారు
జడియకగల్గురు సమరంబునందు
కన్నెకయ్యంబిది కనిపెట్టిపోరు
సలువంగవలయును సత్కీర్తివచ్చు

తలపడునప్పుడు తలకకుమన్న
అలుగులదీప్తికి అలుకకుమన్న
వారణధ్వనివిని వడకకుమన్న
శరములదీప్తికి జడియకుమన్న
సమరకాలంబున జంకకుమన్న

మొనచెడరణములో మురియకుమన్న
బిరుదులుజారిన బెదరకుమన్న

---

* [ఈతీరుగానే

"इदं वः क्षत्रिया द्वारं स्वर्गायापावृतं महत्,
गच्छध्वं तेन शक्रस्य ब्रह्मणः सहलोकताम्." (म. भी.)

అని భీష్ముడు వీరులకు ఉపదేశిస్తాడు. క్షాత్రధర్మాలసందర్భంలో యుద్ధప్రశంస శుక్రనీత్యాదులందు దృష్టం.]

ఘనఖడ్గహతులకు గలిమాలవలదు
బలములుముట్టిన భంగంబుగాకు
సందడిరణమున శంకనొందకుము

పైకొనిసైపుణ్య పటిమచెలంగ
పరదళంబులనొంచి బవరంబుచేయు
కాముడురణమున కంపంబునొంద
నరసింగుపైకేగు నాకూర్మిసుతుడ
జయముచేకొనదగు సాహసస్ఫూర్తి

అనినీతిగాజెప్పి అపుడు బ్రహ్మన్న
తగినట్టికర్పూర తాంబూలమిచ్చి
శంఖతీర్థమొసంగి జయమొందుమంచు
పంపించెతనతండ్రి బ్రహ్మనాయునికి

(బాలుఁడు యుద్ధరంగమున
కేగుట.)

దండనమస్కృతుల్ తాజేసివెడలె
ఆవేళరణభేరు లధికమైమ్రోసె
ఢక్కాఢమామికల్ * దంగురంబులును
పటహశంఖంబుల పటుతరధ్వనులు
బహుళమైమిన్నంద బాలచంద్రుండు
సమరభూస్థలినుండి సంతోషమలర

సూర్యభైరవులాది సురలకుమ్రొక్కి
దిక్పతులార ఓ దేవతలార
కనుగొనుచుండుడీ కదనరంగంబు
చేసెదసమరంబు చిత్రముపొంగ

అనివిన్నపముచేసి ఆయోధమందు
ఒరతీసిజళిపించి ఉగ్రుడై నిల్చె
తరువాతనరసింగ ధరణీశ్వరుండు

(నరసింహాభూపతి రణమునకు
వచ్చుట.)

ఘనమైనగజముపై గ్రక్కునసెక్కి
సమరరంగమునకు చనుదెంచువేళ
చొక్కుచువ్వలవారు సూరలవారు

నిల్చిరిపదివేలు నిండుశౌర్యమున
బల్లెముల్ పట్టుక బలువైనబంట్లు
గజముముందేగిరి గాఢధైర్యమున
విలుకాండ్రు నాలుగువేలసాహసులు
బాణతూణీరముల్ పరగధరించి

వడితోడరణరంగ వసుధదార్కొనిరి
అశ్వమ్ములైదువే లరుదెంచెదాటి
భూరిమాతంగముల్ భూధ్రంబులట్లు
బృంహితధ్వనులతో పెల్లుగనడిచె
కాలశరోద్వృష్టి శోభిల్లుచుండు

వీరులువచ్చిరి విచ్చలవిడిని
కదముబలంబులు కాదులెక్కింప
పటువిక్రమస్ఫూర్తి బలమిట్లువెడలె
ధ్వజములు పడిగెలు దట్టమైకదలె
బిరుదుఛత్రంబులు పెద్దటెక్కెములు
సాంద్రమైయుండెను జగదీశునెదుట
ప్రబలమైవాద్యంపు పటలిమ్రోయంగ

* వీరణము.

పిక్కటిల్లెదిశల భేరీరవంబు
కాహళల్ బూరలుకనకతప్పెటలు
ధ్వనులచేజనతతి దల్లడపరచ
భయదమై చెలగిన పరిపంథిసేన
బాలచంద్రుడుచూచి భ్రాతలుతాను
కుప్పకూటపులనగ్ని సుడిసినయట్లు
కోయనియార్చుచు కుప్పించియురికి
బలముపైవ్రాలెను పౌరుషాధికత
కుంతముల్ చేనంది గదులుగాబొడిచి
కత్తులచేతలల్ ఖండించివైచి

(బాలచంద్రుడు భీమంబగు
సంగ్రామం బొనర్చుట.)

మణికట్లదునుమాడి మస్తకవితతి
ధరమీదనొరగంగ దట్టించినరకె
మోచేతులెడచేసి ముక్కలుచెక్కి
ఫాలంబులంజింపి ప్రక్కలగోసి
దౌడలూడగనూకి దండముల్ద్రుంచి
కనుగ్రుడ్లుపగులంగ కర్ణముల్ వ్రాల
బలువైనరొమ్ములు పరియలుగాగ
తొడలెల్లతునుకలై తూగాడుచుండ
జానువులూడంగ జంఘలువిరుగ
చీలలుపట్టేది చీకాకునొంద
ఈరీతిగొంతసే పీప్సితమడర
అనుజులతోగూడ నని చేసిపిదప
దంతావళంబుల దట్టంబుచూచి
బాలుడుకోపంబు ప్రకటంబుగాగ
కొదమసింహముభంగి కుప్పించియెగిరి
బలిమిమై కుంభముల్ పగులగమోది
తొండముల్ తోకలు తునుకలుసేసి
మావంతులనుగొట్టి మరణమొందించి
పైనున్నదొరలను పడిపోవపొడిచి
దంతముల్ ముక్కలై ధరవ్రాలజిదిమి
చెవులనుకత్తితో చీలికల్ చేసి
పిల్లదంతంబుల బెకలిచివైచి
ఘనపదంబుల దున్మికంఠముల్ నరికి
కొంతసేపిమ్మాడ్కి గురుశౌర్యమలర
సమరంబుగావించి జవనాశ్వవితతి
చక్కాడపైబడి సాహసగరిమ
ఖడ్గకుంతంబులు కరములబట్టి
పైనున్నరాహుత్తపటలిని చంపి
తొడిగినజోడంగి తుక్కుగజేసి
సింగిణివిండ్లను చిదుకలొనర్చి
బాణతూణీరముల్ భగ్నముచేసి
ఖడ్గఖేటకములు ఖండించిమించి
మెడలురెండుగజేసి మేనులుచించి
యెదురురొమ్ములలెస్స యీటెలగ్రుచ్చి
కొంకులుతెగగొట్టి ఖురములుచెక్కి
చాలసేపీగతి సమరంబొనర్చ
బలమెల్లనీలాగు భంగంబునొంది
కంఠముల్ దెగిపడ గ్రక్కుననురికి

(నలగామరాజు సైన్యము
కలతనొందుట)

పడితన్నికొనిచచ్చు బలసమూహంబు
మస్తకంబులుపోయి మహిమీదమడిసి

కన్నులు తెరచుచు గంతులువైచి
ప్రాణముల్విడిచెడు వారునుమరియు
పాదముల్ విరుగగ బవరంబు చేయ

పండ్లుగీటుచు నేలపైగూలువారు
కరములుతునిసిన గత్తులువదలి
బాలునిగనివచ్చు భయదోగ్రభటులు
ప్రేవులువెడలిన పెడచేతనెత్తి
కడిమిచేబల్లెంబు గట్టిగాబట్టి
అహమహమికతోడ అరుదెంచగడగి
సంచలింపనిదీర్ఘ సాహసఘనులు
మూల్గుచుచచ్చెడు ముదియోధవరులు
బాలునికనుగొని భయమందిబెగడి
పారిపోయెడుపంద భటసమూహంబు

పారిపోవగలేక బ్రతుకుపైనాశ
బ్రతిమాలుచుండెడు బలనిచయంబు
లిటువంటిజగడంబు లెన్నడెరుంగ
మేలాగుపోదు మన్చేడ్చెడువారు
ఆలుబిడ్డలబాసి అన్నంబుకొరకు
వచ్చితిమీనేల ప్రాసెనుమృత్యు
వనిదుఃఖమొందుచు నసురుసురంచు
వేగమెప్రాణముల్ విడిచెడువారు
బహుదినంబులు మేము పాలేరుచేసి
మునికోళ్లలెల్లను ముంజూర్లదోపి

పణతులుదిట్టిన పడలేకవచ్చి
చచ్చుచునుంటిమీ సమరరంగమున
పారిపోనిచ్చిన బ్రదుకుదుమయ్య
అనిమ్రొక్కుచుండెడు అతిదీనభటులు
బోయవారము మేము పూర్వంబునందు

బుజములకాయలు పూనికన్గొనుడి
పగవారుమముగని పారిపోవుదురు
మీకేమిభయమని మెలతనాగమ్మ
బాగుగానమ్మించి పంపవచ్చితిమి
జీవముల్ దక్కిన చిన్నలగలిసి

బలుసాకుదినియైన బ్రతుకగగలము
మీరుపిల్చినవేళ మేమరుదెంతు
మనియుండలియొనర్చ యవమానమొంది
మగసిరివిడిచిన మానహీనులును
వీలుచిక్కినరణ వీరులవదలి
పోయెదనట్టి దుర్బుద్ధిసుతులును
వచ్చినవిధమున సమరోర్వియందు
పలుకకయూరక వ్రాలెడువారు
చనలేకభయమున చచ్చినవారి
మీదద్రోసుకయుండి మెదలనివారు

చచ్చినగజముల చాటునడాగి
పందతనంబున పడియుండువారు
పెండ్లాలదలచుక బిట్టేడ్చువారు
వల్మీకములమీద వసియించువారు
గడ్డిలోప్రాకబడి కదలనివారు
వ్రేళ్ళుచీకెడువారు వెన్నిచ్చువారు
(వెండ్రుకల్ విప్పక విదిలించువారు
నీవారమనిపల్కి నిల్చుండువారు
ఆయుధాల్ పడవైచి యలికెడువారు
పడలేకచతికిలబడి యుండువారు)

బవరంబులోగూలి ప్రాణజాలంబు
విడిచియుఖడ్గముల్ విడువనివారు
భయదమైయుబ్బంగి పరికింపరాక
సమరరంగము భయజనకమైయుండె

(బాలచంద్రుఁడు శాత్రవబలంబులఁ
జక్కాడుట.)

కొందరువిలుకాండ్రు గుంపులుగూడి
బహుబాణములుమీఁద బరపెడువేళ
తమ్ములనందర తగనిల్వఁజేసి
పరిఘమొక్కటిచేత పట్టుకతూరి
తనువునబాణముల్ దాకకుండంగ
భ్రమణనైపుణ్యంబు బల్విడిజూపి

పరతెంచువిశిఖముల్ పాయగొట్టుచును
ఖడ్గమాడించుచు గర్జిలానర్చి
అట్టహాసంబున నావిలుకాండ్ర
పైకేగిధనువుల భంగంబుచేసి
శింజినులెల్లను జిదురుపల్ చేసి
తూణముల్ శరములు తుమురుగాగొట్టి
చుట్టుపేరమువారి శూరత మెరయ
పండతరిగినట్లు వడిమేనులెల్ల
ఖండించియముజేర గ్రక్కునఁ బంపె
చొక్కుచువ్వలవారు శూరత హెచ్చ

వంచుకపైకుర్కి వచ్చుటజూచి
బాలుడువెసనార్చి పకపకనవ్వి
తమ్ములతోడు రాదంటయైతొడరి
కుప్పించిపైబడి గొడ్డండ్లతోడ
చెరకులునరికిన చెలువుఘటిల్ల

అలుగులసీటెల నన్నింటిదునిమి
శూలంబులంబోడ్చి సురియలగ్రుమ్మి
గండ్రగొడ్డండ్లతో గనెలుగాగొట్టి
బాకులరొమ్ములు పరియలుచేసి
గదలచేశిరముల గడునుగ్గొనర్చి

బాధించిపోట్లల పటిమచేజించి
కత్తులమేనుల కండలుతుల్చి
పంపించెజముజాడ బలములనెల్ల
సంగ్రామమీరీతి జరిగినవేళ
పారిరిమిగిలిన బంటులుగూడి
ఆవేళనరసింగు డధికకోపమున

(పారిపోవుచున్న సైన్యమునకు
నరసింహభూపతి ధైర్యవాక్య
ములు చెప్పుట.)

పారెడువారికి బలుకంగసాగె
విరిగిపోవుట యిట్లువీరధర్మంబె
బాలురకనుగొని పరువిడనేల
మిమ్ముగాచినవారి మేలెత్యజింప

(బలిమిమీనరములఁ బారురక్తంబు
రాజాన్నవర్ధిత రక్తంబుగాదె
ధూర్తులైనృపునకు ద్రోహంబొనర్చ
నమ్మినరాజును నట్టేటముంచి
పోవుటయేనీతి పుణ్యాత్ములార
తనువులస్థిరములు ధనములుకల్ల
కీర్తియొక్కటి భువిశిలముగానుండు
ధైర్యహీనత వీరధర్మంబుమాని
భంగురంబై మలభాండమైనట్టి
